# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

ద్వితీయసంపుటం

## బ్రాహ్మణాలు

ప్రధానసంపాదకుడు :

**డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్య, ఎమ్.ఏ., పి.హెచ్.డి.**

న్యాయవిద్యాప్రవీణ; డిప్లొమా ఇన్ జర్మన్

ప్రచురణ :

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2016

ĀRSAVIJÑĀNA SARVASVAMU
*(Encyclopaedia of Ancient Indian literature)*
T.T.D Religious Publications Series No. 921

*Second Volume* : **BRAHMANALU**

*Chief Editor :*
**Dr. S.B. Raghunadhacharya**

First Edition : 1985
Second Edition : 1999
Third Edition : 2012
Forth Edition : 2016

*Copies :* 2000

*Cover page* : Sila Virraju

*Published by*
**Dr. D. Sambasiva Rao I.A.S**
**Executive Officer**
**Tirumala Tirupati Devasthanams**
**Tirupati, Andhrapradesh**

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press**

# ముందుమాట

విశ్వమానవకల్యాణానికి విశేషించి అంకితమై, మానవతా దృక్పథానికి మహితాశ్రయమై వెలుగొందుతున్న నిత్య సత్య శబ్దరాశి వేదం. ఇది భగవంతుని నిశ్వాసరూపంగా ఆవిర్భవించింది. సంహితలతో ప్రారంభమై బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తుల వఱకు విస్తరించిన ఈ వాఙ్మయాన్ని వైదికవాఙ్మయం అంటున్నాం. ఛందోబద్ధమైన మంత్రభాగానికే సంహిత అనిపేరు.

ఈ సంహితలు ఋక్సంహిత, యజుస్సంహిత, సామసంహిత, అథర్వసంహిత అనే పేర్లతో నాలుగు. యజుస్సంహితలు కృష్ణ-శుక్ల భేదంతో రెండురకాలు. దేవతాస్తుతి ఈ సంహితలలో ప్రధానప్రతిపాద్యాంశమైనా అక్కడక్కడా ఎన్నో వైజ్ఞానిక విశేషాలు కూడా సాక్షాత్తుగాను, సాంకేతికంగాను వీటిల్లో వివరింపబడినాయి. అంత మాత్రమే కాదు; సమాజకల్యాణంకోసం, మానవాభ్యుదయంకోసం మనమాచరించవలసిన ధర్మమర్మాలు, అనుసరించ వలసిన ఆదర్శ మార్గాలను కూడా మనకందిస్తున్నది వైదికవాఙ్మయం.

మంత్రద్రష్టలైన మహర్షులు మనకంటే ఎన్నో తరాల ముందువారు. దివ్యజ్ఞానసంపన్నులు, దీర్ఘదృష్టివిలసితులైన ఆ మహనీయులు రాను రాను మానవజాతికి రానున్న బలహీనతలను సాక్షాత్కరించుకొని, సంయమనంతో, సమ్యక్జ్ఞానంతో వాటి నెదుర్కోవడానికి కావలసిన శక్తిని, యుక్తిని చక్కగా ఉపదేశించారు. నిజమైన సమసమాజభావనను వైదికవాఙ్మయంద్వారా

మనకందించారు. వారి ఉపదేశంలో త్యాగమే యాగమైంది. నిస్వార్థంగా, నియమబద్ధంగా మంచి మర్యాదలతో మనుగడ సాధించే మానవజీవితమే ఒక యజ్ఞంగా పరిణమించింది. అలాంటి యజ్ఞభావనను మొట్టమొదట మనకుపదేశించిన గ్రంథరాశి ఈ బ్రాహ్మణవాఙ్మయం.

సంహితాభాగం తరువాత ఏర్పడిన ఈ బ్రాహ్మణాలు, సంహితలలో నిగూఢంగా, సాంకేతికంగా ఉన్న విశేషాలను విశ్లేషిస్తూ చక్కని ఉపాఖ్యానాల ద్వారా వైదికధర్మాన్ని వివరించినాయి. భారతీయ మత-ధర్మాల చరిత్ర బ్రాహ్మణవాఙ్మయంలోనే ప్రప్రథమంగా రూపుదిద్దుకొన్నది. ఎన్నో యజ్ఞయాగాలను, ఇష్టులను, వాటి నాచరించే పద్ధతులను వివరిస్తూనే బ్రాహ్మణాలు భారతీయ సంస్కృతికి పెట్టని అలంకారాలైన ఎన్నో విశేషాలను ఆశ్చర్యకరంగా అభివర్ణిస్తున్నాయి.

ప్రాచీన భారతీయుల ధార్మికదృక్పథానికి, సాంస్కృతికచైతన్యానికి, తాత్త్వికచింతనకు, ఎత్తిపట్టిన అద్దమే ఈ బ్రాహ్మణ వాఙ్మయం. ఆర్షవిజ్ఞానసర్వస్వం ప్రణాళికలో "బ్రాహ్మణాలు" అనే రెండవ సంపుటంగా ఈ వాఙ్మయ సారసర్వస్వాన్ని తిరుమల తిరుపతి దేవస్థానాల తరఫున నిండుమనస్సుతో మీకందించడానికి నేనెంతో సంతోషిస్తున్నాను. ఈ సంపుటాన్ని చదివి, ప్రాచీన భారతీయ విజ్ఞానవైభవాలను అర్థంచేసుకొని వైదికవాఙ్మయాన్ని ఆదరించ వలసిన బాధ్యతను ప్రతివారు గుర్తుచేసుకొన గలరని ఆశిస్తున్నాను.

ఆర్షవిజ్ఞానసర్వస్వాన్ని పది సంపుటాలలో భావనచేసి ప్రణాళికా బద్ధంగా ప్రామాణికులైన పండితులద్వారా చక్కని విశేషాలను సంపాదించి, సామాన్యమానవునికి అందుబాటులో ఉండేటట్లు తీర్చి దిద్ది మన ముందుంచుతున్నవారు, తి. తి. దే. ప్రచురణల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్యగారు. వీరి లోకజ్ఞతకు, అవిశ్రాంతకృషికి నిదర్శనం ఈ సంపుటం. వీరిని మనసారా అభినందిస్తున్నాను. ఈ ప్రణాళికద్వారా ఇంకా

ఇతర సంపుటాలను కూడా త్వరత్వరగా సమాజానికి అందించి శ్రీరఘునాథాచార్యగారు వైదిక వాఙ్మయంపైన, భారతీయ సంస్కృతిపైన శ్రద్ధాసక్తులను ఈతరం వారిలో పెంచగలరని భావిస్తున్నాము.

'వేదో౽ఖిలో ధర్మమూలమ్'

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# సంపాదకుని మాట

పరమ మంగళదేవత ప్రపన్నార్తిహారిణి పద్మావతీదేవి. ఏడు కొండలకేడుగడ, శ్రితరక్షణబద్ధదీక్షుడు, చిద్విలాసభాసురుడు శ్రీనివాస భగవానుడు. ఆ దివ్యదంపతుల పరమానుగ్రహమే ఈ ఆర్షవిజ్ఞానసర్వస్వం. చరిత్రకందకుండా నశించిపోయినంత పోగా మిగిలిన ఆర్షవాఙ్మయ విజ్ఞానవైభవాన్ని కొద్దిగానైనా ఈతరంవారికి అందుబాటులోకి తీసుకురావాలనే భవ్యమైన ఆశయంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్షవిజ్ఞానసర్వస్వమనే ఈ పది సంపుటాల ప్రణాళికను ప్రారంభించింది. దీన్ని సంపూర్ణంగా అనుగ్రహించింది భగవాన్ శ్రీనివాసుడు. ఆశీర్వదించింది జగన్మాత శ్రీ పద్మావతీదేవి. వారిరువురికి "బ్రాహ్మణాలు" అనే రెండవ సంపుటాన్ని పూర్తిచేసిన సందర్భంలో నా శతకోటి ప్రణామాల నందిస్తున్నాను.

ఈ ప్రణాళిక ఆవశ్యకతను సమీక్షించి శ్రీవారి ప్రతినిధిగా దీన్ని మంచి మనస్సుతో ప్రారంభించినవారు అప్పటి తి.తి.దే. కార్యనిర్వహణాధికారి, ఉత్సాహానికి మారుపేరు, శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్‌గారు. వారికి నా కృతజ్ఞతామందారాల నందిస్తున్నాను.

ఈ ప్రణాళిక నిర్విఘ్నంగా కొనసాగడానికి దోహదం చేస్తున్నవారు తి. తి. దే ధర్మకర్తలమండలివారు. వారికి నా ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ఈ రెండవ సంపుటాన్ని ముద్రించి ప్రచురించడంలో ఎంతో ప్రోత్సాహాన్నందించి, అందమైన ముందుమాటను ఆదరంతో పలికిన, సహృదయశేఖరులు, సరసమధురహృదయులు తి. తి. దే. కార్యనిర్వహణాధికారి, శ్రీ ఎస్. లక్ష్మీనారాయణగారు. వారందించిన ప్రోత్సాహానికి నా కృతజ్ఞతాకుసుమమంజరుల నర్పిస్తున్నాను.

ఈ సంపుటాన్ని ప్రచురించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రియమిత్రమణులు తి. తి. దే. పౌరసంబంధశాఖాధికారి, డాక్టర్ రావుల సూర్యనారాయణమూర్తిగారు, సప్తగిరి సంపాదకులు శ్రీ కె. సుబ్బారావుగారు ముఖ్యులు. వారికి నా మనఃపూర్వకకృతజ్ఞతలు. ఇందులోని శీర్షికలకు కావలసిన విషయసేకరణ చేయడంలో, అడిగిన వెంటనే ఎందరో పండితులు, విమర్శకులు తమ సహకారాన్ని అందజేశారు. వారికందరికీ నైయక్తికంగా నా కృతజ్ఞతాకుసుమాంజలుల నందిస్తున్నాను. సంపాదకసమితి సభ్యులు ఈ సంపుటాన్ని తీర్చిదిద్దడంలో అమూల్యాలైన సలహాలనిచ్చినారు. వారందరికీ నా అభివందనాలు.

ఈ సంపుటాన్ని సంపాదించడంలోను, ప్రెస్‌కాపీ తయారు చేయడంలోను, ప్రూఫ్‌లు చదవడంలోను నా అసిస్టెంట్స్ కుమారి డి. శారద, కుమారి. టి. సావిత్రి, శ్రీ పి. ఎస్. వి. రమణరావు ఎంతో సహకరించినారు. వారికి నా ఆశీస్సులు.

ఈ సంపుటాన్ని సర్వాంగ సుందరంగా ముద్రించిన ప్రియమిత్రులు టి. టి. డి. ప్రెస్ మేనేజర్ శ్రీ ఎమ్. విజయకుమార్‌రెడ్డి గారికి, శ్రీ ఎమ్. గోపాలరెడ్డికి, శ్రీ పి. మోహన్‌రావుకు, వారి సహచరులకు నా ధన్యవాదాల నందిస్తున్నాను.

శ్రీరామనవమి

30-3-85

— రఘునాథాచార్య

# రచయితలు

ఏ.ఎస్. ఎస్. — శ్రీ ఏ.సోమేశ్వరశర్మ, ఎం.ఏ.
రీడర్, (రిటైర్డ్) సాంస్క్రిట్ డిపార్ట్‌మెంట్,
ఆంధ్రాయూనివర్శిటీ, వాల్తేరు,
2.8.6 ప్రమేయం; 2.8.7 వైశిష్ట్యం

డి. వి. ఎ. — ప్రొఫెసర్ దివాకర్ల వెంకటావధాని,
ఎం. ఏ (ఆనర్స్), పిహెచ్.డి
తెలుగు ప్రొఫెసర్ (రిటైర్డ్)
ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్.
2.1.6 యజ్ఞయాగాలు

జి. ఎస్. ఎస్. — శ్రీ జి. ఎస్. సౌందరరాజన్,
ఎం. ఏ. బి. ఒ. ఎల్. విద్యాప్రవీణ.,
సంస్కృతపండితుడు
తణుకు.
2.3.8. సంగ్రహసమీక్ష

ఐ. వి. ఆర్. — శ్రీ ఐ. వేంకటేశ్వరరావు, ఎం.ఏ. శిరోమణి
లెక్చరర్, ఎస్. వి. ఓరియంటల్ కాలేజ్, తిరుపతి.
1.8 మహర్షులు

కె. బి. ఆర్.
శ్రీ కె. భాస్కరరావు, ఎం. ఏ.
లెక్చరర్, ఎస్. వి. ఓరియంటల్ కాలేజ్, తిరుపతి
2.7.8. సంగ్రహసమీక్ష

కె. ఆర్.
శ్రీకరి రామానుజాచార్యులు, వ్యాకరణశిరోమణి
పండిట్ (రిటైర్డ్) సాంస్క్రిట్ డిపార్ట్‌మెంట్,
ఆంధ్రాయూనివర్శిటీ, వాల్తేరు,
2.6.8సంగ్రహసమీక్ష

కె. ఎస్. ఆర్.
డాక్టర్ కె. ఎస్. ఆర్. దత్త, ఎమ్.ఏ. పిహెచ్. డి
ప్రిన్సిపాల్, ఎస్.వి. ఓరియంటల్ కాలేజ్, తిరుపతి.
2.9.7 వైశిష్ట్యం

కె. ఎస్. వి.
శ్రీ కె. శ్రీనివాసవరదన్, శిరోమణి
రీసెర్చి అసిస్టెంట్, ఎస్. వి. యు. ఓరియంటల్,
రీసెర్చి ఇన్స్టిట్యూట్, తిరుపతి.
2.2.8 సంగ్రహసమీక్ష, 2.8.8. సంగ్రహసమీక్ష

కె. వి. ఆర్.
శ్రీ కె.వి. రాఘవాచార్యులు, ఎం. ఏ. (తెలుగు)
ఎం.ఏ (సంస్కృతం), విద్వాన్, డిప్లొమా ఇన్ లింగ్విస్టిక్స్
లెక్చరర్, శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ అండ్
డాన్స్, తిరుపతి.
1.14 మతం-తత్త్వం; 2.4.6 యజ్ఞయాగాలు

కె. వి. ఆర్. కె. — డాక్టర్ కె.వి.ఆర్. కృష్ణమాచార్యులు
ఎం. ఏ., పిహెచ్.డి. విద్యాప్రవీణ
రీడర్, కేంద్రీయసంస్కృత విద్యాపీఠమ్, తిరుపతి.
1, 11 సాంఘికజీవనం; 2.5.7. వైశిష్ట్యం

ఎమ్. డి. బి. — ప్రొఫెసర్ ఎమ్. డి. బాలసుబ్రహ్మణ్యమ్,
ఎం.ఏ., పిహెచ్.డి.
ప్రిన్సిపాల్, కేంద్రీయసంస్కృత విద్యాపీఠమ్,
తిరుపతి.
2.1.7 వైశిష్ట్యం

ఎమ్. ఎన్. — ప్రొఫెసర్ ఎమ్. నరసింహాచార్య,
ఎం. ఏ (సంస్కృతం) ఎం. ఏ. (తెలుగు), పిహెచ్.డి.
ప్రొఫెసర్, సౌత్ ఇండియన్ శ్రీవైష్ణవిజం
డిపార్ట్‌మెంట్, మద్రాస్ యూనివర్శిటీ, మద్రాస్.
1.10 రాజులు

ఎమ్. ఎస్. ఎన్. — డాక్టర్ ఎమ్. శ్రీమన్నారాయణమూర్తి
ఎం. ఏ., పిహెచ్.డి; డిప్లొమా ఇన్ జర్మన్
రీడర్, సాంస్క్రిట్ డిపార్ట్‌మెంట్,
శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీ, తిరుపతి.
2.2.6 యజ్ఞయాగాలు

ఎస్. ఎస్. ఆర్. — ప్రొఫెసర్ ఎస్. ఎస్. ఆర్. తాతాచార్య,
పిహెచ్.డి. న్యాయ మీమాంసా వ్యాకరణవేదాంత శిరోమణి
ప్రొఫెసర్, కేంద్రీయసంస్కృత విద్యాపీఠమ్.
తిరుపతి.
2.1.8 సంగ్రహావమీక్ష

పి. ఆర్. ఎస్. — డాక్టర్ పి. రాధాకృష్ణశర్మ, ఎం. ఏ., పిహెచ్.డి.
డైరెక్టర్, ఎస్. వి. సెంట్రల్ లైబ్రరీ అండ్
రీసెర్చి సెంటర్, టి. టి. డి. తిరుపతి.
1.15 కవితాసౌందర్యం: 2.2.7 వైశిష్ట్యం

పి. ఎస్. ఆర్. — ప్రొఫెసర్ పి. శ్రీరామచంద్రుడు,
ఎం. ఏ (సంస్కృతం), ఎం. ఏ (తెలుగు)
ఎం. ఏ. (ఇంగ్లీషు), పిహెచ్.డి. శిరోమణి
ప్రొఫెసర్, సాంస్క్రిట్ డిపార్ట్‌మెంట్,
ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్.
1.16 భాషాపరిణామం - గద్యవికాసం

ఎస్. బి. ఎల్. ఎన్. — శ్రీ ఎస్. బి. ఎల్. నరసింహాచార్యులు, విద్వాన్.
అధ్యక్షులు, ఆగమ గురుకులము,
రావిఅనంతవరం, రేపల్లె
2.9.6 యజ్ఞయాగాలు

ఎస్. బి. ఆర్. — డాక్టర్ ఎస్. బి. రఘునాథాచార్య, ఎం.ఏ., పిహెచ్.డి.,
విద్యాప్రవీణ, డిప్లొమా ఇన్ జర్మన్
ప్రధానసంపాదకుడు
రీడర్, సాంస్క్రిట్ డిపార్ట్‌మెంట్, శ్రీవేంకటేశ్వర
యూనివర్శిటీ, కో-ఆర్డినేటర్ పబ్లికేషన్స్ టి. టి.డి.,
తిరుపతి.
1.1 పరిచయం, 1.2 బ్రాహ్మణం అంటే ఏమిటి? 1.3 సంహితలు - బ్రాహ్మణాలు. 1.4 బ్రాహ్మణాల్లో ముందు - వెనుకలు. 1. 5 నశించిపోయిన

బ్రాహ్మణాలు, 1.6 బ్రాహ్మణాలు కూడా వేదాలేనా?
1.7 బ్రాహ్మణాలు - సర్వానుక్రమణులు

2.1.1, 2.2.1, 2.3.1, 2.4.1, 2.5.1, 2.6.1, 2.7.1, 2.8.1, 2.9.1, పరిచయం

2.1.2, 2.2.2, 2.3.2, 2.4.2, 2.5.2, 2.6.2, 2.7.2, 2.8.2, 2.9.2, విభాగం

2.1.3, 2.2.3, 2.3.3, 2.4.3, 2.5.3, 2.6.3, 2.7.3, 2.8.3, 2.9.3, సంకలనకాలం

2.1.4, 2.2.4, 2.3.4, 2.4.4, 2.5.4, 2.6.4, 2.7.4, 2.8.4, 2.9.4, వ్యాఖ్యానాలు - ప్రచురణలు

2.1.5, 2.2.5, 2.3.5, 2.4.5, 2.5.5, 2.6.5, 2.7.5, 2.8.5, 2.9.5 ప్రసిద్ధి

ఎస్. బి. ఎస్. — శ్రీ ఎస్. బి. ఎస్. భట్టాచార్య,
శిరోమణి పి.ఒ.ఎల్.
లెక్చరర్, ఎస్. జి. కె. ఎస్. కాలేజ్.
తాడికొండ.
2.4.8 సంగ్రహసమీక్ష

ఎస్. ఎల్. ఎస్. — శ్రీ ఎస్. లక్ష్మణయ్యనాయుడు, ఎం.ఏ. శిరోమణి.
కార్యదర్శి: హిందూధర్మరక్షణసంస్థ
తిరుపతి.
2.7.6 ప్రమేయం

| | |
|---|---|
| ఎస్. ఎస్. ఎస్. | శ్రీ ఎస్. సుదర్శనశర్మ, ఎం. ఏ.<br>రిసెర్చి అసిస్టెంట్, ఎస్. వి. సెంట్రల్ లైబ్రరీ<br>అండ్ రిసెర్చి సెంటర్, టి. టి.డి. తిరుపతి.<br>1.12. ప్రకృతి; 1.13 ఉపాఖ్యానాలు;<br>2.5.6 యజ్ఞయాగాలు |
| టి. ఎన్. | శ్రీ టి. నరసింహాచార్యులు,<br>ఎం. ఏ., వ్యాకరణ - సాహిత్య విద్యాప్రవీణ<br>వైస్‌ప్రిన్సిపాల్, ఎస్. ఎస్. ఎస్. కాలేజ్,<br>చిట్టిగూడూరు.<br>2.7.7 వైశిష్ట్యం |
| యు. ఎస్. ఆర్. | శ్రీ యు. సుబ్బరామశాస్త్రి, ఎం. ఏ. శిరోమణి<br>ప్రిన్సిపాల్ (రిటైర్డ్) వేద అండ్ సాంస్క్రిట్ కాలేజ్,<br>నెల్లూరు<br>2.6.7 వైశిష్ట్యం |
| యు. వి. ఆర్. | శ్రీ యు. వెంకటరామయ్య,<br>ఎం. ఏ., విద్యాప్రవీణ, భాషాప్రవీణ<br>లెక్చరర్, ఎస్.వి. ఓరియంటల్ కాలేజ్, తిరుపతి.<br>2.9.8 సంగ్రహసమీక్ష |
| వి. కె. ఎస్. | డాక్టర్ వి. కుటుంబశాస్త్రి<br>పిహెచ్.డి., విద్యాప్రవీణ, శిరోమణి<br>లెక్చరర్, కేంద్రీయసంస్కృతవిద్యాపీఠమ్,<br>తిరుపతి.<br>2.3.6 యజ్ఞయాగాలు; 2.4.7 వైశిష్ట్యం |

| | |
|---|---|
| వి. ఎస్. ఎస్. | శ్రీ వి. స్వామినాథన్, ఎం. ఏ. ఎం. లిట్.<br>ప్రిన్సిపాల్, శ్రీ జగద్గురువ్యాయమహావిద్యాలయం,<br>కాంచీపురం.<br>2.5.8 సంగ్రహసమీక్ష |
| వి. ఎస్. జి. | శ్రీ వి. సుబ్రహ్మణ్యఘనపాఠి, విద్యాప్రవీణ<br>లెక్చరర్, కె.యస్.ఎన్. సాంస్క్రిట్ కాలేజ్,<br>తెనాలి.<br>2.3.7. వైశిష్ట్యం |
| వి.వి. | ప్రొఫెసర్ వి. వరదాచార్య, ఎం.ఎ., పిహెచ్.డి.<br>ప్రొఫెసర్, ఫ్రెంచి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండాలజీ,<br>పాండిచ్చేరి.<br>2.6.6 యజ్ఞయాగాలు |

# ప్రస్తావన

డాక్టర్ ఎస్. బి. రఘునాథాచార్య
రీడర్, సంస్కృతవిభాగం
శ్రీ వేంకటేశ్వరవిశ్వవిద్యాలయం
తిరుపతి.

**బ్రాహ్మణవాఙ్మయం :**

భారతీయసంస్కృతికి, తత్త్వజ్ఞానానికి, అనూచానంగా వస్తున్న అఖండ ధర్మవాహినికి మూలకందాలు వేదాలు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదమని అవి నాలుగై వెలుగొందాయి. మంత్ర - బ్రాహ్మణాలకు రెంటికీ వేదమనే వ్యవహారం ఉంది. మంత్రభాగానికి సంహితలని పేరైతే; వాటిని వివరిస్తూ, యజ్ఞయాగాల్లో ఆయా మంత్రాల వినియోగాన్ని నిరూపిస్తూ వాటిని వ్యాఖ్యానించే గ్రంథరాశికి బ్రాహ్మణాలని పేరేర్పడింది. గాయత్రి మొ॥ ఛందస్సులలో మంత్రభాగం ఆవిర్భవించింది. కాని బ్రాహ్మణ గ్రంథాలు గద్యమయాలుగా రూపొందినాయి. సంహితాభాగంలో సాంకేతికంగా నిరూపింప బడిన తత్త్వాలు కొన్ని అక్కడక్కడా బ్రాహ్మణాలలో ఆఖ్యానరూపంలో స్పష్టస్వరూపాన్ని సంతరించుకున్నాయి.

వైదికవాఙ్మయరంగస్థలిలో ద్వితీయరంగం బ్రాహ్మణకాలం. ఈసమయంలో జనజీవనవాహినిలో తాత్త్వికదృష్టికి రూపురేఖలు అంత స్పష్టంగా ఏర్పడినట్లు లేదు. అలా అని అసలు లేకనూ పోలేదు. తృతీయరంగమైన

ఆరణ్యకకాలంలో తత్త్వచింతనకు తనకంటూ ఒక స్వరూపమేర్పడింది. అయితే మరి బ్రాహ్మణవాఙ్మయం ముఖ్యంగా ప్రతిపాదించిన విశేషాలేమిటి? అనేది ప్రశ్న? ధర్మాచరణం జీవిత సర్వస్వంగా భావింపబడిన రోజులవి. ధర్మమంటే ఏదో కాదు; లోక కల్యాణాన్ని, విశ్వశాంతిని కలిగించే యాగానుష్ఠానమే. కాబట్టి బ్రాహ్మణవాఙ్మయం యజ్ఞయాగాల స్వరూప స్వభావ ప్రభావాలను సమగ్రంగా సమన్వయించేస్తూ సమాజానికి చక్కని వివరణ నిస్తున్నది.

అంతవఱకు వేదసంహితలలో దేవతాస్తుతిరూపాలుగా ఉన్న ఋగాదిమంత్రాలను యజ్ఞయాగాలలో ఎలా వినియోగించాలో బ్రాహ్మణాలు చక్కగా వివరిస్తున్నాయి. ఒకరకంగా; ఛందోబద్ధంగా ఉన్న వేదసంహితలు మూలగ్రంథాలైతే, గద్యరూపంలో ఉన్న బ్రాహ్మణాలు వాటికి వ్యాఖ్యానాలని చెప్పవచ్చు.

ఆర్షవిజ్ఞానసర్వస్వం :

విజ్ఞాన - తత్త్వభాండాగారాలైన వేదసంహితలలో ఎన్నో శాఖలు నశించిపోయినాయి. ఆయా శాఖలపైన ఆధారపడిన ఇతర వైదికవాఙ్మయం కూడా కాలగర్భంలో కలిసిపోయింది. ప్రతి సంహితకు ఎన్నో బ్రాహ్మణాలుండేవి. పోయినవి పోగా ఉన్న వాటిని యాగానుష్ఠానానికి ఆదరణ ఉన్నంతవఱకు కాపాడుకుంటూ వచ్చారు మనపూర్వులు. లిపికూడా సరిగా లేని రోజులవి. పుస్తకాలుండే అవకాశమే లేదు. కాని జ్ఞాపకశక్తికి, శ్రద్ధకు వాళ్లల్లో లోటు లేదు. కాబట్టి ఎంతటి గ్రంథాన్నైనా అట్టే జ్ఞాపకం పెట్టుకోగలిగేవారు.

కొంతకాలం గడిచింది. కంఠస్థమైన గ్రంథాలను ఏదో ఒక లిపిలో పత్రస్థం చేయడం జరిగింది. కాని ఏం ప్రయోజనం? వైదిక ధర్మంమీద శ్రద్ధాసక్తులు సన్నగిల్లాయి. ఆదరణ అంతంతమాత్రంగానే మిగిలిపోయింది.

యజ్ఞయాగాలను చేయించే వాళ్ల సంఖ్య, చేసే వాళ్ళ సంఖ్య కూడా నానాటికీ తగ్గుతూ వచ్చింది. బ్రాహ్మణాలు నశించిపోవడం ప్రారంభమైంది. ఈనాడు నిజమాలోచిస్తే ఉన్న వాటి సంఖ్య కంటే పోగొట్టుకున్నవాటిసంఖ్యే చాలా ఎక్కువ. ఇదే గతి వాటిమీద ఆధారపడిన ఇతర గ్రంథాలకూ పట్టింది.

ఏమిటి చేయడం? వీటినిలాగే వదిలేయడమా? ఇప్పటికే ఎంతో విజ్ఞానాన్ని మట్టిపాలు చేసుకున్నాం. ఎలాగో మిగిలిన ఈ కొద్దిపాటి విజ్ఞానాన్ని కూడా మనం సంరక్షించలేకపోతే మనవారసులైన రానున్న తరాలవారికి ఎంత అన్యాయం జరుగుతుంది? నానాటికీ పైపైకి పెరిగిపోతున్న భౌతికదృష్టి మానవజాతిని సర్వనాశనం చేస్తుందేగాని, శాంతితో సహనంతో బ్రతకనివ్వదు. అజ్ఞానం, అహంకారం, అసూయాద్వేషాల అగ్నిజ్వాలలో అసలు మానవత్వమే మాడి మసై పోతున్నది. అందుకే కావాలి ఆర్షవిజ్ఞానసర్వస్వం. అది మనకండ్లు తెరిపిస్తుంది. మనం ఎంత కృత్రిమంగా జీవిస్తున్నామో తెలియజేస్తుంది.

సమాజంలో ప్రతివ్యక్తీ ప్రాచీనభారతీయుల విజ్ఞానవైభవాన్ని విశాలదృక్పథాన్ని సరిగా అర్థంచేసుకున్నప్పుడే ఆర్షవాఙ్మయానికి ఆదరణ లభిస్తుంది. సమాజంలో తన బాధ్యతను గుర్తించి, సమసమాజస్థాపనకు ప్రతివాడు అంకితమౌతాడు. తద్వారా లోకకల్యాణానికి గట్టి పునాదులు పడతాయి. ఈ ఉద్దేశ్యంతోనే ఆర్షవిజ్ఞాన సర్వస్వం ప్రణాళిక ఆవిర్భవించింది. పదిసంపుటాలలో ఆర్షవిజ్ఞాన సారాన్ని అందరికీ అందుబాటులోకి తేవడానికి తిరుమల తిరుపతి దేవస్థానం అహర్నిశలు కృషిచేస్తోంది. 'వేదసంహితలు' అనే మొదటి సంపుటాన్ని ఆంధ్రలోకానికి అందించింది. ఇప్పుడు "బ్రాహ్మణాలు" అనే రెండో సంపుటాన్ని సహృదయులకు సమర్పిస్తున్నది.

## సామాన్యవిభాగం :

ఈ సంపుటాన్ని సామాన్యవిభాగమని, విశేషవిభాగమని రెండుగా విభజించాము. బ్రాహ్మణాలన్నింటికి సంబంధించిన సాధారణాంశాలు సామాన్యవిభాగంలో సమీక్షించబడినాయి. ఇందులో పదిహేనుశీర్షికలున్నాయి.

## విశేషవిభాగం :

ఇందులో నాలుగువేదాలకు సంబంధించిన ముఖ్యమైన బ్రాహ్మణాలు ప్రణాళికాబద్ధంగా వివరింపబడినాయి. ప్రతి బ్రాహ్మణంలో ఎనిమిది అంశాలపైన దృష్టి కేంద్రీకరింపబడింది. వాటినీ చదివితే ఆ బ్రాహ్మణాన్ని గురించి పాఠకునికి కొంతవఱకు అవగాహన ఏర్పడటానికి అవకాశం ఉంది. ఇవి ఇందులో సమీక్షింపబడిన బ్రాహ్మణాలు :

| | | |
|---|---|---|
| ఋగ్బ్రాహ్మణాలు | : | 1. ఐతరేయబ్రాహ్మణం |
| | | 2. కౌషీతకిబ్రాహ్మణం |
| యజుర్బ్రాహ్మణాలు | : | 1. తైత్తిరీయబ్రాహ్మణం |
| | | 2. శతపథబ్రాహ్మణం |
| సామబ్రాహ్మణాలు | : | 1. తలవకారబ్రాహ్మణం |
| | | 2. తాండ్యబ్రాహ్మణం |
| | | 3. ఛాందోగ్యబ్రాహ్మణం |
| ఉపబ్రాహ్మణాలు | : | 1. సామవిధానబ్రాహ్మణం |
| | | 2. దేవతాధ్యాయబ్రాహ్మణం |
| | | 3. సంహితోపనిషద్బ్రాహ్మణం |
| | | 4. వంశబ్రాహ్మణం |
| అథర్వబ్రాహ్మణం | : | 1. గోపథబ్రాహ్మణం |

ఆనాటి యజ్ఞభావన, యజ్ఞయాగాలలో మధ్య మధ్య వివరింపబడే విశేషాలు, యజ్ఞాచరణలో కనబడే క్రమశిక్షణ మనల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తాయి. ఋతం, సత్యం, ఆనాటి వారి ప్రవృత్తిలో ఎలా సహజత్వాన్ని సంతరించుకున్నాయో మనం అర్థం చేసుకోగలుగుతాము. సత్య ధర్మ శాంతి ప్రేమలు ఆనాటి భారతీయులకు సహజాభరణాలనే సత్యం మన మనోనేత్రానికి తప్పక గోచరిస్తుంది. అందుకే ఈ ప్రయత్నం. ఆనందంగా అందుకోండి! ఊరికే అపనిందలు వేయకుండా ఈ వాఙ్మయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి! శాంతితో మీజీవితాలకు కొత్త భాష్యం చెప్పండి! మీ చుట్టూ సమాజాన్ని కూడా శాంతితో బ్రతకనివ్వండి! అదే ఆర్షవాఙ్మయం ఆశించే ఫలం.

# అనుక్రమణి


ముందుమాట

సంపాదకుని మాట

రచయితలు

ప్రస్తావన

1. సామాన్యవిభాగం

1.1 పరిచయం

1.2 బ్రాహ్మణం అంటే ఏమిటి? 3

బ్రాహ్మణపదనిర్వచనం ...

బ్రాహ్మణాల స్వరూపం ఏమిటి? 4

విధి 5

అర్థవాదం ...

స్తుతి ...

నింద ...

పరకృతి ...

పురాకల్పం ...

బ్రాహ్మణాల వైశిష్ట్యం 6

1.3 సంహితలు - బ్రాహ్మణాలు 7

ఋక్సంహిత - బ్రాహ్మణాలు ...

యజుస్సంహిత - బ్రాహ్మణాలు ...

సామసంహిత - బ్రాహ్మణాలు 8

అథర్వసంహిత - బ్రాహ్మణం ...

1.4 బ్రాహ్మణాల్లో ముందు వెనుకలు 9

1.5 నశించిపోయినబ్రాహ్మణాలు 12

ఋక్సంహిత - బ్రాహ్మణాలు 13

1. పైంగిబ్రాహ్మణం ...
2. బాహ్వృచబ్రాహ్మణం 14
3. ఆశ్వలాయనబ్రాహ్మణం ...
4. గాలవబ్రాహ్మణం ...

యజుస్సంహిత-బ్రాహ్మణాలు 15

1. చరకబ్రాహ్మణం ...
2. శ్వేతాశ్వతరబ్రాహ్మణం ...
3. కాఠకబ్రాహ్మణం 16
4. మైత్రాయణీబ్రాహ్మణం 17
5. జాబాలబ్రాహ్మణం ...
6. ఖాండికేయబ్రాహ్మణం 18
7. ఔఖేయబ్రాహ్మణం ...
8. హారిద్రవికబ్రాహ్మణం ...
9. తుంబురుబ్రాహ్మణం 19
10. ఆహ్వరకబ్రాహ్మణం ...
11. కంకతిబ్రాహ్మణం ...
12. ఛాగలేయబ్రాహ్మణం 20

సామసంహిత - బ్రాహ్మణాలు

1. భాల్లవిబ్రాహ్మణం ...
2. కాలబవిబ్రాహ్మణం 21
3. రౌరుకిబ్రాహ్మణం ...
4. శాట్యాయనబ్రాహ్మణం 22

సంకీర్ణబ్రాహ్మణాలు 23

1. ఆరుణేయబ్రాహ్మణం ...
2. సౌంధబ్రాహ్మణం ...

3. శైలాలిబ్రాహ్మణం 24
4. పరాశరబ్రాహ్మణం ...
5. మాషశరావిబ్రాహ్మణం 25
6. కాపేయబ్రాహ్మణం ...
7. రహస్యామ్నాయబ్రాహ్మణం 26
8. నిరుక్తబ్రాహ్మణం ...
9. అన్వాఖ్యానబ్రాహ్మణం ...
10-11 బాష్కలబ్రాహ్మణం - మాండూకేయబ్రాహ్మణం 26
12-13 త్రికర్వబ్రాహ్మణం - కరద్విషబ్రాహ్మణం - ...

1.6 బ్రాహ్మణాలు కూడా వేదాలేనా? 28
1. సంహితలు 29
2. బ్రాహ్మణాలు ...
3. ఆరణ్యకాలు ...
4. ఉపనిషత్తులు ...

1.7 బ్రాహ్మణాలవల్ల ఏం ప్రయోజనం? 31

1.8 బ్రాహ్మణాలు - సర్వానుక్రమణులు 34

1.9 మహర్షులు 37
బ్రాహ్మణాల్లో కొందరు ఋషులు ...
1. అగస్త్యుడు / అగస్తి ...
2. కణ్వుడు 38
3. గౌతముడు ...
4. కశ్యపుడు 39
5. అత్రి ...
6. యాజ్ఞవల్క్యుడు
7. భృగువు 40
8. భరద్వాజుడు ...
బ్రాహ్మణాలు కొన్ని ఋషిసందర్భాలు ...
1. కౌషీతకిబ్రాహ్మణం ...
2. శతపథబ్రాహ్మణం 41
3. షడ్వింశబ్రాహ్మణం ...
4. తాండ్యబ్రాహ్మణం ...
5. పంచవింశబ్రాహ్మణం ...
6. జైమినీయోపనిషద్బ్రాహ్మణం 41
7. గోపథబ్రాహ్మణం 42

1.10 రాజులు 43

1.11 సాంఘికజీవనం 48
దేశం ...
జాతులు 49
వర్ణాలు ...
బ్రాహ్మణులు ...
పురోహితుడు 50
క్షత్రియులు 51
వైశ్యులు 52
శూద్రులు ...
ఆశ్రమాలు 53
బ్రహ్మచర్యం విద్యాభ్యాసం ...
గార్హస్థ్యం - వివాహం 56

| | |
|---|---|
| వానప్రస్థ-సన్న్యాసాలు | 57 |
| రాజకీయపరిస్థితులు | ... |
| సామాజికస్థితిగతులు | 62 |
| సంగీతం | ... |
| నాట్యం | ... |
| క్రీడావినోదాలు | ... |
| వేషభాషలు | ... |
| ఆహారపానీయాలు | 63 |
| పాత్రలు | 64 |
| వైద్యం | 65 |
| వ్యవసాయం | ... |
| వృత్తులు | ... |
| వాణిజ్యం | 67 |
| వాహనాలు | ... |
| గృహ-రథ్యానిర్మాణం | 68 |
| లోహాలు | ... |
| వృక్షాలు | ... |
| మృగాలు | 69 |
| సర్పాలు | ... |
| పక్షులు | ... |
| కీటకాలు | 70 |
| మతం - ధర్మం | ... |
| 1.12 ప్రకృతి | 72 |
| ప్రకృతి అంటే ఏమిటి? | ... |
| ఈ జగత్తెలా పుట్టింది? | ... |
| నదీజలాలు | 73 |
| రెండు పంటలు | 74 |
| కొత్తరకం విత్తనాలు | ... |
| సముద్రపునీళ్ళెందుకు ఉప్పగా ఉంటాయి? | 75 |
| పర్వతాలు-ఓషధులు | 76 |
| సూర్యుడు | ... |
| చంద్రుడు | 77 |
| రావిచెట్టెందుకు ప్రదక్షిణాలు? | ... |
| జంతువులు | ... |
| పక్షులు | 78 |
| ప్రకృతిసౌకర్యాలు | ... |
| ఓషధీప్రభావం | 79 |
| ప్రకృతివైపరీత్యాలు - ఉపశాంతి | ... |
| ప్రకృతినిఅర్థంచేసుకోవాలి | 80 |
| 1.13 ఉపాఖ్యానాలు | 81 |
| 1. ఐతరేయబ్రాహ్మణం | ... |
| శునశ్శేపోపాఖ్యానం | 82 |
| నేనెవరిని? | 83 |
| 2. కౌషీతకిబ్రాహ్మణం | 84 |
| ప్రజాపతి తపస్సు | ... |
| అగ్నికి ఆజ్యం | 85 |
| 3. తైత్తిరీయబ్రాహ్మణం | ... |
| కాలకంజాలయాగం | ... |
| బ్రాహ్మణైనపుట్టు | 86 |
| సృష్టికి మొదట | 87 |
| అనుభవించిందే మనది | ... |
| వేదాలకు అంతంలేదు | ... |
| మోదుగచెట్టుఎలాపుట్టింది? | 88 |

4. శతపథబ్రాహ్మణం ...
సంజీవనీవిద్యతోబ్రతికిస్తాం ...
ఊర్వశి-పురూరవుడు 90
5. జైమినీయబ్రాహ్మణం 91
మేడిచెట్టెలా పుట్టింది? ...
6. తాండ్యబ్రాహ్మణం 92
వసిష్ఠుడే పురోహితుడు ...
నిజమైన పుత్రుడు ...
వైఖానససామ 94
7. గోపథబ్రాహ్మణం ...
ఉద్దాలకుడు ...
ప్రేది - ఉద్దాలకుడు 95
దక్షయజ్ఞధ్వంసం 96
1.14 మతం - తత్త్వం 97
మతం ...
దేవతలు 98
ప్రజాపతి 100
అగ్ని ...
స్త్రీదేవతలు 102
తత్త్వం 103
పరబ్రహ్మ ...
ఆత్మ 104
ముల్లోకాలు 105
స్వర్గం ...
మృత్యువు 106
సంతానం 107
సత్యం 108
అహింస ...
పాపం 109
1.15 కవితాసౌందర్యం 110
ఏరుదాటిన తర్వాత 114
తనకుమాలిన ధర్మం 115
కొంచెం ఎక్కువ ...
ఎద్దేవా 116
1.16 భాషాపరిణామం -
గద్యవికాసం 118
గద్యవికాసం 123
2. విశేషవిభాగం 129
2.1 ఐతరేయబ్రాహ్మణం ...
2.1.1. పరిచయం ...
ఐతరేయమంటే ఏమిటి? ...
2.1.2 విభాగం 131
విషయవిభాగం 132
మొదలు-చివర ...
2.1.3 సంకలనకాలం 133
దేశం ...
కాలం ...
2.1.4. వ్యాఖ్యానాలు -
ప్రమురణలు 135
వ్యాఖ్యానాలు ...
ప్రమురణలు ...
2.1.5 ప్రసిద్ధి 137
2.1.6 యజ్ఞయాగాలు 140
1. జ్యోతిష్టోమము 141
దీక్షణీయేష్టి 142
ప్రాయణీయేష్టి ...
ఉదయనీయేష్టి ...
ఆతిథ్యేష్టి ...

ప్రవర్గ్య 143
ఉపసత్ ...
2. గవామయనము ...
3,4 ఆదిత్యానామయనము -
అంగిరసామయనము 144
5 ద్వాదశాహము ...
6. అగ్నిహోత్రము 145
2.1.7 వైశిష్ట్యం 146
2.1.8 సంగ్రహసమీక్ష 152
మీకు ప్రతిష్ఠకావాలా? ...
2.2 కౌషీతకిబ్రాహ్మణం 163
2.2.1 పరిచయం ...
2.2.2 విభాగం 166
విషయవిభాగం ...
మొదలు - చివర 167
2.2.3 సంకలనకాలం 168
దేశం ...
కాలం ...
2.2.4 వ్యాఖ్యానాలు -
ప్రచురణలు 170
వ్యాఖ్యానాలు ...
ప్రచురణలు ...
2.2.5 ప్రసిద్ధి 171
2.2.6 యజ్ఞయాగాలు 173
అగ్న్యాధానం ...
అగ్నిహోత్రం 176
దర్శపూర్ణమాసలు 177
వికృతీష్టులు 179
1. అనునిర్వాప్యేష్టి 180
2. అభ్యుదితేష్టి ...
3. అభ్యుద్దృష్టేష్టి ...
4. దాక్షాయణయజ్ఞం ...
5. ఇళాదధేష్టి 181
6. సార్వసేనియజ్ఞం ...
7. శౌనకయజ్ఞం ...
8. వసిష్ఠయజ్ఞం ...
9. సాకంప్రస్థాయ్యేష్టి 182
10. ముష్యయనేష్టి ...
11. తురాయణేష్టి ...
12. అగ్రయణేష్టి ...
చాతుర్మాస్యయాగాలు 183
1. వైశ్వదేవం ...
2. వరుణప్రఘాసం 184
3. సాకమేధం 185
4. శునాసీరీయం ...
సోమయాగాలు 186
2.2.7 వైశిష్ట్యం 188
2.2.8 సంగ్రహసమీక్ష 196
2.3 తైత్తిరీయబ్రాహ్మణం 203
2.3.1 పరిచయం ...
తైత్తిరీయం అంటే ఏమిటి? 204
2.3.2 విభాగం 205
విషయవిభాగం 206
మొదలు-చివర ...

2.3.3 సంకలనకాలం 207

దేశం ...

కాలం ...

2.3.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు 208

వ్యాఖ్యానాలు ...

ప్రచురణలు ...

2.3.5 ప్రసిద్ధి 209

భర్తప్రేమను పొందాలంటే ...

ఎందుకివి తారకలైనాయి? ...

2.3.6 యజ్ఞయాగాలు 211

1. ఆగ్న్యాధానం 213
2. అగ్నిహోత్రం 217
3. దర్శపూర్ణమాసేష్టి 218
4. పిండపితృయజ్ఞం 221
5. చాతుర్మాస్యాలు 222

5.1 వైశ్వదేవపర్వ 223

5.2 వరుణప్రఘాసపర్వ ...

5.3 సాకమేధపర్వ 224

5.4 శునాసీరీయపర్వ 225

6. రాజసూయం 226
7. సోమయాగం 227
8. గవామయనం 228
9. పురుషమేధం ...

2.3.7 వైశిష్ట్యం 230

2.3.8 సంగ్రహసమీక్ష 233

మొదటికాండ ...

నక్షత్రాన్నెలా తెలుసుకోవడం? ...

అశ్రద్ధపనికిరాదు 234

కన్ను అబద్ధం చెప్పదు ...

విషువత్ అంటే ఏమిటి? ...

వాజపేయమంటే? 235

పోట్లాడుకోకూడదు ...

రెండుపార్లెందుకన్నంతినడం? 23

ప్రజాపతిశరీరం 237

రెండవకాండ 237

ఆవులే అగ్నిహోత్రాలు 238

మానవులెలా పుట్టారు? ...

కిలాసం : ఫలితం 240

మూడవకాండ 240

నక్షత్రాలు - రెండురకాలు ...

వైదికపరిభాషలు 243

2.4 శతపథబ్రాహ్మణం 247

2.4.1 పరిచయం ...

2.4.2 విభాగం 249

విషయవిభాగం 250

మొదలు-చివర 251

2.4.3 సంకలనకాలం 252

దేశం ...

కాలం ...

2.4.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు 253

వ్యాఖ్యానాలు ...

ప్రచురణలు 254

2.4.5 ప్రసిద్ధి 255
2.4.6 యజ్ఞయాగాలు 257
యజ్ఞాలెన్నిరకాలు? ...
అగ్న్యాధానం 258
అగ్నిహోత్రం 259
దర్శపూర్ణమాసేష్టి ...
చాతుర్మాస్యలు ...
సోమయాగం-అగ్నిష్టోమం 260
వాజపేయం 262
అగ్నిచయనం ...
సౌత్రామణి 264
ప్రవర్గ్య 265
రాజసూయం ...
అశ్వమేధం 267
పురుషమేధం 268
సర్వమేధం 269
పితృమేధం ...
ఋత్విక్కులు ...
2.4.7 వైశిష్ట్యం 271
2.4.8 సంగ్రహసమీక్ష 278
దర్శపూర్ణమాసం ...
పిండపితృయజ్ఞం 279
నవాన్నేష్టి ...
చాతుర్మాస్యేష్టి ...
సోమయాగం 280
అగ్నిష్టోమం ...
రాజసూయం ...
అగ్నిచయనం ...
పంచమహాయజ్ఞాలు 281
సౌత్రామణి ...
ఉపాఖ్యానాలు 282
2.5 తలవకారబ్రాహ్మణం 285
2.5.1 పరిచయం ...
2.5.2 విభాగం 287
విషయవిభాగం 288
మొదలు - చివర ...
2.5.3 సంకలనకాలం 289
దేశం ...
కాలం ...
2.5.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు 290
వ్యాఖ్యానాలు ...
ప్రచురణలు ...
2.5.5 ప్రసిద్ధి 291
2.5.6 యజ్ఞయాగాలు 292
ఆహితాగ్ని అంటే ఎవరు? ...
ఉద్భిద్బలభిద్యాగాలు 299
2.5.7 వైశిష్ట్యం 306
విషయవైశిష్ట్యం 307
భాషాప్రయోగవైశిష్ట్యం 308
చారిత్రకవిషయామశీలనం 309
వైజ్ఞానికతత్త్వవివేచనం 310
2.5.8 సంగ్రహసమీక్ష 312
2.6 తాండ్యబ్రాహ్మణం 320
2.6.1 పరిచయం ...

2.6.3 విభాగం 322

విషయవిభాగం ...

మొదలు-చివర 323

2.6.3 సంకలనకాలం 324

దేశం ...

కాలం ...

2.6.4 వ్యాఖ్యానాలు -

ప్రచురణలు 325

వ్యాఖ్యానాలు ...

ప్రచురణలు ...

2.6.5 ప్రసిద్ధి 326

మధ్యలో మాట్లాడకూడదు ...

2.6.6 యజ్ఞయాగాలు 328

2.6.7 వైశిష్ట్యం 337

2.6.8 సంగ్రహసమీక్ష 342

2.7 ఛాందోగ్యబ్రాహ్మణం 351

2.7.1 పరిచయం ...

2.7.2 విభాగం 353

విషయవిభాగం ...

మొదలు-చివర 354

2.7.3 సంకలనకాలం 355

దేశం ...

కాలం ...

2.7.4 వ్యాఖ్యానాలు -

ప్రచురణలు 356

వ్యాఖ్యానాలు ...

ప్రచురణలు ...

2.7.5 ప్రసిద్ధి 358

2.7.6 ప్రమేయం 360

2.7.7 వైశిష్ట్యం 368

2.7.8 సంగ్రహసమీక్ష 375

మొదటిప్రపాఠకం ...

రెండవప్రపాఠకం 377

2.8 ఉపబ్రాహ్మణాలు 381

2.8.1.1 సామవిధానబ్రాహ్మణం 382

2.8.1.2 దేవతాధ్యాయ

బ్రాహ్మణం ...

2.8.1.3 సంహితోపనిష

ద్బ్రాహ్మణం 383

2.8.1.4 వంశబ్రాహ్మణం ...

2.8.2 విభాగం 384

2.8.2.1 సామవిధాన

బ్రాహ్మణం ...

విషయవిభాగం ...

మొదలు-చివర ...

2.8.2.2 దేవతాధ్యాయ

బ్రాహ్మణం ...

విషయవిభాగం 385

మొదలు-చివర ...

2.8.2.3 సంహితోపనిష

ద్బ్రాహ్మణం ...

విషయవిభాగం ...

మొదలు-చివర ...

Page No.


2.8.2.4 వంశబ్రాహ్మణం 386
విషయవిభాగం ...
మొదలు-చివర ...
2.8.3 సంకలనకాలం 387
2.8.4 వ్యాఖ్యానాలు-ప్రచురణలు 388
2.8.4.1 సామవిధానబ్రాహ్మణం
వ్యాఖ్యానాలు ...
ప్రచురణలు ...
2.8.4.2 దేవతాధ్యాయబ్రాహ్మణం 389
వ్యాఖ్యానాలు ...
ప్రచురణలు ...
2.8.4.3 సంహితోపనిషద్బ్రాహ్మణం 390
వ్యాఖ్యానాలు ...
ప్రచురణలు ...
2.8.4.4 వంశబ్రాహ్మణం ...
వ్యాఖ్యానాలు ...
ప్రచురణలు ...
2.8.5 ప్రసిద్ధి 392
2.8.5.1 సామవిధానబ్రాహ్మణం ...
నచ్చినవాడికివ్వడమెలా? ...
2.8.5.2 దేవతాధ్యాయబ్రాహ్మణం 393
2.8.5.3 సంహితోపనిషద్బ్రాహ్మణం ...
2.8.5.4 వంశబ్రాహ్మణం 394
2.8.6 ప్రమేయం 395
2.8.6.1 సామవిధానబ్రాహ్మణం...
సామ-దాని గొప్పదనం ...
సామార్థ్యయువం 396
తపస్సు 398
ప్రాయశ్చిత్తాలు 399
కామ్యకర్మలు 400
2.8.6.2 దేవతాధ్యాయబ్రాహ్మణం 402
2.8.6.3 సంహితోపనిషద్బ్రాహ్మణం 403
2.8.6.4 వంశబ్రాహ్మణం 405
2.8.7 వైశిష్ట్యం 406
2.8.7.1 సామవిధానబ్రాహ్మణం ...
2.8.7.2 దేవతాధ్యాయబ్రాహ్మణం 407
2.8.7.3 సంహితోపనిషద్బ్రాహ్మణం 409
2.8.7.4 వంశబ్రాహ్మణం 411
2.8.8 సంగ్రహసమీక్ష 412
2.8.8.1 సామవిధానబ్రాహ్మణం ...
2.8.8.2 దేవతాధ్యాయబ్రాహ్మణం 413
2.8.8.3 సంహితోపనిషద్బ్రాహ్మణం 415
2.8.8.4 వంశబ్రాహ్మణం 417

| | | |
|---|---|---|
| 2.9 | గోపథబ్రాహ్మణం | 419 |
| 2.9.1 | పరిచయం | 421 |
| 2.9.2 | విభాగం | 423 |
| | విషయవిభాగం | ... |
| | మొదలు-చివఱ | 424 |
| 2.9.3 | సంకలనకాలం | 425 |
| | దేశం | ... |
| | కాలం | ... |
| 2.9.4 | వ్యాఖ్యానాలు - ప్రమరణలు | 426 |
| | వ్యాఖ్యానాలు | ... |
| | ప్రమరణలు | ... |
| 2.9.5 | ప్రసిద్ధి | 427 |
| 2.9.6 | యజ్ఞయాగాలు | 429 |
| | ఋత్విక్కులు | ... |
| | 1. అగ్న్యాధేయం | 430 |
| | 2. అగ్నిష్టోమం | ... |
| | 3. జ్యోతిష్టోమం | ... |
| | 4. దర్శపూర్ణమాసలు | ... |
| | 5. కామ్యేష్టులు | 431 |
| 2.9.7 | వైశిష్ట్యం | 433 |
| | ప్రపంచసృష్టి | ... |
| | ప్రణవం | 436 |
| | గాయత్రీమంత్రం | 437 |
| | ఋక్సామల సంబంధం | 438 |
| 2.9.8 | సంగ్రహసమీక్ష | 440 |
| | నిర్వచనం | ... |
| | ఐతిహ్యం | ... |
| | ప్రతిపాద్యం | 441 |
| | మర్మగర్భవివరణలు | 442 |
| | సుభాషితాలు | 443 |
| | పూర్వబ్రాహ్మణం | 444 |
| | ఉత్తరబ్రాహ్మణం | ... |

# సామాన్య విభాగం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 1. సామాన్యవిభాగం

### 1.1 పరిచయం

భగవంతుని నిశ్వాసలే వేదాలు[1]. అవి ఋక్, యజుస్, సామ, అథర్వాలని నాలుగు. వీటి మూలగ్రంథాలను సంహిత లంటారు. ఇవి అన్నీ దాదాపు ఛందోబద్ధమైన మంత్రాలుగా ఉంటాయి. అందుకనే దీనికి మంత్రభాగమని వ్యవహారం. దేవతాస్తుతులు, యజ్ఞయాగాదివైదిక కర్మలు, ధార్మికప్రక్రియలు, తాత్త్విక చింతనలు ఇందులో ప్రతిపాదింపబడ్డాయి. ఎన్నో సంవత్సరాలు తపస్సుచేసి సంపాదించుకున్న దివ్యజ్ఞానంతో, పరమేశ్వరానుగ్రహంతో ఈ సంహితలను మహర్షులు భావనాకాశంలో దర్శించారు. అందుకనే వాళ్లను మంత్రద్రష్టలంటున్నాం. వారు దర్శించిన మంత్రాల నుపయోగించి వివిధదేవతలరూపంలో ఉన్న భగవంతునికి చేసిన ఆరాధనమే యజ్ఞం. ఇది చరాచరసృష్టికంతటికీ సుఖాన్నీ, సంతోషాన్నీ శాంతిని ప్రసాదిస్తుంది.

---

1. అస్య మహతో భూతస్య నిశ్వసితం యదృగ్వేదః బృహ. 2-4-10.

యజ్ఞయాగాలను నిర్వహించడానికి వాళ్ళు కొన్ని పద్ధతులను అనుసరించారు. వాటిల్లో ఎంతో సామాజికదృష్టి, తాత్త్వికచింతన, ధర్మపరమైన ఆసక్తి స్పష్టంగా కనబడుతున్నాయి. సంహితను సరిగా అర్థంచేసుకొని దాన్ని అనేకకర్మల్లో ఉపయోగించుకుంటూ, అందులోని సాంకేతికమైన అర్థాలను వివరిస్తూ ఏర్పడిన గ్రంథాలే బ్రాహ్మణాలుగా రూపొందినాయి. ఇవి గద్యమయాలు. వేద సంహితలకు, తరువాత పెరిగిన వాఙ్మయానికి మధ్య ఈ బ్రాహ్మణాలు వంతెనలాంటివి. యాగస్వరూపాన్ని రూపొందించడమే బ్రాహ్మణాలకు ముఖ్యమైన పని అయినప్పటికీ సందర్భాన్ని బట్టి అవి చాలా చోట్ల మానవ జీవనవిధానానికి, సమాజ సంస్కృతులకు ఉపయోగించే విశేషాలనెన్నింటినో చక్కగా వివరిస్తున్నాయి. ఈ వాఙ్మయానికి పట్టిన అద్దమే మీరు చదవబోతున్న ఈ సంపుటం.

— ఎస్. బి. ఆర్.

## 1. 2 బ్రాహ్మణం అంటే ఏమిటి ?

సువిశాలమైన వైదికవాఙ్మయరంగంలో సంహితల తరువాత ఉన్నతస్థానాన్ని ఆక్రమించిన మహోత్కృష్టగ్రంథరాశిని బ్రాహ్మణాలని వ్యవహరిస్తున్నాం. ఇవి కూడ వేదాలని పిలువబడే పవిత్ర గ్రంథాలలో అంతర్భాగాలేనని భారతీయుల దృఢవిశ్వాసం.

బ్రాహ్మణపదనిర్వచనం :

'బ్రహ్మ' అనే శబ్దానికి సంహితాభాగం అర్థమని శతపథబ్రాహ్మణం చెబుతున్నది[1]. ఈ బ్రహ్మకు; అంటే ఋగ్యజుస్సామాథర్వసంహితలలోని మంత్రభాగానికి వినియోగాన్ని విధిస్తూ, వ్యాఖ్యానరూపంగా ఏర్పడినగ్రంథం 'బ్రాహ్మణం' అనబడుతున్నది. ఋగాదిసంహితల్లోగల మంత్రాలను ఆయా యజ్ఞాలలో ఎక్కడెక్కడ ఎలా వినియోగించాలో నిరూపిస్తూ, వాటిని సరైన పద్ధతిలో అవసరమైనచోట్ల వ్యాఖ్యానిస్తూ ఉండే గ్రంథాలకు బ్రాహ్మణాలని పేరని తెలుస్తున్నది[2]. సంహితలలో నిగూఢంగా ఉన్న అర్థాన్ని అనేకవివరణల ద్వారా, ఉపాఖ్యానాల ద్వారా ఈ బ్రాహ్మణగ్రంథాలు తెలియ జేస్తుంటాయి.

బ్రాహ్మణపదాన్ని ఇంకోరకంగా కూడా కొందరు నిర్వచించారు. బ్రహ్మ=యాగనిర్వాహకుడు. ఇతడికి బ్రాహ్మణుడని కూడా పేరు[3]. నాలుగు వేదాలను అధ్యయనం చేసి, యజ్ఞస్వరూపాన్ని బాగా అర్థంచేసుకుని నడిపించ

---

1. బ్రహ్మ వై మన్త్రః 7-1-1-5.
సప్తాక్షరం వై బ్రహ్మ ఋగిత్యేకాక్షరం, యజురితి ద్వే, సామేతి ద్వే
అథ యదతోఽన్యద్ బ్రహ్మైవ తద్ ద్వ్యక్షరం వై బ్రహ్మ. తదేతత్సర్వం
సప్తాక్షరం బ్రహ్మ 10-2-4-6.
2. మన్త్రో మననాత్, బ్రాహ్మణమభిధానాత్-కపర్దివ్యాఖ్య ఆప. శ్రౌ. సూ. 32.
3. బ్రహ్మ వై బ్రాహ్మణః శ. బ్రా.
సమానార్థావేతౌ బ్రహ్మన్ శబ్దో బ్రాహ్మణశబ్దశ్చ మహా. 5-1-1.

గలవాడితడు. ఇలాంటి బ్రహ్మ యాగనిర్వహణవిధానాన్ని క్రమబద్ధంచేసి ప్రతిపాదిస్తాడు. బ్రహ్మచేత శాస్త్రీయంగా ప్రతిపాదింపబడిన యాగానుష్ఠాన విధానమే బ్రాహ్మణం అనబడుతున్నది[1]. దయానందసరస్వతి, సత్యవ్రతసామశ్రమి మొ॥ భారతీయపండితులు, జూలియస్ ఎగ్గెలింగ్ (Julius Eggeling) మార్టిన్ హాగ్ (Martin Haug) మొ॥ పాశ్చాత్యపండితులు బ్రాహ్మణపదానికి పైన చెప్పిన రెండవనిర్వచనాన్ని అనుసరించారు.

సామాన్యంగా ఆరణ్యకాలు, ఉపనిషత్తులు బ్రాహ్మణవాఙ్మయం కంటే విభిన్నమైనవి. కాని కొన్ని ఆరణ్యకాలు, ఉపనిషత్తులు బ్రాహ్మణగ్రంథాల్లో భాగాలుగా ఉన్నాయి. ఉదా :- బృహదారణ్యకోపనిషత్తు శతపథబ్రాహ్మణంలో ఉన్నది. కాని ఆరణ్యకాలు, ఉపనిషత్తులు కలసిఉన్న బ్రాహ్మణాల్లో వాటిని విడిచి మిగత భాగాలనే బ్రాహ్మణాలుగా పరిగణించి ఈసంపుటంలో విషయపరిశీలనం చేయబడుతుంది. కనుక ఇందులో "బ్రాహ్మణం" అనే పదాన్ని పై అర్థంలో పరిమితం చేసి వాడుతున్నాను.

## బ్రాహ్మణాల స్వరూపం ఏమిటి ?

జైమిని పూర్వమీమాంసాదర్శనంలో బ్రాహ్మణాలను గురించి చెబుతూ "మంత్రాలు కాకుండా మిగిలినదంతా బ్రాహ్మణ" మని (శేషే బ్రాహ్మణశబ్దః 2.1.33) చెప్పాడు. యాగానుష్ఠానంలో మనల్ని ప్రేరేపించే విధులే బ్రాహ్మణాలని ఆపస్తంబుడు ప్రతిపాదించాడు[2]. ఈ ప్రేరణ, విధి - అర్థవాదలద్వారా మనకు లభిస్తున్నదని సాయణుని అభిప్రాయం[3].

---

1. చతుర్వేదవిద్భిః బ్రహ్మభిః బ్రాహ్మణైః మహర్షిభిః ప్రోక్తాని యాని వేదవ్యాఖ్యానాని తాని బ్రాహ్మణాని. దయానన్ద ఋ. భా. భూ.
2. కర్మచోదనా బ్రాహ్మణాని. ఆప. శ్రౌ. సూ. 34-35.
3. ద్వివిధం బ్రాహ్మణమ్-విధిః అర్థవాదశ్చ. ఋక్. భా. భూ. 9.

విధి : ప్రత్యేకప్రయోజనాన్ని ఉద్దేశించి యాగాదికర్మలను చేయాలని ఆదేశించేది విధి. ఇది (1) అప్రవృత్తప్రవర్తకం (2) అజ్ఞాతజ్ఞాపకం అని రెండు రకాలు. మనం చేయని యాగాదికర్మల్లో మనల్ని ప్రేరేపించేవాక్యాలు అప్రవృత్తప్రవర్తకమనే మొదటివిభాగానికి చెందినవి[1]. తెలియనివిషయాన్ని మనకు తెలియజేసేవి రెండవవిభాగానికి చెందిన వాక్యాలు[2].

అర్థవాదం : విధిచేత ప్రేరేపింపబడిన కర్మలను ప్రశంసిస్తూ వాటినాచరించడంలో మనల్ని ప్రోత్సహించేవి, విధింపబడని కర్మలను నిందిస్తూ వాటినుంచి మనల్ని నివర్తింపజేసేవి అర్థవాదవాక్యాలు. ఇవి. 1. స్తుతి 2. నింద 3. పరకృతి. 4. పురాకల్పమని నాలుగు విధాలు.

*1. స్తుతి :* దీన్ని 'ప్రశంస' అని కూడా అంటారు. విధింపబడిన కర్మ గుణగణాలను ఇది ప్రశంసిస్తుంది. ఉదా:- "వాయుర్వైక్షేపిష్ఠా దేవతా". వాయువు శీఘ్రంగా వెళ్లే దేవత. కనుక త్వరగా ఫలితాన్నివ్వగలడు అని వాయుదేవతాకయాగాన్ని ప్రశంసిస్తున్నదీ వాక్యం.

*2. నింద :* ఆచరించకూడని కర్మను నిందిస్తూ దానినుంచి మనల్ని నివర్తింపజేసేది నింద. ఉదా :- "ఉపవీతా వా ఏత స్యాగ్నయః".

*3. పరకృతి :* ఇతరులు చేసిన విరుద్ధమైన విధిని చెప్పేది పరకృతి. ఉదా :- "మాషానేవ మహ్యం పచతి".

*4. పురాకల్పం :* ఐతిహ్యాన్ని తెలియజేసే వాక్యం పురాకల్పమవుతుంది. ఉదా :- "పురా బ్రాహ్మణా అభైషుః"

---

1. అగ్నావైష్ణవం పురోడాశం నిర్వపన్తి దీక్షణీయమ్ ఐ. బ్రా. 1-1.
2. ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ ఐ. ఆ. 2-4-1.

ఈ నాలుగుకాక 1. హేతువు 2. నిర్వచనం 3. సంశయం 4. వ్యవధారణకల్పన 5. ఉపమానం అనే అయిదు అంశాలను విధితో చేర్చి మొత్తం విధులు పదివిధాలని కొందఱు చెబుతారు.

**బ్రాహ్మణాల వైశిష్ట్యం :**

బ్రాహ్మణాలన్నీ ప్రతిపాదించే ప్రధానవిషయం యజ్ఞం. యజ్ఞయాగాలను విధిస్తూ మధ్యమధ్య సంహితలలో చెప్పబడ్డ అనేక సాంకేతికవిశేషాలను ఇవి వివరిస్తున్నాయి. తరువాత హిఋ్మయంలో విస్తరించిన భారతీయభావనలకు బ్రాహ్మణాలు పునాదులు వేస్తున్నాయి. ఇలా ఈ బ్రాహ్మణాలు అనేకకోణాల్లోంచి చాలా విశిష్టమైన గ్రంథాలుగా భావింపబడ్డాయి.

బ్రాహ్మణాలవైశిష్ట్యాన్ని ఆధునికుల్లో కూడ చాలామంది భారతీయపండితులు, పాశ్చాత్యవిమర్శకులు గుర్తించారు. బ్రాహ్మణాలు వేదమా? కాదా? అన్న అంశంలో కొంచెం తటపటాయించినా వింటర్నిట్జ్ (Winternitz) 'భారతీయుల ఆలోచనాసరణికి సంబంధించిన చరిత్రలో బ్రాహ్మణాలపాత్ర అనన్యసాధారణమైందని' ఉద్ఘోషించాడు. 'యజ్ఞయాగాల చరిత్రను, మతస్వరూపాన్ని పరిశీలించే విద్యార్థికి బ్రాహ్మణాలు గొప్ప ప్రమాణగ్రంథా'లని ప్రశంసించాడు. డబ్ల్యు.డి.విట్నీ (W. D. Whitney) ప్రొ. జిమ్మర్ (Prof. Zimmer) వైదికసూక్తాల వర్థం చేసుకోవడానికి బ్రాహ్మణాలు మనకు చేస్తున్న సాహాయ్యం ఇంతా అంతా కాద'న్నారు. సి. జి. కాశికర్, వైదికనాగరికతను, సంస్కృతిని అర్థంచేసుకోవాలంటే బ్రాహ్మణాల అవసరం ఎంతైనా ఉంద'న్నాడు. ఇలాగే హెచ్. ఆర్. కర్ణిక్, ఎస్. కె. బెల్వల్కర్, ఆర్.డి. రానడె, టి.వి. కపాలిశాస్త్రి మొ॥వారు బ్రాహ్మణాల వైశిష్ట్యాన్ని ఎన్నో కోణాలనుంచి సమీక్షించారు.

— ఎస్. బి. ఆర్.

## 1. 3 సంహితలు - బ్రాహ్మణాలు

### ఋక్సంహిత - బ్రాహ్మణాలు :

సంహితలలో ప్రతిప్రధానశాఖకు ఒక బ్రాహ్మణం ఉండేది. ఋక్సంహితకు 21 శాఖలున్నట్లు ప్రసిద్ధి. నిజానికి ఇరవై ఒక్క శాఖలకు అన్ని బ్రాహ్మణాలు ఉండవలసిందే. కాని ఋగ్వేదానికి 1. ఐతరేయ బ్రాహ్మణం 2. కౌషీతకి (శాంఖాయన) బ్రాహ్మణం 3. పైంగి బ్రాహ్మణం 4. బహ్వృచ బ్రాహ్మణం 5. ఆశ్వలాయన బ్రాహ్మణం 6. గాలవబ్రాహ్మణం అని ఆరు బ్రాహ్మణాలుండేవని తెలుస్తున్నది. వీటిల్లో మొదటి రెండుబ్రాహ్మణాలు మాత్రమే ఇప్పుడు దొరుకుతున్నాయి. మిగతా నాలుగు నామమాత్రంగానే చరిత్రలో మిగిలి పోయాయి. ఐతరేయబ్రాహ్మణానికే బహ్వృచబ్రాహ్మణమని పేరని కొందరి అభిప్రాయం.

### యజుస్సంహిత - బ్రాహ్మణాలు :

కృష్ణ-శుక్లభేదంతో యజుర్వేదానికి రెండు ప్రధానశాఖలున్నాయి. వాటిల్లో కృష్ణయజుర్వేదానికిగల తైత్తిరీయశాఖలకు సంబంధించింది తైత్తిరీయబ్రాహ్మణం. మాధ్యందిన-కాణ్వభేదంతో శుక్లయజుర్వేదానికి రెండుశాఖలున్నాయి. వాటికి విడివిడిగా మాధ్యన్దిన శతపథబ్రాహ్మణం, కాణ్వశతపథబ్రాహ్మణమని రెండు బ్రాహ్మణాలున్నాయి. ఇవిగాక ఈ యజుర్వేదానికి సంబంధించి కాలగర్భంలో కలిసిపోయిన బ్రాహ్మణాలు ఇంకా పన్నెండున్నాయి. అవి 1. చరక బ్రాహ్మణం 2. శ్వేతాశ్వతరబ్రాహ్మణం 3. కాఠకబ్రాహ్మణం (శతాధ్యయన) 4. మైత్రాయణీబ్రాహ్మణం 5. జాబాలబ్రాహ్మణం 6. ఖాండికేయబ్రాహ్మణం 7 ఔఖేయబ్రాహ్మణం 8 హారిద్రవికబ్రాహ్మణం 9. తుంబురుబ్రాహ్మణం 10. ఆహ్వారకబ్రాహ్మణం 11. కంకతి బ్రాహ్మణం 12. ఛాగలేయబ్రాహ్మణం.

సామసంహిత - బ్రాహ్మణాలు :

సామవేదశాఖలవిషయంలో లాగానే సామబ్రాహ్మణాలను గురించి కూడ విమర్శకులలో ఏకాభిప్రాయం లేదు. ఈ క్రింద పేర్కొన్నట్లు ఈ వేదానికి మూడు ప్రధానబ్రాహ్మణాలు, నాలుగు ఉపబ్రాహ్మణాలు ఉన్నాయనే అంశంలో చాలామంది ఏకీభవిస్తున్నారు. అవి 1. తలవకారబ్రాహ్మణం; దీనికే జైమినీయబ్రాహ్మణం అని ప్రసిద్ధి. 2 తాండ్యబ్రాహ్మణం; దీన్ని పంచవింశ లేక ప్రౌఢబ్రాహ్మణమని కూడా అంటారు. 3. ఛాందోగ్యబ్రాహ్మణం; దీనికి మంత్ర బ్రాహ్మణమని కూడా పేరు. ఇవికాక 1. సామవిధానబ్రాహ్మణం 2. దేవతాధ్యాయ (దైవత) బ్రాహ్మణం 3. వంశబ్రాహ్మణం 4. సంహితోపనిష బ్రాహ్మణం అని నాలుగు ఉపబ్రాహ్మణా లున్నాయి. ఈ నాల్గింటిని కొందఱు అనుబ్రాహ్మణాలని కూడా అంటారు. ఇవికాక 1. భాల్లవిబ్రాహ్మణం 2. కాలబవిబ్రాహ్మణం 3. రౌరుకిబ్రాహ్మణం 4. శాట్యాయనబ్రాహ్మణం అనే నాలుగు సామవేదబ్రాహ్మణాలు పేరుకుమాత్రమే మిగిలి ఉన్నాయి.

అథర్వసంహిత - బ్రాహ్మణం :

అథర్వవేదానికిగల ఒకే ఒక బ్రాహ్మణం గోపథబ్రాహ్మణం. ఈ వేదం ఇతరవేదాల్లాగా యజ్ఞయాగాది కర్మలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్లనేమో! ఇంకా దీనికి సంబంధించిన ఇతరబ్రాహ్మణాల పేర్లు కూడా మనకు దొరకడం లేదు.

— ఎస్. బి. ఆర్.

## 1. 4 బ్రాహ్మణాల్లో ముందు వెనుకలు :

సంహితలచేత ప్రతిపాదింపబడిన కర్మకాండను వివరించే బ్రాహ్మణగ్రంథాలు, యజ్ఞయాగాదివైదికకర్మల స్వరూపప్రభావాలను వివరిస్తున్నాయి. ఈ గ్రంథాలను దగ్గఱగా పరిశీలిస్తే ఇవి విభిన్న కాలాల్లో ఏర్పడి ఉంటాయనుకోవడానికి తగిన సాక్ష్యాలు మనకు దొరుకుతాయి. కర్మకాండను బ్రాహ్మణాలన్నీ సమానంగా ప్రతిపాదించినప్పటికీ వాటిలో ముందు వెనుకలున్నట్లు కనబడుతుంది.

సామవేదానికి సంబంధించిన పంచవింశబ్రాహ్మణాన్ని, కృష్ణ యజుర్వేదానికి సంబంధించిన తైత్తిరీయబ్రాహ్మణాన్ని జాగ్రత్తగా పరిశీలించినపుడు ఇతరబ్రాహ్మణాలకంటే ఈ రెండూ ప్రాచీనమైనవేమో అనిపిస్తుంది. వీటిలో కనబడే శబ్దజాలం వాక్యనిర్మాణపద్ధతి మిగత వాటికంటే వీటి ప్రాచీనతను నిరూపిస్తున్నాయి. అంతేకాక తైత్తిరీయ బ్రాహ్మణంలో ఇప్పటికీ అమలులో ఉన్న స్వరసంప్రదాయం అది చాలా పాతకాలం నాటిదనడంలో సహకరిస్తున్నది. ఇలాంటి స్వరపద్ధతి పంచవింశబ్రాహ్మణంలో కూడా ఒకప్పుడు ఉండిఉండేదని స్పష్టంగా తెలుస్తున్నది. దీన్నిబట్టి ఈ రెండుబ్రాహ్మణాలు చాల ప్రాచీనాలని కొందఱు విమర్శకుల అభిప్రాయం.

తలవకారబ్రాహ్మణమనే ఇంకోపేరుగల జైమినీయబ్రాహ్మణాన్ని బ్రాహ్మణగ్రంథపరంపరలో మూడోదిగా పేర్కోవచ్చు. తరువాత ఏర్పడింది కౌషీతకిబ్రాహ్మణం. ఇది ఐతరేయబ్రాహ్మణం తరువాత కొంతకాలానికి ఉద్భవించి ఉండవచ్చు. ఈ కాలభేదాన్ని వాటిలో ఉపయోగింపబడ్డ భాషాస్వరూపపరిశీలనం ద్వారానే విమర్శకులు సాధిస్తున్నారు.

శతపథబ్రాహ్మణం వీటన్నిటికంటే తరువాతకాలంలో ఏర్పడింది. అందులో ప్రతిపాదింపబడిన ఎన్నో నూతనాంశాలు ఇతరబ్రాహ్మణాల్లో

కనబడవు. సంస్కృతభాషలో 'లిట్' అనే లకారం భూతకాలాన్ని తెలియజేస్తుంది. కర్తకు పరోక్షంలో జరిగిన భూతకాలానికి సంబంధించినక్రియగా దీన్ని ప్రయోగించడం ఈ బ్రాహ్మణంలోనే ప్రారంభమైంది. ఐతరేయబ్రాహ్మణంలో ఇలాంటి ప్రయోగంలేదు. కనుక ఐతరేయబ్రాహ్మణంకంటే ఇది అర్వాచీనమైందని విమర్శకుల అభిప్రాయం. ఇందులో వాడబడ్డభాష కూడా ఇతర బ్రాహ్మణాల్లోని భాషకంటే సంస్కరింపబడి ఉండటం కూడా ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నది.

ఎ. బి. కీత్ (A.B.Keith) ఐతరేయబ్రాహ్మణమే అన్నింటికంటే ముందు ఏర్పడి ఉంటుందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ఎమ్. వింటర్నిజ్ (M. Winternitz) మొదలైన విమర్శకులు ఐతరేయ, కౌషీతకి, జైమినీయ, తాండ్య, తైత్తిరీయ, శతపథబ్రాహ్మణాలను క్రమంగా అంగీకరించారు. వారు కూడ జైమినీయబ్రాహ్మణం చాలా ప్రాచీనకాలంలోను, శతపథబ్రాహ్మణం బ్రాహ్మణకాలం చివఱలోను ఏర్పడిందనే అభిప్రాయపడ్డారు.

పాణిని బ్రాహ్మణాలలో కొన్ని ప్రాచీనాలు కొన్ని అర్వాచీనాలు ఉన్నాయని అభిప్రాయపడినట్లు "పురాణప్రోక్తేషు బ్రాహ్మణకల్పేషు" (అష్టా 4.3.105) అనే సూత్రంద్వారా తెలుస్తున్నది. జయాదిత్యుడు తన కాశికావృత్తిలో ఈ సూత్రాన్ని వ్యాఖ్యానంచేస్తూ భాల్లవి-శాట్యాయన-ఐతరేయబ్రాహ్మణాలు ప్రాచీనాలని యాజ్ఞవల్క్యాదులు రచించిన శతపథబ్రాహ్మణం అర్వాచీనమని వివరించాడు[1]. ఇంకొక చోట పై మూడు బ్రాహ్మణాలతో పాటు తాండ్య బ్రాహ్మణాన్ని ప్రాచీనబ్రాహ్మణంగాను, సౌలభబ్రాహ్మణాన్ని నవీనబ్రాహ్మణం

---

1 పురాణేన చిరన్తనేన మునినా ప్రోక్తా: బ్రాహ్మణేషు తావత్ భాల్లవిన:, శాట్యాయనిన: ఐతరేయిణ:, కల్పేషు - పైంగీకల్ప:. పురాణప్రోక్తేషు ఇతి కిమ్? యాజ్ఞవల్క్యాని బ్రాహ్మణాని (4-3-105)

గాను జయాదిత్యుడు పరిగణించాడు[1]. లాట్యాయన శ్రౌతసూత్రంలో కూడ తాండ్యబ్రాహ్మణం ప్రాచీనమైందనే చెప్పబడింది[2]. అలాగే పైంగలాయని బ్రాహ్మణం కూడా ప్రాచీనమైందేనని బౌధాయన శ్రౌతసూత్రం పేర్కొంటున్నది[3].

కృష్ణద్వైపాయనవ్యాసుని శిష్యులచేత కల్పసూత్రాలతోబాటు నిర్మింపబడిన బ్రాహ్మణాలు నవీనమైనవని, అంతకుముందే ఉన్న బ్రాహ్మణగ్రంథాలు ప్రాచీనమైనవని వైదికసంప్రదాయం చెబుతున్నది.

మొత్తంమీద ఐతరేయ-పంచవింశ-తైత్తిరీయబ్రాహ్మణాలు మిగతవాటికంటే ప్రాచీనమైనవనుకోవడంలోను, శతపథబ్రాహ్మణం నవీనమైందనుకోవడంలోను తప్పులేదు.

— ఎస్. బి. ఆర్.

---

1. బ్రాహ్మణానిఖల్వపి-తాండినః, భాల్లవినః, శాట్యాయనినః, ఐతరేయిణః, యాజ్ఞవల్క్యేన ప్రోక్తాని బ్రాహ్మణాని యాజ్ఞవల్క్యాని సౌలభాని 4-2-66.
2. తథా పురాణం తాండమ్ 7-10-17.
3. గాం దక్షిణాం దద్యాదితి పైంగలాయనిబ్రాహ్మణం భవతి 2-7.

## 1. 5 నశించిపోయిన బ్రాహ్మణాలు

విశ్వమంతటా విజ్ఞానాన్ని విరజిమ్మగల వైదికవాఙ్మయం ఒకనాడు పవిత్రమైన మనదేశంలో మారుమూలల్లో ఉన్నగ్రామాల్లో కూడా వినపడుతూ కనపడుతూ ఉండేది. నిస్వార్థపరులైన ప్రాచీన భారతీయులు ఆ విజ్ఞానాన్ని, దానిద్వారా వారు అలవరుచుకున్న సంస్కృతిని భద్రంగా రక్షించి ముందు తరాలకు అందజేశారు. విదేశీయుల దురాక్రమణల్లో ఆ వాఙ్మయం చాలావఱకు నశించిపోయింది. మరికొంత వారి హస్తగతమైంది. పాశ్చాత్యులననుకరించ డానికి పూనుకున్నది మన జాతి. ఆత్మాభిమానం సన్నగిల్లింది. భౌతికజీవన సౌఖ్యాల విలువ పెరిగింది. ఆధ్యాత్మికదృష్టి అడుగంటిపోయింది. సమాజంలో వైదికవాఙ్మయవిజ్ఞానాలపైన నిరాదరణ పెచ్చు పెరిగింది. ఫలితం? - సహజంగా కొంత నశించిపోగా, మిగిలిన వాఙ్మయాన్ని చేతులారా మనం పోగొట్టుకున్నాం 'అపారమైన వైదిక వాఙ్మయంలో ఏదో కొంతభాగం పోతే ఏం కొంపమునిగింది?' అని కొందఱనుకోవచ్చు. మూలగ్రంథాలు పోవడంవల్ల మౌలికవిజ్ఞానం కాలగర్భంలో కలిసింది. వ్యాఖ్యానగ్రంథాలు నశించడంవల్ల వేదసంహితలకు ప్రాచీనభారతీయులు చేసిన వ్యాఖ్యానం ఎలాంటిది? వాళ్లు వీటినెలా అవగాహన చేసుకున్నారు? అనే విషయం నేటి విమర్శకులకు అర్థంకావడం లేదు. ఇదీ నేటి వైదికవాఙ్మయవిజ్ఞానాల గతి. వేదసంహితలకు వ్యాఖ్యానరూపాలైన బ్రాహ్మణాలెన్ని మన నిరాదరణకు బలిగా నశించి పోయినాయో ఇక్కడ పరిశీలిద్దాం.

## ఋక్సంహిత - బ్రాహ్మణాలు :

### 1. పైంగిబ్రాహ్మణం :

ఋగ్వేదశాఖలలో పైంగిశాఖ ఒకటి అని ప్రపంచహృదయం చెబుతున్నది[1]. ఈ శాఖకు సంబంధించింది పైంగిబ్రాహ్మణం. దీనికే పైంగ్యబ్రాహ్మణమని, పైంగ్యాయని బ్రాహ్మణమని కూడా పేరు. కానీ ఇది మనకిప్పుడు దొరకడం లేదు. వైదికవాఙ్మయంలో ఈ బ్రాహ్మణం చాలాచోట్ల పేర్కొనబడింది. ఆ సందర్భాలనుబట్టి చాలాకొద్దిగా ఈ బ్రాహ్మణాన్ని గురించి మనం తెలుసుకోగలుగుతున్నాం, చూడండి :

ఆపస్తంబశ్రౌతసూత్రం పైంగిబ్రాహ్మణాన్ని రెండుసార్లు పేర్కొంటున్నది[2]. అలాగే బౌధాయనశ్రౌతసూత్రంలో కూడా పైంగలాయన బ్రాహ్మణం పేర్కోబడింది[3]. శారీరకమీమాంసా భాష్యంలో శంకరాచార్యులు పైంగిరహస్య బ్రాహ్మణమనే పేరుతో దీన్ని స్మరించారు[4]. సత్యాషాఢ శ్రౌతసూత్రం (3.7) లో కూడా ఈ బ్రాహ్మణప్రసక్తి వచ్చింది. ఇవికాక ఇంకా ఎన్నో గ్రంథాల్లోని సందర్భాలను పరిశీలిస్తే పైంగ్యబ్రాహ్మణం ఒకప్పుడు సమగ్రంగా దొరికిందని తరువాతకాలంలో అంతరించిపోయిందని స్పష్టమౌతున్నది.

---

1. బాహ్వృచాస్స్వైతరేయ-బాష్కల-కౌషీతక-జావన్తి-బాహవి-గౌతమ-శాకల్య-బాభ్రవ్య-మాండవ్య-పైంగ-ముద్గల-శౌనకశాఖా : 19.
2. తదభావేఽవద్వాన్ పూర్వవదేతాని కర్మాణి కరోతీతి పైంగ్యాయని బ్రాహ్మణం భవతి. 5-14-18.; 5-29-4.
3. అప్యేకం గాం దక్షిణాం దద్యాదితి పైంగలాయనిబ్రాహ్మణం భవతి. 27.
4. 'ద్వాసుపర్ణా' ఇతి నేయమృగస్యాధికరణస్య సిద్ధాన్తం భజతే, పైంగిరహస్య బ్రాహ్మణేనాన్యథా వ్యాఖ్యాతత్వాత్. 1-2-12.

**2. బాహ్వృచబ్రాహ్మణం :**

'బాహ్వృచ' అనే పదం ఋగ్వేదానికి పర్యాయపదంగా వాడటం కనబడుతున్నది. అయినా ఋగ్వేదంలో బహ్వృచశాఖకూడా ప్రత్యేకంగా ఉన్నట్లు తెలుస్తున్నది. దానికి సంబంధించిందే బాహ్వృచ బ్రాహ్మణం. మీమాంసాదర్శనానికి భాష్యం వ్రాసిన శబరస్వామి ఈ బ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు[1]. ఋగ్వేదానికి ప్రస్తుతం దొరుకుతున్న ఐతరేయ-కౌషీతకిబ్రాహ్మణాల్లో శబరస్వామి పేర్కొన్న 'యావజ్జీవమగ్నిహోత్రం జుహోతి' 'యావజ్జీవం దర్శపూర్ణ మాసాభ్యాం యజేత' అనే వాక్యాలు కనపడటంలేదు. దీన్నిబట్టి ఒకప్పుడు బాహ్వృచబ్రాహ్మణం ఉండి ఉండేదని స్పష్టమవుతున్నది.

**3. ఆశ్వలాయనబ్రాహ్మణం :**

రఘునందనుడు స్మృతితత్త్వమనే గ్రంథంలో మలమాస ప్రకరణంలో ఆశ్వలాయనబ్రాహ్మణాన్ని పేర్కొంటున్నాడు[2]. ఐతరేయ బ్రాహ్మణంలో (3.1.1) కూడా ఇదే వాక్యం కనబడుతున్నది. ఆధునికులు కొందరు ఐతరేయబ్రాహ్మణానికే ఆశ్వలాయనబ్రాహ్మణమనికూడా పేరని భావిస్తున్నారు.

**4. గాలవబ్రాహ్మణం :**

ఋగ్వేదానికి గల అయిదు శాకలశాఖలలో గాలవశాఖ ఒకటి. దీనికి సంబంధించిన బ్రాహ్మణం గాలవబ్రాహ్మణం. ఇది ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయింది. గాలవుడు పాంచాలదేశం వాడు. ఇతడికే బాభ్రవ్యుడనికూడా

---

1. బాహ్వృచబ్రాహ్మణే శ్రూయతే-యావజ్జీవమగ్నిహోత్రం జుహోతి ఇతి. 2-4-1; 8-3-1.
2. ఆశ్వలాయనబ్రాహ్మణం ప్రాచ్యాం దిశి వై దేవాః సోమం రాజానమక్రీణన్ ... సోమవిక్రయీతి.

పేరు. ప్రపంచహృదయం అనే గ్రంథం బాభ్రవ్యశాఖను పేర్కొంటున్నది. పతంజలి తన మహాభాష్యంలో (6.3.61; 1.1.44) ఒక వ్యాకరణనియమాన్ని వివరిస్తూ గాలవుని ప్రశంస తీసుకవచ్చాడు. దాన్నిబట్టి గాలవబ్రాహ్మణం ఉండి ఉండేదనే ఊహాకు అవకాశం ఏర్పడుతున్నది.

## యజుస్సంహిత-బ్రాహ్మణాలు :

### 1. చరకబ్రాహ్మణం :

కృష్ణయజుర్వేదానికి గల శాఖల్లో చరకశాఖ ఒకటి. ఈ శాఖకు సంబంధించిన బ్రాహ్మణమే చరకబ్రాహ్మణం. లాహోరు డి. ఎ. వి. కళాశాల గ్రంథాలయంలో చరకారణ్యకం వ్రాతప్రతి (No. 175) భద్రం చేయబడింది. మైత్ర్యుపనిషత్తుకు, దీనికి అట్టే తేడా లేదు. ఈ చరకబ్రాహ్మణం మనకిప్పుడు దొరకడంలేదు.

సాయణుడు తన ఋగ్వేదభాష్యంలో చరకబ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు[1]. నిఘంటువుకు తమవ్రాసిన వ్యాఖ్యానంలో దేవరాజయజ్వ చరకబ్రాహ్మణాన్ని ఉదాహరించాడు[2]. నిరుక్తవ్యాఖ్యానంలో స్కందస్వామికూడా చరకబ్రాహ్మణాన్ని స్మరించాడు[3]. భాషికసూత్రంలోను దానిపైన అనంతభట్టు వ్రాసిన వ్యాఖ్యానంలోను చరకబ్రాహ్మణ ప్రశంస లభిస్తున్నది[4].

### 2. శ్వేతాశ్వతరబ్రాహ్మణం :

చరకుల అవాంతరశాఖ శ్వేతాశ్వతరశాఖ అని చరణవ్యూహంలో చెప్పబడింది. శ్వేతాశ్వతరోపనిషత్తు ఈ బ్రాహ్మణంలో ఒక భాగమే. దీన్ని

---

1. ఐతిహాసికపక్షే చరక బ్రాహ్మణే ఇతిహాస ఆమ్నాయతే. 8-77-10.
2. తథాచ చరకాధ్వర్యూణాం బ్రాహ్మణే ఇతిహాసః శ్రూయతే. 67.
3. ఏవం చరకాధ్వర్యూణాం బ్రాహ్మణే ఇతిహాసః శ్రూయతే. 3.
4. మన్త్రస్వరవద్ బ్రాహ్మణస్వరశ్చరకాణామ్. 8-25.

మంత్రోపనిషత్తు అని కూడా అంటారు. 'అస్య వామస్య' సూక్తానికి భాష్యం వ్రాసిన ఆత్మానందుడు శ్వేతాశ్వతరబ్రాహ్మణంలోని ఒక మంత్రాన్ని (పే.32) పేర్కొన్నాడు.

యాజ్ఞవల్క్యస్మృతికి 'బాలక్రీడ' అనే వ్యాఖ్యానం వ్రాసిన విశ్వరూపాచార్యులు శ్వేతాశ్వతరబ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు[1]. ఈ బ్రాహ్మణం మనకిప్పుడు లభించడంలేదు.

### 3. కాఠకబ్రాహ్మణం :

కాఠకశాఖకూడా చరకశాఖల్లో ఒకటి. ఉత్తరదేశస్థులైన చరకులలో కఠశాఖీయులుకూడా ఉన్నారు. ఈ శాఖకు సంబంధించిన బ్రాహ్మణం కాఠకబ్రాహ్మణం. ఇది మనకు పూర్తిగా దొరకడంలేదు. ఇందులో అక్కడక్కడ కొన్ని భాగాలను సూర్యకాన్త 1943లో లాహోరునుంచి 'కాఠకసంకలనం' అనే పేరుతో ప్రచురించాడు. ప్రొ. కాలండ్ (Prof. Caland) ఈ బ్రాహ్మణంలోని కొన్ని భాగాలను ప్రచురించాడు. కాఠకారణ్యకానికి సంబంధించిన వ్రాతప్రతులు కాశ్మీర్‌లో ఉన్నట్లు వినికిడి. కానీ ఇతరరాష్ట్రాల్లో ఎక్కడా దొరకలేదు. పాశ్చాత్యదేశాల గ్రంథాలయాల్లో ఉన్నాయి. ఈ బ్రాహ్మణాన్ని 'శతాధ్యయనబ్రాహ్మణమ'ని న్యాయమంజరిలో జయన్తభట్టు పేర్కొన్నాడు[2]. నిఘంటువులోను, నిరుక్తంలోను, దుర్గాచార్యవృత్తిలోను ఈ బ్రాహ్మణం ప్రశంసింపబడింది.

యాజ్ఞవల్క్యస్మృతిపై అపరార్కుడు చేసిన వ్యాఖ్యానంలోను, వాసిష్ఠ ధర్మసూత్రంలోను, వైఖానస-ఆపస్తంబశ్రౌత సూత్రాల్లోను మేధాతిథి చేసిన

---

1. శ్వేతాశ్వతరాశ్చ- స కృష్ణమృగోఽభవత్. స కృష్ణమృగో భూత్వా పృథివీమన్వచరత్. తమను ధర్మశ్చచారేత్యాది 1-2.
2. తథాచ కాఠకశతాధ్యయనే బ్రాహ్మణే బ్రహ్మోదనే శ్రూయతే 258.

మనుస్మృతి వ్యాఖ్యానంలోను కాఠకబ్రాహ్మణం ప్రసక్తి కనపడుతున్నది. కాని సమగ్రమైన కాఠకబ్రాహ్మణం కాలగర్భంలో కలిసిపోయింది.

**4. మైత్రాయణీబ్రాహ్మణం :**

మైత్రాయణికి **1.** మానవ **2.** వారాహ **3.** దుందుభ **4.** ఛాగలేయ **5.** హారిద్రవీయ **6.** శ్యామాయనీయులని ఆరుగురు శిష్యులు. వీరందరికీ మైత్రాయణీయులని పేరు. ఈ శాఖకు సంబంధించిన బ్రాహ్మణం మైత్రాయణీబ్రాహ్మణం.

నాసిక్‌లో మైత్రాయణీయశాఖనధ్యయనం చేసిన ప్రాచీనులు ఈ సంహితలో కొంతభాగం బ్రాహ్మణభాగమని అభిప్రాయపడ్డారు. బౌధాయన[1] సత్యాషాఢ[2] శ్రౌతసూత్రాల్లో మైత్రాయణీబ్రాహ్మణం పేర్కొబడింది. వేంకటమాధవుడు ఋగ్వేదభాష్యంలో **(8.1.14)** ఈ బ్రాహ్మణాన్ని ఉదాహరించాడు.

5. జాబాలబ్రాహ్మణం :

వాజసనేయ యాజ్ఞవల్క్యని శిష్యుడు, జనకునికి సమకాలికుడు అయిన సత్యకామజాబాలి ఒక వేదశాఖకు ప్రవర్తకుడు. ఆశాఖ జాబాలశాఖగా ప్రసిద్ధినందింది. ఈశాఖకు సంబంధించిన బ్రాహ్మణమే జాబాలబ్రాహ్మణం. అది మనకిప్పుడు దొరకడంలేదు. విశ్వరూపాచార్యుడు తన 'బాలక్రీడ'లో జాబాలబ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు[3]. ఈబ్రాహ్మణానికి సంబంధించిన జాబాలోపనిషత్తు ప్రసిద్ధమైంది. జాబాలధర్మసూత్రం, జాబాలగృహ్యసూత్రం

---

1. సమచతురశ్రాభిరగ్నిం చినుతే దైవ్యస్య చ మానుష్య చ వ్యావృత్యా ఇతి మైత్రాయణీబ్రాహ్మణం భవతి 30.8.
2. మైత్రాయణీయబ్రాహ్మణే యన్నోపశ్యాయాద్ బధిరః స్యాదితి దోషశ్రవణాదితి భాః 792.
3. ఏవం హి శ్రూయతే- స యదా రాజానముచ్ఛ్రితోన్నయతి.. ఇతి జాబాలిశ్రుతిః 94-95. ఆ. వి. వి. 2.

కూడ స్మృతిచంద్రికలోను[1], స్పందకారికలోను (39), గౌతమధర్మసూత్రంలోను (16-25, 23-22) పేర్కొనబడ్డాయి.

6. ఖాండికేయబ్రాహ్మణం :

తైత్తిరీయంలో ఔఖేయ-ఖాండికేయవిభాగాన్ని చరణవ్యూహం చెబుతున్నది. ఖాండికేయుల్లో అయిదుశాఖలున్నట్లు తెలుస్తున్నది. పాణిని తన అష్టాధ్యాయిలో (4.3.102) ఖండికుని పేర్కొన్నాడు. ఆయన శిష్యులకే ఖాండికేయులని పేరు. ఈశాఖకు సంబంధించినదే ఖాండికేయబ్రాహ్మణం. భాషికసూత్రంలో ఈ బ్రాహ్మణం పేర్కొబడింది[2]. మనకు ఇదికూడా లభించడం లేదు.

7. ఔఖేయబ్రాహ్మణం :

ఔఖేయశాఖకు సంబంధించిన బ్రాహ్మణం ఔఖేయబ్రాహ్మణం. పైన పేర్కొన్న భాషికసూత్రం ద్వారానే ఈ బ్రాహ్మణం కూడా ఉండి ఉండేదని ఊహింపబడుతోంది.

8. హారిద్రవికబ్రాహ్మణం :

మైత్రాయణీయశాఖలలో ఒకటి హారిద్రవికశాఖ. దీనికి సంబంధించిన బ్రాహ్మణం హారిద్రవికబ్రాహ్మణం. సాయణుడు తన ఋగ్వేదభాష్యంలోను[3], యాస్కుడు నిరుక్తంలోను[4] హారిద్రవిక బ్రాహ్మణాన్ని పేర్కొన్నారు. హరిద్రుచేత ప్రవర్తింపచేయబడ్డ శాఖను అధ్యయనం చేసేవారు హారిద్రవిణులని

---

1. తథాచ జాబాలిః - గృహీ వనం ప్రవిశేత్. యది గృహమేవ కామయేత్ తదా యావజ్జీవమగ్నిహోత్రం జుహుయాత్ ఇతి 171.
2. తేషాం చరకాణాం మధ్యే ఖాండికేయౌఖేయానాం బ్రాహ్మణే చత్వారః స్వరాః 3.26.
3. స్వర్భానుమాయయా సూర్యస్యాన్తర్హితత్వాద్ధారిద్రవికే సమామ్నాతా 5.40.8.
4. యదరోదీత్ తద్రుద్రస్య రుద్రత్వమ్ ఇతి హారిద్రవికమ్ 10-5.

జయాదిత్యుడు కాశికావృత్తిలో (4.3.104) నిర్వచించాడు. మొత్తంమీద ఈ బ్రాహ్మణంకూడా పూర్తిగా ఎక్కడా దొరకడంలేదు.

**9. తుంబురుబ్రాహ్మణం :**

యజుర్వేదానికి, సామవేదానికి కూడ తుంబురుశాఖ సంబంధం ఉంది. మహాభాష్యకారుడైన పతంజలి ఈ తుంబురుబ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు[1]. ఇది ఎక్కడా లభించడంలేదు.

**10. ఆహ్వారకబ్రాహ్మణం :**

చరకశాఖల్లో ఒకటి ఆహ్వారకశాఖ. దానికి సంబంధించిన బ్రాహ్మణం ఆహ్వారకబ్రాహ్మణం. దుర్గాచార్యుడు తన నిరుక్త వ్యాఖ్యానంలో ఈ బ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు[2]. సరస్వతీకంఠాభరణంలో ఈ బ్రాహ్మణప్రశంస కనబడుతున్నది[3]. ఇంతకు తప్ప ఈ బ్రాహ్మణాన్ని గురించి మనకేమీ తెలియడంలేదు.

**11. కంకతిబ్రాహ్మణం :**

కంకతిశాఖకు సంబంధించింది ఈ బ్రాహ్మణం. కంకతిశాఖను మహాభాష్యం పేర్కొంటున్నది[4]. ఇది ఏ వేదానికి సంబంధించినశాఖ అనే విషయంలో విమర్శకులు ఇంకా ఒకనిర్ణయానికి రాలేదు. ఆపస్తంబశ్రౌతసూత్రం ఈ బ్రాహ్మణాన్ని పేర్కొంటున్నది[5]. ఈ గ్రంథం ఎక్కడా లభించడంలేదు.

---

1. హారిద్రవిణః, తౌంబురవిణః, ఔల్లవినః 4.2.104.
2. ఉక్తం చాహ్వారకాణామ్-బ్రాహ్మణస్యాత్యాభిరగ్నిముపతిష్ఠేత ఇతి 3-31.
3. అపహార్తార ఆహ్వారకాః శ్రాద్ధసిద్ధమన్నమ్ 1.4.189.
4. క్రౌడాః, కాంకతాః, మౌదాః, పైప్పలాదాః 4.2.66.
5. 'నావిద్యశాలాయోః సంసవో విద్యత' ఇతి కంకతిబ్రాహ్మణం భవతి 14.20.4.

**12. భాగలేయబ్రాహ్మణం :**

తైత్తిరీయశాఖలో ఒకవిభాగం భాగలేయశాఖ. భాగలిమహర్షి శిష్యులకే భాగలేయులని పేరు. ఈ శాఖకు సంబంధించిన బ్రాహ్మణం భాగలేయబ్రాహ్మణం. బౌధాయనశ్రౌతసూత్రం ఈ బ్రాహ్మణాన్ని పేర్కొంటున్నది[1]. స్కందస్వామి తన ఋగ్వేదభాష్యంలో ఈ బ్రాహ్మణాన్ని ప్రశంసించాడు[2]. ఈ బ్రాహ్మణంకూడా పేరుకు మాత్రమే మిగిలింది.

**సామసంహిత-బ్రాహ్మణాలు :**

**1. భాల్లవిబ్రాహ్మణం :**

లాంగలిమహర్షి శిష్యులారుగురిలో భాల్లవి ఒకడు. భాల్లవి శాఖకు సంబంధించిన బ్రాహ్మణమే భాల్లవిబ్రాహ్మణం. బృహద్దేవత భాల్లవి బ్రాహ్మణాన్ని పేర్కొంటున్నది[3]. జైమినీయోపనిషద్బ్రాహ్మణంలో భాల్లవి సిద్ధాన్తప్రశంస ఉన్నది[4]. జయాదిత్యుడు కాశికావృత్తిలో ప్రాచీనబ్రాహ్మణాల్లో భాల్లవిబ్రాహ్మణాన్ని ఉదాహరించాడు[5]. ఆపస్తంబశ్రౌతసూత్రంలో భాల్లవి బ్రాహ్మణం కీర్తింపబడింది[6]. భాషికసూత్రంలో తాండి-భాల్లవుల

---

1. 'నావిద్వేషాణయోః సంసవో విద్యత' ఇతి భాగలేయబ్రాహ్మణం
   భవతీత్యాజికవిః 23.5
2. ఏవం హి భాగలేయినాం శ్రుతా ప్రయోగః - దక్షిణేన హస్తేన దేవానస్పృశత్
   1.37.11.
3. ఏష ఏవ పరామృష్టో భాల్లవిబ్రాహ్మణే ధ్రువ ॥
   విద్యాసంజ్ఞకే గ్రంథే ఛన్దోగానామితిశ్రుతిః ॥ 5.23.
4. భూతిరితి భాల్లవినః ప్రాణం వా అనుప్రజాః పశవో భవన్తి, స య ఏవమేతం
   భూతిరిత్యుపాసతే భవత్యేవ ప్రాణేన ప్రజయా పశుభిః 2.47.
5. బ్రాహ్మణాని కల్పాని-తాండినః. భాల్లవినః 4.2.66.
   బ్రాహ్మణేషు తావత్ - భాల్లవినః 4.3.105.
6. అథ భాల్లవికమ్ 21.16.15.

బ్రాహ్మణస్వరం శతపథం బ్రాహ్మణంలాగానని చెప్పబడింది[1]. తాండ్య బ్రాహ్మణంలోను, ఆనన్దతీర్థుని విష్ణుతత్త్వనిర్ణయంలోను, వేంకటమాధవ భాష్యంలోను భాల్లవిబ్రాహ్మణప్రశంస కనబడుతున్నది. కాని ఈ బ్రాహ్మణం పూర్తిగా మనకు దొరకడంలేదు.

**2. కాలబవిబ్రాహ్మణం :**

సామవేదశాఖల్లో కాలబవిశాఖ ఒకటి. ఈ శాఖకు సంబంధించిన వివరాలు మన వాఙ్మయంలో ఎక్కువ లభించడంలేదు. ఆపస్తంబ శ్రౌతసూత్రంలో కాలబవిబ్రాహ్మణం స్మరింపబడింది[2]. నిదానసూత్రంలో ఈ బ్రాహ్మణం మూడుసార్లు పేర్కొబడింది[3]. ఇలా వైదిక వాఙ్మయంలో ఈ బ్రాహ్మణం పేరుకే మిగిలింది.

**3. రౌరుకిబ్రాహ్మణం :**

రౌరుకిబ్రాహ్మణం సామవేదానికి సంబంధించింది. గోభిల గృహ్యసూత్రంలో ఈ బ్రాహ్మణవాక్యం ఒకటి ఉదాహరింపబడింది[4]. తైత్తిరీయబ్రాహ్మణభాష్యంలో (1-4-1) సాయణుడు రౌరుకిబ్రాహ్మణాన్ని పేర్కొనడం జరిగింది. ద్రాహ్యాయణశ్రౌతసూత్రవ్యాఖ్యలో (4.3.1; 4.3.9) ధన్వినుడు, లాట్యాయనశ్రౌతసూత్రవ్యాఖ్యానంలో (2.3.1) అగ్నిస్వామి ఈ బ్రాహ్మణాన్ని పరామర్శించారు. సమగ్రంగా ఇది ఎక్కడా లభ్యం కావడం లేదు.

---

1. శతపథవత్తాండిభాల్లవినాం బ్రాహ్మణస్వరః 3. 15.
2. ఏకాదశైకాదశినీః ప్రాచీః సంమిమ్నన్తీతి కాలబవిబ్రాహ్మణం భవతి 20.9.9.
3. అథ కాలబవినో యథా సమామ్నాయమేవ కుర్వన్తి 102.14.
4. అథాపి రౌరుకి బ్రాహ్మణం భవతి-కుమారాన్ హ స్మ వైమాతరః పాయయమానా ఆహుః-శక్వరీణాం పుత్రకా వ్రతపారయిష్ణవో భవతేతి 3.2.6.

**4. శాట్యాయనిబ్రాహ్మణం :**

అంతరించిపోయిన బ్రాహ్మణాలలో ఎక్కువ గ్రంథాల్లో పేర్కొనబడిన బ్రాహ్మణం శాట్యాయనబ్రాహ్మణం. ఇందులో ఎన్నోమంచి విషయాలున్నట్లు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

ఆపస్తంబశ్రౌతసూత్రం ఈ బ్రాహ్మణాన్ని ఉదాహరిస్తున్నది[1]. లాట్యాయనశ్రౌతసూత్రవ్యాఖ్యానంలో అగ్నిస్వామి శాట్యాయన బ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు[2]. సాయణుడు (1-151-13) (1-84-13), వేంకటమాధవుడు (1-84-14) తమ ఋగ్వేదభాష్యంలో ఎన్నిసార్లో శాట్యాయన బ్రాహ్మణాన్ని స్మరించారు. త్రితఉపాఖ్యానం శాట్యాయన బ్రాహ్మణంలో చెప్పబడిందని సాయణుడు తన భాష్యంలో (1.105) చెబుతున్నాడు. ఇక్ష్వాకురాజైన త్రైవృష్ణుని ఉపాఖ్యానాన్ని సాయణుడు, వేంకటమాధవుడు కూడా తమ భాష్యాల్లో (5.2.1) శాట్యాయన బ్రాహ్మణంలో చెప్పబడిన ఇతిహాసమని పేర్కొంటూ చెప్పారు. ఉపగ్రంథసూత్రంలో శాట్యాయనబ్రాహ్మణం స్మరింపబడింది[3]. భరద్వాజగృహ్యసూత్రంలోను (3.18), బౌధాయనగృహ్యసూత్రంలోను (2.5.25), తాండ్యబ్రాహ్మణంలోను (4.6.5), హిరణ్యకేశి (1.4), అనుపదసూత్రాల్లోను (1.8), సత్యాషాఢశ్రౌతసూత్రవ్యాఖ్య వైజయన్తిలోను (6.5) శాట్యాయనబ్రాహ్మణం చాలాసార్లు పేర్కొనబడింది. ఇలా సర్వజగత్ప్రసిద్ధమైకూడా ఈ బ్రాహ్మణం సమగ్రంగా దొరకడంలేదు.

---

1. తదుక్తం ఉపగ్రంథకారేణ - అభిప్లవ్యేతిత్వేవ శాట్యాయనిబ్రాహ్మణం భవతి 14.23.14.
2. తథా ఏతాం తేషాం . . . శాట్యాయనకం బ్రాహ్మణమధీయతే 4.5.18.
3. కౌత్సాయ తు కించిత్కం దేవమితి శాట్యాయని బ్రాహ్మణమ్ 2.1.

సంకీర్ణబ్రాహ్మణాలు :

కారణాలేవైనా మనకిప్పుడు దొరుకుతున్నదానికంటే ఎక్కువే వైదికవాఙ్మయం నశించిపోయింది. కొన్ని గ్రంథాలు అసమగ్రంగా దొరుకుతుంటే, ఇంకొన్ని గ్రంథాలవాక్యాలు మాత్రమే ఎక్కడెక్కడో చెదురుమదురుగా కనబడుతున్నాయి. ఇక కొన్నింటి పేర్లు మాత్రమే మిగిలిఉన్నాయి. బ్రాహ్మణవాఙ్మయంలో చాలా గ్రంథాలకు ఈ అవస్థలన్నీ ఏర్పడ్డాయి. గ్రంథాలెలాగూ నశించాయి, కాని అవి ఏ వేదశాఖకు సంబంధించినవో స్పష్టంగా చెప్పడానికికూడా వీలు లేకుండా కొన్ని ఉన్నాయి. వాటిని గురించి ఏ కొద్దిగానో దొరుకుతున్న సమాచారాన్ని ఇక్కడ సంకీర్ణబ్రాహ్మణాలుగా ఇస్తున్నాను చూడండి :

1. ఆరుణేయబ్రాహ్మణం :

అరుణుడనే వాని కొడుకు ఉద్దాలకుడు. ఇతడు గౌతమ వంశీయుడు. ఉద్దాలకారుణి అని ఇతణ్ణి అందరు పిలిచేవాళ్ళు. పాంచాలాధిపతి జనమేజయుని కాలంలో ఉన్న ధౌమ్యుని శిష్యుడీతడు. పతంజలి మహాభాష్యంలో ఆరుణేయ పరంపరను స్మరించాడు. తన్త్రవార్తికంలో (164) ఆరుణేయబ్రాహ్మణాన్ని కుమారిలభట్టు పేర్కొన్నాడు.

2. సౌలభబ్రాహ్మణం :

ఋగ్వేదశాఖల్లో సులభశాఖ ఒకటిగా భావింపబడుతోంది. శాంఖ్యాయన (4-9) ఆశ్వలాయన - గృహ్యసూత్రాల్లోను, కౌషీతకి బ్రాహ్మణంలోను (2.5). ఋషితర్పణ ప్రకరణంలో సులభామైత్రేయి స్మరింపబడింది. పతంజలి మహాభాష్యంలో రెండుచోట్ల (4.2.66; 4.3.105) ఈ బ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు. జయాదిత్యుడు కాశికావృత్తిలో (4.2.66) శతపథబ్రాహ్మణంతోపాటు సౌలభబ్రాహ్మణాన్ని కూడా ప్రశంసించాడు.

క్షత్రియుడై పుట్టి గొప్ప మహర్షిగా రూపొంది జనకునితో ఆధ్యాత్మికచర్చలు చేసిన సులభుడు ఈ బ్రాహ్మణాన్ని రచించినట్లు కూడా కొందరి అభిప్రాయం. మొత్తం మీద ఈ బ్రాహ్మణాన్నిగూర్చి ఇంకా పరిశోధనలు జరిగితేనేగాని సరైన నిర్ణయాలు ఏర్పడవు. దీనికి సంబంధించిన ఒక్క వాక్యం కూడా మనకిప్పుడు దొరకడంలేదు.

### 3. శైలాలిబ్రాహ్మణం :

ఆపస్తంబశ్రౌతసూత్రం శైలాలిబ్రాహ్మణాన్ని పేర్కొంటున్నది[1]. ఆపస్తంబుడు తన శ్రౌతసూత్రంలో ఉదాహరించిన శైలాలిబ్రాహ్మణవాక్యాన్ని అదేమాదిరి దేవణభట్టు తన స్మృతిచంద్రికలో పేర్కొన్నాడు.

శ్రీభాష్యవ్యాఖ్యానం శ్రుతప్రకాశికలో నాలుగుచోట్ల (681, 909, 910, 1368) సుదర్శనాచార్యుడు శైలాలిబ్రాహ్మణంనుంచి చాలా వాక్యాలను అనువాదం చేశాడు. ఇంతకుమించి ఈ బ్రాహ్మణాన్ని గురించి మనకేమీ తెలియడంలేదు.

### 4. పరాశరబ్రాహ్మణం :

కుమారిలభట్టు తంత్రవార్తికంలో అరుణపరాశరబ్రాహ్మణాన్ని పేర్కొంటున్నాడు[2]. పరాశరశాఖకు అరుణపరాశరశాఖ ఉపశాఖగా భావింపబడుతున్నది. బౌధాయనశ్రౌతసూత్రంలో గోత్రప్రకరణంలో అరుణపరాశరగోత్రం స్మరింపబడింది. ఈ బ్రాహ్మణం ఋగ్వేదానికి సంబంధించిందా? లేక యజుర్వేదానికి సంబంధించిందా? అనే అంశం ఇంతవరకు అస్పష్టంగానే ఉంది. పేరుకు మాత్రమే మిగిలిపోయిన బ్రాహ్మణాల్లో ఇది ఒకటి.

---

1. 'సముద్రో వా ఏష యదహోరాత్రస్తస్యైతే గాధే తీర్థే యత్సన్ధీ:
తస్మాత్సన్ధౌ హోతవ్యమ్' ఇతి శైలాలిబ్రాహ్మణం భవతి 6.4.7.
2. అరుణపరాశరశాఖాబ్రాహ్మణస్య కల్పరూపత్వాత్ 164.

5. మాషశరావి బ్రాహ్మణం :

ద్రాహ్యాయణశ్రౌతసూత్రం ఈ బ్రాహ్మణవాక్యాన్ని పేర్కొంటున్నది[1]. ఈ శ్రౌతసూత్రవ్యాఖ్యానంలో ధన్వినుడు ఈ శాఖను వివరిస్తున్నాడు[2]. పాణిని తన గణపాఠంలో (4.1.9) ఈ శాఖను చేర్చాడు. నిదానసూత్రం రెండుచోట్ల (82.3; 89.17) ఈ బ్రాహ్మణాన్ని కీర్తించింది. ఇది బహుశ సామవేదశాఖ అయివుండవచ్చునేమో!

6. కాపేయబ్రాహ్మణం :

కాశికావృత్తిననుసరించి కాపేయులు ఆంగిరసులనుంచి వేఱుపడి విభిన్నగోత్రులైనారు (4.1.107). ఆంగీరసగోత్రానికి సంబంధించిన వారందఱు కాప్యులనబడతారు. బృహదారణ్యకోపనిషత్తులో (3.3.1) చెప్పబడ్డ పతంజలకాప్యుడు కూడా ఆంగిరసగోత్రుడే. జైమినీయోపనిషద్బ్రాహ్మణంలో (3.1.21) శౌనకకాపేయుడు పేర్కొబడ్డాడు. జైమినీయబ్రాహ్మణంలో (2.268) కూడా ఈ కాపేయగోత్రం పేర్కొబడింది. కఠసంహితలోను (13-12) పంచవింశబ్రాహ్మణంలోను (20.12.5) కాపేయులు ఉదాహరించబడ్డారు.

సత్యాషాఢశ్రౌతసూత్రంలో కాపేయబ్రాహ్మణం పేర్కొబడింది[3]. ఇది సామవేదానికి సంబంధించిన బ్రాహ్మణమా? అని విమర్శకులు తర్కిస్తున్నారు. ఇది ఎక్కడా లభించడంలేదు.

---

1. 'వాత ఆ వాతు' ఇతి మాషశరావయః 8.2.30.
2. మాషశరావ్యో నామ కేచిచ్ఛాఖినః వాత ఆ వాతు ఇతి త్రింశం స్తోత్రీయామాహురితి. అందులోనే 8.2.30.
3. నాసోమయాజీ సంవదేరల్ ఇల్వాపిః కాపేయాః సంనేయుమేవా సోమయాజినేతి 1.4.

**7. రహస్యామ్నాయబ్రాహ్మణం :**

స్మృతిరత్నాకరంలో (74) రహస్యామ్నాయబ్రాహ్మణం పేర్కోబడింది. ఇది ఏశాఖకు సంబంధించిందో ఇంతవరకు తేలలేదు.

**8. నిరుక్తబ్రాహ్మణం :**

న్యాయపరిశుద్ధిలో (127; 178) వేదాన్తదేశికులు నిరుక్తశాఖను పేర్కొంటున్నారు. తైత్తిరీయోపనిషద్భాష్యంలో నిరుక్తబ్రాహ్మణం కీర్తింపబడింది. ఇంతకుమించి దీన్ని గురించి మనకేమీ తెలియడంలేదు.

**9. అన్వాఖ్యానబ్రాహ్మణం :**

ఈ బ్రాహ్మణానికి సంబంధించిన వివరాలు ఎక్కువగా తెలియడంలేదు. డా॥ కాలండ్ 1926లో అక్టా ఓరియంటలియా (Acta Orientalia) లో అన్వాఖ్యానబ్రాహ్మణంనుంచి చాలాభాగాలను తీసి ప్రచురించాడు. తైత్తిరీయశాఖకు సంబంధించిందిగా భావింపబడుతున్న వాధూలమాత్రం అన్వాఖ్యానబ్రాహ్మణానికి సంబంధించిందేమోనని కూడ ఒక అభిప్రాయం ఉంది.

**10-11. బాష్కలబ్రాహ్మణం-మాండూకేయబ్రాహ్మణం :**

ఈ రెండుబ్రాహ్మణాలకు సంబంధించిన వివరాలేవీ మనకు తెలియడంలేదు. కవీన్ద్రాచార్యసరస్వతిగ్రంథాలయంలోని వ్రాతప్రతుల పట్టికలో-మొదటిపేజీలో ఈ రెండుబ్రాహ్మణాలు నిర్దేశించబడిఉన్నాయని సత్యశ్రవ వ్రాస్తున్నారు.

**12-13. త్రిఖర్వబ్రాహ్మణం-కరద్విషబ్రాహ్మణం :**

సాయణుడు త్రిఖర్వ-కరద్విషశాఖలను తనభాష్యంలో (2.8.3; 2.15.4; 3.6.4) పేర్కొన్నాడు. ఈ శాఖలకు సంబంధించిన బ్రాహ్మణాలు

ఆపస్తంబశ్రౌతసూత్రంలోను, బౌధాయనధర్మసూత్రంలోను, వాసిష్ఠధర్మసూత్రంలోను, ఆపస్తంబధర్మసూత్రంలోను పేర్కొబడ్డాయి. ఈ బ్రాహ్మణాల్లోని వాక్యాలు వాజసనేయ-బహ్వృచబ్రాహ్మణాలకు సంబంధించినట్లు ఉదాహరించబడ్డాయి; కాని వాటిల్లో ఎక్కడా కనబడటం లేదు. వాజసనేయశాఖకు మాధ్యన్దినశతపథం, కాణ్వశతపథం, జాబాలబ్రాహ్మణం కాక ఇంకాకొన్ని బ్రాహ్మణాలున్నాయి. వాటిని కూడా శతపథమని షష్టిపథమనీ చెబుతుంటారు. కాని త్రిఖర్వ-కరద్విషబ్రాహ్మణాలు అలాగే ఇంకెన్నో బ్రాహ్మణాలు వాటిల్లోనే ఉండి ఉంటాయి. వైదికవాఙ్మయపరిశోధకులు సావధానంగా ఈ కోణంలో ఇంకా పరిశీలన జరపవలసిఉంది.

— ఎస్. బి. ఆర్.

## 1. 6 బ్రాహ్మణాలు కూడా వేదాలేనా?

మంత్రభాగవ్యాఖ్యానరూపాలైన బ్రాహ్మణగ్రంథాలను వేదాలని వ్యవహరించవచ్చా? అనే అంశంమీద అతిప్రాచీనకాలంనుంచి ఈనాటివరకు విచారణ జరుగుతూనే వచ్చింది. అయితే సమగ్ర వైదికవాఙ్మయాన్ని, దానినాధారంగా చేసుకొని వికసించిన ఇతర భారతీయవాఙ్మయాన్ని, పరిశీలిస్తే బ్రాహ్మణాలకు వేదత్వప్రతిపత్తి ఇచ్చినట్లు కనబడుతుంది.

జైమిని మీమాంసాసూత్రాలకు భాష్యంవ్రాసిన శబరస్వామి (మంత్రాశ్చ బ్రాహ్మణం చ వేదః 1.2.33) మంత్రాలు బ్రాహ్మణం కూడా వేదమే నన్నాడు. బృహదారణ్యకోపనిషద్భాష్యంలో శ్రీశంకరాచార్యులు (వేదానువచనేన మంత్ర బ్రాహ్మణాధ్యయనే 4.4.22) మంత్రభాగాన్ని (సంహిత), బ్రాహ్మణభాగాన్ని అధ్యయనం చేయడమే వేదానువచనమని చెబుతూ బ్రాహ్మణాలకు కూడా వేదత్వాన్ని అంగీకరించారు. కుమారిలభట్టు తంత్రవార్తికంలో (1.3.10) మంత్ర బ్రాహ్మణాలకు వేదమనిపేరని ఒక ధర్మశాస్త్రాన్ని పేర్కొంటున్నాడు. అలాగే మనుస్మృతివ్యాఖ్యానంలో మేధాతిథి[1], మస్కరి[2] మొ॥వారు బ్రాహ్మణాలను వేదాలుగా గుర్తించారు.

ఆపస్తంబుడు తన శ్రౌతసూత్రంలో (మన్త్రబ్రాహ్మణయోర్వేద నామధేయమ్ 24.1.31) మంత్రబ్రాహ్మణాలకు రెండింటికి వేదమని పేరని చెప్పాడు. సాయణుడు తన ఋగ్భాష్యభూమికలో (మంత్రబ్రాహ్మణాత్మక శబ్దరాశిర్వేదః) మంత్రభాగ-బ్రాహ్మణభాగరూపమైన శబ్దరాశి

---

1. వేదశబ్దేనార్గ్యజుస్సామాని బ్రాహ్మణసహితాన్యుచ్యన్తే 2.6.
2. వేదో మంత్రబ్రాహ్మణాఖ్యో గ్రంథరాశిః 1.1.

వేదమనబడుతుందన్నాడు. సర్వానుక్రమణీవృత్తి భూమికలో షడ్గురుశిష్యుడు మంత్రబ్రాహ్మణాలకు రెంటికీ వేదమనే వ్యవహారాన్ని సమర్థించాడు[1].

స్థూలంగా మనం వైదికవాఙ్మయాన్ని ఇలా నాలుగు భాగాలుగా విభజించుకోవచ్చు.

**1. సంహితలు** : సంహితలని పిలువబడే మంత్రభాగం మొదటి విభాగానికి చెందుతుంది. ద్రష్టలైన మహర్షుల దివ్యదర్శనానికి అందిన ఈ మంత్రాలు సూక్తాలుగా, ప్రపాఠకాలుగా, అధ్యాయాలుగా, మండలాలుగా సంహితారూపంలో రూపొందివాయి.

**2. బ్రాహ్మణాలు** : మంత్రాలకు ఆయా యజ్ఞయాగాల్లో వినియోగాన్ని చెప్తుతూ వ్యాఖ్యానరూపంగా ఏర్పడిన గద్యరూపమైన గ్రంథాలివి. ఇవి రెండవ విభాగానికి చెందుతాయి.

**3. ఆరణ్యకాలు** : వానప్రస్థాశ్రమం తీసుకొని అరణ్యంలో ప్రాచీనభారతీయులు అధ్యయనం చేసిన గ్రంథాలు. జ్ఞానవిభాగానికి పూర్వావస్థను వీటిల్లో మనం గమనించవచ్చు. బ్రాహ్మణాలకు ఉపనిషత్తులకు మధ్యలో ఉండటంవల్ల ఆ రెంటి సమ్మిశ్రస్వరూపం వీటిల్లో కనబడుతుంది.

**4. ఉపనిషత్తులు** : జ్ఞానకాండ అని ప్రసిద్ధిచెందిన ఈ ఉపనిషత్తులు జీవేశ్వర ప్రపంచతత్త్వాలను క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. ఇంతవరకు ఉన్న గ్రంథరాశినంతా వేదమని వ్యవహరిస్తూ ఈ ఉపనిషద్భాగాన్ని 'వేదాంతం' అనికూడా భారతీయులు అంటారు.

ఇలా నాలుగుభాగాలుగా వైదికవాఙ్మయం విభజింపబడి 'వేదమ'ని పిలువబడుతున్నప్పటికీ వేదమనేపదం ముఖ్యంగా మంత్రభాగాన్ని

---

1. మంత్రబ్రాహ్మణయోరాహుర్వేదశబ్దం మహర్షయః ।
వినియోక్తవ్యరూపో యః స మన్త్ర ఇతి చక్షతే ॥

చెబుతున్నట్లు తోస్తున్నది. అయితే అంతమాత్రంచేత బ్రాహ్మణాలకు వేదమనే పేరు లేదా? అంటే తప్పకుండా ఉన్నది. కాని అవి మంత్రభాగవ్యాఖ్యానరూపాలు కాబట్టి అది (గౌణం) అప్రధానంగా ఉపచారమాత్రంగా వాటిని చెబుతుంది. దానికి కారణం; బ్రాహ్మణాలు మహర్షులచేత యజ్ఞయాగాది కర్మల నిరూపణంకోసం వ్యాఖ్యానగ్రంథాలుగా రచింపబడటం. కాబట్టి మంత్రబ్రాహ్మణాలకు కలిపికట్టుగా వేదమనే వ్యవహారమున్నా వీటిమధ్య తరతమభేదం ఉన్నదని గ్రహించాలి.

దయానందసరస్వతి మొ॥ ఆధునికులు కొందఱు వేదమంటే మంత్రభాగమేకాని బ్రాహ్మణాలు అందులో చేరవని చాలప్రయాసతో ప్రతిపాదించారు. కాని వారు చూపించిన హేతువులేవీ నిలబడేటట్లు కనబడటంలేదు. కపాలిశాస్త్రి బ్రాహ్మణాలుకూడా వేదాలేనని సిద్ధాంతం చేశాడు. మాక్స్‌ముల్లర్, వింటర్నిజ్ మొ॥ పాశ్చాత్యులు బ్రాహ్మణాలను చాల తక్కువగా అంచనావేసి వేదాల్లో చేరవనే అన్నారు. భారతీయులెందరో ఈమధ్యకాలంలో చేసిన పరిశోధనల్లో ఆపస్తంబశ్రౌతసూత్రంలో చెప్పినట్లు మంత్ర-బ్రాహ్మణాలకు వేదత్వాన్నంగీకరించారు. అటు వైదికసంప్రదాయ విదుల, ఇటు ఆధునికుల అభిప్రాయాలను దృష్టిలోకి తీసుకొని మధ్యస్థదృష్టితో పరిశీలించినప్పుడు పైన చెప్పిన నాలుగు విభాగాల్లో పరస్పరం స్వరూపభేదం ఉన్నప్పటికీ, జ్ఞానప్రతిపాదకగ్రంథరాశి కాబట్టి వాటిని వేదమని వ్యవహరించడంలో తప్పులేదనిపిస్తుంది. కాబట్టి బ్రాహ్మణాలుకూడా వేదాలేనని చెప్పడం సత్యదూరంకాదు.

— ఎస్. బి. ఆర్.

## 1. 7 బ్రాహ్మణాలవల్ల ఏం ప్రయోజనం ?

మంత్రభాగమనబడే సంహితలను సరిగా అర్థం చేసుకోవాలంటే బ్రాహ్మణగ్రంథాలు బాగా అవసరమౌతాయి. యజ్ఞయాగాలకు సంబంధించిన ద్రవ్యాన్ని, దేవతను స్మరింపచేసేవి మంత్రాలైతే, యజ్ఞాన్ని ఎలా చేయాలో, అలా చేస్తే ఏయే ప్రయోజనాలు లభిస్తాయో నిర్వచించేవి బ్రాహ్మణాలు. వేదసంహితలను అందులో నిక్షిప్తమైన విజ్ఞానాన్ని చక్కగా అర్థం చేసుకోవడానికి ఏర్పడిన గ్రంథాలే నిఘంటువులు. వాటినాధారంగా చేసుకొనే యాస్కుడు మొ॥ మహర్షులు నిరుక్తాలను వ్రాశారు. ఒకప్పుడు ప్రతివేదానికి విడివిడిగా నిఘంటువు నిరుక్తం ఉండేవి. కాని ఇప్పుడవన్నీ నశించిపోగా యాస్కుడు వ్రాసిన నిఘంటువు నిరుక్తం మాత్రమే లభిస్తున్నాయి.

ఈ నిఘంటువులు సంహితలోని పదాలకు అర్థనిర్వచనం చేసేటప్పుడు బ్రాహ్మణాలపై ఆధారపడతాయి. కాబట్టే బ్రాహ్మణాల్లో సందర్భవశాన ఇవ్వబడ్డ అర్థాలే నిఘంటువుల్లో కూడా కనపడుతుంటాయి. చూడండి :

| నిఘంటువు | | | బ్రాహ్మణం | |
|---|---|---|---|---|
| 1. క్షపా | = రాత్రిః | 1.7 | 1. రాత్రయః క్షపాః | ఐ.బ్రా. 1.13. |
| 2. ఇషం | = అన్నం | 2.7 | 2. అన్నం వా ఇషమ్ | కౌ.బ్రా. 28.5. |
| 3. మఖః | = యజ్ఞః | 3.6 | 3. యజ్ఞో వై మఖః | తై.బ్రా. 3.2.8.3. |
| 4. గీః | = వాక్ | 1.1 | 4. వాగ్వై గీః | శ.బ్రా. 7.2.2.5. |
| 5. రేతః | = ఉదకం | 1.12 | 5. ఆపో హి రేతః | తాం.బ్రా. 8.7.9. |
| 6. మహీ | = పృథివీ | 1.1 | 6. ఇయమేవ మహీ | జై.బ్రా. 3.4.7. |
| 7. సర్పం | = ఉదకం | 1.12 | 7. ఆప ఏవ సర్పం | గో.బ్రా. 5.15. |

ఇలా వేదసంహితల్లోని పదాలకు, నిఘంటువుల్లో ఇవ్వబడ్డ అర్థాలన్నింటికీ బ్రాహ్మణాలే మూలమని భావింపబడుతున్నది. కాబట్టి మంత్రభాగాన్ని సరిగ్గా అర్థంచేసుకోవాలనే వారికి బ్రాహ్మణగ్రంథాలు ఎంతో ఉపయోగపడతాయి. ఇక్కడ బ్రాహ్మణాలననుసరించే నిఘంటువులోని కొన్ని పదాలకు అర్థాలివ్వబడ్డాయని ఉదాహరణకు మాత్రమే పై పట్టికనిచ్చాను. ఉత్సాహమున్నవారు ఇంతటితో తృప్తి పడక, నిఘంటువును బ్రాహ్మణాలను పరిశీలించి ఇంకెన్నో రహస్యార్థాలను తెలుసుకోవచ్చు.

మన ఇంద్రియాలకు కనపడని వస్తువులను దర్శించే శక్తిగల ద్రష్టలైన మహర్షులు బ్రాహ్మణాల్లో సత్యస్వరూపమైన మంత్రార్థాలను విశదీకరించారు. వాటినాధారంగా చేసుకొని నిఘంటువులు ఇతర భాష్యాలు ఏర్పడ్డాయని భారతీయపండితుల భావన. పాశ్చాత్యపండితులు చాలామంది ఈ అభిప్రాయంతో ఏకీభవించరు. మంత్రద్రష్టల అభిప్రాయాన్ని బ్రాహ్మణాలు ఉన్నది ఉన్నట్లుగా ప్రతిపాదించడంలేదని వారి వాదం. దీన్ని సత్యమని ఎవరంగీకరిస్తారు[1]?

బ్రాహ్మణాలు వైదికకర్మలనాచరించడానికి మానవులకు ప్రేరణ నిస్తాయని ఆపస్తంబుడు తన యజ్ఞపరిభాషలో చెబుతున్నాడు[2]. విధి, అర్థవాదరూపమైన బ్రాహ్మణాలు వైదికకర్మలను విధిస్తూ, వాటిలో మానవుడు ప్రవర్తించేటట్లు సందర్భాన్ననుసరించి స్తుతిని నిందను చేస్తూ ప్రేరణనిస్తాయి. అలా బ్రాహ్మణాలద్వారా ప్రేరణను పొందినవాడు, మంత్రార్థాన్ని సరిగా అర్థం చేసుకొని యజ్ఞయాగాది కర్మలనాచరిస్తాడు. యాగాలను ఆచరించే కాలంలో బ్రాహ్మణాలకు ఇది ముఖ్యప్రయోజనం.

---

1. దీనిపై సోదాహరణమైన వివరణకు చూడండి : A comprehensive History of Vedic Literature, Brahmana and Aranyaka works, ed. Satyasrava P.P. 154-175.
2. కర్మచోదనా బ్రాహ్మణాని. 35.

ఇంతేకాక ప్రాచీన భారతీయుల చరిత్రను, సంస్కృతిని, వారి ఆచారవ్యవహారాలను, జీవితలక్ష్యాన్ని ఈ బ్రాహ్మణగ్రంథాలనధ్యయనం చేయడంవల్ల మనం స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఈ బ్రాహ్మణాల్లో సాంకేతికంగా పొందుపరచబడ్డ ఉపాఖ్యానాలు, తర్వాత వాఙ్మయంలో ఎలా విరూపించబడ్డాయో కూడా వీటితోపాటు పోల్చుకొని బాగా తెలుసుకోవచ్చు. ఈ దృష్టితో చూసినప్పుడు ప్రాచీనభారతీయులకు సంబంధించిన అనేకాంశాలను ఈ బ్రాహ్మణాలను చదవడంద్వారా మనం తెలుకోగలిగే అవకాశం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రాచీన భారతీయుల జీవనసంస్కృతులకు, ఆలోచనావిధానాలకు, తత్త్వచింతనకు పట్టిన అద్దం ఈ బ్రాహ్మణవాఙ్మయం.

— ఎస్. బి. ఆర్.

## 1. 8 బ్రాహ్మణాలు - సర్వానుక్రమణులు

నిఘంటువులకు నిరుక్తాలకులాగానే సర్వానుక్రమణులకు గూడ బ్రాహ్మణాలే మూలగ్రంథాలు, సర్వానుక్రమణుల్లో వేదసంహితల్లో గల ఆయా సూక్తాలకు ద్రష్ట అయిన మహర్షి ఎవరో, ఆ సూక్తం ఏ దేవతను స్తుతిస్తున్నదో, అందులో ఏ యే మంత్రాలు ఏ యే ఛందస్సుల్లో ఉన్నాయో చక్కగా వివరింపబడుతున్నది. ఇలాంటి సమాచారం సంప్రదాయసిద్ధంగా ఒకతరంనుంచి ఇంకో తరానికి తెలియడం జరుగుతున్నది. అలా కాకుండా బ్రాహ్మణగ్రంథాలను పరిశీలిస్తే కొన్ని సూక్తాలకు ద్రష్టలను, దేవతలను, ఛందస్సులను కూడా అవి పేర్కొంటున్నట్లు తెలుస్తున్నది. పైగా తను ఉపయోగిస్తున్న మంత్రానికి ద్రష్ట ఎవరో, దేవత ఎవరో, అది ఏ ఛందస్సులో ఉందో తెలియకుండా యాగాలలో ప్రయోగించకూడదని ఇతరులకు అధ్యాపనం కూడా చేయకూడదని, అలా చేస్తే, తన తలను అతడే ఎండిపోయిన చెట్టుకు కొట్టుకున్నట్లేనని లేదా గోతిలోనైనా పడినట్లేనని ఆర్షేయబ్రాహ్మణం చెబుతున్నది[1].

సామబ్రాహ్మణంలో ద్రష్టలైన ఋషులను గురించి చెప్పబడిందని వేంకటమాధవుడు సర్వానుక్రమణిలో పేర్కొన్నాడు[2]. ప్రజాపతి శతపథబ్రాహ్మణంలో మంత్రద్రష్టగా కీర్తింపబడ్డాడు[3]. శుక్లయజుస్సంహితకు భాష్యం వ్రాసిన మహీధరుడు "గురుపరంపరద్వారాను, తన బుద్ధిబలంతో ఊహించి, శతపథబ్రాహ్మణాన్ననుసరించి ఈ సంహితను దర్శించిన

---

1. అథాపి బ్రాహ్మణం భవతి-యో హ వా అవిదితార్షేయచ్ఛన్దోదైవతబ్రాహ్మణేన మన్త్రేణ యాజయతి వాధ్యాపయతి వా స్థాణుం వర్చ్ఛతి గర్తం వా పద్యతి 1.1.
2. సను చ బ్రాహ్మణే సామ్నాం ఋషయశ్చాపి దర్శితాః ।
3. ప్రజాపతిః ప్రథమాం చితిమపశ్యత్ 6.2.3.10

ఋషులను, దేవతలను, ఛందస్సులను చెబుతా"నని భాష్యారంభంలో అన్నాడు[1]. దీన్నిబట్టి శతపథబ్రాహ్మణం పైమూడు విషయాలను చెప్పటానికి అతనికి బాగా ఉపయోగపడిందని తెలుస్తున్నది.

ఋక్సంహితలో పదవమండలంలో ముప్పైఎనిమిదో సూక్తాన్ని కవషుడనే ఋషి దర్శించినట్లు కౌషీతకిబ్రాహ్మణం పేర్కొంటున్నది[2]. సర్వానుక్రమణికలో కూడ కౌషీతకిబ్రాహ్మణం ప్రకారం ఆయనే ఆ సూక్తాన్ని దర్శించినట్లు చెప్పబడింది.

ఋక్సంహితలోని 10-73వ సూక్తాన్ని శాక్త్యగౌరివీతి దర్శించాడని ఐతరేయబ్రాహ్మణం పేర్కొంటున్నది[3]. ఋక్సర్వానుక్రమణిలో ఆ సూక్తాన్ని అలాగే గౌరివీతి దర్శించినట్లు చెప్పబడింది.

తాండ్యబ్రాహ్మణంలో ఋక్సంహితలోని 7.32-36వ సూక్తానికి వసిష్ఠుడు ద్రష్ట అని చెప్పబడింది[4]. సర్వానుక్రమణిలో హతపుత్రుడైన వసిష్ఠుడే దీనికి ఋషి అని తాండ్యబ్రాహ్మణం కూడా చెబుతున్నదని పేర్కొనబడింది[5].

---

1. గురుతస్తర్కతశ్చైవ తథా శాతపథశ్రుతేః ।
   ఋషీన్ వక్ష్యామి మంత్రాణాం దేవతాశ్ఛన్దసం చ యత్ ॥
2. ఏతత్కవష సూక్తమపశ్యత్పంచదశర్చం.
   ప్ర దేవత్రా బ్రహ్మణే గాతురేతు ఇతి 12.1.
3. జనిష్ఠా ఉగ్రః సహసే తురాయ ఇతి . . . గౌరివీతిర్హ వై శాక్త్యః . . .
   ఏతత్సూక్తమపశ్యత్ 3.19.
4. ఇన్ద్రక్రతున్న ఆభరఇతి . . వసిష్ఠో వా ఏతం పుత్రహతోఽపశ్యత్. 4.7.3.
5. వసిష్ఠస్యైవ హతపుత్రస్యార్షమితి తాండకమ్.

ఈ మాదిరి అనేక బ్రాహ్మణాల్లో చెప్పబడ్డ మహర్షులు ఆలాగే సర్వానుక్రమణుల్లో కూడా చెప్పబడి ఉండటం గమనిస్తే సర్వానుక్రమణుల ఉత్పత్తిలో బ్రాహ్మణగ్రంథాలపాత్ర ఎంతైనా ఉందని స్పష్టమౌతున్నది.

— ఎస్. బి. ఆర్

## 1. 9 మహర్షులు

మానవసంస్కృతికే మూలభూతులైన మహర్షులు దర్శించిన నిత్యసత్యాలు వైదికగ్రంథాలుగా వెలువడ్డాయి. అనాదినుంచి నేటి వరకు ఆ మహర్షులు అవసరాన్నిబట్టి ఆవిర్భవిస్తూ ఆ యా కాలాలకు తగిన జీవన సంస్కృతీస్రవంతిని సమాజంలో ప్రవహింపజేస్తూనే ఉన్నారు; చేస్తారు కూడ. ఆ యా ఋషులపేర్లతోనే వేదసూక్తాలున్నాయి. బ్రాహ్మణాది గ్రంథాలలో వేదద్రష్టలే గాక మరెందరో ఋషులు పేర్కొనబడ్డారు. వాళ్లు సర్వశ్రేష్ఠులు (ఋ. సం. 9.96.6), (శ.బ్రా. 12.4.4.6) మాత్రమేకాదు, దేవతలనే ఉద్ధరించగల సామర్థ్యం కలవాళ్లు (ఋ.సం. 1.730.6).

ఋగ్వేదంలోను, ఇతర వేదసంహితల్లోనూ సప్తర్షుల ప్రసక్తి వచ్చింది. కుత్స, అత్రి, రేభ, అగస్త్య, కుశికగణ, వసిష్ఠ, వ్యశ్వ మొదలైనవాళ్లు అందులో (ఋ. సం. 1.106.6) పేర్కొనబడ్డారు. బృహదారణ్యకోపనిషత్తు గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వసిష్ఠ, కశ్యప, అత్రిమహర్షుల్ని గురించి చెప్పింది. అథర్వవేదం పైవారితోపాటు అంగిరస, గవిష్ఠిర, కక్షీవంత, కణ్వ, మేధాతిథి, త్రిశోక, ఉశనా, కావ్యముద్గల ఋషుల్ని చెప్పింది. ఋక్సంహిత తరువాతి వాఙ్మయంలో సప్తర్షినక్షత్రమండలానికి సప్తర్షులకి సంబంధమేర్పడింది. (అ. సం. 6.40.1; శ.బ్రా. 2.1.2.4; 13.8.1.9). సాయణుడు నక్షత్రవాచక 'ఋక్ష' శబ్దాన్ని సప్తర్షులుగా వివరించాడు.

**బ్రాహ్మణాల్లో కొందరు ఋషులు :**

**1. అగస్త్యుడు / అగస్తి :** ఇతడు మరుద్దేవతలనుద్దేశించి వృషభాలను ప్రోక్షించి పూజించాడు. ఆ పశువుల్ని ఇంద్రు డపహరించగా మరుద్దేవతలు వజ్రధారులై ఇంద్రుని చంపటానికి వచ్చారు. ఇంద్రాగస్త్యులు 'కయా శుభీయ' మనే సామమంత్రంతో వారిని శాంతింపజేశారు (తై. బ్రా. 2.7.11.7; ఐ.బ్రా. 5.16; కౌ. బ్రా. 26.9;

పం.విం.బ్రా. 21.14.5). గొప్ప బుద్ధిబలం కల ఇతనికి ఇంద్రుడు బ్రహ్మజ్ఞానాన్ని మొట్టమొదట ఉపదేశించాడు[1].

**2. కణ్వుడు :** ఇతని వంశీయులు కణ్వులు లేక కాణ్వులు. కణ్వుడు లేక కాణ్వుడని ఏకవచనంలోనూ, కణ్వులు, సౌశ్రవసులని బహువచనంలోనూ వ్యవహారంఉంది. అత్రి, కణ్వవంశాలకు సంబంధం ఉంది (పం. విం. బ్రా. 8.2.2, 9.2.6; కౌ.బ్రా. 28.8).

**3. గౌతముడు ;** ఋషిగోత్రం. ఈ గోత్రీకులకు, అంగిరసులకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఇతడు జనకునికి యాజ్ఞవల్క్యునికి సమకాలికుడు (శ.బ్రా. 1.4.1.10, 11.4.3.20). ఒక ఋగ్వేదస్తుతి స్తోమానికి ప్రణేత. విదేహరాజు మాధవుడు వైశ్వానరాగ్నిని తననోటిలో ధరించాడు. ఆ రాజుకి పురోహితుడుగా ఉన్న ఈ ఋషి అతన్ని పిలువగా, బదులుపలికితే నోటిలోని అగ్ని బయటపడుతుందని పలుకలేదు. అగ్ని అయినా పలుకుతుందని, ఋషి ఋగ్వేదమంత్రాలతో అగ్నిని స్తోత్రంచేస్తూ ఆ రాజుని పిలిచాడు. కాని అగ్నిగాని రాజుగాని పలుకలేదు. తైత్తిరీయసంహితామంత్రంతో అగ్నిని స్తోత్రం చేస్తూ క్రోధంతో చాలా దీర్ఘంగా రాజును మళ్లీ పిలిచాడు. అయినా పలుకలేదు. 'తన్త్వాఘృతస్నవీమహే' (ఋ.5.26.2) అనే ఋక్‌ను అగ్నినుద్దేశించి చెప్పాడు. మంత్రంలోని 'ఘృత' శబ్దాన్ని పలకగానే అగ్ని ఊర్ధ్వముఖంగా ప్రజ్వరిల్లింది. అందుచేత రాజు దాన్ని ధరించలేకపోయాడు. ఆ అగ్ని భూమిని చేరింది. తాపాన్ని చల్లార్చుకోవటానికి రాజు సరస్వతీనదిలో మునిగాడు. అగ్ని తూర్పుగా ప్రజ్వరిల్లుతూ భూమంతా వ్యాపించింది. రాజు,

---

1. ఏతం హ వా ఏతం గాయత్రస్యోద్గీథముపనిషదమమృతమింద్రో ఉగస్త్యాయోవాచ (జై. ఉ. బ్రా. 4.9.1.1)

ఋషి మండుతున్న అగ్నిని వెంబడించారు. అది భూమిపై నదులన్నింటిని ఎండింపజేసింది (శ. బ్రా. 1.4.1.10). 'మిత్రవిందా యష్టి' విదేహరాజైన జనకుని ఉద్దేశించి ఏర్పాటైంది. దాన్ని ఇతడు చూశాడు (11.4.3.20).

4. కశ్యపుడు : విశ్వకర్మ సర్వమేధయాగం చేశాడు. విశ్వకర్మ కశ్యపునికి భూదానమివ్వదలచాడు (శ.బ్రా. 13.7.1.15). కాని భూమి అంగీకరించలేదు. కశ్యపునికి దితి అదితి అని ఇద్దరు భార్యలున్నారు. బ్రహ్మపుత్రుడైన మరీచి పుత్రుడు కశ్యపుడు దైవాసురులకు, సర్వప్రాణికోటికి తండ్రి. అదితితోపాటు పన్నెండుగురు దక్షపుత్రికలను పెండ్లి చేసుకొని ఎన్నో ప్రాణుల్ని సృష్టించాడు. ఇతడు ప్రజాపతి; గోత్రఋషి. సామగుహ్యజ్ఞానం ఇంద్రునిమంచి అగ్ని తర్వాత మానవుల్లో కశ్యపునికే మొదట సంక్రమించింది. (జై. ఉ. బ్రా. 7.3.7) (ఐ.బ్రా. 8.21; జై. ఉ. బ్రా. 4.3.1).

5. అత్రి : ఋషిగోత్రం. పరివారరూపంగా ప్రియమేధులు (ఐ.బ్రా.8.22) కణ్వులు, గౌతమ, కక్షీవంతగుణాలతో అత్రిగణం వచ్చింది (కౌ.బ్రా. 24.3). అత్రిజమదగ్ని గౌతములు క్రిమిసంహారకులు (ఛాం.బ్రా. 2.7.1)

6. యాజ్ఞవల్క్యుడు : ఇతడు శతపథబ్రాహ్మణాన్ని రచించాడు. ఇతనికి మైత్రేయి, కాత్యాయని అని ఇద్దరుభార్యలు. మైత్రేయిపైన ఆసక్తితో ఇతడు కాత్యాయనిని 'ఇతర' అన్నాడు. ఇతర పుత్రుడే మహిదాస ఐతరేయుడు. ఐతరేయబ్రాహ్మణాన్ని ఇతడే రచించాడంటారు. వైశంపాయన శిష్యులైన చరకుల్లో యాజ్ఞవల్క్యుడు ఒకడు. జనకుడు తన యజ్ఞంలో 'అందరికంటే గొప్పబ్రహ్మజ్ఞానియైన వాడు పదివేల గోవుల్ని తీసుకుపోవచ్చ' న్నాడు. అశ్వల, ఆర్తభాగ, ఉషస్తి, ఆహోల, ఉద్దాలక, గార్గి మొదలైన ఋషులతో, ఋషికలతో వాదం చేసి, గెలిచి ఇతడు పదివేల గోవుల్ని తోలుకుపోయినాడు. ఉపనిషత్సారమును స్పష్టంచేయమని లేకపోతే శిరస్సు

తెగిపడుతుందని దేవమిత్ర శాకల్యుని ప్రశ్నించాడు. శాకల్యుడు చెప్పలేకపోయాడు. అతని శిరస్సు తెగిపడింది. జనకుడీతనివల్ల బ్రహ్మజ్ఞానలాన్నిపొంది రాజ్యసర్వస్వాన్ని సమర్పించగా తనకు బదులు జనకునే రాజ్యం చేయుమన్నాడు (శ. బ్రా. 11-14 కాండం). ఇతడు సన్యాసం తీసుకుంటూ తన సంపదలను భార్యలకిద్దఱకి పంచాడు. మైత్రేయి ఆత్మసంపదనడిగింది. కాత్యాయని భౌతికసంపదను తీసుకున్నది.

7. భృగువు : ఇతడు వరుణపుత్రుడు (శ.బ్రా. 11.6.1.1) (పం. విం. బ్రా. 18.9.2; ఐ. బ్రా. 3.34). తైత్తిరీయబ్రాహ్మణంలో (1.8.2.5) ఇంకోరకంగా ఇతని వృత్తాంతం ఉంది. భృగుగణం ద్రుహ్యుల పురోహితులుగా ఉన్నారు. వీరికి అంగిరసులతో సంబంధం ఉంది. చ్యవనునికి భార్గవుడు లేక అంగిరసుడని పేరు. వీరిపై ఆక్రమణ ఫలితంగా సృంజయ వైతహవ్యులు సర్వనాశనాన్ని పొందారు (ఐ. బ్రా. 2.20; జై. బ్రా. 1.42.44).

8. భరద్వాజుడు : గోత్రఋషి. దివోదాస పురోహితుడు (పం. విం. బ్రా. 15.3.7.) మంత్రప్రణేతగా ద్రష్టగా తరచు పేర్కొనబడుతుంటాడు (ఐ. బ్రా. 6.18.8.3; తై. బ్రా. 3.10.11.13; కౌ. బ్రా. 15.1; 29.3; 30.9).

బ్రాహ్మణాలు - కొన్ని ఋషిసందర్భాలు :

1. కౌషీతకిబ్రాహ్మణం : చైత్రగార్గ్యాయణి తన యజ్ఞాన్ని నెరవేర్చటానికి ఉద్దాలకుని పురోహితునిగా ఎన్నుకున్నాడు (1.1). హిరణ్మయశకునుడు, కేశిదార్భ్యుడు ఇందులో పేర్కొబడ్డారు (7.4). చైకితాయనదాల్భ్యుడు, కేశిదార్భ్యుడు, బకదాల్భ్యుడు సోదరులు కావచ్చు. ఉలోవార్ష్ణివృద్ధుడు, ఇటవ్యావ్యుడు, (సుతయజ్ఞసేన సోదరుడు) శిఖండియజ్ఞసేనుడు (7.5) గాత్రుడు, మధూకపైంగ్యుడు (16-9) గలునా ఆర్క్షకాయనుడు బ్రహ్మదత్తచైకితాయనుడు ( 1.316) ఇతని సమకాలికులు.

విశ్వామిత్రునికి ఇంద్రుని సాక్షాత్కారమైంది (15.1; 16.14; 28.1.2; 29.3). శక్తికి విశ్వామిత్రునికి పోటీ జరిగింది. దానివల్ల శక్తి వాక్సామర్థ్యాన్ని సంపాదించాడు (4.8).

2. శతపథబ్రాహ్మణం : శుచిపుత్రుడైన శౌచేయ ప్రాచీన యోగ్యుడు, అరుణి పుత్రుడైన ఉద్దాలకారుణివద్ద బ్రహ్మతత్త్వాన్ని ప్రతిపాదించే అగ్నిహోత్రాన్ని తెలుసుకోవాలని కోరాడు ( 11.5.3.1). ఉద్దాలకపుత్రుడైన కుసురబిందు కుమారుడు ప్రోతికౌశాంబేయుడు ఉద్దాలకునివద్ద బ్రహ్మచర్యాశ్రమాన్ని గడిపాడు (12.2.2.13). అరుణ ఔపవేశుడు (14.9.43.33) చైత్రగార్గ్యాయణి తండ్రి (కౌ. బ్రా. 1.1) అరుణి, భాల్లవేయులు ఇందులో పేర్కొనబడుతున్నారు (2.1.4.6). బలకజీవలుడు, గర్భప్రవిష్టరేతస్సు సంతానంగా పుట్టకపోవడంలోగల దోషాన్ని గుర్తించి దానికి పరిహార హోమవిధానాన్ని సూచించాడు (2.3.1.34). బుడిలాశ్వతరాశ్వి, జనకుని చర్చలో పాల్గొన్నాడు (14.8.15.11).

3. షడ్వింశబ్రాహ్మణం : గ్లావమైత్రేయుడు (1.4.6) మౌద్గల్యుని గురువు. కుసురబిందువనే ఉద్దాలక పుత్రుడు ఇందులో పేర్కొనబడ్డారు (1.4.16).

4. తాండ్యబ్రాహ్మణం : కుసురబిందు (22.15.10) బహుభావఫలాన్ని సాధించే దశరాత్రయాగంచేసి భాగ్యాన్ని పొందాడు.

5. పంచవింశబ్రాహ్మణం : భరతుల పురోహితులు వసిష్ఠ గణం (15.4.24). విశ్వామిత్రుడు ఋషిత్వాన్ని సంపాదించాడు (14.3.12).

6. జైమినీయోపనిషద్బ్రాహ్మణం : సత్యకామ జాబాలి సమకాలికుడు చిత్రశైలనుడు జనకుని సంబంధాన్ని పొందాడు (1.2.45). జీవలకాలీవాడి, ఆషాఢస్సాయసులు, అరుణి, భాల్లవేయులు సమకాలీనులు (1.21). వాష్ణ్యుడైన

బర్కువృ, జానశ్రుతి పుత్రుడైన ప్రియుడు, అశ్వతరాశ్వి పుత్రుడైన బడిలుడు, వ్యాఘ్రపుత్రుడైన సద్యుడనే ఐదుగురు జనకునితో చర్చలు జరిపి బ్రహ్మలుగా పేర్కొనబడ్డారు (2.22). సుదక్షిణక్షైమి జనకునివాదంలో పాల్గొన్నాడు (2.113). నైమిశారణ్యఋషులు యజ్ఞం చేసినపుడు దాల్భ్యుడు వారితో చర్చించాడు. దాల్భిఅని ఇతనికి మరోపేరు. దార్భ్యుల తండ్రి దర్భుడు (2.100). ఇతడు హిరణ్మయహంసయై యూపస్తంభంలో ప్రవేశించాడు. ఇందులో కుసురబిందు (1.75) సోమాన్ని కీర్తించాడు. విశ్వామిత్రునికి ఇందులోకూడ ఋషిత్వం చెప్పబడింది (2.3.13, 15.1). వసిష్ఠపుత్రుడైన శక్తికి విశ్వామిత్రునికి పోటీ ఇందులో ప్రస్తావించబడింది (1.150).

7. గోపథబ్రాహ్మణం : మౌద్గల్యుడు తత్త్వజ్ఞానంకోసం మైత్రేయు నాశ్రయించాడు (1.31). కేశిసత్యకామి కేశిదార్భ్యునికి జ్ఞానాన్ని ఉపదేశించాడు (3.6). శౌనకస్వైదాయనుడు ఉద్దాలకారుణితో తత్త్వాన్నిగురించి చర్చించాడు (3.6).

ఋషులు ఇంచుమించు గృహస్థులే. గృహస్థాశ్రమం స్వీకరించి సంతానంపొంది సన్న్యాసులయ్యేవారు. సమకాలికులైన రాజులతో సంబంధాన్ని కలిగి ఉండేవారు. యజ్ఞయాగాదులు, ఆత్మవిచారణే వీరికి ప్రధానకార్యం. తమ పేర్లతో తండ్రి పేర్లనుకూడ తప్పక తెలుపుకునేవారు. ఈ విధంగా ఋషులస్థితిగతులను సంగ్రహంగా బ్రాహ్మణాల్లో తెలుసుకోవచ్చు.

— ఐ. వి. ఆర్.

## 1. 10 రాజులు :

యాగప్రక్రియలను గురించి వివరించే బ్రాహ్మణాలలో చాల మంది రాజుల, రాజర్షుల ప్రసక్తి ఉంది. వీరు ఋషులతోపాటు వాగ్వాదాలు జరిపి తత్త్వనిర్ణయం కావించేవారు. తమ సునిశితమైన బుద్ధిబలం ద్వారాను, ధారాళమైన వాగ్ధాటి ద్వారాను, వారు ఆనాటి ఋషులకు, బ్రాహ్మణయాజకులకు మార్గదర్శకులుగాను, మాననీయులుగాను ఉండేవారు. రాజ్యపరిపాలనలోనే కాక బ్రహ్మవిద్యానుభవంలోను, యాగ విధానంలోను ఆరితేరిన ఆనాటి రాజులలో తలమానికంవంటివాడు జనకుడు.

జనకుని గూర్చిన ప్రసక్తి శతపథబ్రాహ్మణంలో (11.6.2.1) ఉన్నది. శ్రీమద్రామాయణంలో సీతకు తండ్రిగా పేర్కొనబడ్డ జనకుడు, ఈ జనకుడు ఒకేవ్యక్తి కావచ్చు. ఆయన సభలో ఎప్పుడూ ఆధ్యాత్మిక విషయాలను గురించి, యాగ ప్రక్రియలను గురించి చర్చలు జరుగుతూండేవి.

ఆయన ఒకసారి శ్వేతకేతువు, సోమశుష్మడు, యాజ్ఞవల్క్యుడు అనే ఋషులను, 'అగ్నిహోత్రం చేసే విధానం ఏమిటి?' అని ప్రశ్నించాడు. వారు ముగ్గురు తమకుతోచిన విధంగా బదులు చెప్పారు. కాని జనకునికి తృప్తి కలుగలేదు. అందరికంటే బాగా చర్చను జరిపినందుకు యాజ్ఞవల్క్యునకు 100 గోవులను బహుమానంగా ఇచ్చాడు. "నిజానికి అగ్నిహోత్రంయొక్క తత్త్వం యాజ్ఞవల్క్యుడికి కూడా బోధపడలేదు". అంటూ జనకుడు ఆనాటి సభ చాలించాడు.

అప్పుడు సోమశుష్మడు, శ్వేతకేతువు ఇలా అనుకున్నారు : "ఈ క్షత్రియుడు తన పరిపూర్ణజ్ఞానంచేత మనలనందర్నీ దిగ్భ్రాంతులనిచేశాడు. కాబట్టి మనం తగిన ప్రతీకారం చెయ్యాలి. మన బ్రాహ్మణాధిక్యతని

నిలువుకోవాలి. మనం ఆయన్ను బ్రహ్మోద్యంలోకి (అంటే బ్రహ్మతత్త్వాన్ని గురించిన వాదంలోకి) దింపి, ఓడించాలి" అని.

కాని యాజ్ఞవల్క్యుడు అందుకు ఒప్పుకోలేదు. "ఆయనతో వాదానికి దిగి గెలిచినా, ఓడినా అవమానం మనకే సుమా!" అన్నాడు. అగ్నిహోత్రం యొక్క నిజమైన విధానాన్ని గురించి తెలుసుకొనే జిజ్ఞాసతో యాజ్ఞవల్క్యుడొక్కడే జనకుణ్ణి కలుసుకుని, తన లక్ష్యాన్ని సాధిస్తాడు.

ఈ కథనుబట్టి జనకుడెంతటి తత్త్వజ్ఞానసంపన్నుడో తెలుస్తుంది. ఈ జనకుడు సత్యకామ జాబాలిదగ్గర శిష్యరికం చేసిన వాడు (శ.బ్రా. 14.6.10.14).

ప్రతర్దనుడనే రాజు యజ్ఞవిధానాన్ని గురించి యాజకులతో చర్చలు జరిపినట్లు కౌషీతకిబ్రాహ్మణంలో (26.5) చెప్పబడి ఉంది.

ప్రవాహణజైవలి అనే పాంచాలరాజు శ్వేతకేతువునకు సమకాలికుడుగా శతపథబ్రాహ్మణంలో (14.9.1.1) పేర్కొనబడ్డాడు. "శ్వేతకేతువుకి పాంచాలదేశంలో క్షత్రియస్నేహితుడు ఉండేవాడు." అనే అర్థంగల బ్రాహ్మణవాక్యాన్నొకదాన్ని మనుస్మృతి వ్యాఖ్యాత మేధాతిథి ఉదాహరిస్తాడు. కాని మనకు లభించే ఏ బ్రాహ్మణంలోను ఈ వాక్యం కనబడదు. కాబట్టి మేధాతిథి ఉదాహరించిన వాక్యం ఉత్సన్నమైన బ్రాహ్మణంలోనిది కావచ్చునని విజ్ఞులు ఊహిస్తున్నారు. కాగా, శతపథంలో చెప్పబడ్డ ప్రవాహణ జైవలి, మేధాతిథి పేర్కొన్న ప్రవాహణ జైవలి, ఇద్దరు ఒకేవ్యక్తి కావచ్చు.

ఈ ప్రవాహణజైవలి, శిలకశాలావత్యుడు. చైకితాయన దాల్భ్యుడు అనే మరిద్దరు క్షత్రియులతో వివాదపడినట్లు, వీరు ముగ్గురు సామగానంలో నిపుణులైనట్లు ఛాందోగ్యోపనిషత్తు (6.2.3) చెబుతోంది.

ఈ చైకితాయన దాల్భ్యునిసోదరుడు బకదాల్భ్యుడు. ఇతని ప్రసక్తి జైమినీయబ్రాహ్మణంలోను (1.2.2.3), ఛాందోగ్యోపనిషత్తులోను (10.6), మహాభారతంలోను (శల్య. అధ్యా. 41) కనబడుతున్నది.

ఈ చైకితాయన, బకదాల్భ్యులకు మరొక సోదరుడు కేశిదార్భ్యుడు (=దాల్భ్యుడు). ఇతని ప్రసక్తి కౌషీతకి బ్రాహ్మణంలో (7.5) ఉన్నది.

ఈ ముగ్గురుసోదరులకు తల్లి ఉచ్చైఃశ్రవసుడనే కౌరవరాజుకు సోదరి. తండ్రి దార్భ్యుడు. అతని తండ్రి శతానీకుడు. వీరందరిని గురించిన ప్రసక్తి జైమినీయబ్రాహ్మణంలో (2.100) ఉన్నది.

ద్రుపదమహారాజుకూడా యాగవిషయకమైన చర్చలు చేసినట్లు తెలుస్తోంది. ఇతని బిరుదు "యాజ్ఞసేనుడు". ముఖ్యంగా ఇతని కుమారులైన "సుత్వాయాజ్ఞసేనుడు" "శిఖండి యాజ్ఞసేనుడు" జైమినీయబ్రాహ్మణంలో (2.53) ఆరితేరిన యాగతత్త్వజ్ఞులుగాను, కేశిదార్భ్యుని సమకాలీనులుగాను చెప్పబడ్డారు.

జీవలచైలకి, ప్రాచీనశాల ఔపమన్యవుడు, సత్యయజ్ఞ పౌలుషి, ఇంద్రద్యుమ్నభాల్లవేయుడు, జనశార్కరాక్ష్యుడు, బుడిల అశ్వతరాశ్వి అనే క్షత్రియులు ఉద్దాలక ఆరుణితో శాస్త్రచర్చ చేసినట్లు శతపథంలోను (10.6.1.1-2), ఛాందోగ్యోపనిషత్తులోను (5.11.1-2) చెప్పబడింది. వీరందరు

జాతిచేత క్షత్రియులైనా, బ్రహ్మ జ్ఞానసంపన్నులు కాబట్టి బ్రాహ్మణులుగానే వ్యవహరింపబడ్డారు అనేది గమనించదగిన అంశం.

వీరుకాక జీవలకారిరాది, ఆషాఢసావయసుడు అనే మరి ఇద్దరు క్షత్రియులను గూర్చిన ప్రసక్తి జైమినీయబ్రాహ్మణంలో (1.21) ఉన్నది.

వీరుకాక జనకునిసమకాలికులుగా బర్కువార్ష్ణుడు, ప్రియజాన శ్రుతేయుడు అనే క్షత్రియుల ప్రసక్తి జైమినీయబ్రాహ్మణంలో (2.22) ఉన్నది. సుదక్షిణక్షైమి అనే క్షత్రియుడు జనకునితో "ప్రోమ" శబ్దార్థాన్ని గూర్చి చర్చించినట్లు ఇదే బ్రాహ్మణం (2.113) చెబుతోంది.

వీరుకాక హిరణ్మయశకునుడు,ఆసోలవాష్ణివృద్ధుడు, ఇటన్ కావ్యుడు, బ్రహ్మదత్తచైకితాయనుడు. కోసలరాజు బ్రహ్మదత్త ప్రాసేనజితుడు సమకాలికులని, యజ్ఞయాగాది విధానాలనిగూర్చి చర్చలుసలిపేవారని కౌషీతకి, జైమినీయ బ్రాహ్మణాలు తెలుపుతున్నాయి.

పర ఆట్నార (=అట్నార) అనే కోసలరాజును గూర్చిన ప్రసక్తి తాండ్యబ్రాహ్మణంలోను (25.10.17), శతపథబ్రాహ్మణంలోను (13.5.4.4) కనబడుతుంది. నమీసాప్యడనే మరొకరాజుపేరు తాండ్యబ్రాహ్మణంలో ప్రసక్తమైంది.

ఇవన్నీ ఒక ఎత్తు; "సులభా" అనే క్షత్రియస్త్రీని గూర్చిన ప్రసక్తి ఒక ఎత్తు. ఈమె జనకునితో ఆధ్యాత్మిక విషయకమైన చర్చలను సాగించేదని తెలుస్తోంది. బహుశః ఈమె మరొకపేరు "మైత్రేయి" కావచ్చునని విజ్ఞులు భావిస్తున్నారు. ఈమె పేర "సౌలభబ్రాహ్మణం" ఉండేదని, అది ఇప్పుడు నష్టమైందని, కాశికావృత్తిలో (4.2.66) చెప్పబడింది.

ఈ విధంగా బ్రాహ్మణాలలో పేర్కొనబడ్డ క్షత్రియులు, క్షత్రియ స్త్రీలు ఆధ్యాత్మికమైన చర్చలలోను యజ్ఞసంబంధమైన వివాదాలలోను పాల్గొనేవారని, యీనాటి మన ఆధ్యాత్మిక విజ్ఞానానికి శిక్షాగురువులు వారేనని, స్పష్టంగా తెలుస్తోంది. ఈ క్షత్రియులను గూర్చి పేర్కొనేటప్పుడు ఆయాబ్రాహ్మణాలు వీరిని "బ్రాహ్మణులు" అనడం కూడా, వారికుండే ఆధ్యాత్మికప్రావీణ్యానికి, సంఘంలో వారికుండే పేరు ప్రతిష్ఠలకి నిదర్శనం.

— ఎమ్. ఎస్.

## 1. 11 సాంఘిక జీవనం

వేదసంహితల్లోలాగానే, వాటి వ్యాఖ్యానరూపాలైన బ్రాహ్మణాల్లోకూడా ఆనాటి జీవనవిధానం ప్రతిబింబించింది. వేదశాఖలు అనేకంగా చీలిపోవటంవల్ల అధ్యేతల అజాగ్రత్తవల్ల బ్రాహ్మణపాఠం కొంతనష్టమైందని ఆపస్తంబ ధర్మసూత్రాలు చెబుతున్నాయి. (14.12.10). ప్రస్తుతం మనకు దొరికే బ్రాహ్మణాలను ఆధారంగా తీసుకొని అందులో ప్రతిబింబించిన జనజీవనాన్ని కొద్దిగా పరిశీలిద్దాం.

దేశం : బ్రాహ్మణకాలంనాటికి ఆర్యులు వాయువ్యభారత భూభాగంనుంచి ప్రాగ్భారతానికి వచ్చినట్లు అక్కడ స్థిరపడినట్లు తెలుస్తున్నది. అంటే ఆర్యనాగరికత సింధుమైదానం నుంచి గంగామైదానానికి వలసపోయిందన్నమాట. ఈదేశానికి కురుక్షేత్రం నడిబొడ్డు. శతపథబ్రాహ్మణంలో (16.3.11) ప్రాక్పశ్చిమ సముద్రాలు వర్ణింపబడ్డాయి. ఇలాంటి మార్పువల్ల సింధుమైదానంలోని నదుల ప్రాధాన్యత తగ్గిపోయింది. గంగామైదానంలో నదులకు ప్రాధాన్యత హెచ్చింది. వేదకాలంలో నదులలో ప్రధానమైందిగా పొగడబడ్డ సరస్వతి బ్రాహ్మణకాలంలో కేవలం ఒక నదిగా మాత్రమే పేర్కొనబడింది. గంగకు ప్రాధాన్యత పెరిగింది. శతపథబ్రాహ్మణంలో (1.4.1.17) సదానీర అనేది కోసలవిదేహదేశాల సరిహద్దుగా వర్ణింపబడింది. ఇది గండకీనది అని విమర్శకుల భావన. ఇలాగే అందులోనే (13.5.4.7) పేర్కొబడ్డ పరిచక్ర, ఆసందీవత్, కాంపిల నగరాలు ఏకచక్ర, హస్తినాపుర, కాంపిల నగరాలుగా ఇపుడు ప్రసిద్ధిపొందాయని విమర్శకులనుకుంటున్నారు. ఈకాలంలో దేశం తూర్పుదేశం, దక్షిణదేశం, పశ్చిమదేశం, ఉత్తరదేశం, మధ్య దేశమని ఐదుభాగాలుగా విభజింపబడింది (ఐ. బ్రా. 8.38.3).

జాతులు : బ్రాహ్మణాలను పరిశీలించిన తరువాత వేదకాలంలో ప్రసిద్ధిపొందిన జాతులు కొన్ని మరుగునపడినట్లు, క్రొత్తజాతులు కొన్ని ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. వేదకాలంలోని అను, ద్రుహ్యు, పురు, తుర్వశు, యదుజాతులు మరుగునపడిపోగా కురు, పాంచాల, వశ, ఉశీనరాదిజాతులు వెలుగులోకి వచ్చాయి. ఈ కాలంలో కురుపాంచాలదేశాలు ఒకజంటగా ఆదర్శదేశాలుగా, అందులోని ప్రజలు ఆదర్శపురుషులుగాను వర్ణింపబడ్డారు (శ. బ్రా. 3.2.3-15; కౌ.బ్రా7.6). మాగధులు, సాత్త్వతులు, నీచ్యులు, అపాచ్యులు, ఉదీచ్యులు, గాంధారులు ఈ విధంగా దేశభేదంచేత కూడ అనేక జాతులు బయటకొచ్చినాయి.

వర్ణాలు : సంఘజీవియైన మానవుని మనుగడ ఇచ్చిపుచ్చుకోవడాలపై ఆధారపడి ఉంటుంది. పరస్పర సహకారంలేనిదే సాంఘికాలైన చాలా అవసరాలు తీరవు. అందుచేత మానవులు తమ అవసరాలను తీర్చుకోవడానికి ఆ యా వృత్తుల్ని చేపట్టారు. ఆ వృత్తులనుబట్టే వారు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులనే నాల్గు వర్ణాలుగా విభజింపబడ్డారు (శ. బ్రా. 5.5.4-9). ఈ వర్ణవ్యవస్థ బ్రాహ్మణకాలంనాటి సంఘజీవనానికి జీవభూతమైంది. ఇలాంటివ్యవస్థ మనుష్యుల్లోనే కాదు; దేవతల్లోను (శ. బ్రా. 14.4.2-23, 24, 25; ఐ. బ్రా. 1.2.3 సాయణభాష్యం) పశువుల్లోను (ఐ. బ్రా. 6.4.4.12-15) వనస్పతుల్లోను (శ. బ్రా. 1.1.1.4; ఐ. బ్రా 8.37.4) ఛందస్సుల్లోను (శ.బ్రా. 7.4.5.6.) ఉంది.

బ్రాహ్మణులు : నాలుగువర్ణాలలోను ఉత్తమవర్ణంగా బ్రాహ్మణులు పరిగణించబడ్డారు. క్షత్రియుల అధికారం వారినుంచి మూడువర్ణాల వరకే పరిమితం. బ్రాహ్మణులపై క్షత్రియులకు కూడ అధికారం లేదు. సోముడే బ్రాహ్మణులకు రాజట (తై. బ్రా. 1.7.4.2). దక్షిణలను, బహుమతులను

తీసుకోవడం, యజ్ఞశేషాన్ని భుజించటం, తమ ఇష్టంవచ్చినట్లు సంచారం చేయటం, అధ్యయనం (వేదాన్ని చదువుకోవడం), అధ్యాపనం (వేదాన్ని శిష్యులకు బోధించడం), యజనం (యాగాలు చేయడం), యాజనం (యాగాలు చేయించడం) బుద్ధికుశలతతో రాజుకు సమయానుసరించి తగిన సలహాలనివ్వడం వీరి విధులు (ఐ. బ్రా. 7.35.3). బ్రాహ్మణుని చంపటం మహాదోషంగా ఎంచబడింది (శ. బ్రా. 3. 9. 4. 17). ఏ రాజైనా బ్రాహ్మణుని చంపాలని గాని, బాధించాలనిగాని తలిస్తే అతడు దీనావస్థకు లోనవుతాడనే భావన అప్పటి క్షత్రియుల్లో ఉండేది ( శ. బ్రా. 13.1.5.4).వీరు భూదేవులుగా కీర్తింపబడ్డారు (శ. బ్రా. 4.3.4.4). వీరు పూజ్యులని, దానదక్షిణాదులంచే సమ్మానించదగిన వారని, అజేయులని, అవధ్యులని శతపథం (11.5.7.1) చెబుతోంది. బ్రాహ్మణముఖం యజ్ఞాగ్నిలాగా పవిత్రమని పంచవింశబ్రాహ్మణం (1ం.౬.14.) అంటున్నది. ఋజుస్వభావం, విజ్ఞానం వీరి ఆయుధాలట (ఐ. బ్రా. 7.19). వీరిమాటే వజ్రమట (తాం. బ్రా. 6.1.6). విజ్ఞాని అయిన బ్రాహ్మణుడగ్నినట (తై. బ్రా. 2. 7. 3. 1). మద్యపానం, సంగీతం, నృత్యం వీరికి నిషిద్ధాలు (శ. బ్రా. 12.8.1.5; గో. బ్రా 1.2.21). ఇలాంటి వీరిలో షోడశసంస్కారపరిపూర్ణుడైన బ్రాహ్మణుడు 'సాత్తమముడ'ని పిలువబడ్డాడు (గో. బ్రా. 1.2.2.3).

**పురోహితుడు** : ఇలాంటి బ్రాహ్మణులలో ఎవడు మహా పండితుడై శమదమాది సద్గుణాలు కలిగి దేశరక్షణసామర్థ్యం గల వాడవుతాడో అలాంటివాడు పురోహితుడుగా నియమించబడేవాడు (ఐ. బ్రా. 8.40.4). అన్ని దేశాల్లోను ప్రతిరాజు పురోహితుని కలిగి యుండేవాడు. పురోహితుని సలహాలననుసరించే రాజు సాంఘికాలు, దైవికాలు, ధర్మపరాలైన కార్యక్రమాలను చేపట్టేవాడు. ఇతని సలహాలతోనే రాజు రాజ్యాన్ని పాలించేవాడు (ఐ. బ్రా.

8.40.3). సముద్రం భూమినెలా రక్షిస్తుందో, అలాగే పురోహితుడు రాజును రక్షిస్తాడని ఐతరేయం (8.40.2) చెబుతోంది. పురోహితుడు సమర్థుడైతే అతనికి ఇతరరాజులందరు వశులవుతారు. శత్రువులు నశిస్తారు (ఐ. బ్రా. 8.40.4). రాజు తన పురోహితుని కెలాంటి అపకారాన్ని తలపెట్టనని ప్రమాణంచేసేవాడు (ఐ. బ్రా. 7.23). సమర్థుడైన పురోహితుడు రెండురాజ్యాలకు పురోహితుడుగా ఉండేవాడు. దేవభాగశ్రౌతర్షుడు, కురు-శృంజయదేశాలకు పురోహితుడైనట్లు శతపథంలో (2.4.4.5) వర్ణింపబడింది. అందువల్లనే పురోహితుడే రాజుకు ఆత్మ అని ఐతరేయం (8.40.4) తెలుపుతోంది.

క్షత్రియులు : శౌర్య, బల, పరాక్రమాలకు చిహ్నంగా క్షత్రియుడు వర్ణింపబడ్డాడు (ఐ. బ్రా. 8. 37.3). భూమి అంతా క్షత్రియునిదే. బ్రాహ్మణ వైశ్య శూద్రులు భూమికై అతణ్ణే యాచింపవలసిందే (ఐ. బ్రా. 7.20). ప్రజలు క్షత్రియునికి పన్నులరూపంలోను, బహుమతులరూపంలోను ధనాన్నిచ్చేవారు. దానికి ప్రత్యామ్నాయంగా అతనినుంచి రక్షణము పొందేవారు (శ. బ్రా. 1. 3. 2. 15). క్షత్రియులకు గూడ యజ్ఞం చేసే అధికారం ఉంది. కాని హోమశేషాన్ని భుజించే అధికారం లేదు (ఐ. బ్రా. 7.34.1). క్షత్రియుని వేషం అతని సాంఘికస్థితిననుసరించి ఉంటుంది. వీరు రథాలనెక్కి సంచరించేవారు (శ. బ్రా. 1. 2. 4. 2). శత్రువులనుంచి దేశాన్ని రక్షించటం, దుండగులను శిక్షించటం, ఆపదలలో నున్నవారిని ఆదుకోవటం ఇతని కర్తవ్యాలు. ఇతడే వర్ణాశ్రమధర్మాలను ప్రజల చేత ఆచరింపచేసే సామర్థ్యం కలవాడు (ఐ. బ్రా. 8.17). బ్రాహ్మణులు క్షత్రియులు పరస్పర సహకారసదవగాహనలు కలిగి ఉండేవారు. వీరిద్దఱూ పరస్పరం ఆశ్రయించి ఉండేవారు (ఐ. బ్రా. 8.36.2). ప్రజలకు ఇద్దఱూ సంరక్షకులే. అందులో

ఒకరు దైవికశక్తిచేత ప్రజలను రక్షిస్తే ఇంకొకరు భౌతికశక్తిచేత ప్రజలను రక్షిస్తారు ( శ. బ్రా. 5.1.1.11) క్షత్రియుడు బ్రాహ్మణులను భక్తి ప్రపత్తులతో వశంచేసుకుంటాడు. బ్రాహ్మణులెవ్వరికి వశపడతారో అతని రాజ్యం మూడు పువ్వులు ఆరుకాయలుగా పెరుగుతుందని ఐతరేయం (8.37.5) చెబుతోంది.

వైశ్యులు : క్షత్రియుల తరువాత ఆనాటి సమాజంలో మూడవ స్థానాన్నలంకరించినవారు వైశ్యులు. వీరికి పై రెండు వర్ణాలలాగా ఉపనయనాధికారం, యజ్ఞాధికారం ఉన్నాయి. హోమశేషాన్ని భుజించే అధికారం మాత్రం వీళ్ళకు లేదు (ఐ. బ్రా. 7.34.1). వాణిజ్యం వ్యవసాయం పశుపోషణ వీరి వృత్తులు. కనుక వీరు సంఘానికి వెన్నెముకలాంటివారు. వీళ్లను క్షత్రియులు, బ్రాహ్మణులు తమ అదుపు ఆజ్ఞలలో పెట్టుకునేవారు (ఐ. బ్రా. 2.10.1; 8.36.4; శ. బ్రా. 5.1.5.28). వైశ్యులు, శూద్రులు అసంపూర్ణ వర్ణాలుగా వర్ణింపబడ్డారు (శ. బ్రా. 6.6.3. 12). తమ వాణిజ్య వ్యవసాయ పశుసంపదలను రక్షించుకోవడానికి వైశ్యులు తమంతట తామే క్షత్రియులకు లోబడి వారి రక్షణలోనుండే వారు ( శ. బ్రా. 1.3.2.15).

శూద్రులు : ఈ కాలంలో తూర్పుభాగంలో ప్రవేశించిన ఆర్యులు అక్కడ స్థిరనివాసమేర్పరచుకొని ఉన్నవాళ్ళను యుద్ధంచేసి వశపరచుకుని వాళ్లను దశ్యులని, దాసులని పిలువసాగారు. ఆర్యులకు లోబడక అక్కడక్కడ దాగిఉండి ఆర్యులపై దెబ్బతీయదలచినవారు దశ్యులు. వీరికి లోబడి వీరికి దాస్యంచేయాలనుకొన్నవారు దాసులు. ఈ దాసులే శూద్రులుగా మారారు. వీరివృత్తి సేవే. వీరు అసురులనుంచి పుట్టినట్లు వర్ణింపబడటమే (తాం. బ్రా. 1. 2. 6. 7) దీనికి ప్రమాణం. నాల్గువర్ణాలలోను అత్యంతహీనస్థితిలోనున్న వర్ణమిదే. వీరికి యజ్ఞాధికారంలేదు (శ. బ్రా. 3.1.1.9). ఇంతేకాదు; యజ్ఞభూమిలో ప్రవేశం (శ. బ్రా. 3.1.1.9). యజమానితో సంభాషణ (3.1.1.10)

కూడ వీరికి నిషిద్ధాలే. ఆవులను పాలను పితుకటానికికూడ వీరు పనికిరారు (తాం. బ్రా. 2.39). అనులోమవివాహాలలో శూద్రస్త్రీలు పైవర్ణాలవారి చేత గ్రహించబడుతుండేవారు. ఇలాంటి అనులోమ వివాహాలవల్ల పుట్టిన సంతతికూడ శూద్రులుగానే పరిగణించబడినప్పటికి వారికి శూద్రులలోనే ఒక ఉత్కృష్టస్థానముండేది (శ. బ్రా. 13.2.9.8). నిమ్యలు, అపామ్యలు అనేవారు శూద్రులకంటెను హీనులుగా పరిగణింపబడేవారు (ఐ. బ్రా. 8.38.3).

ఏ శూద్రుడైనా బ్రాహ్మణుల విజ్ఞానాన్ని సంపాదిస్తే, అలాంటి వాణ్ణి బ్రాహ్మణతుల్యునిగా గౌరవించటం అప్పటి ఆచారం. ఐతరేయ బ్రాహ్మణంలోని కవశోపాఖ్యానం దీనికి ఉదాహరణ (2.8.1). ఐతరేయ బ్రాహ్మణకర్తయైన మహీదాసుకూడ ఇలాంటివాడే. విద్య తపస్సులవల్ల హీనవర్ణాలవారు ఉచ్చవర్ణస్థాయిని పొందేటట్లు కూడ దీనివల్ల తెలుస్తోంది.

ఆశ్రమాలు :

పైనచెప్పబడ్డ వర్ణాలలో పై మూడు వర్ణాలవారికి ఆశ్రమధర్మాలు ఉన్నాయి. ఈ ఆశ్రమాలు బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అని నాలుగు.

బ్రహ్మచర్యం - విద్యాభ్యాసం : ఇందులో విద్యాభ్యాసానికుపకరించే ఆశ్రమం బ్రహ్మచర్యం. బ్రాహ్మణక్షత్రియవైశ్యులు తమ పిల్లలకు ఉపనయన సంస్కారం చేసి గురువులదగ్గరికి గురుకులాలకు విద్యాభ్యాసానికి పంపేవారు. ఉపనయనసంస్కారమే రెండవజన్మగా భావించబడడంచేత వీరికి ద్విజులని పేరు. విద్యార్థులు బ్రహ్మచర్యాన్నవలంబించి గురుశుశ్రూషచేస్తూ విద్యనభ్యసించాలి. ఈ విద్యార్థి దశ దీర్ఘసత్రంగా వర్ణించబడింది (శ. బ్రా.

కూడ వీరికి నిషిద్ధాలే. ఆవులను పాలను పితుకటానికికూడ వీరు పనికిరారు (తాం. బ్రా. 2.39). అనులోమవివాహాలలో శూద్రస్త్రీలు పైవర్ణాలవారి చేత గ్రహించబడుతుండేవారు. ఇలాంటి అనులోమ వివాహాలవల్ల పుట్టిన సంతతికూడ శూద్రులుగానే పరిగణించబడినప్పటికీ వారికి శూద్రులలోనే ఒక ఉత్కృష్టస్థానముండేది (శ. బ్రా. 13.2.9.8). నీచ్యులు, అపాచ్యులు అనేవారు శూద్రులకంటెను హీనులుగా పరిగణింపబడేవారు (ఐ. బ్రా. 8.38.3).

ఏ శూద్రుడైనా బ్రాహ్మణుల విజ్ఞానాన్ని సంపాదిస్తే అలాంటి వాణ్ణి బ్రాహ్మణతుల్యునిగా గౌరవించటం అప్పటి ఆచారం. ఐతరేయ బ్రాహ్మణంలోని కవశోపాఖ్యానం దీనికి ఉదాహరణ (2.8.1). ఐతరేయ బ్రాహ్మణకర్తయైన మహీదాసుకూడ ఇలాంటివాడే. విద్య తపస్సులవల్ల హీనవర్ణాలవారు ఉచ్చవర్ణస్థాయిని పొందేటట్లు కూడ దీనివల్ల తెలుస్తోంది.

ఆశ్రమాలు :

పైనచెప్పబడ్డ వర్ణాలలో పై మూడు వర్ణాలవారికి ఆశ్రమధర్మాలు ఉన్నాయి. ఈ ఆశ్రమాలు బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అని నాలుగు.

బ్రహ్మచర్యం - విద్యాభ్యాసం : ఇందులో విద్యాభ్యాసానికుపకరించే ఆశ్రమం బ్రహ్మచర్యం. బ్రాహ్మణక్షత్రియవైశ్యులు తమ పిల్లలకు ఉపనయన సంస్కారం చేసి గురువులదగ్గరికి గురుకులాలకు విద్యాభ్యాసానికి పంపేవారు. ఉపనయనసంస్కారమే రెండవజన్మగా భావించబడడంచేత వీరికి ద్విజాలని పేరు. విద్యార్థులు బ్రహ్మచర్యాన్నవలంబించి గురుశుశ్రూషచేస్తూ విద్యనభ్యసించాలి. ఈ విద్యార్థి దశ దీర్ఘసత్రంగా వర్ణించబడింది (శ. బ్రా.

గురువుల దగ్గర బ్రహ్మచర్యాన్ని పాలించే బ్రహ్మచారులను నైష్ఠిక బ్రహ్మచారులంటారు. వీరికి గార్హస్థ్య-వానప్రస్థాలు లేవు. ఇలాంటి బ్రహ్మచారులే శతపథబ్రాహ్మణంలో వర్ధిష్ణుంతులుగా కీర్తింపబడ్డారు. ఇక స్నాతకవ్రతమాచరించి, సమావర్తన (ఇంటికి పోవటం) చేసి గార్హస్థ్యాన్నవలంబించబోయేవారు ఉపకుర్వాణబ్రహ్మచారులని పిలువబడతారు. వీరు స్నాతకవ్రతాంతంలో గురువుకు దక్షిణలు ఇవ్వాల్సి వుంటుంది. ఇలాంటి ఉపకుర్వాణ బ్రహ్మచారులు దక్షిణలచేత గురువులను సంతోషపరచి, వారి అనుజ్ఞచేత గార్హస్థ్యాన్ని స్వీకరించేవారు. తమ గురువుయొక్క యాగశాలనుంచి గార్హపత్యాగ్నిని తీసుకొనివచ్చి తాము అగ్నిహోత్రాన్ని తమగృహంలో ప్రతిష్ఠించుకునేవాళ్లు.

ఇక ఇలాంటి విద్యార్థులకు బోధించే గురువులు కూడ రెండు విధాలుగా ఉండేవాళ్లు. ఒక్కచోటే స్థిరపడి అక్కడికి వచ్చే విద్యార్థులకు బోధించే వాళ్లు కొందరు. మరికొందరు విద్యార్థుల కనుకూలంగా దేశాటనచేస్తూ విద్యాబోధన చేసేవాళ్లట. అలాంటి గురువులకు 'చరకుల'ని పేరు (శ. బ్రా. 4.2.4.1). రెండురకాల ఉపాధ్యాయులు ఆకాలంలో ఉండేవాళ్లు. విద్యలను ఏ శుల్కం తీసుకోకుండానే చెప్పేవాళ్లు (శ. బ్రా. 13.4.3.14).

స్త్రీవిద్యకై చెప్పుకోదగిన ఏర్పాట్లు లేనప్పటికీ అది నిషేధించబడలేదు. స్త్రీలు యజ్ఞోపవీతం ధరించి వేదాధ్యయనాన్ని వేదకాలంలోనే చేసేవారు. ఐతరేయబ్రాహ్మణంలో (5.25.4) గంధర్వ అనే ఆమె అగ్నిహోత్రంయొక్క మంచిచెడ్డలను విచారిస్తున్నట్లు కథ ఉంది. యజ్ఞాలలో యజమానిభార్య కొన్ని మంత్రాలు పఠించవలసి ఉంటుంది.

సంగీతం, నృత్యం, పాకం, కుట్టటం, సంతతిని పోషించటం, దారం వడకటం, చాలారకాలైన కుట్టుపనులు (embroidery)

మొదలైన లలితకళలలో అప్పటి స్త్రీలందరు నిపుణులు (శ. బ్రా. 12.7.2.11; 14.3.1.35).

గార్హస్థ్యం-వివాహం : సమావర్తనాన్నాచరించిన స్నాతకుడు తన కనుకూలవతి, గుణవతియైన ఆమెను తనకులంలో జన్మించిన దానిని వివాహమాడి గృహస్థాశ్రమంలో అడుగుపెట్టేవాడు. సామాన్యంగా ఏకకులవివాహాలే ప్రశస్తాలుగా చెప్పబడ్డాయి. అనులోమ వివాహాలు కూడ నిషిద్ధాలు కావు. వివాహంవల్లనే మనుష్యునికి పూర్ణత్వమొస్తుందని వారి నమ్మకం (ఐ. బ్రా. 1.2.5). ఎందువల్లనంటే యజ్ఞయాగాద్యనుష్ఠానం భార్యలేనివాడికి నిషిద్ధం కదా ! శతపథం కూడ (5.1.6.10) ఈ విషయం నొక్కి చెబుతోంది. అందుచేత స్త్రీ యజ్ఞానికి జఘనభాగంగా పేర్కొనబడింది (శ. బ్రా. 5.2.1.8).

మధురమైన వైవాహికజీవనం బ్రాహ్మణాలలో వర్ణించబడింది. వివాహమొక ఒప్పందంకాక పవిత్రబంధంగా భావించబడింది. భార్య భర్తపై ఆధారపడినా, భర్తనే బానిసగా కాక స్నేహితురాలిగా ఆధ్యాత్మిక విషయాలలో భాగస్వామినిగా చూడబడింది (ఐ. బ్రా. 73.3.1). స్త్రీమూర్తి లక్ష్మీదేవికి ప్రతీకగా గౌరవించబడింది (శ. బ్రా. 11.4.3.2). అందువల్లనే బ్రాహ్మణహత్యలాగా స్త్రీహత్యకూడా నిషేధించబడింది. భార్యాభర్తలయొక్క అవినాభావసంబంధం అన్యోన్యత మనోవాక్కుల యొక్క, సత్యవిశ్వాసాల యొక్క సంబంధంతో పోల్చబడింది (శ. బ్రా. 12.8.2.6). భర్త భార్యలో ప్రవేశించి పుత్రునిగా జన్మిస్తాడు కాబట్టి ఆమె 'జాయ' అనబడుతుందట (ఐ.బ్రా. 7.33.1). పుత్రులులేనిదే గార్హస్థ్యానికి పూర్ణతే లేదు గదా !

స్వయంవరంకూడ అపుడు ప్రచారంలో ఉన్నది (ఐ. బ్రా. 4.17.1). బహుభార్యాత్వం సమ్మతమే. యాజ్ఞవల్క్యమహర్షికి మైత్రేయి, కాత్యాయని

అని ఇద్దరు భార్యలుండేవారు. హరిశ్చంద్రుడనేరాజుకు వందమంది భార్యలున్నట్లు ఐతరేయం (7.33.1) చెబుతోంది. ప్రతిరాజుకు మహిషి (రాణి), వావాత (ప్రియసతి), పరివృక్త (ఉపేక్షింపబడింది), పాలాగలి (శూద్ర) అనే నల్గురు భార్యలు చట్టసమ్మతులే (శ. బ్రా. 13.4.1.8). బహుభర్తృత్వం నిషిద్ధం ( ఐ. బ్రా. 3.12.12; గో. బ్రా. 3.20). సగోత్రవివాహాలు నిషిద్ధాలు. సజాతివివాహాలే శ్రేష్ఠమైనవని గుర్తించబడ్డాయి. అనులోమ వివాహాలు కూడ అంగీకరించబడ్డాయి (శ. బ్రా. 4.1.5.9).

సామాన్యంగా పురుషులు స్త్రీలు వడ్డిస్తే ముందు భోజనంచేసేవారు. కాని వీరులైన పుత్రులను కోరేవారు భార్యఎదుట భోజనం చేసేవారు కాదు (శ. బ్రా. 10.5.2.9). పరస్పరాకర్షణకై దంపతు లిద్దరూ సుగంధ ద్రవ్యాలనుపయోగించేవారు ( శ. బ్రా. 9-4-1-4). నిద్రించేటపుడు శయ్యపై భర్త కుడివైపు పడుకోవటం అప్పటివారి ఆచారం (శ. బ్రా. 7.5.1.6). మామగారి దగ్గర సిగ్గుపడటం భార్య విధి (ఐ. బ్రా. 3.12.1). భర్తయొక్క అక్కచెల్లెళ్ళు అంటే ఆడబిడ్డలు భార్యపై అధారపడేవారు (ఐ. బ్రా. 3.13.3).

వానప్రస్థ-సన్యాసాలు : వీటినిగూర్చి విశేషంగా బ్రాహ్మణాలలో చెప్పబడలేదు.

**రాజకీయపరిస్థితులు :**

వేదకాలంలో మొట్టమొదట రాజా ప్రజలచే ఎన్నుకొనబడినప్పటికి, తరువాత రాచరికం వంశపారంపర్యరూపమే (శ. బ్రా. 12.9.3.1-13). రాజ్యం, సామ్రాజ్యం, భౌజ్యం, స్వారాజ్యం, వైరాజ్యం, పారమేష్ఠ్యం, రాజ్యం, మహారాజ్యం, ఆధిపత్యం, స్వావశత్వం, ఆతిష్ఠత్వం అనే పదకొండురకాల ప్రభుత్వాలు ఐతరేయంలో (8.37.2, 5: 8.38-1;8-39.1) చెప్పబడ్డాయి. ఇందులో మొదటి ఐదు ఈలోకానికి సంబంధించినవని మిగిలినవి పరలోకానికి

సంబంధించినవని సాయణాచార్యుడు వ్యాఖ్యానించాడు (ఐ. బ్రా. 8.37.5). ఈ ఆధిపత్యాలు ఆ యా యజ్ఞాలకు సంబంధించినవి. రాజసూయం చేసినవాడు రాజవుతాడు. అలాంటిరాజు వాజపేయంచేసి సమ్రాట్టు అని పిలువబడతాడు. అలాగే ఆతడు అశ్వమేధంచేసి మహారాజవుతాడు (శ. బ్రా. 5.1.1.3).

బ్రాహ్మణకాలంలో దేశం ఐదుభాగాలుగా విభజించబడిందని చెప్పాను. ఆయాదేశాల్లో విభిన్నజాతులవారు నివసించేవారు. వారిని పాలించే ప్రభువుల ఆధిపత్యం భిన్నంగా ఉండేది. ప్రాచ్యదేశప్రభువు సమ్రాట్టని, దక్షిణదేశప్రభువు భోజుడని, ప్రతీచ్యదేశప్రభువు స్వరాట్టని, ఉత్తరకురుమద్రదేశాలుగల ఉదీచ్యదేశప్రభువు విరాట్టని, మధ్యదేశప్రభువు రాజని పిలువబడేవారు (ఐ. బ్రా. 8.38.3). ఈ ఐదుదేశాల్లో మధ్యదేశంలో కురుపాంచాలదేశాలు జంటదేశాలుగా ప్రసిద్ధిపొందాయి (శ. బ్రా. 13.5.4.2). ఇవి ఇతరదేశాలకు ఉదాహరణాలట. అక్కడివారే ఆదర్శనాగరికులు. అలాగే అక్కడి ప్రభువులే ఆదర్శ ప్రభువులు. వారుమాట్లాడే భాషే శుద్ధమైంది (శ. బ్రా. 3.2.3.15). సృంజయులు, మత్స్యులు, శిబులుకూడా మధ్యదేశంలోనే నివసించేవారు (ఐ.బ్రా. 8.39.9. శ. బ్రా. 2.4.45; 13.5.49). నీచ్యులు, అపాచ్యులు, ఆంబష్ఠ్యులు, పశ్చిమదేశంలో నివసించేవారు (ఐ. బ్రా. 8.21). ఉత్తరదేశంలో ఉత్తరకురులు, ఉత్తరమద్రులేకాక మూడు సంతులు బాహ్లీకులు, కేశులు, కేకయులు, కాంభోజులు కూడ ఉండేవారు. ఉత్తరదేశాలుకూడా విజ్ఞానంలో ప్రసిద్ధాలే.

రాజులకు పట్టాభిషేకోత్సవం ప్రధానం. ఇది రాజసూయంలో ఒక భాగం. రాజసూయంలో ప్రతి క్రియ ప్రభుత్వంయొక్క విభిన్న క్రియలకు ఉపలక్షణం. ఇందులో రాజు రత్నమనబడతాడు. ఆతణ్ణి రక్షించేవారు 'రత్ని' శబ్దంచేత వ్యవహరించబడతారు. అలాంటి రత్నులచే స్వీకరించబడినప్పుడే

రాజు అభిషేకానికి ప్రజాపాలనకు అర్హుడవుతాడు. ఈ రత్నులు పురోహితుడు, మహారాణి, సేనాని, సామంతులు, గ్రామణి (గ్రామపెద్ద), సూతుడు, రథకారుడు (సేనావిభాగాధిపతులు), అంగరక్షకుడు: కర(గ్రాహకుడు, సంగ్రాహకుడు (Treasurer) కర్మారుడు (పరిశ్రమల అధికారి) అక్షావాపుడు (జూదశాలలపైన అధికారి) అనేవారు (శ. బ్రా. 5.3.3.4, 9.4.1.13, 9.3.4.5).

రాజు దైవాంశసంభూతుడుగా తలంచబడేవాడు. అతడు దండానికతీతుడు. శాసనాలు చేయటానికి, ఆచరింపజేయడానికి అధికారమీతనిదే. న్యాయవ్యవస్థకు, సైన్యానికిగూడా ఇతడే సర్వాధికారి. పురోహితుడే ముఖ్యమంత్రి. ఈతడన్ని విషయాల్లోను రాజుకు సహాయకారి (శ. బ్రా. 5.4.4.7, ఐ. బ్రా. 8.37.3).

వేదకాలంలో రాజ్యపాలనకుపకరించే సభలు రెండు. ఇవి సభ, సమితి అని పిలువబడేవి. సభలో విద్వాంసులు, విజ్ఞానులు రాజుచే ఎన్నుకోబడిన వారుండేవారు. ఇది చిన్నది. దీనికంతటి ప్రాముఖ్యముండేదికాదు. రెండవది సమితి. ఇందులో ఆయా గ్రామాల యొక్క, ఆయా జాతులయొక్క వర్ణాల యొక్క ప్రతినిధులుండేవారు. ఇందులో రాజకీయాలైన విషయాలు చర్చించబడి నిర్ధారించబడుతుండేవి. ఈ సమితికే అప్పుడు ప్రాముఖ్యమెక్కువగా ఉండేది. రెండింటికి రాజే అధ్యక్షుడు[1]. బ్రాహ్మణాలలో సభ ప్రస్తావించబడింది గాని సమితి ప్రస్తావించబడలేదు (తాం. బ్రా. 3.8.13.3). యువకులకు సభలో ప్రవేశమున్నట్లు తాండ్యబ్రాహ్మణం చెబుతోంది.

రాజుకు ప్రజలకుగల సంబంధం సామాన్యం. పరస్పర సదవగాహన, పరస్పరసహకారాలకై ప్రయత్నం జరిగేది. రాజు యుద్ధసమయాలలో ప్రజల అభిమానం సంపాదించటానికి తాను తన స్థాయినుంచి దిగివచ్చి సామాన్యులతో

---

1. I.A.B. by J. Basu PP 113-114.

భోజనంచేసేవాడు ( శ. బ్రా. 4.3.3.15). ప్రజలు పన్నులను నిర్బంధంలేకుండానే చెల్లించేవారు. యుద్ధసమయాలలో ప్రజలు తమ భార్యాబిడ్డలను కోటలలో దాచేవారు (ఐ. బ్రా. 1.4.7). విలువైన వస్తువులను భూమిలోను, చెరువులోను, అగడ్తలలోను, సముద్రంలోను, యుద్ధకాలంలో దాచేవారు. యుద్ధభీభత్సం తగ్గిన తరువాత మళ్లాపైకి తీసేవారు.

విజయంగూడ పరిపరివిధాల కీర్తింపబడింది (ఐ. బ్రా. 8.37.5). జితి, అభిజితి, విజితి, సంజితి అని విజయం నాలుగురకాలు. జితి అంటే సాధారణవిజయం. అభిజితి అంటే జితికంటే కొంచెం ఎక్కువ. విజితి అంటే వివిధరకాలైన శత్రువులను జయించటం. సంజితి అంటే శత్రుశేషం లేకుండ జయించటం.

మహారాణి, కొడుకులు, సోదరులు రాజ్యంలో రాజుతరువాత ఉన్నతస్థానాన్నలంకరించేవారు. మహారాణి, రాజసోదరులు పట్టాభిషేకోత్సవంలో పాల్గొనేవారు. అలాగే రాజుయొక్క ఇతరభార్యలు గూడ సమాజంలో ఉన్నతస్థాయిలో ఉండేవారు. అశ్వమేధయాగంలో నలుగురు భార్యలు భాగంగ్రహిస్తారు. వావాత అంటే రాజుకత్యంత ప్రియురాలు. ఈమె రాజుకు ప్రజలకుమధ్య రాయబారిగా ఉండేది. సాక్షాత్తు రాజును చూడలేనివారు తమపనులను ఈమెద్వారా చక్కబెట్టుకొనేవారు. ప్రజల సమస్యలను ఈమె రాజుదృష్టిలోనికి తెస్తుండేది. ఈమె చెబితే తప్పకరాజు మన్నిస్తాడని అప్పటి ప్రజల విశ్వాసం (ఐ. బ్రా. 3.12.11; 1.3.2; శ. బ్రా. 5.3.5.12). రాజు పట్టాభిషేకోత్సవంలో అభిషేకానంతరం మిగిలిననీటిని తనకుమారుని కిచ్చి ఈ ప్రతాపైశ్వర్యాలను కుమారుడు పొందేటట్లు ఆశీర్వదిస్తాడు. కాబట్టి యువరాజైన కొడుకుకు గూడ ప్రభుత్వంలో ఉన్నతస్థాన మున్నట్లు భావించవచ్చు ( శ. బ్రా. 5.4.2.8).

రాజులు దుష్టులై రాజ్యపాలన సరిగా చేయనపుడు వారిని సింహాసనంనుంచి ప్రజలు అధికారులు కలసి దింపేసేవారు (శ. బ్రా. 12.9.3.1). పదభ్రష్టులైన రాజులు 'రాద్యజ్ఞం' చేసి ప్రజల మన్ననలనుపొంది మళ్లా రాజులయ్యేవారు (పం. బ్రా. 19.7.1.4).

దీనివల్ల అప్పటి రాచరికం వంశపారంపర్యరూపమైనా ప్రజలకు గూడ రాజుయొక్క ప్రవర్తనను పరిశీలించే అధికారం ఉన్నదనీ, ప్రజలమాట రాజుచేత మన్నించబడేదని, ప్రజాస్వామ్యవిలువలు పాటించబడేవని తెలుస్తున్నది.

సేన, సేనాని, అనీక మొదలైన సేనావాచకపదాలు అన్ని బ్రాహ్మణాల్లోను వినిపిస్తున్నాయి. అశ్వీక, రథిక, పదాతిరూపాలైన వివిధసేనలు వర్ణించబడ్డాయి. మంచిసేన 'స్వనీక' అని పిలువబడేది (ఐ. బ్రా. 3.12.11). యుద్ధాలలో సైనికులు వివిధప్రక్రియలలో వ్యూహాలుగా తయారుచేయబడేవారు. సేనలో అగ్రగామియైన సేన మహాభయంకరంగా ఉండేది. వారి వస్త్రకవచధారణ, పడక, ఆయుధాదులు చూసేవారికి భయాన్ని కలిగిస్తుండేవి (కౌ. బ్రా. 6.5; శ. బ్రా. 13.2.2.2). మంచిసేనానాయకుని సుసేనుడని, సేనను జయించినవానిని "సేనాజిత్" అని బిరుదాలతో గౌరవించేవారు (శ. బ్రా. 8.6.1.30). వాజసనేయిసంహితలో శతరుద్రీయసూక్తం (16వ అధ్యాయం) వల్ల సైనికులలో వైవిధ్యం తెలుస్తోంది. వర్మి, కవచి, వర్మి, వరూధి, దుందుభ్య మొదలైన పేర్లతో వివిధరకాల సైనికులు పిలువబడ్డారు.

అశ్వాలు, రథాలు, కవచాలు, బాణాలు, ధనుస్సులు, కత్తులు, బల్లేలు, గొడ్డళ్ళు మొదలైన ఆయుధాలను ఉపయోగించేవారు (శ. బ్రా. 8.6.1.6; ఐ. బ్రా. 7.34.1). బాణాలు 45 అంగుళాలు పొడవైనవట. ఇవి నాల్గుభాగాలు కలవి. అందులో ముందుభాగం అనీకమని, అందులోని పదు

పైనభాగం శల్యమని, దానియొక్క చివరి భాగం తేజనమని, తోక పర్ణమని పిలువబడుతుండేది ( ఐ. బ్రా. 1.4.8).

సామాజిక స్థితిగతులు :

**సంగీతం** ; గాత్రసంగీతం, వాద్యసంగీతం కూడా అప్పుడు ప్రసిద్ధిపొందినవే. వీణావాదనం సామాన్యంగా అన్ని బ్రాహ్మణాల్లోనూ వర్ణించబడింది. సామూహిక వీణావాదనగూడ వర్ణించబడింది ( శ. బ్రా. 13.4.3.3). వీణ శ్రీరూపంగా వర్ణించబడింది (శ. బ్రా. 13. 1. 5. 3). సామగానం చేసేటప్పుడు దుందుభులను ప్రయోగించేవారట (శ. బ్రా. 5.1.5.17). ప్రసిద్ధమైన పాటలనేగాక స్వయంగా రచించినవాటిని గూడ పాడేవారట.

**నాట్యం** : శతపథబ్రాహ్మణంలోను (3.2.46), ఐతరేయంలోను (5.22.10) నృత్యం, నర్తనం వర్ణించబడ్డాయి.

**క్రీడావినోదాలు** : గుఱ్ఱపుస్వారి, రథాలపై స్వారీచేయడం ముఖ్యమైన వినోదాలు (ఐ. బ్రా. 2.9.1). గృహక్రీడలలో మొదట చెప్పుకోదగింది జూదం (శ. బ్రా. 13.3.2.1). ద్యూతగృహాలు ప్రత్యేకంగా నెలకొల్పబడి ఉండేవి. వీటిపై నిరీక్షణకై ఒక అధికారి ఉండేవాడు. అతడే 'అక్షావాపుడ'ని పిలువబడేవాడు.

**వేషభాషలు** : ఉన్ని, నూలు, ఱ్ఱ్యవస్త్రాలను ధరించేవారు. ప్రతివ్యక్తి మూడువస్త్రాలను ధరించేవాడు. అందులో శరీరాన్నంటిపెట్టుకొని ఉండే వస్త్రానికి 'వాస' మనిపేరు. పైన ఉత్తరీయంగా ధరించే వస్త్రం అధివాసమని పేర్కొనబడింది. వాసానికి లోపలధరించబడేదానికి 'నీవి' అని పేరు. స్త్రీలు తమతమ శరీరాలకు అనుగుణంగా వస్త్రాలను కుట్టి ధరించేవారు. కుట్టడం, దారం వడకడం, రంగు దారాలతో చిత్రవిచిత్రంగా కుట్టడం స్త్రీలపనులు (శ.బ్రా. 3.2.1.10).ఇతరులనాకర్షించడానికి మంచి వేషం అవసరమని శతపథం

(13.4.1.10) చెబుతోంది. బంగారు, వెండిదారాలతో వస్త్రాల అంచులను చిత్రాలతో కుట్టేవారు (ఐ. బ్రా. 2.11.10). యజ్ఞయాగాదులలో అన్వయించే ఋత్విక్కులకు పురోహితులకు ప్రత్యేకమైన వేషముంది. వీరి వస్త్రాల్లో వాసం ఉన్నితోను, అధివాసం సిల్కుతోను చేయబడేవి. ఇవికాక వారు తలపాగాగూడ ధరించేవారు. రాజులు, రాణులు కూడ రంగు రంగుల తలపాగాలను ధరించేవారు. (శ. బ్రా. 14.2.1.8). ఋషులు, బ్రహ్మచారులు కృష్ణాజినాన్ని ధరించేవారు.

సైనికులేగాక ఇతరులుగూడ కవచాలను ధరించేవారు. ఈ కవచాలు ఇనుముతోను (శ. బ్రా. 3.4.4.23), వెండితోను (3.4.4.24), బంగారంతోను కూడ (3.4.4.25) చేయబడేవి. మెత్తటి ఆసనాలు, కుర్చీలు కూడా వారు ఉపయోగించేవారు (శ. బ్రా. 13.4.3.1; ఐ. బ్రా. 7.33.6). ప్లక్షవృక్షంయొక్క నారుతో చేయబడే చాపలనుపయోగించారు. తలగడలు గూడ వారికి తెలును.

బంగారు, వెండిఆభరణాలను ధరించేవారు (శ. బ్రా. 13.8.3.11). వజ్రాలహారాలను గూడ అప్పటి రాణులు ధరించేవారు (శ.బ్రా. 13.2.6.8). ఇంతేకాదు బంగారపు ఇటుకలు, బంగారుపళ్లేలు, బంగారుగిన్నెలు, బంగారుకత్తులు ఈ విధంగా రాజులు ఉపయోగించేవన్నీ సామాన్యంగా బంగారుమయంగా ఉండేవి (శ. బ్రా. 6.12.30).

**ఆహారపానీయాలు** : బియ్యం, గోధుమలు ప్రధానమైన ఆహారం. బియ్యంతో చేసిన వంటలు ధాన, కరంభ, పరివాప, పురోడాశ, పయస్యాలు ఐతరేయంలో (2.8.5) పేర్కొబడ్డాయి. గంజి కూడ (శ. బ్రా. 12.7.2.8) ఉపయోగించబడింది. తాండ్య బ్రాహ్మణంలో (3.8.15) బియ్యంచేత వండబడే పదార్థాలు పృథుక, సక్తు, లాజ, ధాన, మసూస్యాలు ఉల్లేఖించబడ్డాయి.

పాలచే తయారుచేయబడే అనేకరకాల ఆహారాలు బ్రాహ్మణాలలో వర్ణింప బడ్డాయి. దుగ్ధం, పయస్సు, ఆజ్యం, ఆమిక్షా (మీగడ), దధి, వాజి, కరంభ (కోవా), ఘృత, నవనీత, సాన్నాయ్యం (పాలు పెరుగు మిశ్రమం), శ్రిత (కాచినపాలు), శర (తొరక), మొ॥ పాల నుండి తయారుచేయబడే ఆహారాలు.

ఉదుంబర, అశ్వత్థ, ప్లక్ష, ఇక్షు, కువల, కరన్ధు, బదర, కదళ్యాది ఫలాలు పేర్కొనబడ్డాయి (శ. బ్రా. 3.4.1-8; ఐ. బ్రా. 7.54.4). మాంసం ఆహారంగా అందరిచేత గ్రహింపబడేది. అతిథి సత్కారం గోమాంసంతోగాని, అజామాంసంతో గాని చేయాలని శతపథం (3.4.1.2) చెబుతోంది. అన్ని ఆహారాలలోను మాంసం శ్రేష్ఠమని శతపథం (11.7.2.1) చెబుతోంది.

పండ్లరసాలతోబాటు సోమం, సుర, తేనె, పాలు అప్పటి పానీయాలు. సుర కొన్ని ఓషధులచేత తయారుచేయబడేది. బియ్యం చేత గూడ సుర తయారుచేయబడేది (శ. బ్రా. 12.8.1.4; ఐ. బ్రా. 8.8). ఈ సుర కాక పరిస్రుతమనే మరొక పానీయముండేది (శ. బ్రా. 5.1.2.14). ఆహారం మరీ ఎక్కువగాకుండాను, తక్కువగాకుండాను సమంగా తీసుకోవాలనే నియమం శతపథంలో (10.4.1.4) ఉంది.

**పాత్రలు :**

చర్మపుసంచి (శ. బ్రా. 1.1.2.7), కొయ్యజాడీ (శ. బ్రా. 1.1.2.8), జల్లెడ (శ. బ్రా. 1.1.3.1), రోలు-రోకలి (శ. బ్రా. 1.1.4.7), కొయ్య కత్తి, చాట (శ. బ్రా. 1.1.4.8), ఇనుపమూకుడు (శ. బ్రా. 13.3.4.5), పళ్లెం, కుండ మొదలైనపాత్రలు పరికరాలు వారుపయోగించారు. అలాగే అశ్వమేధంలో బంగారంతోను, వెండితోను, రాగితోను చేసిన మూడు సూదులను ఉపయోగించారు (శ. బ్రా. 13.2.2.16). పాత్రలు మట్టి, ఇనుము, కంచు, వెండి, బంగారం కొయ్యలతో చేయబడ్డాయి.

వైద్యం :

ఆయుర్వేదం అప్పుడు బాగా ప్రచారం పొందింది. వేడి, సూర్యరశ్మియే మందుగా కీర్తించబడింది (ఐ. బ్రా. 1.5.2). ప్రకృతి వైద్యమే అప్పుడు ప్రచారంలో ఉండేది. దెబ్బలు, కోతలు, కురుపులు మొదలైనవాటికి లేపనాలు (Ointments) తయారుచేయబడేవి (శ. బ్రా. 3.1.3.7). చింతపండు, పెరుగు మొదలైనవానిని ఉపయోగించి వాంతులను, విపరీతంగా సురాదిపానాలవల్ల కలిగిన దోషాలను పోగొట్టేవారు (ఐ. బ్రా. 2.8.4). జంతుశరీరశాస్త్రంలో అప్పటివారు మహాపండితులు. పశుయాగాన్ని పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది (శ. బ్రా. 13.8.1.16), గండమాల (ఐ. బ్రా. 1.4.8), జలోదరం (ఐ. బ్రా. 7.33.3), యక్ష్మ మొదలైన రోగాలు పేర్కొనబడ్డాయి.

వ్యవసాయం :

వైదిక ఆర్యుల ముఖ్యవృత్తి వ్యవసాయం. ఇది బాగా శతపథంలో (1.6.1.3) వర్ణించబడింది. వ్యవసాయంవల్ల పెరిగిన మొక్కలు గ్రామ్యఓషధులనీ, అరణ్యంలో మనుష్యప్రయత్నంలేకనే మొలచినవాటిని అరణ్యఓషధులని పేర్కొనేవారు (శ. బ్రా. 11.1.7.2). ఆవుపేడ ఎరువుగా వాడబడేది (శ. బ్రా. 2.1.1.7). ఎడ్లు, ఆవులు వ్యవసాయానికెక్కువ ఉపయోగపడుతుండేవి. అందుచేత పశువులే సర్వస్వంగా పరిగణించబడేవి (శ. బ్రా. 3.1.4.14; 3.7.3.13).

వృత్తులు :

బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల వృత్తుల గురించి ఇంతకుముందే చర్చించబడింది. అనులోమ ప్రతిలోమ వివాహాలవల్ల శూద్రులలో చాలా ఉచ్చనీచజాతులు పుట్టాయి. ఆయా జాతులలాగా వారి వారి వృత్తులుగూడ చాలా రకాలు. వాజసనేయసంహితలో ఇలాంటి వృత్తులు దిగ్విక్పైగా

నిరూపించబడ్డాయి. అవే ఈకాలంలో గూడ ప్రచారంలో ఉన్నట్లు తెలియాలి. మగధ (మంత్రి), శైలూష (నటుడు), సూత (రథచోదకుడు), సభాకార (సభాసమితులలో సభ్యుడు), రథకార (రథాలను తయారుచేసేవాడు), తక్ష (వడ్రంగి), కులాల (కుమ్మరి), కర్మార (కమ్మరి), మణికార (స్వర్ణకారుడు), వాప (మంగలి), ఇషుకార (బాణాలను చేసేవాడు), ధనుష్కార (ధనుస్సులను చేసేవాడు), జ్యాకార (అల్లెత్రాడు తయారుచేసేవాడు), రజ్జుసర్జ (త్రాడు పేనేవాళ్లు), మృగయు (వేటగాడు), శ్వని (కుక్కలను వేటకు సిద్ధంచేసేవాడు), పుంజిష్ఠ (పిట్టలను పట్టేవాడు), విదలకారి (బుట్టలల్లేవాడు), కంటుకీకరి (ముళ్లలో పనిచేసేది), పేశస్కరి (ఎంబ్రాయిడరీచేసేది), భిషజ (వైద్యుడు), నక్షత్రదర్శ (జ్యోతిష్కుడు), హస్తిప (మావటివాడు), అశ్వప (గుఱ్ఱాలను చూసేవాడు), గోపాల (ఆలమందలకాచేవాడు), అవిపాల (గొఱ్ఱెలకాపరి), అజపాల (మేకలకాపరి), కీనాశ (వ్యవసాయదారుడు), సురాకార (మద్యం తయారుచేసేవాడు), గృహప (ఇళ్లను రక్షించేవాడు), క్షత్త (రథికుడు), అనుక్షత్త (రథికసహాయకుడు), దార్వాహార (కట్టెలమ్మేవాడు), పేష్ట (ప్రతికృతి తయారుచేసేవాడు), వాసపల్పులి (చాకిత), రజయిత్రి (పాలెయువతి), పిశున (గూఢచారి), క్షత్త (ద్వారపాలకుడు), అనుక్షత్త (ద్వారపాలక సహాయకుడు), అశ్వసాద (అశ్వపాలకుడు), భాగదుఘ (పన్నులను వసూలు చేసేవాడు), అంజనీకారి (అంజనాలను, ప్రసాధనద్రవ్యాలను చేసేది), కోశకారి (కత్తిఒరలను తయారుచేసేది), అజినసన్ధ (జింకచర్మం తయారుచేసేవాడు), చర్మార (చర్మాన్ని బాగుచేసేవాడు), ధీవర (బెస్త), శౌష్కల (ఎండుచేపలను అమ్మేవాడు), హిరణ్యకార (కంసాలి), వణిజ (వర్తకుడు), వనప (అడవులను రక్షించేవాడు), వీణావాద (వీణను వాయించేవాడు), తూణవధ్మ (వేణువాదకుడు), శంఖధ్మ (శంఖపూరకుడు), వంశవర్తి (దొమ్మరి), గ్రామణి (గ్రామపెద్ద), గణక (జ్యోతిష్కుడు) అభిక్రోశకులు (ప్రచారకుడు) అందులో

పేర్కొనబడ్డారు. వీరందరు బ్రాహ్మణాలలో పేర్కొనబడనప్పటికీని, ఈ వృత్తులవారందరు బ్రాహ్మణకాలంలో ఉన్నట్లు ఊహించవచ్చు[1].

వాణిజ్యం :

వైశ్యులకు వ్యవసాయం, వాణిజ్యం వృత్తులని ముందే చెప్పుకున్నాం. వైశ్యులలో పెద్ద 'శ్రేష్ఠి' అని వ్యవహరించబడతాడు. ఎంబ్రాయిడరీ చేసిన దుస్తులు, ఉన్నిదుస్తులు, తలపాగలు, లేడి చర్మాలు, మేకచర్మాలు, ఉన్ని, బంగారు వెండి ఆభరణాలు, ఆహార ధాన్యాలు, పశువులు, బంగారు, వెండి మొదలైనవన్నీ అమ్మబడుతూ కొనబడుతూ ఉండేవి. బంగారుకాసులు (నిష్కాలు) ఇందులో ఉపయోగించబడేవి. బ్రాహ్మణకాలంలో సముద్రయానంకూడ ఉంది. వ్యాపారం విదేశాలలోకూడా జరిగేది. వడ్డీవ్యాపారంకూడా అపుడు ప్రచారంలో ఉన్నదే (ఐ. బ్రా. 5.23.1; శ. బ్రా. 13.4.3.11).

వాహనాలు :

వాణిజ్యానికి, ప్రయాణానికి ఉపయోగించే వివిధవాహనాలు బ్రాహ్మణాల్లో పేర్కొనబడ్డాయి. గుఱ్ఱాలచేత, అశ్వతరులచేతను (గుఱ్ఱాలతో సమానమైనవి) లాగబడే రథాలు, ఎడ్లబళ్ళు ప్రధాన వాహనాలు. రథాలయొక్క వివిధావయవాలు తాండ్యబ్రాహ్మణంలో (1.5.12.5) వర్ణించబడ్డాయి.

జలమార్గంలో ఉపయోగించే పెద్ద చిన్నపడవలు నౌకలుగాను, నావలుగాను వ్యవహరించబడ్డాయి. ఇంతేకాక సముద్రప్రయాణానికై ఉపయోగించే బలిష్ఠమైన పడవలుకూడ అప్పుడు ఉన్నాయి. అలాంటి వాటికి

1. I. A. B. PP. 72-73.

శైరావతు' అని పేరు (ఐ. బ్రా. 1.3.2; 6.29.5). శత పథంలో (3.5.1.14) పడవలయొక్క, ఓడలయొక్క వివిధావయవాలు వర్ణించబడ్డాయి.

### గృహ-రథ్యానిర్మాణం :

బ్రాహ్మణకాలంలో గృహనిర్మాణకౌశలం ఒకస్థాయికి చేరింది. అనేకరకాలైన గృహాలు, కోటలు, పట్టణాలు, బ్రాహ్మణాలలో పేర్కొనబడ్డాయి (శ. బ్రా. 13.5.1.11; ఐ. బ్రా. 1.4.6). అనేక శిల్పకళలలో, జ్యామితిలోను వారు నైపుణ్యం కలవారు. యజ్ఞవేదికలను వివిధాకృతులలో నిర్మించటం వారికి వెన్నతో బెట్టిన విద్య. అలాగే రాజపథాలను మహాపథాలను అప్పటివారు నిర్మించారు (ఐ. బ్రా. 18.3).

### లోహాలు :

బంగారం, వెండి (ఐ. బ్రా. 7.32.11), కంచు (ఐ.బ్రా. 6.30.1), ఇనుము, సీసం, రాగి (శ. బ్రా. 12.7.1.17; 5.4.1.2) వాడబడ్డాయి.

### వృక్షాలు :

వృక్షాలకు ప్రాణం, చైతన్యం ఉందని వారికి తెలుసు (శ. బ్రా.9.2.3.3). వృక్షంలో వివిధభాగాలు వాజసనేయ (22.28), తైత్తిరీయ (7.3.20.1) అథర్వ (8.7.4) సంహితలలోనే వర్ణింపబడ్డాయి. శీతదారు, పలాశ, న్యగ్రోధ, ప్లక్ష, అశ్వత్థ, ఉదుంబర, బిల్వ, ఖదిరాలు ఐతరేయ శతపథ తైత్తిరీయ బ్రాహ్మణాలలో చెప్పబడ్డాయి. ఇందులో న్యగ్రోధం తిన్నగా పెరగదట (శ. బ్రా. 13.2.7.3). శాల్మలీవృక్షమే (బూరుగుచెట్టు) అన్నిటికంటే ఎత్తుగాపెరుగుతుందట (శ. బ్రా. 13.2.7.4). శమీవృక్షం (జమ్మిచెట్టు)లో అగ్ని ఉంటుందట. ఇలా ఆయా చెట్ల ప్రత్యేకతలుగూడ బ్రాహ్మణాలలో వర్ణింపబడ్డాయి. పైన చెప్పబడ్డ

వృక్షాల్లో ఉదుంబర, ఖదిర, బిల్వ, పలాశాలు పవిత్రాలు. ఇవేకాక శతపథంలో కార్ష్మరి, వికంకట, విభీతక, అర్కాదిమొక్కలు అశ్వగంధ, అర్క, అపామార్గ మొదలైన ఓషధులు (శ. బ్రా. 13.8.1.16) పద్మాలు బ్రాహ్మణాలలో ఉల్లేఖింపబడ్డాయి.

మృగాలు :

ప్రసిద్ధమైన గోవులు, గుఱ్ఱాలు, ఎద్దులు, లేళ్ళు కాక ఇతర జంతువులు కూడా శతపథంలో చెప్పబడ్డాయి. అవి ఉష్ట్ర (1.2.39), శల్యక (2.6.4.5), వృక (5.1.5.22), జంభయన్త అహి (5.1.5.22), గజ (3.1.3.4), కూర్మ (6.1.1.12), సింహాలు (5.5.4.10). ఐతరేయంలో శరభమృగం (2.6.8) పేర్కొబడింది. అలాగే గవయమృగం కూడ శతపథ ఐతరేయాలలో పేర్కొనబడింది. పిల్లి చాలా సార్లు పేర్కొనబడింది. 'ఓతుసారి' యని ఇది పిలువబడింది. అలాగే కప్పలు, ఎలుకలు, అడవికుక్కలు, పులులు కూడా బ్రాహ్మణాలలో ఉల్లేఖింపబడ్డవే.

సర్పాలు :

విర్దంశి, స్వజ, మంథావాల, అంధసర్ప, గండూపద, శాకల, జంభయన్త అహి (dragon), మహాఅహి మొదలైన సర్పభేదాలు వర్ణింపబడ్డాయి (ఐ. బ్రా. 3.13.2, 3.14.5). అలాగే గోధాకృకలాశాలుకూడ (జై. బ్రా. 1.22.1) వర్ణించబడ్డాయి.

పక్షులు :

హంస (శ. బ్రా. 6.7.3.11), కలవింక (శ. బ్రా. 1.6.3.4), తిత్తిరి (శ. బ్రా. 1.6.3.5), వాజ, కపింజల (శ.బ్రా. 1.6.3.3; 13.5.1.13) శ్యేన, సువర్ణ కృకవాయు మొదలైనవి బ్రాహ్మణాలలో ఉల్లేఖితాలు.

**కీటకాలు :**

తేనెటీగలు, ఎఱ్ఱ-నల్లచీమలు (శ. బ్రా. 6.6.3.6) వర్ణించబడ్డాయి.

**మతం - ధర్మం :**

బ్రాహ్మణాలు యజ్ఞాల గొప్పదనాన్ని, యజ్ఞస్వరూపస్వభావాలను తెల్పటానికి అవతరించాయి. ఆయా వర్ణాలవారు ఆయా యజ్ఞాలను చేసి దేవతలను సంతృప్తిపరచి, వారినుంచి ఇష్టాలను పొందాలని ప్రజలను ఇవి ఆదేశిస్తున్నాయి. ఇదే అప్పటి ధర్మం. గృహస్థుడైనవాడు ప్రతిదినం చేయాల్సిన ఐదు యజ్ఞాలకు పంచ మహాయజ్ఞాలనిపేరు. ఇవి ప్రతిదినం తప్పక చేయవలసినవి (శ. బ్రా. 11.5.6.1). అవి బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. స్వాధ్యాయమైన వేదాన్ని ప్రతిరోజు వల్లెవేయటం బ్రహ్మయజ్ఞం. దేవతలకు హోమంద్వారా ఆజ్యాది సత్కారాల నివ్వటం దేవయజ్ఞం. పరలోకగతులైన తండ్రులకు తర్పణం పితృయజ్ఞం. అతిథిఅభ్యాగతులసేవ మనుష్యయజ్ఞం. క్రిమికీట కాదులకై అన్నాన్ని వేయటం (ఉదయం, సాయంకాలం, హోమసమయంలో) భూతయజ్ఞం.

బ్రాహ్మణకాలంలో విష్ణువుకు రుద్రునికి ప్రాధాన్యత హెచ్చింది. సూర్యుడుకూడ విష్ణుస్వరూపంగా బ్రాహ్మణాలలో వర్ణించబడ్డాడు. వైష్ణవభక్తి మార్గానికి బీజావాపం బ్రాహ్మణకాలంలోనే పడిందన్నమాట. అలాగే తైత్తిరీయ-వాజసనేయ సంహితలలోని రుద్రాధ్యాయాన్నాధారంగా తీసుకొని శతరుద్రీయాది యాగాలవల్ల రుద్రునికి కూడ ప్రాముఖ్యత పెరిగి రుద్రశివులకభేదం ఏర్పడింది. దీనివల్ల రుద్రుని గూడ ప్రధానదైవంగా ఆరాధించే మార్గానికి కూడ బీజం ఆకాలంలోనే పడిందని చెప్పవచ్చు.

ఈ విధంగా రెండు మార్గాలకు ప్రారంభం జరిగినప్పటికీ పరదైవతమొక్కటే అనీ, అదే ఎన్నో పేర్లతో పిలువబడుతోందనే విశ్వాసం అప్పటి ఆర్యులలో గూడుకట్టుకుంది.

— కె. ఏ. ఆర్. కె.

## 1. 12 ప్రకృతి

### ప్రకృతి అంటే ఏమిటి ?

చరాచరాత్మకమైన సృష్టిఅంతా ప్రకృతి అని పిలువబడుతుంది. పంచభూతాలు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, నదులు, సముద్రాలు, పర్వతాలు, అరణ్యాలు, అందులోఉండే వృక్షాలు, లతలు, మనుష్యులు, పశువులు, పక్షులు ఇవన్నీ ప్రకృతిలోని భాగాలే. మానవుడు ఈ భూమిమీద పుట్టినప్పటినుంచి తన అవసరాలు తీర్చుకోవటానికి ప్రకృతిమీదనే ఆధారపడ్డాడు. ప్రకృతి ప్రసాదించిన పండ్లు, ఆకులు, పూలు, దుంపలు మొదలైనవే అతని ఆహారం. అతడి నివాసం చెట్ల నీడలు, పొదరిళ్లు, పర్ణశాలలు. ఆకులు, చెట్లబెరడు, నారచీరలు అతనిదుస్తులు. ఈ మూడు అతనికి అతిముఖ్యమైన అవసరాలు. ఇంతే కాక ఆ ఆదిమమానవుని ఆయుధాలు; కర్ర, రాతిగద, ధనుస్సు, బాణాలు ఇవన్నీ ప్రకృతినుంచి సంపాదించినవే. అతడు ప్రాణంతీసే విషాన్ని, ప్రాణంపోసే ఓషధులను కూడ ప్రకృతినుంచే సంపాదించాడు.

### ఈజగత్తెలా పుట్టింది ?

మానవుని బ్రతుకుకు మూలాధారమైన ఈ ప్రకృతి సృష్టిని గురించి గోపథబ్రాహ్మణంలో వివరంగా చెప్పబడింది. స భూయోఽ శ్రామ్యత్ .... .... .... యమ్ ఏవం వేద (గో. బ్రా. 1.2.3) బ్రహ్మమనస్సులో సృష్టిచేయాలనే కోరిక కలిగింది. వెంటనే ఆయన నీటిని సృష్టించి అందులో తనవీర్యాన్ని ఉంచాడు. దానినుంచే ఈ జగత్తు అంతా ఆవిర్భవించింది. తూర్పు మొదలైన దిక్కులు ఉద్భవించాయి. బ్రహ్మయొక్క మనస్సునుంచి చంద్రుడు, గోళ్లనుంచి నక్షత్రాలు, రోమాలనుంచి ఓషధులు మొదలైనవన్నీ పుట్టాయని ఇక్కడ గోపథ

బ్రాహ్మణం వివరిస్తోంది[1]. తైత్తిరీయోపనిషత్తులో బ్రహ్మనుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీటినుంచి భూమి, భూమినుంచి ఓషధులు, ఓషధులనుంచి అన్నం, అన్నంనుంచి జీవుడు జన్మించినట్లుగా సృష్టిక్రమం వర్ణింపబడింది[2].

నదీజలాలు :

సృష్టిలో అన్నీ అవసరమైనవే అయినా మనిషికి నీటి అవసరం చాలా ఎక్కువ. నీరు లేకపోతే మనిషి జీవించలేడు. త్రాగటానికి, స్నానానికి, వ్యవసాయానికి అన్నిటికీ నీరేకావాలి. నీరు త్రాగటం దప్పికతీర్చుకోవటానికే అయినా కొన్ని ప్రత్యేకమైన పద్ధతుల్లో అంటే; ఆచమనం మొదలైన పద్ధతులతో తీసుకుంటే ఆ జలం పాపాన్ని పోగొడుతుంది. ఈ విషయాన్ని గోపథబ్రాహ్మణం స్పష్టంగా చెబుతున్నది[3]. నీరు బావులు, చెరువులు, నదులు, సముద్రాలు ఇలా అనేకరూపాలలో గోచరిస్తుంది. ఒక్క సముద్రజలం తప్ప మిగిలినదంతా త్రాగటానికి యోగ్యమైనదే. వాటిలోకూడ నదీజలం శ్రేష్ఠమని వేదం చెబుతున్నది. మనకు గంగ, యమున - ఇలాగే మరికొన్ని నదులపేర్లు తెలుసు. ఆశ్చర్యమేమిటంటే; ఈ నదులపేర్లు కొన్ని వేదంలో కూడా కనబడతాయి. అంతేకాదు, వాటి ప్రశంసకూడా అందులో మనం చూడవచ్చు. తైత్తిరీయంలోని నారాయణంలో అఘమర్షణ స్నానఘట్టంలో 'ఇమం మే గంగే యమునే సరస్వతి' అని చెప్పబడింది. ఇక్కడ గంగ యమున సరస్వతి అనే మూడు నదులపేర్లతో బాటు వాటియొక్క గొప్పతనం, వాటిలో స్నానంచేస్తే కలిగే ప్రయోజనం కూడా చక్కగా చెప్పబడ్డాయి. నదీస్నానంవల్ల

---

1. మనస ఏవ చన్ద్రమసం ... ... ... కురుతే గో. బ్రా. 1.12.
2. ఆకాశాద్వాయుః వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ, పృథివ్యా ఓషధయః. ఓషధీభ్యోఽన్నం. అన్నాత్పురుషః తై. ఉ. 2. 1.
3. యదాచామతి త్రిరాచామతి ... ... ... పాప్మానం నిర్ణుదతి గో. బ్రా. 1.39.

మాన్ద్యం, అలసత్వం, మొదలైన శారీరక మానసిక రుగ్మతలు, పాపాలు పోతాయి. ఉత్సాహం, శక్తి కలుగుతాయి. తలవకారబ్రాహ్మణంలో (1.82) 'పనతీవరీ' అని పిలువబడే పుణ్యనదీజలం జీవహింసవల్ల కలిగే పాపాన్ని పోగొట్టి పుణ్యాన్ని సమకూరుస్తుందని చెప్పబడింది.

**రెండు పంటలు :**

నదీజలాలు ఇందుకేకాక వ్యవసాయానికి బాగా ఉపయోగపడతాయి. ఆనకట్టలు కట్టడం, కాల్వలు త్రవ్వటం, సేద్యపునీటి ఫారుదల ఇవన్నీ మనం ఎవరివో క్రొత్తగాచూసి నేర్చుకొన్నవికావు. ఇవన్నీ మనవేదాలలోనే ఉన్నాయి. మనమే వాటిని ఇతరులకు నేర్పాం. వేదంలో ధాన్యం రెండు రకాలుగా ఉంటుందని చెప్పబడింది. 'కృష్టపచ్యాశ్చ మేఽకృష్టపచ్యాశ్చ మే' (తై. సం. 4.7.5). 'కృష్టపచ్యం' అంటే భూమిని దున్ని (వ్యవసాయంచేసి) పండించిన పంట. 'అకృష్టపచ్యం' అంటే ఏ ప్రయత్నమూ లేకుండా ప్రకృతియే పండించి ఇచ్చిన పంట. మొదటిదానికి వడ్లు, గోధుమలు, యవలు, మినుములు, నువ్వులు, శనగలు మొ॥ ఉదాహరణ. ఇక నీవారం, వెదురుబియ్యం మొ॥ రెండవతెగకు చెందినవి. అంటే అరణ్యంలోపండే వన్నమాట. కొన్నిరకాల ధాన్యాలు అడవిలోను, పంటపొలాల్లోనూ పండుతాయి. నువ్వులు (గ్రామ్యతిలలు) పొలంలో పండే నువ్వులు (ఆరణ్యకతిలలు) అరణ్యంలోపండే నువ్వులు అని రెండురకాలుగా ఉన్నట్లు వేదం చెప్తున్నది. **'పశవ ఆరణ్యాశ్చ యజ్ఞేన కల్పన్తామ్'** (తై. సం. 4.7.5).

**క్రొత్తరకం విత్తనాలు :**

మనం ఈనాడు కొత్తకొత్త విత్తనాలను తయారుచేసుకుంటున్నాం. వరివంగడాలలో అనేకరకాలు వచ్చాయి. ఐదునెలలలో నాలుగునెలలలో, చివరకు తొంభైరోజులలో పండేవరిని కూడా కనుక్కున్నాం. అయినా

ఇంకెంతో తెలుసుకోవలసింది ఉంది. వేదంలో 'ఆశూనం వ్రీహీణాం' (తై. సం. 1.8.10) అని చెప్పబడింది. ఈ 'ఆశువ్రీహి' అనేపదాన్ని వివరిస్తూ విద్యారణ్యుడు 'షష్టిభిర్దివసైః పచ్యమనా ఆశువ్రీహయః' అని చెప్పాడు. అంటే: అరవైరోజుల్లో పండే వరిని 'ఆశువ్రీహి' అని పిలిచేవారన్నమాట. ఇంకా ఇలాంటి విషయాలెన్నో వేదంలో ఉన్నాయి. వాటిని మనం తెల్సుకుంటే విజ్ఞానరంగంలో మనం ముందంజవేయవచ్చు. గాదె (తై. సం. 5.1.11), చేట (తై. సం. 1.6.8), రోకలి (తై.బ్రా. 3.8.4), తిరుగలి (తై.సం.7.2.1)- ఇలాంటి వ్యవసాయవిజ్ఞానానికి సంబంధించిన పదాలెన్నో తైత్తిరీయంలో ఉన్నాయి.

**సముద్రపు నీళ్లెందుకు ఉప్పగా ఉంటాయి?**

సముద్రజలం నిరుపయోగం. కారణం అది ఉప్పగా ఉంటుంది. నదులు సముద్రంలో కలుస్తాయి. నదీజలాలు తియ్యనివి. తియ్యని నదీజలాలుచేరిన సముద్రం ఉప్పగా ఎందుకు ఉంటుంది? అంటే దానికి ప్రకృతే కారణమని చెప్పాలి. దీన్ని గురించి గోపథబ్రాహ్మణం ఇలా అంటున్నది. సృష్టికర్త నీటిని సృష్టించి అందులో తన ప్రతిబింబాన్ని చూసుకొన్నాడు. ఆ సమయంలో ఆయన వీర్యం జలంలో ప్రవేశించింది. ఆప్రాంతంలోని నీరంతా వేడెక్కి ఉప్పగా తయారయింది[1]. 'సముద్రస్య త్వా వా కయాగ్నే పరివ్యయామసి' అనే ఈ తైత్తిరీయ వాక్యం సముద్రసారమే ఈ 'అవక్త' అంటే నాచుగా ఏర్పడినట్లు చెప్తున్నది. ఇదివేడిని పోగొట్టే గుణం కలది.

1. తా ఆపః సృష్ట్వాఽన్వైక్షత, తాసు స్వాం ఛాయామపశ్యత్, తామస్యేక్షమాణస్య స్వయం రేతోఽస్కన్దత్తదప్సు ప్రత్యతిష్ఠత్. తమసాత్ తాః శ్రాన్తాస్తప్తాః - రేతసా ద్వైధ మభవంస్తాసామన్యా అన్యతరా అతిలవణా అపేయాః గో.బ్రా. 1.3.

పర్వతాలు - ఓషధులు :

భారతదేశంలో అనేక పర్వతాలున్నాయి. వీటిలో హిమవత్పర్వతం మొ॥ కొన్ని ప్రపంచప్రసిద్ధిగాంచినవి. వేదంలోకూడా హిమవత్పర్వతంయొక్క వర్ణన ఉన్నది[1]. ఈ హిమవత్పర్వతం మహోన్నతమైంది. రత్నరాసులకు నిలయం. అంతేగాక పైవాక్యాన్ని బట్టి ఆ హిమవత్పర్వతంపైన 'సీబల' అనే ఓషధి దొరుకుతుందని తెలుస్తుంది. భాష్యంలో విద్యారణ్యుడు **'కాచిత్ వల్లీరూపా ఓషధిః హిమవత్సానుషూత్పద్యతే'** సీబల ఒకలత (తీగ). ఇది హిమవత్పర్వతం చెరియలపైన పుడుతుందని వివరించాడు. ఈ ఓషధి గుండె జబ్బులను పోగొడుతుందనికూడా పైశృతివాక్యమే చెప్తున్నది. ప్రకృతి సౌందర్యంలో మనస్సును ఆకట్టుకొనే ఈ పర్వతం ఆనందంతోపాటు ఆరోగ్యాన్నికూడా అందిస్తున్నదన్నమాట.

సూర్యుడు :

ప్రతిరోజూ సూర్యుడు ఉదయిస్తూ అస్తమిస్తూ ఉంటాడు. ఈసమయాన్నే 'సంధ్యాసమయం' అంటారు. ప్రకృతిలోని అందచందాలన్నీ ఈ సంధ్యాసమయంలో మరింత ప్రకాశిస్తాయి. కన్నుల పండుగ చేస్తాయి. ఈ సంధ్యను గూర్చి 'షడ్వింశబ్రాహ్మణం' లో వివరంగా చెప్పబడింది (5.5). మనోహరమైన ఈ సంధ్యాసమయం అతిరమణీయమైనదేకాక ఎంతో విలువైనది. ఆ సమయంలో సూర్యుణ్ణి ధ్యానించడం చాల మంచిది. పగలు-రాత్రియొక్క సంధికాలం కాబట్టి దీన్ని సంధ్యాకాలమని అంటారట **'సంధౌ భవా సంధ్యా'** (5.5).

---

1. యత్తే సుజాతే హిమవత్సు భేషజం మయోభూః శంతమా యద్హృదోసి తన్నో దేహి సీబలే తై. బ్రా. 2.5.6.

**చంద్రుడు :**

ప్రకృతిలో అందరికన్నా అందగాడు చంద్రుడు. అందుకే మనం అందమైన ముఖాన్ని చంద్రునితో పోలుస్తాం. 'షడ్వింశబ్రాహ్మణం'లో ఈ చంద్రుని గురించి శుక్ల, కృష్ణపక్షాలను గురించి ఉన్నది[1]. దేవతలు సోమాన్ని (సోముణ్ణి) త్రాగటంచేత చంద్రకళలు తరిగిపోయి కృష్ణపక్షం ఏర్పడుతున్నది. మళ్లా శుక్లపక్షంలో చంద్రుడు ఓషధులు, వనస్పతులు, గోవులు మొదలైన వాటినుంచి తిరిగి తన కళలను సమకూర్చుకుంటుంటాడు.

**రావిచెట్టుకెందుకు ప్రదక్షిణాలు ?**

ప్రకృతినుంచి అనేకలాభాలను పొందటంవల్లనే మనిషి దైవంగా భావించి ఆరాధించటం మొదలుపెట్టాడు. రావిచెట్టుకి ప్రదక్షిణంచేస్తే పుణ్యమని మనపెద్దలు అంటారు. ఇటీవల భౌతిక శాస్త్రజ్ఞులు రావిచెట్టుచుట్టూ తిరగటంవల్ల కొన్ని విద్యుత్తరంగాల వంటివి మానవశరీరంలోనికి ప్రవేశించి వేడిని కలిగిస్తాయని కనుక్కొన్నారు. ఇందువల్ల స్త్రీలలో గర్భపాతదోషం నశించి సంతానం పొందటానికి అవకాశముంది. తైత్తిరీయబ్రాహ్మణం (1.13) అగ్ని ఈ చెట్లో ఒకసంవత్సరం నివసించాడు అని చెప్పింది. అందుచేత ఇది వేడిగుణం కలదని చెప్పడం సమంజసమేననిపిస్తున్నది. ప్రకృతి అంటే మనిషికి భయంకూడా ఉంది (తై. బ్రా. 2.5.5). ఈ అరణ్యాల నుంచి పండ్లు, పూలు, మంచిగంధం, కర్పూరం లభిస్తాయని క్రూరమృగాలవల్ల ప్రమాదం ఉంటుందనికూడ ఇక్కడ వర్ణించబడింది.

**జంతువులు :**

బ్రాహ్మణాల్లో అనేక జంతువుల వివరాలున్నాయి. యజ్ఞాలలో మేక మొ॥ పశువులు ఉపయోగింపబడటం మనకు తెలిసిందే. ఆవు పాలు,

1. అథైసా చంద్రమాసః క్షయవృద్ధిర్భవతి . . . . . . . చంద్రమా వై ధాతా 5-6

పెరుగు, నెయ్యి ఇవన్నీ హోమానికి పనికివస్తాయి. అశ్వమేధయాగానికి గుఱ్ఱంకావాలి. తై. బ్రా. (2.5.5)లో గవయం అనే మృగం చెప్పబడింది. ఇది ఇంచుమించు ఆవులాగా ఉంటుందట. అగ్ని చయనంలో కప్పను (తై. సం. 4.1.6) ఉపయోగిస్తారు. తై. బ్రా (3.8.4) లో కుక్కను గురించిన ప్రస్తావన ఉన్నది. ఐతరేయ బ్రాహ్మణంలో (3.3.2) పాములు మొదలైన జంతువుల ఉత్పత్తిని గురించి వున్నది. ఈ బ్రాహ్మణం యజ్ఞానికి పనికివచ్చే పశువులను కూడా చెప్తున్నది (2.1.8). ఇంకా అనేక జంతువులను గురించి తై. సం. (5.5.11) నుంచి చాలా అనువాకాలలో వర్ణించబడింది.

పక్షులు :

ఐతరేయబ్రాహ్మణంలో (2.6.6) శ్యేనపక్షి (డేగ)ని గురించి చెప్పబడింది. తై. సం. (5.5.23)లో 'కుషీతక' మనే సముద్రపక్షిని గురించి '5.5.26' లో 'తిత్తిరి' అనే పక్షిని గురించి, '4.1.10' లో గరుడ పక్షినిగురించి వర్ణనలు ఉన్నాయి. తైత్తిరీయబ్రాహ్మణంలో (2.5.5) 'చిచ్చిక' అనే పక్షిని గురించి చిత్రంగా వర్ణించబడింది. ఇది అడవిలో నివసిస్తుంది. 'చిచ్చి' అనేశబ్దం చేస్తుందట.

ప్రకృతిసౌకర్యాలు :

ప్రకృతి మనిషికి అన్నాన్ని వస్త్రాన్ని నివాససౌకర్యాన్ని ఇస్తున్నది. మానవుడు తనప్రజ్ఞతో చెట్లనీడను మహాసౌధంగా, నార చీరను పట్టువస్త్రంగా మార్చుకున్నాడు. ఐతరేయబ్రాహ్మణంలో (1.34) ఈ క్రమికవికాసం స్పష్టంగా గోచరిస్తున్నది. ఇందులో 'ప్రాచీనవంశం' అనే వెదురుతో నిర్మింపబడే శాలను గురించి, సోమయాగంచేసే యజమానుడు ధరించే వస్త్రాన్నిగురించి చెప్పబడింది. మట్టికుండను (ప్రవర్గ్యపాత్ర) గురించి (5.1), ప్రకృతిలో భాగమైన జంతుజాలాన్ని

గురించి కూడా ఈ బ్రాహ్మణంలో (6. 8; 7. 7) వివరించబడింది. 'శల్మలీ' అనే వృక్షంనుంచి పట్టువస్త్రం తయారు చేయవచ్చునని తై. సం. (7.4.12) వివరిస్తున్నది.

**ఓషధీప్రభావం :**

ప్రకృతి మనకు అనేక దివ్యౌషధాలను ఇస్తున్నది. 'నక్తం జాతాస్యోషధే' 'కీలాసం చ పలితం చయత్' (తై. బ్రా. 2.4.4) 'నీలి' అనే ఓషధి నల్లగా ఉంటుంది. ఇది బొల్లి, జుట్టు నెరవటం (తెల్లబడటం) అనే రోగాలను పోగొడుతుందని ఈ మంత్రం చెబుతున్నది. ఉదుంబరవృక్షం (అత్తిచెట్టు) అన్నసారంనుంచి పుట్టటంచేత దాని పండు చాల పుష్టికరమైందని (తై. బ్రా. 1.2.1), శమీ (జమ్మిచెట్టు) అగ్నిని (జ్వరాన్ని) తగ్గిస్తుందని (తై. బ్రా. 1.1.9), అర్క (జిల్లేడు) వేడినిపుట్టిస్తుందని, దర్భ క్రిమికీటకాదులను నశింపచేస్తుందని (తై. బ్రా. 1.3.7), పద్మలతయొక్క దుంప (తై.బ్రా. 1.18) క్షయవ్యాధిని పోగొడుతుందని చెప్పబడింది. ఇంకా అనేక వృక్షలతాదులు, వాటి ప్రయోజనం ఇందులో స్పష్టంగా కనబడుతుంది.

**ప్రకృతి వైపరీత్యాలు - ఉపశాంతి :**

తల్లిలా కాపాడే ప్రకృతిదేవత ఒక్కొక్కసారి తనకోపాన్ని చూపెట్టడంవల్ల అతివృష్టి, వరదలు, భూకంపాలు మొ॥ ఏర్పడతాయి. వాటిని ఎదుర్కొనే విధానాన్ని షడ్వింశబ్రాహ్మణం సూచిస్తున్నది. భూకంపాలు, అకాలంలో చెట్లు పుష్పించి ఫలించటం, ఇలాంటి ప్రకృతివైపరీత్యాలు కనిపిస్తే, భూమికి అభిముఖంగా 'అగ్నిం దూతం వృణీమహే' (సా. సం. 2) అనేమంత్రాన్ని పఠించాలి. గుడ్లగూబలు ఇళ్లలో ప్రవేశించటం, ధూళి వానలాగా కురవటం, చెట్లు రక్తం కక్కటం, రాత్రిపూట ఇంద్రధనుస్సు కనబడటం మొ॥ జరిగితే, అంతరిక్షాన్నుద్దేశించి 'వాత ఆవాతు' (సా.సం. 184) అనే మంత్రాన్ని ఉచ్చరించాలి. ఇళ్లలో తేనెపుట్టలు పుడితే ఉత్తరపుదిక్కుకు తిరిగి నిలబడి

**'అధిత్వం దేవ'** (సా. సం. **464**) అనే మంత్రాన్ని పఠించాలి. అకాలంలో మంచుకురవటం, తోకచుక్కలు కనబడటం జరిగితే ఆకాశాభిముఖంగా 'సోమం రాజానం వరుణం' (సా. సం. 91) అనే మంత్రాన్ని చదవాలి.

దేవతాప్రతిమలు ఊగిసలాడించడం, నవ్వటం, నదులుప్పొంగటం జరిగితే **'ఇదం విష్ణుః'** (సా. సం. 22) అనే మంత్రాన్ని, నాలుగు కంటే ఎక్కువకాళ్లతో పశువులు పుట్టటం మొదలగు వైపరీత్యాలకు **'ఆ వో రాజానం'** (సా.సం. 68) అనే మంత్రాన్ని, పర్వతశిలలు దొర్లిరావటం, మహావృక్షాలు కూలిపోవటం, నీటిలో రాళ్లు తేలటం ఇలాంటివి జరిగితే **'ఉదుత్యం జాతవేదసం'** (సా.సం.31) అనేమంత్రాన్ని ఉచ్చరించాలి. ఇంకా ఇలాంటి విషయాలనేకం షడ్వింశబ్రాహ్మణంలో ఆరవఅధ్యాయంలో మూడవఖండం నుంచి అధ్యాయం చివరివరకు చెప్పబడ్డాయి.

**ప్రకృతిని అర్థం చేసుకోవాలి :**

వేదం కేవలం యజ్ఞయాగాదులేకాక మానవుని నిజజీవితానికి ఉపయోగపడే అనేకవిషయాలను తెలుపుతున్నది. మానవుడు తన చుట్టూ ఉన్న ప్రకృతిని సరిగ్గా అర్థంచేసుకొని, దాన్ని చక్కగా వినియోగించుకోవాలంటే, వేదంలో ప్రకృతిని గూర్చి ఏం చెప్పబడిఉందో తెలుసుకోవటం చాలా అవసరం. వేదంనుంచి అనేక ప్రకృతి రహస్యాలను మనం తెలుసుకోవచ్చు. వేదంలో వృక్షలతాదులను గూర్చి చెప్పబడిన విషయాలు మనం కొత్తగా చాలా ఓషధుల్ని ఉపయోగించుకోవటానికి, భూమి మొదలైన పంచభూతాలయొక్క సూర్యచంద్రులయొక్క రహస్యాలను భేదించటానికి ఉపయోగపడతాయి. వేదం సకలవిజ్ఞానసర్వస్వం. దాన్ని సరైన మార్గంలో అర్థంచేసుకోవటం చాలా అవసరం.

— ఎస్. ఎస్. ఎస్.

## 1. 13 ఉపాఖ్యానాలు

వేదం సాధారణంగా ఆ యా కర్మలకు సంబంధించిన విధివాక్యాలతో నిండి జటిలంగా ఉంటుందని అనుకుంటాం. అది కొంతవరకు నిజమే. కారణమేమంటే వేదం రాజులాగా 'ఇది చేయి' 'అది చేయవద్దు' అంటూ ఆజ్ఞాపిస్తుంది. అయితే ఇలాంటి వేదంలో కూడా అక్కడక్కడ కమనీయమైన కథలు కనిపిస్తుంటాయి. చిన్న పిల్లలకు కథలు చెప్పి పెద్దలు ఎలా బుజ్జగిస్తుంటారో అలాగే వేదం కూడా కథలు చెప్పి లాలిస్తుంది. వీటినే ఉపాఖ్యానాలు లేక ఆఖ్యాయికలు అని అనవచ్చు. ఇవి కేవలం కథలు కావు. వీటివెనుక ఎంతో నిగూఢమైన సందేశం ఉంది. లోకంలో చిన్నపిల్లలకు కథ అంతా చెప్పి చివరకు ఈ కథలో నీతి ఇది - 'అబద్ధము చెప్పరాదు', ఇలాగ- అని చెపుతుంటారు. అంటే ఈ కథ అంతా ఆ నీతిని బోధించటానికి అన్నమాట. కేవలం నీతివాక్యాన్ని ఒక్కదాన్నేచెప్తే మనసులో బాగా నాటుకోదు కనుక కథ అవసరమైంది. అలాగే వేదంకూడా తాను విధించదలచుకొన్న కర్మయొక్క (ప్రాశస్త్యం) గొప్పదనం, లేదా నిషేధించదలచినదానిలోని దోషాన్ని వెల్లడించటంకోసం అనేక ఉపాఖ్యానాలను అందిస్తుంది. ఇలాంటి ఉపాఖ్యానాలు ఎక్కువగా వేదంలోని బ్రాహ్మణభాగాల్లో కనిపిస్తాయి. ఇక ఆ యా బ్రాహ్మణాలలో ఎలాంటి ఉపాఖ్యానాలు ఉన్నాయో, వాటి అంతరార్థాలు ఏమిటో సంగ్రహంగా తెలుసుకుందాం.

### 1. ఐతరేయబ్రాహ్మణం :

ఋగ్వేదానికి చెందిన ఈ బ్రాహ్మణంలో చక్కని ఉపాఖ్యానాలు చాలా ఉన్నాయి. అన్నిటిలోకీ పెద్దదీ, ప్రసిద్ధమైదీ, శునశ్శేపోపాఖ్యానం (ఐ.బ్రా.7.13.18).

**శునశ్శేపోపాఖ్యానం :**

ఇక్ష్వాకువంశానికి చెందిన హరిశ్చంద్రుడనే రాజు సకలసంపదలు ఉండికూడా పుత్రుడులేడనే చింతతో చాలకాలం పరితపించి, చివరకు 'నాకు పుత్రుడు పుడితే వానిని నీకే అర్పించి క్రతువు చేస్తాను' అని వరుణదేవునికి మొక్కుకొని 'రోహితుడు' అనే కొడుకును పొందాడు. రోహితుడు పుట్టిన వెంటనే వరుణుడు ప్రత్యక్షమై హరిశ్చంద్రునికి మొక్కు సంగతి గుర్తుచేసి 'నీ పుత్రుణ్ణి నాకర్పించు' అని అడిగాడు. హరిశ్చంద్రుడు బారసాల అయిన తర్వాత చేస్తానని వాయిదా వేశాడు. పదిరోజులతర్వాత వరుణుడు మళ్ళీ వచ్చాడు. పళ్ళు (దంతాలు) వచ్చాక క్రతువు చేస్తానన్నాడు హరిశ్చంద్రుడు. ఈ విధంగా వరుణుడు చాలాసార్లు రావటం ప్రతిసారి హరిశ్చంద్రుడు వాయిదావేయుటం జరుగుతూ వచ్చింది.

ఈలోగా రోహితుడు యుక్తవయస్కుడై గురుకులంలో సకల శస్త్రాస్త్రవిద్యలు అభ్యసించి తిరిగి వచ్చాడు. తండ్రి అతనికి వరుణునికి తానిచ్చిన మాటను తెలియజేశాడు. కాని రోహితుడు బలిపశువు కావటానికి ఇష్టపడక రాజభవనం విడిచి, ధనుర్బాణాలు ధరించి అరణ్యంలో నివసించటం మొదలుపెట్టాడు. తన మొక్కు తీర్చలేదనే కోపంతో వరుణుడు హరిశ్చంద్రునికి వైద్యులకు లొంగనివిధంగా జలోదరవ్యాధిని కల్గించాడు. చక్రవర్తి చివరకు అశక్తుడై మంచం పాలైనాడు. రోహితునికి ఈ సంగతి తెలిసి తండ్రిని చూడటానికి బయలుదేరాడు. కాని ఇంద్రుడు అతణ్ణి అడ్డగించి 'వనవాసం చాలా మంచిది, నీవు నగరానికి వెళ్తే బలిపశువుగా చావాల్సివస్తుంది' అని బోధించి వెనుకకు పంపివేశాడు.

ఇలా మూడుసార్లు జరిగాక తనబదులు మరెవరైనా పురుషుణ్ణి ఉంచి యాగం జరిపించి, వరుణుని తృప్తిపరచి తండ్రిరోగాన్ని పోగొడదామని ఆలోచించి రోహితుడు తిరిగి తిరిగి అజీగర్తుని దగ్గరకు వచ్చాడు. అజీగర్తునికి

ముగ్గురు కొడుకులు. పెద్దకొడుకు కర్మాధికారి కనుక అజీగర్తుడతన్ని రోహితునికి బదులుగా బలిపశువుని చేయుటానికి అంగీకరించలేదు. ఆఖరికొడుకంటే తనకు ప్రేమ ఎక్కువ కాబట్టి తల్లి మూడవకొడుకుని ఇవ్వనన్నది. తల్లిదండ్రుల అభిప్రాయాన్ని గ్రహించిన రెండవకొడుకు శునశ్శేపుడు రోహితునివెంట నడిచాడు. కొడుకును ఇచ్చినందుకు అజీగర్తునికి ప్రతిఫలం ముట్టింది.

రోహితుడు శునశ్శేపునితో నగరానికి తిరిగి వచ్చాడు. యాగానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినాయి. అయితే నరుణ్ణి యూపానికి కట్టటానికి ఎవరూ ముందుకు రాలేదు. అజీగర్తుడే 100 ఆవులను తీసుకొని శునశ్శేపుణ్ణి యూపానికి కట్టేశాడు. మరో నూరు ఆవులకు ఆశించి చివరకా తండ్రి కొడుకును చంపటానికి (ఆలంభనం) కూడా సిద్ధపడ్డాడు. ఇంతలో కరుణరసపూరితమైన శునశ్శేపుని ప్రార్థన విని కరుణించిన హృదయంతో వరుణుడు ప్రత్యక్షమై, అతనిని యూప బంధంనుంచి, హరిశ్చంద్రుని వ్యాధినుంచి విముక్తులను చేశాడు. బంధవిముక్తుడైన శునశ్శేపుడు తండ్రివెంట వెళ్లడానికి నిరాకరించాడు. విశ్వామిత్రుడతణ్ణి తనకొడుకుగా స్వీకరించాడు.

ఈ శునశ్శేపోపాఖ్యానం సమాజంలోని అనేకరకాల మనస్తత్వాలను చూపెడుతూ దేవతాస్తుతిరూపాలైన ఋక్కులయొక్క ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తున్నది.

నేనెవరిని ?

సంస్కృతంలో 'కః' అనే శబ్దానికి 'ఎవడు' అనేది ప్రసిద్ధమైన అర్థం. ఇదిగాక 'బ్రహ్మ' అనే మరొక అర్థంకూడా ఉంది. అది ఎలా వచ్చిందో ఐ.బ్రా. (3.2.10) ఒక ఉపాఖ్యానంలో వివరిస్తున్నది. ఇంద్రుడు వృత్రాసురుణ్ణి చంపి, భూమి మొదలైన లోకాలన్నీ జయించి ప్రజాపతివద్దకు వచ్చి, నేను

సమస్తప్రాణులకంటే గొప్పవాడను అని అన్నాడు. అప్పుడు ప్రజాపతి 'నా గొప్పదనాన్ని నీవు తీసుకుంటే మరి నేనెవర్ని ? (అహం కః ?) అని ప్రశ్నించాడు. దానికి ఇంద్రుడు 'ప్రజాపతీ ! స్వాత్మను నీవు 'కః' అని అన్నావు కనుక ఇకనుంచి నీవా శబ్దంతోనే పిలువబడతావు' అన్నాడు. అప్పట్నుంచి 'కః' అన్నదానికి బ్రహ్మ అనే అర్థం కూడా వచ్చింది. ప్రజాపతియొక్క గొప్పదనాన్ని కూడా హరించటంచేత ఇంద్రుడు మహేంద్రుడైనాడు. దేవతలు మహేంద్రుని కోసం మాధ్యందినసవనాన్ని, నిష్కేవల్యశస్త్రాన్ని కేటాయించారు. ఈ ఉపాఖ్యానం, మాధ్యందినసవనానికి నిష్కేవల్యశస్త్రానికి మహాత్మ్యాన్ని కల్గించేశక్తి ఉన్నట్లు సూచిస్తున్నది కూడా.

ఐతరేయబ్రాహ్మణంలో ద్వాదశాహక్రతువును (4.4.1), గవామయనాన్ని (4.3.3), తృతీయసవనాన్ని (3.2.1), పర్యగ్నికరణాన్ని (2.2.1) ప్రవర్గ్యాన్ని (1.4.1) ప్రశంసిస్తూ ఉపాఖ్యానాలు ఉన్నాయి. ఇవికాక ఎన్నో చిన్నచిన్న ఉపాఖ్యానాలు ఉన్నాయి. ఐ. బ్రా. 3.2.10 లో ఉన్న ఉపాఖ్యానం చాలా చిత్రమైంది.

## 2. కౌషీతకీబ్రాహ్మణం :

ఋగ్వేదానికి చెందిన రెండవబ్రాహ్మణం కౌషీతకి. ఇందులోనూ చాలా ఉపాఖ్యానాలున్నాయి. కాని ఇవి ఐతరేయబ్రాహ్మణంలో వలె పెద్దవిగా ఉండవు.

### ప్రజాపతితపస్సు :

ఈ బ్రాహ్మణంలో ఒక ఉపాఖ్యానం చూడండి : సృష్టిచేసే సంకల్పంతో ప్రజాపతి తపస్సుచేయగా ఆ తపస్సులోనుంచి అగ్ని, వాయువు, ఆదిత్యుడు, చంద్రుడు, ఉషస్సు జన్మించారట. ఆ తర్వాత మొదటి నల్గురూ తపస్సుచేయటం, ఉషస్సుద్వారా వేయి కన్నులు, వేయిపాదాలుగల

మహాపురుషుడు జన్మించటం జరిగినట్లు వర్ణింపబడింది. ఈ ఉపాఖ్యానం సృష్ట్యాదిన ఉన్న తత్త్వాలను బోధిస్తున్నది.

**అగ్నికి ఆజ్యం :**

మరొకటి కౌ. బ్రా. (1.1.3). అసురులతో యుద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైనపుడు దేవతలకు కనబడకుండా పారిపోయి అగ్ని, ఋతువుల్లో ప్రవేశించి దాక్కొన్నాడట. దేవతలు రాక్షసులను జయించి అగ్నికోసం వెతకటం ప్రారంభించారు. వారిలో యముడు, వరుణుడు అతణ్ణి కనుక్కోగల్గారు. అప్పుడు అగ్ని కోరినవిధంగా అతనికి (వరంగా) ప్రయాజానుయాజలు, ఆజ్యాన్ని ఇచ్చి మళ్లీ తీసుకొచ్చారు. మనం లోకంలో 'అగ్నికాజ్యం' అంటుంటాం. దానికి ఈ ఉపాఖ్యానం మూలమనిపిస్తున్నది. అగ్నికి మిక్కిలి ఇష్టమవటం చేతనే ప్రయాజానుయాజలతోబాటు ఆజ్యాన్ని (నేతిని) వరంగా కోరుకున్నాడు. ఇంకా ఈ బ్రాహ్మణంలో వృత్రాసురవధకు (3.3.5) సూర్యోత్పత్తికి (3.5.1) సంబంధించిన ఉపాఖ్యానాలున్నాయి.

**3. తైత్తిరీయబ్రాహ్మణం :**

తైత్తిరీయబ్రాహ్మణం కృష్ణయజుర్వేదానికి చెందింది. ఈ బ్రాహ్మణంలోకూడా చాలా ఉపాఖ్యానాలున్నాయి. వాటిలో ఎక్కువ భాగం దేవాసురయుద్ధాలకు, ప్రజాపతిసృష్టికి సంబంధించినవి. ఇతర అంశాలను బోధించేవికూడా లేకపోలేదు. ఆరంభంలోనే (1.1.2) ఒక ఉపాఖ్యానం ఉంది.

**కాలకంజులయాగం :**

కాలకంజులు అని పిలువబడే రాక్షసులు ఉండేవారు. వాళ్లు స్వర్గాన్ని పొందటానికి ఇష్టకలను (ఇటుకలు) పేర్చి యాగం చేయనారంభించారు. వాళ్లరాకతో స్వర్గం నాశనమౌతుందని భయపడిన ఇంద్రుడు వాళ్లను

ఆటంకపరచటానికి మారువేషంలో తాను కూడ వాళ్లతో కలిసి 'చిత్ర' అనేపేరుగల ఇష్టకను ఉంచాడు. యాగం పూర్తయి, కాలకంజాసురులు స్వర్గానికి, ఆ పేర్చిన ఇష్టకల మీదుగా వస్తున్నప్పుడు ఇంద్రుడు తన చిత్రేష్టకను చితిమంచి తొలగించివేశాడు. చితికూలిపోవటంతో ఆ రాక్షసులు నేలకూలి సాలీడు మొదలైన క్రిమికీటకాదులు అయ్యారు. అందుచేతనే సాలీళ్లు పూర్తిగా నేలమీద ఉండక, ఆకాశంలో ఎగరక, మధ్యలో గూళ్లు నిర్మించుకొని ఉంటుంటాయి.

ఈ ఉపాఖ్యానం ధర్మరక్షణ - ఆత్మరక్షణలకోసం శత్రువును మాయోపాయంతో జయించవచ్చుననే దానితోపాటు, ఇంద్రుడు చిత్రేష్టకతో శత్రువులను జయించాడు; కనుక ఏ యజమానుడు చిత్రానక్షత్రంలో ఇష్టకాచయనంచేస్తాడో అతని శత్రువులు నశిస్తారనే విషయాన్నికూడా తెలః పుతున్నది.

బ్రహ్మకైనపుట్టు :

కాంతా కనకాలను చూస్తే బ్రహ్మకైనా రిమ్మతెగులు పుడుతుం దంటారు. ఈ ఉపాఖ్యానం చూడండి (తై. బ్రా. 1.3.1):

ఒకప్పుడు రాక్షసులకు దేవతలకు ఘోరమైనపోరు జరిగింది. ముందు పరిస్థితెలాగుంటుందోనని దేవతలు తమతమ వస్తువాహనాది ధనాన్నంతా అగ్నీషోములదగ్గర దాచి తాము యుద్ధానికి వెళ్లారు. అగ్నీషోములకు, తమవారు జయిస్తారో లేదో అనే అనుమానంతో బాటు ఈ ధనమంతా ఉంటే జీవితాంతం సుఖంగా గడపవచ్చు గదా ! అనే ఆలోచన కలిగింది. ఇంకేం ఆ ధనంతో పారిపోయారు. అయితే దేవతలు యుద్ధంలో విజయంపొంది, అగ్నిని వెతికి పట్టుకొని అతనికి కొంత ప్రతిఫలమిచ్చి సామదానాలతో తమధనాన్ని రాబట్టుకున్నారు. అలాగే సోముణ్ణి కూడా కనుక్కొని (అతడగ్ని అంత బలవంతుడు కాకపోవటంవల్ల కావచ్చు) కొట్టి, అతడి దగ్గరున్న తమ ధనాన్ని

దండోపాయంతో స్వాధీనపరచుకున్నారు. పిదప ఆ ధనమే ఐంద్ర వాయువాదిగ్రహాలు[1]గా మారటంచేత యజమానుడు యాగంలో ఈగ్రహాలను తప్పక ఉంచాలని చెప్తున్నది.

**సృష్టికి మొదట :**

ఇక సృష్టిని గూర్చిన ఉపాఖ్యానం (తై. బ్రా. 1.1.3) : ఈ జగత్తులో మొదట అరణ్యాలు, పర్వతాలు ఇవేవీ ఉండేవికావు. అంతా జలమయం. ప్రజాపతికి సృష్టిచేయాలనే కోరిక కలిగి ఆలోచించ నారంభించాడు. ఆయనకు నీటిలో పద్మలత కనిపించింది. వెంటనే వరాహరూపాన్ని ధరించి ఆ లతకు సమీపంలో నీటిలో మునిగి మట్టిని పైకితెచ్చి భూమిని, మిగిలినసృష్టిని పూర్తి చేశాడు.

**అనుభవించిందే మనది :**

ఇలాగే మరొకటి (తై. బ్రా. 3.11.8) : ప్రజాపతి ప్రజోత్పాదన చేయాలనే కోరికతో తపస్సు చేశాడు. ఆయనకు బంగారం కనిపించింది. తనకోర్కెను అది తీరుస్తుంది గదా అని అగ్నిలో హోమం చేశాడు. కాని అలా జరగలేదు. అలాగే మరోసారి చేశాడు. ప్రయోజనం లేదు. వెంటనే ఆయన ఆ బంగారాన్ని తన కడుపులోఉన్న వైశ్వానరాగ్నికి ఆహుతి చేశాడు. అంటే మింగాడన్నమాట. వెంటనే ఆయనకు ప్రజోత్పాదనశక్తి వచ్చేసింది. ఈ సందర్భంలోనే 'దాచి పెట్టిన ధనంకంటే ఉపయోగించింది ఉత్తమమైంది' అని చెప్పబడింది[2].

**వేదాలకు అంతంలేదు :**

వేదాలు అనంతాలని ఉపపాదించే ఇంకో ఉపాఖ్యానం చూడండి : భరద్వాజమహర్షి తనజీవితకాలమంతా వేదాధ్యయనం చేసినా ఇంకా చాలా

---

1. గ్రహం అంటే సోమం లేదా సురను దేవతలకోసం తీసి ఉంచే కొయ్యపాత్ర.
2. తస్మాద్ధిరణ్యం కనిష్ఠం ప్రజానామ్ । భుంజత్ప్రియతమమ్॥ తై.బ్రా. 3.11.8.

మిగిలిపోయింది. ఇంద్రుణ్ణి ప్రార్థించి మరొక జీవితకాలాన్ని పొందాడు. అదీ చాలలేదు. అలాగే మరో జీవితకాలం; అది కూడా సరిపోలేదు. 300 సం॥లు వేదాధ్యయనం చేసి అలసి వృద్ధుడైపడిఉన్న భరద్వాజుని దగ్గరకు ఇంద్రుడు వచ్చి మూడు పెద్ద పర్వతాలను చూపి వాటిని వేదాలనిచెప్పి మూడింటిలోనుంచి మూడు గుప్పెళ్ల (ధూళి) తీసి ఇచ్చి అంతటితో తృప్తిపడమన్నాడట. అందులోని ఒక్కొక్కరేణువు ఒక్కొక్కవేదశాఖ.

**మోదుగచెట్టు ఎలా పుట్టింది :**

మోదుగచెట్టుపుట్టుకను ఈ ఉపాఖ్యానం తెలుపుతున్నది (3.2.1). భూమికిపైన మూడవ లోకంలో ఉండే సోమాన్ని గాయత్రీదేవి బలాత్కారంగా తీసుకొని వెళ్ళింది. అప్పుడు సోమరక్షకులకు, ఆమెకు జరిగిన యుద్ధంలో సోమలతయొక్క ఆకు ఒకటి నేలమీద పడింది. దానినుంచి (పలాశ) మోదుగచెట్టు పుట్టింది.

ఇలాగే దర్భయొక్క (3.2.5) మజ్జి, మేడి, జమ్మి, వికంకత వృక్షాలయొక్క పుట్టుకను గూర్చి కూడా (1.2.1) చెప్పబడింది. 3.1.4, 5,6 లలోను, 3.12.2 లోను, ఇంకా ఇతరత్ర ఆశ్చర్యకరమైన చాలా ఉపాఖ్యానాలున్నాయి.

**4. శతపథబ్రాహ్మణం :**

శుక్లయజుర్వేదానికి చెందిన ఈ బ్రాహ్మణంలో చాలా విస్తరమైనవి, ప్రసిద్ధిమైనవి ఎన్నో ఉపాఖ్యానాలు ఉన్నాయి. మచ్చుకు ఒకటి రెండు చూద్దాం.

**సంజీవనీవిద్యతో బ్రతికిస్తాం :**

అథర్వమహర్షి పుత్రుడు దధ్యజ్. ఈయననే దధ్యఙాథర్వుడని, ఆథర్వుడనీ పిలుస్తారు. ఆథర్వుడు ప్రాపంచిక సుఖదుఃఖాలకు దూరంగా

ప్రశాంతపావనమైన ఆశ్రమంలో మునివృత్తితో జీవితాన్ని గడుపుతూ ఉండేవాడు. తపస్సుచేసుకోవటం, ధర్మాచరణం, శిష్యులకు బోధించటం; ఇవే ఆయన నిత్యకృత్యాలు. దధ్యఙాథర్వుని ధార్మిక జీవనాన్ని చూచి సంతోషించిన ఇంద్రుడు స్వయంగా ఆ మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. మహర్షి తనకు అతిథిపూజలు చేయటం పూర్తి అయిన తర్వాత ఇంద్రుడు "మహర్షీ! నీ సచ్ఛీలత, ధర్మతత్పరత నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నాయి. నీ కేదైనా వరం ఇవ్వాలనుకుంటున్నాను. కోరుకో !" అన్నాడు. స్వతః మహర్షి బైరాగి. కాంతాకనకాదులాయనకనవసరం. ఐతే 'ఇస్తాను' అంటున్నప్పుడు వరం కోరుకోకపోవటం ఇంద్రుణ్ణి అవమానించినట్లు అవుతుంది. అందుకని ఆథర్వుడు ఆలోచించి, బ్రహ్మసాక్షాత్కారానికి దోహదంచేసే 'మధువిద్య'ను తనకుపదేశించమని ఇంద్రుణ్ణి కోరాడు. ఇంద్రుడు సంకటస్థితిలో పడ్డాడు. అయినా ఇచ్చినమాట నిలబెట్టుకోటంకోసం యథావిధిగా విద్యోపదేశం చేశాడు. చివర 'ఈ విద్యను నీవు మరెవరికైనా ఇస్తే నీ శిరస్సును వజ్రాయుధంతో ఖండిస్తాను' అని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

కొంతకాలం గడిచింది. ఇంద్రుడిచేత యజ్ఞభాగం లేకుండా బహిష్కరింపబడ్డ అశ్వినీదేవతలకీ సంగతి తెలిసింది. పోయిన తమ ప్రాభవాన్ని తిరిగి ఈ విద్యద్వారా సంపాదించుకోవచ్చునని తలచి వాళ్ళు దధ్యఙాథర్వుని వద్దకు వచ్చి 'మధువిద్య'ను కోరారు. మహర్షి ఇంద్రుని శాసనాన్ని వారికి తెలిపాడు. అశ్వినులు దానికి ముందుగానే నీ తలను శరీరం నుంచి వేరుచేసి గుఱ్ఱంతల అతికిస్తాం. మాకు విద్యోపదేశం చేయి. ఇంద్రుడు గుఱ్ఱంతలను ఖండిస్తాడు. తర్వాత మేం నీకు నీ మామూలు శిరస్సును అతికించి సంజీవనీవిద్యతో బ్రతికిస్తామని చెప్పారు. అంతా అలాగే జరిగింది. మహర్షి మధువిద్యను అశ్వినులకిచ్చాడు. ఇంద్రుడు తానుచేసిన పనికి (శిరఃఖండన) పశ్చాత్తాప పడుతుంటే మహర్షి ఓదారుస్తాడు (శ.బ్రా. 14.1.1).

ఈ ఉపాఖ్యానంలో విద్యలనెంత జాగ్రత్తగా కాపాడాల్సింది, వాటిని పాత్రత (అర్హత) నెరిగి ఎలా దానం చేయాలన్నదీ నిరూపింపబడింది.

**ఊర్వశి-పురూరవుడు :**

ఈ బ్రాహ్మణంలోని మరో ప్రసిద్ధోపాఖ్యానం పురూరవునిది. ఇళుడనే మహారాజు పార్వతీదేవి శాపానికి గురై ఆరునెలలు స్త్రీగా ఉండాల్సివచ్చింది. ఆ సమయంలో ఇళాదేవిమీద బుధుని దృష్టి పడటం ఫలితంగా పురూరవుడు జన్మించటం జరిగింది. పురూరవుడు తల్లిదండ్రులను మించిన ప్రజ్ఞాపరాక్రమశాలి. ఒకరోజు చక్రవర్తి దేవసభలో ఊర్వశిని చూచి మోహించటం, ఆమెకూ ఇతనిపై ప్రేమ కల్గటం జరిగింది. దానికితోడు మిత్రావరుణ శాపంవల్ల ఆమె మానవ స్త్రీగా ఉండాల్సిన సమయంకూడా వచ్చింది. ముఖ్యంమీద (1) తానెప్పుడూ నేతినే ఆహారంగా స్వీకరించాలి. (2) తనవద్ద ఎప్పుడూ మేకలజంట ఒకటి ఉండాలి. అదెప్పటికీ విడిపోకూడదు. (3) పడకకవతల పురూరవుడు నగ్నంగా కనిపించకూడదు, అనే మూడు షరతులతో పురూరవునికి రాణిగా భూలోకానికి వచ్చింది. చాలా సంవత్సరాలు సుఖంగా గడిచాయి. చివరకు గంధర్వుల మాయోపాయానికి ఫలితంగా చివరి రెండుషరతులు భగ్నం కాగా ఊర్వశి రాజును విడిచి స్వర్గానికి వెళ్తుంది. పురూరవుడు విరహావేదనతో తపించి నిర్మథనంద్వారా అగ్నిని సృష్టించి గార్హపత్యం, ఆహవనీయం, దక్షిణాగ్నిస్థలాలలో త్రేతాగ్నులను అర్చించి స్వర్గానికి చేరి ఊర్వశిని పొందగల్గుతాడు.

ఈ ఉపాఖ్యానంలో పూరూరవుని నిష్కళంకమైన ప్రేమేకాక విధికి ఎవరూ ఎదురాడలేరనే నగ్నసత్యం కూడా ప్రతిపాదింపబడింది. ఇలాగే మరో ప్రసిద్ధమైన వృత్రాసురవధోపాఖ్యానం కూడా ఈ బ్రాహ్మణంలో (1.1.3) ఉంది.

5. జైమినీయబ్రాహ్మణం :

ఈ బ్రాహ్మణం సామవేదానికి సంబంధించినది. ఇందులో ఉపాఖ్యానాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. కొన్ని ముఖ్యమైన వాటిని మాత్రం ఇక్కడ పరిశీలిద్దాం.

**మేడిచెట్టెలా పుట్టింది ?**

ఉదుంబర (మేడి) వృక్షం చాలా సారవంతమైంది. ఈ విషయాన్ని ఈ ఉపాఖ్యానం యిలా వివరిస్తున్నది. ప్రజాపతి అన్నం సారాన్ని అంతా ఒకచోటచేర్చి ప్రజలకు పంచటం ప్రారంభించాడట. ఆసమయంలో కొన్ని చుక్కలు క్రిందపడి వాటినుంచి ఈ చెట్లు పుట్టిందట. అందుచేతనే దీనిఫలం పుష్టిని కలిగిస్తుంది (జై. బ్రా. 1.70). తైత్తిరీయబ్రాహ్మణంలో కూడా దీన్ని ప్రశంసించడం జరిగింది.

అలాగే (జై. బ్రా. 1.73) ప్రజాపతి ప్రజలనందరిని సృష్టించటం, అగ్నిని ముఖంనుంచి సృష్టిచేయటం; ప్రజాపతి ముఖంనుంచి భయంకర జ్వాలలతో బయల్పడిన అగ్ని ప్రజాపతి శిరస్సుకు హాని కల్గించడం, దేవతలు ఆ అగ్నిని బృహస్పతిద్వారా గ్రహించటం- ఇలా నడిచిన ఈ ఉపాఖ్యానం సృష్టిలోని ఆయా తత్త్వాలను తెలియ జేస్తున్నది.

ఈ బ్రాహ్మణంలోని మూడవకాండ ఆ యా సామలు లేక క్రతువులను ప్రశంసించే చిన్న చిన్న ఉపాఖ్యానాలతో నిండి ఉంది. ఇంతేగాక 3.122 లో చ్యవనోపాఖ్యానం, 3.104 లో వృత్రాసురవధ వల్ల కల్గిన పాపాన్ని ఇంద్రుడు దశరాత్రయాగంతో పోగొట్టుకున్న విధానం వర్ణింపబడ్డాయి. ఇవేగాక ఈ బ్రాహ్మణంలో ఉపాఖ్యానాలు కోకొల్లలుగా ఉన్నాయి.

**6. తాండ్యబ్రాహ్మణం :**

సామవేదానికి చెందిన ఈ బ్రాహ్మణంలో ఉపాఖ్యానాల సంఖ్య చాలా ఎక్కువ. అయితే చాలావరకు అన్నీ చిన్న చిన్న ఉపాఖ్యానాలే. వాటిలో కొన్ని పెద్దవీ, ముఖ్యమైనవీ అయిన ఉపాఖ్యానాలను కొన్నిటిని గూర్చి తెలుసుకుందాం.

**వసిష్ఠుడే పురోహితుడు :**

వసిష్ఠుడు అనేపేరు మనకందరికీ తెలిసిందే. రామాయణంలోను, ఇతర గ్రంథాలలోను, ఈయనను గురించి మనం చదువుతున్నాం. ఈయన రాజపురోహితుడు. వసిష్ఠుని సంతతిలోని వారిని వసిష్ఠుడని పిలవటమేగాక, సామాన్యంగా ఏ పురోహితుడైనా వసిష్ఠుడని పిలవటంకూడా జరుగుతున్నది. వసిష్ఠుని గురించి ఈ బ్రాహ్మణంలో (15.5) ఒక ఉపాఖ్యానం ఉంది.

పూర్వ ఋషులందరికీ ఇంద్రుణ్ణి ప్రత్యక్షంగా చూడాలనే కోరిక కలిగిందట. చాలామంది చాలాకాలంగా ప్రయత్నించారు; గాని ఎవరూ సఫలురుకాలేదు. వసిష్ఠుడు ఆలోచించి 'నివహం' అనే పేరుగల సామంతో ఇంద్రుణ్ణి స్తుతించాడు. అప్పుడింద్రుడు ప్రత్యక్షమై అసంఖ్యాకాలైన యజ్ఞయాగాలు, వాటి అనుష్ఠానపద్ధతులు అన్నీ వివరంగా బోధించాడట. అందువల్ల వసిష్ఠునికి ఇతర ఋషులకంటే ప్రాధాన్యం వచ్చింది. సకల వైదికకర్మలూ సమగ్రంగా తెలిసిన వాడు కావటంచేతనే కావచ్చు చక్రవర్తులు, ఇతర ఋషులను విడిచి వసిష్ఠుని పురోహితునిగా వర్ణించారు.

**విజమైన పుత్రుడు :**

తాం. బ్రా. (16.4)లో మరో ఉపాఖ్యానం ఉంది. ప్రజాపతి ఈ భూమిని అందులోని ప్రాణుల్నీ, స్వర్గాదిలోకాలను, సూర్యచంద్రాది మండలాలను సృష్టిచేశాడు. అయితే సృష్టిలోని ప్రాణులేవీ ప్రజాపతియొక్క

పెద్దరికాన్ని మన్నించలేదట. అందుకు కోపగించి ప్రజాపతి సృష్టిసారాన్నంతటినీ మాలగా చేసి మెడలో ధరించాడట. దాంతో సృష్టి అంతా అతనికి పరాక్రాంతమైంది. అప్పుడాయన తన సృష్టికి ఎవడైనా ఒక నాయకుడు ఉంటే బాగుంటుందని తలచి, ఆ మాలను ఇంద్రునిమెడలో వేశాడట. ప్రజాపతికి ఇంద్రుడుకాక ఇంకా చాలామంది పుత్రులున్నారు. కాని మాలను ఇంద్రునికే ఇవ్వటంవల్ల ప్రజాపతి అతనినే వంశరక్షకునిగా సమర్థునిగా భావించి ఉంటాడని అర్థమౌతున్నది. ఇలా తండ్రి విశ్వాసానికి పాత్రుడై అతని ఆస్తిలో అధికభాగాన్ని పొందినవాడే నిజమైనపుత్రుడు అని తాం. బ్రా. చెప్పున్నది[1].

తరువాత ఇంద్రుడు 'అభిజిత్' 'విశ్వజిత్' అనే యాగాల ననుష్ఠించి, చైత్రయాత్రచేసి, సమస్తలోకాలకు ,అధిపతి అయినాడు' కేవలం తండ్రి ఇచ్చినందువల్ల వచ్చిన అధికారమేగాక స్వయంప్రతిభ కూడా ఇంద్రునిలో ఉన్నట్లు చూపటం, విశ్వజిదభిజిద్యాగాలను ప్రశంసించటం ఈ ఉపాఖ్యానం ముఖ్యోద్దేశాలు.

ఈ బ్రాహ్మణంలోని ఉపాఖ్యానాల్లో అధికభాగం ఆయా సామలను గురించివే. దేవాసురులు పశుసంపదకోసం యుద్ధం చేశారట. దేవతలు 'ఆతే అగ్న' అనే 'సంజయ' సామను గానం చేసి విజయం పొందారు (తాం.బ్రా. 13.6). తమమీద అలిగి పక్షిరూపాన్ని ధరించి వెళ్లిపోయిన యజ్ఞపురుషుణ్ణి, దేవతలు 'సౌపర్ణ' సామతో తిరిగి పొందారట (తాం. బ్రా. 14.3). పదస్తోభసామను గానంచేసి ఇంద్రుడు వృత్రాసురుణ్ణి చంపినందున కలిగిన పాపాన్ని పోగొట్టుకున్నాడు (తాం. బ్రా. 13.5).

---

1. తస్మాద్యః పుత్రాణాం దాయం ధనతమమివైతి తం మన్యేఽయమేవేదం భవిష్యతీతి - తాం. బ్రా. 16.4.

వైఖానససామ :

వైఖానససామయొక్క ప్రాశస్త్యం ఇలా చెప్పబడింది (తాం. బ్రా. **14.4**): విఖనసుని పుత్రులైన వైఖానసమహార్షులు ఇంద్రునికి ప్రీతిపాత్రులు. వీరు దేవతలకు చాలా ఉపకారాలు చేస్తున్నారనే కోపంతో ఒకరాక్షసుడు వారిని రహస్యంగా తీసుకొని వెళ్ళి 'మునిమరణం' అనేచోట చంపివేశాడు. తనకు ఆప్తులైన ఋషులు కనపడకపోవటంతో ఇంద్రుడు కలతచెంది నలుమూలలా వెతకమని దూతలను పంపాడు. వాళ్ళకు చివరకు వైఖానసుల కళేబరాలు కన్పించాయి. ఇంద్రుడువచ్చి వైఖానససామను గానంచేసి వారిని తిరిగి బ్రతికించాడు. ఈ సామకు ఉన్న ప్రభావం ఇంతగొప్పది. ఈ వైఖానససామ తీర్చలేని కోరికంటూలేదు.

దానం పట్టినందున కలిగే దోషాన్ని పోగొట్టే 'ధ్వస్రమోః పురుషన్త్యో' అనే మంత్రాన్ని గూర్చిన ఉపాఖ్యానం (తాం. బ్రా. 13.7.) చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది.

ఇలా ఈ బ్రాహ్మణంలో **5.7, 6.5, 7.8, 8.9, 13.4, 14.6, 14.11, 18.1,** స్థలాల్లో చాలా ఉపాఖ్యానాలున్నాయి. పైన చెప్పినవేగాక, ఈ తాండ్యబ్రాహ్మణం అడుగడుగునా ఉపాఖ్యానాలతో నిండి ఉన్నది.

**8. గోపథబ్రాహ్మణం :**

ఇది అథర్వవేదానికి చెందిన బ్రాహ్మణం. ఇందులో గంభీరమైన అంతరార్థంకల ఉపాఖ్యానాలు చాలా ఉన్నాయి. ఇలాంటి వాటిలో ఒకటి ఉద్దాలక-శౌనక సంవాదరూపమైన ఉపాఖ్యానం (గో. బ్రా. 3.6).

ఉద్దాలకుడు :

అరుణుడనే ఋషియొక్క పుత్రుడు ఉద్దాలకుడు. ఆయన శాస్త్రార్థంచేసి నన్ను జయించిన వారికి నామెడలోని హారం ఇస్తాను అని ప్రతిజ్ఞ

చేసి దేశాలు తిరగటం మొదలుపెట్టాడు. ఎవరూ ఆయనను ఎదిరించలేదు. కాని ఉత్తరదేశపండితులు సద్రేవాయమణ్ణి (శౌనకుణ్ణి) నాయకుణ్ణిగా చేసుకొని ఉద్దాలకునితో శాస్త్రార్థానికి తలపడ్డారు. ఉద్దాలకుడు ప్రశ్నలు వేయుటం వాటికి శౌనకుడు సమాధానాలు చెప్పటం (3.7:3.8) విపులంగా వర్ణింపబడింది.

ఈ ఉపాఖ్యానం - విజ్ఞానంపొందటమేగాక శాస్త్రార్థాలు చేసి దాన్ని పెంపొందించుకోవాలి, ఇతరులకు అందించాలి - అని పండితులకు బోధిస్తున్నది.

**ప్రేది - ఉద్దాలకుడు :**

ఇలాంటిదే మరొకటి (గో. బ్రా. **4.24**) : ఉద్దాలకుని గురువు కౌశాంబీ (ఇప్పటి పాట్నా) నగరవాసియైన ప్రేది. ఆయన తన శిష్యుడికి బ్రహ్మచర్యాన్ని గురించి ఉపదేశించి 'కుమారా! నీ తండ్రి సంవత్సరయజ్ఞాన్ని పూర్తిచేయుటానికి ఎన్నిరోజులు కోరుతాడు ?' అని అడిగాడు. దానికి ఉద్దాలకుడు 'పది' అని సమాధానమిచ్చాడు. ఎందుకంటే ప్రధానమైన విరాట్ ఛందస్సుకు పదే అక్షరాలు. ఆచార్యుడు మళ్ళీ అడిగాడు. ఈసారి 'తొమ్మిది' అని సమాధానం వచ్చింది. అంటే (నవ వై పురుషే ప్రాణాః) ప్రాణాలు తొమ్మిది కనుక అన్నమాట. ఇక్కడ ప్రాణమంటే (గాలి ప్రసరించే మార్గాలు) నవరంధ్రాలు. మళ్లీ ప్రశ్న ! ఈసారి సమాధానం ఎనిమిది, ప్రముఖమైన గాయత్రి అష్టాక్షరి కనుక. మళ్లీ ప్రశ్న, దానికి ఏడు అని ఉత్తరం, ముఖ్యచ్ఛందస్సులుఏడు కనుక. ఇలా ఈ సంఖ్య తగ్గుతూ వస్తుంది. రెండు అంటాడు శిష్యుడు, మనిషి రెండు పాదాలు కలవాడు కనుక. ఇక్కడ పాదమంటే కాలుకాదు; మానవుడు నడిచే కర్మ, జ్ఞానమార్గాలు. మళ్లీ ప్రశ్నించగా ఉద్దాలకుడు ఒకటి అంటాడు అంటే రోజు ఒక్కటి. (సంవత్సరం ఒకటి పూర్తిగా అని అర్థం) ఇలా అతి విచిత్రమైనరీతిలో మానవునికి పరమార్థం బోధిస్తున్నదీ ఉపాఖ్యానం.

**దక్షయజ్ఞ ధ్వంసం :**

లోకంలో ప్రసిద్ధమైన దక్షయజ్ఞానికి సంబంధించిన ఉపాఖ్యానాన్ని గోపథం వివరిస్తోంది (1.2). ఒకప్పుడు ప్రజాపతి రుద్రునికి భాగంలేకుండా యజ్ఞం ప్రారంభించాడు. కోపించిన రుద్రుడు యజ్ఞాన్నే ధ్వంసం చేశాడు. యజ్ఞంలో మిగిలిన (అన్నశేషం) ప్రాశిత్రాన్ని చూడగానే భగునికి కళ్ళుపోయాయి. ఆ తర్వాత దాన్ని సవితృదేవత చేతులతో తీసుకోబోతే అవి తెగిపోయాయి. అతనికి బంగారు చేతులు అమర్చారు (అందుకే ఆయన హిరణ్యపాణి అయ్యాడు). పిదప సూర్యుడు సాహసించి తినబోయాడు. అతని పళ్ళు ఊడిపోయాయి. (అందుకే సూర్యునికి మెత్తని పిండివంటి పదార్థాలను నైవేద్యం పెట్టాలని శ్రుతి చెప్తున్నది). ఇలాగే ఇధ్మునికి శిరస్సు, బర్హిస్సుకి కీళ్ళు పడిపోయాయి. చివరకు బృహస్పతి మంత్రోచ్చారణపూర్వకంగా సూర్య చక్షుస్సుతో చూస్తూ అశ్వినీదేవతల బాహువులతో స్వీకరించి లోపాన్ని సరిదిద్దాడు.

ఈ ఉపాఖ్యానంలోని అంతరార్థమిది-ప్రజాపతి శరీరావయవాల కధిపతియైన జీవాత్మ. రుద్రుడు సర్వజ్ఞుడైన పరమాత్మ. యజ్ఞమంటే పరమాణుసంయోగంతో ఏర్పడిన శరీరం. ప్రజాపతి రుద్రుణ్ణి యజ్ఞం నుంచి దూరం చేయటంచేత భగ-సవితృ-పూషా-ఇధ్మ-బర్హిష్-తత్త్వాలు తమ తమ పనులు చేయలేకపోయాయి. జ్ఞాని అయిన వాడు ఏ కర్మలోకూడా పరమాత్మయొక్క ఉనికిని మరువరాదు.

ఇలా బ్రాహ్మణాలలో చాలా ఉపాఖ్యానాలున్నాయి. కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి. ఏదైనప్పటికీ ఇవి పుక్కిటిపురాణాలు కాదు. వీటన్నిటివెనక నిగూఢమైన అర్థం ఉంటుంది. దాన్ని వెలికితీసి గ్రహించటం మనకర్తవ్యం. అంతేకాదు. వేదంలో వ్యర్థంగా ఒక్క అక్షరంకూడా లేదు. దాన్ని సరైనరీతిలో అర్థం చేసుకోవటం మన బాధ్యత.

— ఎస్. ఎస్. ఎస్.

## 1. 14 మతం-తత్త్వం :

బ్రాహ్మణాలు ; యాగాలు ఇతరవైదికకర్మలు ఋత్విక్కులు, నాటి ఆర్యసంఘాల ఆచారాలు, విశ్వాసాలు, మతసిద్ధాంతాలు, ధర్మాలు మొ॥ వాటిని వివరించే విజ్ఞానసర్వస్వాలు. బ్రహ్మసాక్షాత్కారమే మానవుని పరమలక్ష్యం. అందుకు సాధనం యజ్ఞం. కనుక యజ్ఞానికి బ్రహ్మశబ్దం వాడబడింది. బ్రాహ్మణాలలో యజ్ఞాలు సాంగోపాంగాలుగా వివరించబడ్డాయి.

మానవుడు తనపుట్టుకకు జీవనానికి మరణానికి, పరోక్షంగా ఉండే దేవతలు, ప్రత్యక్షంగా కనబడే ప్రకృతిశక్తులు కారణాలని భావించాడు. తనను సంరక్షించే దేవతలకు భయభక్తులతో అతడు చేసే విధులను మతం అనే పదం సూచిస్తోంది. మతం మానవునికి సత్ప్రవర్తన నేర్పటంలో నీతికి, కర్మకాండప్రయోగానికి స్థానాన్ని కల్పించింది. విశ్వాసంచేత మతం అభివృద్ధి చెందింది.

ఆత్మజ్ఞానమే తత్త్వశాస్త్రానికి మూలం. ఆత్మ అనే పదం జీవాత్మను, పరమాత్మను తెలుపుతోంది. ఆత్మదర్శనమే తత్త్వశాస్త్రం యొక్క పరమప్రయోజనం. 'ఈ ఆత్మ సమస్తభూతాధిపతి' అని శతపథబ్రాహ్మణం (14.5.5.15) చాటుతోంది.

### మతం :

నాటి మతంలో యజ్ఞం ముఖ్యాంశంగా ఉండేది. యజ్ఞమంటే ఆత్మపరిత్యాగం. ఆ యా దేవతలనుద్దేశించి వేయబడ్డ ఆహుతులు యజ్ఞపదం చేత సూచింపబడుతున్నాయి. యజ్ఞాలలో పృథివి, అంతరిక్ష ద్యులోకాలలోనున్న దేవతలు ఆహ్వానింపబడతారు. వాళ్ళు దర్భాసనాలపై (బర్హిస్సదనాలపై) ఆసీనులవుతారు. దేవతలు ప్రధానమైన సోమరసంతోబాటు వ్రీహి. యవధాన్యాలతో చేసిన పురోడాశాన్ని, నెయ్యి, పాలు, పెరుగు, తేనె మొదలగు

ద్రవ్యాలను స్వీకరిస్తారు. ఋత్విక్కులు, దేవతలను ఋక్కులతో ఆనందపరుస్తారు. దీర్ఘాయుర్దాయం, కుటుంబసౌఖ్యం, వీరసంతతి, యుద్ధంలో విజయప్రాప్తి, ఐశ్వర్యం మొదలగు వాటికొరకు దేవతలు ప్రార్థింపబడతారు. బ్రాహ్మణాలలో యజమానులు లేక ఋత్విక్కులు దేవతలను ఈ లోకం నుంచి విముక్తి కావాలని, స్వర్గానికి తీసుకొనిపొమ్మని ప్రార్థించటం ఎక్కడా కన్పించదు.

**దేవతలు :**

బ్రాహ్మణాలలో 33 మంది దేవతల వర్ణనలున్నాయి. వీళ్ళు భూమి, ఆకాశం, స్వర్గం - మూడులోకాలకు చెందినవాళ్ళు. వీళ్ళు మూడువర్గాలుగా ఉన్నారు.

**1. వసువులు :** వీరు ఎనిమిదిమంది. వీరినాయకుడు అగ్ని.

**2. రుద్రులు :** వీరు పదకొండుమంది. వీరి నాయకుడు ఇంద్రుడు.

**3. ఆదిత్యులు :** వీరు పన్నెండుమంది. వీరి నాయకుడు వరుణుడు. వీరు ప్రజాపతి, వషట్కారులతో కలిసి 33 మంది అవుతున్నారు (పం. విం.బ్రా. 6.2.5; శ.బ్రా. 11.4.6.5). వీరికి బృహస్పతి పురోహితుడు. వీరు సృష్టి స్థితి, లయాలకు కారకులవుతున్నారు. వసువులు అంభోలోకానికి, రుద్రులు నభోలోకానికి, ఆదిత్యులు మహర్లోకానికి అధిపతులు (తై. బ్రా. 3.8.18. 1,2,3).

వీరికి తోడుగ మరికొన్ని వర్గాలున్నాయి. వారు ఋభువులు, మరుత్తులు, సాధ్యులు, విశ్వేదేవులు, భృగ్వంగీరసులు (జై. బ్రా. 1.31.33).

దేవతలు ప్రాకృతిక శక్తులే. దేవతలు విజ్ఞానవంతులు. కాంతి మంతులు. ప్రకాశత్వంచేత దైవత్వాన్ని పొందారు. వాళ్ళు శక్తిమంతులు;

మహనీయులు. అద్భుతకార్యాలు చేస్తుంటారు. 'సత్యమే దేవతలు; అసత్యం మనుష్యులు' అని శ. బ్రా. (1.1.1.4) చెబుతోంది. ప్రజాపతి దేవతలను సృష్టించాడు. ఓషధులే దేవపత్నులని శ.బ్రా. (6.4.2.4) పేర్కొంటున్నది. జై.బ్రా.లో శబ్దప్రకంపనలే దేవతలుగా వర్ణింపబడ్డాయి. ఇంద్రుడు మనస్సు వాక్కులనుంచి జన్మించిన స్వరంగా వర్ణింపబడ్డాడు[1].

దేవతలకు మనుష్యులకుగల తారతమ్యం జై.బ్రా. (1.270) ఇలా వివరించింది. 'మనుష్యులకు నాయకుడు మనస్సు (మనుష్య ధవాః), దేవతలకు నాయకుడు జలం (దేవధవాః). మనుష్యులను మనస్సు, ప్రాణం, చక్షుస్ (కన్నులు),శ్రోత్రం(చెవులు), వాక్కు నడిపిస్తున్నాయి. దేవతలకు అపః (నీరు), వాయువు, ఆదిత్యులు, దిక్కులు, పృథివి (భూమి) మార్గదర్శకాలుగా ఉన్నాయి. మానవుడు దేవతలకు నివాసభూమిగా చెప్పబడ్డాడు[2]. భూమి దేవతలకు రథంగా వర్ణించబడింది.

దేవతలు రహస్యప్రియులు. పరోక్షంగా కార్యాలు చేస్తారు. అగ్ని, వాయు, ఆదిత్యులు మూడులోకాలకు ప్రతినిధులు. వాళ్ళు మనుష్యులుచేసే అన్ని పనులకు సాక్షీభూతులుగా ఉంటారు. అందుచేత అగ్ని ఉపద్రష్టగా, వాయువు ఉపశ్రోతగా, ఆదిత్యుడు అనుఖ్యాతగా ప్రశంసింపబడ్డారు[3].

అగ్ని, ప్రజాపతి, ఇంద్రుడు సర్వదేవతలకు ప్రతినిధులుగా వర్ణించబడ్డారు. యజ్ఞంలో సమర్పించబడ్డ హవిస్సులు అగ్నిద్వారా దేవతలకు చెందుతున్నాయి.

---

1. స యో మనసశ్చ వాచశ్చ స్వరో జాయతే స ఇంద్రః జై. బ్రా. 1.321
2. వరో వై దేవానాం గ్రామః పం. విం. బ్రా. 6.9.2
3. తస్య మేఽగ్ని రుపద్రష్టా. వాయురుపశ్రోతా ఆదిత్యోఽనుఖ్యాతా. తై. బ్రా. 3.7.5.4.

ప్రజాపతి :

ప్రజాపతి ప్రపంచసృష్టికర్త. జీవులకు ఆధారభూతుడు. ఆదిలో ప్రజాపతి ఒక్కడే ఉండేవాడు. కోరికవలన ఆతడే ప్రపంచంగా ప్రాణులుగా రూపొందాడు. మొట్టమొదట సలిలం (నీరు) ఏర్పడింది. దానినుంచి భూమి ఏర్పడింది. తరువాత దేవతలు, మానవులు, పితరులు మొదలైన సర్వప్రాణులు ప్రజాపతిచేత సృష్టింపబడ్డారు. ప్రజాపతే సృష్టికి రక్షకుడు. ప్రజాపతి యజ్ఞాన్ని ఏర్పరచి దేవతలను పోషించాడు. కనుక ప్రజాపతే యజ్ఞం అని ప్రశంసించబడ్డాడు. మొదట ఋతంచేత ప్రజాపతి గుర్తింపబడ్డాడు. బ్రాహ్మణాల్లో దేవతలందరిలో ప్రజాపతికి అగ్రస్థానం ఇవ్వబడింది.

ప్రజాపతి తనమనస్సునుంచి మానవుని, కన్నులనుంచి గుర్రాన్ని, శ్వాసనుంచి గోవును, చెవులనుంచి గొర్రెలను, కంఠస్వరంనుంచి మేకను సృష్టించాడు. మానవుడు ప్రజాపతిమనస్సు నుంచి సృష్టించబడటంచేత సర్వప్రాణులలో మొదటివాడుగా, శక్తిమంతుడుగా, బుద్ధిమంతుడుగా ఉన్నాడు. ప్రజాపతి సంకల్పంద్వారా పంచభూతాలను,ఉచ్చారణద్వారా భూః (భూమి) భువః (అంతరిక్షాన్ని) స్వః (స్వర్గాన్ని) సృష్టించాడు.

అగ్ని :

అగ్నికి, యజ్ఞానికి అవినాభావసంబంధం ఉంది. ఆహుతులన్నీ అగ్నిద్వారా దేవతలకు చెందుతున్నాయి. కనుక అగ్ని దేవతలలో ప్రథమగణ్యుడు. 'అగ్నిరగ్రే దేవతానాం' (తై.బ్రా. 2.4.3.3). అగ్ని వసువులకు నాయకుడు. దేవతలకు యజమాని (యష్టా). అగ్ని దేవతలందరికి ప్రతీక. అగ్నియే అన్నపతి; వీర్యవంతుడు. కనుక సంతానోత్పత్తికి కారకుడు (రేతోధాః). గృహస్థుడు తనను పాపాల నుంచి తొలగించమని అగ్నిని ప్రార్థిస్తాడు. అగ్నివల్ల ధూమం (పొగ), ధూమంవల్ల మేఘం, మేఘంవల్ల వర్షం కలుగుతుందని

శతపథ బ్రాహ్మణంలో చెప్పబడింది (5.3.5.17). సోమయాగంలో పశ్వులతో గూడిన అగ్నికి తర్పణోదకాలు ప్రత్యేకంగా ఇవ్వబడతాయి.

ఇంద్రుడు దేవతలకు అధిపతి. ఇంద్రుడు బలం, ఓజస్సు కలవాడు. కాబట్టి ఇంద్రుడు తనభక్తుని నాయకులలో శ్రేష్ఠునిగా చేస్తాడు. ఇంద్రాగ్నులు సర్వలోకరక్షకులుగా స్తుతింపబడ్డారు. వరుణుడు ధర్మానికి అధిపతి. సత్యాసత్యాలు వరుణుని స్వభావాలు. వరుణుడు రాజులకు రాజు, సమ్రాట్టుగా స్తుతింపబడ్డాడు. మిత్రావరుణులు క్షత్రధర్మాలకు ప్రతీకలు. ప్రాణ, అపానాలలాగా మిత్రా వరుణులు కలిసిఉన్నారు. పగటికి మిత్రుడు, రాత్రికి వరుణుడు చెంది ఉన్నారు. సోమశబ్దం చంద్రుని, సోమలతను తెలుపుతోంది. సోముడే రాజు. ఓషధులకు, వనస్పతులకు అధిపతి. సోముడు మానవుల క్షేమాన్ని పర్యవేక్షిస్తుంటాడు. సోమలతే దేవతలకు ఆహారం. ఇంద్రునికి సోమరసమే ప్రియమైన హవిస్సు.

రుద్రుడు భూతాలకు అధిపతి, సవిత ప్రేరకశక్తిగల దేవత. సవిత ప్రాణులను కర్మలను చేయుమని ప్రేరేపిస్తాడు. ఆదిత్యుని మరొక రూపమే సవిత. అశ్వినులు దేవతలజంట: దేవతావైద్యులు. దేవతలకు యజ్ఞాలలో వీళ్లు అధ్వర్యులుగా ఉంటారు (ఐ. బ్రా. 4.18). విష్ణువు దేవతలలో పెద్దవాడు (పరమః) (ఐ.బ్రా. 1.1). విష్ణువు సర్వస్వతంత్రుడు. విశ్వాత్ముడు. సర్వవ్యాపి. శతపథబ్రాహ్మణంలో 14వ కాండలో విష్ణువు సర్వదేవతలలో విజయశీలుడుగా సర్వదేవతలలో శ్రేష్ఠుడుగా స్తుతింపబడ్డాడు.

ఆదిత్యుడే మనకు కనిపిస్తున్న సూర్యుడు. ఇతడు దివ్యనేత్రాలు కలవాడు. సూర్యుడు తన వర్చస్సుచేత ప్రపంచాన్ని రక్షిస్తున్నాడు. సూర్యుడు మానవులను కర్మలు చేయుమని ప్రేరేపిస్తాడు. 'సూనం జనాః సూర్యేణ ప్రసూతాః' (తై. బ్రా. 2.8.1.3). వాయువు దేవతలలో వేగంకలవాడు. వాయువే

ప్రాణం. వాయువు వల్ల వర్షాలు కురుస్తాయి. మరుత్తులు గణదేవతలు. పితరులు యమలోకానికి చెందినవాళ్లు. వాళ్లు సుప్తులుగా ఉంటారు. 'మనుష్యా వై జాగరితం పితరః సుప్తం' (శ. బ్రా. 12.4.4.2). యజ్ఞాలలో దేవతలకు అర్పింపబడేవి హవిస్సులు. ఇవి 'స్వాహా' అనే పదంచేత అర్పించబడతాయి. పితరులకు అర్పించేవి, కవ్యాలు. ఇవి 'స్వధా' అనే పదంచేత అర్పించబడతాయి. దేవతలకు లోహ, దారుపాత్రలు వాడతారు. పితరులకు మృణ్మయ (మట్టి) పాత్రలు వాడతారు.

**స్త్రీ దేవతలు :**

అదితి భూదేవిగా, ప్రపంచానికి తల్లిగా చెప్పబడింది. ఆమె 'మహి' విశాలమైంది. ప్రపంచాన్ని భరిస్తోంది. దేవరథగా చెప్పబడింది. సరస్వతి ఇంద్రసుత్రామునికి యౌవనాన్ని కలిగించింది. సరస్వతి, వీర్యం, వాక్కు, ఇడ, భారతి సరస్వతులు ఏడవప్రయాజ, అనుయాజ ఆహుతులకు దేవతలు. భారతి ఆదిత్యునికి, సరస్వతి రుద్రునికి, ఇడ వసువు లేక అగ్నికి సంబంధించినవారుగా చెప్పబడ్డారు.

నాటి ఆర్యులు యజ్ఞంచేయుటమే శ్రేష్ఠమైన కార్యమని తలచారు. యజ్ఞం ప్రజాపతికి ప్రతీకగా తలచబడింది[1]. యజ్ఞం చేయుటంద్వారా ప్రకృతిశక్తులపై ఆధిపత్యం సంపాదించవచ్చునని భావింపబడింది. యజ్ఞం చేయుటంచేత వర్షాలుకురిసి, దేశం సుభిక్షంగా ఉంటుంది.

గోపథబ్రాహ్మణంలో యజ్ఞస్వరూపం వివరింపబడింది. యజ్ఞ ప్రక్రియలో 7 సోమసంస్థలు, 7 పాకయజ్ఞాలు, 7 హవిర్యజ్ఞాలు ఉంటాయి. అవి :

---

1. ఏష వై ప్రత్యక్షం యజ్ఞో యత్ప్రజాపతిః శ. బ్రా. 4.3.4.3.

1. సోమసంస్థలు : 1. అగ్నిష్టోమ, 2. అత్యగ్నిష్టోమ, 3. ఉక్థ్య, 4. షోడశి, 5. అతిరాత్ర, 6. అప్తోర్యామ, 7. వాజపేయ.

2. పాకయజ్ఞాలు : 1. అష్టక, 2. పార్వణస్థాలీపాక, 3. మాసిక శ్రాద్ధ, 4. పిండపితృశ్రావణి, 5. ఆగ్రహాయణి, 6. చైత్రి, 7. ఆశ్వీయుజి.

3. హవిర్యజ్ఞాలు : 1. అగ్న్యాధాన, 2. అగ్నిహోత్ర, 3. దర్శ, 4. పూర్ణమాస, 5. చాతుర్మాస్య, 6. నిరూఢ పశుబంధ, 7. సౌత్రామణి.

ఈ యజ్ఞాల క్రమమిది - అగ్న్యాధేయ, పూర్ణాహుతి, అగ్నిహోత్ర, దర్శపూర్ణమాస, ఆగ్రయణ, అశ్వమేధ, పురుషమేధ, సర్వమేధ మొదలైనవి. యజ్ఞాలు చేయడంవల్ల చెడు తొలగిపోతుంది. శుభం కలుగుతుంది. పౌర్ణమినాడు యజ్ఞాలు చేయడం శుభప్రదంగా తలచబడింది. యజ్ఞానికి 'అధ్వర' మనే పర్యాయపదం ఉంది. ధ్వర మంటే హింస. అధ్వరమంటే హింసలేని కార్యం. యజ్ఞంలో జరిగే పశువధ హింసగా భావించబడలేదు. హింస అంటే శత్రుత్వభావంతో, ద్వేషంతో ప్రాణులను గాయపరచటం, చంపటం.

తత్త్వం :

పరబ్రహ్మ :

వేదాలలో ప్రధాన ప్రతిపాద్యం పరబ్రహ్మం. వైదికధర్మంలో పరమసత్యం బ్రహ్మ. ఆ బ్రహ్మసాక్షాత్కారమే మానవుని పరమలక్ష్యం. దేవతలలో ఏకత్వాన్ని అన్వేషించిన మహర్షులు పరబ్రహ్మనే దేవతలకు నియామకమైనట్టి ఏకతత్త్వంగా గుర్తించారు. పరబ్రహ్మ వేదసారమైన ఓంకారస్వరూపుడు. గోపథబ్రాహ్మణంలో ఓంకారం త్రిమూర్త్యాత్మకంగా

(బ్రహ్మ, విష్ణు, శివస్వరూపంగా) వర్ణింపబడింది. శతపథబ్రాహ్మణంలో మొదట పరబ్రహ్మ 'ప్రథమజాడు' గా పేర్కొనబడ్డా, చివరి అధ్యాయాలలో స్వయంగా అనాదియై జగత్తునంతా సృష్టించిన ప్రథమతత్త్వంగా వర్ణింపబడ్డాడు. 'ఆదిలో బ్రహ్మయే విశ్వం, బ్రహ్మయే దేవతలందరికీ సృష్టికర్త' (శ. బ్రా. 11.1.11.1). అదే బ్రాహ్మణంలో ఒకచోట (6.1.1.8) త్రయీవిద్యయే పరబ్రహ్మ అని చెప్పబడింది. ఇలా బ్రాహ్మణవాఙ్మయంలో సర్వజగత్తుకు మూలకారణం, చరమలక్ష్యం అయిన ఒక ఉదాత్త ఆధ్యాత్మికతత్త్వంగా పరబ్రహ్మ రూపొందింది. తరువాతి ఉపనిషత్తులు పూర్తిగా బ్రహ్మతత్త్వ విచారణకే అంకితమైనాయి. ఉపనిషత్తులలో 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' అని సూత్రప్రాయంగా చెప్పబడింది. బ్రహ్మ, ఆత్మ రెండూ ఒక్కటే అనే శాండిల్యుని సిద్ధాంతం శతపథబ్రాహ్మణం (10.6.3) లో ఉంది. ఇదే ఉపనిషత్తుల ప్రధానసిద్ధాంతం.

**ఆత్మ :**

బ్రాహ్మణాలలో 'ఆత్మవిచారం' ఉంది. ఆత్మ సహజమైంది. అది ప్రాణులకు చైతన్యాన్ని కలిగిస్తుంది. శరీరంకంటే ఆత్మ భిన్నమైంది అని గుర్తింపబడింది. తైత్తిరీయబ్రాహ్మణం ఆత్మ శరీరం కలిసిఉండాలి అని బోధిస్తున్నది[1]. ప్రజాపతి క్షేత్రజ్ఞునిగా ప్రాణులలో ప్రవేశించాడు. ఆహారాన్ని స్వీకరించి, పేరును, రూపాన్ని పొందాడు (తై.బ్రా. 3.10.10.5; 2.2.7.1).

వైదికధర్మంలోని ప్రాథమికసిద్ధాంతాలు, సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు, ఆత్మ, జననమరణ పునర్జన్మ చక్రాలగూర్చి శతపథ బ్రాహ్మణం (3.2.2.23) వివరించింది. మానవశరీరం పదిప్రాణాలను ఒక ఆత్మను కలిగి ఉంది. ఇవే ఏకాదశరుద్రులు (శ. బ్రా. 11.6.3.7).

---

1. ఆత్మా చ త్వా తమా చ శ్రీణతామ్ తై. బ్రా. 3.7.9.3.

ముల్లోకాలు :

భూమి, అంతరిక్షం, స్వర్గం మూడులోకాలుగా గుర్తింపబడ్డాయి. వీటిలో భూమి 'ఇయం' (ఇది) అనే సర్వనామంతోను, స్వర్గం 'అసౌ' (అల్లది) అనే సర్వనామంతోను సూచింపబడింది. తైత్తిరీయబ్రాహ్మణంలో (3.8.18.5,6) భూమిని గురించి 'ఈ లోకం భూతకాలం ఆ లోకం (స్వర్గం) భవిష్యత్కాలం' అని చెప్పబడింది.

స్వర్గం :

తైత్తిరీయబ్రాహ్మణంలో 'దివః శ్యేన' అనే ఇష్టిలో స్వర్గలోకపు ఏడుద్వారాలను గురించి చెప్పబడింది. ఆశా, కామ, బ్రహ్మ, యజ్ఞ, ఆపః, అగ్ని, అనువిత్త అని వాటిపేర్లు. ఇవి ఏడు యథార్థానికి ఇష్టులే. వీటిని తైత్తిరీయబ్రాహ్మణం (3.12.2.9) స్వర్గద్వారాలుగా వర్ణించింది.

ఇలా తైత్తిరీయబ్రాహ్మణం స్వర్గాన్నిగురించి నిశ్చయంగా చెబుతుంటే కొన్ని బ్రాహ్మణాలలో స్వర్గం ఉందా? లేదా? అనే సందేహం (శ. బ్రా. 1.2.2.21; పం.విం.బ్రా. 4.6.17); కొన్నింటిలో 'లేదు' అనే సమాధానం కూడ ఉంది. జైమినీయబ్రాహ్మణంలో (1.291) 'ఎవడు తెలిసినదాని నుంచి తెలియనిదానికి వెడతాడు? పరలోకం అంతరిక్షానికి అవతల ఉంది. అది చాలా లోతైన బావిలో చీకటి కనిపించినట్లు ఉంది. కాబట్టి స్వర్గం అక్కడ ఉందో లేదో ఎవరికి తెలుస్తుంది?' అని చెప్పబడింది. ' ఆ లోకం నిజంగా ఈ లోకంలోనే ఉంది' 'అస్మిన్ లోకే అసౌ లోకః' (జై. బ్రా. 1.291).

తైత్తిరీయబ్రాహ్మణంలో (3.3.10.2) పుణ్యకర్మయే సుకృత లోకమనీ, సత్యమే సుకృతలోకమనీ (3.3.6.11) చెప్పబడింది. మరొకచోట సూర్యలోకమే స్వర్గమని చెప్పబడింది. ' ఏష (ఆదిత్యః) స్వర్గో లోకః ' (3.8.10.3). ఇది మరణానంతరం పొందదగింది.

పుణ్యకార్యాలు చేయటంవల్ల స్వర్గం లభిస్తుందని శతపథ బ్రాహ్మణం (6.5.4.8) చెబుతోంది. 'దేవా వై యజ్ఞేన శ్రమేణ తపసాహుతిభిః స్వర్గం లోకమాయన్' (యజ్ఞాలు చేయటం తపస్సు చేయటం ఆహుతులవల్ల స్వర్గం లభిస్తుంది) అని ఐతరేయబ్రాహ్మణం (3.42) చెబుతోంది.

పరలోకాలలో ప్రాణులు జన్మించటంలేదు. 'న హి అముష్మిన్ లోకే పశవః ప్రజాయంతే' (పం. విం. బ్రా. 20.16.7). భూమిపై ప్రాణుల జీవనం గురించి చెప్పబడింది. సంపూర్ణమానవజీవనం 100 సంవత్సరాలు. అది పూర్ణాయుష్యంగా తలచబడింది[1]

బ్రాహ్మణాలు మానవజీవితం బుద్బుదప్రాయం (నీటిబుడగ వంటిది) కాబట్టి త్వరగా అగ్న్యాధానం స్వీకరించమని, అగ్నిహోత్రాన్ని వాయిదావేయవద్దని హెచ్చరిస్తున్నాయి (శ. బ్రా. 2.13.9)

మృత్యువు :

మరణం సాధారణమైంది. అది జీవితానికి సమాంతరంగా నడుస్తోందని శతపథబ్రాహ్మణంలో (10.3.6.16, 17) చెప్పబడింది. సంవత్సరం, కాలం, మృత్యువు, అంతకమని పిలువబడుతున్నాయి[2]. పగలు, రాత్రి మానవుల ఆయుష్యం నశిస్తోంది. ఆయుఃపరిమాణం 100 సంవత్సరాలయినా పురుషుడు 100 సంవత్సరాలకంటే ఎక్కువ జీవించగలడు[3]. ఇది ఎలా సాధ్యపడుతుందోగూడ బ్రాహ్మణాలలో చెప్పబడింది.

---

1. దీర్ఘాయుత్వాయ శతః శరదాయు: శతం శరద్భ్యయం ఆయుషే వర్చసే
   తై. బ్రా. 1.2.1.19.20.
2. ఏష వై మృత్యుః యత్ సంవత్సరః ఏష హి మర్త్యానాం అహోరాత్రాభ్యాం ఆయుః క్షిణోతి శ. బ్రా. 10.3.2.1., 2.11.
3. అపి హి భూయాంసి శతద్వర్షేభ్యః పురుషో జీవతి శ. బ్రా. 1.9.3.19.

కౌషీతకీబ్రాహ్మణంలో పునర్జన్మకు బదులుగా 'పునర్మృత్యు' శబ్దం (25-1) ప్రయోగింపబడింది. బ్రాహ్మణాలన్నీ పునర్జన్మ సిద్ధాంతాన్ని సమ్మతించాయి. అయితే పునర్జన్మకు బదులుగ 'పునర్మృత్యు' శబ్దం వాడటం ఈ బ్రాహ్మణంలోని విశేషం. శతపథ బ్రాహ్మణంలో 'అతి హ వై పునర్మృత్యుముచ్యతే' (11.5.6.9) అని పునర్జన్మ గూర్చి చెప్పబడింది.

యజ్ఞాలనాచరించటంవల్ల మానవుడు మరణాన్ని, పునర్జన్మ అనే చక్రాన్ని జయిస్తాడు. రాహుగణగోతముడు 'మిత్రవింద' అనే యజ్ఞాన్ని తెలిసికొన్నాడు. అది విదేహరాజైన జనకునికి తెలిసింది. ఈ యజ్ఞం చేయుటంవల్ల అతడు పునర్జన్మపరంపరను, మరణాన్ని జయించాడని శతపథబ్రాహ్మణంలో (11.4.3.20) చెప్పబడింది. దేవతలు గతజన్మల, భవిష్యజ్జన్మల జ్ఞానం ప్రసాదించండని ప్రార్థింపబడ్డారు. విద్యాజ్ఞానం అమృతత్వాన్ని పొందటానికి అవసరం. జ్ఞానంలేకుండా కేవల కర్మాచరణ దానికి తోడ్పడదు. 'సావిత్రవిద్య' తెలిసినవాడు మరణం, పునర్మరణం అనే చక్రాన్ని దాటగలడని తైత్తిరీయబ్రాహ్మణం (3.10.11.1,2) తెలియజేస్తున్నది.

మానవుడు దేవతలసాయుజ్యం, సాలోక్యం పొందటంకూడ బ్రాహ్మణాలలో వర్ణింపబడింది[1].

తైత్తిరీయబ్రాహ్మణంలో ఒకచోట (3.10.7.3) 'సశరీర ఏవస్వర్గం లోకమేతి' అని శరీరంతో స్వర్గం పొందటంగూడ తెలుపబడింది.

సంతానం :

మానవజీవితం సంపూర్ణతను పొందటానికి సంతానం అవసరం. 'ప్రజయా హి మనుష్యః పూర్ణం' - తై. బ్రా. 3.3.10.4. ఐతరేయబ్రాహ్మణం

1. ఆదిత్యస్య చ సాయుజ్యం గచ్ఛతి తై. బ్రా. 2.3.7.2.
స ఏతేషామేవ సలోకతాం సాయుజ్యమశ్నుతే తై. బ్రా. 3.10.10.5.

(7. 13) ' న పుత్రస్య లోకో అస్తి' అని పుత్రుడు లేనిదే తల్లిదండ్రులకు ఆనందం పరలోకం లేదని చెబుతోంది. పుత్రులు పూర్వజన్మ కర్మఫలంచేత కలుగనప్పుడు పుత్రులు కలగటానికి 'పుత్రేష్టి'ని చేయాలి. తైత్తిరీయ బ్రాహ్మణంలో (1.5.5.6) 'సంతానం వల్ల వంశాభివృద్ధి అవుతుంది. 'ఓ మర్త్యుడా, సంతానమే నిన్ను అమరునిగా శాశ్వతునిగా చేస్తుంది' అని చెప్పబడింది.

సత్యం :

సత్యమంటే చూసింది చూసినట్లుగ విన్నది విన్నట్లుగా చెప్పడం. ఏదైనా వివాదంలో నేను నా కళ్ళతో చూశాను అంటే దానిని అందరూ విశ్వసించేవారు[1]. తాండ్యబ్రాహ్మణం (18.2.9) 'ఋతేనై నైనం స్వర్గం లోకం గమయతి' అని సత్యం పలికినవాడు స్వర్గాన్ని పొందుతాడని చెబుతున్నది. ఋతం మానసికసత్యం. సత్యం వాచిక సత్యం కాబట్టి 'ఋతమితి సత్యం' అని శతపథబ్రాహ్మణం (6.7.3.11) ఋతం, సత్యం ఒకటే అని చెబుతోంది.

అహింస :

యజ్ఞాలలో పశువధ జరుగుతుంది. కాబట్టి యజ్ఞం హింసామయం అనే దురభిప్రాయం ఉంది. అశ్వమేధయాగంలో అహింస కోసం 'పర్యగ్నీకరణం' తరువాత అడవి జంతువులన్నీ విడిచిపెట్టబడతాయి[2]. ఇది అనాటి అహింసా దృక్పథాన్ని వెల్లడిస్తోంది. వేదీనిర్మాణంలో భూమిని కొయ్యకత్తితో చదునుచేస్తారు. భూమికి హింసకలుగకుండా కొంతగడ్డిని వదలుతారు (శ. బ్రా. 1.2.2.15). భూమికి రోలువల్ల హింస కలుగకుండ భూమిమీద

1. చక్షుర్వా ఋతం తస్మాద్యతరో వివదమానయోరాహా
మనుష్యా చక్షుషాఽదర్శమితి తస్య శ్రద్దధతి ఐ. బ్రా. 2. 40.
2. పర్యగ్నీ కృతానారణ్యాన్ ఉత్సృజంతి అహింసాయై తై. బ్రా. 3.9.3.3.

జింకచర్మాన్ని పరచి, దానిపైన రోలును ఉంచి పిండిని దంచుతారు (శ. బ్రా. 1.1.4.5, 6.7). ఒక క్రతువులో 'స్వధితి' అనబడే కత్తి 'ఓ స్వధితీ! దీనిపట్ల ప్రవర్తించకు' అని సంబోధింపబడింది.

పాపం :

పాపాలు చేయటానికి పరిసరాలప్రభావం తోడ్పడుతుంది. వృజినం (కుటిలవర్తనం), అన్నృతం, చెడునడతలు, పాపకార్యాలు. వీటికి విరుద్ధమైనవి ఋజుకర్మ, సత్యం, సుచరితాలు (తై. బ్రా. 3.3.7.9,10). జైమినీయ బ్రాహ్మణంలో (1.97) విద్రాస్వభావం, సోమరితనం, కోపం, ఆకలి, జూదక్రీడలలో, కామక్రీడలలో అతికాంక్ష పాపాలుగా చెప్పబడ్డాయి.

సోమలతను నలగగొట్టడం కూడా చెడ్డపనిగా ఆనాటివారు భావించారు. దానికోసం సోమలతను క్షమించమని ప్రార్థిస్తారు (తై. బ్రా. 3.7.13.1). పాపాలనుంచి గృహస్థుల్ని అగ్ని రక్షిస్తాడు. అసత్యవాదులను వరుణుడు శిక్షిస్తాడు.

ఇలా బ్రాహ్మణాలలో యజ్ఞకలాపవివరణతో బాటు మత తత్త్వాలను గురించి విశేషాలెన్నో వివరించబడ్డాయి. బ్రాహ్మణాలలోని తత్త్వవిచారబీజాలే తరువాతి ఉపనిషత్తులలో విశ్వరూపాన్ని ధరించాయి.

— కె. వి. ఆర్.

## 1. 15 కవితాసౌందర్యం

వేదం విశ్వవిజ్ఞానానికి నిధి అనే సత్యాన్ని ప్రపంచంలోని మేధావులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. ఈ విశ్వాన్ని సృష్టించిన పరమేశ్వరుణ్ణి కవులకు కవిగా అంగీకరించగలిగితే, ఆయన ముఖ కమలంనుంచి బయల్పడిన వేదం సర్వకావ్యమర్యాదలకు మార్గదర్శకం అవుతుంది. సాహితీసంప్రదాయావిర్భావం అగ్నిపురాణంలో కనిపించినప్పటికీ; నిజానికి ఆ సంప్రదాయబీజాలకు వేదమే మూల కందమని సూక్ష్మపరిశీలనవల్ల తెలుస్తుంది.

మంత్ర-బ్రాహ్మణ భాగద్వయాత్మకమైన వేదంలో మంత్రభాగం యజ్ఞాదికర్మానుష్ఠానానికి ప్రత్యక్షంగా ఉపయోగపడుతూ, ప్రభుసమ్మితంగా ఉంటు ంది. ఆ మంత్రాలకు వ్యాఖ్యానంవంటిది బ్రాహ్మణభాగం. దీనిలో అక్కడక్కడ సందర్భానుసారంగా కొన్ని సంవాదాలూ, ఉపాఖ్యానాలూ ఆ యా క్రతువిధులకు సంబంధించిన అర్థవాదవాక్యాలూ ఉంటాయి. అందువల్ల మంత్రభాగంలోకంటే బ్రాహ్మణాలలో కవితాచ్ఛాయలు ఎక్కువగా కనిపిస్తాయి.

'కవి' శబ్దం మొట్టమొదట వేదంలో కనిపిస్తుంది. అది బ్రహ్మపరంగా కొన్నిచోట్ల వాడబడింది. కవియొక్క ధర్మం కవిత్వమైతే, అతడుచేసిన వాఙ్మయరూపకర్మ కావ్యమౌతుంది. ఆదికవి అని ప్రసిద్ధిగాంచిన వాల్మీకిమహర్షి వ్రాసిన శ్రీమద్రామాయణం వేదతుల్యం. వేదవ్యాసుడు రచించిన భారతం పంచమవేదమని ప్రసిద్ధిగాంచింది. వ్యాసప్రణీతమైన శ్రీమద్భాగవతం సర్వ వేదసారమన్నది జగద్విదితం. ఇలాంటి దృష్టితో చూసిన ఈ మహర్షుల కావ్యేతిహాసరచనకు వేదాలే మార్గదర్శకాలని స్పష్టమౌతున్నది.

కావ్యానికి ఇతివృత్తం ఆధారభూతమైనది. శబ్దశక్తులూ శబ్దార్థాలంకారాలూ, నానావిధవర్ణనలూ ప్రకృతి సత్యాలను పట్టి యిచ్చే

లోకోక్తులూ మొదలయినవి కావ్యసౌధజీవసౌందర్యాలకు అత్యావశ్యకాలౌతాయి. వేదంలో ముఖ్యంగా ఋగ్వేదంలో ఐలోపాఖ్యానం, మారుతోపాఖ్యానం, నాచికేతోపాఖ్యానం మొ॥ ఉపాఖ్యానాలు చిన్నవీ, పెద్దవీ ఎన్నోఉన్నాయి. ఇవన్నీ కవితాశిల్పానికి నిధులుగా పేర్కొనదగినవి. కవికులగురువైన కాళిదాసు ఐలోపాఖ్యానాన్ని ఆధారంగా చేసికొని విక్రమోర్వశీయాన్ని రచించాడు. సంహితాభాగం సాంద్రపదగుంఫన కలిగి ప్రౌఢశైలిలో ఉండగా బ్రాహ్మణభాగం ప్రసాదగుణభరితమై ద్రాక్షాపాకంలో ఉంటుంది.

అలంకారాలకన్నింటికి మూలమని చెప్పదగిన ఉపమాలంకారం వేదంలో విస్తృతంగా కనిపిస్తుంది. శ్యేనయాగాన్ని గూర్చి చెప్పే-

**యథా వై శ్యేనో నిపత్యాదత్తే ఏవమయం**
**ద్విషన్తం భ్రాతృవ్యం నిపత్యాదత్తే**

ఈ వాక్యంలో ఉపమాలంకారం స్ఫుటంగా కనిపిస్తుంది. శ్యేనయాగాలకు ఉపమానోపమేయభావం, 'యథా' 'ఏవం' పదాలకు ఉపమావాచకత్వం, 'నిపత్యాదత్తే' అన్నదానిలో సమానధర్మం తెలిపే ఈ సన్నివేశం సంపూర్ణోపమకు చక్కని ఉదాహరణం అవుతున్నది. ఇదే విధంగా -

**ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।**
**తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి ॥**

ఈ మంత్రంలో రూపకాలంకారం ధ్వనిస్తున్నది. ఇక్కడ వర్ణింపబడిన పక్షులు రెండూ జీవాత్మపరమాత్మలు. వృక్షం నశ్వరమైన శరీరం, పిప్పలం కర్మఫలం. రెండు పక్షుల్లో భోక్తయైన పక్షి జీవాత్మ. సాక్షిమాత్రంగా ఉన్న పక్షి పరమాత్మ. ఉపమేయాలైన జీవాత్మాదులు ఉపమానాలైన సుపర్ణాదులుగా రూపింప బడ్డాయి. 'ఆదిత్యో యూపః' అనే వాక్యంగూడ రూపకాలంకారానికి ఉదాహరణమౌతుంది.

గోపథబ్రాహ్మణంలో రాత్రి పుట్టుకను గురించిచెప్పే సందర్భంలో -

**మృత్యోస్తమ ఇవ హి రాత్రిః మృత్యుర్వై తమః**

అని చెప్పబడింది. ఈ వాక్యం పూర్వార్థంలో ఉపమ, ఉత్తరార్థంలో రూపకం విస్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఈ బ్రాహ్మణంలోనే బ్రహ్మ కావించిన సృష్టిక్రమాన్ని వివరించే సందర్భం చూడండి :

*స ఆత్మత ఏవ త్రీన్ లోకాన్నిరమిమత. పృథివీమన్తరిక్షం*
*దివమితి, స ఖలు పాదాభ్యామేవ నిరమిమతోదరా*
*దన్తరిక్షం మూర్ధ్నో దివమ్.* *గో. బ్రా. 1.6.*

పృథివ్యంతరిక్షద్యులోకాలు క్రమంగా బ్రహ్మయొక్క పాదోదర శిరస్సుల నుండి పుట్టినట్లు వర్ణింపబడింది. ఇక్కడ క్రమాలంకారం వ్యంగ్య మర్యాదలో సూచితమైంది. అంతేకాక ఈ క్రమంవల్ల ఆ యా లోకాలే బ్రహ్మయొక్క ఆయా అవయవాలుగా నిరూపింపబడుతున్నాయన్నది ఇక్కడ స్ఫురించే వ్యంగ్యాంతరం.

ఇంకో సందర్భం చూడండి :

*స ఖలు పృథివ్యా ఏవాగ్నిం నిరమిమతాన్తరిక్షాద్వాయుం దివ*
*ఆదిత్యమ్* *(గో. బ్రా. 1.6)*

ఇందులో కారణమాలాలంకారం ధ్వనిస్తున్నది. కౌషీతకి బ్రాహ్మణంలో రేయింబవళ్లు మృత్యుదేవత బాహువులుగా పోల్చబడ్డాయి చూడండి :

**అథో మృత్యోర్హవా ఏతౌ విరాజబాహూ యదహోరాత్రే**

**(కౌ. బ్రా. 1.2)**

ఇది ఉపమాలంకారమే అయినా, కాలం అజేయమైనది, మృత్యువు నిత్య సన్నిహితమైనది-అన్న పరమసత్యం దీనివల్ల సూచితమౌతున్నది.

ఈవిధంగా అలంకారాంతరాలకు కూడా బీజప్రాయాలైన సన్నివేశాలు వేదంలో మనకు దర్శనమిస్తాయి.

పైన పేర్కొనబడిన ఘట్టాలు ఉపమాద్యర్థాలంకారాలకు ఉదాహరణాలు కాగా, క్రింది వాక్యాలు శబ్దాలంకారావిర్భావానికి శ్రీకారం చుట్టాయి :

**స భూయో ఽ శ్రామ్యత్ భూయో ఽ తప్యత్,**
**భూయ ఆత్మానం సమతపత్**

అనే గోపథబ్రాహ్మణవాక్యం వృత్త్యనుప్రాసాలంకారానికి మార్గదర్శకమై తద్వారా ఇతర శబ్దాలంకారవ్యాప్తికి కారణమౌతున్నది.

**బ్రహ్మ హ వై బ్రహ్మాణం పుష్కరే ససృజే,**
**స ఖలు బ్రహ్మా సృష్టః**

ఇలాంటి వాక్యాలు శబ్దాలంకారవ్యాప్తిని సమర్థిస్తున్నాయి. అయితే ఇవి లౌకికకావ్యంలో లాగా కేవలసౌందర్యసాధనాలు మాత్రమేకాక, తపస్సు ప్రధానమనీ, పరబ్రహ్మ చతుర్ముఖబ్రహ్మను సృష్టించాడనీ, బ్రహ్మయే సృష్టి అనే పరమార్థాలను సైతం బోధిస్తున్నాయి. 'బ్రహ్మ సృష్టిః' అనే రూపకం కేవలాలంకారం కాక వ్యాపనశీలమైన బ్రహ్మతత్త్వాన్ని తెలియజేస్తుంది.

అలంకారశాస్త్రంలో పేర్కొనబడిన అభిధ, లక్షణ, వ్యంజన అనే మూడు శబ్దవృత్తులకు ఆధారం వేదంలో కనిపిస్తుంది. 'ఆయుర్ఘృతం' అన్నవాక్యంలో లక్షణ ఉన్నది. ఘృతమంటే నెయ్యి అని వాచ్యార్థం. నెయ్యి ఆయువుకాదు. వాచ్యార్థం పొసగనప్పుడు స్వీకరించబడేది లక్షణ. ఘృతం ఆయువుకాదు కాబట్టి 'ఆయుః' పదానికి ఆయుర్వర్ధనం అన్న అర్థం చెప్పుకోవాలి. ఇది లక్ష్యార్థం. 'మహాగ్నిచయనం' అనే క్రతువులో ఇటుకలను పేర్చి తయారుచేసిన వేదికపైన అగ్నిని ఉంచి హోమంచేస్తారు. 'అగ్నిః చీయతే

అస్మిన్ కర్మణి' అనే వ్యుత్పత్తివిబట్టి నిజానికి ఇందులో ప్రోగుచేయబడేవి ఇటుకలు (ఇష్టకాః) అయినా, ఇవి అగ్నిని ధరించేవి కాబట్టి వీటికి 'అగ్ని' అనే పేరువచ్చి ఈ యాగం అగ్నిచయనం అని వ్యవహరింపబడింది. అలాగే 'యజ్ఞ' పదం నిష్కామకర్మాచరణబోధకమై మానవజీవితం త్యాగమయం కావాలని ధ్వనింపజేస్తూ వ్యంజనకు నాంది పలికింది.

ఏరుదాటిన తర్వాత .............

ఇదేవిధంగా బ్రాహ్మణాలలో లోకవ్యవహారములు, మనః ప్రవృత్తులు చాలా సహజంగా వర్ణింపబడి, కొన్ని లోకోక్తులు, పలుకుబడులు పుట్టడానికి దోహదం చేశాయి. ఐతరేయబ్రాహ్మణంలోని శునశ్శేపోపాఖ్యానంలో వర్ణింపబడిన హరిశ్చంద్రుడు మనకు తెలిసిన సత్యహరిశ్చంద్రుడు కాదు. పుట్టబోయేబిడ్డను యాగపశువుగా సమర్పిస్తానని మొక్కుకొని వరుణదేవుని అనుగ్రహంతో పుత్రుణ్ణి పొందిన హరిశ్చంద్రుడు, మాటకు నిలబడక మొక్కుబడిని వాయిదా వేస్తూ తుదకు వ్యాధిపీడితుడైనాడు. గత్యంతరంలేక 'అజీగర్తుడనే గృహస్థుని రెండవకొడుకైన శునశ్శేపుని బలిపశువుగా తీసుకువెడతాడు. అయితే శునశ్శేపుడు దేవతలను ప్రార్థించి విముక్తుడై ప్రాణాలు కాపాడుకొంటాడు.

ఇక్కడ తనపని నెరవేరింతర్వాత మేలుచేసినవానిని మరచి పోవటం అనే మానవదౌర్బల్యం నిరూపింపబడి, 'ఏరుదాటిన తర్వాత తెప్ప తగలబెట్టటం' అనే లోకోక్తి సూచింపబడుతున్నది. అయితే ఈ లౌకికార్థంవెనుక వరుణాధారమైన సస్యసంపదను మానవజాతి శ్రేయస్సుకై సంరక్షించుకోవడానికి పుట్టిన ప్రతివ్యక్తీ అంకితం కావాలనీ, అలాకాకపోవడం మానవరూపంలో ఉన్న దైవానికి ద్రోహం చేయడమే అన్న పరమార్థం కూడ ధ్వనిస్తూంది.

తనకుమాలిన ధర్మం ..........

తలవకారబ్రాహ్మణంలో అగ్నిహోత్రకర్మ ప్రతిపాదనఘట్టంలో దేవతలందరికీ హవిస్సులు మోసుకొని వెళ్లవలసిన అగ్ని ముందుగా తనకు హవిస్సు ఇవ్వనిదే ఊరుకోడు. ఇది 'తనకు మాలిన ధర్మం మొదలుచెడ్డ బేరం' అన్న లోకోక్తిని స్ఫురింపజేస్తుంది. దేవతలు అగ్నిముఖులుగాబట్టి అగ్నిలోనే హోమంచేయడం అనివార్యమన్నది పరమార్థం.

ఈ బ్రాహ్మణంలోనే మరొకచోట ఒకఋత్విక్కు 'మోచ్చైరితి హోవాచ' అని అంటాడు. అనగా 'ఈ ఋక్కును నీవు పెద్దగా పఠించవద్దు. భూమి వింటుంది' అని దీని అర్థం. బహుశః 'గోడకు చెవులుంటాయి' అనే సామెత ఇటువంటి సందర్భాల నుండి పుట్టి ఉండవచ్చు.

కొంచెం ఎక్కువ :

శతపథబ్రాహ్మణంలో సోమవిక్రయం గురించి చాలా విచిత్రంగా చెప్పబడింది. దేవతలకతిప్రియమైనదీ సోమం. ఈ సోమంలతను ఒకవ్యక్తి అమ్మజూపగా 'ఆవునిస్తే అమ్ముతావా? బంగారం తీసుకొని అమ్ముతావా? లేక వస్త్రానికిస్తావా?' అని యజమాని అడుగుతాడు. అప్పుడు అమ్మేవ్యక్తి 'ఇంతకన్నా సోమం కొంచెం ఎక్కువధర కలది' అంటాడు. ఈ సంభాషణ క్రయవిక్రయాలను చేసే మానవమనస్తత్వాన్ని తెలియజేస్తుంది :

స ఆహ సోమవిక్రయిన్ క్రయ్యస్తే సోమో రాజా
ఇతి క్రయ్య ఇత్యాహ సోమవిక్రయీ. తం
వై తే క్రీణానీతి క్రీణీహీత్యాహ సోమవిక్రయీ.
కలయా తే క్రీణానీతి, భూయో వామతః సోమో
రాజార్హ తీత్యాహ సోమ విక్రయీ. భూయ ఏవాతః

*సోమో రాజాఽర్హతి మహాంస్త్వేవ గోర్మహిమేత్యధ్వర్యుః ....*
*ఏ ఆహా వస్త్రం తే వస్త్రం తే ఛాగా తే ధేనుస్తే మిథునౌ*
*తే గావౌ తిస్రః ..... అథ హిరణ్యే వాచయతి శుక్రం త్వా*
*శుక్రేణ క్రీణామి ... తత్తతః సోమవిక్రయ్యాదత్తే.*

( శ. బ్రా. 3.3.31.7.)

ఎద్దేవా :

లోకంలో హేళనచేయడం అనే అర్థంలో 'ఎద్దేవా' చేయటం అనే పదం వాడుకలో ఉంది. తైత్తిరీయంలో -

**యదేవాదేవ హేడనం దేవాసశ్చకృమా వయం**

అన్న వాక్యంలో హేడనపదసాహచర్యంవల్ల 'యదేవా' పదం హేళనార్థకమై క్రమంగా 'ఎద్దేవా' చేయడం అన్న పలుకుబడికి దారి తీసుండవచ్చు.

ఓంకారాన్ని వివరించే సందర్భంలో గోపథబ్రాహ్మణంలో ఒక సాహిత్యానికేగాక సమస్తశాస్త్రాలకు, వాఙ్మయాలకు సంబంధించిన ధాతువులు, ప్రత్యయాలు, విభక్తులు, వచనాలు విశదీకరింపబడ్డాయి. అక్కడే -

*సదృశం త్రిషు లింగేషు సర్వాసు చ విభక్తిషు ।*
*వచనేషు చ సర్వేషు యన్నవ్యేతి తదవ్యయమ్ ॥*

అన్న అవ్యయలక్షణంతో బాటు ఛందో, వర్ణక్రమ, నిరుక్తాదులను గురించి కూడ చెప్పబడింది.

వేదంలో కొన్ని సంవాదాలు నాటకంలోని పాత్రల సంభాషణల్లాగా ఉంటాయి. ఉదాహరణకు అశ్వమేధయాగంలోని హోత-బ్రహ్మల సంవాదాన్ని చూడండి :

> కిగ్గ్స్విదాసీత్పూర్వచిత్తిః కిగ్గ్స్విదాసీద్బృహద్వయః
> కిగ్గ్స్విదాసీత్పిశంగిలా కిగ్గ్స్విదాసీత్పిలిప్పిలా
> ద్యౌరాసీత్పూర్వచిత్తిరశ్వ ఆసీద్బృహద్వయః
> రాత్రిరాసీత్పిశంగిలా విరాసీ త్పిలిప్పిలా (తై. సం. 7.4.18)

పై వాక్యాలలో 'పుట్టుకతోనే జ్ఞానం కలవారెవరు' ఇలాంటి ప్రశ్నలను హోత అడగటం, బ్రహ్మ-'దేవతలు'-అనే ఇలాంటి సమాధానాలివ్వటం మనం గమనించవచ్చు.

గోపథబ్రాహ్మణంలో ఓంకారాన్ని గురించి ప్రశ్నలు సమాధానాలు కూడా ఇలాగే కనిపిస్తాయి-

> *ఓంకారం పృచ్ఛామః; కో ధాతుః? కిం ప్రాతిపదికం?*
> *కిం నామాఖ్యాతం? కిం లింగం? కిం వచనం? ....*
> ( గో. బ్రా. 1.24).

సంస్కృతనాటకోత్పత్తికి ఈ సంవాదాలే మూలమని విజ్ఞులైన విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

దేవాసురసంగ్రామఘట్టాలు, వీరరసస్ఫోరకాలై రసోత్పత్తికి నాంది పల్కుతున్నాయి.

కాలగతిలో చక్కని పరిణామంచెందిన ఆలంకారికుల లక్షణాలతో తుల్యం కాకపోయినా కొంచెం అటుఇటుగా, సూక్ష్మరూపంలో కావ్యసౌందర్య సాధనాలనదగిన అర్థాలంకారాదులకు, కావ్యాత్మ అనదగిన ధ్వనికి - నానావిధాలైన లోకోక్తులకు, ప్రకృతి సత్యాలను వెలార్చే చక్కని చిక్కని పలుకుబళ్ళకూ వేదమే ఆధారమనటం స్వభావోక్తి అనవచ్చు.

— పి. ఆర్. ఎస్.

## 1. 16. భాషాపరిణామం - గద్యవికాసం

వేదాలలో సంహితాభాగం బ్రాహ్మణభాగం అని రెండు విభాగాలు ఉన్నాయి. సంహితల స్వరూపం ఒక విధంగా ఉంటుంది, బ్రాహ్మణాల స్వరూపం మరొకవిధంగా ఉంటుంది. సంహితలు - ప్రధానంగా ఋక్సామాథర్వసంహితలు ఛందోబద్ధంగా ఉన్నాయి. సంహితల అర్థాన్ని మంత్రాల వినియోగాన్ని బోధించడానికి ఉద్దిష్టమైనవి బ్రాహ్మణాలు. ఈ అర్థాన్ని విశదీకరించేటప్పుడు కొన్ని ప్రశంసావాక్యాలు, లేదా నిందావాక్యాలు మొదలైనవాటినీ, చెప్పేవిషయానికి అనుగుణమైన కొన్ని ఉపాఖ్యానాలనీ చేర్చడం సహజం. వ్యాఖ్యానం కూడా పద్యరూపంలో ఉంటే దాన్ని అర్థం చేసికోవడం కూడా కష్టమే అవుతుంది. అందుచేత సంహితావ్యాఖ్యానరూపాలైన బ్రాహ్మణాలలో గద్యప్రయోగం కనబడుతుంది. కొన్ని ప్రశంసా నిందారూపాలైన వ వ్యాలు (వీటినే అర్థవాదలంటారు), అక్కడక్కడ చిన్న చిన్న ఉపాఖ్యానాలు కూడా బ్రాహ్మణాలలో కనబడుతున్నాయి. ఈ విధంగా సంహితాబ్రాహ్మణాల స్వరూపంలోను, ప్రతిపాద్యవిషయంలోనూ కూడా భేదం కనబడుతుంది.

సంహితలలో ప్రయోగింపబడ్డ భాషకీ, బ్రాహ్మణాలలోని భాషకీ కూడా భేదం కనబడుతుంది. ఋగ్వేదసంహితలో ఉన్న భాష అతి ప్రాచీనమైంది; రూపవైవిధ్యాలతో కూడింది. బ్రాహ్మణాలలోని భాష సంహితాభాషకీ, లౌకిక సంస్కృతభాషకీ మధ్యగా ఉంటూ చాలావరకు లౌకికసంస్కృతానికి సన్నిహితంగా ఉంటుంది. సంహితలలో ఉండే భాషలోని కొన్ని వైశిష్ట్యాలు ఈ విధంగా ఉంటాయి.

1. అకారంతశబ్దాల ప్రథమా బహువచనరూపాలు తృతీయా బహువచనరూపాలు కూడా లౌకికసంస్కృతంలో ఉన్నట్లుగా 'దేవాః' 'దేవైః' అని,అందుకు భిన్నంగా 'దేవాసః' 'దేవేభిః' అని కూడా ఉంటాయి.

2. అకారాంతశబ్దాలు ప్రథమా, సంబోధనప్రథమా విభక్తుల ద్వివచనబహువచన రూపాలు ఆకారాంతాలుగా ఉంటాయి.

ఉదా:- 'యేనేమా విశ్వా భువనా కృతాని' మొ॥

3. ఇకారాంత స్త్రీలింగశబ్దాలకు ఈకారం చేర్పడంచేత తృతీయైక వచనరూపాలు ఏర్పడతాయి. ఉదా:- 'ధీతీ' 'మతీ'

4. సప్తమీ ఏకవచన విభక్తిప్రత్యయానికి సాధారణంగా లోపం చేయబడుతూ ఉంటుంది. ఉదా:- 'పరమే వ్యోమన్' ('వ్యోమ్ని'కి బదులు).

5. ఉకారాంతశబ్దాల ద్వితీయాబహువచనంలో 'తన్వమ్' 'తనువమ్' మొ॥ రూపాలుకూడా ఉంటాయి.

6. ఉకారాంతశబ్దాల తృతీయైకవచనంలో 'ఆ' 'యా' లేదా 'ఇయా' చేర్పడంచేత 'ఉవియా' 'సాధుయా' మొ॥రూపాలు ఏర్పడతాయి.

7. యుష్మదస్మచ్ఛబ్దాల చతుర్థ్యేకవచనంలో 'తుభ్యమ్' 'మహ్యమ్' అనడానికి బదులు 'యుష్మే' 'అస్మే' ఇత్యాది ఏకారాంత రూపాలు ఉంటాయి.

8. పరస్మైపది ధాతువుల లట్ ఉత్తమపురుష బహువచన ప్రత్యయం 'మసిః' ఉదా:- 'త్వమస్మాక మన్యవస్మసి' లౌకిక సంస్కృతంలో 'మస్' (మః) ఉంటుంది. ప్రథమపురుష బహువచనంలో 'రే' లేదా 'రతే' అనే ప్రత్యయాలు చేర్చబడతాయి. ఉదా:- 'దుహ్రే' 'దుహ్రతే' మొ॥.

9. సాధారణంగా ఆత్మనేపదప్రత్యయమైన 'త' లోపిస్తూ ఉంటుంది. ఉదా:- 'దక్షిణతః శయే'. అలాగే 'ధ్వ'కు బదులు 'ధ్వాత్' ప్రయోగింపబడుతుంది. ఉదా:- 'వారయధ్వాత్'.

10. లోట్ మధ్యమపురుష బహువచనంలో 'త' 'తన' 'థన' 'తాత్' అనే ప్రత్యయాలు చేర్చబడతాయి. ఉదా:- 'శృణోత' 'సచతన' 'యతిష్ఠన' 'కృణుతాత్'.

11. ఎనిమిది విభిన్నరూపాలలో 'లేట్' ఎక్కువగా ప్రయోగింప బడుతుంది.

12. ఒకే ధాతువును వేరువేరు వికరణ ప్రత్యయాలతో ప్రయోగించడం సంహితలలో ఎక్కువగా కనబడుతుంది.

13. క్రియార్థకక్రియకు లౌకికభాషలో ఒక్క 'తుమ్' అనే ప్రత్యయం మాత్రమే చేర్చబడగా సంహితలలో 'సే' 'అధ్యై' 'తవే' 'త్వై' అన్న ప్రత్యయాలు చేర్చబడతాయి. ఉదా:- 'వక్షే', 'అసే', 'పృణధ్యై' 'సతవే', 'మాదయుత్వై' మొ॥

14. తుమున్నంతార్థాన్ని బోధించడానికి ద్వితీయాంతశబ్దం 'శక్' ధాతువుతో ప్రయోగింపబడుతుంది. ఉదా:- 'విభాగం నాశకత్'('విభంక్తుం నాశకత్' అని అర్థం) 'ఈశ్వర' శబ్దంతో అనుప్రయుక్తమైన ధాతువుకు 'తోసున్' 'కసున్' ప్రత్యయాలు చేర్చబడతాయి. ఉదా:- 'ఈశ్వరో విచరితోః' 'ఈశ్వరో విలిఖః' 'విచారితుం విలేఖితుం చ ఈశ్వరః' అని అర్థం. 'తవ్య' ప్రత్యయార్థంలో 'త్వై' 'కేన్' 'కేన్య' 'త్వన్' ప్రత్యయాలు చేర్చబడతాయి. ఉదా:- 'న మ్లేచ్ఛితవై, నావభాషితవై' 'న మ్లేచ్ఛితవ్యం, నావభాషితవ్యమ్' అని అర్థం. 'అవగాహే' 'దిదృక్షేణ్యః' 'కర్త్వమ్' (కర్తవ్యమ్) మొ॥ ఇదేవిధంగా లౌకిక సంస్కృతంలోలేని ఎన్నోపదాలు ప్రయోగాలు- 'గత్వాయ' 'పీత్వీ' 'పరివష్టి' 'సను' 'అమీవా' 'శివతాతిః' మొదలైనవి సంహితలలో కనబడుతున్నాయి.

ఋగ్యజుర్వేదాలకి సంబంధించిన బ్రాహ్మణాలలో ఉన్న భాషలో కొంత మార్పు కనబడుతోంది. సంహితలలో ఉండే ఎన్నో పదాలప్రయోగం

బ్రాహ్మణాలలో కనబడదు. శబ్దరూపాలు ఒక నిర్ణీతపద్ధతిలో ప్రయోగింపబడుతూ లౌకికభాషకి దగ్గరగా వచ్చాయి. ధాతువులకు వికరణప్రత్యయాలు చేర్చడం విషయంలో కూడా కొన్ని నియమాలు పాటించబడ్డాయి. అంటే కొన్ని ధాతువులు కొన్ని గణాలలోనే ఉంటాయి; కాని అన్నింటినీ అన్ని గణాలలోను ఉన్నట్లుగా ప్రయోగించటం ఆగిపోయింది. 'లేట్' ప్రయోగం కూడా చాలా అరుదుగా చేయబడింది. 'క్త్వా' ప్రత్యయాంత 'తుమున్' ప్రత్యయాంతాల (కృత్వా, కర్తుమ్ మొ॥) ప్రయోగం విరివిగా చేయబడింది. ధాతువులను అన్నిలకారాలలోను అత్యధికంగా ప్రయోగించడం జరిగింది. ఐతే కొన్ని ప్రాచీనరూపాలు కూడా లేకపోలేదు. ఉదాహరణకు-

1. కొన్ని స్త్రీలింగ శబ్దాల చతుర్థీ షష్ఠీవిభక్తిరూపాలు ఒకే విధంగా (ఉదా:- 'భూమ్యాః' కు బదులు 'భూమ్యై') ఉన్నాయి.

2. ప్రథమపురుష రూపాలలో ఉన్న నకారం సంహితలో లాగానే ఇక్కడకూడా లోపిస్తూ ఉంటుంది.

3. 'అజ్ఞత' మొదలైన రూపాలు లౌకికసంస్కృతంలో లేనివి ప్రయోగంలో ఉన్నాయి.

4. 'అనీక' 'నిష్టావ' 'భగవాన్' మొదలైన అప్రసిద్ధార్థకపదాలుకూడా ప్రయోగింపబడ్డాయి.

5. ఐతరేయబ్రాహ్మణంలో కొన్ని గాథలు (శ్లోకాలు) ఉదాహరించబడ్డాయి. వాటి భాష గద్యభాగాలలో ఉన్న భాషకంటే చాలా ప్రాచీనమైనది. ఇందులో అప్రసిద్ధపదాలు ఎన్నో ఉన్నాయి.

6. 'అహన్' 'ఆత్మన్' శబ్దాలు తప్ప మిగిలిన అన్నంతశబ్దాల సప్తమ్యేకవచనంలో 'ఐ' చేర్చబడుతుంది.

7. కర్త్రర్థకమైన 'తవత్' ప్రత్యయం చేర్పుగా ఏర్పడిన శబ్దాలప్రయోగం కనబడుతుంది.

8. 'అగుట' అనే అర్థంలో 'రూపం కరోతి' అని ప్రయోగించబడుతుంది.

9. భూతకాలికక్రియల వివిధరూపాల ప్రయోగం అత్యధికంగా చేయబడింది.

10. ప్రత్యక్షంగా చెప్పేటప్పుడు లుఙ్ప్రయోగం చేయబడినా వర్ణనచేసే సందర్భంలో లఙ్ ప్రయోగమే అత్యధికంగా చేయబడింది.

11. లిట్టురూపాలలో ద్విత్వంచేసిన రూపాలు అధికంగా ఉన్నాయి.

12. 'కృఞ్' ధాతువు అనుప్రయోగంచేసిన లిడ్రూపాలు ఉన్నా 'భూ' 'అస్' ధాతువుల అనుప్రయోగంచేత ఏర్పడిన రూపాలు ఇంకా బ్రాహ్మణాలలోకి రాలేదు.

13. బ్రాహ్మణాలలో ఉపసర్గలతో తుల్యాలైన 41 నిపాతలు ప్రయోగించబడ్డాయి. వీటిలో అ, సాకమ్, ఉపరి, తిరః, పశ్చాత్, అవస్తాత్, అధస్తాత్, ప్రాక్, ప్రాఙ్, అర్వాక్, పరాచీనమ్, అవాక్ అనే పన్నెండు నిపాతలు మాత్రమే కారకాలకంటే పూర్వం ప్రయోగింపబడి ఉన్నాయి. మిగిలినవి కారకాల తరవాత ప్రయోగించబడ్డాయి. ఇది శతపథబ్రాహ్మణంలో అధికంగా కనబడుతుంది.

14. కొన్నిచోట్ల ఉపసర్గలకు, వాటితో సంబంధించవలసిఉన్న కారకానికీ మధ్య కొన్ని పదాలు చేర్చడం కూడా జరుగుతుంది. ఉదా: 'అధి ను హ్యై శశ్వద్ అస్మిన్నేవ లోకేఽసా లోకః' (జై.బ్రా. 103). ఇక్కడ 'అధి' అనే ఉపసర్గకీ, 'లోకే' అనేదానికీ మధ్య ఆరుపదాలున్నాయి. 'ఋతే' 'ఊర్ధ్వమ్' లాంటి కొన్నిఅవ్యయాలు కారకాలకి పూర్వంగాను, పరంగానూ కూడా ప్రయుక్త

మైనాయి. ఉదా:- ఋతే వాచః' (శాం. బ్రా. 2.7) 'ప్రాణేభ్య ఋతే' (శ. బ్రా.9.2.1.15) 'ఊర్ధ్వం అన్తరిక్షాత్' 'ప్రణేతాదూర్ధ్వమ్' మొ॥

15. నిషేధార్థకమైన 'మా' తో ప్రయోగించినపుడు మాత్రమే 'లుఙ్' లోని 'అట్' 'ఆట్' ఆగమాలు లోపిస్తాయి.

ఇలాంటి కొన్ని వైశిష్ట్యాలతో బ్రాహ్మణాలలోని భాష సంహితాభాషకు, లౌకికభాషకు మధ్య ఉంటూ సంస్కృతభాషా వికాసక్రమంలో ద్వితీయస్థితికి ఉదాహరణంగా ఉన్నది.

గద్యవికాసం :

పైన పేర్కొన్న విధంగా బ్రాహ్మణాలు గద్యరూపంలో ఉన్నాయి. వీటిలోని గద్య దీర్ఘసమాసరహితమై అతిసరళంగా సుబోధంగా ఉంటుంది. సాధారణంగా విసుగు కలిగించడానికి అవకాశం ఉన్న యజ్ఞ విధానాల వర్ణనలు, వివిధ నిర్వచనాలు ఉండే బ్రాహ్మణ భాగాలలోకూడా చిన్న చిన్న వాక్యాలు ప్రయోగించడంచేత భాషలో ఒక విధమైన అందం కనబడుతుంది. ఇక అర్థవాదలూ, ఉపాఖ్యానాలు మొదలైన బ్రాహ్మణభాగాలు చాలా హృదయంగమంగా ఉంటాయనడంలో సందేహమేలేదు. సత్యానికి ఉన్న ప్రాశస్త్యాన్ని వర్ణించే ఈ వాక్యం ఎంత సరళంగాను, మనోహరంగాను ఉన్నదో చూడండి :

> 'సత్యం వైచక్షుః సత్యం హి వై చక్షుస్తస్మాత్ యదిదానీం ద్వౌ వివదమానా వేయాతం- 'అహమదర్శమ్' 'అహమ శ్రౌషమ్' ఇతి; య ఏవ బ్రూయాత్ అహమదర్శమితి తస్మా ఏవ శ్రద్దధ్యామ, తత్ సత్యేనైవైతత్ సమర్ధయతి' *(శ. బ్రా. 1.3.2.27).*

కొన్ని వాక్యాలు లౌకికసత్య ప్రతిపాదకాలుగాను అలంకారిక భాషాగుంభితాలుగాను ఉంటాయి.

> 'యః సకృత్ పాపం కుర్యాత్ కుర్యాదేనస్తతోఽపరమ్' (ఐ.బ్రా. *7.17*) (ఒకమారు పాపకార్యానికి అలవాటుపడ్డవాడు మళ్లీ మళ్లీ పాపకార్యం చేస్తూనే ఉంటాడు).
>
> 'వాచో', వావ తౌ స్తనౌ సత్యానృతే వావతే. అవత్యేనం సత్యం నైతమనృతం హినస్తి య ఏవం వేద' (ఐ.బ్రా. *41*).

ఉపాఖ్యానాలలోని భాష ఎంతసరళంగా జీవనభరితంగా ఉంటుందో తెలుసుకోవడానికి ఐతరేయబ్రాహ్మణంలో ఉన్న ఒక ఉపాఖ్యానంలోని కొన్ని వాక్యాలు ఉపకరిస్తాయి:-

> 'హరిశ్చన్ద్రో నామ వైధస ఐక్ష్వాకో రాజాఽపుత్ర ఆస. తస్య హ శతం జాయా బభూవుః. తాసు పుత్రం న లేభే. తస్య హ పర్వతనారదౌ గృహా ఊషతుః. స హ నారదం పప్రచ్ఛ .... అథైన మువాచ- వరుణం రాజానముపధావ పుత్రో మే జాయతాం తేన త్వా యజా ఇతి. తథేతి. స వరుణం రాజాన ముపససార పుత్రో మే జాయతాం తేన త్వా యజా ఇతి. తథేతి. తస్య హ పుత్రో జ జ్ఞే రోహితో నామ. తం హోవాచ అజని తే వై పుత్రో యజస్వ మానేనేతి. స హోవాచ యదా వై పశుర్నిర్దశో భవత్యథ స మేధ్యో భవతి. నిర్దశోన్వస్త్వథ త్వా యజా ఇతి'.

ఇంతవరకు ఉదాహరించిన గద్యభాగాలలో ఒక్కసమాసం కూడా లేకపోవడం గమనార్హం. ఈ విధంగా గంభీరనదీప్రవాహం లాగా ఒడుదుడుకులు లేకుండా, చక్కగా ప్రవహిస్తూ పోతూ ఉంటుంది బ్రాహ్మణాలలోని గద్యం.

మహాభారతంలో అక్కడక్కడ కనబడే గద్యభాగాలలోను, నిరుక్త మహాభాష్యాది ప్రాచీనగ్రంథాలలోను కూడా ఈ బ్రాహ్మణ గద్యచ్ఛాయలు మనకు స్పష్టంగా గోచరిస్తాయి. ఉదా:-

'కశ్చిదృషిర్ధౌమ్యో నామాయోదః. తస్య శిష్యాస్త్రయో బభూవుః, ఉపమన్యు రారుణిపాంచాలో వైద ఇతి. ఏకం శిష్యమారుణిపాంచాలం ప్రేషయామాస-భో గచ్ఛ కేదార ఖణ్డం బధానేతి. స ఉపాధ్యాయేన సన్దిష్ట ఆరుణిపాంచాల స్తత్ర గత్వా కేదార ఖణ్డం బద్ధుం నాశక్నోత్. స క్లిశ్యమానో గతిం నాపశ్యత్ కిఞ్చిత్. భవత్వేవం తావత్కరిష్యామీతి. స తత్ర సంవివేశ. కేదారఖణ్డే శయానే తస్మిన్ తదుదకం తస్థౌ' (మహాభారతం ఆదిపర్వం. 3. అధ్యాయం).

'దేవాపిశ్చార్ష్టిషేణః శంతనుశ్చ కౌరవ్యౌ భ్రాతరౌ బభూవతుః. స శంతనుః కనీయానభిషేచయాంచక్రే. దేవాపిస్తపః ప్రతిపేదే. తతః శంతనోః రాజ్యే ద్వాదశవర్షాణి దేవో న వవర్ష. తమూచుర్బ్రాహ్మణాః. అధర్మస్త్వయాచరితః. జ్యేష్ఠం భ్రాతర మన్తరిత్యాభిషేచితమ్. తస్మాత్తే దేవో న వర్షతీతి. స శంత నుర్దేవాపిం శిశిక్ష రాజ్యేన. తమువాచ దేవాపిః-పురోహితస్తే" సానియాజయాని చ త్వేతి. తస్య తద్వర్షకామసూక్తమ్ (నిరుక్తం. 2. అధ్యాయం).

'అథవా కిం న ఏతేన ఇదం నిత్యం ఇదమనిత్యమితి. యన్నిత్యం తం పదార్థం మత్వైష విగ్రహః క్రియతే-సిద్ధే శబ్దే అర్థే సమ్బన్ధే చేతి. కథం పునర్జ్ఞాయతే సిద్ధః శబ్దోఽర్థః సమ్బన్ధశ్చేతి? 'లోకతః'. యల్లోకే ఽర్థమర్థముపాదాయ శబ్దాన్ప్రయుఞ్జతే నైషాం నిర్వృత్తౌ యత్నం కుర్వన్తి. యే పునః కార్యాభావా నిర్వృత్తౌ తావత్తేషాం యత్నః క్రియతే. తద్యథా ఘటేన కార్యం కరిష్యన్ కుమ్భకారకులంగత్వాహ - కురు ఘటం కార్యమనేన కరిష్యామీతి. న తద్వచ్ఛబ్దాన్ ప్రయుయుక్షమాణో వైయాకరణకులం గత్వాహ- కురుశబ్దాన్ ప్రయోక్ష్య ఇతి.

శాసత్యేనార్థముపాదాయ శబ్దాన్ ప్రయుఞ్జతే (మహాభాష్యం. పస్పశాహ్నికం).

పై గద్యాలను పరిశీలించడంచేత భారత నిరుక్త మహాభాష్యాదులలోని గద్యరచన బ్రాహ్మణగద్యరచనకు ఎంతసన్నిహితంగా ఉందో స్పష్టం అవుతుంది. చిన్నచిన్న వాక్యాలు, సమాసాలు లేక పోవడం, ధాతురూపాల అధికప్రయోగం ఇలాంటివిషయాలలో వీటన్నింటికీ చాలా సాదృశ్యం ఉంది. కాలంగడచినకొద్దీ ఈ గద్య శైలిలో మార్పులు ప్రవేశించాయి. చిన్న వాక్యాలకు బదులు దీర్ఘవాక్యాలు, సమాసరాహిత్యానికి బదులు నాతిదీర్ఘ-దీర్ఘ సమాసాల ప్రయోగం, ధాతురూపాలకు బదులు క్త-క్తవత్, య, తవ్య, అనీయప్రత్యయాంత పదాలప్రయోగం, తద్ధితాంతాల ప్రయోగమూ అధికంగా ప్రవేశించాయి. శాబరభాష్య - శాంకరభాష్యాదులను, ఇతరమైన గద్యకావ్యాలను ఇందుకు ఉదాహరణాలుగా గ్రహించవచ్చు. ఈ విధంగా ఋగ్వేదాది సంహితలలో ఛందోరూపంగా ఉన్న భాష బ్రాహ్మణాలలో అతిమనోహరమైన గద్యరూపాన్ని సంతరించుకొని క్రమక్రమంగా శాస్త్రగ్రంథాలలోను, తదితర గద్యకావ్యాల్లోను నానావిధగద్యరచనాప్రవృత్తులకి దారి చూపించింది.

— పి. ఎస్. ఆర్.

# ఐతరేయబ్రాహ్మణం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 2. విశేషవిభాగం

## 2. 1 ఐతరేయబ్రాహ్మణం

### 2. 1. 1. పరిచయం

ఋగ్వేదానికిగల శాఖల్లో ప్రసిద్ధమైనవి శాకల-బాష్కల శాఖలు. అందులో శాకలశాఖకు సంబంధించిన బ్రాహ్మణం ఐతరేయబ్రాహ్మణం. దీన్ని బహ్వృచబ్రాహ్మణమని కూడ కొందఱంటారు (పే. 7).

**ఐతరేయమంటే ఏమిటి ?**

[1]ఈ బ్రాహ్మణాన్ని ఐతరేయమనడంలో సాయణభాష్యంలో మనకొక ఆఖ్యాయిక ఇలా దొరుకుతున్నది :

ఒక మహర్షికి ఎందఱో భార్యలున్నారు. అందులో ఒక ఆమె పేరు ఇతర. ఆమె కుమారుడు మహిదాసు. ఇతర కొడుకు కాబట్టి మహిదాసుకు ఐతరేయుడని పేరు. మిగిలినపిల్లల మీద ఉండే ప్రేమాభిమానాలు మహిదాసుపైన మహర్షికుండేవికావు. పైగా అతడంటే కొంచెం చిన్నచూపుకూడా

లేకపోలేదు. కనుకనే ఒక యజ్ఞసభలో మహర్షి మహిదాసును తక్కువచేస్తూ మిగతాపిల్లలని తొడపైన కూర్చోబెట్టుకున్నాడు. పాపం ! బిక్కమొహంతో మహిదాసు తనతల్లి ఇతర దగ్గరికి వెళ్లాడు. అలా పిల్లవాణ్ణి చూసిన ఇతర తన కులదేవతైన భూదేవిని ధ్యానించింది. వెంటనే భూమాత ప్రత్యక్షమైంది. యజ్ఞసభలో మహిదాసును దివ్యసింహాసనంలో కూర్చోబెట్టి సోదరులందరికంటే ఇతడు పండితుడౌతాడని గ్రహించి, ఇతనికి ఈ బ్రాహ్మణస్ఫూర్తి కలిగేలా వరాన్ని అనుగ్రహించింది[1]. తరువాత మహిదాసు ఈ బ్రాహ్మణాన్ని రచించి ప్రచారంలోకి తీసుకొని వచ్చాడు.

షడ్గురుశిష్యుడు ఈబ్రాహ్మణానికి 'సుఖప్రద' అనే వృత్తిని 1252లో వ్రాశాడు. ఆ వృత్తి ప్రారంభంలో ఐతరేయుడు యాజ్ఞవల్క్యునికి ఇతరాకాత్యాయనికి కుమారుడని[2], అతడే ఈ బ్రాహ్మణాన్ని రచించాడని స్పష్టంగా చెప్పాడు[3]. యాజ్ఞవల్క్యుడు పెద్దభార్యను ప్రియురాలని, రెండవభార్యను 'ఇతర' అని అనాదరంగా అన్నట్లు మనకు ఈ వృత్తిద్వారా తెలుస్తున్నది. మొత్తంమీద ఇతరాపుత్రుడైన మహిదాసు ఈ బ్రాహ్మణాన్ని రచించడంవల్ల దీనికి ఐతరేయ బ్రాహ్మణమనే ప్రసిద్ధి లభించిందని తెలుస్తున్నది.

— ఎస్. బి. ఆర్.

---

1. ప్రకృతస్య తు బ్రాహ్మణస్య ఐతరేయకర్తే సంప్రదాయవిద ఏతామాఖ్యాయికా మాచక్షతే ........ వరం దదౌ. (సాయణభాష్యోద్ధృతం - ఐ. బ్రా).
2. ఆసీద్విప్రో యాజ్ఞవల్క్యో ద్విభార్యస్తస్య ద్వితీయామితరేతి చాహుః ।
స జ్యేష్ఠాయామాక్షిప్తచిత్తః ప్రియాం తాముక్త్వా ద్వితీయామితరేతి హోచే ॥
ఐ. బ్రా. పే. 4 త్రివేంద్రమ్. 1924.
3. మహిదాసైతరేయర్షి సందృష్టం బ్రాహ్మణం తు యత్, అందులోనే పే. 2.

## 2. 1. 2 విభాగం

ఐతరేయబ్రాహ్మణం ఎనిమిది పంచికలుగా విభజింపబడింది. ఐదు అధ్యాయాలను 'పంచిక' అంటారు. ఇందులో మొత్తం 40 అధ్యాయాలున్నాయి. ఈ అధ్యాయాలు మళ్లా కొన్ని ఖండలుగా విభజింపబడ్డాయి. ఐతరేయబ్రాహ్మణంలో మొత్తం 285 ఖండలున్నాయి. ఈ దిగువ పట్టిక చూడండి :

| పంచికలు | అధ్యాయాలు | ఖండలు | పంచికలు | అధ్యాయాలు | ఖండలు |
|---|---|---|---|---|---|
| I | 1 | 6 | V | 21 | 5 |
| | 2 | 5 | | 22 | 10 |
| | 3 | 6 | | 23 | 4 |
| | 4 | 9 | | 24 | 6 |
| | 5 | 4=30 | | 25 | 9=34 |
| II | 6 | 10 | VI | 26 | 3 |
| | 7 | 8 | | 27 | 5 |
| | 8 | 6 | | 28 | 8 |
| | 9 | 8 | | 29 | 10 |
| | 10 | 9=41 | | 30 | 10=36 |
| III | 11 | 11 | VII | 31 | 1 |
| | 12 | 13 | | 32 | 11 |
| | 13 | 14 | | 33 | 6 |
| | 14 | 6 | | 34 | 8 |
| | 15 | 6=50 | | 35 | 8=34 |
| IV | 16 | 6 | VIII | 36 | 4 |
| | 17 | 8 | | 37 | 7 |
| | 18 | 8 | | 38 | 3 |
| | 19 | 6 | | 39 | 9 |
| | 20 | 4=32 | | 40 | 5=28 |
| | మొత్తం ఖండలు - 153+ | | | | 132=285 |

**విషయవిభాగం :**

ఇందులో చివటి పది అధ్యాయాలు తరువాతికాలంలో చేర్చబడి ఉంటాయని 30 అధ్యాయాలు మాత్రమే మొదట ఉండేవని కొందరి అభిప్రాయం. ఈ బ్రాహ్మణంలోని విషయాలను దాదాపు అనువాదం చేసిన శాంఖాయనబ్రాహ్మణం చివటి పది అధ్యాయాలలోని విషయాలను ముట్టుకోలేదు. కాని తరువాత ఏర్పడ్డ శాంఖాయనసూత్రం మాత్రం వాటిని పరామర్శ చేసింది. మొదటి 25 అధ్యాయాలలో ప్రాచీనబ్రాహ్మణాలలో లాగానే వర్తమానవాచకంగా ప్రయోగింపబడిన 'లిట్' అనే క్రియారూపం ఆ తరువాత పరోక్షార్థంలో ప్రయోగింపబడింది. ఇలాంటి కారణాలవల్ల చివటిభాగం తరువాత చేర్చబడి ఉంటుందని వారి ఊహ.

ఈ బ్రాహ్మణం ప్రధానంగా సోమయాగాన్ని వివరిస్తున్నది. మొదటి పదహారు అధ్యాయాల్లో ఒకరోజులో చేయవలసిన 'అగ్నిష్టోమ' మనే సోమయాగం వివరింపబడింది. తరువాత రెండు అధ్యాయాలలో 360 రోజులు చేయదగిన 'గవామయనం' అనే యాగం, తరువాత 6 అధ్యాయాల్లో పన్నెండురోజులు నిర్వహింపబడే 'ద్వాదశాహ' మనే యాగం నిరూపించబడ్డాయి. చివరి 8 అధ్యాయాల్లో పట్టాభిషేకవిధానం మొ॥ వర్ణింపబడ్డాయి. ఇదీ ఇందులోని విషయవిభాగం.

**మొదలు - చివట :**

ఈ బ్రాహ్మణం "అగ్నిర్వై దేవానామవమః విష్ణుః పరమః" అనే మంత్రంతో ప్రారంభమై "అపి హ యద్యస్యాశ్మమూర్ధా" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

— ఎస్. బి. ఆర్.

## 2. 1. 3 సంకలనకాలం

దేశం :

ఐతరేయబ్రాహ్మణం భారతదేశంలో ఏ భాగంలో రచింపబడి ఉంటుందనే విషయం ఖచ్చితంగా చెప్పడానికి తగిన సాక్ష్యాలేవీ దొరకడంలేదు. కాని భారతదేశంలో ఇప్పటికీ కనబడుతున్న వర్గ వర్ణాది విభాగాలు ఈ బ్రాహ్మణంలో అక్కడక్కడా పేర్కొనబడటాన్ని బట్టి, యజ్ఞయాగాదికర్మలు విస్తరంగా ఆచరించబడి ధర్మక్షేత్రంగా ప్రసిద్ధిపొందిన కురుపాంచాలదేశంలోనే ఈ బ్రాహ్మణం రచింపబడి ఉంటుందని మెక్డొనల్ అభిప్రాయపడ్డాడు.

కాలం :

బ్రాహ్మణగ్రంథాలన్నీ ఒకేసారి రచింపబడినవి కావు. వాటిల్లో ముందువెనుకలను గురించి ఎందరో విమర్శకులు పరిశోధనలు చేశారు. ఏ బ్రాహ్మణం ఏ సంవత్సరంలో వ్రాయబడింది? అని ఖచ్చితంగా అడిగితే సమాధానం చెప్పడం అంత తేలికైన పనికాదు. సంహితాభాగం ఏర్పడిన తరువాత కొత్తగా మంత్రదర్శనం చేయడం ఆగిపోయింది. అప్పటి మన పూర్వులు ఈ సంహితలనుపయోగిస్తూ వాటి అర్థాలను వివరిస్తూ కొంత కర్మకలాపాన్ని రూపొందించారు. ఆ కర్మలే తరువాత ఎన్నో యాగాలుగా రూపుదిద్దుకున్నాయి. సరిగా ఆ కాలంలో ఏర్పడిందే బ్రాహ్మణవాఙ్మయం (పే. 9).

ఇలా ఏర్పడిన బ్రాహ్మణాలలో ఐతరేయబ్రాహ్మణం ఒకటి. వేదసంహితలవారీగా లెక్కవేసినపుడు దీన్ని మొట్టమొదట పేర్కొనవలసి ఉంటుంది. కాని బ్రాహ్మణవాఙ్మయమంతటిలోను ప్రాచీన బ్రాహ్మణంగా దీనికి మొదటిస్థానం ఇవ్వడాన్ని గురించి చాలామంది విమర్శకులు

అంగీకరించలేదు. బహుశ ఆ దృష్టితో ఆలోచిస్తే దీనికి మూడోస్థానమో లేక అయిదవ స్థానమో లభిస్తుంది. చాలామంది పాశ్చాత్యుల విమర్శలననుసరించి క్రీస్తుపూర్వం 800 నుంచి 500 వఱకు బ్రాహ్మణవాఙ్మయకాలం కాబట్టి క్రీ.పూ. 7వ శతాబ్దంలో బహుశః ఐతరేయబ్రాహ్మణం రచింపబడి ఉండవచ్చునని కొందఱి అభిప్రాయం. కాని భారతీయపండితులు ఈవాదాన్ని అంగీకరించరు.

ఎ. బి. కీత్, ఎమ్. వింటర్నిట్జ్ మొ॥ విమర్శకులు బ్రాహ్మణాలన్నింటిలో ఐతరేయమే మొదటిదంటారు (పే. 10). కాని వారిచ్చిన హేతువులు అంతగా నిలబడలేదు.

— ఎస్. బి. ఆర్.

## 2. 1. 4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

వ్యాఖ్యానాలు :

ఐతరేయబ్రాహ్మణానికి సమగ్రమైన భాష్యాన్ని వ్రాసినవాడు సాయణాచార్యుడు. ఇది ఇప్పటికి చాలాసార్లు ప్రచురింపబడింది. భట్టభాస్కరుడు ఈ బ్రాహ్మణానికి భాష్యంవ్రాసినట్లు ప్రసిద్ధి ఉంది. ఇంతవఱకు అది పరిశోధనాలయాల్లో మూలుగుతున్నదే కాని వెలుగు చూడలేదు. ఈ భట్టభాస్కరుని భాష్యంపైన గోవిందస్వామి ఒక వ్యాఖ్యానాన్ని వ్రాశాడు. అది వ్రాతప్రతిగానే లభిస్తున్నది. ఈ బ్రాహ్మణంలోని మొదటి 32 అధ్యాయాలకు షడ్గురుశిష్యుడు వ్రాసిన 'సుఖప్రద' అనే వృత్తి ఒకటి లభిస్తున్నది. ఇంతకుదప్ప ఐతరేయ బ్రాహ్మణానికి వేఱే భాష్యాలుగాని వ్యాఖ్యానాలుగాని ఉన్నట్లు చరిత్రకందలేదు.

ప్రచురణలు :

ఐతరేయబ్రాహ్మణాన్ని మొట్టమొదట మార్టిన్‌హాగ్ (Martin Haug) అనే పాశ్చాత్యపండితుడు తన ఆంగ్ల భాషానువాదంతో సంపాదించి 1863లో బొంబాయినుంచి ప్రచురించాడు. తరువాత థ్యోడర్‌ఔఫ్రేఖ్ (Th. Aufrecht) సాయణభాష్యసారాంశంతో దీన్ని సంపాదించి 1879లో బాన్‌నుంచి ప్రకటించాడు. ఆ తరువాత 1894-1906 సం॥ మధ్యకాలంలో వైదికపరిశోధనంలో అందె వేసిన చేయి అయిన సత్యవ్రతసామశ్రమి సాయణభాష్యంతో ఈ బ్రాహ్మణాన్ని నాలుగు భాగాలుగా కలకత్తానుంచి ప్రచురించాడు. 1896 సం॥లో కాశీనాథశాస్త్రి ఆగాశె సాయణభాష్యంతో దీన్ని సంపాదించగా పూనా ఆనందాశ్రమం రెండు భాగాలుగా ప్రకటించింది. షడ్గురుశిష్యుని 'సుఖప్రద' వృత్తితో అసంపూర్ణంగా ఈ బ్రాహ్మణాన్ని

త్రివేంద్రంనుంచి 1942-52 సం॥ మధ్య మూడు భాగాలుగా ఆవన్త కృష్ణశాస్త్రి ప్రచురించాడు. ఎ.బి. కీత్ దీన్ని ఆంగ్లంలో అనువదించి హార్వర్డ్ ఓరియంటల్ సిరీస్‌లో (నెం. 25) 1920లో ప్రకటించాడు. 1925లో నిర్ణయసాగర్‌వారు ఈ బ్రాహ్మణాన్ని మూలం మాత్రం ప్రచురించారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయంలోని సంస్కృత-పాలి విభాగంలో పనిచేస్తున్న సుధాకర మాలవీయ, 'వేదార్థప్రకాశ' మనే సాయణభాష్యంతోను 'సరళ' అనే హిందీవ్యాఖ్యానంతోను 1980లో ఈ బ్రాహ్మణాన్ని ప్రకటించాడు. ఇలా ఇప్పటికి ఐతరేయ బ్రాహ్మణానికి ఎనిమిది ప్రచురణలు వచ్చాయి. వీటిలో కొన్నింటికి ఎన్నో సార్లు పునర్ముద్రణలు కూడ జరిగాయి.

— ఎస్. బి. ఆర్.

## 2. 1. 5 ప్రసిద్ధి

సామాన్యంగా బ్రాహ్మణాలు ప్రపంచ మతచరిత్రను పరిశీలించే వారికి, భారతీయ వైదికకర్మకలాపాన్ని తెలుసుకొనగోరేవారికి ఎంతగానో ఉపకరిస్తాయి. అంతేగాక వీటిల్లో అక్కడక్కడ ప్రసక్తిని బట్టి వచ్చే ఉపాఖ్యానాలు సాంకేతికంగా ఎంతో గంభీరమైన అర్థాన్ని సందేశాన్ని భారతజాతికి అందిస్తూ, తాత్త్వికాంశాలపైన, వైజ్ఞానిక విశేషాలపైన మౌలికమైన చింతనను మనలో ప్రోత్సహిస్తాయి.

ఐతరేయబ్రాహ్మణం అన్ని బ్రాహ్మణాల్లాగా సోమయాగాన్ని ఇతరయాగాలను వివరించినప్పటికీ, సమాజానికి కావలసిన ఎన్నో మహత్తరమైన విశేషాలను, ప్రకృతిరహస్యాలను అందిస్తూ చక్కని ప్రసిద్ధిని సంపాదించింది. చూడండి :

> **"సూర్యుడు అస్తమించడం ఉదయించడం అనేది ఎప్పటికీ ఉండదు. సాయంకాలం అతడు విపర్యాసాన్ని పొంది మనకు కనబడడు. మళ్ళా తెల్లవారేసరికి కనబడతాడు. ఈ గోళంలో కొంతభాగానికి కొంతసేపు మిగతభాగానికి కొంతసేపు చీకటివెలుగులను ప్రసాదిస్తూ రాత్రి, పగలు అని వ్యవహారాన్ని కలిగిస్తాడు. ప్రకృతిలోని ఈ సత్యాన్ని తెలుసుకున్న వాడు అపమృత్యువులేకుండా సూర్యునితో సహవాసాన్ని సమానరూపాన్ని సాలోక్యాన్ని పొందుతాడు."[1]**

ఐతరేయబ్రాహ్మణం వివరిస్తున్న ఈ సత్యాన్ని చూచి మోనియర్ విలియమ్స్ భారతీయుల సునిశిత మేధాసంపత్తిని ఎంతగానో ప్రశంసించాడు[2].

---

1. స వా ఏష న కదాచనాస్తమేతి నోదేతి. తం యదస్తమేతీతి మన్యన్తేఽహ్న ఏవ తదన్తమిత్వాథాత్మానం విపర్యస్యతే-రాత్రీమేవావస్తాత్ కురుతేఽహః పరస్తాత్.
   . . య ఏవం వేద. 14.6.
2. Indians had made some shrewd astronomical guesses more than two thousand years before the birth of Copernicus.
   - The Vedas P. 39.

ఆ యా యాగక్రియలలో వేదమంత్రాలను వినియోగిస్తాడు హోత. ఇతడు యాగాన్ని నిర్వహించే ఋత్విజుల్లో మొదటివాడు. ఇతనికి సంబంధించిన కర్మలను ఐతరేయ - కౌషీతకిబ్రాహ్మణాలు వివరిస్తాయి. అలా కూడా ఈ బ్రాహ్మణానికి ప్రసిద్ధి ఉంది.

ఐతరేయబ్రాహ్మణాన్ని రచించిన మహిదాస ఐతరేయుని కాలానికే ఆంధ్రజాతి, ఆంధ్రదేశం చాలాప్రసిద్ధిని పొందినట్లు మనకు తెలుస్తుంది. చరణవ్యూహసూత్రంలోని యజుర్వేదఖండకు వ్యాఖ్యానం చేస్తూ మహిదాసు మహార్ణవంలోనుంచి ఉదాహరించిన శ్లోకంలో ఆంధ్ర దేశపదం స్పష్టంగా కనబడుతున్నది[1]. శునశ్శేపోపాఖ్యానంలో ప్రసక్తమైన ఆంధ్రపదం (ఐ. బ్రా. 33.6) ఆంధ్రులనే చెబుతున్నదంటారు. ఇలా కూడా ఐతరేయబ్రాహ్మణానికి ఆంధ్రులకు కొంత సంబంధం ఉన్నట్లు తద్వారా ఉభయులకు ప్రసిద్ధి ఏర్పడినటు తెలుస్తుంది.

ఈ లోకంలో ఉన్న భోగభాగ్యాలన్నిటికంటే మధురపదార్థాలన్నిటికంటే ఆస్వాదయోగ్యమైన పానీయాలకంటే తల్లిదండ్రులకు పుత్రుడే ఎక్కువ సౌఖ్యాన్నిస్తాడని ఈ బ్రాహ్మణం (33.1.2) నొక్కి చెబుతున్నది. అలాగే పురుషునికి అన్నమే ప్రాణమని, ఒంటిమీది బట్టే ఇల్లని, బంగారమే రూపమని, పశువులే నిర్వాహకాలని, భార్యే స్నేహితురాలని ఈ బ్రాహ్మణం చెబుతుంది. కాని కుమార్తె దైన్యహేతువని[2], పుత్రుడు జ్యోతిస్స్వరూపుడని, అతడు తనతండ్రి పరబ్రహ్మస్వరూపాన్ని పొందేలా చేస్తాడనే సత్యాన్ని

1. తుంగా కృష్ణా తథా గోదా సహ్యాద్రిశిఖరావధి ।
   ఆ ఆంధ్రదేశపర్యన్తం బహ్వావర్త్యాశ్శిలాయినీ ॥
2. సంభవే స్వజనదుఃఖకారికా సంప్రదానసమయేఽర్థహారికా ।
   యౌవనేఽపి బహుదోషకారికా దారికా హృదయదారికా పితుః ॥

సా. భా. ఐ. బ్రా. 83-1

వివరిస్తున్నది. అంటే ఆనాడే స్త్రీసంతానానికంటే పురుషసంతానాన్నే ప్రజలు ఎక్కువగా కోరేవారనే విషయం ఇక్కడ స్పష్టమౌతుంది. ఇలాంటి లౌకిక-ధార్మికతత్త్వాలను విశదీకరించడం వల్లనే ఐతరేయబ్రాహ్మణం సమాజంలో ఎంతో ప్రసిద్ధిని సంపాదించింది.

— ఎస్. బి. ఆర్.

## 2. 1. 6 యజ్ఞయాగాలు :

వేదము మంత్రబ్రాహ్మణాత్మకము అని ఒక లక్షణము కలదు. అందు మంత్రభాగమునకు సంహిత అనియు, దానికి వ్యాఖ్యానరూపమైన వాక్యగ్రంథభాగమునకు బ్రాహ్మణము అనియు పేర్లు. సంహితాకాలానంతరము యజ్ఞములు చేయుటయందు ఆసక్తి ప్రబలుటచే అందుకు అవసరమైన క్రియాకలాపము వివరింపబడుటయు వైదికమంత్రములకు ఆయా క్రియలతోగల సంబంధము తెల్పవలసివచ్చుటయు సంభవించెను. భాషాభేదమువలన వేద మంత్రముల అర్థము సరిగా బోధపడని సమయమున దానిని వివరించుటకు బ్రాహ్మణములు పుట్టినవని కొందఱు చెప్పుదురు. ఏది ఎటులైనను బ్రాహ్మణములు వైదికవాక్యములకు గల అన్యోన్యమైత్రిని, యజ్ఞక్రియల అంగాంగిభావమును, పదములకు గల సంబంధమును అర్థమును బోధించు చున్నవి. బ్రాహ్మణములలో అచ్చటచ్చట ప్రసంగ వశమున కనవచ్చు ఉపాఖ్యానములు హృద్యములుగా ఉండును.

ఆ యా వేదములకు సంబంధించిన బ్రాహ్మణగ్రంథములందు తెల్పబడు విషయములు ఆ యా వేదములను అనుసరించు ఋత్విక్కుల కర్మభేదమును అనుసరించి భిన్నభిన్నములుగా ఉండును. ఆ యా క్రియలయందు ఏ యే మంత్రములను వినియోగింపవలెనో తెలిపిన హోత అను పేరుగల ఋత్విజుని కర్మములను ఐతరేయము, కౌషీతకి అను ఋగ్వేదబ్రాహ్మణములు ఉపదేశించును.

అందు ఐతరేయ బ్రాహ్మణము 1.జ్యోతిష్టోమయాగము 2.గవామయనము 3.ఆదిత్యానామయనము 4.అంగిరసామయనము 5.ద్వాదశాహము 6.అగ్నిహోత్రము అను ఆఱు యాగములను ముఖ్యముగ వివరించుచున్నది.

### 1. జ్యోతిష్టోమము (14. 1)

గోష్టోమ-ఆయుష్టోమ-జ్యోతిష్టోమములను మూడు సోమ యాగములలో జ్యోతిష్టోమము ప్రధానమైనది. ఇది ఏడు విధములుగ సమాప్తమగుటచే దీనిని సప్తసంస్థమందురు. సంస్థ అనగా సమాప్తి ప్రకారము. 1. అగ్నిష్టోమ 2. అత్యగ్నిష్టోమ 3. ఉక్థ్య 4. షోడశి 5. వాజపేయ 6. అతిరాత్ర 7. అప్తోర్యామములని జ్యోతిష్టోమ యాగము ఏడు విధములని భావము. ఇవి యన్నియు సోమమను ద్రవ్యములో చేయదగినవే. కనుకనే సోమయాగములనియు వీటికి పేరు. 'యజ్ఞాయజ్ఞీయ'మను అగ్నిష్టోమసామతో యాగసమాప్తి కలుగును గాన దీనికి అగ్నిష్టోమమని పేరు.

ఐతరేయబ్రాహ్మణమున ఈ జ్యోతిష్టోమయాగము చతుస్సంస్థముగ చెప్పబడినది. 1. అగ్నిష్టోమ 2. ఉక్థ్య 3. షోడశి 4. అతిరాత్రములను నాలుగు విధములే ఈ బ్రాహ్మణమున ప్రస్తావించబడినవి. అందు అగ్నిష్టోమము ప్రకృతియాగము. మిగతవన్నియు వికృతియాగములు. 'ఆచరింపవలసిన అంగములన్నియు పూర్తిగా ఏ యాగమున ఉపదేశించబడుచున్నవో అది ప్రకృతియాగము' (ప్రకర్షేణ క్రియతే సాకల్యేనాముష్యేయ ముపదిశ్యతే యస్యాం సా ప్రకృతిః). ఉక్థ్యము, షోడశి, అతిరాత్రము అను మూడును వికృతి యాగములు. వీటికి అంగములన్నియు పూర్తిగా బోధింపబడవు. అవి ప్రకృతియాగమునుండియే అతిదేశించుకొనబడి వీటియందు అనుష్ఠింప బడును.

జ్యోతిష్టోమయాగమునకు 1. దీక్షణీయేష్టి 2. ప్రాయణీయేష్టి 3.ఉదయనీయేష్టి 4. అతిథ్యేష్టి అనునవి అంగములు. వీటిని ఐతరేయ బ్రాహ్మణము విస్తరముగ నిరూపించినది.

**దీక్షణీయేష్టి (1.1)**

జ్యోతిష్టోమయాగమునకంగభూతములైన నాలుగు ఇష్టులలో ఇది మొదటిది. ఇది దర్శపూర్ణమాసయాగమునకు వికృతి. అగ్ని-విష్ణువు దీనికి దేవతలు. దేవతలలో అగ్ని చిన్నవాడు; విష్ణువు పెద్దవాడు. మధ్యలో ఇతరదేవతలందఱు చేరిపోవుదురు. అగ్ని విష్ణువు లందువలననే సర్వదేవతా స్వరూపులుగ ఈ బ్రాహ్మణమున పేర్కొనబడిరి. ఈ ఇష్టిలో నెయ్యి చెరువు (హోమద్రవ్యము)లతో హోమమును చేసిన అప్రతిష్ఠాదోషము పరిహారమగును.

**ప్రాయణీయేష్టి (2.1)**

ప్రాయణీయేష్టి కూడ దర్శపూర్ణమాసయాగమునకు వికృతియే. దీనికి అదిత్యుడు దేవత. ఈ ఇష్టిద్వారా త్వరగా స్వర్గమును పొందుదురు. కాన దీనికి ప్రాయణీయేష్టి అని పేరు (ప్రయన్తి స్వర్గం గన్తుం ప్రారభన్తే౽ నేనేతి ప్రాయణీయః ). ఈ ఇష్టియందు పథ్య అను దేవతకు తూర్పుదిక్కునందును, అగ్నికి దక్షిణదిశయందును, సోమునికి పశ్చిమదిక్కునందును, సవితకు ఉత్తరదిక్కునందును, అదితికి ఊర్ధ్వ దిక్కునందును యాగము చేయవలెను. వీరిలో క్రమముగా పథ్య వాక్కును, అగ్నిషోములు ప్రాణాపానములను, సవిత ప్రేరణను, అదితి ప్రతిష్ఠను పెంపొందించునని ఈ బ్రాహ్మణము చెప్పుచున్నది.

**ఉదయనీయేష్టి (2. 5)**

దీనిని అనుష్ఠించుటద్వారా పై నున్న స్వర్గలోకమునకు పోవుదురు. కనుక ఇది ఉదయనీయేష్టి అని పిలువబడుచున్నది (ఉద్యన్తి ఊర్ధ్వం స్వర్గం యన్తి ప్రాప్నువన్త్యనేనేతి ఉదయనీయః).

**ఆతిథ్యేష్టి (3. 5)**

దీనికి విష్ణువు దేవత. ఫలాన తిథి అను నిర్ణయములేక అనుకొనకనే ఎవరైనను భోజనమునకు వచ్చిన అతడు అతిథి అగును. ఈ ఇష్టియందు

సోముడట్లే అతిథి. కనుక ఇది ఆతిథ్యేష్టి అయినది. ఇందు నవకపాలయాగ మొనర్చబడును.

సోమయాగమునకంగములగు ప్రవర్గ్యము, ఉపసత్తు ఈ బ్రాహ్మణము వివరించినది.

ప్రవర్గ్య (4. 1)

ఇది సోమయాగమునకు అంగము. ప్రవర్గ్యమందు మహావీరమను పేరుగల మూడు పాత్రలను మట్టితో నిర్మింతురు. దాని నిర్మాణవిషయమున ఎంతయో క్రియాకలాపము కలదు. ఈ మహావీరపాత్రమును నేతితో నింపుదురు. ఈ యాగమునందు చివర అధ్వర్యుడు మహావీరపాత్రమున ఆవుపాలను, మేకపాలను క్రమముగ పోయును. కాగుచున్న నేతిలో పాలను పోయుటను 'ప్రవృంజన' మందురు. ఆ క్రియాసంబంధమువలన దీనికి ప్రవర్గ్యమను పేరేర్పడినది.

**ఉపసత్ (4. 6)**

ఇందు అగ్ని, సోముడు, విష్ణువు ప్రధానదేవతలు. ఈ ఇష్టి యందు ఆజ్యమే ద్రవ్యము. ప్రవర్గ్యము చేసిన వెంటనే దీనిని చేయుదురు. అగ్నిష్టోమయాగమున మూడు రోజులు ఉదయ సాయంకాలముల యందు ఈ ఇష్టి చేయబడును.

ఇవికాక మధ్యలో అగ్నీషోమీయము, ఇంద్రావాయవము, తూష్ణీంశంసము అను అంగయాగములు కూడ కలవు.

2. *గవామయనము* **(17.6)**

ఇది ప్రకృతియాగము. దీనిని 361 రోజులు చేయుదురు. ఇది 1. పూర్వపక్షము 2. విషువము 3. ఉత్తరపక్షమని మూడు భాగములుగా విభజింపబడినది. ఇందు 180 రోజులు పూర్వపక్షము నాచరింతురు.

తరువాత ఒకరోజు విషువమనే కర్మ. మరల 180 రోజులు ఉత్తర పక్షము. ఈ మూడింటికిని గవామయనమని పేరు. దీనిని గోవులాచరించినవను అర్థవాదవాక్యమువలన ఈ పేరేర్పడినది.

### 3. 4. ఆదిత్యానామయనము - అంగిరసామయనము (18. 3)

ఇవి గవామయనమునకు వికృతిక్రతువులు. ఆదిత్యులను దేవతలు, అంగిరసులను ఋషులు స్వర్గప్రాప్తిని గూర్చి మేమే ముందని పోటీపడిరి. చివరకు ఆదిత్యులే మొదట స్వర్గమును పొందినారు. తరువాత 60 సంవత్సరములకు గాని అంగిరసులు పొందలేదు. ప్రాయణీయేష్టి అతిరాత్రము ఉక్థ్యము అనునవి గవామయనమునకు ఆదిత్యానామయనమునకును సమానము. ఇతర విషయములందు భేదము కలదు.

### 5. ద్వాదశాహము (19. 1)

ఈ క్రతువు 12 రోజులయందు చేయతగినది. ఇది అహీనము, సత్రమును అగుటకు కూడ వీలున్నది. ఇందు పైరెండు లక్షణములును గలవు. ఒకడే యజమాని, యజ్ అను ధాతువుతో విధానము, దక్షిణావిధి అనునవి అహీనమునకు లక్షణములు. ఎక్కువమంది యజమానులు, 'ఆసతే, ఉపయన్తి, ఆసీరన్, ఉపేయుః' అను పదములతో విధానము సత్రమను యాగమునకు లక్షణములు. ఈ రెండును ఇందు గలవు గాన ఇది అహీనము, సత్రము కూడ అగుచున్నది. ఏకాహములకు అగ్నిష్టోమమువలెనే అహీనములకు ఈ క్రతువు ప్రకృతి.

ఈ క్రతువునందు మొదటిరోజు 'ప్రాయణీయము' చివటి రోజు 'ఉదయనీయము' అను కర్మలు జరుగును. పదవరోజు 'అవివాక్యము' నాచరింతురు. కనుకనే ఆయా రోజులను ఆ యా పేర్లతోనే వ్యవహరించుట పరిపాటి.

### 6. అగ్నిహోత్రము (25. 1)

ఆహితాగ్నియైనవాడు జీవితాంతమువఱకు నిత్యము అగ్నిహోత్రమును చేయవలెను. దీనిని సాయంకాలముపక్రమించి ప్రాతః కాలములో పూర్తిచేయవలెను. కొందఱు సూర్యుడుదయించిన తదుపరి హోమమును చేయుదురు. కొందఱు సూర్యోదయమునకు ముందుగానే హోమమును చేయుదురు. దీనికి నిత్యము ఉపయోగించవలసిన ద్రవ్యము పాలు, పెరుగు, గంజి. పశుసమృద్ధిని కోరువాడు పాలతోను, ఇంద్రియ పటుత్వము కోరువాడు పెరుగులోను, గ్రామాధిపత్యమును కోరువాడు గంజితోను, అన్నసమృద్ధిని కోరువాడు అన్నముతోను, ఓజస్సును బలమును కోరువాడు బియ్యముతోను, తేజస్సును కోరువాడు నేతితోను హోమము చేయవలెను.

ఇవికాక రాజయజ్ఞము మెుఃయజ్ఞములు, ఇంకను యజ్ఞములకు సంబంధించిన ఎన్నియో విశేషములు ఈ బ్రాహ్మణమునందు పేర్కొనబడినవి.

ఐతరేయబ్రాహ్మణము సోమయాగస్వరూపమును సాంగముగ నిరూపించుచున్నది. ప్రసక్తివశమున అక్కడక్కడ చెప్పబడిన ఉపాఖ్యానములు ఎంతగనో పాఠకులనాకర్షించుచున్నవి. ప్రాచీన భారతీయుల వైదికకర్మానుష్ఠాన ప్రావణ్యమును అర్థముచేసికొనుటకు ఈ బ్రాహ్మణమొక మణిదర్పణ మనుటలో అతిశయోక్తి లేదు.

— డి. వి. వి.

## 2. 1. 7 వైశిష్ట్యం

ఐతరేయబ్రాహ్మణంలోని విషయవిశేషాలను తీర్చిదిద్దడంలో ఒకే రకమైన వాక్యాలు, ఉదాహరణలు, ఉపమానాలు, పునరావృత్తం కావడం కనబడుతుంది. వాటికి యజ్ఞాన్ని ప్రతిపాదించడమే ప్రధాన లక్ష్యం. ఋగ్వేదమంత్రాలను సమర్థించడంకోసం ఇలాగే కొన్ని ఉపాఖ్యానాలు కూడా ఇందులో పేర్కొనబడ్డాయి.

ఐతరేయబ్రాహ్మణం ఏడవపంచికలో వచ్చే హరిశ్చంద్రోపాఖ్యానం ఎంతో ఆకర్షణీయమైంది. పురాణాల్లోని హరిశ్చంద్రుని కథకు దీనికి ఎంతో తేడా ఉంది. ఇక్ష్వాకువంశస్థుడైన ఈ రాజు వరుణుణ్ణి ఉపాసించి అతని అనుగ్రహంతో రోహితుడనే కుమారుణ్ణి పొందాడు. అయితే ఒప్పందం ప్రకారం ఆ పిల్లవాణ్ణి యజ్ఞంలో బలిపశువుగా అర్పించవలసి వస్తుంది. హరిశ్చంద్రుడు తన కుమారుణ్ణి బలిపశువుగా ఇవ్వడంలో ఆలస్యంచేసి రోగగ్రస్తుడవుతాడు. తరువాత ఇతడు అజీగర్తుని కొడుకు శునఃశేపుని యజ్ఞపశువుగా సమర్పించడానికి సిద్ధపడతాడు. ఆ యజ్ఞానికి విశ్వామిత్రుడు హోత, జమదగ్ని అధ్వర్యుడు, అయస్యుడు ఉద్గాత, వసిష్ఠుడు బ్రహ్మ. యజ్ఞంలో శునఃశేపుని ప్రార్థనను మన్నించిన వరుణుడు అతణ్ణి కాపాడతాడు. హరిశ్చంద్రుడు తిరిగి ఆరోగ్యాన్ని పొందుతాడు.

రాజులు చేయవలసిన రాజసూయయాగం మొ॥ యజ్ఞాలకు ప్రస్తావనగా ఈ ఉపాఖ్యానం ఐతరేయబ్రాహ్మణం రెండవభాగంలో (33. 1) పేర్కొనబడింది. సాయణాచార్యుడు తన ఉపోద్ఘాతశ్లోకంలో[1] చెప్పినట్లు ఈ కథను చదివినవారికి చక్కని పుత్రసంతతి కలుగుతుంది. అంతేకాక ఈ ఉపాఖ్యానంలోని సామాజిక-సాంస్కృతిక తత్త్వాలు ఈనాటి పాఠకునికి ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

---

1. హరిశ్చంద్రకథా తత్ర కథితా బహుపుత్రదా.

పట్టాభిషేకం పూర్తయిన తరువాత ఈ ఉపాఖ్యానం రాజుకు వినిపిస్తారు (ఐ. బ్రా. 33). ఇలా కూడ దీనికి చాల ప్రాధాన్యంఉంది. నిజానికి క్షత్రియబలం పురోహితుని శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంది (ఐ. బ్రా. 34). అయినా పురోహితునికి రాజుకు మధ్య సత్సంబంధాలుండాలి. అలా ఉన్నప్పుడే వాళ్ళిద్దరు ఎన్నో ప్రమాదాల నుంచి దేశప్రజలను కాపాడగలుగుతారు. పురోహితుని సాయంతోనే రాజు సిరిసంపదలను సంపాదించి పేదలకు పంచిపెట్టగలుగుతాడు. పురోహితుడనే పదాన్నిబట్టి రాజుకతడు మంచి స్నేహితుడు. నిజంగా పురోహితుడు మంత్రిస్థానంలో ఉంటూ ప్రజలలో శాంతిని, సమత్వాన్ని, న్యాయబద్ధమై సుస్థిరమైన ప్రభుత్వాన్ని నిలబెడతాడు (34.8: 35.1).

రాజ్యపరిపాలనలో పురోహితుడు చాలా ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తాడు. పవిత్రమైన అగ్నిహోత్రాలనతడు పోషించి జాగ్రత్తగా కాపాడుతున్నాడు. కనుకనే అతీతమైన దివ్యశక్తులుగల పురోహితుడే అగ్నివైశ్వానరుడు. రాజ్యం రాజు క్షేమంగా ఉండటంకోసం భూమిచుట్టూ సముద్రం ఉన్నట్లు పురోహితుడు రాజునెప్పుడూ వెంటనంటే ఉంటాడు. పురోహితునితో కలిసిమెలిసి రాజ్యాన్ని పాలిస్తూ, అతనితో ఐకమత్యంతో మెలగుతూ సత్సంబంధాలుకల రాజు జననమరణ బంధాలనుంచి విముక్తిని పొందినవాడవుతాడు. పురోహితుడు రాజ్యాన్నెప్పుడూ కాపాడుతుంటాడు. అందువల్లనే ప్రజలు ఏకగ్రీవంగా రాజుకు విధేయులై కలిసిమెలిసి ఉంటారు (8.24-25). ఈనాటి శ్రేయోరాజ్యభావన రూపురేఖలను ఐతరేయబ్రాహ్మణంలో సూత్రప్రాయంగా గుర్తించవచ్చునని చెప్పడం అతిశయోక్తికాదు.

మహారాజులకు సంబంధించిన మహాభిషేకవిధిని సమగ్రంగా వర్ణించడం ఐతరేయబ్రాహ్మణానికి ఒక విశిష్టతను చేకూర్చింది (37). ఎంతో సుందరంగా సరళంగా సరసంగా మధురమైన పద్యాలతో నిండి గద్యంలో

ఇంద్రుని మహాభిషేకం వర్ణింపబడింది. రాజు లందఱికీ ఈ మహాభిషేకాన్ని ఎలా అన్వయించాలో కూడా ఈ బ్రాహ్మణం వివరించింది (39.1-4). ఆచరణదృష్ట్యా చూచినపుడు ఇది ఈనాటి ఆధునికరాష్ట్రపతికి కూడా చాలాముఖ్యమైనది. ఐతరేయబ్రాహ్మణంలో జనమేజయుని గురించి చెప్పిన మాటలనుంచి గ్రహించబడ్డ ఈ వాక్యాలు ఆత్మవిశ్వాసానికి ఒక చక్కని నిదర్శనం (39.7: 40.4).

ఋగ్వేదమంత్రాలను వ్యాఖ్యానంచేయడంలో మహిదాస ఐతరేయుని గొప్పదనం కనబడుతుంది. ఆ వ్యాఖ్యానసందర్భంలో మహిదాసు 'రూపసమృద్ధి, పర్యాయవిధానం, నిర్వచనం, ఛన్దస్సు, ఆఖ్యానం, ఋషి, పురోహితమహాత్వం, దేవతానిరూపణం, బ్రహ్మపరిమరం మొ॥ సాంకేతికపదాలనుపయోగించాడు[1]. మంత్రవ్యాఖ్యాన సందర్భంలో ఐ.బ్రా. ఈ క్రింది నాలుగు రకాల ఆఖ్యానాలను పరిచయం చేస్తున్నది. 1. దేవతల సంబంధం, దేవతలు-యజ్ఞం, దేవాసురులమధ్య యుద్ధం: 2. ఛందస్సులకు సంబంధించిన వృత్తాంతాలు: 3. యజ్ఞాలతో సంబంధం ఉన్నరాజులకు ఋషులకు సంబంధించిన ఇతిహాసాలు: 4. ప్రకీర్ణాఖ్యానాలు.

బ్రాహ్మణకాలం తరువాత శైవమతవిస్తరణకు అగ్ని, వరుణుడు ఇంద్రుడు మొ॥ ఋగ్వేదదేవతలేకాకుండా రుద్రునిస్థానం కూడ ప్రధానపాత్రను నిర్వహించింది. అంగిరసులు నాభానేదిష్ఠునకు యజ్ఞఫలంలో ఒకభాగం ఇచ్చినప్పుడు యాగశాలలో నల్లటివస్త్రాన్ని ధరించిన ఒక మహానుభావుడు ప్రత్యక్షమైనట్లు ఈ బ్రాహ్మణం పేర్కొంటున్నది (22.9). సంగ్రహంగా చెప్పాలంటే దేవతలందఱు పరబ్రహ్మలో చేరిపోయినారు.

---

1. ఈవరిభాషలవివరాలకు చదవండి : ఎస్. పాఠక్ 'ఐతరేయబ్రాహ్మణ్ కా ఏక్ అధ్యయన్' జయపూర్, 1966.

ఐతరేయబ్రాహ్మణానికి గల సామాజిక-ధార్మిక-ఆధ్యాత్మిక వైశిష్ట్యాన్ని ఈ క్రింది వాక్యాలలో మనం తెలుసుకోవచ్చు :

1. స్త్రీలు పురుషులతో సమానస్థానాన్ని పొందారు. భర్త భార్యను సన్నిహితస్నేహితురాలిగా గౌరవించాడు. (33.1).

2. భర్త భార్యలో కుమారుడుగా తిరిగి పుడుతున్నాడు కాబట్టి భార్యకు 'జాయ' అని పేరు (33.1).

3. భూమి, అగ్ని, జలంద్వారా మానవులు పొందే అన్ని ఆనందాలకంటే పుత్రుని ముఖం చూచినప్పుడు తండ్రికికలిగే ఆనందం వర్ణనాతీతం. పుత్రునిద్వారా తండ్రి ఎంతో చీకటిని దాటగలడు. తండ్రికి కుమారుడు ఉన్నతస్వర్గాలను చూపించగల ఒక తేజఃపుంజం (33.1).

4. పెద్దవారితో ఉన్నవాడికే అనర్థాలు ముంచుకొస్తాయి. దేశంపట్టుకు తిరిగేవాడికి దేముడే నిజమైన స్నేహితుడు (33.3).

5. చిన్నమొక్కలు, వృక్షాలతో సహా సమాజం అంతటికి రాజు రక్షణను కల్పిస్తాడు. ప్రజలందరూ అభివృద్ధిచెందటానికి వీలుగా రాజ్యంలో తన శక్తిసామర్థ్యాలనతడు పెంచుకుంటాడు. తనసాయం కోరినవాడిని రాజు తప్పక కాపాడతాడు (40.3).

6. దేవతలు, ప్రజలకు మార్గాల్లోను, ఎడారుల్లోను, నీళ్లల్లోను, నివాసాల్లోను, సిరిసంపదల్లోను అభివృద్ధిని కలిగిస్తారు (2.3).

7. యజ్ఞం దేవతలకోసం పన్నిన వలలాంటిది (11.11).

8. ఏది దేనికి మొదలో అదే దానికి చివరకూడా, ఏదిదేనికి చివరో అదే దానికి తిరిగి మొదలుకూడా అవుతుంది (14.4).

9. మానవునిలో అయిదు భాగాలున్నాయి : జుట్టు, చర్మం, మాంసం, ఎముకలు, మజ్జ. ఆ అయిదు, ఎంతో చక్కగా అతడిలో అమర్చబడ్డాయి. అతడు యజ్ఞయాగాలు చేసి 'యజమాని' అనిపించుకుంటే నిజంగా ఎంతో గొప్పవాడౌతాడు.

10. మానవుణ్ణి ప్రభుత్వాధికారంనుంచి ఒక దివ్యశక్తి కాపాడుతున్నది (34-5).

11. విశ్వబ్రహ్మంలో పరమపురుషుని ఆజ్ఞలకోసం మానవులెదురు చూస్తుంటారు.

12. హోత ఉపయోగించిన ప్రతిబుక్కుచివఱలోను అధ్వర్యుడు 'ఓం' అని ప్రతిగరం చేయాలి. ఓంకారం ఒక దివ్యచిహ్నం. ఇది ఛందోబద్ధంగా ఉచ్చరింపబడుతుంది. ఓంకారజపం రాజు చేసిన పాపాలను నాశనం చేస్తుంది. నరకంనుంచి విముక్తి కలిగిస్తుంది. కీర్తిని పెంచుతుంది. చివఱకు అతడొక పరిపూర్ణమైన వ్యక్తిగా రూపొందుతాడు (33-6).

ఐతరేయబ్రాహ్మణంలోని చివఱిభాగంలో (40. 1-4) విద్యుత్, వర్షం, చంద్రుడు, సూర్యుడు, అగ్ని మొ॥ దేవతలు వాయుస్వరూపిగా బ్రహ్మను దర్శించి చేసిన ఆధ్యాత్మికసిద్ధాంతం నిరూపించబడింది. ఆ వాయువునుంచి అగ్ని, దానినుంచి శక్తిచేత ప్రేరేపింపబడ్డ ప్రాణం ఏర్పడ్డాయి. అగ్నినుంచి ఆదిత్యుడు, అతనినుంచి చంద్రుడు, చంద్రుని నుంచి వృష్టి ఉద్భవించాయి.

ఐ. బ్రా. లోని 'బ్రహ్మవివర' భాగాన్ననుసరించి ధ్యానరూపం, జపరూపమైన ఒక ప్రత్యేకకర్మ ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ స్థూలజగత్తంతా బ్రహ్మలోనే నివసిస్తున్నది. ఈ విశ్వమంతా సృష్టిగా ఏర్పడుతున్నది.

ఋగ్వేదంలోని (10-190) మం॥ విశ్వసృష్టిసూక్తాలను దృష్టిలో పెట్టుకొని మహిదాస బ్రహ్మను సృష్టికి మూలకారణంగా చిత్రించాడు. ఋతమనే విశ్వక్రమం, సత్యం కూడా బ్రహ్మనుంచే ఏర్పడుతున్నాయి.

బ్రహ్మప్రాప్తికి వ్రతాచరణం తప్పనిసరి. భగవంతుని తెలుసుకోవడం సంస్కారాలను సంపాదించడానికి ఉపయోగిస్తుంది. కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం అనే ఆరు అంతశ్శత్రువులను మానవుడు తప్పక జయించాలి. వీటిని అణచివేయ గలిగితే మానవునిలో విశ్వప్రేమ ఏర్పడుతుంది. అప్పుడతడు అజాతశత్రువవుతాడు. కర్మలవల్ల కలిగే దివ్యజ్ఞానాన్ని పొందడానికి అర్హుడవుతాడు. కర్మాచరణం జ్ఞానాన్ని కలిగిస్తుంది. కాబట్టి యజ్ఞాల నాచరించాలి. అందువల్లనే ఐ.బ్రా. ద్రవ్య యజ్ఞంతో ప్రారంభించి జ్ఞానయజ్ఞంతో పరిసమాప్తమౌతుంది. ఈ జ్ఞానాన్ని పొందినవాడు దేవతామయుడౌతాడని ఐ.బ్రా. (10-9) చెబుతున్నది[1]. కనుకనే ప్రతివాడు కర్మలనాచరిస్తే అవి వాళ్లే అమృతత్వాన్ని పొందిస్తాయి. భగవద్గీతలో (4-33) భగవాన్ కృష్ణుడు అర్జునునికి చెప్పిన మాటల్లో ఈ భావమే ప్రతిధ్వనిస్తోంది[2].

— ఎమ్. డి. బి.

---

1. య ఏవం విద్వాన్ ఏతన్మయో దేవతామయో భవతి.
2. శ్రేయాన్ ద్రవ్యమయాత్ యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప।
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥

## 2. 1. 8 సంగ్రహసమీక్ష

ఋగ్వేదబ్రాహ్మణాల్లో ఐతరేయం ఎంతో విశిష్టమైంది. ఇందులోని నలభై అధ్యాయాల్లో ప్రధానంగా అగ్నిష్టోమం - గవామయనం - ద్వాదశాహం - అగ్నిహోత్రం మొ॥ యాగాలు వివరింపబడ్డాయి. ప్రతిఅధ్యాయంలోను ప్రసక్తిననుసరించి ఆ యా కర్మలకు సంబంధించిన ఎన్నో విశేషాలు మనకు కనబడతాయి. సంగ్రహంగా కొన్నింటినిక్కడ సమీక్షించుకుందాం.

1. సోమయాగాలలో ముఖ్యం జ్యోతిష్టోమయాగం. దానికి అంగమైన దీక్షణీయేష్టిని ఎలా ఆచరించాలో మొదటి అధ్యాయం వివరిస్తున్నది. ఈ ఇష్టికి దేవతలు ఆగ్నావిష్ణువులు ఇందులో స్తుతింపబడ్డారు. విష్ణువు మూడడుగులతో ముల్లోకాలను వ్యాపించడం ప్రశంసింపబడింది. దర్శపూర్ణ మాసయాగం చేసిన తరువాతే సోమయాగం చేయాలని చెప్పబడింది. ఇష్టి- ఆహుతి హోతృశబ్దాలకు చక్కని నిర్వచనాలు ఇందులో మనకు దొరుకుతున్నాయి.

**మీకు ప్రతిష్ఠ కావాలా ?**

> **కొడుకులు కూతుళ్ళు మొ॥ వారితో కూడిన మంచికుటుంబం, గోవులు మొ॥ పశువులు లేకపోవడం అప్రతిష్ఠ. అవన్నీ సమంగా కలిగి ఉండటమే ప్రతిష్ఠ. దాన్నిపొందాలనుకునే యజమాని నేతిని, బియ్యాన్ని కలిపి హోమద్రవ్యాన్ని (చరువు) తయారుచేసి ఈ ఇష్టిలో హోమం చేయాలి. (1.1).**

2. ప్రాయణీయ-ఉదయనీయేష్టులని ఇంకో రెండు అంగాలను రెండవఅధ్యాయం వివరిస్తోంది. ప్రాయణీయేష్టికి అదిత్యుడు దేవత. ప్రసంగవశాన దేవతలలోని జాతులను ఇందులో సాయణుడిలా వివరిస్తున్నాడు. అగ్ని, బృహస్పతి బ్రాహ్మణులు. ఇంద్రుడు, వరుణుడు, సోముడు, రుద్రుడు, పర్జన్యుడు, యముడు, మృత్యువు, ఈశానుడు మొ॥ క్షత్రియులు. వసువులు, రుద్రులు, ఆదిత్యులు, విశ్వేదేవులు, మరుత్తులు వైశ్యులు. పూష శూద్రుడు(2.3).

3 సోమలతను తూర్పుదిక్కులో కొనాలని చెబుతూ మూడో అధ్యాయం ప్రారంభమవుతున్నది. సోమక్రయణానికి సంబంధించిన ఎన్నోవిధులు, విశేషాలు ఇందులో చర్చకు వస్తాయి. తరువాత ఆతిథ్యేష్టి చేసే విధానం సమగ్రంగా వివరింపబడింది. వికల్పంలో ఎనిమిది దోషాలని, పరిసంఖ్యలో మూడే దోషాలని సాయణుడు తన భాష్యంలో పేర్కొన్నాడు.

4. ప్రవర్గ్య అనే యాగం ఎలా చేయాలో, దానికి సంబంధించిన పూర్వాంగాలేమిటో వివరించడం ఈ అధ్యాయప్రారంభంలో కనబడుతుంది. ప్రవర్గ్యకు సంబంధించిన అభిష్టవం ప్రతిపాదింపబడింది. తరువాత 'ఉపసత్' అనే ఇష్టిని గురించిన ప్రస్తావన ఉంది. ప్రసంగవశాన సంధ్యాకాలం అసురకాలమని ఇందులో నిరూపింపబడింది. జయహేతువులు గనుక 'ఉపసత్తు' లకు జితులనిపేరు. వీటిని ఆచరించిన వారికి శత్రువులు నశించి విజయం లభిస్తుంది. తరువాత 'తనూనప్త్రం' చెప్పబడింది. అధ్వర్యుడు మొ॥ పదహారు మంది ఋత్విక్కులు యజమానితో కలసి మెలసి ఉండి ఒకరికొకరు ద్రోహం చేసుకోకుండా ఐకమత్యంతో యజ్ఞకార్యాన్ని పూర్తిచేస్తామని నేతిని తాకుతూ మంత్రోచ్చారణపూర్వకంగా చేసే శపథానికే తనూనప్త్రమని పేరు. (4-8).

5. సోమక్రయణం దగ్గఱనుంచి అగ్నిప్రణయనం వఱకు రహస్యంగా (ఉపాంశు) మంత్రోచ్చారణ చేస్తూ చేయవలసిన కర్మలు ఇందులో చెప్పబడ్డాయి. ఆదిత్యుని గుణగణాలు చక్కగా ప్రశంసించబడ్డాయి.

6. ఇక్కడనుంచి రెండోపంచిక ప్రారంభమవుతున్నది. అగ్నీషోమీయ పశుయాగంతో ఈ అధ్యాయం మొదలౌతోంది. పశుయాగంలో యూపస్తంభం అవసరమౌతుంది. కనుక ఇందులోయూపస్తంభానికి సంబంధించిన ఎన్నో విశేషాలు వివరింపబడ్డాయి. యజమాని కోరికలనుబట్టి యూపస్తంభం ఏ

కౌయ్యతో చేయాలనేది నిర్ణయిస్తారు. యజ్ఞాలలో మంత్రోచ్చారణ చేసేవాళ్లు అన్యమనస్కులుగా ఉండకూడదని చెప్పబడింది. తరువాత వనస్పతియాగం, స్విష్టకృద్యాగం ఇళోపహ్వానం నిరూపింపబడ్డాయి.

7. పర్యగ్నికరణవిధితో ఈ అధ్యాయప్రారంభం. భూమికిపైన నిలువుగా వెయ్యి ఆశ్వీనాలపైన స్వర్గం ఉన్నదని ఈ బ్రాహ్మణం వివరిస్తున్నది (7.7). బలమైన గుఱ్ఱం ఒక పగలంతా పరుగెత్తితే ఎన్ని యోజనాలు వెడుతుందో ఆ దూరానికి ఆశ్వీనం అని పేరు. అలా వెయ్యి ఆశ్వీనాలు భూమికి స్వర్గానికి మధ్యలో దూరం అని ఈ బ్రాహ్మణం చెబుతున్నది (7.7).

8. ఆపోనప్త్రీయమనే కర్మతో ఈ అధ్యాయం మొదలౌతున్నది. ఇందులో పురోడాశశబ్దం చక్కగా నిర్వచింపబడింది (8.5).

9. ఐంద్రవాయవగ్రహాన్ని నిరూపిస్తూ ఈ అధ్యాయం ప్రారంభమైంది. ఇందులో ఆగూకరణం, వషట్కారం అనే పదాలకు చక్కని వివరణ ఇవ్వబడింది. 'అగూ' అనే శబ్దానికి ప్రతిజ్ఞ అని అర్థం. తరువాత ఋతుగ్రహయాగాలు, తూష్ణీంశంసం నిరూపింపబడ్డాయి.

10. పదో అధ్యాయంలో తూష్ణీంశంసానికి సంబంధించిన 'ఆహావ' 'నివిత్' మొ॥ కర్మలు ప్రతిపాదించబడ్డాయి. యజ్ఞాన్ని దేవతల కొక రథంగా అభివర్ణించారు. (10.5).

11 మూడవపంచిక ఇక్కడ ప్రారంభమౌతున్నది. ఇందులో 'ప్రఉగశస్త్రం' మొ॥ శస్త్రాలు నిరూపించబడ్డాయి. ఈ అధ్యాయంలో వషట్కారం 1. వజ్రం 2. ధామచ్ఛద్ 3. రిక్తం అని మూడు రకాలుగా చెప్పబడింది. ఇలాగే ప్రైష, వేది, గ్రహ, నివిద మొ॥ శ్రౌతశబ్దాలకు చక్కని నిర్వచనాలు ఇందులో దొరుకుతున్నాయి.

12. ప్రాతర్మాధ్యందినతృతీయసవనాల్లో హోత చేసే 'ఆహావం' అధ్వర్యుడు చేసే 'ప్రతిగరా' నికి సంబంధించిన విశేషాలెన్నో ఇందులో వివరించబడ్డాయి.

13. ఇందులో కృశానువనే గంధర్వునికి గాయత్రికి జరిగిన యుద్ధం చమత్కారంగా చెప్పబడింది. మానవజాతి ఉత్పత్తిని గురించి 'మాదుషం' అనే శబ్దం 'మానుషం' అయినట్లు ఈ అధ్యాయంలో (13.9) చక్కగా నిరూపింపబడింది. అంతేకాదు; దేవతలెలా పుట్టారు? అనే ప్రశ్నకు కూడా ఇందులో చక్కని సమాధానం దొరుకుతున్నది (13.10).

14. ఈ అధ్యాయంలో 1. హుత 2. ప్రహుత 3. ఆహుత 4. శూలగవ 5. బలిహరణ 6. ప్రత్యవరోహణ 7. అష్టకాహోమాలనే ఏడు పాకయజ్ఞాల ప్రస్తావన ఉంది. ఈ పాకయజ్ఞాలన్నీ ఇళా సదృశాలే. ఈనాటి వైజ్ఞానికులను సైతం ఆశ్చర్యపరచే ప్రకృతి రహస్యం - సూర్యునికి ఉదయాస్తమయాలు వ్యవహారమాత్రమే కాని వాస్తవంగా లేవని ఇందులో (14.6) పేర్కొనబడింది.

15. ఇందులో దీక్షణీయ - అతిథ్యేష్టుల సంస్థలను (సమాప్తులను) గురించి చెప్పబడింది. ప్రసంగవశాన భరద్వాజవృత్తాంతం పేర్కొనబడింది.

16. నాలుగవపంచిక ఈ అధ్యాయంతో మొదలౌతుంది. షోడశి అనే శబ్దం గ్రహాన్ని, స్తోత్రాన్ని, శస్త్రాన్ని చెబుతున్నది. పదహారవ స్తోత్రం, పదహారవశస్త్రం, పదహారు అక్షరాలనుచ్చరించి ప్రణవోచ్చారణ చేయడం, పదహారుఅక్షరాలుగల 'నివిత్'ను శస్త్ర మధ్యంలో చెప్పడం మొ॥ వాటివల్ల ఈ ప్రయోగానికి 'షోడశి' అనే పేరేర్పడింది. అతిరాత్రయాగం ఈ అధ్యాయంలో నిరూపించబడింది. రాత్రిపూట అనుష్ఠించవలసిన ఛందస్సులకు కొన్నింటికి 'అపిశర్వరా' లని పేరు. ఇవి పన్నెండని ఇందులో చెప్పబడింది.

17. ఆశ్వినశస్త్రానికి సంబంధించిన వెయ్యి ఋక్కులకు ఆశ్విన సహస్రమని చాలా పాతపేరు. ఆశ్వినశస్త్రం ఈ అధ్యాయంలో చక్కగా నిరూపించబడింది. ఇంకా గవామయనం, అతిరాత్రం, ఉక్థ్యం, అగ్నిష్టోమం, ఆరంభణీయం మొ॥ కర్మలన్నీ ఇందులో ప్రతిపాదించబడ్డాయి.

18. ఒక సంవత్సరకాలం చేయాల్సిన గవామయనమనే సత్రయాగంలో 'అభిప్లవ' మని ఆరురోజుల్లో చేయాల్సిన కర్మను మొత్తం అయిదుసార్లు చెయ్యాలి. దాంతో ఒకమాసం పూర్తవుతుంది. అలాగే ఒక సంవత్సరం చేసే ఆ సత్రయాగం క్రమంగా సంపూర్ణ మౌతుంది. ఇంకా ఇందులో 'విషువత్' అనే క్రతువు కూడా చెప్పబడింది.

19. ఇందులో ప్రధానంగా ద్వాదశాహమనే క్రతువు నిరూపించబడింది. యాగయోగ్యమైన కృష్ణపక్షం చంద్రునిలో ఉండటం వల్ల శుక్లపక్షంలో యాగం చేస్తున్న యజమానులు ఆ చంద్రమండలాన్ని పొందాలనుకుంటున్నారని ఈ అధ్యాయంలో చెప్పబడింది. యజ్ఞయాగాలు చేసినవాళ్ళు దక్షిణమార్గంలో చంద్రమండలం చేరగలరని ఉపనిషత్తులు చెబుతున్నాయి.

20. ద్వాదశాహక్రతువులోని నవరాత్రవిధి ఈ అధ్యాయంలో ప్రధాన విషయం. మొదటిరోజు, నాల్గవరోజు, పదవరోజు వదిలి పెడితే మిగిలేవి తొమ్మిదిరోజులు. ఈ తొమ్మిదింటికి 'నవరాత్ర' మని పేరు. దీనిలో మొదటి రెండు రోజులు చేయవలసిన కర్మలు ఈఅధ్యాయంలో చెప్పబడ్డాయి.

21. ఇక్కడ ఐదవపంచిక ప్రారంభం. పై 'నవరాత్రం'లో మూడు, నాల్గురోజులలో చేయవలసిన కర్మలు ఇందులో చెప్పబడ్డాయి. ఆజ్యశస్త్రం, ప్రఉగశస్త్రం, నిష్కేవల్యశస్త్రం, వైశ్వదేవశస్త్రం మొ॥ ఇందులో నిరూపించబడ్డాయి.

22 నవరాత్రంలో ఆరు, ఏడురోజుల్లో ఆచరించాల్సిన కర్మలిందులో పేర్కొనబడ్డాయి.

23. నవరాత్రంలో ఎనిమిది, తొమ్మిదిరోజుల్లో నిర్వహించాల్సిన కర్మకలాపం ఈ అధ్యాయంలో వివరించబడింది. వెనకటిలాగానే ఇందులోను ఆజ్యాదిశస్త్రాలు పేర్కొనబడ్డాయి.

24. ఈ అధ్యాయంలో తొమ్మిదోరోజు చేయవలసిన కర్మలను గురించి చెప్పి పదోరోజును 'అవివాక్య' మని ఎందుకంటారో విశదపరచబడింది. ఈ పదోరోజు సకలభోగ్యవస్తుసమృద్ధి కలది. పదోరోజున వివాక్యం నిషేధింపబడింది కాబట్టి ఇది అవివాక్యమని ప్రసిద్ధి పొందింది. వివాక్యమంటే ఎవరైనా విరుద్ధంగా ఏదైనా చేసినప్పుడు, నీ విలా విరుద్ధంగా చేశావు సర్దుకో! అని చెప్పటం. పదోరోజు అలా చెప్పటం నిషిద్ధం కాబట్టి ఆ రోజును 'అవివాక్య' మంటారు.

25. అగ్నిహోత్రమనేయాగం ఈ అధ్యాయంలో సవిస్తరంగా ప్రస్తావించ బడింది. హోమద్రవ్యమైన పాలయొక్క ప్రశంస ఇందులో కనబడుతుంది. ఇంకా అగ్నిహోత్రయాగదక్షిణ, సూర్యోదయం తరువాత ప్రాతః కాలాగ్నిహోత్రహోమం, ఉదితహోమప్రశంస, అనుదితహోమనింద, భూః, భువః, సువః అనే వ్యాహృతిత్రయోత్పత్తి, ప్రణవోత్పత్తి మొ॥ విషయాలు ఇందులో చోటుచేసుకుంటున్నాయి.

26. ఆరవపంచిక ఇక్కడ ప్రారంభమవుతున్నది. అగ్నిహోత్ర హోమంలో గ్రావస్తుత్ అనే ఋత్విజుడు చేయవలసిన కర్మలిందులో చెప్పబడ్డాయి. అలాగే సుబ్రహ్మణ్యుడు, అగ్నీధ్రుడనే ఇద్దరు ఋత్విజుల కర్తవ్యాలు కూడా చెప్పబడ్డాయి.

27. ఈ అధ్యాయంలో మైత్రావరుణ - బ్రాహ్మణాచ్ఛంసి - అచ్ఛావాకు లనే ఋత్విజుల శస్త్రవిధానం చెప్పబడింది. ఈ ముగ్గురు ఋత్విజుల ఆరంభణీయార్విధానం ఇందులో కనబడుతుంది.

28. ప్రాతస్సవన, మాధ్యందిన, తృతీయసవనాల్లో ప్రశాస్త్ర చేయవలసిన శస్త్రాలను విధించడం ఈ అధ్యాయంలో ముఖ్యవిషయం.

29. భరద్వాజ - వసిష్ఠ - నోధల సూక్తాలు, అహీనసూక్తం, సంపాతసూక్తాలు, వాటి విధానాలు ఇందులో ప్రతిపాదింపబడ్డాయి.

30. పృష్ఠ్యమనే ఆరవరోజు, హోత, ప్రశాస్త, బ్రాహ్మణాచ్ఛంసి, అచ్ఛావాకుడు మొ॥ ఋత్విజులు చెప్పే శిల్పాల విధానం ఈ అధ్యాయంలో ఉంది. ఆత్మసంస్కారకమైన శస్త్రానికే 'శిల్పం' అనిపేరు. కుంతాపసూక్తవిధానం కూడా ఇందులో చూడవచ్చు.

31. ఏడవపంచిక ప్రారంభం ఇక్కడే. ఉపప్రతీయమనే పశుయాగవిభాగం ఈ అధ్యాయంలో కనబడుతుంది. ఈ విభాగవిద్య ఆచార్యపరంపరా ప్రాప్తమైందని కూడ ఇక్కడ చెప్పబడింది.

32. ఇంతవరకు అనేక క్రతువులు, అందులోని కర్మలు చెప్పబడ్డాయి. ఈ అధ్యాయంలో ప్రశ్నోత్తరాల రూపంలో క్రతువులో సంభావింపబడే దోషాలకు ప్రాయశ్చిత్తాలు వివరింపబడ్డాయి.

33. ఇందులో ముఖ్యమైంది హరిశ్చంద్రోపాఖ్యానం. హరిశ్చంద్రుడనే రాజు వరుణానుగ్రహంతో రోహితుడనే కొడుకును పొందాడు. చెప్పిన మాటప్రకారం వరుణునికి ప్రీతిగా కొడుకును పశువుగాపెట్టి యాగం చేయలేదు. వరుణాగ్రహంతో రోగగ్రస్తుడైనాడు. ఎలాగో ఆ రాజు శునఃశేపుణ్ణి పెట్టి యజ్ఞం చేయడం మొదలుపెట్టాడు. దుఃఖితుడైన శునఃశేపుణ్ణిచూసి వరుణుడు కనికరిస్తాడు. హరిశ్చంద్రుడు ఆరోగ్యవంతుడౌతాడు. శునఃశేప-రోహితులు రక్షింపబడతారు. ఈ సందర్భంలో పుత్రప్రశంస చేయబడింది.

34. యజ్ఞోత్పత్తి, క్షత్రియుని యజ్ఞాచరణానికి సంబంధించిన ఎన్నో విశేషాలు ఈ అధ్యాయంలో ప్రతిపాదింపబడ్డాయి.

35. శ్యాపర్ణవృత్తాంతం, రామ - విశ్వంతరసంవాదం, న్యగ్రోధశబ్ద నిర్వచనం, న్యగ్రోధానికి క్షత్రియుడికి పోలిక, వరాశంసచమసభక్ష ప్రశంస మొ॥ విషయాలు ఇందులో పేర్కొనబడ్డాయి.

36. ఎనిమిదవపంచిక ఇక్కడే ప్రారంభమౌతుంది. రాజయజ్ఞానికి సంబంధించిన స్తోత్రశస్త్రవిశేషాలు, మరుత్వతీయ నిష్కేవల్య శస్త్ర స్వరూపం, అగ్నిష్టోమంతో ముగిసే జ్యోతిష్టోమానికి గల స్తోత్ర - శస్త్రసంఖ్య మొ॥ ఇందులో చెప్పబడ్డాయి.

37. దీక్షితుడైన క్షత్రియునికి పట్టాభిషేకం ఎలా చేయాలో ఇందులో వివరింపబడింది. సమిదాధానం, తరువాత చేయవలసిన క్రియాకలాపం ఇందులో పేర్కొనబడింది.

38. పురుషార్థప్రదమైన అభిషేకాన్ని నిరూపించిన తరువాత ఇంద్రుని అభిషేకం వివరింపబడింది.

39. శపథంచేసి పట్టాభిషేకం చేయాలి. ఆచార్యుడు క్షత్రియుణ్ణి అభిమంత్రిస్తాడు. అభిషేకద్రవ్యాలైన పెరుగు మొ॥ వాటిప్రశంస ఇందులో ఉంది. జనమేజయునిలాగా శర్యాతాదిరాజాభిషేకం, భరతాభిషేకం మొ॥ విషయాలు ప్రస్తావించబడ్డాయి.

40. పురోహితుడు ఆహవనీయాగ్ని సమానుడు. పౌరోహిత్యానికి ఎటువంటి బ్రాహ్మణులు అర్హులు ? ఎవరు అనర్హులు ? అనే విషయం పురోహితప్రశస్తి, అగ్న్యుత్పత్తి, వర్షోత్పత్తి, విద్యుదుత్పత్తి మొ॥ విషయాలు ఈ అధ్యాయంలో పేర్కొనబడ్డాయి.

ఐతరేయబ్రాహ్మణంలో గల 40 అధ్యాయాలను నిశితంగా సమీక్షిస్తే ప్రాచీన భారతీయసంప్రదాయాలకు సంబంధించిన ఎన్నో విషయాలు ఆధునిక విమర్శకులకు అందుబాటులోకి వస్తాయి.

— ఎస్. ఎస్. ఆర్.

# కౌషీతకిబ్రాహ్మణం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 2. విశేష విభాగం

### 2. 2 కౌషీతకిబ్రాహ్మణం

### 2. 2. 1 పరిచయం

ఋగ్వేదానికి గల శాఖలలో శాంఖాయనశాఖ ఒకటి. ఈ శాంఖాయనశాఖకు సంబంధించింది కౌషీతకిబ్రాహ్మణం. కనుకనే దీన్ని శాఖానామంతో శాంఖాయనబ్రాహ్మణమని కూడా అంటారు. కొందఱి అభిప్రాయంలో శాంఖాయనబ్రాహ్మణం ఈ బ్రాహ్మణం కంటే విభిన్నమైంది. కౌషీతకిబ్రాహ్మణానికే శాంఖాయనబ్రాహ్మణమని కూడా పేరని చాలామంది విమర్శకులంగీకరించారు. దీన్నే ఇంకొందఱు సాంఖ్యాయనబ్రాహ్మణమని కూడా పిలుస్తారు.

కుషీతకమహర్షి కొడుకు కౌషీతకుడు; లేక కౌషీతకి. ఇతడు వ్రాసింది కాబట్టి ఇది కౌషీతకిబ్రాహ్మణం. ఉద్దాలకుని శిష్యుడు గుణాఖ్యశాంఖాయనుడు. కహోలకౌషితకి ఇతని దగ్గఱ అధ్యయనం చేశాడు.

గురువు శాంఖాయనుడుగాని, శిష్యుడు కౌషీతకి గాని ఈ బ్రాహ్మణాన్ని రచించి ఉంటారని కొందఱు విమర్శకుల అభిప్రాయం. లేకపోతే గురువు శాంఖాయనుడు రచిస్తే శిష్యుడు కౌషీతకి ప్రచారంలోకి తెచ్చి ఉండవచ్చు. అందువల్లనే శాంఖాయన - కౌషీతకి సంబంధం ఈ శాఖకు చెందిన వాఙ్మయంలో కనబడుతుంది.

తాండ్యమహాబ్రాహ్మణం కౌషీతకిని గురించి ఒక కథనిలా చెబుతున్నది[1]: 'సమశ్రవసుడనే మహర్షికొడుకు కుషీతకుడు. ఇతనికి సామశ్రవసుడని కూడా పేరు. ఒకప్పుడు నపుంసకులైన వ్రాత్యులు కొందఱు గృహస్థులైన కుషీతకి మహర్షితో కలసి ఒక యజ్ఞం చేశారు. యజ్ఞాన్ని శాస్త్రీయంగా చేయలేదని ఖర్గలికొడుకు లుశాకపి ఆవ్రాత్యులనందఱినీ శపించాడు. ఆ శాపప్రభావంవల్ల కుషీతకి వంశంలో వాళ్లు, కౌషీతకశాఖ అధ్యయనం చేసేవాళ్లు బ్రహ్మచర్యాన్ని పోగొట్టుకొని భ్రష్టులైనారు.'

అయితే ఈ కథ బ్రాహ్మణకర్త కౌషీతకికే సంబంధించిందనడంలో ప్రమాణమేమీ కనపడడంలేదు. పైగా కౌషీతకిబ్రాహ్మణవ్యాఖ్యాత ఉదయుడు తన వ్యాఖ్యానారంభంలో కౌషీతకిని ఇలా ప్రశంసిస్తాడు[2]. 'అపౌరుషేయ అయిన శ్రుత్యంగన యుక్తి అనే చెలికత్తెతో వచ్చి స్వయంగా కౌషీతకిమహర్షిని వరించింది.' దీన్ని బట్టి కౌషీతకి మహర్షి ఎంతజ్ఞానధనుడో మనం అర్థం చేసుకోవచ్చు.

1. ఏతేన వై శమనీచామేఢ్రా అయజన్త. తేషాం కుషీతకః సామశ్రవసో గృహపతి రాసీత్. తాన్ లుశాకపిః ఖార్గలిరనువ్యాహారదవాకీర్షత. కనీయాంసౌ స్తోమావుపాగురితి. తస్మాత్కౌషీతకానాం న కశ్చనాతీవ జిహీతే యజ్ఞావకీర్ణా హి 17.4.
2. అపౌరుషేయత్వవిభూషితా యా
శ్రుత్యంగనా యుక్తిసఖీసనాథా।
స్వయం వృణీతే స్మ మునీశ్వరం తం
ప్రణౌమి కౌషీతకినామధేయమ్ ॥

శంకరుడు బ్రహ్మసూత్రభాష్యంలో (1.1.28; 3.3.10) దీన్ని కౌషీతకిబ్రాహ్మణమనే పేర్కొన్నాడు. పాణిని ముప్పై అధ్యాయాలు గల కౌషీతకిబ్రాహ్మణాన్ని, నలభై అధ్యాయాలుగల ఐతరేయ బ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు (అష్టా. 5.1.62)). నలభై అధ్యాయాలు గల బ్రాహ్మణం మహాకౌషీతకిబ్రాహ్మణమనే సత్యశ్రవ ఊహ సత్యదూరంగా ఉన్నది. కౌషీతకారణ్యకం పదిహేను అధ్యాయాలు కలిపితే నలభై అయిదు అధ్యాయాలు అవుతుంది గాని నలభై అధ్యాయాలు కాదు.

— ఎస్. బి. ఆర్.

## 2. 2. 2 విభాగం

కౌషీతకిబ్రాహ్మణం మూడు దశకాలుగా విభజింపబడింది. పదిఅధ్యాయాలకు దశకమని పేరు. ఇందులో మొత్తం ముప్పై అధ్యాయాలున్నాయి. ఈ అధ్యాయాల అవాంతర విభాగాలను ఖండలంటారు. కొందరు ఇందులో 226 ఖండలున్నాయని, ఇంకొందరు 276 ఖండలున్నాయని అన్నారు. కాని అది సరికాదు. ఇందులో మొత్తం 272 ఖండలున్నాయి. చూడండి :

| దశకం | అధ్యాయం | ఖండలు | దశకం | అధ్యాయం | ఖండలు | దశకం | అధ్యాయం | ఖండలు |
|---|---|---|---|---|---|---|---|---|
| I | 1 | 5 | II | 11 | 9 | III | 21 | 7 |
| | 2 | 9 | | 12 | 10 | | 22 | 6 |
| | 3 | 12 | | 13 | 7 | | 23 | 11 |
| | 4 | 10 | | 14 | 7 | | 24 | 8 |
| | 5 | 10 | | 15 | 6 | | 25 | 14 |
| | 6 | 11 | | 16 | 10 | | 26 | 14 |
| | 7 | 12 | | 17 | 7 | | 27 | 12 |
| | 8 | 12 | | 18 | 9 | | 28 | 8 |
| | 9 | 6 | | 19 | 7 | | 29 | 8 |
| | 10 | 10 | | 20 | 6 | | 30 | 9 |
| మొత్తం ఖండలు 97+ | | | 78+ | | | 97=272 | | |

కౌషీతకిబ్రాహ్మణంలో మొత్తం 6,962 వాక్యాలున్నాయి.

విషయవిభాగం :

ఐతరేయబ్రాహ్మణం ముఖ్యంగా చెప్పినవిషయాలనే ఈ బ్రాహ్మణం కూడా వివరిస్తున్నది. అయితే అందులోని వివరణపద్ధతి చాలా సంగ్రహంగా ఉంటుంది. ఈ బ్రాహ్మణంలో అది చాలవిస్తరంగా కనబడుతుంది. ఐతరేయంలో ఎన్నో విషయాలు సంకీర్ణంగా కనబడతాయి. కాని కౌషీతకిబ్రాహ్మణం ఎంతో చక్కగా విషయనిరూపణం చేసింది.

ఈ బ్రాహ్మణంలో మొదటి అధ్యాయంలో 'అగ్న్యాధేయం', రెండవ అధ్యాయంలో 'అగ్నిహోత్రం', మూడవ అధ్యాయంలో 'దర్శపూర్ణమాసలు' నిరూపింపబడ్డాయి. ఇక నాలుగవ అధ్యాయంలో 1. అనునిర్వాప్యేష్టి 2. అధ్యుదితేష్టి 3. అభ్యుద్దృష్టేష్టి 4. దాక్షాయణ యజ్ఞం 5. ఇళాదధేష్టి 6.సార్వసేనియజ్ఞం 7. శౌనకయజ్ఞం 8. వసిష్ఠయజ్ఞం 9. సాకంప్రస్థాయ్యేష్టి 10. మన్యయనేష్టి 11. తురాయణేష్టి 12. ఆగ్రయణేష్టి అనే 12 వికృతీష్టులు నిరూపింపబడ్డాయి. అయిదవ అధ్యాయం 1. వైశ్వదేవపర్వ 2. వరుణప్రఘాస పర్వ 3. సాకమేధపర్వ 4. శునాసీర్యపర్వ అనే నాలుగు చాతుర్మాస్యయాగాలను, ఆరవ అధ్యాయం తూలగవం, బ్రహ్మత్వమీమాంస, ప్రాయశ్చిత్తాహుతులను ప్రతిపాదిస్తున్నాయి. ఏడవ అధ్యాయంనుంచి బ్రాహ్మణం చివరివరకు సోమయాగమే వివరింపబడింది. అందులో దీక్షణీయ, ప్రాయణీయ, ఆతిథ్యేష్టులు, ప్రవర్గ్య, అగ్నీషోమీయ పశువు, ఆపోనప్త్రీయం, ఉక్థ్యం, షోళశి, అతిరాత్రం, ఉదవసానీయేష్టి అభిప్లవషడహం, విశ్వజిత్, గవామయనం మొ॥ సోమయాగకర్మలు చక్కగా చోటుచేసుకున్నాయి.

మొత్తంమీద ఐతరేయబ్రాహ్మణంలో లాగా ఇందులో కూడా సోమయాగమే ప్రధానమైన విషయం. అయితే మొదట దర్శపూర్ణ మాసలు మొ॥ హవిర్యజ్ఞాలు కూడ పేర్కొనబడటం ఇందులో విశేషం.

మొదలు - చివర :

ఈ బ్రాహ్మణం 'అస్మిన్ వై లోక ఉభయే దేవమనుష్యా ఆసుః' అనే మంత్రంతో మొదలై 'పరమే వై తదహారభ్యారధ్య వసన్తీతి హ స్మాహ కౌషీతకిః' అనే దానితో పూర్తవుతున్నది.

— ఎస్. బి. ఆర్.

## 2. 2. 3 సంకలనకాలం

దేశం :

కౌషీతకిబ్రాహ్మణం మనదేశంలో ఏ భాగంలో రచింపబడి ఉంటుందనే విషయంలో తగిన సాక్ష్యాలేవీ సరిగా దొరకడంలేదు. మహిదాసు తన చరణవ్యూహసూత్రవ్యాఖ్యానంలో (ఖండ. 2) మహార్ణవంనుంచి ఒక శ్లోకాన్ని పేర్కొంటాడు[1]. దానిద్వారా ఉత్తర గుర్జరదేశంలో ఋగ్వేదానికి సంబంధించిన శాంఖాయనశాఖాధ్యయనపరులు 'ఎంతోమంది ఉన్నారని, వారు కౌషీతకిబ్రాహ్మణాన్ని అనుసరిస్తున్నారని తెలుస్తున్నది. అంతేకాక ఈ బ్రాహ్మణం వ్రాత ప్రతులు ఈ నాటికీ ఆదేశంలోనే ఎక్కువగా లభిస్తున్నాయి. వీటినిబట్టి చూస్తే ఈ బ్రాహ్మణనిర్మాణం ఆదేశంలోనే జరిగిందేమో నని పిస్తున్నది.

కాలం :

ఐతరేయబ్రాహ్మణంలోని విషయనిరూపణపద్ధతి చాలా సంకీర్ణమని ఇదివరకే చెప్పాను. కౌషీతకిబ్రాహ్మణంలో అది చాలా సుగమంగా కనబడుతుంది. దీన్ని బట్టి ఐతరేయంకంటే ఈ బ్రాహ్మణం నవీనమైందని చెప్పవచ్చని కొందరి అభిప్రాయం.

కౌషీతకిబ్రాహ్మణాన్ని ఆచార్య పాణిని పరోక్షంగా పేర్కొన్నాడు. పాణిని భాషకంటె ఈ బ్రాహ్మణంలోని భాష చాల ప్రాచీనమైందనడంలో సందేహంలేదు. కాబట్టి క్రీ. పూ. మూడవశతాబ్దానికి చాలా పూర్వమే ఈ బ్రాహ్మణం రచింపబడిందని స్పష్టమవుతున్నది.

---

1. ఉత్తరే గుర్జరే దేశే వేదో బహ్వృచ ఈరితః ।
   కౌషీతకిబ్రాహ్మణం చ శాఖా శాంఖాయనీ స్థితా ॥

నిరుక్తంలో యాస్కుడు ఈ బ్రాహ్మణాన్ని పేర్కొన్నాడు (1.9). యాస్కుడు పాణినికంటే ప్రాచీనుడు. కౌషీతకిబ్రాహ్మణం యాస్కుని కంటే కూడ ప్రాచీనమైందనడంలో సంశయానికి అవకాశం లేదు.

రుద్రుని పేర్లైన ఈశాన మహాదేవశబ్దాలను కౌషీతకిబ్రాహ్మణం, శతపథబ్రాహ్మణం పేర్కొంటున్నాయి. దీన్నిబట్టి ఈరెండు దగ్గఱ దగ్గఱ ఒకే కాలానికి సంబంధించి ఉంటాయేమోనని కొందఱి ఊహ. ఏతావతా మొత్తం మీద క్రీ. పూ. 7 వ శతాబ్దం చివఱ ఈ బ్రాహ్మణం ఏర్పడి ఉండవచ్చునని చరిత్రవిమర్శకుల అభిప్రాయం. కాని భారతీయుల దృక్పథం ప్రకారం ఇది ఇంకా ఇంకా ప్రాచీనమైందని చెప్పక తప్పదు.

— ఎస్. బి. ఆర్.

## 2. 2. 4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

వ్యాఖ్యానాలు :

కౌషీతకిబ్రాహ్మణానికి సాయణుడు భాష్యం వ్రాయలేదు. మాధవభట్టు కొడుకు వినాయకభట్టు దీనికొక వ్యాఖ్యానం వ్రాసినట్లు తెలుస్తుంది. కౌషీతకిబ్రాహ్మణంలోని ఏడో అధ్యాయానికి సంబంధించిన ఈ వ్యాఖ్యానాన్ని 1908 లో ఆర్. లొబ్బెకె (R. Lobbecke) ప్రచురించాడు.

ఈ బ్రాహ్మణానికి సమగ్రమైన వ్యాఖ్యానాన్ని వ్రాసినవాడు ఉదయుడు. ఈ వ్యాఖ్యానాన్ని ఇ. ఆర్. శ్రీకృష్ణశర్మ చక్కగా సంపాదించారు. ఇది 1973లో జర్మనీలో ప్రచురింపబడింది. వ్రాసిన వాడు భారతీయుడైనా దీనిప్రతులు భారతీయులకు అందుబాట్లోలేవు.

ప్రచురణలు :

ఐతరేయబ్రాహ్మణానికి లభించినంత ఆదరణ కౌషీతకిబ్రాహ్మణానికి లభించలేదు. దీని వ్రాతప్రతిని గురించి వేబర్ (weber) ఇండిషెస్టుడియన్ (Indische studien)రెండవభాగంలో 1853లో విపులంగా పేర్కొన్నాడు. తరువాత 1887 లో బి. లిండ్నెర్ (B. Lindner) దీన్ని మొట్టమొదట ప్రచురించాడు. పూనా ఆనందాశ్రమం వారు 1911 లో ఈ బ్రాహ్మణాన్ని 'ఋగ్వేదాన్తర్గతం శాంఖాయనబ్రాహ్మణమ్' అని నెం. 65 గా ప్రచురించారు. గులాబ్‌రాయ్ వఝే శంకర దీనికి సంపాదకులు. ఈ ప్రచురణ అంత ప్రామాణికంగాలేదు.

కేరళలోని వేదపండితుల పాఠాలను, వ్రాతప్రతులను ఆధారంగా చేసుకొని ఇ. ఆర్. శ్రీకృష్ణశర్మ సంపాదించిన కౌషీతకి బ్రాహ్మణం 1968లో జర్మనీలో ముద్రింపబడింది. ఇప్పటికి ఈ బ్రాహ్మణానికి గల సంస్కరణల్లో ఇది చాలా విశిష్టమైంది.

— ఎస్. బి. ఆర్.

### 2. 2. 5 ప్రసిద్ధి

ఐతరేయబ్రాహ్మణంకంటే అందంగా అమర్చబడినా కౌషీతకి బ్రాహ్మణానికి అంతగా ప్రసిద్ధిరాలేదు. సాయణుడు ఈ బ్రాహ్మణానికి ఎందుకు భాష్యం వ్రాయలేదో స్పష్టంగా తెలియదు. ఋగ్వేద బ్రాహ్మణాల్లో ఒక్కటైన ఐతరేయానికి భాష్యం వ్రాయడంవల్ల, రెండింటిలోనూ విషయం ఒకటే కావడంవల్లనూ ఉపేక్షించి ఉండవచ్చు. అలాగే కుషీతకుని శాపవృత్తాంతంవల్ల సాయణుని కాలంనాటికి వైదికసమాజంలో ఈ బ్రాహ్మణంపైన చిన్నచూపు ఏర్పడి ఉండవచ్చునేమో !

ఐతరేయబ్రాహ్మణంలాగా ఇది సోమయాగాన్ని ప్రధానంగా వివరించినప్పటికీ మధ్యమధ్యలో ఎన్నో ఇష్టులను, యాగాలను, ధార్మిక - తాత్త్వికవిశేషాలను మనకందిస్తూ కొంతకు కొంత ప్రసిద్ధిని సంపాదించింది. మాంసభక్షణం చేసినందువల్ల వచ్చే అనర్థాన్ని ఈ బ్రాహ్మణం ఇలా వివరిస్తున్నది. చూడండి[1] :

> **"ఈ లోకంలో మనుష్యులు పశువుల్ని ఎలా తింటున్నారో; ఇతర లోకాల్లో పశువులు మనుష్యుల్ని కూడా అలాగే తింటాయి."**

అంటే ఏ పశువును బాధించి చంపి దాని మాంసాన్ని మానవుడు తింటున్నాడో, ఆ పశువు వీడిని కూడా అలాగే ఇతరలోకాల్లో వదలకుండా తింటుంది.

యజ్ఞమే విష్ణువనే భావన, "యజ్ఞో వై విష్ణుః" (4.2) అనే వాక్యంద్వారా ఈ బ్రాహ్మణంలో కూడా చాలాచోట్ల కనబడుతుంది.

---

1. తద్ యథా హ వా అస్మింల్లోకే మనుష్యాః పశూనశ్నన్తి, యథైవైభిర్భుంజతే. ఏవమేవాముష్మింల్లోకే పశవో మనుష్యానశ్నన్తి, ఏవమేభిర్భుంజతే 11.2.

జీవుడు వాక్స్వరూపి (2.5) అని, సత్యమయుడని, దేవతలు కూడ సత్యమయులే అనే తత్త్వాన్ని ఈ బ్రాహ్మణం వివరించిన తీరు ఎంతో హేతుబద్ధంగా కనబడుతుంది[1]. ఇలాగే ఇంకెన్నో విశేషాలను ఈ బ్రాహ్మణాధ్యయనంవల్ల మనంతెలుసుకోవచ్చు. ఈ బ్రాహ్మణానికి రావలసినంత ప్రసిద్ధి రాకపోవడంలో చక్కని సంస్కరణం ప్రజల కందుబాటులో లేకపోవడం కూడా ఒక కారణం కావచ్చు.

— ఎస్. బి. ఆర్.

1. స సత్యం వదతి. తస్మాదయం వాఙ్మయ ఆత్మా సత్యమయో భవతి. సత్యమయా ఉ దేవాః 2.6.

## 2. 2. 6 యజ్ఞ యాగాలు

యాగప్రక్రియలో దేవతలు, యాగద్రవ్యాలు, మంత్రాలు అతిముఖ్యమైనవి. యాగాలలో ఋగ్వేదంలోని మంత్రాలను చదువుతూ దేవతలను ఆహ్వానించటం ఋగ్వేది అయిన హోత చేసే పని. కాబట్టి ఈ బ్రాహ్మణంలో కౌషీతకిశాఖకు చెందిన హోత వివిధ యాగాలలో చదవవలసిన ఋక్కుల వివరాలు ప్రధానంగా చెప్పబడతాయి. మంత్రాలవివరాలతోపాటు యాగప్రక్రియను సంగ్రహంగా చెప్పటం కూడ జరుగుతుంది. హవిర్యజ్ఞాలుగా ప్రసిద్ధిచెందిన దర్శపూర్ణమాసం, అగ్న్యాధానం, అగ్నిహోత్రం, అనునిర్వాప్యేష్టి చాతుర్మాస్యం మొదలైన యాగాలు, సోమయాగాలుగా వ్యవహరింపబడుతున్న అగ్నిష్టోమం, అత్యగ్నిష్టోమం, ఉక్థ్యం, షోడశి, అతిరాత్రం ఈ కౌషీతకిబ్రాహ్మణంలో ముఖ్యంగా వివరింపబడ్డాయి. హవిర్యజ్ఞాలకు దర్శపూర్ణమాసం సోమయాగాలకు అగ్నిష్టోమం ప్రకృతియాగాలు. సాధారణంగా ప్రకృతియాగాలు సవిస్తరంగా నిరూపించిన తరువాత వికృతియాగాలను పేర్కొనడం పరిపాటి. ఈ క్రమం కౌషీతకి బ్రాహ్మణంలో సోమయాగాల విషయంలో అనుసరింపబడింది. కాని హవిర్యజ్ఞాల విషయంలో మాత్రం అంతగా పాటింపబడలేదు. ముందు అగ్న్యాధానం, అగ్నిహోత్రం గురించి చర్చించిన తరువాత దర్శపూర్ణమాసం వివరింపబడింది.

అగ్న్యాధానం (1-1-5) :

ఇది ఒక ఇష్టి. ఇష్టులలో ప్రధానంగా పాలు, నెయ్యి, బియ్యం, యవలు మొ॥ ద్రవ్యాలుగా ఉంటాయి. అగ్న్యాధానం అంటే హోమం చేయటానికి కావలసిన అగ్నిని ప్రతిష్ఠచేసుకోవటం. యజ్ఞప్రక్రియలో ఆహవనీయం, గార్హపత్యం, అన్వాహార్యపచనం అనే పేర్లతో వ్యవహరింపబడే మూడు అగ్నులు ఉంటాయి. ఒక రోజులో పూర్తయ్యే యాగాలనుంచి నెయ్యి

సంవత్సరాల వఱకు చేయవలసిన సత్రం వరకు ఈ అగ్నులు లేకుండా యాగప్రక్రియ జరుగదు. కాబట్టి ప్రతియాగానికి ముందు అగ్న్యాధానం తప్పనిసరిగా చేయాలి. అందువల్ల అనుష్ఠానక్రమాన్ని పురస్కరించుకొని ఈ కౌషీతకి బ్రాహ్మణం అగ్న్యాధానంతోనే ప్రారంభమవుతుంది. ఇది ఈ బ్రాహ్మణం యొక్క విశిష్టత.

విధింపబడే యాగాలక్రమం పాటిస్తే దర్శపూర్ణమాసమే ముందు చెప్పాల్సి ఉండేది. కాని అనుష్ఠానక్రమం ప్రకారమైతే అగ్న్యాధానేష్టి ముందుగా చెప్పవలసి ఉంటుంది. ఈ అగ్న్యాధానేష్టితో అగ్నిని ప్రతిష్ఠించటంతోపాటు పవమానం, పావకం, శుచి అనే మూడు ఇష్టులు కూడా చేయాలి. వీటి నెందుకు చేయాలో ఈ ఉపాఖ్యానం తెలియజేస్తుంది.

ఒకప్పుడు మానవులవలె దేవతలుకూడ ఈ భూలోకంలోనే కర్మానుష్ఠానం చేసుకుంటూ స్వర్గప్రాప్తికి సాధన చేస్తుండేవారు. దేవతలు కర్మానుష్ఠానంవల్ల పునర్జన్మబంధం నుండి విముక్తిని పొంది పునరావృత్తిలేని దేవలోకాన్ని పొందారు. పునరావృత్తి లేకపోవటం వల్ల దేవతలు మనుష్యుల కంటే వేరయ్యారు. ఈ దేవతలు స్వర్గానికి పోతూ అగ్నిని పిలిచి ఇలా చెప్పారు:

"నీవు ఈ భూలోకంలోనే ఉండి మనుష్యులకు మాకు కూడా అధ్యక్షుడుగా ఉండు. ఈ మానవులు శ్రౌతస్మార్తకర్మలద్వారా సమర్పించిన పదార్థాలను నీ ద్వారా స్వీకరిస్తాం. మా అనుగ్రహంచేత వీరు ఐహికాముష్మికపురుషార్థాలను పొందుతారు. భూలోకవాసులైన ఈ మానవులకు, స్వర్గలోకవాసులైన మాకు సంబంధం కలుపుతూ నీవు ఈ భూమిమీదనే ఉండు. మానవులు యాగాలలో ఇచ్చే వస్తువులను నీవు స్వీకరించు. మా తరపున వారి కోరికలను తీర్చు".

అందుకు అగ్నిదేవుడు ఇలా బదులు చెప్పాడు : "మీరు చెప్పింది వినటానికి చాలా బాగున్నది. కాని నేను తీవ్రదాహకశక్తితో కూడిన శరీరం కలవాడిని. నన్ను సమీపించటానికి భస్మమైపోతామనే భయంతో ఎవ్వరూ సాహసించరు. అందువల్ల మీరు అనుకున్నట్లు పురోడాశం వగైరా పదార్థాలు మానవులు ఇవ్వరు".

దేవతలు బాగా ఆలోచించారు. అగ్నిలో రెండు రకాల స్వభావాలు ఉన్నాయి. ఒకటి ఇతరులు సహింపరాని తీవ్రమైన దాహకశక్తి. రెండోది మంగళకరమై మానవాభ్యుదయానికి ఉపయోగపడే శోభనకరమైన దాహకశక్తి. ఇందులో శోభనకరమైన శక్తిని ఉపయోగించుకోవటానికి వీలవుతుంది. ఈ శక్తివల్లనే మనం వంటలు చేసుకోగలుగుతున్నాం. ఈ శోభనకరమైన శక్తిని మాత్రం అగ్ని దేవుడిలో ఉంచి, భయంకరమైన తీవ్రశక్తిని వేరే విధంగా (ఈనాడు విద్యుచ్ఛక్తిని వినిమయం చేసినట్లు) తరలించాలని దేవతలు నిర్ణయించుకున్నారు. కొంతభాగాన్ని నీటిలో ఉంచారు. దీన్ని పవమానాగ్ని అంటారు. కొంత వాయువులో ఉంచారు. దీన్ని పావకాగ్ని అంటారు. తక్కిన తీవ్రశక్తిని సూర్యునిలో ఉంచారు. ఈ అగ్నిని శుచి అంటారు. అగ్నిదేవుణ్ణి పూజించి ఆయన అనుగ్రహం సంపాదించాలంటే ఆహవనీయ గార్హపత్యాన్వాహార్య రూపాలలోని శోభనమూర్తినే గాక పావక, పవమాన, శుచి అనే పేర్లతో పిలువబడే అగ్నిస్వరూపాలనుగూడ పూజించాలి. అందువల్ల ఈ మూడు శరీరాలకు మూడు ఇష్టులు చేయాలి. పావకేష్టి పూర్ణమాసేష్టికి వికృతి. శుచి, పవమానేష్టులకు దర్శేష్టి ప్రకృతి. ఈ మొత్తం ప్రక్రియతో అగ్న్యాధానం పూర్తిఅవుతుంది.

ఒక వేళ అగ్న్యాధానంచేసిన తరువాత యజమానికి రుగ్మత, శిశుమరణం, ఉత్పాతం లాంటి అనివార్యకారణాలవల్ల యాగం మధ్యలో

నిలిపివేయటం జరిగితే, మళ్ళీ ప్రారంభించినప్పుడు తిరిగి అగ్న్యాధానం చేయాలి. దీన్ని పునరాధానం అంటారు. దీనిలో ప్రాయశ్చిత్తకర్మలు కూడా ఉంటాయి.

అగ్నిహోత్రం (2. 1. 9) :

అగ్నిహోత్రం కూడ ప్రతియాగానికి ముందు అగ్న్యాధానం తరువాత చేయవలసిన విధి. ఈ అగ్నిహోత్రం ప్రతిరోజు ప్రాద్దున సాయంత్రం చేయాలి. ఉదయం చీకట్లు విచ్చి సూర్యుడు ఉదయాద్రి నుంచి పైకివస్తున్నప్పుడు హోమం చేయాలి. సాయంత్రం సూర్యుడు అస్తమించి చీకట్లు ఆవరించక ముందు హోమం చేయాలి.

ఈ అగ్నిహోత్రంలో ఆవుపాలు ప్రధానంగా ఉపయోగించే హోమద్రవ్యం. ఆవు నానారకాలైన ఓషధులను తింటుంది. ఈ ఓషధులే పాలుగా పరిణమించటంవల్ల పాలు సర్వౌషధులకు సారం (సర్వాసామోషధీనాం రసో యత్ పయః) అని కౌషీతకిబ్రాహ్మణం (2.1) చెపుతుంది.

ఈ అగ్నిహోత్రయజ్ఞంద్వారా సర్వౌషధులను, ఆ ఓషధుల అధిదేవతలను, పితృదేవతలను, పశువులను, పక్షులను గర్భస్థజీవరాసులను, పుట్టిన, పుట్టబోయే జీవరాసులను, రాక్షసులను, దేవతలను, గంధర్వులను, అప్సరసలను పూజించి వారి ప్రీతిని పొందటాన్ని యజమాని ఆశిస్తాడు. సర్వజీవరాసులకు ప్రీతిని కలిగించి తద్వారా అభ్యుదయం పొందగోరుతున్నాడు యజమాని. అంటే అగ్నిహోత్రం ఏ జీవరాసులనుంచీ ఆపదలు కలుగకుండా చేసుకొనే కర్మ. ప్రకృతి శక్తులను పూజించి వశపరచుకుంటేగాని అతీతశక్తుల సాధన సాధ్యం కాదని తలచే మనప్రాచీన ఆర్యుల సంస్కృతి ఇందులో స్పష్టమవుతుంది.

దర్శపూర్ణమాసలు (3. 1. 12) :

రెండు ప్రత్యేకయాగాలకు కలిసినపేరు దర్శపూర్ణమాసేష్టి దర్శం అంటే అమావాస్య. పూర్ణమాసం అంటే పున్నమి. ఇవి కాల వాచకాలు అయినా, ఈ తిథుల్లో చేసే యాగాలకు కూడ ఈ పేరే వచ్చింది. అంటే పూర్ణిమనాడు, అమావాస్యనాడు ఈ యాగాలు చేయాలి.

ఈ యాగంలో ప్రథమాంగం ఉపవాసం. మామూలుగా తినే పదార్థాలు, త్రాగే పానీయాల విషయంలో నియమం (ప్రతిజ్ఞ) చేసుకోవాలనే సంకల్పమే ఉపవాసం. ఉపవాసవ్రతం చేయకుండా యజమాని హోమంచేస్తే ఆ ద్రవ్యాన్ని దేవతలు స్వీకరించరు. ఉపవాసం అంటే అసలైన అర్థం ఏమంటే ఆహారనియమం వల్ల యజమానికి దగ్గరగా దేవతలు ఉంటారు అని. దేవతలను సన్నిహితులుగా చేసుకోవటం కొరకు మనం ఉపవాసం ఉంటామన్న మాట.

సూర్యోదయంనుంచి మళ్లా సూర్యోదయం వరకు గడిచే కాలాన్ని ఒక్కరోజుగా పరిగణిస్తాం. ఒకతిథి రెండురోజుల్లో సాధారణంగా పడుతుంది. కౌషీతకిమతం ప్రకారం సూర్యాస్తమయం అయిన వెంటనే పూర్ణచంద్రుడు ఏరోజు ఉదయిస్తాడో ఆ రోజున పూర్ణమాస యాగంచేసే యజమాని ఉపవాసం ఉండాలి. అదేవిధంగా ఏ రాత్రితో చంద్రుడు పూర్తిగా కనుపించడో ఆ రోజున దర్శయాగం చేసే యజమాని ఉపవాసం ఉండాలి. ఈ ఉపవాసం ఉండే రోజును 'ఉపవసథం' అని అంటారు. ఆమరుసటిరోజున యాగాలు జరుగుతాయి.

దర్శపూర్ణమాసయాగాలలో హోత ప్రధానంగా సామిధేనీ మంత్రాలు, ప్రయాజమంత్రాలు, అనుయాజమంత్రాలను సస్వరంగా చదవవలసి ఉంటుంది. సామిధేనీమంత్రాలు అగ్నిదేవతాకమైనవి. ఇవి

గాయత్రీచ్ఛందస్సులో ఉన్నాయి. గాయత్రీచ్ఛందోబద్ధమైన ఒక మంత్రంలో 24 అక్షరాలు ఉంటాయి. ఈ మంత్రాలు పదకొండు ఉన్నాయి. మొదటిదైన 'ప్రవో వా జాః (ఋ. సం.3.27.1) అనే మంత్రాన్ని, చివరిదైన 'ఆ జుహోతా' (ఋ.సం. 5. 28. 6) అనే మంత్రాన్ని మూడు మూడుసార్లు చదవటంవల్ల మొత్తం గాయత్రీ-చ్ఛందోబద్ధమైన మంత్రాలను 15 చదివినట్లు అవుతుంది. 15 మంత్రాల్లోని అక్షరాలసంఖ్యతో గుణిస్తే (15×24)360 అక్షరాలు వస్తాయి. ఈ సంఖ్యను జాగ్రత్తగా పరిశీలిస్తే 15 మంత్రాలు శుక్లపక్షంలోని, కృష్ణపక్షంలోని, 15 రోజులకు, 360 అక్షరాలు సంవత్సరంలోని రోజులకు ప్రతీకలు. అంటే ఈ మంత్రాలతో కాలమానంలోని రోజు, పక్షం, సంవత్సరాలను పూజిస్తున్నట్లు వ్యక్తమవుతుంది.

ఇక ప్రయాజమంత్రాలు ఐదు. వీటిలోని సమిత్ యాగంతో వసంతర్తువును, తనూనపాత్‌యాగంతో గ్రీష్మర్తువును, ఇళాయాగంతో వర్షర్తువును, బర్హిర్యాగంతో శరత్ శిశిరర్తువులను, స్వాహాకృద్యాయాగంతో హేమంతర్తువును పూజించటం జరుగుతుంది. ఈ ప్రక్రియను చక్కగా సమన్వయం చేస్తే ఈ దర్శపూర్ణమాసయాగాల ద్వారా ప్రాచీనభారతీయులు కాలాన్ని పూజించినట్లు వ్యక్తమవుతుంది.

అనుయాజమంత్రాలు (శాంఖాయనశ్రౌతసూత్రం, 1.13.1-3) మూడు. ఈ మూడింటిని పఠించటంద్వారా మూడులోకాలను, అంటే ముల్లోకాల్లో ఉండేవాళ్ళను తృప్తిపరచినట్లు అవుతుంది.

వీటి తరువాత హోత చదివే ముఖ్యమైన మంత్రాలు పత్నీసంయాజ మంత్రాలు. ఈ మంత్రాలను పఠిస్తూ గార్హపత్యాగ్నిలో హోమం చేయాలి. ఈ పత్నీసంయాజయాగం ద్వారా దేవతలను, వారి భార్యలను కలిపి యాగంచేయుటం జరుగుతుంది.

పూర్ణమాసయాగంలో ఆగ్నేయం, అగ్నీషోమీయం, ఉపాంశుయాగం అనే మూడు యాగాలు, దర్శయాగంలో ఆగ్నేయ

యాగం, ఇంద్రదేవతాకమైన దధియాగం, పయోయాగం అనే మూడుయాగాలు ప్రధానమైనవి.

పూర్ణమాసయాగంలో అగ్ని, అగ్నీ-షోములు, ఇంద్రాగ్నులు, దర్శ యాగంలో ఇంద్రాగ్నులు, ఇంద్రుడు ప్రధానదేవతలు. పురోడాశం, పాలు, పెరుగు ప్రధానమైన ద్రవ్యాలు. సోమయాగం చేసిన యజమాని దర్శయాగంలో ఇంద్రాగ్నులకు పురోడాశానికి బదులు ఇంద్రుడికిగాని, మహేంద్రుడికిగాని సాన్నాయ్యం ద్రవ్యంగా ఉపయోగించాలి. పాలు పెరుగు కలిపిన మిశ్రమానికి సాన్నాయ్య మనిపేరు.

ఈ ప్రధాన హవిర్యాగాలు చేసి తరువాత స్విష్టకృద్ రూపమైన అగ్నికి యాగం చేయాలి. ఎవరెవరికి ఎంతెంతభాగం రావాలో అది వారివారికి పంచిపెట్టేవాడు స్విష్టకృత్. ఉదాహరణకు అన్నం వడ్డించేవాడు ప్రతిభోక్తకు కావలసింది సమగ్రంగా వడ్డించి తృప్తిపరుస్తాడు. వారు భుజించేటప్పుడు తను తినడు. అందరిదీ అయిన తరువాత అతను తింటాడు. అదే విధంగా యాగాగ్నిలో హోమం చేసిన ప్రతిద్రవ్యాన్ని ఉద్దేశింపబడిన దేవతలకు అగ్ని చేరుస్తాడు. వారికి చేర్చేటప్పుడు తాను తినడు. అందువల్ల ప్రత్యేకంగా ఈ మధ్యవర్తిత్వం నిర్వహించినందుకు మరో హోమం అగ్నికి చేయాలి. అందువల్ల అగ్నికి స్విష్టకృత్ అనేది సార్థకమైన పేరు. ఈ స్విష్టకృదగ్నియాగంతో ప్రధానయాగాలు పూర్తిఅవుతాయి.

## వికృతీష్టులు

దర్శపూర్ణమాసయాగాలకు 12 వికృతీష్టులు కౌషీతకిబ్రాహ్మణంలో చెప్పబడ్డాయి. ప్రకృతీష్టిలో ఉన్న క్రమంగాని, దేవతలుగాని, హోమద్రవ్యాలుగాని మంత్రాలుగాని మార్పటంవల్ల ఈ వికృతీష్టు లేర్పడతాయి. ద్రవ్యదేవతామంత్రాల మార్పువల్ల యాగఫలం కూడ మారుతుంది.

**1. అనునిర్వాప్యేష్టి (4.1) :**

ఈ ఇష్టిని చేసి దేవతలు అసురులను జయించారు. అందువల్ల శత్రునాశం కోరేవాడు ఈ యాగాన్ని చేయాలి. ఈ ఇష్టిని రెండు రకాలుగా చేయవచ్చు. 1. పౌర్ణమాసేష్టి చేసిన తరువాత అమావాస్యేష్టిలో లాగా ఇంద్రదేవతాకమైన ఇష్టి చేయటం ఒక పద్ధతి. 2. అమావాస్యేష్టి చేసిన తరువాత పౌర్ణమాసేష్టిలో లాగా అదితిదేవతాకమైన ఇష్టిని చేయటం రెండో పద్ధతి. ఏ విధంగా చేసినా అనునిర్వాప్యేష్టి చేసినట్లే అవుతుంది.

**2. అభ్యుదితేష్టి (4.2) :**

అమావాస్యకు ముందున్న చతుర్దశినాడు దర్శయాగంచేసినట్లైతే అభ్యుదితేష్టి అవుతుంది. ఇందులో మూడుహవిస్సులు ఉంటాయి. 1. అగ్ని దేవతలకు అష్టాకపాలమైన పురోడాశం; 2. ఇంద్రుడికి సాయంత్రం పిండిన పాలలో తయారైన పెరుగు; 3. విష్ణువుకు ప్రొద్దున పితికిన పాలు. దక్షిణగా ధనుస్సు ఇవ్వాలి. ఈ యాగంవల్ల వచ్చే ఫలం సుఖమైన ప్రయాణం, క్షేమప్రాప్తి.

**3. అభ్యుద్దృష్టేష్టి (4.3) :**

అమావాస్య తరువాత వచ్చే పాడ్యమినాడు (శుక్లపతిపత్) ఈ ఇష్టిని చేయాలి. ఇందులో కూడ మూడు హవిస్సులు ఉంటాయి. 1. అగ్నికి అష్టాకపాలమైన పురోడాశం, 2. ఇంద్రునికి ఏకాదశకపాలమైన పురోడాశం, 3.ఆదిత్యరూపుడైన వైశ్వానరునికి ద్వాదశ కపాలమైన పురోడాశం. ఇందులో చేతికర్ర, చెప్పులు దక్షిణగా ఇవ్వాలి. ఈ యాగంవల్ల యజమానికి ఎటువంటి భయం కలుగదు.

**4. దాక్షాయణయజ్ఞం :**

పూర్వం కౌషీతకిమతం ప్రకారం ఫాల్గుణ పూర్ణిమనాటినుంచి సంవత్సరం మొదలయ్యేది. దాక్షాయణయజ్ఞం ఈ సంవత్సరాదినాడు

ప్రారంభించాలి. ఇంతకు పూర్వం పర్వతుని కుమారుడైన దక్షుడు ఈ యాగాన్ని చేసి తనకోరికలు పొందాడు. అదేవిధంగా అన్ని రకాల కోరికలను పొందగోరేవాడు ఈ యాగం చేయుటానికి అధికారి. ఈ దాక్షాయణయజ్ఞం రెండు పున్నమదినాలలో, రెండు అమావాస్య దినాలలో చేయాలి. మొదటి పున్నమనాడు అగ్నీషోములకు ఏకాదశ కపాలమైన పురోడాశాన్ని హోమం చేయాలి. రెండో పున్నమనాడు ఇంద్రదేవతాకమైన సాన్నాయ్యాన్ని హోమం చేయాలి. మొదటి అమావాస్యనాడు ఇంద్రాగ్నియాగం చేయాలి. రెండో అమావాస్యనాడు మైత్రావరుణదేవతాకమైన పయస్యాయాగం చేయాలి.

**5. ఇళాదధేష్టి (4.5.1-6) :**

దాక్షాయణయజ్ఞం ఏ రోజున ప్రారంభిస్తారో ఆ రోజునే ఇళాదధేష్టి కూడ చేయాలి. పశుసంపద, సమృద్ధిగా అన్నపానాదులు కావలసినవాడు ఈ యాగం చేయాలి.

**6. సార్వసేనియజ్ఞం (4.5.7-11):**

దీన్ని పౌర్ణమాసిలాగా చేయాలి. ఈ యజ్ఞం చేసినవాడు శత్రువులను అధిగమించగలుగుతాడు. కాబట్టి శత్రుజయం కోరేవాడు ఈ యాగానికి అధికారి.

**7. శౌనకయజ్ఞం (4.5.12-16) :**

ఇదీ పౌర్ణమాసిలాగా చేయాలి. వంశసమృద్ధి కోరేవాడు చేయాల్సిన యాగమిది.

**8. వసిష్ఠయజ్ఞం (4.5.1-11) :**

పూర్వం వసిష్ఠుని పుత్రులను సుదాముని కుమారులు చంపారు. పిల్లలులేని వసిష్ఠుడు మళ్ళీ సంతానం పొంది వంశాభివృద్ధి చేయాలని వారికి నాశం జరుగకుండా శత్రుక్షయంకూడ కలగాలని ఆశించాడు. ఇవన్నీ ఒకే

యాగంవల్ల ఎలా సాధించటానికి వీలు అవుతుందోనని ఆలోచించసాగాడు. సంస్కారంవల్ల ఈ యాగాన్ని సందర్శించగలిగాడు. తాను ఈ యాగాన్ని చేసి కృతకృత్యుడయ్యాడు. కాబట్టి దీనిపేరు వసిష్ఠయాగం అయింది. దీన్ని ఫాల్గుణ అమావాస్యనాడు ఆరంభించాలి. పున్నమ బ్రాహ్మణజాతీయంగా, అమావాస్య క్షత్రజాతీయంగా పరిగణింపబడుతాయి. ఇక్కడ సంతానాభివృద్ధితో పాటు శత్రునాశం కూడ కాంక్షింపబడుతుంది. కాబట్టి అమావాస్యనాడు ప్రారంభించాలని నిర్ణయించారు.

**9. సాకంప్రస్థాయ్యేష్టి (4.6.12-19) :**

ఈ యాగంలో పాలు పెరుగుతో నింపిన కుండలను తీసుకొన్నన్ని బ్రాహ్మణులతో పాటు అధ్వర్యుడు హోమం దగ్గరకు వెళ్లాడు. కాబట్టి దీనికి సాకంప్రస్థాయ్యేష్టి అనే పేరు వచ్చింది. దీన్నికూడ వసిష్ఠయాగంలాగా అమావాస్యనాడు చేయాలి. దీనివల్ల పురుషశ్రేష్ఠత్వం విద్యాతపస్సులద్వారా సర్వోత్కృష్టత్వం లభిస్తాయి.

**10. మున్యయనేష్టి (4.7.1-4) :**

ఐహికసుఖాలైన పశుపుత్రాదులు, ఆముష్మికమైన స్వర్గం కావాలని కోరేవాడు ఈ యాగాన్ని చేయాలి. దీన్ని పూర్ణిమనాడు పౌర్ణమాసిలాగా చేయాలి.

**11. తురాయణేష్టి (4.7.5-14) :**

కావషేయుడైన 'తుర' అనే మహర్షి దీని ద్రష్టకావటంవల్ల ఈ యాగానికి ఆ పేరు వచ్చింది. ఇది కూడ పౌర్ణమాసేష్టి లాగా పున్నమనాడే ప్రారంభింపబడుతుంది.

**12. ఆగ్రయణేష్టి (4.8-10) :**

పంటలనుండి ధాన్యం ఇంటికి తెచ్చేటప్పుడు చేసే ఇష్టి ఆగ్రయణేష్టి అందువల్ల అన్నాదులు కొదవలేకుండా కావాలనే వాడు చేయవలసిన యాగం

ఇది. ఇది శ్యామాకాగ్రయణేష్టి వేణుయవ ద్రవ్యకాగ్రయణేష్టి, వ్రీహ్యాగ్రయణేష్టి అని మూడు రకాలుగా ఉంది.

శ్యామాకాగ్రయణేష్టి వర్షాకాలంలో శ్యామాకధాన్యం బాగా పండిన తరువాత కోయించి ఇంటికి తెచ్చిన తరువాత వచ్చే అమావాస్య పున్నమ దినాలలో చేయాలి. సోమదేవతకు శ్యామాకఫలాలతో తయారైన చరువును (హవ్యం) హోమద్రవ్యంగా ఉపయోగించాలి. పెరుగు నెయ్యి కలపటంవల్ల ఏర్పడే మధుపర్కం దక్షిణగా ఇవ్వాలి.

వేణుయవాగ్రయణేష్టి వసంతఋతువులో వెదురుబియ్యం పంటకు వచ్చి కోయించి ఇంటికి తెచ్చిన తరువాత చేయవలసిన యాగం. దీన్ని శ్యామాకాగ్రయణేష్టి లాగానే చేయాలి.

వ్రీహ్యాగ్రయణేష్టిలో బియ్యంగాని, యవలుగాని ఉపయోగిస్తారు. ఇంద్రాగ్నులు, విశ్వేదేవులు, భూమి, ఆకాశం దేవతలు. ప్రక్రియ అంతా శ్యామాకాగ్రయణేష్టిలాగానే ఉంటుంది. ఇంటికి పంటచేరినప్పుడు ముందు దేవతలకు అర్పించనిదే మనం ఉపయోగించకూడదనే మన సనాతన సంప్రదాయం ఈ మూడింటిలోను ప్రధానంగా గమనించవలసిన విషయం.

### చాతుర్మాస్యయాగాలు

వైశ్వదేవం, వరుణప్రఘాసం, సాకమేధం, శునాసీర్యం అనే నాలుగు చాతుర్మాస్యయాగాలు కౌ. బ్రా. లో ఐదో అధ్యాయంలో వివరింపబడ్డాయి. ఇవికూడ దర్శపూర్ణమాసలకు వికృతిష్టులు.

**1. వైశ్వదేవం (5. 1-2) :**

నూతనసంవత్సరాది ఫాల్గుణపూర్ణిమనాడు ఈ చాతుర్మాస్యేష్టిని ప్రారంభించాలి. మొత్తం నాలుగు పూర్ణిమదినాల్లో చేయాలి. ఈ చాతుర్మాస్యం రుగ్మతనివారణకు ఉద్దేశించబడింది. ఋతువులు మారినప్పుడు జబ్బులు

చేస్తూ ఉంటాయి. వాటి నివృత్తికోసం ఋతువుల సంధులలో ఈ యాగం చేయబడుతుంది. ఇందులో అగ్నికి ముఖ్యంగా హవిర్దానం చేస్తారు. సప్తదశ సామిధేనీమంత్రాలు, ఆజ్యం హోమంచేసేటప్పుడు 'అప్' ధాతునిష్పన్నమైన క్రియావాచక పదం కలిగిన మంత్రాలు, విరాట్ ఛందోబద్ధమైన సంయాజ్యా మంత్రాలు ఉంటాయి. ఇందులో తొమ్మిది ప్రయాజలు, తొమ్మిది అనుయాజలు, ఎనిమిది హవిస్సులు, ఒక వాజినం అనే అశ్వాలకు ఇచ్చే హవిస్సు ఉంటాయి. అగ్నీషోములు, సవిత, వచోరూపమైన సరస్వతి, పూష, రోగనివారణకారకులైన మరుత్తులు ప్రధానమైన దేవతలు. పాలు, ఏకకపాలమైన పురోడాశం ప్రధానమైన ద్రవ్యాలు. ఈ యాగానంతరం పౌర్ణమాసేష్టి కూడా చేయాలి. ఈ యాగాన్ని చేసినవాడు నక్షత్రాలవంటి కాంతిని పొంది ప్రకాశిస్తాడు.

తక్కిన చాతుర్మాస్యాలు ఈవైశ్వదేవం లాగానే చేయాలి. అక్కడక్కడ దేవతల మార్పు, హోమద్రవ్యాల మార్పులు ఉంటాయి.

**వరుణప్రఘాసం (5.3.5) :**

సర్వపాపాలనుంచి విముక్తి కలిగించే ఈ వరుణప్రఘాసయాగం ఎలా వచ్చిందో ఈ కథ వివరిస్తుంది :

వైశ్వదేవయాగం చేయుటంవల్ల ప్రజాపతి సంతానాన్ని పొందాడు. ఈ పిల్లలుపుట్టగనే వరుణదేవుని యవలను అతని అనుమతి లేకుండా తిన్నారు. అందుకు కోపించిన వరుణుడు ఆబిడ్డలను తన పాశాలతో బంధించాడు. అప్పుడు ఆ పాశాలనుంచి విముక్తి చేయమని ఆ పిల్లలు తమ తండ్రి ప్రజాపతిని వేడుకున్నారు. పుత్రవాత్సల్యం గల ప్రజాపతి ఈ యాగాన్ని కనుగొన్నాడు. దీనితో వరుణుణ్ణి సంతోషపరచాడు. యాగంచేత సంతుష్టినొందిన వరుణుడు ఆ బిడ్డలను తన పాశాలనుంచి విముక్తులను

చేశాడు. అందువల్ల ఈ యాగం చేసినవాడు సర్వపాపాలనుంచి విముక్తి పొందుతాడు.

వైశ్వదేవంలో ఉపయోగించిన అగ్నినే ఇక్కడ కూడా ఉపయోగించాలి. ఇందులో ద్వాదశకపాలమైన పురోడాశం ఇంద్రాగ్ని దేవతలకు హోమం చేయాలి. తక్కినవన్నీ వైశ్వదేవంలాగానే ఉంటాయి.

**సాకమేధం (5.6-7) :**

ఇంద్రుని గురించి చేసేది సాకమేధం. అగ్ని, మరుత్తులు, ఇంద్రుడు, పితృదేవతలు, మహేంద్రుడు ప్రధానమైన దేవతలు. గృహమేధీయం అనే యాగం సాయంత్రం చేయాలి. గృహమేధీయం పుష్టి (అభ్యుదయం) ఇచ్చే కర్మ. సాయంత్రమే పుష్టి కలుగుతుంది. కాబట్టి దీన్ని సాయంత్రమే చేయాలి. అందువల్ల 'పోష' అనే శబ్దం కలిగిన మంత్రాలు ఇందులో చదవబడుతాయి. యజమానుడు పోషింపబడతాడు. ఇదే ఈ చాతుర్మాస్యఫలం.

**శునాసీరీయం (5.10) :**

ఈ యాగంలో 'శునా' 'సీర' అనే దేవతలు ప్రధానం కావటంవల్ల దీనికీపేరు వచ్చింది. తక్కిన అంశాల్లో ఇది వైశ్వదేవ యాగం లాగా ఉంటుంది. పౌష్ణయాగం వరకు దాంతో ఏమీ తేడా లేదు. తరువాత వైశ్వదేవంలో మరుత్తులకు యాగం చేస్తే ఇందులో శునాసీరులకు యాగం చేయాలి. ఇది కూడ రోగనిరోధానికి, రోగ ప్రశమనానికి ఔషధంగాను ఉపయోగపడుతుంది. ఈ యాగాన్ని సంవత్సరంలో వచ్చే అధికమాసంలో చేయాలి. ఒక తెల్ల ఆవును దక్షిణగా ఇవ్వాలి.

## సోమయాగాలు

కౌషీతకిబ్రాహ్మణంలో చెప్పబడిన అత్యగ్నిష్టోమం, ఉక్థ్యం, షోడశి, అతిరాత్రం అనే సోమయాగాలకు అగ్నిష్టోమం ప్రకృతి యాగం. ఈ అగ్నిష్టోమంలో మొదటినుంచి చివరివరకు హోత చదవ వలసిన మంత్రాలు అన్నీ సమగ్రంగా వివరించబడ్డాయి. తక్కిన యాగాలలోవచ్చే మార్పులు చేర్పులు మాత్రం చెప్పబడ్డాయి. సోమయాగాల విషయంలో ప్రక్రియలతోబాటు ఎక్కువగా వేదమంత్రాల పఠనం ఉంటుంది. ఈ మంత్రాలు ఏ సమయంలో ఎక్కడ పఠించాలో కూడ సవిస్తరంగా నిర్దేశింపబడింది.

అగ్నిష్టోమానికి మరోపేరు జ్యోతిష్టోమం. ఇది ఒకరోజు జరిగే యాగమే అయినా అంకురార్పణనుంచి అవభృథస్నానం వరకు ఉన్న మొత్తం ప్రక్రియ చాలారోజులు పడుతుంది. ప్రధాన యాగం జరిగే రోజు 'సుత్యాహ' మం[illegible]రు. ఆ రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుమార్లు సోమరసాన్ని హోమం చేస్తారు. ఈ సోమరసం ప్రధానమైన యాగద్రవ్యం కావటంవల్ల ఈ యాగానికి సోమయాగం అనే పేరు వచ్చింది. ఈ సోమరసానికి కారణమైన సోమలత ఎలా ఉంటుందో, ఎక్కడ దొరుకుతుందో తెలియకుండా కాలగర్భంలో కలిసిపోయింది. ఈనాడు సోమయాగాలు చేసేవారు ఆ లతకు ప్రత్యామ్నాయంగా దానితో పోలి సమృద్ధిగా దొరికే లతను ఉపయోగిస్తున్నారు. భిన్నభిన్న ప్రాంతాలలో రకరకాల లతలను ఉపయోగిస్తున్నారు కూడ. ఉదాహరణకు ఆంధ్రదేశంలో 'అమృతవల్లి' (=తిప్పతీగ) మహారాష్ట్రలో 'పూతిక' అనే లతలను ఇప్పుడు ఉపయోగిస్తున్నారు. సోమరసమే కాకుండా ఈ యాగంలో సోమయాగంనాడు, ఆముందురోజు (10. 5. 2) పశుయాగం కూడ చేస్తారు. పశుపురోడాశమనే యాగంలో పురోడాశపు ముక్కల్ని, యజ్ఞపశువు శరీరంలోని భాగాలను కలిపి హోమం చేస్తారు.

దీక్షణీయేష్టి (7.1-6), ప్రాయణీయేష్టి (7.7.11), సోమక్రయం (7.11-12), అగ్ని మన్థనం (8.1-2), ఆతిథ్యేష్టి (8.2-3), ఉపసదిష్టి (8.9-12), అగ్నిప్రణయనం (9.1-2), యూపసంస్కారం (10.2-4), వపాయాగం (10.8.9-21), పశుపురోడాశయాగం (10.8.22-32), జ్యోతిష్టోమసమాపనం (18.5-6), అవభృథం (18.6-8), ఉదవసానీయేష్టి (18.9) మొదలైనవి ఈ యాగంలోని కొన్ని ముఖ్యమైన కర్మలు.

—ఎమ్. ఎస్. ఎస్.

## 2.2. 7 వైశిష్ట్యం

ఐతరేయ, కౌషీతకిబ్రాహ్మణాలు రెండూ ఒకే సంప్రదాయ వ్యాప్తికి ప్రాతినిధ్యం వహిస్తున్నా, వీటిలోని విషయాలను పరిశీలిస్తే ఈ రెంటికీ చాలా తేడా ఉన్నట్లు మనకు తెలుస్తుంది. రాజసూయం, అశ్వమేధంవంటి సాధారణయజ్ఞాలను వదిలేసినా ముఖ్యమైన శ్రౌతయాగాలను కౌషీతకి బ్రాహ్మణం ప్రస్తావించింది.

ముప్పై అధ్యాయాలుగా విస్తరించిన ఈ కౌషీతకిబ్రాహ్మణంలో మొదటి నాలుగధ్యాయాల్లో అగ్న్యాధేయం, అగ్నిహోత్రం, దర్శ-పూర్ణమాసలు, ప్రత్యేకయజ్ఞాలు వరుసగా వివరింపబడ్డాయి. ఐదవ అధ్యాయంలో చాతుర్మాస్యం, వైశ్వదేవం మొ॥ విధివిశేషాలు పేర్కొనబడ్డాయి. ఆరవ అధ్యాయంలో బ్రహ్మయొక్క తపఃకర్తవ్యాదులు సూచింపబడ్డాయి. ఇక ఏడవ అధ్యాయం నుంచి చివరిదాకా సోమయాగానికి సంబంధించిన ఎన్నో విషయాలు విస్తరంగా చెప్పబడ్డాయి.

ఈ బ్రాహ్మణంలోని భాగాలన్నీ సూటిగా విషయనిర్దేశం చేస్తూ పరస్పరం సన్నిహితసంబంధం కలిగి ఉండేటట్లు జాగ్రత్తగా అమర్చబడ్డాయి. విషయవివరణం సమగ్రంగాను క్రమబద్ధంగాను చేయబడింది.

దేవత లొకప్పుడు అగ్నిని తమఅధ్యక్షునిగా అర్థించి శుభకరం, సహాయకారి, యజ్ఞకర్తమూ అయిన రూపాన్ని మాత్రం ఆయనలో ఉంచి, భయంకరమైన రూపాన్ని వేఱుచేసి, పవమాన, పావక, శుచి నామాలతో జల, వాయు, సూర్యులలో నిక్షేపించారు (పే. 175). కనుక ఇప్పుడు అగ్ని మానవ క్షేమంకరుడై ప్రకాశిస్తున్నాడు. లోకాలు దేవాసురసంఘర్షణకు గురైనప్పుడు అగ్ని వారినుంచి వేఱై ఋతువులలో ప్రవేశించాడు. ఇక అసురులమీద విజయంసాధించిన దేవతలు అగ్నిని ఆశ్రయించి, ఆయనకు వరప్రదానం

చేశారు. దాని ప్రకారం హోమద్రవ్యం అగ్నిద్వారా దేవతలను చేరుతుంది. దేవతలు తృప్తి పొందుతారు. అగ్నిచేత వ్యవస్థీకరింపబడ్డ ఋతువులవల్ల సకాలంలో వానలు కురిసి మానవుల కోర్కెలు నెరవేరతాయి. ఈ విషయాలు అగ్న్యాధేయంలో వివరింపబడ్డాయి. ప్రాణికోటి జీవనారోగ్యాలకు అత్యంతావశ్యకమైన పంచభూతాల్లో ఒక్కటైన అగ్నికిగల ప్రాధాన్యం, అగ్నిలో ఆజ్యాదిహోమద్రవ్యాలను ఆహుతిచేయుటంవల్ల వాతావరణంలో కలిగే విశ్వజనీన ప్రయోజనాలు దీనిలో తెలుస్తున్నాయి.

అగ్నిహోత్రాధ్యాయంలో సూర్యాగ్నితేజస్సులతో ప్రకాశించే ప్రాతస్సాయంకాలాల్లో హోమం చేయవలసిన ఆవశ్యకత, పాకానికి పనికివచ్చే గార్హపత్యాగ్నిలోను, అర్చనకు అక్కరకువచ్చే ఆహవనీయాగ్నిలోను హోమంచేసే విధానం వివరింపబడ్డాయి. గ్రామ సంపదను, బ్రహ్మవర్చస్సును, పశుగణాభివృద్ధిని కోరేవారు క్రమంగా ధూమప్రాయం, జ్వాలామయం, భస్మప్రాయమూ అయిన అగ్నిలో హోమంచేయాలని సూచింపబడింది. అగ్నిజన్యమైన జలసంపదవల్ల, తరులతాదులు, వాటివల్ల ఆహారం, దానివల్ల మానవుడు ఉద్భవించిన తీరు సృష్టిపరిణామాన్ని సూచిస్తున్నది. అంతేకాక ఇందులో రాత్రింబగళ్లు దేవుని అస్త్రాలతోను, మృత్యుదేవత బాహువులతోను, ఉభయ సంధ్యలు పక్షిరెక్కలతోను పోల్చబడినాయి. సాయంకాలంలో సూర్యాస్తమయం తర్వాత చీకటిరాకముందు ప్రాతఃకాలంలో సూర్యోదయానికి ముందు చీకటిపోయిన తర్వాత, అగ్నిహోత్రారాధన చేస్తే దివ్యత్వం లభిస్తుందని చెప్పబడింది.

దర్శపూర్ణమాసాధ్యాయంలో మొదట మనఃకారకుడైన చంద్రుని క్షయవృద్ధులతో ముడిపడిన అమావాస్య-పూర్ణిమ తిథులలో చేయవలసిన ఉపవాసం పేర్కొనబడింది. అగ్నికి గాయత్రితోగల సంబంధం, అగ్నిమహిమకు

వాయువుతో సంపర్కం, పూర్ణమాసేష్టి ప్రభావంతో ఇంద్రుడు వృత్రవధచేయడం మొ॥ అంశాలు దీనిలో వర్ణింపబడ్డాయి. ఇక వికృతియజ్ఞాలలో అనునిర్వాప్యేష్టి శత్రు విజయానికి, అభ్యుదితేష్టి త్యాగమహితమైన జీవయాత్రకు, అభ్యుద్దృష్టేష్టి నిర్భీకత్వానికి, దాక్షాయణేష్టి నియతాహారానుగతమైన సర్వకామావాప్తికి దోహదం చేస్తాయి. ఇళాదధేష్టి మొదలైన ఎనిమిది ప్రత్యేక యజ్ఞాలు; అవి యిచ్చే ఫలితాలు, ఇంచుమించుగా పైవాటిలో చేరిపోతాయి.

ఋతుసందుల్లోనూ, ఋతుపరిణామ సమయాల్లోనూ నానావిధ రోగబాధలు కల్గడం సహజం కాబట్టి ఆ బాధానివృత్తికై చాతుర్మాస్యాధ్యాయంలో పేర్కొనబడిన యజ్ఞాలు ఉపకరిస్తాయి. ఋతు సంధిపరిణామకారణభూతులైన సవిత, పూష, మరుత్తులకు ఉద్దేశింపబడిన యజ్ఞాల వివరాలు దీనిలో చెప్పబడ్డాయి. ఈ వివరాలు ఇందలి వైశ్వదేవపర్వం, వరుణప్రఘాసపర్వాలలో ఉన్నాయి. సాకమేధ పర్వంలో ఇంద్రునకుద్దేశింపబడిన యాజ్ఞికకర్మకలాపం వర్ణితమైంది. ఇది యజ్ఞకర్త సంక్షేమానికుపకరిస్తుంది. పితృయజ్ఞంలో అగ్ని, పితరులకు, దేవతలకు సంధానకర్తగా అభివర్ణింపబడ్డాడు. మనం సమర్పించే కవ్యం అగ్నిద్వారా పితృదేవతలకు చేరుతుంది. ఆయా కాలాల్లో ఆహ్వానింపబడే పితరులు ఋతుస్వరూపులుగా నిరూపింపబడ్డారు. పదమూడునెలలు వచ్చే సంవత్సరంలో చేయబడే 'శునాశీర్య' యాగం రోగనివారణశక్తినీ, ఔషధాలనూ ప్రసాదిస్తుంది.

ప్రజాపతిప్రకరణంలో సృష్టిచేయాలని ప్రజాపతి తపస్సు చేయుగా, ఆ తపశ్శక్తివల్ల ఆయననుండి అగ్ని, వాయువు, సూర్యచంద్రులు, ఉషస్సు ఉద్భవించడం చెప్పబడింది. ప్రజాపతిప్రేరణతో తపోదీక్షితులైన అగ్న్యాదుల వీర్యం ఉషస్సులో నిక్షిప్తంకాగా సహస్ర నయనాదులుగల పురుషుడు ఆవిర్భవించాడు. అతనివల్ల జలచర స్థలచరాది సృష్టి ఆహారోత్పత్తి జరిగాయి.

తపస్సుచేస్తున్న ప్రజాపతి ఉచ్ఛ్వాస నిశ్వాసాలవల్ల భూమ్యాకాశాలు, వాతావరణం పుట్టాయి. అగ్ని, వాయు, సూర్యులనుండి ఋగ్యజుస్సామవేదాలు ఉత్పన్నమైనాయి. ఈ విధంగా విస్తరించిన విశ్వసృష్టి ప్రజాపతితపఃఫలమని చెప్పవచ్చు. యజ్ఞార్థకర్మప్రవర్తకుడైన ప్రజాపతికి వైశ్వదేవాది యజ్ఞాలు వివిధాంగాలై విలసిల్లగా ఆయన యజ్ఞపురుషుడై భాసించాడు. ఇది తెలిసినవాడు సర్వం పొందగలుగుతాడు. అంటే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నట్లు యజ్ఞార్థకర్మమర్మం తెలిసిన వాడు యజ్ఞపురుషుడౌతాడు. కాబట్టి అతడు పొందలేనిదంటూ ఉండదు. ఈ విధంగా ఈ అధ్యాయంలో నిష్కామకర్మాచరణం ధ్వనిస్తున్నది.

కౌషీతకిబ్రాహ్మణవైశిష్ట్యం సోమయాగనిరూపణం మీద ఆధారపడింది. పదిరోజులు నిర్వహింపబడే మహాయజ్ఞం ఈ సోమయాగం. దీని ప్రశంస వాగ్దీక్షతో ప్రారంభమౌతుంది. వాగ్దీక్షవల్ల ప్రాణదీక్ష లభిస్తుంది. ఆ రెండింటివల్ల యజమానికి ఇష్టసిద్ధి కలుగుతుంది. సంస్కారవంతమైన మానవజీవితంలో వాక్కుకున్నవిలువ, దాన్ని ప్రేరేపించే మనస్సుయొక్క సంయమనం, మనస్సుతో ప్రభావితమయ్యే ప్రాణశక్తి ప్రయోజనం ఇక్కడ సూచింపబడ్డాయి. మహాయజ్ఞకర్మ చేసేవానికి వాగ్దీక్ష మొదటినియమం. దీని తర్వాత త్వక్చక్షుః శ్రోత్ర దీక్షలు ఉపదేశింపబడ్డాయి. యజ్ఞకర్త దేవతలాగా (ఇక్కడ దేవతలంటే ప్రజ్ఞామూర్తులని చెప్పుకోవచ్చు) అగ్నికి ఆతిథ్యమిచ్చి ద్విపాద చతుష్పాదపశువులను పొందవచ్చు. అంటే వాటిసహకారం పొందవచ్చు నన్నమాట. ప్రవర్గ్యభాగంలో 'మహావీరుడు' యజ్ఞ శిరస్సుగా పేర్కొనబడ్డాడు. ఇక్కడ మహావీరుడంటే ఉష్ణకారకుడైన అగ్నిహోత్రుడే. అతడు యజ్ఞాత్మ. ప్రపంచాలను ప్రవర్తింపజేసేవి, అన్నికోరికలను తీర్చేవి అయినవాజ్యనస్సులు హోమద్రవ్యవాహకాలు. అగ్ని బ్రహ్మశక్తి. సోమం క్షాత్రశక్తి. ఉపవాసంనాడు మొదట తీసుకొనిరాబడిన ఈ రెండూ, యజమాని పాపాలను నశింపచేస్తాయి.

పశుబలిప్రకరణంలో మనస్సు ప్రజాపతి అని, ప్రజాపతి యజ్ఞమని మనఃపూర్వకంగా యజ్ఞార్థమే యజ్ఞంచెయ్యాలని నిర్దేశింపబడింది. బల్యాహారణంలో సమర్పించబడే పురోడాశం పశుసారంగా భావింపబడింది. పశుసారమంటే పశుత్వమే కాబట్టి పశుత్వహననమే 'పశుబలి' అన్న అర్థం ఇక్కడ వ్యంగ్యమౌతున్నది. ఇందుకు పురోడాశసమర్పణం ప్రతీక. అందుకే 'యత్ర పశుపురోడాశో న నిరూప్యతే తత్పురోడాశః స్విష్టకృదచ్యుతః' అని వెంటనే చెప్పబడింది. అంటే పశురూపమైన పురోడాశం ఎక్కడ నిరూపించబడదో స్విష్టకృత్తయిన ఆ పురోడాశం నాశంలేనిదౌతుందని అర్థం. పశువుగాక పశుసంకేతమైన పురోడాశాన్ని సమర్పించాలని సారాంశం. ప్రాతరనువాకసవనం వల్ల యజ్ఞకర్తకు ఇహపరలోకాల్లోను, ఈ రెంటికి సంధానరూపమైన అంతరిక్షం(Ether) లోను క్షేమం కలుగుతుంది. సంతానాన్ని కోరేవాళ్లు శుద్ధప్రణవాన్ని, ప్రతిష్ఠను కోరేవాళ్లు మకారసహిత ప్రణవాన్నీ ఉచ్చరించాలి. ఈ యజ్ఞం సుసంపన్నమైతే స్వర్గరూపం, ఏదైనా తగ్గితే అన్నాదిరూపం, ఏదైనా హెచ్చితే సంతానరూపం ఔతుంది.

శక్తి, సారకారణమైన జలం యజ్ఞస్వరూపమని ఆపోనప్త్రీయంలో అభినుతింపబడింది. ఇక్కడ సోమమే సవనీయపశువుగా చెప్పబడింది. అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, ఇంద్రుడు, ప్రజాపతి సోమపానంచేసి ఆనందిస్తారు. తర్వాత యజ్ఞం ప్రజాపతి స్వరూపంగా నిరూపితమయింది. ఈ ప్రాజాపత్యయజ్ఞం సర్వాభీష్టదాయకం, అమరత్వప్రాపకం కూడ అని, సాలకులే దీనికి బలిపీఠాలని వివరింపబడింది. ఇక్కడ యజ్ఞకర్తశరీరమే పురోడాశం. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలే సోమపానపాత్రలు. ఈ విధంగా ఈ ప్రాజాపత్యయజ్ఞకర్త ఇహలోకంలో సంపూర్ణజీవితం గడిపి స్వర్గంలో అమరుడౌతాడు. పిమ్మట ప్రాతర్మాధ్యందిన సాయంసవనాల వివరాలు వెల్లడింపబడ్డాయి.

షోడశిలో విశ్వం షోడశకళాత్మకంగా తెలుపబడింది. షోడశి అంటే ఇంద్రుడని, ఇంద్రుడు హరియేనని వివరింపబడింది. ఇందులోని 'అతిరాత్ర' ప్రశంసలో యజ్ఞం పురుషస్వరూపంగా నిరూపింపబడింది. పురుషుని శిరస్సు హవిర్వాహకం. ముఖం ఆహవనీయం. ఉదరం సదస్సు. ఆహారం దేవతాస్తోత్రాలు. బాహువులు మార్జాలీయాగ్నీధ్రీయాలు. అంతర్గతదివ్యశక్తులు సదస్సులోని దేవతాపీఠాలు. మనస్సు బ్రహ్మ. ప్రాణం ఉద్గాత. అపానం ప్రస్తోత. వ్యానం ప్రతిహర్త. వాక్కు హోత. నేత్రం అధ్వర్యువు. సంతతి సదస్యులు. ఆత్మ యజమానుడు. అవయవాలు హోత్రాశంసులు. మానవజీవితం యజ్ఞమయం కావాలన్న ధ్వని దీనిలో ఉన్నది.

యజ్ఞస్వరూపుడు విష్ణువు అన్న అర్థమిచ్చే వాక్యం - 'యజ్ఞో వై విష్ణుః' తర్వాత కనిపిస్తుంది. ఇక్కడే మానవాహారమే దేవతలకు ఆహారమని (మానుషేణైవ తద్భక్షేణ దైవం భక్షమవ్వర్ధతే) గూడ సూచితమయింది. దీన్నిబట్టి 'మానవసేవే మాధవసేవ' అన్న మాట ఎంతప్రాచీనమయినదో, వైదికవిజ్ఞానం ఎంత నిత్యనూతనమయినదో గ్రహించవచ్చు.

ఆపైన యజ్ఞదీక్షితులు ఒకచోటచేరి యజ్ఞం చెయ్యటం, ఆ సందర్భంగా వారు అష్టాకపాలమైన పురోడాశాన్ని బ్రాహ్మణాగ్నికి, ఏకాదశకపాలమైన పురోడాశాన్ని క్షాత్రాగ్నికి, ద్వాదశకపాలమైన పురోడాశాన్ని క్షాత్రాధారమైన అగ్నికి సమర్పించటం, తత్ఫలితంగా సంవత్సరకాలమంతా సురక్షితంగా గడుపటం ప్రస్తావించబడ్డాయి. అభిప్లవషడహంలో అనంతంగా తిరిగే సంవత్సరం దేవచక్రంగా నిరూపింపబడింది. సంవత్సరం షడృతుమయం కాబట్టి ఈ యాగం చేసినవాళ్లు షడ్రసోపేతమైన ఆహారాన్ని, గ్రామ్యపశుసంపదను, ఆరణ్య పశు ప్రయోజనాన్ని, సస్య సమృద్ధిని, తరులతా సంపదను, జలచరప్రయోజనాన్ని పొందుతారని చెప్పబడింది. అంతేగాక వీరు ప్రపంచతాదాత్మ్యం చెంది

ఐహికాముష్మికసమృద్ధులను, బ్రహ్మతాదాత్మ్యం చెంది దివ్యత్వాన్ని పొందుతారు. అందుకే దీనిలో గోవు, ఆయువు, జ్యోతి అన్న వానితో యజ్ఞకర్మనిర్వహణ విస్తృతంగా వివరింపబడింది.

ఇందులో వర్ణింపబడ్డ 'అభిజిత్' 'విశ్వజిత్' అనే యాగాలు ఎంతో విశిష్టమైనవి. 'అభిజిత్' అంటే అగ్ని, 'విశ్వజిత్' అంటే ఇంద్రుడు. అభిజిద్యాగంతో దేవతలు ముల్లోకాలను జయించారు. దానితో జయించలేని వానిని వారు 'విశ్వజిత్'తో జయించారు. 'విశ్వజిత్' అనే పదానికి 'ప్రజాపతి' అని గూడ అర్థమున్నది. కాబట్టి ప్రజారక్షకుడైన ప్రభువుకు ఈ విశ్వజిద్యాగం అవశ్యకర్తవ్యమన్న విషయం ఇక్కడ స్ఫురిస్తున్నది. దీనివల్ల సామాన్య ప్రజాసంక్షేమానికి హానితలపెట్టే దుష్టశక్తులు సమసిపోతాయి.

తరువాత పరిధులు లేనిది మనస్సని, మనస్సే 'ప్రజాపతి' అని ప్రజాపతి యజ్ఞమయుడని మనఃపూర్వకంగా యజ్ఞార్థమే యజ్ఞం చేయవలసిందని, మరొక్కమారు గట్టిగా ఉపదేశింపబడింది. దీనివల్ల ప్రజాపాలకుడైన ప్రభువుయొక్క మనస్సు, జీవితం, ఎంత నిస్స్వార్థంగా ఉండాలో ధ్వనిస్తున్నది. దశమాహప్రకరణంలో యజ్ఞం విజ్ఞాని రాకను చూసి ఆనందిస్తుందని, ఎవరైనా ప్రమాదవశాన తప్పుచేస్తే ఏకాంతంలో ఆత్మపరిశీలనం చేసికొని తప్పులు దిద్దుకోవాలని సూచింపబడింది. దశమాహవిధిని నిర్వర్తించినవారు నిర్దోషులై అమరత్వాన్ని పొందుతారు.

త్రిసంధ్యలలో చేయదగిన హోత్రకపఠనప్రసంగం ఈ బ్రాహ్మణంలో విలక్షణమైంది. ప్రజాపతి యజ్ఞాన్ని సృష్టించాడని, దేవతలు ఈ యజ్ఞాన్ని ఆచరించి సర్వాభీష్టాలను పొందారని, మానవుడు యజ్ఞస్వరూపుడని, ప్రాతస్సవనం వసువులకు, మాధ్యందిన సవనం రుద్రులకు, తృతీయసవనం

ఆదిత్యులకు ఉద్దిష్టమయిందని సూచింపబడింది. దీన్నిబట్టి సృష్టికర్మ యజ్ఞార్థమని మానవునిలోనున్న దైవగుణసంపద యజ్ఞార్థకర్మాచరణంవల్ల చరితార్థమౌతుందని తేలింది. అంతేగాక వసువులు సమగ్రమానవజీవితసాధన దశకు, రుద్రులు నిత్యజాగరూకమైన వ్యావహారికజీవితయాత్రకు, ఆదిత్యులు దివ్యజీవనానికి సంకేతాలని తెలుస్తుంది.

అందరు చేరలేని ఎత్తులకు ఎగిరే గరుత్మంతుడు వాయువని, వాయువంటే ప్రాణమని చివరి ప్రకరణంలో చేయబడిన వివరణం 'సువర్ణ' తత్త్వాన్ని ధ్వనింపచేస్తున్నది. ఇంకా వాలఖిల్యులంటే భౌతికశరీరంనుండి విడివడని ప్రాణాలని (రెండు ప్రదేశాలతో సంబంధం లేనిదానిని 'ఖిల' మంటారు. వైశాల్యంలో వాలం (కేశం) వంటి ప్రాణాలు శరీరాన్ని వదలి లేవుగాబట్టి వానికి వాలఖిల్యులన్న పేరు వచ్చిందని) చేసిన వివరణంకూడ కర్మబద్ధుడైన జీవుని ప్రస్థానరహస్యాన్ని బోధిస్తున్నది. ఇలా ఎన్ని విధాలుగానో కౌషీతకిబ్రాహ్మణంలోని వైశిష్ట్యాన్ని మనం గ్రహించవచ్చు.

— పి. ఆర్. ఎస్.

## 2. 2. 8. సంగ్రహసమీక్ష

'యజ్ఞో వై విష్ణుః' అని వేదం; 'యజ్ఞో యజ్ఞపతిర్యజ్వా' అని సహస్రనామం; 'అహం క్రతురహం యజ్ఞః' 'అహమగ్నిరహం హుతమ్' అని భగవద్గీతకూడ యజ్ఞమే పరబ్రహ్మమని చెబుతున్నాయి. వైదికోత్తములు అగ్న్యాధానం దర్శపూర్ణమాసలు మొ॥ అనేక యాగాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ కొంతమంది మహానుభావులు ప్రతిరోజు అగ్నిహోత్రాలను చేస్తున్నారు. ప్రాచీనకాలంలో ఇక్ష్వాకువు, రఘువు, దశరథుడు మొ॥ మహారాజులు రాజసూయం, వాజపేయం, పుత్రకామేష్టి మొ॥ యజ్ఞాలాచరించినట్లు మనకు ఇతిహాసాలద్వారా తెలుస్తోంది. ఇప్పుడుకూడ సోమయాగం, వాజపేయం, పౌండరీకం మొ॥ యాగాలు అక్కడక్కడా జరుగుతున్నాయి. పర్జన్యేష్టి మహావిష్ణుయాగం, మహారుద్రయాగం, చండీయాగం మొ॥ యాగాలను చేసేవారు ఈనాటికీ లేకపోలేదు. ఈ యజ్ఞాలలోని తేడాలను, స్వరూపాన్ని విధానాన్ని కౌషీతకిబ్రాహ్మణం చక్కగా వివరిస్తున్నది.

ఇందులోని ముప్పై అధ్యాయాలను మూడు దశకాలుగా విభజించారు. మొదటి దశకంలో అగ్నిస్వరూపం, పావకేష్టి, పవమానేష్టి, పునరాధేయం మొ॥ యాగాల స్వరూపం వర్ణింపబడింది. అగ్నిస్వరూపంతో ప్రారంభమైనందువల్ల ప్రథమదశకానికి 'అగ్న్యాధేయము'ని పేరు.

అగ్నికి శివ, శగ్మ, యజ్ఞియ అని మూడు శరీరాలున్నాయి. పౌర్ణమాస్యయాగం, పావకేష్టి, పవమానేష్టి మొ॥ కొన్నియాగాలలో అగ్ని ప్రధాన దేవత. యాగాలలోని హవిర్భాగాలను విభజించి ఆ యా దేవతలకు చేర్చటం అగ్నిహోత్రుని కర్తవ్యం. ఈ విషయాన్నే వేదం 'అగ్నిముఖా వై దేవాః' అని చెప్పింది (పే. 174).

రెండవ అధ్యాయంలో అగ్నిహోత్రమనే యాగాన్ని చేయాల్సిన సమయం, దాన్నిచేస్తే వచ్చే ఫలం, సాయంకాలాగ్నిహోత్రం, పాలు హోమం చేయటం మొ॥ చెప్పబడ్డాయి. అందువల్లనే దీనికి అగ్నిహోత్రాధ్యాయమని పేరు.

మూడవ అధ్యాయంలో దర్శపూర్ణమాసయాగం, ఉపవాసకాల నిర్ణయం, దేవతావాహనాలు, ఆజ్యభాగాలు, ప్రధానయాగం మొ॥ వివరింపబడ్డాయి.

నాలుగవ అధ్యాయంలో దాక్షాయణయజ్ఞం, సార్వసేవి యజ్ఞం, శౌనకయజ్ఞం, వసిష్ఠయజ్ఞం మొ॥ పన్నెండు వికృతి యాగాల స్వరూపం వర్ణింపబడింది.

అయిదవ అధ్యాయంలో నిత్యాగ్నిహోత్రులు, సన్న్యాసులు చాతుర్మాస్యవ్రతాన్ని చేయువలసిన కాలం, ప్రకారం, పిత్రుయజ్ఞం ఇంకా అనేక విశేషాలు చెప్పబడ్డాయి.

ఆరవ అధ్యాయంలో యజ్ఞాలలో బ్రహ్మ అనే ఋత్విజునిస్థానం ఆయనవిధులు ప్రాయశ్చిత్తాహుతివిచారం ఉంది.

ఈ బ్రాహ్మణంలో ఏడవ అధ్యాయం నుంచి ముప్పైయ్యవ అధ్యాయంవరకు (గ్రంథం చివరిదాకా) సోమయాగం విశేషంగా వర్ణింపబడింది. పదిరోజులు జరిగే ఒక మహాయజ్ఞం సోమయాగం. 27వ అధ్యాయంలో సోమయాగసమాప్తిని గురించి ఆఖరురోజు జరిగే కర్మకాండవిషయాలు చెప్పబడ్డాయి.

సోమయాగం దీక్షణీయేష్టితో ప్రారంభమవుతుంది. ఆ ఇష్టిలో సోమయాగంలోని దేవతలు, వారికిగల సంబంధం, పూజాక్రమం, దేవపత్నులకు కూడ యజ్ఞంలో భాగం, ఆవు, చంద్రుడు, వస్త్రం, మేక అనే నాలుగు ద్రవ్యాలనిచ్చి సోమలతను తీసుకోవటం మొ॥ విషయాలు ప్రతిపాదింపబడ్డాయి.

ఎనిమిదవ అధ్యాయంలో అగ్నిమథనం, ఆతిథ్యేష్టి ప్రవర్గ్య మంత్రాలు, ఉపసత్తులు నిరూపింపబడినాయి.

తొమ్మిదవ అధ్యాయంలో అగ్నిప్రణయనం అగ్నిని సోమాన్ని తీసుకొని వచ్చేటప్పుడు చెప్పాల్సిన మంత్రాలు చెప్పబడ్డాయి.

పదవ అధ్యాయంలో అగ్నీషోమీయపశుయాగం, యాగ పశువును బంధించటానికి యూపస్తంభాన్ని నిర్మించటం, దాని ఉపయోగం వపాయాగం, యాగపశుపురోడాశ భక్షణం మొ॥ విషయాలు వివరింపబడ్డాయి.

పదకొండవ అధ్యాయంలో ప్రాతరనువాకంలోని మంత్రాలు, మంత్రపఠనకాలం, మంత్రాలసంఖ్య చెప్పబడింది.

పన్నెండవ అధ్యాయంలో 'ఆపోనప్త్రీయము'నే పేరు గల యాగానుష్ఠానక్రమం, బహిష్పవమానస్తోత్రాలు, ప్రాతస్సవనం, మాధ్యందినసవనం, సాయంసవనం నిరూపింపబడినాయి. అష్ట వసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, ఇంద్రుడు, ప్రజాపతి మొదలైన 33 మంది సోమదేవతలు పేర్కొనబడ్డారు.

పదమూడవ అధ్యాయంలో హవిష్పంక్తియాగం, సోమభేద విచారం, రెండు దేవతలుగల గ్రహాలు, అచ్ఛావాకుడనే ఋత్విజుని ప్రాముఖ్యం మొ॥ విషయాలు చెప్పబడ్డాయి.

14, 15, 16 అధ్యాయాల్లో ప్రాతస్సవనం, మాధ్యందినసవనం, సాయంసవనం అనే యాగాలు క్రమంగా చెప్పబడ్డాయి.

17వ అధ్యాయం 'షోళశి' అనే యాగంతో ప్రారంభమవుతోంది. ఈ యాగమే హరి అని, ఇంద్రుడని స్తుతింపబడింది. దీన్ని చేసిన

యజమానిపాపాలన్నీ వజ్రాయుధంతో కొట్టినట్లు నశించిపోతాయని చెప్పబడింది. ఇంతేకాగ గాయత్రీస్తోత్రం, గాయత్రీస్వరూపం, గాయత్రీప్రభావం, గాయత్రీ ఉపాసనవల్ల కలిగే ఫలం ఇక్కడ చెప్పబడింది.

7వ అధ్యాయం నుంచి 18 వ అధ్యాయం వరకు గల 12 అధ్యాయాలలో సోమశబ్దవ్యాఖ్యానం ఈ బ్రాహ్మణంలో కనబడుతుంది. 18వ అధ్యాయంలో జ్యోతిష్టోమ, ఆగ్నేయయాగవిశేషాలను వాటి సమాప్తిని తెలుపుతూ పురుషుడు శతవీర్యుడై, శతేంద్రియుడై, శతాయుష్మంతుడై జీవిస్తాడని చెప్పబడింది. అంతేకాకుండా వషట్కారం, హవిస్సు, బలం, వీర్యం, అగ్నిహోత్రం, పౌర్ణమాసం, పంచకపాలం, అష్టాకపాలం, ఛందస్సు మొ॥ ముఖ్యశబ్దాల వివరణకూడ ఇవ్వబడింది. అందరికీ తెలిసిన, యాగం విష్ణుస్వరూపమనే అర్థంగల 'యజ్ఞో వై విష్ణుః' అనే ఋక్కు ఇందులో కనబడుతుంది.

19వ అధ్యాయంలో అగ్నిచయనం, గవామయనం, అగ్ని స్వరూపం, అగ్నిప్రభావం మొ॥ విషయాలు వివరింపబడ్డాయి.

20వ అధ్యాయంలో అభిప్లవం, షళహం అనే యాగాలు, వీటిని చేయవలసిన ఆవశ్యకత, 1. జ్యోతిః 2. గౌః 3. ఆయుః అనే మూడు అహస్సుల స్వరూపం చెప్పబడింది.

21వ అధ్యాయంలోకూడ జ్యోతిః, గౌః, ఆయుః అనే పేర్లుగల 4, 5, 6 అహస్సుల విచారం, ఛందోవిచారం, అగ్ని, ఇంద్ర, వరుణ, మిత్ర, అర్యమా, వైశ్వానరాది దేవతాస్వరూపం, ఘృతప్రశంస, యాగపశువిశేషాలు చెప్పబడ్డాయి. ఇంతేకాక అభిప్లవమనే పేరుగల యాగాన్ని చేసిన యజమానులు స్వర్గలోకానికి కూడ యజమానులవుతారని తెలుపబడింది.

ఆరురోజులలో చేయబడే అభిప్లవయాగం లాగానే 'పృష్ఠ్య' మనే మహాయజ్ఞాన్ని చేయాలి. 22, 23 అధ్యాయాలలో పృష్ఠ్యయాగవైశిష్ట్యం గొప్పగా చెప్పబడింది.

24 వ అధ్యాయం 'అభిజిత్' అనే యజ్ఞాన్ని చెబుతుంది. ఇందులో ప్రాతస్సవనం, మాధ్యందినసవనం, తృతీయసవనం అనే ప్రభేదాలు ఉన్నాయి.

25 వ అధ్యాయంలో 'విశ్వజిద్యాగం' వివరింపబడింది. ఈ యాగంలో కూడ ప్రాతస్సవనం, మాధ్యందినసవనం, తృతీయ సవనాలకు సంబంధించిన మంత్రాలు చెప్పబడ్డాయి. 'విశ్వజిత్' అంటే బ్రహ్మ. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే శ్రుతివాక్యానికి ఇది ఉపష్టంభకం. విశ్వజిద్యాగం ద్వారా మానవుడు అన్ని సంపదలను పొందుతాడు. ఈ యాగాన్ని ఒక సంవత్సరం,ఆచరించాలి. ఈ విషయాలను తెలుసుకొన్నవాళ్ళుకూడ ఆ యాగఫలాన్ని పొందుతారని చెప్పబడింది.

26 వ అధ్యాయంలో 'ఛందోమ' అనే యాగం నిరూపించబడింది. దానిలో గ...యనసత్రం, ఛందోమశస్త్రాలు మొ॥ వివరింపబడ్డాయి.

27 లో 'దశమమహః' అని పదిరోజులు చేయాల్సిన యాగవిధానం చెప్పబడింది. కౌషీతకిబ్రాహ్మణమాహాత్మ్యం వివరింపబడింది. పదిరోజులు ప్రతినిత్యం ఋత్విక్కులు చేయాల్సిన కర్మకాండ సంగ్రహంగా చెప్పబడింది.

28. 29 30 అధ్యాయాలకు 'హోతృకశస్త్ర' మని పేరు. ఈ 'హోతృకశస్త్రం' ప్రాతస్సవనం, మాధ్యందినసవనం, తృతీయసవనం అని మూడు విధాలుగా విభజింపబడింది. అతిరాత్ర, వాజపేయ, అప్తోర్యామయజ్ఞాలు ఇందులోని విశేషాలు. ఛందోమాయజ్ఞంలోని విశేషాలు చెప్పబడ్డాయి. ఈ యజ్ఞాలు చేయటంవల్ల లోకకల్యాణం, సర్వప్రాణులకు క్షేమం కలుగుతుందని కౌషీతకి బ్రాహ్మణసిద్ధాంతం. శక్తిలేనివాళ్లు ఈ విషయాలు తెలుసుకున్నా మంచిఫలాన్ని పొందగలరని ఈ బ్రాహ్మణం ప్రతిపాదిస్తోంది.

కౌషీతకిబ్రాహ్మణంలోని విషయాలు చాలా సూక్ష్మాలు. యజ్ఞకర్మలను ఆనువంశికంగా ఆచరించేవాళ్లకు ఇందులోని విషయాలు తెలుస్తాయేగాని కేవలం గ్రంథపఠనమాత్రంచేత తెలియడం కష్టం. యజ్ఞాచరణం సమాజంలో రానురాను మృగ్యమైపోయింది కాబట్టి, కనీసం వాటి స్వరూపాన్నైనా తెలుసుకొని మనప్రాచీనుల సంస్కృతిని చరిత్రను అర్థంచేసుకోవడం మనకర్తవ్యం.

— కె. ఎస్. వి.

# తైత్తిరీయబ్రాహ్మణం

## 2. 3 తైత్తిరీయబ్రాహ్మణం

### 2. 3. 1 పరిచయం

కృష్ణయజుర్వేదానికి గల శాఖలు ఎనభైఆరు. అందులో చాలా శాఖలు నశించిపోయినాయి. పోయినవి పోగా మిగిలిన శాఖలు నాలుగు. ఆ నాలిగింట్లో ప్రధానమైన శాఖ తైత్తిరీయశాఖ. ఆశాఖకు సంబంధించిన బ్రాహ్మణమే తైత్తిరీయబ్రాహ్మణం. అంటే ఇది కృష్ణయజుర్వేదానికి ఇప్పటికి మిగిలిన ఏకైకబ్రాహ్మణమన్నమాట. దీన్నే 'పరాయాత'మని వైదికులు పిలుస్తుంటారు.

కృష్ణయజుస్సంహితలో బ్రాహ్మణభాగాలుకూడా కలిసిపోయి ఉన్నాయి. అదే దానిలోని కృష్ణత్వం. కఠ-మైత్రాయణీయశాఖల వరకు సంహితలో దొరికే గద్యలనే బ్రాహ్మణభాగాలుగా పరిగణిస్తారు. తైత్తిరీయ శాఖలో సంహితకంటే భిన్నంగా దొరుకుతున్న బ్రాహ్మణం ఇది. ఈ బ్రాహ్మణానికి సంహితకు తేడా పెద్దగా కనబడటంలేదు. అయినా ఈ బ్రాహ్మణం

సంహితలో ప్రస్తావించబడని విషయాలను కొన్నింటిని ప్రస్తావిస్తూ సంహిత ప్రతిపాదించినవాటిని కొన్నింటిని వివరిస్తూ దాని కనుబంధంలాగా కనబడుతున్నది, కానీ అంతమాత్రాన ఈ బ్రాహ్మణం తైత్తిరీయసంహితకు పరిశిష్టభాగమేగాని ప్రత్యేకప్రతిపత్తి దీనికి లేదనేవాదం అర్థరహితమైంది.

**తైత్తిరీయం అంటే ఏమిటి?**

వైశంపాయముని శిష్యుడు పైంగియాస్కుడు. అతని శిష్యుడు తిత్తిరిమహర్షి. ఉఖమహర్షి తిత్తిరిశిష్యుడు. ఆత్రేయుడు తిత్తిరి ప్రశిష్యుడు. ఇలా తిత్తిరిమహర్షి తైత్తిరీయ శాఖాప్రవర్తకులలో మధ్య మణిలాంటివాడైనాడు[1]. అతడు రచించింది ఈ బ్రాహ్మణం. కాబట్టే తైత్తిరీయబ్రాహ్మణం.

— ఎస్. బి. ఆర్.

---

1. వైశమ్పాయనః ప్రాహ శాఖాం యాస్కాయ పైంగయే ।
యాస్కః పైంగిస్తిత్తిరయే ఉఖాయ ప్రాహ తిత్తిరిః ॥
ఉఖశ్శాఖామిమాం ప్రాహ ఆత్రేయాయ యశస్వినే ।

## 2. 3. 2 విభాగం

తైత్తిరీయబ్రాహ్మణం మూడు కాండలుగా విభజింపబడింది. అందులో మొదటికాండకు 'పారక్షుద్ర' మని రెండోకాండకు 'అగ్నిహోత్ర'మని పేరు. మూడోకాండలోగల విభాగాలకు విడివిడిగానే పేర్లున్నాయి. మొదటి రెండుకాండల్లో ఎనిమిదెనిమిది ప్రపాఠకాలు, మూడోకాండలో పన్నెండు ప్రపాఠకాలు ఉన్నాయి. ప్రతి ప్రపాఠకంలోను కొన్ని అనువాకాలున్నాయి. ప్రపాఠకాలలోగల అనువాకాల తక్కువ సంఖ్య ఆరు; ఎక్కువ సంఖ్య ఇరవైమూడు. పై మూడు కాండలను అష్టకాలని, ప్రపాఠకాలను అధ్యాయాలని కూడ అంటారు. మూడోకాండలో చివరి మూడు ప్రపాఠకాలను (10,11,12) కాఠకమని పిలుస్తారు. ఈ భాగం ఒకప్పుడు కఠశాఖకు సంబంధించి ఉండటంవల్ల దీనికా పేరేర్పడింది. భట్టభాస్కరుడు తనభాష్యంలో తిత్తిరిమహర్షి ఈ మూడు ప్రపాఠకాలను చెప్పలేదని స్పష్టంచేశాడు[1]. ప్రపాఠకాలను ప్రశ్నలని వ్యవహరిస్తాడు భట్టభాస్కరుడు. మొత్తం ఇందులో ఉన్న అనువాకాలు 338. వివరాలకు చూడండి :

| కాండం | ప్రపా | అను | కాండం | ప్రపా | అను | కాండం | ప్రపా | అను |
|---|---|---|---|---|---|---|---|---|
| I | 1 | 10 | II | 1 | 11 | III | 1 | 6 |
| | 2 | 6 | | 2 | 11 | | 2 | 10 |
| | 3 | 10 | | 3 | 11 | | 3 | 11 |
| | 4 | 10 | | 4 | 8 | | 4 | 19 |
| | 5 | 12 | | 5 | 8 | | 5 | 13 |
| | 6 | 10 | | 6 | 20 | | 6 | 15 |
| | 7 | 10 | | 7 | 18 | | 7 | 14 |
| | 8 | 10 | | 8 | 9 | | 8 | 23 |
| | | | | | | | 9 | 23 |
| | | | | | | | 10 | 11 |
| | | | | | | | 11 | 10 |
| | | | | | | | 12 | 9 |
| | మొత్తం 78+ | | | 96+ | | | 164=338 | |

ఏవమశ్వమేధాన్తాని తిత్తిరిప్రోక్తాని కాండాని వ్యాఖ్యాతాని. అథ కాఠకాన్యకాండాన్యుక్తి.

విషయవిభాగం :

ఈ బ్రాహ్మణంలోని మొదటికాండలోని ఎనిమిది ప్రపాఠకాల్లో అగ్న్యాధానవిధి, గవామయనసోమవిధి, వాజపేయ-సోమాది విధి, నక్షత్రేష్టికా మంత్రాలు, రాజసూయం నిరూపించబడ్డాయి. రెండో కాండలోని ఎనిమిది ప్రపాఠకాల్లో అగ్నిహోత్రవిధి, ఉపహోమాలు, సౌత్రామణి, ఒకేరోజు చేయాల్సిన 'సవం' అనే పేరుగల యాగాలు, కామ్యపశుయాగాలు ప్రస్తావించబడ్డాయి. మూడో కాండలో నక్షత్రేష్టి, దర్శపూర్ణమాసవిధి, మనుష్యపశువిధి, అశ్వమేధం, సావిత్రచయనం, నాచికేతాగ్నిచయనం, చాతుర్హోత్ర - వైశ్వసృజాగ్ని చయనాలు ప్రతిపాదించబడ్డాయి.

మొదలు - చివర :

ఈ బ్రాహ్మణం "బ్రహ్మ సంధత్తం తన్మే జిన్వతమ్" అనే మంత్రంతో ప్రారంభమై "విశ్వమేనా నను ప్రజాయతే" అనే మంత్రంతో పరిసమాప్తమౌతోంది.

— ఎస్. బి. ఆర్.

## 2. 3. 3 సంకలనకాలం

దేశం :

యజుర్వేదానికి 'అధ్వర్యువేద' మని పేరు. అధ్వరమంటే యాగం. యజ్ఞయాగాల నిర్వహణభారాన్ని వహించే అధ్వర్యుడు ఋత్విక్కులలో చాలా ముఖ్యుడు. ఈ అధ్వర్యుని కర్తవ్యాన్ని వివరించేది అధ్వర్యువేదం. దీనివల్ల యజ్ఞయాగాలు బాగా నిర్వహింపబడే ప్రదేశంలో ఈ వేదం ఆవిష్కరింపబడి, ఆదరింపబడిందని స్పష్టమౌతున్నది. ధర్మక్షేత్రమని ప్రసిద్ధిపొందిన కురుక్షేత్రమే తైత్తిరీయ సంహితకు, తైత్తిరీయబ్రాహ్మణానికికూడా పుట్టినిల్లని చాలామంది విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అక్కడే యజ్ఞాలు విరివిగా ఆచరింపబడటంవల్ల కురు-పాంచాలదేశాలలోనే ఈ బ్రాహ్మణం రచింపబడి ఉండవచ్చుననే ఊహాకు అవకాశం ఎక్కువ దొరకుతున్నది.

కాలం :

గ్రంథస్వరూపాన్ని బట్టి, అందులో నిరూపింపబడ్డ వైదికకర్మ కలాపాన్ని బట్టి బ్రాహ్మణాల ఉత్పత్తికాలాన్ని అంచనా వేయువచ్చు. సంహితాభాగంలో కనబడే స్వరసంప్రదాయం తైత్తిరీయబ్రాహ్మణంలోను పాటింపబడుతోంది. ఒకరకంగా ఇతరబ్రాహ్మణాల్లో వేటిల్లోను ఈస్వరం నిలబడలేదు. దీన్నిబట్టి ఆలోచిస్తే తైత్తిరీయ బ్రాహ్మణం పంచవింశబ్రాహ్మణం తరువాత రచింపబడి ఉండవచ్చునని, బ్రాహ్మణవాఙ్మయంలో రెండో స్థానానికి ఇది అన్నివిధాలా అర్హమైందని అనిపిస్తుంది.

విమర్శకుల నిర్ణయంప్రకారం క్రీ. పూ. 8వ శతాబ్దంలో బ్రాహ్మణకాలం మొదలైంది. అదే శతాబ్దంలో తైత్తిరీయబ్రాహ్మణం రచింపబడి ఉంటుందనడం ఎంతైనా సమంజసం. భారతీయభావన ఇదమిత్థమైన ఇలాంటి కాలనిర్ణయాలకు వైదికవాఙ్మయం అతీతమైందని అభిప్రాయపడుతోంది.

— ఎస్. బి. ఆర్.

## 2. 3. 4. వ్యాఖ్యానాలు - ప్రచురణలు

వ్యాఖ్యానాలు :

తైత్తిరీయబ్రాహ్మణానికి సాయణుని భాష్యం దొరుకుతున్నది. తైత్తిరీయసంహితలో రాజసూయప్రకరణానికి (1.8.1) వివరంగా భాష్యం వ్రాయడంవల్ల ఈ బ్రాహ్మణంలో ప్రథమకాండంలో 6, 7, 8 ప్రపాఠకాలకు సాయణుడు భాష్యంచేయలేదు[1]. ఇది ఇప్పటికి కలకత్తాలోను, పూనాలోను రెండు సంస్కరణలను పొందింది. పూనాలో ఇప్పటికిది మూడుసార్లు ముద్రింపబడింది. ఈ బ్రాహ్మణానికి భట్టభాస్కరుడు కూడా భాష్యాన్ని వ్రాశాడు. ఇదికూడా సమగ్రంగానే దొరుకుతున్నది. ఇది మైసూర్‌నుంచి ప్రకటింపబడింది. ఈ రెండు భాష్యాలు తప్ప ఈ బ్రాహ్మణానికి ఇతర భాష్యాలుగాని, వ్యాఖ్యానాలుగాని ఉన్నట్లు ప్రసిద్ధిలేదు.

ప్రచురణలు :

తైత్తిరీయబ్రాహ్మణాన్ని సాయణభాష్యంతో 1862లో మిత్ర రాజేంద్రలాల్ కలకత్తానుంచి ప్రకటించాడు. అలాగే నారాయణ శాస్త్రి గోడ్‌బోలే సంపాదకత్వంలో పూనాలోని ఆనందాశ్రమంవారు 1934-1971 సంవత్సరాల మధ్య సాయణభాష్యంతో ఈ బ్రాహ్మణాన్ని ఇప్పటికి మూడుసార్లు ప్రచురించారు. భట్టభాస్కరభాష్యంతో తైత్తిరీయబ్రాహ్మణాన్ని మహాదేవశాస్త్రి శ్రీనివాసాచార్య మైసూరునుంచి ప్రకటించారు. గ్రంథాక్షరిలో కుంభకోణం శారదా ముద్రాక్షరశాలవారు దీన్ని ప్రచురించారు. ఇలా ఈ బ్రాహ్మణానికి జరిగిన ప్రచురణలు ఎక్కువ సంఖ్యలో లేకపోయినా ఉన్నంతవరకు చాలా ప్రామాణికమైనవి.

— ఎస్. బి. ఆర్.

1. అక్షరార్థః సంహితాయాం తన్మన్త్రవిధిః సహ ।
వ్యాఖ్యాతోఽపేక్ష్యతాం తత్ర కాండోఽతోఽత్ర సమాపితః ॥ 1.5.12

### 2. 3. 5 ప్రసిద్ధి

యజ్ఞయాగాది కర్మలను వివరించడానికి ఏర్పడింది బ్రాహ్మణ వాఙ్మయం. అయినా సందర్భం ఏర్పడినప్పుడల్లా అందులో ఎన్నో లౌకిక విశేషాలుగూడ అడుగడుగునా మనకు దర్శనమిస్తాయి. ఇతర బ్రాహ్మణాల్లాగా తైత్తిరీయబ్రాహ్మణం కూడా యజ్ఞయాగాది వైదిక క్రియాకలాపాన్ని చక్కగా విశదీకరిస్తున్నది. అంతేగాక అది మధ్య మధ్యలో ఎన్నో వైజ్ఞానికవిశేషాలను, మానవుని మనుగడకు అవసరమైన అంశాలను కూడా అందిస్తూ ఎంతో ప్రసిద్ధిని సంపాదించింది. చూడండి :

**భర్తప్రేమను పొందాలంటే .....**

> "పెండ్లిచేసి అత్తవారింటికి పంపిన ఆడపిల్ల అల్లుడిప్రేమకు ఆటపట్టై అక్కడ సుఖంగా ఉండాలని, ప్రతి తండ్రీ కోరుకుంటాడు. అలా ఆ పిల్ల జీవితం మూడుపువ్వులు ఆరుకాయలుగా ఉండాలంటే స్వాతీ నక్షత్రంలో ఆమెను కన్యాదానం చేయాలి. అలా చేస్తే ఆమె సకల సౌభాగ్యాలతో అత్తవారింట ఆనందంగా ఉంటుంది. ఆశ్రయంలేకగాని, అవమానభారంతోగాని తిరిగి ఆమె మెట్టినింటినుంచి పుట్టినింటికి తిరిగివచ్చే అవసరంరాదు[1]".

**ఎందుకివి తారకలైనాయి ?**

నక్షత్రాలు దేవగృహాలు. ప్రళయకాలంలో అవి జలాన్ని దాటినై కాబట్టి వాటికి తారకలని పేరేర్పడింది[2] (1.5.2).

---

1. యాం కామయేత దుహితరం ప్రియా స్యాదితి తాం నిష్ట్యాయాం దద్యాత్. ప్రియైవ భవతి. నైవ తు పునరాగచ్ఛతి 1.5.2.
2. సలిలం వా ఇదమ న్తరాసీత్, యదతరన్, తత్తారకాణాం తారకత్వమ్. ఆ. వి. స. 14.

ఇలా నేటివారు ఆశ్చర్యంతో గమనించదగ్గ ఎన్నో విశేషాలను తైత్తిరీయబ్రాహ్మణం ప్రతిపాదిస్తూ వైదికంగానే గాక లౌకికంగా గూడా ఇతరబ్రాహ్మణాలలో ప్రసిద్ధమైంది.

మహార్ణవంలో మనకు కనబడే ఒక శ్లోకం[1] ఆధారంగా ఆంధ్రదేశంలోను నర్మదానదికి తూర్పు, దక్షిణభాగాల్లోను, గోదావరీ తీరంలోను తైత్తిరీయశాఖ, దానికి సంబంధించిన వాఙ్మయమంతా ప్రచారంలో ఉండి ఎంతో ప్రసిద్ధిని సంపాదించింది.

— ఎస్. బి. ఆర్.

1. ఆంధ్రాది దక్షిణాగ్నేయీ గోదాసాగర అవధిః
యజుర్వేద స్తైత్తిరీయురాను స్తంబీ ప్రతిష్ఠితా ॥

## 2. 3. 6 యజ్ఞయాగాలు

తరచు మనం వింటూ ఉంటాం - ప్రయోగిస్తూనూ ఉంటాం 'అధ్వర్యం' 'ఆధ్వర్యవం' అన్న పదాల్ని. ఈ పదాన్ని ప్రయోగించేటప్పుడు మనం చెప్పదలచుకొన్న అర్థమేమిటి ? అవి ఆలోచిస్తే-సమస్త కార్యభారాన్ని నిర్వహించడంలో అత్యంత ప్రధానమైన పాత్ర అని తేలుతుంది. అసలీ అధ్వర్యవం అన్న పదానికి అధ్వర్యునికి సంబంధించినదని అర్థం. అధ్వర్యువనేవాడు యజ్ఞాన్ని నిర్వహించే ప్రధానులైన నల్గురు ఋత్విక్కులలో ఒకడు-అంతేకాదు; చాలా ముఖ్యమైన పాత్రను నిర్వహించేవాడు. ఋగ్యజుస్సామాథర్వవేదాల్ని యాజ్ఞికుల పరిభాషలో వరుసగా హోతృవేదం, అధ్వర్యువేదం, ఉద్గాతృవేదం, బ్రహ్మవేదం అని నల్గురు ఋత్విక్కులపేర్లతో కూడా పిలుస్తుంటారు. అందువల్లనే యజ్ఞయాగాదులు, వాటి స్వరూపస్వభావాలు, నిర్వహించేవిధానం లాంటివాటికి సంబంధించిన వివరాలన్నీ యజుర్వేదంలో; అందులోనూ కృష్ణయజుర్వేదంలో దొరికినట్లుగా మరొక చోట దొరకవు.

సంహితల్లో యజ్ఞయాగాలలో పఠించవలసిన మంత్రాలుంటాయి. బ్రాహ్మణాల్లో ఆ మంత్రాలకు యజ్ఞాదుల్లో వినియోగం యజ్ఞంచేసే విధానం, అనుష్ఠానం మొ॥ వివరాలు చెప్పబడతాయి. ఇది సాధారణంగా సంహితాబ్రాహ్మణాలకు గల విషయవిభాగం. కాని కృష్ణయజుర్వేదంలో సంహితలో వినియోగవాక్యాలు; బ్రాహ్మణంలో మంత్రాలు కూడా కలగాపులగంగా కలసి ఉన్నాయి. అందుకే ఈ శాఖను 'కృష్ణ' (మలినమైనది) అని అంటారు.

యజ్ఞం అనేది బహుక్రియాసాధ్యం. మంచి ఆరోగ్యవంతులై నడివయస్సులోనున్న అనేకమంది ఋత్విక్కులు నిర్విరామంగా చేసినా ఈ క్రియాకలాపాన్ని సకాలంలో ముగించడం కష్టమవుతుంది. ఇంతటి

కార్యకలాపాన్ని ఏ ఒక్క చిన్న అంశాన్ని కూడా వదలకుండా యజుస్సంహితా బ్రాహ్మణాలు వివరించి చెప్పాయి. అందులో ఎన్నో నియమాలు, ఎన్నెన్నో నిర్దేశాలు. ఇదే ఎందుకు? యిలాగే ఎందుకు ? అనేటువంటి ప్రశ్నలకు ఈ శాస్త్రంలో తావే లేదు.

పురోడాశమనే పిండిరొట్టెను తయారుచేసేందుకు వడ్లను దంచి ఊకతీయాలేగాని చెక్కతిరగటిలో వేసో మరోరకంగానో ఊకను తీయకూడదనటంలాంటి చాలా చిన్నవిషయాలలోకూడా నియమాల్ని నిర్బంధాల్ని విధించే ఈ వేదభాగాలవెనుక మహత్తరమైన అసాధారణమైన విజ్ఞానం ఏదో దాగి ఉందనే దృఢభావం కలుగక మానదు. కాని ఆ విజ్ఞానాన్ని వ్యాఖ్యానించే పరంపర విచ్ఛిన్నమవటం వల్ల ఎక్కడోతప్ప చాలావరకు చెప్పింది చేసుకు పోవటమే మనకు మిగిలింది.

అసంఖ్యాకాలైన ఈ యజ్ఞాలలో విడివిడిగా క్రియాకలాపాన్ని వర్ణించడం-విధించడం వేదాలకు కూడా అసాధ్యమైన పనే. అందుకనే ఒక సులువైన మార్గం చేపట్టబడింది. మొత్తం యాగాలను కొన్ని విభాగాలుగా చేసి ఒక్కొక్క విభాగంలో ఒక్కయాగాన్ని ప్రకృతియాగంగా స్వీకరించి దానికి మాత్రం క్రియాకలాపాన్నంతటినీ విధించి ఆవిభాగానికి చెందిన వికృతియాగాల్లో విశేషం ఉన్నచోట మాత్రమే ఆయావిశేషాలు విధింపబడ్డాయి. సాధారణక్రియా కలాపం ప్రకృతియాగంలోలాగానే వికృతియాగాల్లో చేసుకుపోవాలని మాత్రం నిర్దేశింపబడింది. మనకు ప్రస్తుతం ఇక్కడ ఉన్న అవకాశంలో అలా సంగ్రహించి చెప్పబడిన ఒక విభాగానికి చెందిన ఒక యాగంలో ఒకరోజు చేయవలసిన కార్యకలాపాన్ని కూడా పూర్తిగా చెప్పడం కుదరదు. అందుకని మనం ఈ యజ్ఞయాగాదులనుగురించి చాలా చాలా సంగ్రహంగా మాత్రమే తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం.

అయితే ఇంతటి వ్యయప్రయాససాధ్యమైన ఈ యజ్ఞాలకు ఏమిటి ప్రయోజనం? అనేదికూడా ఒక ప్రశ్న. భౌతికమైన శరీరానికి అనేక శోధనలెలా అవసరమో అలాగే జీవాత్మకుకూడా శోధన అవసరమే. ఈ యజ్ఞాలను అనుష్ఠించడం ద్వారా జీవాత్మకు ఒక సంస్కారమేర్పడుతుంది. దాన్నే చిత్తశుద్ధి అనికూడా అంటారు. ఇదే యజ్ఞయాగానుష్ఠానాలకు పరమప్రయోజనం. అందుకే గౌతమధర్మసూత్రాలలో పుట్టినప్పటినుంచి చచ్చేవరకు మనిషికి విధించిన 40 సంస్కారాల్లో అగ్న్యాధానం, అగ్నిహోత్రం, దర్శపూర్ణ మాసలు, ఆగ్రయణం, చాతుర్మాస్యాలు, నిరూఢపశుబంధం, సౌత్రామణి అనే ఏడు హవిర్యజ్ఞాల్ని, అగ్నిష్టోమం, అత్యగ్నిష్టోమం, ఉక్థ్యం, షోడశి, వాజపేయం, అతిరాత్రం, అప్తోర్యామం అనే ఏడు సోమయాగాల్ని కూడా చేర్చారు. కాని కనబడని ఈ సంస్కారం ప్రయోజనం అంటే దానికోసం యింతకష్టపడాలనిపించదు కాబట్టి అనేక దృష్టప్రయోజనాలు గల కామ్యకర్మలు కూడా ఎన్నో విధించబడ్డాయి. కాగా యజ్ఞాలు నిత్యాలు-కామ్యాలు అని రెండుకరకాలు. సంస్కారంకోసమే చెప్పబడ్డ యజ్ఞాలు నిత్యాలు. ఏదో ఒక లౌకిక ప్రయోజనంకోసం చేయబడేవి కామ్యాలు. అవి అనంతాలు.

ఇప్పుడు తైత్తిరీయబ్రాహ్మణంలో వివరించి విధింపబడిన ప్రధానమైన కొన్నియాగాల్ని గురించి తెలుసుకుందాం-

**1. అగ్న్యాధానం (1.1.1-10) :**

అగ్న్యాధానం చేయనివాడు ఏ యజ్ఞయాగాది శ్రౌతకర్మను చేయడానికి వీలులేదు. గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులనే అగ్నులు మూడుగాని, సభ్య, ఆవసథ్యాగ్నులతో కలిపి అయిదుగాని సిద్ధించడమే ఈ అగ్న్యాధానానికి ప్రయోజనం. అందుకే ఇది స్వతంత్రమైన కర్మ. అంటే ఇది ఇతరకర్మకు దేనికీ అంగంకాదన్న మాట. ఈ అగ్న్యాధానంద్వారా సంస్కరింపబడిన శ్రౌతాగ్నిలోనే ఏ హోమమైనా యాగమైనా చెయ్యాలి.

ఆధానానికి ముందురోజు సంకల్పంచేసి ఋత్విగ్వరణం చేయాలి. తర్వాత అధ్వర్యువు జమ్మిచెట్టుమీద మొలచిన రావిచెట్టు కొమ్మతో తయారుచేసిన అరణులను రెంటిని తీసుకొని రావాలి. అరణులంటే నాల్గంగుళాలు ఎత్తు, పన్నెండంగుళాల వెడల్పు, పదహారంగుళాల పొడవుగల్గి నీడలో ఎండిన చెక్కలు. తర్వాత వేదికి పడమట గార్హ పత్యాగ్నికుండాన్ని, వేదికి తూర్పుగా ఆహవనీయాగ్నికుండాన్ని, గార్హపత్యాగ్నికి ఆగ్నేయంగా దగ్గరగా దక్షిణాగ్నికుండాన్ని నిర్మించాలి. సభ్య ఆవసథ్యాగ్నులనుకూడా ఆధానం చేయగోరినట్లైతే ఆహవనీయాగ్నికుండానికి తూర్పుగా వరుసగా వాటి కుండాల్ని కూడా నిర్మించాలి.

వీటిలో గార్హపత్యాగ్నికుండం గుండ్రంగాను (వృత్తాకారం), ఆహవనీయకుండం నలుచదరం (చతురశ్రం) గానూ, దక్షిణాగ్నికుండం అర్ధచంద్రాకారంగానూ ఉండాలి. గార్హపత్యాగ్ని మధ్య భాగంనుంచి తూర్పుగా ఆహవనీయాగ్ని మధ్యభాగానికి సరిగ్గా 96 అంగుళాల వ్యవధానం ఉండాలి.

మంగళస్నానాదులు పూర్తయిన తర్వాత అధ్వర్యువు యజమాని ఔపాసనాగ్నినుంచి అగ్నిని తెచ్చి గార్హపత్యానికి పడమరగా ఉంచి అందులో కడగని బియ్యంతో ఉడికీ ఉడకకుండా అన్నాన్ని వండాలి. దీన్ని బ్రహ్మౌదనపాకమంటారు. తర్వాత ఆ అన్నాన్ని అదే అగ్నిలో హోమంచేసి మిగిలిన అన్నాన్ని నాల్గుముద్దలుగా చేసి అధ్వర్యువు, హోత, బ్రహ్మ, ఆగ్నీధ్రుడు అనే నల్గురు ఋత్విక్కులకు ఇవ్వాలి. కొద్దిగా అన్నాన్ని ఆ పాత్రలో మిగల్చాలి. అధ్వర్యువు తన ఎడమచేతిలో ఆ అన్నపుముద్దను పెట్టుకొని కుడిచేతితో మిగిలిన అన్నంలో నేతిని పోసి ఊరికి గుర్తుగా ఉండే ఒక రావిచెట్టుయొక్క పచ్చి సమిధలు మూడింటితో ఆ అన్నాన్ని కలియబెట్టి వాటికి అంటుకొని ఉన్న అన్నంతో కూడా వాటిని హోమంచేయాలి. దీన్ని సమిదాధానం అంటారు. ఆ రాత్రికి వీణాదివాద్యాలతో జాగరణం చేస్తూ ఆ

అగ్నిని రాత్రంతా కాపాడాలి. తెల్లవారుఝామున అరణులను రెంటిని ఆ అగ్నిలో కాచి దాన్ని చల్లార్చి ఆ అరణులను యజమానికివ్వాలి. అతను అగ్నిమథనంజరిగేవరకు వాటిని చేతిలో పట్టుకొనే ఉండాలి. క్రింద పెట్టగూడదు.

ఇంతకుముందే సమకూర్చుకొన్న సప్తమృత్తికల్లో సప్తవానస్పత్యాల్లో ఒక్కొక్కదాన్ని రెండు భాగాలుగాచేసి అందులో ఒక భాగాన్ని మళ్ళా రెండుగా విభజించి అలా ఏర్పడిన ఒక నాల్గవ భాగాన్ని గార్హపత్యకుండంలో మరొక నాల్గవభాగాన్ని దక్షిణాగ్ని కుండంలోనూ ఉంచాలి. మిగిలిన సగభాగాల్ని ఆహవనీయ కుండంలో ఉంచాలి. ఇసుక, ఎడారి మట్టి, ఎలుక తవ్వినమట్టి, పుట్టమట్టి, ఎండిన చెరువులోని మట్టి, పందికుళ్ళగించిన మట్టి, మున్నపురాళ్ళ వీటిని సప్తమృత్తికలంటారు. రావిచెక్క, ఉదుంబరపు చెక్క, మోదుగచెక్క, జమ్మిచెక్క, వికంకతపు చెక్క, పిడుగుపడి చచ్చిన చెట్టుయొక్క చెక్క, తామరాకు వీటిని సప్తవానస్పత్యాలంటారు. ఈ రెంటిపైన బంగారాన్ని ఉంచాలి.

తర్వాత ఇంతకుముందు చల్లార్చిన అగ్నిపైనున్న బూడిదను తోసివేసి, దానిమీద అరణులను పెట్టి, తెల్లని గుఱ్ఱాన్ని ఎదురుగా కట్టి అగ్నికోసం అరణులను మథించాలి. అగ్ని పుట్టగానే అధ్వర్యుపు పిడకలు మొ॥ వాటితో ఆ అగ్నిని పెద్దచేసి బ్రహ్మ సామగానం చేస్తూండగా గార్హపత్యకుండంలో ఇదివఱకుంచిన సంభారాలపైన ఆ అగ్నిని ఉంచాలి. ఇదే గార్హపత్యాగ్న్యాధానం.

మర్నాడుదయం సూర్యుడు సగం ఉదయించి ఉండగా గార్హపత్యాగ్నిని ప్రజ్వలింపజేసి దాంట్లోనుంచి కాలుతున్న రావిసమిధల్ని తీసి అధ్వర్యుపు చేత్తో పైకెత్తి పట్టుకొంటాడు. అప్పుడు అగ్నీధ్రుడు ఎవరో ఒకరింటినుండి తెచ్చిన

లౌకికాగ్నినిగాని, గార్హపత్యాగ్నినిగాని మథించిన అగ్నినిగాని బ్రహ్మ వామదేవ్య సామగానం చేస్తుండగా దక్షిణాగ్నికుండంలో ఉంచాలి. ఇదే దక్షిణాగ్న్యాధానం.

తర్వాత అధ్వర్యువు మొ॥ ఋత్విక్కులు తూర్పుదిక్కుకెదురుగా గుఱ్ఱాన్ని ముందు నడిపించుకుంటూ ఆహవనీయాగ్నికుండం దగ్గఱకు వెళ్లాలి. వాళ్లకు కుడివైపు బ్రహ్మ రథచక్రాన్ని మూడు సార్లు తిప్పాలి. గుఱ్ఱం ఆహవనీయకుండానికి తూర్పునుంచి పడమటి దిక్కుకు తిరిగి ఆహవనీయాగ్నికుండాన్ని దాటాలి. బ్రహ్మ సామగానం చేస్తుండగా పడమటిదిక్కుకు తిరిగి అధ్వర్యువు ఆహవనీయ కుండంలో అగ్నిని ఉంచాలి. ఇది ఆహవనీయాగ్న్యాధానం. ఇలా ఆధానం చేసిన అగ్నుల్ని ఆజ్యహోమాలతోను, కట్టెలతోను పెంపుచేయాలి.

తరువాత రావి జమ్మిసమిధలను మూడుమూడింటిని ఒక్కొక్క అగ్నిలో హోమంచేసి ఆజ్యంతో పూర్ణాహుతి చేయాలి. యజమాని ఆహితాలైన అగ్నులకు నమస్కరించి అధ్వర్యువుకు దక్షిణ సమర్పిస్తాడు. ప్రాయశ్చిత్తహోమాలుచేసి ఆహితాగ్నికి విధించబడిన నియమాల్ని సంకల్పపూర్వకంగా స్వీకరిస్తాడు. ఇది అగ్న్యాధానానికి సంబంధించిన ప్రధానకర్మ.

ఆధానంచేసిన వెంటనే దానికి అంగంగా ఒక ఇష్టిని చేయాలి. దానికి అగ్నిదేవత, అష్టాకపాలపురోడాశం ద్రవ్యం. దాని తర్వాత మూడు పవమానేష్టులను చేయాలి. పవమానేష్టులలో వరుసగా పవమానాగ్ని, పావకాగ్ని, శుచ్యగ్ని దేవతలు. మూడింటిలోను అష్టాకపాలపురోడాశమే ద్రవ్యం. ఈ పవమానేష్టులు చేసిన రోజు సాయంకాలమే అగ్నిహోత్రాన్ని ప్రారంభించాలి.

### 2. అగ్నిహోత్రం (2.1.1-11) :

అగ్న్యాధానంచేసినవాడిని ఆహితాగ్ని అంటారు. అతను విధిగా నిర్వహించవలసిన శ్రౌతకర్మల్లో అగ్నిహోత్రం చాలా ముఖ్యమైంది. ఇది నిత్యకర్మ. వేదాలు ఎన్నో నిత్య-కామ్యకర్మల్ని విధించినా అవి అగ్నిహోత్రాన్ని ప్రశంసించినంతగా ఇంకోదాన్ని ప్రశంసించలేదు. అగ్నిహోత్రాన్ని చేయకుండా మరి ఏ యితర కర్మను చేయడానికి వీలులేదు. గార్హపత్యాహవనీయ దక్షిణాగ్నుల్లో, గార్హపత్యాన్ని జీవించినంతకాలం కాపాడాలి. హోమ సమయాల్లో, రాత్రులలో యజమానిగాని, వాని భార్యగాని అగ్నిగృహంలో తప్పనిసరిగా ఉండి తీరాలి. ఇద్దరూ బయటకు వెళ్లవలసివస్తే ఆ అగ్నుల్ని యజమాని మంత్రపూర్వకంగా తనలో ఇముడ్చుకొని, వెళ్లినచోట శ్రోత్రియగృహంనుంచి తెచ్చిన అగ్నిలో మంత్రపూర్వకంగా తనలోని అగ్నిని ఆవాహనచేయాలి. ఇలా తనలో అగ్నిని ఇముడ్చుకొని వెళ్లేటప్పుడు భార్య యజమానిని తాకుతూనే వెళ్లాలి.

ఈ అగ్నిహోత్రంలో సాయంకాలం రెండుహోమాలు ఉదయం రెండుహోమాలు ప్రధానమైనవి. సాయంకాలం హోమం ఉదయం హోమం కలిసి ఒకే కర్మగా పరిగణించబడుతుంది. సాయంకాలం మొదటి హోమానికి అగ్నిదేవత. రెండో హోమానికి ప్రజాపతి. అలాగే ఉదయం మొదటి హోమానికి సూర్యుడు-రెండో హోమానికి ప్రజాపతి. మొదటి హోమంలో దేవత అగ్ని కాబట్టి ఈ కర్మకు అగ్నిహోత్రమనే పేరు కలిగింది. అన్ని హోమాల్లోను ఆవుపాలు ద్రవ్యం. ఈ అగ్నిహోత్రంలో పాలు, పెరుగు, గంజి నిత్యద్రవ్యాలు. ఫలోద్దేశ్యాన్నిబట్టి ద్రవ్యం మారుతుంటుంది. పశువులు-స్వర్గం కావాలంటే పాలు ద్రవ్యం. ఇంద్రియపుష్టి కలగాలంటే పెరుగు. గ్రామాధిపత్యం కావాలంటే గంజి. ఇవికాక కామ్యద్రవ్యాలుకూడా విధింపబడ్డాయి. అన్నసమృద్ధికోసం అన్నం, ఓజస్సు-బలాల కోసం బియ్యం, తేజస్సుకావాలంటే నెయ్యి హోమద్రవ్యం కావాలి.

అగ్నిహోత్రాన్ని యజమాని స్వయంగానే అనుష్ఠించాలి. అవసర మైనప్పుడు కొడుకులచేత లేక ఋత్విక్కులచేత కూడా హోమం చేయించవచ్చు. అయితే అమావాస్యా పౌర్ణములలో యజమానుడే అనుష్ఠించితీరాలి.

సూర్యకిరణాలు భూభాగాల్ని వదలి వృక్షాగ్రాలలో ఉండే సమయంలో సాయంకాలాగ్నిహోత్రాన్ని అవి తూర్పుదిక్కున కనబడగానే ప్రాతః కాలాగ్నిహోత్రాన్ని అనుష్ఠించాలి.

3. దర్శపూర్ణమాసేష్టి (3.2.3.4.5) :

వివాహితుడై అగ్న్యాధానం చేసిన త్రైవర్ణికుడు దీనికి అధికారి. భార్య మరణించినవానికధికారంలేదు. దీన్ని పౌర్ణమనాటి ఉదయాన ప్రారంభించి కృష్ణపాడ్యమినాటి పూర్వాహ్ణందాకా; అలాగే అమావాస్యనాటి ఉదయాన ప్రారంభించి శుక్లపాడ్యమినాటి పూర్వాహ్ణం వరకున్నూ చేయాలి. ఉదయసాయంకాలాల్లో చేయబడే రెండగ్నిహోత్రాలు కలిపి ఒకే కర్మగా ఎలా పరిగణింపబడ్డాయో అలాగే అమావాస్యనాడు పూర్ణిమనాడు చేయబడే ఈ యాగాలన్నీ కలిపి ఒకే కర్మక్రింద పరిగణింపబడతాయి. మొదట దర్శపూర్ణమాసల్ని ప్రారంభించేటప్పుడు పూర్ణిమతో ప్రారంభించాలి. ఆ పూర్ణిమకూడా మలమాసశుక్రాస్తాదిదోషాలు లేనిదై ఉండాలి. తర్వాత వచ్చే అమావాస్య లగాయితు అన్ని పర్వాలలోనూ దీన్ననుష్ఠించాల్సిందే.

ప్రతి అమావాస్యనాడు ప్రతిపూర్ణిమనాడు బ్రతికినంతకాలం అనుష్ఠించితీరాలన్న నియమాన్ని బట్టి ఈ ఇష్టి నిత్యమైందిగానూ, ఆయాఫలాలకోసం ఈ ఇష్టిని విధించడంవల్ల కామ్యమైందిగానూ కూడా పరిగణింపబడుతోంది. నిత్యమైన ఈ ఇష్టిని ముప్పైసంవత్స రాలు, కొందరి మతంలో పదిహేను సంవత్సరాలు నిరంతరంగా అనుష్ఠించి తర్వాత వదలివేయవచ్చు. కామ్యమైన ఈ ఇష్టిని ఎప్పుడు

కామన కలుగుతుందో అప్పుడు నిర్దుష్టమైన పర్వలో ఒక్కసారి చేసివా చాలు.

ప్రధానయాగానికి ముఖ్యకాలం పూర్ణిమ-అమావాస్యలకు పక్కతిథి పాడ్యమితో ఏర్పడే సంధి. అట్టి సంధి ఒక్కొక్కసారి అపరాహ్ణంలోను, రాత్రిపూటో ఏర్పడితే అప్పుడు మర్నాడు ఉదయాన్నే ప్రధానయాగాన్ని నిర్వర్తించాలి. దాన్ననుసరించి అంతకు ముందురోజే ఇష్టిని ప్రారంభించాలి. ఈ దర్శపూర్ణమాసేష్టి సమస్తమైన ఇష్టులకు, పశుయాగాలన్నిటికీ ప్రకృతియైన అగ్నీషోమీయ పశుయాగానికి కూడా ప్రకృతి.

ఈ ఇష్టిలో అధ్వర్యువు, బ్రహ్మ, హోత, అగ్నీధ్రుడు అని నల్గురు ఋత్విక్కులుంటారు. వీరికి సమప్రాధాన్యమే.

పూర్ణిమనాటి ఇష్టిలో మూడు ప్రధాన యాగాలు. అందులో అగ్నిదేవతగా, అష్టాకపాలపురోడాశం ద్రవ్యంగా ఉండే ఆగ్నేయ యాగం మొదటిది. విష్ణువు, ప్రజాపతి, అగ్నీషోములు వీరిలో ఒకరు దేవతగా ఆజ్యం ద్రవ్యంగా ఉండే ఉపాంశుయాగం రెండోది. అగ్నీషోములు దేవతగా ఏకాదశకపాలపురోడాశం ద్రవ్యంగా ఉండే అగ్నీషోమీయయాగం మూడోది.

అలాగే అమావాస్యనాటి ఇష్టిలోకూడా అగ్నిదేవతగా అష్టాకపాల పురోడాశం ద్రవ్యంగా ఉండే ఆగ్నేయయాగం, ఇంద్రుడు దేవతగా పెరుగు ద్రవ్యంగా ఉండే ఐంద్రయాగం, ఇంద్రుడే దేవతగా, పాలు ద్రవ్యంగా ఉండే ఐంద్రయాగం; మొత్తం మూడు ప్రధానయాగాలు. ఇష్టులు రెంటిలోను ప్రధానయాగాలకు ముందు ప్రయాజలనే ఐదు యాగాల్ని చేయాలి. సమిత్, తనూనపాత్, ఇట్, బర్హి అనే పేర్లుగల నాల్గు ప్రయాజలకు దేవతలుకూడా అవే. స్వాహాకారమనే ఐదోయాగానికి మాత్రం ఆయా కర్మల్లోని ప్రధాన దేవతే

దేవత. ఇదింటిలోనూ ఆజ్యమే ద్రవ్యం. ఈ ప్రయాజలు ఏయాగంలో విధింపబడినా ప్రయాజహోమం తర్వాత జుహువులో కొంత ఆజ్యాన్ని మిగిల్చి దాన్ని ప్రధాన యాగద్రవ్యాలైన పురోడాశాదులమీద అభిఘరించాలి.

ప్రయాజహోమానంతరం పూర్ణమాసేష్టిలో ముందు చెప్పినట్లు మూడు ప్రధానయాగాల్ని అనుష్ఠించాలి. దర్శేష్టిలో మొదట ఆగ్నేయపురోడాశయాగాన్ని చేయాలి. తర్వాత ఐంద్రం దధి ఐంద్రం పయః అనే రెండు యాగాలయినా రెంటిలో దేవత ఇంద్రుడు ఒక్కడేకాబట్టి జుహువులోకి రెండుసార్లు అవదానంచేసి తీసిన పెరుగును రెండుసార్లు అవదానంచేసి తీసిన పాలనుకూడా తీసుకొని అభిఘరించి ఒకేసారిగా హోమంచేయాలి. త్యాగంకూడా ఒక్కసారే. ఇలా జుహువులో కలిసిన దధిపయస్సులను సాన్నాయ్యమంటారు యాజ్ఞికులు. ప్రధానయాగానికి తర్వాత పార్వణేష్టి అందులో పూర్ణమాసేష్టిలో పూర్ణమాసం దేవత. దర్శేష్టిలో అమావాస్య దేవత. రెండుచోట్ల ఆజ్యమే ద్రవ్యం. ప్రధానయాగానికి తర్వాత స్విష్టకృద్యాగం. దీంట్లో స్విష్టకృదగ్ని దేవత. ప్రధానయాగంలోని పురోడాశమే ద్రవ్యం. సాధారణంగా హవిర్యాగాలలో హవిస్సంతటికీ హోమం ఉండదు. మొత్తం హవిస్సునుంచి శాస్త్రోక్తవిధానంగా కొంతభాగాన్ని వేరుచేసి హోమం చేయాలి. ఈ వేరుచేయడాన్నే అవదానమంటారు. ఇలా భాగాలుచేసి హోమం చెయ్యగా మిగిలిన హవిస్సును 'ఇడా' అనే పేరుతో వ్యవహరిస్తారు. ఈ ఇడను యథావిధిగా ఋత్విక్కులు తినాలి.

తర్వాత ఆజ్యద్రవ్యంతో మూడు అనుయాజలను హోమం చేయాలి. వీటిలో 1. దేవం బర్హిః 2. దేవో నరాశంసః 3. దేవోఽగ్నిః స్విష్టకృత్ అనే ముగ్గురు క్రమంగా దేవతలు. అధ్వర్యుడు, సోముడు, త్వష్టా దేవపత్నులు, రాకా, సినీవాలి, కుహూః, అగ్నిర్గృహపతి అనే దేవతలకోసం ఆజ్యంతో పత్నీ సంయాజలనే ఏడు హోమాలను గార్హపత్యాగ్నిలో చేయాలి. వీటిల్లో ఉద్దేశత్యాగం

పాఠానుమంత్రణం అనేవాటిని యజమానితోపాటు యజమానపత్నికూడా చేయాలి.

పురోడాశమనేది పిండిరొట్టె. వడ్లతోగాని యవలతోగాని ఈ పురోడాశాన్ని తయారుచేయవచ్చు. అయితే మొట్టమొదటిసారిగా ఏధాన్యంతో పురోడాశాన్ని చేస్తే తర్వాత ఆ యజమాని ఎప్పటికీ ఆ ధాన్యంతోనే పురోడాశాన్ని తయారుచెయ్యాలి గాని మధ్యలో మార్చకూడదు. వడ్లను దంచి ఊకతీసి మరొకసారి దంచి తవుడు తీసి తర్వాత పిండిచేసి, పిండిని వేయించి వేడినీళ్లతో ముద్దచేసి దాన్ని దర్భలతోను సమిధలతోను కాల్చి ఈ పురోడాశాన్ని సంపాదించాలి. కాల్చేటప్పుడు కుండపెంకుల్లో పెట్టి కాల్చాలి. ఆ కుండ పెంకుల సంఖ్యనుబట్టే అష్టాకపాల పురోడాశమని, ఏకాదశ కపాల పురోడాశమని, పురోడాశంలో భేదాలు ఏర్పడతాయి. కపాలమంటే కుండపెంకు.

**4. పిండపితృయజ్ఞం (1.3.10) :**

ఇది దర్శేష్టికి అంగమని కొందరు, స్వతంత్రమైన కర్మ అని కొందరు అంటారు. అమావాస్యనాటి సాయంకాలాన సంకల్పించి వడ్లను దంచగా వచ్చిన బియ్యాన్ని ఒకసారి కడిగి వాటితో దక్షిణాగ్నిలో ఉడికీ ఉడకని ప్రాయంగా అన్నాన్ని వండాలి. తరువాత అభిఘరించి అవదానంచేసి ఆ అన్నాన్ని సశేషంగా పితృపీతసోముడనే దేవతకోసం దక్షిణాగ్నిలో హోమంచేయాలి. తర్వాత మరల అవదానంచేసి అంగిరస్వద్యానికి సశేషంగా హోమంచేసి శేషభాగాలను రెంటిని కలిపి కవ్యవాహనాగ్నికి హోమంచేయాలి. ఇది స్విష్టకృత్ స్థానీయమవుతుంది. ఇది అధ్వర్యుడు చేయవలసిన పని.

యజమాని ప్రాచీనావీతితో ఆగ్నేయకోణంలో ఒకే వరుసగా పితృపితామహ ప్రపితామహులకు మూడు పిండాల్ని ఉంచి తిలోదకాలిచ్చి నమస్కరించి పూజించాలి. హవిశ్శేషాన్ని వాసన చూసి అర్చనచేసి పితరుల నుద్వాసనచేయాలి. అందులో ఒకపిండాన్ని సంతానేచ్ఛగల తన భార్యకిచ్చి తానొకటి భుజించాలి.

5. చాతుర్మాస్యాలు (1.6.1-110, 1.7.1) :

వైశ్వదేవపర్వ, వరుణప్రఘాసపర్వ, సాకమేధపర్వ, శునాసీరీయ పర్వ అనే పేర్లుగల ఈ నాల్గుచాతుర్మాస్యాలు పర్వలో అనుష్ఠింపబడటం వల్ల పర్వలనే పేర్లతో పిలువబడుతున్నాయి. ఫాల్గుణపూర్ణిమనాడు గాని, చైత్రపూర్ణిమనాడుగాని వైశ్వదేవపర్వము అనుష్ఠించాలి. ఆ తరువాత నాల్గుమాసాలకొకపర్వ చొప్పున మిగతా మూడు పర్వలను ఆచరించాలి. చాతుర్మాస్యాలు నిత్యకర్మలుగా పేర్కొనబడ్డాయి. అయినప్పటికి ఒకసారి నాల్గుపర్వలను చేసి వదలివేయవచ్చు. లేదా మొదటి ఆవృత్తి పూర్తికాగానే మళ్లామళ్లా ఆవృత్తిచేస్తూ అయిదు సంవత్సరాలవరకుగాని లేదా ఆపైవరకుగాని అనుష్ఠించవచ్చు. సోమయాగం చేయదలచినవాడు మాత్రం ఒకసారిచేసి మానేయాలి.

ఈ చాతుర్మాస్యాలు ఇష్టివిధానాన్ననుసరించి అనుష్ఠించడం వల్ల ఐష్టికాలని, పశుయాగవిధానాన్ననుసరించడంవల్ల పాశుకాలని, సోమయాగ విధానాన్ననుసరించడంవల్ల సౌమికాలని మూడు విధాలు. దేవతలు మూడు విధానాలలోను ఒకటే. ద్రవ్యం మాత్రం భిన్న భిన్నం.

చాతుర్మాస్యాలను రాజసూయానికంగంగాగాని స్వతంత్రంగాగాని అనుష్ఠించవచ్చు. రాజసూయానికంగంగా అనుష్ఠించేవాటిలో క్షత్రియుడికి మాత్రమే అధికారం. స్వతంత్రంగా అనుష్ఠించేవాటిలో త్రైవర్ణికులకు అధికారమున్నది.

## 5.1 వైశ్వదేవపర్వ

| యాగాలు | దేవత | ఐష్టిక ద్రవ్యం | పాశుక ద్రవ్యం |
|---|---|---|---|
| ఆగ్నేయయాగం | అగ్ని | అష్టాకపాలపురోడాశం | అష్టాకపాలపురోడాశం |
| సౌమ్యయాగం | సోముడు | చరువు | చరువు |
| సావిత్రయాగం | సవిత | ద్వాదశకపాలపురోడాశం | ద్వాదశకపాలపురోడాశం |
| సారస్వతయాగం | సరస్వతి | చరువు | చరువు |
| పౌష్ణయాగం | పూష | పిష్టక చరువు | పిష్టక చరువు |
| మారుతయాగం | మరుత్తులు | సప్తకపాలపురోడాశం | సప్తకపాలపురోడాశం |
| వైశ్వదేవయాగం | విశ్వేదేవులు | ఆమిక్ష(పాలవిరుగుడు) | పశువు |
| ద్యావాపృథివ్యయాగం | ద్యావాపృథివులు | ఏకకపాలపురోడాశం | ఏకకపాలపురోడాశం |

ఐష్టికంలో తొమ్మిది ప్రయాజలు. ఆజ్యం ద్రవ్యం. తొమ్మిది అనుయాజలు. పృషదాజ్యం (పెరుగు నెయ్యి కలిసింది) ద్రవ్యం. పాశుకంలో పశుయాగవిధానాన్ననుసరించి పదకొండు ప్రయాజలు పదకొండు అనుయాజలు. ప్రధానయాగాలు ముగిసిన తర్వాత మధు, మాధవ, శుక్ర, శుచి అనే మాసనామధేయాలుగల ఆజ్యహోమాలను చేయాలి. తర్వాత స్విష్టకృత్, ఇడాభక్షణం, అనుయాజలు చేసి వాజినద్రవ్యంతో వాజిదేవతలకు హోమంచేయాలి. విరిగిన పాలలో నీటిభాగాన్ని వాజినమంటారు.

### 5.2 వరుణప్రఘాసపర్వ

వైశ్వదేవపర్వలో మొదటి ఐదుయాగాలు ఇందులోనూ ఉంటాయి. ఆరవది ఐంద్రాగ్నయాగం. ఇంద్రాగ్నులు దేవత. ఏడవది మారుతయాగం. మరుత్తులు దేవత. పిండిలోచేసిన ఆడమేకలో కూడిన ఆమిక్ష ద్రవ్యం. ఈ ఒక్కయాగాన్ని మాత్రం ప్రతిప్రస్థాత అనే ఋత్విక్కు దక్షిణాహవనీయాగ్నిలో చేయాలి. ఈ పర్వలో మాత్రం ఆహవనీయాలు రెండు. ఒకటి దక్షిణాహవనీయం. రెండవది ఉత్తరాహవనీయం. ఎనిమిదవది

వారుణయాగం. వరుణుడు దేవత. పిండితోచేసిన మగమేకతో కూడిన ఆమిక్షద్రవ్యం. పాశుకంలో ఈ యాగంలో మాత్రమే పశువు ద్రవ్యం. తొమ్మిదవది కాయయాగం. క అనేవాడు దేవత. ఏకకపాలపురోడాశం ద్రవ్యం. ఈ తొమ్మిది ప్రధానయాగాలు.

ఈ ప్రధానయాగాలకు పూర్వం యజమానిపత్ని పిండితో పాత్రసామగ్రిని పోలిన చిన్నపాత్రలను చేయాలి. వాటిసంఖ్య యజమాని ఇంటిలోని జనసంఖ్యకన్నా ఒక్కటి ఎక్కువగా ఉండాలి. వాటిని చేటలో పెట్టి యజమాని పత్నితోకలసి వాటిని చేటలోనే హోమం చేయాలి. ఈ హోమంకూడా దక్షిణాహవనీయంలోనే.

తొమ్మిదవ ప్రధానయాగం ముగిసినతర్వాత నభ, నభస్య, ఇష, ఊర్జ అనే మాసనామధేయాలుగల నాల్గు ఆజ్యహోమాలు. తరువాత స్విష్టకృత్, ఇడాభక్షణం, అనుయాజలు సమావాలే. ఈ పర్వ ముగిసిన తర్వాత అవభృథస్నానంచేయాలి.

## 5.3 సాకమేధపర్వ

శుక్ల చతుర్దశివాడు ప్రారంభించి దీన్ని రెండురోజుల్లో ఆచరించాలి. ఇందులో అనీకవత్యాదులనే ఇష్టులు, మహాహవిస్సులు పితృయజ్ఞం, త్ర్యంబకహవిస్సులు అనే నాల్గుకర్మలు చేయాలి.

మొదట అనీకవతి అనే ఇష్టి. అష్టాకపాలపురోడాశం ద్రవ్యం. అనీకవానగ్ని దేవత. మధ్యాహ్నం సాంతపనీష్టి. చరువు ద్రవ్యం. సాన్తపనమరుత్తులు దేవతలు. సాయంకాలం గృహమేధీయేష్టి పాలతో వండిన చరువు ద్రవ్యం. గృహమేధులు దేవతలు. ఇందులో యజమానికిగల గోవులన్నిటిని పితికి ఆ పాలతో చరువు ఇంటిలోని వారందరికి సరిపోయేటంత

వండి హోమశేషాన్ని యింటిలో వారందరు భుజించాలి. పౌర్ణమినాటి ఉదయం 'పౌర్ణదర్వి' అనే హోమాన్ని చేసి ఉదయాన్నే క్రీడినేష్టిని చేయాలి. ఇందులో సప్తకపాలపురోడాశం ద్రవ్యం. క్రీడినోమరుత్తులు దేవతలు.

మహాహవిస్సులలో ఎనిమిది యాగాలు. మొదటి ఐదు వైశ్వదేవపర్వలో లాగానే చేయాలి. తర్వాత ఐంద్రాగ్ని, ఐంద్ర, వైశ్వ కర్మలనే మూడు యాగాలు. వీటిలో వరుసగా ఇంద్రాగ్నులు, ఇంద్రుడు, విశ్వకర్మలు దేవతలు. ద్రవ్యాలు వైశ్వదేవంలో లాగానే. పాశుకంలో ఐంద్రయాగంలో మాత్రమే పశువు ద్రవ్యం. ఎనిమిదో యాగం తర్వాత సహ, సహస్య, తప, తపస్య అనే మాసనామధేయాలైన హోమాల్ని చేయాలి.

మహాపితృయజ్ఞంలో షట్కపాలపురోడాశం, ధానలు (యవలపేలాలు) దూడ చనిపోయిన ఆవుపాలతో కలిపిన యవల పిండి ద్రవ్యాలు. వరుసగా పితృమత్సోముడు, బర్హిషత్పితరులు, అగ్నిష్వాత్తపితరులు దేవతలు. తర్వాత పితృపితామహ ప్రపితామహాలకు పిండప్రదానం చేయాలి.

త్ర్యంబకహవిస్సులో పురోడాశాలు ద్రవ్యం. వీటి సంఖ్య యజమాని యింటిలో స్త్రీ పురుషసంఖ్యకన్నా ఒకటి ఎక్కువ. రుద్రుడు దేవత.

## 5.4 శునాసీరీయపర్వ

వైశ్వదేవపర్వలోలాగానే మొదటి ఐదు యాగాలుంటాయి. తర్వాత ఐంద్రాగ్న, వైశ్వదేవ, శునాసీరీయ, వాయవ్య, సౌర్యలనే ఐదు యాగాలు. వీటిలో క్రమంగా ఇంద్రాగ్నులు, విశ్వేదేవులు, శునాసీరేంద్రుడు, వాయువు, సూర్యుడు దేవతలు. పురోడాశం, చరువు, పాలు ద్రవ్యాలు. పాశుకంలో శునాసీరేంద్రయాగంలో మాత్రం పశువు ద్రవ్యం. తొమ్మిది ప్రయాజలు. తొమ్మిది అనుయాజలు. మాసనామకహోమాలు లేవు. కాని సంసర్పమనే పేరుతో అధిక మాసహోమం ఒకటి ఉంటుంది.

సౌమిక చాతుర్మాస్యాలను ఏడు రోజుల్లో అనుష్ఠించాలి. మొదటి రోజు వైశ్వదేవపర్వ. దీంట్లో అగ్నిష్టోమ సంస్థాకమైన సోమయాగం. రెండు మూడు రోజులలో వరుణప్రఘాసపర్వ. రెండవరోజున అగ్నిష్టోమ సంస్థాగల సోమయాగం. మూడోరోజున ఉక్థ్యసంస్థాకం. సాకమేధపర్వ మూడు రోజులు. అందులో మొదటిరోజున అగ్నిష్టోమ సంస్థాకం, రెండవరోజున ఉక్థ్యసంస్థాకం, మూడోరోజున అతిరాత్ర సంస్థాకమైన సోమయాగం చేయాలి. శునాసీరీయం ఏడవరోజు. జ్యోతిష్టోమ సంస్థాకసోమయాగం. ఏడు రోజులలోను సోమయాగానికంగంగా ఏడు పశుయాగాలను చేయాలి. వాటిలో వరుసగా విశ్వేదేవులు, వరుణుడు, మరుత్తులు, అగ్ని, ఇంద్రాగ్నులు, ఏకాదశినదేవతలు, వాయువు అనేవారు దేవతలు.

### 6. రాజసూయం (1.6-8)

రాజసూయయాగాన్ననుష్ఠించడానికి పట్టాభిషిక్తుడై రాజ్యాన్ని పాలిస్తున్న క్షత్రియుడే అధికారి. ఇది సంవత్సరకాలానికి పైగా పడుతుంది. అతివిస్తృతం అత్యధిక వ్యయప్రయాస సాధ్యమైన ఈ యజ్ఞంలో మొత్తంమీద ఆరు సోమయాగాలు, రెండు పశుయాగాలు, నూటఇరవైతొమ్మిది ఇష్టులు, ఏడు దర్వీహోమాలు ఉంటాయి. ఈ యజ్ఞాన్ని ఫాల్గుణ శుద్ధపాడ్యమినాడు ప్రారంభించాలి. తర్వాత చాతుర్మాస్యాలను వాట్నింటినీ సౌమిక విధానంతో అనుష్ఠించాలి. అభిషేచనీయమనే సోమయాగానికి అంగంగా రాజుకభిషేకం చేయాలి. నల్గురు ఋత్విక్కులు నాల్గుప్రక్కల నిలబడి రాజు కభిషేకం చేయాలి. ఈ అభిషేకంకోసం పదహారు స్థలాలనుంచి పవిత్రజలాలను తెప్పించాలి. అభిషిక్తుడుకాని ఒక క్షత్రియుడు ఒక వైశ్యుడు ఒక స్నేహితుడుకూడా రాజుకభిషేకం చేయాలి. ఈ సమయంలోనే 'ఇతడు మీకు రాజు' అని ప్రజలందరికీ ఎదుట రాజు నిర్దేశింపబడతాడు. అభిషేకం తరువాత రథారోహణం చేయాలి. తర్వాత ఋత్విక్కులందరు రాజును

స్తుతించాలి. హోత, శునశ్శేపుని కథను చెబుతూ ఋగ్వేదంలోని శునశ్శేప సూక్త మంత్రాలను పఠిస్తుంటే రాజు వినాలి. రాజసూయంలో ఋత్విగ్దక్షిణలో కూడా అనేక విశేషాలున్నాయి. యథావిధి దక్షిణలనివ్వాలి. ఈ రాజసూయానికి స్వారాజ్యం ఫలంగా చెప్పబడింది.

7. సోమయాగం:

తైత్తిరీయ బ్రాహ్మణంలో ఏఒక్క సోమయాగ ప్రకృతి కూడా సాంగోపాంగంగా చెప్పబడిందనటానికి లేదు. ఒకరోజులో చేయబడే సోమయాగాల్ని ఏకాహాలని, ఒకటి నుండి పన్నెండు రోజులలోపున చేయబడే సోమయాగాల్ని అహీనాలని, పన్నెండు రోజులు దాటి చేయబడే సోమయాగాల్ని సత్రాలని అంటారు. అందులో సవాలనే పేరుగల పన్నెండు ఏకాహహోమాలు మాత్రం తైత్తిరీయబ్రాహ్మణంలోనే వివరింపబడ్డాయి (2.7.1-18). వీటిలో యజమానిని ఈశ్వరుడుగా భావించి అభిషేకిస్తారు. కాబట్టి వీటికి సవాలనే పేరు ఏర్పడింది. ఇవి 1.బృహస్పతిసవం, 2. వైశ్యసవం, 3.బ్రాహ్మణ సవం, 4.సోమసవం, 5.పృథిసవం, 6.గోసవం, 7.ఓదనసవం, 8.పంచశారదీయసవం, 9.అగ్నిష్టుత్ సవం, 10.ఇంద్రస్తుత్ సవం, 11.అప్తోర్యామసవం, 12.విఘనసవం అని పన్నెండు రకాలు.

వీటిలో అనేక పురోడాశాలు - పశువులు కూడా ద్రవ్యాలు సోమయాగవిధానంతో వీటిననుష్ఠించాలి.

8. గవామయనం (1.2.2-6):

సత్రాలలో గవామయనం (1.2.2-6) వివరించబడింది. మూడువందల అరవైఒకరోజులలో ఈ సత్రాన్ని నిర్వహించాలి. మొదటి నూటఎనభై రోజులు పూర్వపక్షం. తర్వాత ఒకరోజు విషువత్. తర్వాత మరల నూటఎనభైరోజులు

ఉత్తర పక్షం. ఈ రోజులలో ప్రతిరోజు 'సుత్యా' ఉంటుంది. సోమాన్ని పిండి రసం తీసి హోమం చేసేరోజును 'సుత్యా' అంటారు. ఈ యజ్ఞాన్ని గోవులనుష్ఠించినట్లు అర్థవాదవాక్యంలో ఉండటంవల్ల దీనికి గవామయనమని పేరువచ్చింది. ఈ సత్రం మిగతా సత్రాలన్నిటికీ ప్రకృతి.

**9. పురుషమేధం (3.4.1-19):**

అశ్వమేధంలాగానే పురుషమేధంకూడా సోమయాగమే. అశ్వమేధాన్ని గురించి తైత్తిరీయబ్రాహ్మణంలో గమనించదగిన వివరాలేమీ కనబడవు. కాని అనేక ఫలాలకోసం నూట తొంభై ఎనిమిది విధాలైన పురుష పశువుల విధానం కనబడుతుంది. అయితే 'నరమేధం' అనికూడా పిలువబడే ఈ యజ్ఞాన్ని గురించి కొన్ని విపరీత భావనలు లోకంలో ఉన్నాయి. అశ్వమేధాది యాగాల్లో అశ్వాన్ని ద్రవ్యంగా హోమంచేసినట్లు పురుషులకుకూడా విశసనహోమాదులుంటాయని. ఇది పూర్తిగా వేద విరుద్ధం. ఒకొక్క పురుషపశువుతోపాటు ఒకొక్క మేకను కూడా ద్రవ్యంగా స్వీకరించాలి. పాశుక విధానంలో ఉపాకరణమని ఒకకర్మ. అంటే ఆయా పశువులను తాకుతూ ఆయా దేవతలనుద్దేశించి ఇది నీకోసమేనన్నట్టు మాటతో సమర్పించడం. ఈ ఉపాకరణాన్ని పురుషునికి మేకకుకూడా చేసి పురుషుని నారాయణస్వరూపుడుగా భావించి వదిలివేయడమే. తరువాత చేయాల్సిన విశసన వపోద్ధారణ హోమాదులన్నీ మేకకేగాని పురుషునికి కావు. కాగా పురుషులను హోమం చేయడమనే ప్రసక్తే లేదు.

తైత్తిరీయబ్రాహ్మణంలో యజ్ఞయాగాలకు సంబంధించిన ఎన్నో వివరాలు చక్కగా చెప్పబడ్డాయి. వాటికి దిగ్దర్శనమాత్రమే ఇందులో చేయబడింది.

\- వి.కె.ఎస్.

## 2.3.7 వైశిష్ట్యం

మంత్రాల వినియోగాన్ని చెప్పడం బ్రాహ్మణగ్రంథ లక్షణం. కాని ఇతర బ్రాహ్మణాలకంటే తైత్తిరీయబ్రాహ్మణ వైశిష్ట్యమేమిటంటే కేవలం మంత్రాల వినియోగాన్ని ప్రతిపాదించడమేకాక మంత్ర భాగంతో గూడ కలిసి ఉండటం.

ఇతర వేదాలకు సంబంధించిన బ్రాహ్మణాలలో ఉదాత్తాది స్వరాలు కనపడటంలేదు. కొన్ని బ్రాహ్మణ భాగాలలో స్వరమున్నా అది ద్వైస్వర్యమే: అంటే ఉదాత్తం అనుదాత్తం అనే రెండు స్వరాలేగాని చాతుస్స్వర్యంలేదు[1]. కాని తైత్తిరీయ బ్రాహ్మణంలో అలాకాక చాతుస్స్వర్యం సుప్రసిద్ధంగా ఉంది. అంటే ఉదాత్తం, అనుదాత్తం, స్వరితం, ప్రచయం అనే నాలుగు స్వరాలు. పరంపరగా వచ్చే అధ్యయనంలో ఇవి పాటింపబడటం తైత్తిరీయ బ్రాహ్మణ వైశిష్ట్యం.

అదీగాక బ్రాహ్మణాల్లో అనేక క్రతువులు చెప్పబడుతుంటాయి. కాని ఏ ఇతర బ్రాహ్మణం చెప్పని సావిత్రాగ్నిచయనక్రతువును దాని ఉపాసనను ఈ తైత్తిరీయబ్రాహ్మణం చెప్పటం దీనికిగల గొప్ప విశిష్టత. తైత్తిరీయబ్రాహ్మణంలోని సావిత్రాగ్నిచయనక్రతుజ్ఞానమాహాత్మ్యానికి సంబంధించిన కొన్ని విశేషాలను తెలుసుకుందాం.

భరద్వాజమహర్షి సంపూర్ణంగా వేదాలనన్నింటిని అధ్యయనం చేయాలనుకొన్నాడు. అలా చేయడానికి ఎంతో ఆయుష్యం కావాలి కదా! అందుకోసం తపస్సుచేశాడు. తపస్సు ఫలించింది. దేవేంద్రానుగ్రహంవల్ల నూరు సంవత్సరాల ఆయుస్సు లభించింది. ఆ ఆయుస్సుతో వేదాధ్యయనం

---

1. ఛందోగా బహ్వృచాశ్చైవ తథా వాజసనేయినః ।
ఉచ్చనీచస్వరం ప్రాహుః స వై భాషిక ఉచ్యతే ॥

చేశాడు. ఇలా మూడుసార్లు తపస్సు చేసి, మూడువందల సంవత్సరాల ఆయుస్సును పొంది వేదాధ్యయనం చేశాడు. తరువాత వృద్ధుడై శరీరేంద్రియపాటవం కోల్పోయి పడుకొని ఉన్న భరద్వాజమహర్షి దగ్గరకి దేవేంద్రుడు వచ్చి 'భరద్వాజా! ఈపైనగూడ మళ్లా ఆయుస్సును నేననుగ్రహిస్తే దాంతో నీవేంచేస్తావ'ని అడిగాడు. 'మళ్లా వేదాధ్యయనాన్నే చేస్తాన'ని భరద్వాజుడు సమాధానం చెప్పాడు. 'ఆహా! ఏమి ఈ మహర్షి వేదాధ్యయనదీక్ష!' అని ఆశ్చర్యపడ్డాడు దేవేంద్రుడు. వేదాల నన్నింటిని అధ్యయనం చేయుటం అసాధ్యంగదా! కాని ఈ విషయం తెలియక పట్టుదలతో ఇతడు ఇలా సంపూర్ణ వేదాధ్యయనంకోసం పూనుకొంటున్నాడని తెలుసుకొని ఆ మహర్షి శ్రద్ధకు సంతోషించి తన యోగమహిమచేత ఋగ్యజుస్సామ వేదాలను మూడింటిని మూడు పర్వతాలుగా చూపించాడు. 'నేనిచ్చిన మూడువందల సంవత్సరాల కాలం నీవు చేసిన వేదాధ్యయనం ఒక్కొక్క పర్వతంనుంచి ఒక్కొక్క పిడికిలి మన్నుతీస్తే ఎంత అవుతుందో అంతే. మిగిలిందంతా ఇంకా నీవు అధ్యయనం చేయవలసిందే. భరద్వాజా! ఈ మూడు పర్వతాలు వేదాలు. వీటి స్వరూపం అనంతం. అందువల్ల సర్వవేదాధ్యయనం అసాధ్యం. వేదాలనన్నింటినీ అధ్యయనం చేయాలని తీవ్రప్రయత్నం చేస్తున్న నీవు సర్వవేదాధ్యయన ఫలమైన సావిత్రాగ్నిని ధ్యానంచేసి సాక్షాత్కరింపచేసుకోమని సావిత్రాగ్ని విద్యనుపదేశించాడు. మూడు వేదాలలో చెప్పబడిన సర్వకర్మానుష్ఠానంచేత ఏ ఫలం వస్తుందో ఈ సావిత్రాగ్నిజ్ఞానం చేత ఆ ఫలాన్ని పొందవచ్చు. సావిత్రాగ్ని జ్ఞానానికి ఆదిత్యోపాధికమైన హిరణ్యగర్భప్రాప్తి ఫలం. కర్మకాండలో కర్మాంగోపాసనలకు ఆదిత్యోపాధికమైన హిరణ్యగర్భ ప్రాప్తికంటే అధికఫలంలేదు' అన్నాడు. తరువాత భరద్వాజమహర్షి సావిత్రాగ్నిని ధ్యానంచేసి స్వస్వరూపంగా సాక్షాత్కరింపచేసుకొని, ఆ జ్ఞాన మహిమవల్ల తను స్వయంగా సావిత్రాగ్ని స్వరూపమై దేహత్యాగంచేసి, ఆదిత్యసాయుజ్యాన్ని పొందాడు. ఇంతటి మహామహిమోపేతమైన సావిత్రాగ్ని క్రతువు, దాని ఉపాసన చెప్పబడటం ఈ బ్రాహ్మణ వైశిష్ట్యం (3.10.11).

మరి ఈ బ్రాహ్మణమే సావిత్రాగ్నిజ్ఞానమాహాత్మ్యాన్ని ఉపాఖ్యాన పూర్వకంగా బోధించింది. ప్రరోచనకోసం ఇలా బోధించటం శ్రుతియొక్క శైలి. ఈ బ్రాహ్మణశ్రుతి బోధించిన రెండు మూడు ఉపాఖ్యానాలను పరిశీలిద్దాం :

విదేహదేశాధిపతియైన జనకమహారాజు సావిత్రాగ్నిజ్ఞానాన్ని సంపాదించదలచి అహోరాత్రాభిమాని దేవతలను కలవగా ఆ దేవతలు ఇలా అన్నారు: జనకమహారాజా! మమ్మల్ని లోకంలో ఎవరు సావిత్రాగ్ని స్వరూపంగా ఉపాసనచేస్తారో అలాంటివాళ్లు సర్వపాపాల నుంచి అపమృత్యువునుంచి విముక్తులై పరిపూర్ణాయుస్సును పొంది దేహావసానంలో స్వర్గాన్నికూడ పొందుతారు. వాళ్లు ఎప్పటికీ అన్నానికి లోటులేకుండా సర్వాన్నసమృద్ధి కలవారై స్వర్గలోకం పొందగలరు (3.10.9).

ఇలాగే అశ్వత్థమహర్షి పుత్రుడైన అహీనమహర్షి సావిత్రాగ్నిని స్వస్వరూపంగా ధ్యానంచేసి సాక్షాత్కరింపచేసుకొన్నాడు. ఆమహర్షి అలా సాక్షాత్కరింపచేసుకోవటంచేత దేహావసానసమయంలో బంగారుహంస అయి స్వర్గలోకానికి వెళ్లి ఆదిత్యతాదాత్మ్యాన్ని పొందాడు.

శ్రౌతానుష్ఠానంలో సంపూర్ణ పాండిత్యంకల దేవభాగమహర్షి గూడ సావిత్రాగ్నిని ధ్యానంతో సాక్షాత్కరింపచేసుకొనే సమయంలో ఆమహర్షికి ఎదుట ఒక అశరీరవాక్కు ఇలా వినబడింది. 'ఈ దేవభాగమహర్షి సావిత్రాగ్నిని స్వస్వరూపంగా సాక్షాత్కరింపచేసుకోవటంచేత ఈమహర్షి సర్వజగత్తును తెలుసుకోగలిగినవాడైనాడు. ఆహా! ఏమి ఈ సావిత్రాగ్నిజ్ఞానమహాత్మ్యం! ఈ మహర్షికి సర్వజ్ఞత్వాన్ని గూడ సంపాదించిందే' అని ఆశ్చర్యాన్ని వ్యక్తపరచింది. ఈ అశరీరవాక్కును విన్న మహర్షి ఆమెను 'నీవెవరవి' అడిగాడు. ఆవాక్కు సర్వవేదాన్తప్రతిపాద్యమై గోప్యమైన, బ్రహ్మతేజస్సును ధరించిన సర్వదేవతలు

నివసించటానికి యోగ్యమైన, ఉత్తమస్థానమైన సావిత్రాగ్నిని నేనేనని సమాధానం చెప్పింది. వెంటనే ఆమహర్షి ఉత్తరీయాన్ని యజ్ఞోపవీతంగా ధరించి గొప్పభక్తితో ఉచ్చస్వరంతో నమస్కారాలను చెబుతూ ఆ సావిత్రాగ్నికి సాష్టాంగ నమస్కారాలను చేశాడు. తరువాత సావిత్రాగ్ని 'దేవభాగమహర్షీ సావిత్రాగ్నిజ్ఞానఫలం సంభవించిందా? లేదా? అనే సందేహం పొందనవసరం లేదు. సావిత్రాగ్ని సాక్షాత్కారమవటంచేత నీకు సర్వలోకాలు, సర్వఫలసిద్ధి కలిగింద'ని చెప్పింది.

వృష్ణికుమారుడైన శూషమహర్షి ఒకప్పుడు శ్రేయోదాయకమైన విజ్ఞానాన్ని ఆదిత్యునివల్ల పొందతలచాడు. తరువాత ఆదిత్యుడు 'ఓ శూషమహర్షీ నాదగ్గరికి రా! నన్ను సావిత్రాగ్ని స్వరూపంగా తెలుసుకో!' అని చెప్పి ఇలా భావనచేయుటంచేత ఈ సావిత్రాగ్ని స్వర్గప్రాప్తికి కారణమవటమేకాక సంసారసాగరాన్ని దాటడానికి గూడ ఉపయోగిస్తుంది. ఎందువల్లనంటే అమృతస్వరూపమైన పరమాత్మనుంచి ఈ సావిత్రాగ్ని పుట్టటంవల్ల దానికి ఆ సామర్థ్యం ఉంది. అదేగాక ఆదిత్యమండలంలో బంగారుజుట్టుతోను, మీసాలతోను, కళ్లతోను నఖశిఖపర్యంతం బంగారంతో ప్రకాశించేస్వరూపమేది ఉందో అది సావిత్రాగ్ని స్వరూపమే. కనుక ఈ సావిత్రాగ్ని స్వరూపాన్ని తెలుసుకున్నవారికి ఇదే ప్రాప్యస్థానం కనుక నేను నిన్ను ఇక్కడికి రమ్మనమని, నన్ను సావిత్రాగ్ని రూపంగా తెలుసుకోమని ఉపదేశించాను' అని శూషమహర్షికి ఆదిత్యమండలాంతర్గత పురుషుడు సావిత్రాగ్నిస్వరూపం గురించి చెప్పాడు. ఈ విషయం ఈ బ్రాహ్మణంలో ఉండటం దీనికొక వైశిష్ట్యం.

ఇలా తైత్తిరీయబ్రాహ్మణ వైశిష్ట్య బోధకాలైన విషయాలు ఎన్నో ఉన్నాయి. వాటి నధ్యయనంచేయుడం మన కనీసధర్మం.

- వి.ఎస్.జి.

## 2.3.8 సంగ్రహసమీక్ష

తైత్తిరీయబ్రాహ్మణంలో మూడు కాండలున్నాయి. ప్రతికాండ కొన్ని ప్రపాఠకాలుగాను, ప్రతిప్రపాఠకం కొన్ని అనువాకాలుగాను విభజింపబడి ఉంది. ఇక్కడ మూడు కాండలను సంగ్రహంగా సమీక్షించుకుందాం.

**మొదటికాండ :**

ఈకాండలో ఎనిమిది ప్రపాఠకాలున్నాయి. ప్రతి ప్రపాఠకంలోను గల అనువాకాలసంఖ్య పోలిక చాలా తక్కువ.

1. మొదటి ప్రపాఠకంలో గల పది అనువాకాలలో అగ్న్యాధానవిధి సమగ్రంగా నిరూపింపబడింది. అక్కడక్కడ సందర్భాన్ననుసరించి ఎన్నో విశేషాలు ఇందులో మనకు దొరుకుతున్నాయి.

**నక్షత్రాన్నెలా తెలుసుకోవడం?**

ఆధానం మంచినక్షత్రంలో చేయాలి. కాబట్టి యోగ్యమైన నక్షత్రాన్ని నిర్ణయించుకోవాలి. రోజుకొక నక్షత్రం ఉంటుంది. అది ఎలా తెలుసుకోవడం? అంటే; చంద్రుడు ఏరోజు ఏనక్షత్రంతో కలిసి ఉంటాడో ఆరోజు ఆనక్షత్రమని వ్యవహారం. కృత్తికతో కలసి చంద్రుడున్నరోజు కృత్తికానక్షత్రమని అంటాం. కృత్తిక ఒకప్పుడు మొదటినక్షత్రంగా ఉండేది. ఆనక్షత్రంలో ఆధానంచేస్తే అతడికి బ్రహ్మవర్చస్సు కలుగుతుంది. రోహిణీ[1] నక్షత్రంలో ఆధానంచేసిన వాడు సిరిసంపదలతో తులతూగుతాడు (1.1.1-2).

---

1. రుహ్యాన్వై ప్రాప్నువన్నితి రోహః రోహః కామాః తే కామా యత్ర ప్రాప్నువన్ సా రోహిణీ

**అశ్రద్ధ పనికిరాదు:**

దేవతలొకప్పుడు ధనగర్వంతో విర్రవీగుతూ అశ్రద్ధగా అగ్న్యాధానం చేశారు. అంతే; వారి సిరిసంపదలన్నీ నశించి దరిద్రులైనారు. మళ్లా ఎన్నో అవస్థలుపడి తప్పు తెలుసుకొని పునర్వసు నక్షత్రంలో శ్రద్ధగా అగ్న్యాధ్యానంచేసి మళ్లా ధనికులైనారు. అందుకే ఆనక్షత్రం సార్థకంగా పునర్వసు అయింది (1.1.1-2).

**కన్ను అబద్ధం చెప్పదు :**

మాట మనసు ఎప్పుడైనా అబద్ధం చెబుతాయి కాని ఏదోషం లేని కన్ను ఎప్పుడూ అబద్ధం చెప్పదు. అది ఎదురుగా ఉన్న వస్తువు యథార్థస్వరూపాన్నే తెలుసుకుంటుంది. అందుకే ప్రతివాడు కన్నును నమ్ముతాడు. ఎవరైనా ఏదైనా విషయం మనకు చెబితే నీవు కంటితో చూశావా లేక విన్నావా? అని అడుగుతాం. నేనే చూశానంటే తప్పకుండా నమ్ముతాం[1].

2. రెండో ప్రపాఠకంలో గవామయనశేషవిధులు ఆరు అనువాకాల్లో నిరూపింపబడ్డాయి. గవామయనంలో ముఖ్యమైన 'విషువత్' అనే అహస్సు, దానికి రెండువైపులా ఉన్న ఎనిమిది అహస్సులు మొత్తం నవాహ్నికం ఇందులో బాగా నిరూపింపబడింది.

**విషువత్ అంటే ఏమిటి?**

సంవత్సరాన్ని రెండు భాగాలు చేయాలి. మొదటిభాగంలో చివరి నాలుగురోజులు రెండో భాగంలో మొదటి నాలుగురోజులు తీసుకోవాలి.

1. అనృతం వై వాచా వదతి. అనృతం మనసా ధ్యాయతి. చక్షుర్వై సత్యమ్. అద్రాగిత్యాహ అదర్శమితి. తత్సత్యమ్ 1.1-4

మధ్యలో ఉండే రోజును 'విషువత్' అంటారు. **(4+1+4=9)**. ఈ తొమ్మిది రోజుల్లో యాగంచేస్తే అష్టదిక్పాలకులచేత పాలింపబడే ఎనిమిది స్వర్గాలు, అంతకంటే పైనుండే స్వర్గం పొందగలుగుతాడు యజమాని (1.2.1).

3. మూడో ప్రపాఠకంలోని పది అనువాకాల్లో వాజపేయం, పునరాధానం, పిండపితృయజ్ఞం ప్రధానవిషయాలు.

వాజపేయమంటే....

అన్నాన్ని వాజమంటారు. త్రాగేది కాబట్టి సోమం పేయం, ఏయాగంలో అన్నం-సోమం ద్రవ్యంగా ఉపయోగింపబడుతున్నాయో దానికి 'వాజపేయ' మని పేరు.

పోట్లాడుకోకూడదు:

ఒకప్పుడు దేవతలు వాజపేయం చేయాలనుకొన్నారు. ఎవరు ముందు చేయాలని వాదోపవాదాలు జరిగాయి. చివఱకు ఇలా నిర్ణయించుకొన్నారు. అనుకున్న సమయంలో ఎవరు భూమినంతా ప్రదక్షిణంచేసి వస్తారో వారికి ప్రాథమ్యం. అలా ముందు ప్రదక్షిణం చేసి వచ్చి గెలిచి బృహస్పతి వాజపేయం చేశాడు. తరువాత ఇంద్రుడు బృహస్పతిని ప్రార్థించి వాజపేయాన్ని ఆచరించి స్వర్గాధిపత్యం చేపట్టాడు. "కనుక పరస్పరం పోట్లాడుకోకూడదు. మనలో మనమే సర్దుకుపోవాలి" అనే సందేశం ఇందులో కనబడుతుంది.

**4.** ఈ ప్రపాఠకం సోమయాగానికి సంబంధించిన ఎన్నో విశేషాలను వివరిస్తున్నది. సోమగ్రహం, దోషప్రాయశ్చిత్తం, వహ్నిప్రాయశ్చిత్తం, అమావాసిరోహణప్రాయశ్చిత్తం, చాతుర్మాస్యవిధి మొదలైనవి అందులో ముఖ్య విషయాలు.

రెండుపూట్లెందుకు అన్నంతినడం?

ఒకప్పుడు దేవతలు, పితరులు, మనుష్యులు, పశువులు, అసురులు (వీరందరికీ ప్రజలనిపేరు) ఉపవాసరూపమైన (సత్రాన్ని) తపస్సును చేశారు. వారిలో దేవతలు నేతితోనిండిన చమసపాత్రను చూసి హోమంచేసి పదిహేనురోజులకొకసారి భోజనం చేసే రసపదార్థాన్ని సంపాదించారు. అందువల్లనే అమావాస్యనాడు పౌర్ణమాసినాడు దేవతలప్రీతికోసం దర్శపూర్ణమాస యాగాలు చేయబడుతున్నాయి. అలాగే పితృదేవతలు నెలకొకసారి తమ భోజనాన్ని సంపాదించుకొన్నారు. అందుకనే ప్రతి అమావాస్యనాడు 'పిండపితృయజ్ఞం' చేస్తున్నారు. మనుష్యులు ఒకేరోజు రెండుపూట్లు భోజనాన్ని సంపాదించారు. కాబట్టే ఇప్పటికీ మనుష్యులు రోజుకు రెండుపూట్లు భోజనం చేస్తున్నారు. పశువులు ఒకేరోజు మూడుపూట్లు ఆహారం తినే అవకాశాన్ని పొంది గడ్డితినడంకోసం తిరుగుతున్నాయి. మిగతా సమయంలో తిన్నదాన్ని నెమరువేసుకుంటాయి. అసురులు సంవత్సరానికొకసారే ఆహారాన్ని పొందారు. అందువల్లే వాళ్లు సంవత్సరానికొకసారి భోజనం చేసి మిగతా సమయంలో దేవతలతో యుద్ధానికి సిద్ధపడేవాళ్లు. ఇలా ఆహారనియమాలు మొదట ఏర్పడి ఇప్పటికీ కొందరిలోనైనా ఆచరణలో ఉన్నాయి **(1.4.9)**.

5. అయిదో ప్రపాఠకం పన్నెండు అనువాకాలతో నక్షత్రేష్టికా మంత్రాలను వివరిస్తున్నది. ఇందులో యజ్ఞానుష్ఠానానికి పవిత్రమైన కాలం, దినవిభాగం, వపనవిధి, ఛన్దఃప్రశంస మొ॥ విశేషాలున్నాయి.

ప్రజాపతి శరీరం:

నక్షత్రాలే ప్రజాపతి శరీరం. హస్తనక్షత్రం ప్రజాపతికి హస్తం. చిత్తానక్షత్రం శిరస్సు. స్వాతీనక్షత్రం హృదయం. విశాఖానక్షత్రం తొడలు.

అనూరాధా నక్షత్రం పాదాలు. ఇలా నక్షత్ర స్వరూపిగా ప్రజాపతిని ధ్యానం చేసేవారు భూమిలోను స్వర్గంలోకూడ ప్రతిష్ఠను పొందుతారు (1.5.2).

6. పది అనువాకాలు గల ఆరో ప్రపాఠకం ప్రధానంగా రాజసూయ యాగానికి సంబంధించిన అనుబ్రాహ్మణంగా కనబడుతున్నది. తైత్తిరీయ సంహితలో రాజసూయానికి విస్తరంగా భాష్యం వ్రాసిన సాయణుడు బ్రాహ్మణంలో 6,7,8 ప్రపాఠకాలకు భాష్యం వ్రాయలేదు. ఇందులో అనుమతేష్టి మొ॥ ఇష్టులు, వైశ్వదేవహవిఃప్రశంస, వరుణప్రఘాసవిధి, సాకమేధవిధి, పిండపితృ యజ్ఞవిధి, త్ర్యంబక హవిర్విధి మొ॥ విషయాలు చక్కగా వివరింపబడ్డాయి.

7. ఏడో ప్రపాఠకంలో పది అనువాకాలున్నాయి. ఇందులో శునాసీరీయాదివిధి, నిర్వాపవిధి, జలాహరణవిధి, జలసంస్కారం, దిగ్వయుధ్యానం, అభిషేకవిధి, రథారోహణవిజయవిధి మొ॥ విశేషాలు చెప్పబడ్డాయి.

8. ఎనిమిదో ప్రపాఠకంలో పది అనువాకాలున్నాయి. ఇందులో దశపేయవిధి, సౌత్రామణీయవిధి, పవిత్రాహవిధి, పట్టాభిషేకవిశేషాలు నిరూపింపబడ్డాయి. ఇంతటితో మొదటికాండ పూర్తవుతున్నది.

**రెండవకాండ:**

మొదటికాండలో లాగానే రెండవకాండలో కూడ ఎనిమిది ప్రపాఠకాలున్నాయి.

1. మొదటిప్రపాఠకంలో అగ్నిహోత్రవిధి ముఖ్యవిషయం. అగ్నిహోత్రశబ్దార్థం. అధిశ్రయణం, అభ్యున్నయనవిధి, దోహన ప్రకారం, అగ్నికి గల ఏడు అవస్థలు వివరంగా చెప్పబడ్డాయి.

**ఆవులే అగ్నిహోత్రాలు :**

ప్రజాపతి పర్వతాలు మొ॥ అచేతనాలను ముందు సృష్టించి హోమంద్వారా అగ్ని, వాయువు, ఆదిత్యుడనే చేతనులను తరువాత సృష్టించాడు. ఈ ముగ్గురు ప్రజాపతిలాగానే హోమంచేసి చేతనాన్ని సృష్టించాలనుకున్నారు. అగ్ని ప్రాణాలకోసం, వాయువు శరీరం కోసం, ఆదిత్యుడు కండ్లకోసం హోమం చేశారు. దాంతో ఒక గోవు పుట్టింది. దాని పాలుపంచుకోవడంలో ముగ్గురికీ పేచీవచ్చింది. ప్రజాపతిదగ్గఱకు పరిష్కారంకోసం పోయారు. ప్రాణాలులేని శరీరం, కండ్లు వ్యర్థంకాబట్టి ప్రాణాలు కోసం హోమం చేసిన అగ్నిదే అవన్నాడు ప్రజాపతి. అగ్నిచేసిన హోమంవల్ల పుట్టిందికాబట్టి అప్పట్నుంచి ఆవుకు అగ్నిహోత్రమనే పేరేర్పడింది. ఇలా ఆవును అగ్ని హోత్రంగా ఉపాసించేవారికి అపమృత్యువుండదు (2.1.6).

2. ఆరణ్యకాండలోని మంత్రబ్రాహ్మణమే రెండో ప్రపాఠకం. ఇందులోగల పదుకొండు అనువాకాల్లో దశహోతృమంత్రప్రయోగవిధి, హోతృమంత్రప్రశంస, హోతృమంత్రాలకు సోమయాగాంగత్వం, జగత్సృష్టి కథనం, ఇంద్రుని దేవాధిపత్యం, లౌకికప్రయోజనసిద్ధికోసం హోతృమంత్ర ప్రయోగం మొ॥ ప్రతిపాదింపబడిన విషయాలు.

3. మూడో ప్రపాఠకంలో గల పదుకొండు అనువాకాల్లో సర్వహోతృ మంత్రాలకు చాతుర్హోతృశబ్దంతో వ్యవహారం, అధ్వర్యు ప్రభృతులకు గృహపతితో సంవాదం, అగ్నిహోత్రాది యాగాలకు ఋత్విగ్నిర్ణయం, అసురాదిసృష్టిదర్శనం, వాయురూపత్వవిజ్ఞానం మొదలైనవి చెప్పబడ్డాయి.

**మానవులెలా పుట్టారు?**

ప్రజాపతి సృష్టికి సంకల్పం చేశాడు. అసురులను (ప్రాణవాయువులో బలాధికులను) సృష్టించాడు. 'పిత' అనిపించుకున్నాడు. పితృదేవతలను

సృష్టించాడు. తరువాత ఇంకేం సృష్టించాలని మనసుతో ఆలోచించాడు. మనుష్యులను సృష్టించాడు. వాళ్లు లౌకిక-వైదిక వ్యవహారాలు మొదలు పెట్టారు. దాంతో అంతట కాంతి నిండి పోయింది. ఆ కాంతినమసరించి దేవతలను సృష్టించాడు. దేవతలు, మనుష్యులు, పితరులు, అసురులు అనే ఈ నాలుగురకాల సృష్టి అంతా జలంలాంటిది. నదీజలం, తటాకజలం ఎలా స్నానపానాదిరూపమైన భోగానికుపయోగపడుతుందో అలాగే ఈ సృష్టికూడా భోగానికుపయోగపడుతుంది (2.3.8).

4. నాలుగో ప్రపాఠకం ఏడు అనువాకాల్లో ఉపహోమ మంత్రాలను వివరిస్తుంది. చివరి అనువాకంలో అగ్రయణసూక్తం చెప్పబడింది.

కిలాసం : పలితం :

తెల్లబొల్లి మచ్చలు గల శరీరాన్ని కిలాసమని, తల నెరిసిపోవడాన్ని పలితమని అంటారు 'నీలి' అనే ఓషధి ఈ రెండు వ్యాధులను పోగొడుతుంది. పసుపుకూడ ఈ వ్యాధుల్ని పోగొడుతుంది. ఆ ఓషధిని అభిమంత్రిస్తూ చెప్పాల్సిన మంత్రాలు ఈ ప్రపాఠకంలో ఉన్నాయి. ఈ బొల్లి ఎన్ని రకాల ఏర్పడుతుందో, దాన్ని పోగొట్టే శక్తి 'నీలి' అనే ఓషధికి ఎలా వచ్చిందో ఇందులో చక్కగా చెప్పబడింది.

5. అయిదో ప్రపాఠకంలో ఎనిమిది అనువాకాలున్నాయి. వీటన్నింటిలోను ఉపహోమశేషమంత్రాలే ప్రతిపాదింపబడినాయి.

6. ఆరో ప్రపాఠకంలో ఇరవై అనువాకాలున్నాయి. సౌత్రామణియాగం, అందులోని గ్రహోపస్థానం, గ్రహహోమం, అభిషేకం, అవభృథం, హోతనుద్దేశించి మైత్రావరుణుడు చదవాల్సిన పదకొండు ప్రయాజ ప్రైషలు, అనుయాజ ప్రైషలు, సూక్తవాకప్రైషలు, పితృయజ్ఞ మంత్రాలు మొదలైనవి వీటిల్లో చెప్పబడ్డ విషయాలు.

7. ఏడో ప్రపాఠకంలో పద్దెనిమిది అనువాకాలున్నాయి. ఇందులో 'సవ' మనే పేరుగల ఏకాహాయజ్ఞాలు చెప్పబడ్డాయి. బృహస్పతి సవం, వైశ్యసవం, బ్రాహ్మణసవం, సోమసవం, పృథిసవం, గోసవం, ఓదనసవం, పంచశారదీయ విధి, అగ్నిష్టుత్, ఇంద్రస్తుత్, అప్తోర్యామవిధి, రాజాభిషేకవిధి, విఘనక్రతువు మొదలైనవి ఇందులో ప్రస్తావింపబడ్డాయి.

8. ఎనిమిదో ప్రపాఠకంలో గల తొమ్మిది అనువాకాల్లో కామ్య పశుయాగాలకు సంబంధించిన యాజ్యానువాక్యామంత్రాలు ప్రస్తావింప బడ్డాయి. వాయువ్యాది పశుసూక్తాలు, వశాది పశుసూక్తాలు సౌమ్యాది పశుసూక్తాలు, అభిమాతిషాహాగ్న్యాది పశుసూక్తాలు, ఐంద్రాగ్న పశ్వాదిసూక్తాలు, సావిత్రాదిపశుసూక్తాలు, సౌర్యాది పశుసూక్తాలు, వేహదాదిపశుసూక్తాలు, శుక్ల-కృష్ణ పశ్వాదిసూక్తాలు వీటిలోని విషయాలు.

**మూడవకాండ :**

ఈకాండలో పన్నెండు ప్రపాఠకాలున్నాయి. అందులో చివరి మూడు ప్రపాఠకాలకు కాఠకాలనిపేరు.

1. మొదటి ప్రపాఠకంలో ఆరు అనువాకాలున్నాయి. అందులో దేవనక్షత్రేష్టుల యాజ్యాపురోనువాక్యామంత్రాలు, యమ నక్షత్రేష్టుల యాజ్యాపురోనువాక్యామంత్రాలు, చాంద్రమసేష్టుల యాజ్యాపురోనువాక్యా మంత్రాలు, దేవనక్షత్రేష్టి విధులు, యమనక్షత్రేష్టి విధులు, చాంద్రమసేష్టి విధులు చెప్పబడ్డాయి.

**నక్షత్రాలు రెండురకాలు :**

దేవ-యమభేదంతో నక్షత్రాలు రెండురకాలు. కృత్తికనుంచి విశాఖవరకు గల పద్నాలుగు దేవనక్షత్రాలు. అనూరాధనుంచి భరణి వరకు

గల పదమూడు యమనక్షత్రాలు. ఈ నక్షత్రాల స్వరూప స్వభావాలు అధిష్ఠాన దేవతలు, ఫలాలు ఈ ప్రపాఠకంలో చక్కగా వివరించబడ్డాయి.

2. రెండో ప్రపాఠకంలో పది అనువాకాలున్నాయి. దర్శపూర్ణ మాసేష్టి ఇందులో ముఖ్యంగా నిరూపించబడింది. వత్సాపకరణవిధి, బర్హిస్సంబన్ధివిధి, దోహనసంబంధివిధి, నిర్వాపవిధి, కండనవిధి, ప్రేషణవిధి, కపాలసంబంధివిధి, పురోడాశసంబంధివిధి, వేదికాసంబంధివిధి, ఇధ్మాబర్హిస్సాదనవిధి ఇందులోని విషయాలు.

3. మూడో ప్రపాఠకంలోగల పదకొండు అనువాకాలు దర్శపూర్ణమాసేష్టినే వివరిస్తున్నాయి. స్రుక్సమ్మార్జనం, పత్నీసన్నహనం, ఆజ్యోత్పవనం, ఆజ్యగ్రహణం, పురోడాశం, ఇడాభక్షణం, ప్రస్తరప్రహరణం, పత్నీయోక్త్రవిమోచనం, ఉపవేషప్రహరణం మొదలైన విధులిందులో వివరింపబడ్డాయి.

4. నాలుగో ప్రపాఠకం మనుష్య పశుయాగాలను నిరూపిస్తున్నది. ఇందులో పందొమ్మిది అనువాకాలున్నాయి. మనుష్య పశువిధి, సూతాదితక్షాన్తపశువిధి, కౌలాలాదిశ్వనితాంతపశువిధి, జారాద్యమారుధాన్త పశువిధి, పౌంజిష్ఠాదికంటకకారాన్త పశువిధి, కుబ్జాది ప్రశ్నవివాకాన్త పశువిధి, స్తేన హృదయాదిరజయిత్ర్యన్త పశువిధి, దార్వాహారాది పరివేష్ట్రన్తపశువిధి, హస్తిపాద్యనుక్షత్రన్త పశువిధి, అయస్తాపాద్యన్వస్తపశువిధి, ఋతులాదివర్మమ్నాన్త పశువిధి, పౌలసాది ప్రచ్ఛిదాన్తపశువిధి, పూత్కల్యాది తలవాన్తపశువిధి, కితవాది గోలి కర్తన కర్తన్త పశువిధి, పురుషాది పురుషాన్త పశువిధి, అతిప్రాష్యాది కుమార్యన్తపశువిధి ఇందులో వివరింపబడ్డాయి. ఇక్కడ ఇచ్చిన వ్యక్తుల్లో సమాజంలో ఉన్న అన్ని వృత్తులవారు ఉన్నారు.

5. అయిదో ప్రపాఠకంలో గల పదమూడు అనువాకాలలో ఇష్టి హౌత్రమంత్రాలు ప్రధానంగా ప్రతిపాదింపబడ్డాయి. సామిధేనీ మంత్రాలు, ఋక్సంబంధి నివిత్, ఋక్సంబంధి ఆదావనమ్, ఆజ్యభాగలు, యాజ్యానువాక్యలు, ఇడాహ్వానం, అను సూక్తవాకం, శంయువాకం, పత్నీ సంయాజులు మొదలైనవి ఇందులోని విషయాలు.

6. ఆరో ప్రపాఠకం పాశుకహౌత్రాన్ని ప్రతిపాదిస్తున్నది. ఇందులో పదిహేను అనువాకాలున్నాయి. యూపసంస్కారం, ప్రయాజలకు సంబంధించిన మైత్రావరుణప్రైషలు, పర్యగ్నీకరణీయ ఋక్కులు, హోతను గురించి మైత్రావరుణప్రైష, వరుణుడు చెప్పిన పురోనువాక్యలు, వపాపురోడాశస్విష్టకృత్తుల యాజ్యలు, మనోతా సూక్తం మొదలైన విషయాలిందులో ఉన్నాయి.

7. ఏడో ప్రపాఠకంలోని పద్నాలుగు అనువాకాల్లో దర్శపూర్ణ మాసయాగానికి సంబంధించిన కొన్ని ప్రాయశ్చిత్తాలను మనం చూడవచ్చు. ఈ ప్రపాఠకానికి అచ్ఛిద్రమని పేరు. ఇందులో చెప్పబడ్డ మంత్రాలు యజ్ఞచ్ఛిద్రాలను పోగొట్టేవి కావడం దానికి కారణం. అగ్నిహోత్ర సాన్నాయ్యప్రాయశ్చిత్తాలు, పష్టికయాజమాన మంత్రాలు, దర్శపూర్ణమాసేష్టి మంత్రాలు, దీక్షాంగభూత మంత్రాలు, పశువిషయప్రాయశ్చిత్తాలు, అభిషవం, సౌమిక ప్రాయశ్చిత్తాలు, అవభృథవిశేషాలు ఇందులో నిరూపింపబడ్డాయి.

8. ఎనిమిదో ప్రపాఠకంలో అశ్వమేధయాగంలో మొదటి అహస్సు వివరింపబడింది. ఇది పెద్ద ప్రపాఠకం. ఇందులో ఇరవై మూడు అనువాకాలున్నాయి. సంగ్రహణేష్టి బ్రహ్మోదనం, అశ్వబంధనం, అశ్వప్రోక్షణం, దీక్ష. వైశ్వదేవహోమమంత్రాలు, దేవయజనప్రదేశంలో చేయాల్సిన మూడు ఇష్టులు, అన్నహోమం, యూపప్రయోగం మొ॥ నిరూపింపబడ్డాయి.

9. తొమ్మిదో ప్రపాఠకంలోకూడ ఇరవైమూడు అనువాకాలున్నాయి. ఇందులో అశ్వమేధయాగానికి సంబంధించిన రెండు మూడు అహస్సుల కార్యక్రమం వివరింపబడింది. చాతుర్మాస్యపశుప్రయోగం, అశ్వాలంకరణం, రథయోజనం, మృతాశ్వోపచారం, శరీరహోమం, బ్రహ్మోదనం, అశ్వమేధప్రశంస మొదలైన విషయాలున్నాయి.

10. పదోప్రపాఠకంలో సావిత్రచయనం చెప్పబడింది. ఇందులో పదకొండు అనువాకాలున్నాయి. మృత్యుగ్రహం, ధ్యానరూప సావిత్రాగ్ని విద్య, జనకోపాఖ్యానం, దేవభాగాఖ్యాయిక, ఇంద్ర భరద్వాజాఖ్యాయిక ఇలా ఎన్నో విశేషాలు ఇందులో నిరూపింపబడ్డాయి.

**వైదిక పరిభాషలు :**

సావిత్రచయనంలో కొన్ని వైదిక పరిభాషలిలా చెప్పబడ్డాయి - ప్రతినెలలో మొదటి పదిహేనురోజులు శుక్లపక్షం. పాడ్యమి మొ॥ తిథులుగల ఆ పగళ్లను వరుసగా వైదికులిలా పిలిచేవారు - 1.సంజ్ఞానం, 2.విజ్ఞానం, 3.ప్రజ్ఞానం, 4.జానత్, 5.అభిజానత్, 6.సంకల్పమానం, 7.ప్రకల్పమానం, 8.ఉపకల్ప మానం, 9.ఉపక్లప్తం, 10.క్లప్తం, 11.శ్రేయః, 12.వసీయ, 13.ఆయత్, 14.సంభూతం, 15.భూతం. శుక్లపక్షంలోని పదిహేను పగటిముహూర్తాలకు చిత్రః మొ॥ పేర్లున్నాయి. శుక్లపక్షంలోని రాత్రులపేర్లివి: 1.దర్శా, 2.దృష్టా 3.దర్శతా, 4.విశ్వరూపా, 5.సుదర్శనా. 6.ఆప్యాయమానా, 7.ప్యాయమానా, 8.ప్యాయా, 9.సూనృతా, 10.ఇరా, 11.ఆపూర్యమాణా, 12.పూర్యమాణా, 13.పూరయన్తీ, 14. పూర్ణా, 15.పౌర్ణమాసీ. శుక్లపక్షంలో పదిహేను రాత్రిముహూర్తాలకు దాతా, ప్రదాతా మొ॥ పేర్లున్నాయి. అలాగే కృష్ణపక్షంలోని పగళ్ళకు, రాత్రులకు, పగటిముహూర్తాలకు, రాత్రి ముహూర్తాలకు చైత్రాదిమాసాలకు వైదికుల పరిభాషలు ఈ ప్రపాఠకంలో దొరుకుతున్నాయి (3.10.1).

11. పదకొండో ప్రపాఠకంలో పది అనువాకాలున్నాయి. ఇందులో నచికేతాగ్నిచయనవిధి వివరింపబడింది. నచికేతాగ్నిదేవతోపాసన, ఉద్దాలకనచికేతుల ఆఖ్యాయిక, నచికేతాగ్ని చయన ప్రశంస ఈ ప్రపాఠకంలోని విషయాలు.

12. పన్నెండో ప్రపాఠకంలో గల అనువాకాలు తొమ్మిది. ఇందులో చాతుర్హోత్రాగ్నిచయనం, వైశ్వసృజాగ్నిచయనం ప్రతిపాదింపబడ్డాయి. దివఃశ్యేనాదీష్టి అపాద్యాశ్చేష్టి చాతుర్హోత్రచయనం ఇందులో నిరూపింపబడ్డ వైదికకర్మలు.

ఇలా తైత్తిరీయ బ్రాహ్మణం మూడుకాండల్లోను అనేక యజ్ఞయాగాల నిర్వహాణ ప్రకారం నిరూపింపబడింది. మధ్యమధ్యలో సందర్భాన్ననుసరించి ఇంకెన్నో లోకోపకారకాలైన విషయాలు కూడ అక్కడక్కడ ప్రస్తావించబడ్డాయి. వాటిని యథాతథంగా అర్థంచేసుకొని సంస్కారంతో జీవితాన్ని మలచుకోవడం, సమాజాభ్యుదయానికి మొదటిమెట్టు.

- జి.ఎస్.ఎస్.

# శతపథబ్రాహ్మణం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 2. విశేషవిభాగం

## 2.4 శతపథ బ్రాహ్మణం

### 2.4. 1 పరిచయం

శుక్ల యజుర్వేదానికి గల ఒకే ఒకబ్రాహ్మణం శతపథ బ్రాహ్మణం. నూరు అధ్యాయాలు గల గ్రంథం కాబట్టి దీనికి పేరు సార్థకమైంది (శతం పన్థానో మార్గాః అధ్యాయాః యస్య తచ్ఛతపథమ్). కాత్యాయముని భాషికసూత్రానికి భాష్యం వ్రాశాడు అనన్తదేవుడు. అందులో ఒకచోట (3-15) శతపథ శబ్దానికి నిర్వచనం చెబుతూ "శతపథశ్శ శతాధ్యాయైః" అంటాడు. మొత్తంమీద అధ్యాయపర్యాయంగా వాడబడిన 'పథ' శబ్దంతో బ్రాహ్మణ వాఙ్మయం మొత్తంలోనే ఈపేరు చాలా ముద్దుగా కుదిరింది[1].

1. ఈ శతపథబ్రాహ్మణాన్ని అనుసరించి వైదికకర్మకలాపాన్ని నిర్వహించే శుక్ల యజుర్వేదులకు పేరు చివర 'శతపథి' అని చేర్చడం కనపడుతుంది. ఆ పదం అలా అలా ఇంకెన్నో వికృతిరూపాలను కూడా పొందింది.

మాధ్యందిన - కాణ్వశాఖల భేదంవల్ల ఈబ్రాహ్మణం మాధ్యందిన శతపథబ్రాహ్మణం, కాణ్వశతపథబ్రాహ్మణమని రెండు విధాలుగా లభిస్తున్నది. కాండలు మొ॥ వాటి సంఖ్యలోను విషయనిరూపణ క్రమంలోను చిన్నచిన్న తేడాలు తప్ప ఈరెంటికి పెద్దగా తేడా లేదు. ఒక సమగ్రమైన బ్రాహ్మణంగా సాయణుడు మాధ్యందినశతపథానికి భాష్యంచేయడంలో అది వైదికలోకానికి బాగా అందుబాటులోకి వచ్చింది.

ఈ బ్రాహ్మణాన్ని యాజ్ఞవల్క్యమహర్షి తనవార్ధకదశలో రచించి ఉంటాడని విమర్శకుల ఊహ. దీన్నే వాజసనేయబ్రాహ్మణమని కూడా పిలుస్తారు.

- ఎస్.బి.ఆర్.

## 2.4.2 విభాగం

మాధ్యందిన శతపథబ్రాహ్మణాన్ని పద్నాలుగు కాండలుగా విభజిస్తారు. ప్రతికాండ కొన్ని ప్రపాఠకాలుగా విభజింపబడింది. ఈ బ్రాహ్మణంలో మొత్తం 68 ప్రపాఠకాలున్నాయి. ప్రపాఠకాలు అధ్యాయాలుగా విభజింపబడ్డాయి. పేరుకు తగినట్లు ఇందులో 100 అధ్యాయాలున్నాయి. ఈ అధ్యాయాలు మళ్లా 438 బ్రాహ్మణాలుగా వేఱు చేయబడ్డాయి. ప్రతిబ్రాహ్మణంలోను కొన్ని కండికలున్నాయి. శతపథబ్రాహ్మణంలో ఉన్న కండికలు మొత్తం 7624. విషయాన్ని బట్టి శతపథంలోని ప్రతిబ్రాహ్మణానికి సృష్టిబ్రాహ్మణం, సంభార బ్రాహ్మణం, నక్షత్రబ్రాహ్మణం, ఉద్గీథబ్రాహ్మణం మొ॥ పేర్లు ఏర్పడ్డాయి. వాటికి సంబంధించిన వివరాలన్నీ భాష్యంలో దొరుకుతున్నాయి. కాండలు మొ॥ వివరాలను కింది పట్టికలో చూడండి:

| మాధ్యందిన శతపథబ్రాహ్మణం | | | | |
|---|---|---|---|---|
| కాండలు | ప్రపాఠకాలు | అధ్యాయాలు | బ్రాహ్మణాలు | కండికలు |
| 1 | 7 | 9 | 37 | 837 |
| 2 | 5 | 6 | 24 | 549 |
| 3 | 7 | 9 | 37 | 859 |
| 4 | 5 | 6 | 39 | 648 |
| 5 | 4 | 5 | 25 | 471 |
| 6 | 5 | 8 | 27 | 530 |
| 7 | 4 | 5 | 12 | 398 |
| 8 | 4 | 7 | 27 | 437 |
| 9 | 4 | 5 | 15 | 402 |
| 10 | 4 | 6 | 31 | 369 |
| 11 | 4 | 8 | 42 | 437 |
| 12 | 4 | 9 | 29 | 459 |
| 13 | 4 | 8 | 43 | 432 |
| 14 | 7 | 9 | 50 | 796 |
| మొత్తం | 68 | 100 | 438 | 7624 |

కాణ్వశతపథ బ్రాహ్మణంలో 17 కాండలున్నాయి. వీటిని 104 అధ్యాయాలుగా విభాగం చేశారు. ఈ అధ్యాయాలను 435 బ్రాహ్మణాలుగా విభజించారు. వీటిల్లో మొత్తం 6806 కండికలున్నాయి. ఈ బ్రాహ్మణంలో ప్రపాఠకవిభాగంలేదు. చూడండి:

| కాణ్వశతపథబ్రాహ్మణం | | | |
|---|---|---|---|
| కాండలు | అధ్యాయాలు | బ్రాహ్మణాలు | కండికలు |
| 1 | 6 | 22 | 376 |
| 2 | 8 | 32 | 532 |
| 3 | 2 | 22 | 124 |
| 4 | 9 | 36 | 649 |
| 5 | 8 | 38 | 974 |
| 6 | 2 | 7 | 700 |
| 7 | 5 | 19 | 289 |
| 8 | 8 | 27 | 511 |
| 9 | 5 | 16 | 257 |
| 10 | 5 | 20 | 243 |
| 11 | 7 | 20 | 437 |
| 12 | 6 | 28 | 286 |
| 13 | 8 | 31 | 241 |
| 14 | 9 | 28 | 392 |
| 15 | 8 | 44 | 308 |
| 16 | 2 | 8 | 192 |
| 17 | 6 | 47 | 295 |
| మొత్తం | 104 | 435 | 6806 |

విషయ విభాగం :

మాధ్యందినశతపథబ్రాహ్మణం మొదటినుంచి తొమ్మిదోకాండ వరకు మాధ్యందినసంహితాక్రమాన్నే అనుసరిస్తుంది. ఒక్క పిండపితృయజ్ఞంలోనే రెంటికీ తేడా కనబడుతున్నది. దర్శపూర్ణమాసయాగాన్ని నిరూపించి పిండ

పితృయజ్ఞాన్ని సంహిత పేర్కొంటుంటే ఆధానంచేసిన వెంటనే పిండపితృ యజ్ఞాన్ని బ్రాహ్మణం నిరూపిస్తున్నది. మిగతాకాండల్లో దాదాపు సంహితా క్రమమే అనుసరింపబడింది.

కాణ్వ మాధ్యందినసంహితలు మొదట దర్శపూర్ణమాసయాగాన్ని చెబుతున్నాయి. మాధ్యందిన శతపథబ్రాహ్మణం సంహిత ననుసరించి మొదట దర్శపూర్ణమాసయాగాన్ని ప్రతిపాదిస్తుండగా కాణ్వశతపథం మాత్రం ఆధానంతో ప్రారంభమవుతున్నది. మిగతా విషయాలలో రెండు బ్రాహ్మణాలు ఇంచుమించుగా ఒకటిగానే ఉన్నాయి. అక్కడక్కడ చిన్నచిన్న తేడాలున్నా మొత్తంమీద విషయవిభాగం స్థూలంగా ఒకటిగానే కనిపిస్తున్నది.

దర్శపూర్ణమాసయాగం, ఆధానం, పిండపితృయజ్ఞం, సోమయాగం, వాజపేయం, రాజసూయం, ఉఖాసంభరణం, చయనం, దీక్షాక్రమం, సౌత్రామణి, అశ్వమేధం, ప్రవర్గ్య, బ్రహ్మవిద్య ఇవి శతపథబ్రాహ్మణంలో ప్రతిపాదింపబడ్డ విషయాలు.

మొదలు - చివర:

ఈ బ్రాహ్మణం "వ్రతముపైష్యన్నంతరేణాహవనీయం" అనే మంత్రంతో ప్రారంభమై 'ఆదిత్యానీమాని శుక్లాని యజూంషి' అనే దానితో పూర్తవుతున్నది.

- ఎస్.బి.ఆర్.

### 2.4.3 సంకలనకాలం

దేశం:

వైదికధర్మానికి యజ్ఞయాగాదికర్మలకు పుట్టినిల్లైన కురు పాంచాలదేశాల్లోనే శతపథబ్రాహ్మణం ఏర్పడి ఉంటుందనుకోవడానికి అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. ఈ బ్రాహ్మణంలో జనమేజయుడు కురురాజుగా పిలువబడుతున్నాడు. మహాయాజ్ఞికుడైన ఆరుణి పాంచాలదేశీయుడు. ఇతని శిష్యుడే యాజ్ఞవల్క్యుడు. కాని ఈ బ్రాహ్మణం ఆరోజుల్లోనే కోసలవిదేహదేశాల్లో గొప్పప్రచారాన్ని పొందింది. మిథిలానగరం రాజధానిగా విదేహదేశాన్ని పరిపాలించిన జనకుని ఆస్థానంలో సభాపతి ఈ యాజ్ఞవల్క్యుడు. రాజర్షి జనకుని సభ ఆధ్యాత్మవిద్యలో నిష్ణాతులైన బ్రహ్మర్షులతో కళకళలాడుతుండేది.

కాలం:

ప్రాచీనవైదికులు ఈసృష్టి వేదాలనాధారంగా పెట్టుకొని చేయబడింది కాబట్టి ఇవి సృష్టికంటే ముందే ఉండి ఉంటాయని ఊహించారు. కాని ఆధునిక విమర్శకులు దీన్ని అంగీకరించలేదు. వారిదృష్టిలో బ్రాహ్మణవాఙ్మయం రచింపబడింది. క్రీ.పూ. 800 నుంచి 500 సం॥ మధ్యకాలంలో బ్రాహ్మణ వాఙ్మయం ఏర్పడిందని వారి విశ్వాసం. అందులో ఇతర బ్రాహ్మణాలకంటే శతపథ బ్రాహ్మణం కొంచెం నవీనమైంది కాబట్టి అది క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఏర్పడి ఉంటుందని ఊహింపబడుతోంది. కాని ఈకాలనిర్ణయం చాలా కృత్రిమంగా కనబడుతున్నదని వైదికమార్గాన్ని అనుసరించేవాళ్లు దీన్ని ఏమాత్రం అంగీకరించరు.

- ఎస్.బి.ఆర్.

## 2.4.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

### వ్యాఖ్యానాలు:

మాధ్యందినశతపథబ్రాహ్మణానికి హరిస్వామి వ్రాసిన "శ్రుత్యర్థ వివృతి" అనే భాష్యం చాలా ప్రాచీనమైంది. అవన్తిదేశానికి ఉజ్జయిని రాజధాని. దాన్ని పరిపాలించిన విక్రమార్కమహారాజు ఆస్థానంలో ధర్మాధ్యక్షుడుగా దానాధ్యక్షుడుగా హరిస్వామి ఉన్నట్లు అతని భాష్యంద్వారా తెలుస్తున్నది. దీన్ని బట్టి ఇతడు క్రీ.పూ. 55 వ సం॥ ప్రాంతంలో ఈభాష్యాన్ని రచించి ఉండవచ్చునని కొందరి ఊహ. ఇతని తండ్రి నాగస్వామి. అన్ని విద్యలలో ఆరితేరిన హరిస్వామికి "సర్వవిద్యానిధానకవీంద్రాచార్య సరస్వతి" అనే బిరుదం కూడా ఉన్నది. ఇతని భాష్యం సమగ్రంగా దొరకడంలేదు. దొరికినంతవరకు చూస్తే అది చాలా గంభీరమైందిగా కనపడుతుంది.

ఈ బ్రాహ్మణానికి సమగ్రమైన భాష్యం సాయణభాష్యం. సంహితలకు భాష్యం వ్రాసిన తరువాత అన్ని విధాలా సంపూర్ణమైన బ్రాహ్మణానికి భాష్యం వ్రాయాలనే సంకల్పంతో ఈ మాధ్యన్దినశత పథబ్రాహ్మణానికి తాను భాష్యం వ్రాసినట్లు సాయణుడు తన ఉపోద్ఘాతంలో పేర్కొన్నాడు.1

ధారానగరంలో ఆనందరాయమహారాజు కాలంలో (1868) దానాధ్యక్షుడుగా ఉన్న శ్రీగణేశశాస్త్రి పాఠక్ ఈ బ్రాహ్మణానికి 'స్వరప్రకాశం' అనే భాష్యాన్ని వ్రాశాడు. ఇది ఇంతవరకు వెలుగు చూడలేదు. దీని వ్రాతప్రతి ధారానగరంలోనే ఈయన మనుమడు శ్రీముకుందపాఠక్ దగ్గర ఉన్నట్లు, శ్రీధరశర్మ 1940లో శతపథబ్రాహ్మణోపోద్ఘాతంలో వ్రాస్తున్నారు.

---

1. సర్వతః సాయణాచార్యో విమృశ్యోదీరితాన్ గుణాన్।
   మాధ్యన్దినే శతపథే బ్రాహ్మణే వ్యాకరోతి తత్॥

కాణ్వశతపథబ్రాహ్మణానికి ప్రసిద్ధమైన భాష్యాలు లేవు. కాని మహాభారతానికి వ్యాఖ్యానం వ్రాసిన నీలకంఠుడు దీనికొక భాష్యం వ్రాసినట్లు నీలకంఠి వ్యాఖ్యద్వారా తెలుస్తున్నది.[1]

ప్రచురణలు:

ఈ బ్రాహ్మణాన్ని మొట్టమొదట లండన్‌లో 1885లో ఎ.వెబర్ (A.Weber)సాయణభాష్యంతో ప్రచురించాడు. తరువాత అజ్మీర్‌లో 1902లో ఈ బ్రాహ్మణం ప్రకటింపబడింది. ఏషియాటిక్ సొసైటిద్వారా కలకత్తాలో సత్యవ్రతసామశ్రమి సాయణభాష్యంతో కూడా ఈబ్రాహ్మణాన్ని 1905లో ప్రకటించాడు. సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్ (SBE) అనే గ్రంథమాలలో 12,26,41,43,44 సంపుటాలుగా శతపథబ్రాహ్మణానికి ప్రొ॥ ఎగ్గెలింగ్ తన ఆంగ్లానువాదాన్ని ప్రకటించాడు. 1926లో లాహోర్‌నుంచి బెనారస్‌నుంచి కూడ శతపథబ్రాహ్మణం వెలువడింది. అందులో లాహోరు ప్రచురణ డబ్ల్యు.కాలండ్ (W. Caland) సంపాదించింది. అలాగే 1937లో కాశీ అచ్యుతగ్రంథమాల ద్వారా విద్యాధరశర్మ, చంద్రధరశర్మల సంపాదకత్వంలోను, శ్రీ చిన్నస్వామిశాస్త్రి, శ్రీ పట్టాభిరామశాస్త్రుల సంపాదకత్వంలో చౌఖంబా సంస్కృత సీరీస్‌ద్వారాను ఈబ్రాహ్మణం ప్రచురింపబడింది. తరువాత భారతదేశంలో బొంబాయిలో శ్రీధరశర్మ సంపాదకత్వంలో గంగావిష్ణు శ్రీకృష్ణదాస్ 1940లో ఈ బ్రాహ్మణాన్ని ఐదుభాగాల్లో సాయణభాష్యంతో ప్రకటించాడు.

- ఎస్.బి.ఆర్.

---

1. "సూర్యామాసా విచరతో దివీతి" మంత్రవర్ణాత్. సూర్యామాసా సూర్యచంద్రమసావిత్యర్థః. నిపుణతరముపపాదిత మేతదస్మాభిః కాణ్వశతపథభాష్యే ఏకపాదికా కాండే.

## 2.4.5 ప్రసిద్ధి

బ్రాహ్మణవాఙ్మయంలో శతపథబ్రాహ్మణానికి గల స్థానం అద్వితీయం. సర్వాంగసుందరంగా తీర్చిదిద్దబడి ఉండటంవల్లనే దీనికి అంత పేరు ప్రసిద్ధి ఏర్పడింది. ఈ బ్రాహ్మణాన్ని చక్కగా అధ్యయనం చేసినవాడు యజ్ఞవిద్యలోను, బ్రహ్మవిద్యలోను కుశలుడై మంచిపండితుడుగా పేర్కొనబడేవాడు. అతడికి వైదికజ్ఞానం, ప్రాచీనేతిహాసజ్ఞానం కరతలామలక మౌతుంది. అందువల్లనే అరివీర భయంకరుడై వైదికధర్మ సంరక్షకుడైన హరిహరరాయలు యజ్ఞవిధిని పూర్తిగా వర్ణించే గ్రంథానికొకదానికి వ్యాఖ్యానం చేయమన్నప్పుడు మాధ్యన్దినశతపథబ్రాహ్మణానికి సాయణుడు వ్యాఖ్యానం చేస్తాడు. దీనివల్ల సంహితల తరువాత సమున్నతస్థానాన్ని ఆక్రమించగల అర్హతగల గ్రంథంగా శతపథబ్రాహ్మణానికి ఆనాటికే ప్రసిద్ధి ఉన్నట్లు తెలుస్తుంది.[1]

ఈ బ్రాహ్మణంలో అమూల్యమైన తత్త్వాలెన్నో ప్రతిపాదింపబడి దీనికెంతో ప్రసిద్ధిని సంపాదించాయి. మచ్చుకు ఒకటి రెండు ఇక్కడ ప్రస్తావిస్తాము -

1. ఋగ్యజుస్సామశాఖానామేకైకా వ్యాకృతా త్వయా ।
   తావతా తత్సమానార్థా జ్ఞాతుం శక్యాస్తతః పరాః ॥
   వాసనా విశదా యత్ర మంత్రార్థానామశేషతః ।
   ప్రాయేణాధ్వర్యవం కర్మ పూర్ణం శాఖాన్తరైర్వినా ॥
   కరామలకవద్యత్ర పరం తత్త్వం ప్రకాశితమ్ ।
   యా కాచిత్తాదృశీ శాఖా త్వయా వ్యాఖ్యాయతామితి ॥
   పర్వతః సాయణాచార్యో విమృశ్యోదీరితాన్ గుణాన్ ।
   మాధ్యన్దినే శతపథే బ్రాహ్మణే వ్యాకరోతి తత్ ॥

"అబద్ధాలాడటంవల్ల మానవుడు అపవిత్రుడౌతున్నాడు. జలం చాలా పవిత్రమైంది. కాబట్టి ముందు నీళ్లను తాకి (ఉపస్పర్శనం) పవిత్రుడై ఏదైనా నియమనిష్ఠలను పాటించాలి".[1]

ఇక్కడ మానవజాతి స్వభావం, పవిత్రతను సంపాదించడానికి మార్గం, పవిత్రతలేకుండా ఏనియమం ఫలించలేదనే ఉపదేశం మనకు లభిస్తున్నాయి. ఇంకొకటి చూడండి:

భార్య భర్తలో సగభాగం. ఆమెను పొందేవఱకు అతడు సంతానాన్ని కనలేడు. అసంపూర్ణుడే అవుతాడు. భార్యను, ఆమెద్వారా సంతానాన్ని పొందిన భర్త పరిపూర్ణతను సాధిస్తాడు.[2]

పురుషుని వ్యక్తిత్వం అసంపూర్ణమైంది. వివాహితుడై రెండో సగమైన స్త్రీతో కలిసి సంతానాన్ని పొందినప్పుడే అతడు నిండుమనిషి అవుతాడనేది నిత్యసత్యం. సమాజ కళ్యాణంకోసం స్త్రీకి సముచిత స్థానాన్నివ్వాలనే సందేశం ఇందులో మనకు దొరుకుతుంది.

ఇలా ఇంకెన్నో విశేషాలు శతపథంలో చోటు చేసుకొని దీనికి చక్కని ప్రసిద్ధిని సంపాదించాయి.

\- ఎస్.బి.ఆర్.

---

1. తద్యదప ఉపస్పృశతి, అమేధ్యో వై పురుషో యదనృతం వదతి. తేన పూతిరన్తరతః, మేధ్యా వా ఆపః, మేధ్యో భూత్వా వ్రతముపాయానీతి, తస్మాద్వా అప ఉపస్పృశతి 1.1.1.1.
2. అర్ధో హ వా ఏష ఆత్మనో యజ్జాయా, తస్మాద్యావజ్జాయాం న విన్దతే నైవ తావత్ ప్రజాయతే. అసర్వో హి తావద్భవతి. అథ యదైవ జాయాం విన్దతే అథ ప్రజాయతే, తర్హి హి సర్వో భవతి, సర్వ ఏతాం గతిం గచ్ఛానీతి. 5.2.1.10

## 2.4.6 యజ్ఞయాగాలు

వేదమనే పదం వినగానే మనకు యజ్ఞయాగాలు గుర్తుకొస్తాయి. వేదాలలో; అంటే విశేషంగా బ్రాహ్మణాలలో యజ్ఞయాగస్వరూపం విశేషంగా వివరింపబడింది. యజ్ఞం భారతీయసంస్కృతికి ప్రతీక.

దేవతలనుద్దేశించి త్యాగంచేసే ద్రవ్యానికి హవిస్సని పేరు. అగ్నిలో హోమంచేయుడంద్వారా అది దేవతలకు చేరుతుంది. అందుకనే అగ్నికి హవ్యవాహనుడని పేరు. యజ్ఞానికి అధ్వరం, ఇజ్య, ఇష్టి క్రతువు, మఖం, మేధం, యాగం, సవం, హవనం అనేవి పర్యాయపదాలు.

ప్రకృతి సృజనశక్తియే యజ్ఞం కాబట్టి యజ్ఞం సృష్టికర్తయైన ప్రజాపతికి ప్రతీకగా అభిన్నంగా పరిగణించబడింది. ప్రజాపతే యజ్ఞమని శతపథబ్రాహ్మణంలో చాలాసార్లు చెప్పబడింది (14-3,2,1; 3-6,3,1). సమస్త ప్రాణుల ఆత్మ, సకల దేవతల స్వరూపం యజ్ఞం. ఎవడు యజ్ఞంకోసం ఆత్మత్యాగం చేస్తాడో అతడు అందరి కోసం ఆత్మత్యాగం చేసినట్లవుతుంది. యజ్ఞం-ఋతం, సత్యం అనికూడా కీర్తించబడింది.

### యజ్ఞాలెన్ని రకాలు?

హవిస్సునుబట్టి యజ్ఞం మూడు విధాలు. 1. ఇష్టి (పిండి ప్రధానహవ్యంగా గలది) 2. పశుబంధం (పశువు హవ్యంగా గలది) 3.సోమయాగం (సోమరసం హవ్యంగా గలది). ఆచరణను బట్టి యజ్ఞం మూడు విధాలు. 1. నిత్యం (ప్రతిదినం చేసే యాగం) 2. నైమిత్తికం (ఆయా సందర్భాల్లో చేయబడే యాగం) 3. కామ్యం (ప్రతిఫలాన్ని ఆశించి చేసే యాగం). ప్రసిద్ధిని బట్టి యజ్ఞం రెండు విధాలు. 1. ప్రకృతి, 2. వికృతి. ఆదర్శమైంది. ఉపాదానకారణమైంది ప్రకృతియాగం. ఇష్టులకు

దర్శపూర్ణమాసలు, పశుబంధాలకు నిరూఢపశుబంధం, సోమయాగాలకు అగ్నిష్టోమం ప్రకృతియాగాలు. ప్రకృతిని అనుసరించి చేసే యాగాలు వికృతులు. వాజపేయం, రాజసూయం మొ॥ సోమయాగం యొక్క వికృతులు.

సోమయాగాలు ఆచరించే కాలాన్ని బట్టి మూడు విధాలు. 1.ఏకాహం, 2.అహీనం, 3.సత్రం. దీక్ష మొదలుకొని అవభృథం దాకా గల కర్మలన్నీ ఒకేరోజు పూర్తిచేస్తే అది ఏకాహం. బృహస్పతి సవం, సోమసవం, అప్తోర్యామం మొదలైనవి ఏకాహాలు. రెండు నుంచి పన్నెండు రోజుల లోపల ముగిసే యాగం అహీనం. రాజసూయం, అశ్వమేధం, పురుషమేధం మొ॥ అహీనాలు. యాగకలాపం పన్నెండు రోజులకంటే ఎక్కువగా ఉంటే అది సత్రం. ఇది చాలా యాగాల పరంపర. గవామయనం సత్రయాగం.

**అగ్న్యాధానం (2.1-2):**

బ్రహ్మచర్యాశ్రమానంతరం పురుషుడు వివాహితుడై గృహస్థాశ్రమాన్ని స్వీకరించి యజ్ఞాలను చేయాలి. గృహస్థుడు ఆధానంతో యజ్ఞాలను ప్రారంభించాలి. బ్రాహ్మణులు వసంత ఋతువులో, క్షత్రియులు గ్రీష్మంలో, వైశ్యులు శరత్తులో, రథకారులు వర్షర్తువులో అగ్న్యాధానం చేయాలి.

యజ్ఞనిర్వహణకు పవిత్రాగ్నులు అవసరం. అవి ఆహవనీయం, గార్హపత్యం, దక్షిణాగ్ని. ఈ త్రేతాగ్నులున్న ప్రదేశానికి 'దార్శికవేది' అని పేరు. ఈ త్రేతాగ్నులను ఉపచరించటమే ఆధానం. గృహస్థుడు నిత్యం గార్హపత్యాగ్నిని అర్చించాలి. ఆయా యాగవిధుల ననుసరించి గార్హపత్యాగ్నినే ఆహవనీయ, దక్షిణాగ్నికుండాలలో పంచిపెట్టాలి. అన్ని హోమాలు సాధారణంగా ఆహవనీయాగ్నిలోనే జరుగుతాయి.

**అగ్నిహోత్రం (2-2):**

ప్రతినిత్యం ఉదయ-సాయంసంధ్యాకాలాల్లో చేయవలసిన యాగం అగ్నిహోత్రం. దీన్ని ఆహితాగ్ని భార్యతోపాటు చేయాలి. పాలు, నెయ్యి మొ॥ హవిస్సులు. గృహస్థు జీవితపర్యంతం లేక వృద్ధాప్యంవరకు చేసే సత్రయాగ మిది (2.2.3.1).

**దర్శపూర్ణమాసేష్టి (1-9):**

పురోడాశం ప్రధానహవ్యంగా కలది ఇష్టి. పురోడాశమంటే బియ్యపు పిండితో కుండపెంకులో కాల్చిన అప్పం. ఇష్టిని చేయుటానికి అధ్వర్యుడు, హోత, బ్రహ్మ, ఆగ్నీధ్రుడు అనే నలుగురు ఋత్విక్కులు కావాలి.

ఇష్టికార్యకలాపం:- హవిస్సును తయారుచేయుటం, సామిధేని కర్మ (పవిత్రాగ్నులను ప్రజ్వలింపజేయుటం), సాధారణోపచారం, పురోడాశాన్ని హోమంచేయడం, స్విష్టకృత్ హోమం, హవిశ్శేషం-ఇడను గ్రహించడం, పత్నీసంయాజం మొదలైనవి.

దర్శేష్టి అమావాస్యనాడు, పూర్ణమాసేష్టి పౌర్ణమినాడు చేయాలి (1-1-11). ఇవి ప్రకృతికర్మలు. ఇతర ఇష్టులకు ఆదర్శంగా ఉన్నాయి. ఇష్టులలో ఆగ్రయణేష్టి మొ॥ కొన్ని స్వతంత్రమైనవి. కొన్ని అంగకర్మలు. ఇవి ఇతర యాగాలలో అంగాలుగా ఉంటాయి. ప్రాయణీయేష్టి మొదలైనవి. ఇది సోమయాగానికి అంగకర్మ.

**చాతుర్మాస్యలు (2-4-2, 2-5-5):**

ఒక సంవత్సరంలో అప్పుడప్పుడు పౌర్ణమినాడు చేసే వైశ్వదేవం మొ॥ నాలుగు యాగాలకు "చాతుర్మాస్య"లని పేరు.

1. వైశ్వదేవాన్ని ఇష్టిలాగా వసంతర్తువులో చేయాలి. హవ్యాలు చరుపురోడాశాలు, ఆమిక్ష (పాలవిరుగుడు) మొ॥.

2. వరుణప్రఘాసను వర్షర్తువులో చేయాలి. ఇందులో పశుబలి ఉంది. కాబట్టి అర్గురు ఋత్విక్కులు కావాలి. పశుబలి 'దార్శికీవేది'కి దక్షిణంగా నిర్మించబడ్డ వేదిపై జరుగుతుంది. ఇందులో యజమాని పత్నిని మంత్రాలతో పరిశుద్ధిచేయటం ఆసక్తికరమైన అంశం. వరుణుడు ప్రధానదేవత.

3. సాకమేధం శరత్కాలంలో చేయాలి. ఇందులో అనీకవతి మొ॥ నాలుగు భాగాలున్నాయి. రుద్రత్ర్యంబకుడు ప్రధాన దేవత.

4. ఇది ముగిసిన వెంటనే 'శునాసీరీయ' యాగం చేయాలి. ఇది నాల్గవ యాగం.

**సోమయాగం - అగ్నిష్టోమం (3,4 కాండలు):**

సోమయాగం 'దీక్షణీయేష్టి'తో ప్రారంభమవుతుంది. యజమాని యజ్ఞనిర్వహణానికి దీనితో దీక్ష వహిస్తాడు. మరునాడు 'ప్రాయణీయేష్టి' చేయబడుతుంది. సోమలతను యాగశాలకు ఊరేగింపుగా తీసికొస్తారు. సోమలత గౌరవార్థం 'ఆతిథ్యేష్టి' జరుగుతుంది. ఇష్టి ముగిసిన తరువాత 'తానూనప్త్రం' జరుగుతుంది. ఋత్విక్కులు, యజమాని పరస్పరసహకారానికీ, ఐకమత్యానికి గుర్తుగా పాత్రలోని నేతిని స్పృశిస్తారు. ఈ కార్యక్రమమంతా 'దార్శికీవేది' పైన జరుగుతుంది.

మూడో రోజున ప్రవర్గ్య, ఉపసత్ అనే యాగాలు చేయబడతాయి. వీటితోపాటు 'సుబ్రహ్మణ్యాహ్వానం' జరుగుతుంది. ఇది ఇంద్రుని ఆహ్వానించే కార్యం. నాల్గో రోజు మహావేది నిర్మించబడుతుంది. అయిదో రోజు మొదటి

పశుయాగం చేయబడుతుంది. ఇదంతా పూర్వరంగం. ఆరో రోజు సోమయాగం ప్రారంభమవుతుంది.

ప్రాతఃకాలంలో హోత ప్రాతరనువాకాన్ని బహిష్పవమాన, ఆజ్యస్తోత్రాలను పఠిస్తాడు. పెరుగుతో కొన్ని హోమాలు చేసిన తరువాత, అధ్వర్యుడు, ప్రతిప్రస్థాత, ఉన్నేత, హోత సోమలతను రాతితో నలగ్గొట్టి సోమరసాన్ని తయారుచేస్తారు. దీనిని 'మహాభిషవ' మంటారు. సోమరసం దేవతలకు అర్పించబడుతుంది. దీనితో ఉదయకార్యక్రమం ముగుస్తుంది.

మధ్యాహ్నం మాధ్యందిన పవమాన, పృష్ఠస్తోత్రాలు పఠించబడతాయి. ఋత్విక్కులు సోమరసాన్ని తయారుచేస్తారు. 'గ్రావస్తుత్' ఒత్తుడురాళ్లను స్తుతిస్తాడు.

సాయంకాలం తృతీయపవమాన, అగ్నిస్తోమ సామలు పఠించ బడతాయి. ఈ అగ్నిస్తుతిచేతనే ఈ యాగానికి 'అగ్నిష్టోమం' అనే పేరు కలిగింది. అగ్నిస్తుతిలో ఋగ్వేదంలోని 'యజ్ఞా యజ్ఞా వో అగ్నయే: ఊర్జో న పాతం' అనే సూక్తాలు (6-48-1,2) గానం చేయబడతాయి. ఈ కార్యక్రమమంతా రాత్రి రెండవజాముకు ముగుస్తుంది. ఋత్విక్కులందరు 'ఆగ్నీధ్రీయ' ఆవరణలో పెరుగును పంచుకొంటారు. దీనితో 'తానూనప్త్రం' వల్ల ఏర్పడ్డ బాధ్యత నెరవేరుతుంది.

మర్నాడు అవభృథం జరుగుతుంది. యజమాని, పత్ని, ఋత్విక్కులు ఊరేగింపుగా నదికి వెడతారు. అందరు స్నానం చేస్తారు. అంతటితో యజ్ఞదీక్ష ముగుస్తుంది. నీళ్లలో 'అవభృథేష్టి' జరుగుతుంది. అందరు యాగశాలకు వచ్చిన తరువాత 'ఉదయనీయేష్టి' జరుగుతుంది. ఇలా సోమయాగం సమాప్తమవుతుంది.

ఈ కలాపమంతా అగ్నిష్టోమమనబడే సోమయాగానికి చెందింది. ఇది ఏకాహం. అగ్నిష్టోమం ప్రకృతియాగం. ఇది సోమయాగాలన్నింటికీ ఆదర్శం. సోమయాగాలు ఏడు ఉన్నాయి. 1.అగ్నిష్టోమం, 2.ఉక్థ్యం, 3.షోడశి 4.అతిరాత్రం, 5.అత్యగ్నిష్టోమం 6.వాజపేయం, 7.అప్తోర్యామం.

**వాజపేయం (5-1):**

వాజపేయం అగ్నిష్టోమానికి వికృతియాగం. ఇందులో 17 దీక్షాదినాలు, మూడు ఉపసత్‌లు, ఒకరోజు సోమయాగం (సుత్యాహం) ఉంటుంది. సవనీయపశువులు 17 ప్రజాపతికి బలి యివ్వబడతాయి. అగ్నిసోములకు, ఇంద్రునకు, సరస్వతికి పశువులు సమర్పించబడతాయి. ఇందులో సప్తదశస్తోమం బృహత్స్వరంతో పఠించబడుతుంది. ఇది ఈ యాగానికి ఒక ప్రత్యేక లక్షణం: తరువాత వాజపేయశస్త్రం పఠించబడుతుంది. వాజపేయం సమ్రాట్ సవంగా, బలవర్ధకక్రతువుగా కీర్తించబడింది.

వాజపేయంలో చాలా ఆసక్తికరమైన అంశం పదిహేడు రథాల పరుగుపందెం. ఇందులో యజమాని పాల్గొని విజయం పొందుతాడు. యజమాని భార్యతో కలసి సూర్యునికి ప్రతీకగా ఉన్న విజయస్తంభాన్ని అధిరోహిస్తాడు. ఇది స్వర్గారోహణంగా భావించబడుతుంది. ఈ సందర్భంలో యజమాని, భార్య అర్ధాంగి కాబట్టి ఆమె అనుమతితో 'భార్యతో కలసి సంపూర్ణపురుషుడినై ఈ మార్గం గుండా స్వర్గాన్ని అధిరోహిస్తా"నని తెలుపుతాడు (5-2,1,10). ఈ సన్నివేశం నాటి సంఘంలో స్త్రీకి గల గౌరవస్థానాన్ని తెలియజేస్తుంది.

**అగ్నిచయనం (6-10):**

సోమయాగంలో ఆహవనీయాగ్నికుండం నలుచదరంగా ఉంటుంది. దీనికే ఒక నమూనాలో నిర్మించిన 'చితి' అనిపేరు. ఈ కార్యక్రమానికి

'చయనం' అనిపేరు. ఇందుకు సంబంధించిన సోమయాగం 'సాగ్నిచిత్ సోమయాగ' మనబడుతుంది.

యజమాని పౌర్ణమినాడో లేక అమావాస్యనాడో చయన యాగం చేయటానికి ఒక సంవత్సరం ముందుగా సంకల్పిస్తాడు. ఆరోజు కొన్ని హోమాలు, సంస్కారాలు చేసిన తరువాత యజమాని మట్టితో ఒక కుండను తయారుచేస్తాడు. దీనిని 'ఉఖా' అంటారు. ఒకనెల తరువాత వాయుదేవత గొరవార్థం పశుయాగం చేయబడుతుంది. అగ్నివేది నిర్మించటానికి కావలసిన ఇటుకలను తయారు చేస్తారు. సోమయాగం చైత్రపౌర్ణమినాడు జరిపేటట్లుగా ఈ అగ్నివేది నిర్మాణం ప్రారంభించబడుతుంది.

యజమాని 'దీక్షణీయేష్టి' స్వగృహంలో చేసి యజ్ఞదీక్షను తీసుకుంటాడు. ఉఖా అనే పాత్రను గడ్డితో నింపి ఆహవనీయాగ్నిలో కాలుస్తారు. యజమాని ఉఖను తీసుకొని తూర్పుకు నాలుగడుగులు నడుస్తాడు. దీనిని 'విష్ణుక్రమణం' అంటారు. తరువాత మరికొన్ని హోమాలు చేస్తాడు. చివరిరోజున విష్ణుక్రమణ ఉపస్థానాలు చేసి, యజమాని స్వగృహంనుంచి చయనయాగం చేయటానికి నిర్ణయించుకొన్న యాగశాలకు వెడతాడు. యజమాని తనతో ఉఖాగ్ని, గార్హపత్య, దక్షిణాగ్నులను తీసికొని వెడతాడు.

ఇక్కడ సోమయాగం చేసినట్లు 'ప్రాయణీయేష్టి' మొదలైన ఇష్టులు, ప్రవర్గ్య, ఉపసత్ చేయబడతాయి. ఇలా అయిదురోజులు జరుగుతాయి. ఈ అయిదురోజులలో ఉత్తరవేదినిర్మాణం జరుగుతుంది. ఈ నిర్మాణ సామగ్రిని ఊరేగింపుగా తీసుకొని వస్తారు. ఊరేగింపుకు ముందు తెల్ల గుఱ్ఱం నడుస్తుంది. 10,800 ఇటుకలతో ఉత్తరవేదినిర్మాణం వివిధ ఆకారాలలో చేయబడుతుంది. మనిషి బంగారు ప్రతిమ, జీవించి ఉన్న తాబేలు, శంకుస్థాపనలో ఉంచబడుతుంది. ఇవి ఉత్తరవేది వివిధరూపాలు -

1.శ్యేనచిత్ (రెక్కలు విప్పుకొన్న డేగ), 2. కంకచిత్ (క్రౌంచపక్షి), 3.ప్రౌగచిత్ (త్రికోణం), 4.ఉభయతః ప్రౌగచిత్ (తుల్యచతుర్భుజం), 5. రథచక్రచిత్ (16 ఆకులుగల రథచక్రం), 6.ద్రోణచిత్ (పిడితోనున్న పాత్ర), 7.పరిచాయ్య (కేంద్రీకరించిన ఆరు వృత్తాలు), 8.సమూహ్య (మండలాకారం), 9.కూర్మ (తాబేలు). ఈ నిర్మాణాలన్నీ అయిదు అంతస్థులుగా నిర్మించబడతాయి. ఈ బ్రాహ్మణంలో చయనకాండలో వీటి వివరాలన్నీ దొరుకుతున్నాయి.

దార్శికీవేదినిర్మాణం స్త్రీస్వరూపంలా ఉండాలి. 'యోషా వై వేదిః' (1-2-3-16) 'జఘనభాగం విశాలమై, నెన్నడుము సూక్ష్మమై, అంసప్రాంతంలో విశాలమైన స్త్రీవలె అగ్నివేదిక పశ్చిమంలో విశాలమై, మధ్యభాగంలో సూక్ష్మమై, తూర్పున కొద్ది వైశాల్యంగలిగి ఉంటే దేవతలకు ప్రీతికలుగుతుంది'. ఈ వర్ణన స్త్రీ సౌందర్యాన్ని గురించి మహర్షుల దృష్టిని, వైదికక్రియలలో వారికి గల సౌందర్యదృష్టిని వెల్లడిస్తోంది.

అగ్నివేది నిర్మాణం పూర్తియైన తరువాత 'శతరుద్రీయ హోమం' చేయబడుతుంది. జిల్లేడుఆకులో మేకపాలు పోసి అగ్నిలో హోమం చేస్తారు. రుద్రాధ్యాయాన్ని పఠిస్తారు. తరువాత కొన్ని కర్మలు 'వసోర్ధారా' హోమం చేయబడుతుంది. అగ్నిష్టోమంలో చేసే కార్యక్రమంతో ఈ చయనయాగం సమాప్తమవుతుంది. చయనం ప్రధానంగా అగ్నికి చెందిన యాగం అయినా జగత్సృష్టికి నిగూఢార్థ ప్రతీకగా భావించబడుతోంది.

**సౌత్రామణీ (5-5; 12-7):**

చయనయాగానంతరం సౌత్రామణీ అనే పశుయాగం చేయాలి (12-4-1-2). ఇది సోమపానం ఎక్కువగా చేయటంవల్ల కలిగే హానిని పోగొట్టడానికి చేసే ప్రాయశ్చిత్త కర్మ. ఇందులో సుత్రాముడు అంటే ఇంద్రుడు ప్రధానదేవత. హవిస్సులు అశ్వినులకు, సరస్వతికి సమర్పించబడతాయి. దేవతలకు

మూడు పశువులతోబాటు పురోడాశం ఇందులో సమర్పించబడుతుంది. చరకసౌత్రామణి, కౌకిల సౌత్రామణి అని ఇది రెండురకాలు.

### ప్రవర్గ్య (9-2; 14-1):

సోమయాగం పూర్వరంగంలో చేయబడే అంగయాగం (అప్రదానకర్మ). ఎక్కువగా కాచబడిన నెయ్యి, ఆవుపాలు, మేకపాలతో కలిపి ఇందులో దేవతలకు సమర్పించబడుతుంది. సోమలతను యాగశాలకు తీసికొని వచ్చిన తరువాత రోజుకు రెండుసార్లు ప్రవర్గ్యను చేస్తారు. ఉదయం ప్రవర్గ్యానంతరం ఉత్తర వేదిలో ఒక అంతస్థును నిర్మిస్తారు. ఇలా ప్రవర్గ్యను అయిదు రోజులు చేస్తారు. క్రమంగా ఉత్తరవేది అయిదు అంతస్థులుగ నిర్మించబడుతుంది. అశ్వినులు ప్రధాన దేవతలు. ఇందులో నెయ్యికాచబడిన పాత్రను 'మహావీరం' అంటారు. వీర అంటే అగ్ని. అందుకనే ప్రవర్గ్యకు 'మహావీరం' అనే నామాంతరం ఉంది. ప్రవర్గ్య చివర అగ్నిని శాంతింప జేయటానికి 'ఉపసత్' అనే హోమం చేస్తారు.

### 10 రాజసూయం (5-2; 3; 4):

రాజు రాజ్యాధికారాన్ని స్వీకరించిన తరువాత రాజసూయయాగం చేస్తాడు. ఇది రాజును పవిత్రీకరిస్తుందని రాజుకు ప్రతిష్ఠను పెంచుతుందని భావించబడింది. ఇది ఆరు సోమయాగాలు, రెండు పశుయాగాలు, 129 ఇష్టులు, ఏడు దర్విహోమాలతో 14 నెలలకు పూర్తి అవుతుంది. సాధారణంగా ఫాల్గుణ శుక్లపాడ్యమినాడు దీన్ని ప్రారంభిస్తారు. ఇందులోని సోమయాగాలు- 1. పవిత్రయాగం-ఇదిఅగ్నిష్టోమంతో ప్రారంభమవుతుంది. 2.అభిషేచనీయ- ఉక్థ్య. ఇందులో అభిషేకసంస్కారం జరుగుతుంది. 3.దశపేయం: అగ్నిష్టోమయాగం, 4.కేశవపనీయం, అతిరాత్రయాగం, 5.వ్యుష్టిద్విరాత్రం, 6.క్షత్రధృతి అనేవి.

**అభిషేచనీయ** (పవమాన) మనే సోమయాగంలో మధ్యాహ్న సవనానంతరం, ప్రధాన ఆహుతి తరువాత, బ్రహ్మ యజమాని (రాజు) **చేతిని** పట్టుకొని సభ్యులకు ప్రజలకు 'ఇతడు... రాజ కుమారుడు మీకు రాజు, రక్షకుడు' అని పరిచయం చేస్తాడు. తరువాత అభిషేకం జరుగుతుంది. సముద్రం, నది, సరస్సు, సెలయేరు మొదలైన **16** పుణ్యతీర్థాలలోని నీరు, పెరుగు, నెయ్యి, పాలు, తేనె మొదలైనవన్నీ కలిపి రాజును అభిషేకిస్తారు. దీనికి ఉదుంబర (మేడి) పాత్ర ఉపయోగించబడుతుంది.

రాజు విల్లు - బాణాలను చేతపట్టుకొని, పులితోలు పరచిన ఉదుంబర (మేడి) సింహాసనంపై, ఆహవనీయాగ్ని సమీపంలో కూర్చుంటాడు. ఆరు పార్థ హోమాలు చేయబడతాయి. మహేంద్ర స్తోత్రాన్ని ఉద్గాత పఠిస్తాడు. అధ్వర్యుడు, బ్రహ్మ, హోత, ఉద్గాత రాజుచుట్టు నిల్చుని పవిత్రజలంతో అభిషేకిం చేస్తారు. ఈ కార్యక్రమంలో రాజమిత్రులు ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారు. తరువాత రాజు నూతన వస్త్రాలను ధరిస్తాడు. మళ్లీ ఆరు పార్థహోమాలు చేయబడతాయి. ఇందులో 'రత్నినాం హవీంషి' అనే 12 ఇష్టులు చేయబడతాయి. ఈ కార్యక్రమంవల్ల రాజోద్యోగులకు 'రత్నిన్' (రత్నాలు) అనే పేరు కలిగింది. వారు పురోహిత, సూత, సంగ్రహీతృ, అక్షావాప, క్షత్రి, గోవికర్తన, పాలాగల, తక్షన్, రథకార మొదలైనవారు.

రాజు మూడుగుర్రాలు, ఇద్దరు అంగరక్షకులుగల రథాన్నధిరోహించి ఒక వీరునితో ద్వంద్వయుద్ధంచేసి జయిస్తాడు. రాజు పరిహాసానికి తన బంధువులకు చెందిన గోసమూహంమీద దండెత్తి జయించి, కొంత ధనాన్ని రాజ్యభాగాన్ని ఆ బంధువుకు ప్రతిఫలంగా యిస్తాడు. అధ్వర్యునితో పాచికలాడతాడు. ఆటలో పందెం గోవు. దానిని కూడా జయిస్తాడు. ఇవి యాగేతరమైన కార్యాలు. సోమయాగం చివర హోత శునఃశేపుని వృత్తాంతాన్ని పఠిస్తాడు.

మరునటిదినంనుంచి 10 రోజాలు 'సంస్రుపాం హవింషి' అనే 10 ఇష్టులు చేయబడతాయి. 11 వ రోజున 'దశపేయం' జరుగుతుంది. ఈ సోమయాగంలో 10 చమసలు (పాత్రలు) ఉపయోగించబడతాయి. పదిమంది ఋత్విక్కులు సోమపానంలో పాల్గొంటారు. కనుక ఇది 'దశపేయం' అనబడుతోంది.

'కేశవపనీయ'మనే సోమయాగం ఒక సంవత్సరం తరువాత చేయబడుతుంది. దీనితో దీక్ష ముగుస్తుంది. పిమ్మట వ్యుష్టిద్విరాత్ర, క్షత్రస్య ధృతి అనే సోమయాగాలు చేయబడతాయి. రాజసూయం అంతటితో సమాప్తమవుతుంది. తరువాత సౌత్రామణి ప్రాయశ్చిత్త యాగాన్ని చేస్తారు.

రాజసూయంలో వరుణుడు ప్రధానదేవత. 'వరుణసవో వా ఏష యద్ రాజసూయమ్' (5-4-3-21) అని శతపథబ్రాహ్మణం చెబుతోంది. రాజసూయ, అశ్వమేధ, పురుషమేధ, సర్వమేధ యాగాలు క్షత్రియ యాగాలు. రాజసూయంలో రాజు ప్రజాపతికి ప్రత్యక్ష ప్రతినిధిగా చెప్పబడ్డాడు (5-3-3-12).

**అశ్వమేధం (13 కాండ):**

చారిత్రిక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగి 'రాజయజ్ఞం' గా ప్రసిద్ధి పొందిన యాగం అశ్వమేధం. అశ్వం బలిపశువుగా గల సోమయాగం. కాని ఇందులో అశ్వంతోపాటు అనేక పశువులు పవిత్రద్రవ్యంగా ఉంటాయి.

'సాంగ్రహణ్యేష్టి'తో అశ్వమేధం ప్రారంభమవుతుంది. పశు యాగానంతరం అశ్వం పవిత్రీకరించబడి ఒక సంవత్సరపాటు స్వేచ్ఛగా తిరగటానికి వదలబడుతుంది. దానిని రక్షించటానికి కొంత సైన్యం వెంట ఉంటుంది. రాజు (యజమాని) యాగదీక్షితుడై హోమాలు చేస్తుంటాడు.

హోత గానం చేస్తున్న 'పారిప్లవం' వింటూంటాడు. గాయకులు తన వీరగాథలు గానం చేస్తుంటే రాజు వాటిని వింటూ అశ్వం తిరిగిరావడాన్ని నిరీక్షిస్తూంటాడు.

ప్రధానయాగం మూడురోజులు జరుగుతుంది. మొదటిరోజు పూర్వరంగమైన హోమాలు చేయబడతాయి. రెండవరోజు సోమయాగంలో సవనాశ్వం యూపస్తంభం దగ్గరికి తీసికొనిరాబడుతుంది. హోత సూర్యుని అశ్వరూపంలో స్తుతించే సూక్తం (ఋ.సం. 5-163) గానం చేస్తాడు. ఉత్తర వేదిపై 21 యూపస్తంభాలుంటాయి. మధ్యనున్న యూపానికి సవనాశ్వం బంధించబడుతుంది. దానికి రెండు వైపులమున్న యూపస్తంభాలకు 340 గ్రామ్యజంతువులు గుంపులుగ బంధించబడతాయి. వీటితోపాటు 360 అరణ్య జంతువులుగూడ బంధించబడి ఉంటాయి. అదొక జంతు ప్రదర్శనశాలగా ఉంటుంది. 'పర్యగ్నికరణం' తరువాత అశ్వం, గ్రామ్య జంతువులు దేవతలకు బలి యివ్వబడతాయి. అరణ్య జంతువులు వదలివేయబడతాయి. తరువాత వపాహోమం మొ॥ చేయబడతాయి.

మూడవ రోజున అతిరాత్రసోమయాగం చేస్తారు. అవభృథంతో అశ్వమేధం సమాప్తమవుతుంది. అశ్వమేధం రాజ్యానికి, ప్రజలకు అభివృద్ధిని కలిగిస్తుంది. సార్వభౌమాధికారానికి ఏకచ్ఛత్రాధిపత్యానికి అశ్వమేధం చిహ్నం. అశ్వం సృష్టికర్తయైన ప్రజాపతికి ప్రతీక.

**పురుషమేధం (13-6):**

పురుషమేధం అశ్వమేధంలాగా ఒక సోమయాగం. ఇందులో పురుషుడే యజ్ఞ పశువుగా ఉంటాడు. బ్రాహ్మణ లేక క్షత్రియ యువకుడు ముఖ్యపశువుగా ఉంటాడు. ఇతడు 1000 గోవులకు లేక 100 గుర్రాలకు ప్రతిఫలంగా కొనబడతాడు. ఇది వాయుదేవతకు సంబంధించిన యాగం

(13-6-2-1). ప్రధానయాగం అయిదురోజులు జరుగుతుంది. మూడవరోజు పశువులు దేవతలకు బలి యివ్వబడతాయి. వాజసనేయిసంహితలో (30-5) 185 మంది దేవతలు, వారికి సమర్పించబడే 185 పశువులు (మానవులు) తెలుపబడ్డారు. యాగకార్య కలాపవివరణను బట్టి ఇందులో మానవపశువులు హవిస్సులుగ వధించబడటంలేదు. సామిత్రగ్నానికి తీసికొనిపోయిన తరువాత వదలివేయబడతారు. ఇందులో పేర్కొన్న పశువుల పేర్లను పరిశీలిస్తే పురుషమేధం ఒక సాంకేతికయాగమనిపిస్తుంది. నాగరికత అభివృద్ధి చెందిన నాటి సమాజస్వరూపమంతా ఇందులో ప్రత్యక్షమవుతోంది.

**సర్వమేధం (13-7):**

ఇది పది రోజుల సోమయాగం. యజమాని తన శక్తి ననుసరించి అగ్ని వేదిని నిర్మిస్తాడు. పదిరోజుల కార్యక్రమం - 1. అగ్నిస్తుత్ 2.ఇంద్రస్తుత్ ఉక్థ్య, 3.సూర్యస్తుత్ ఉక్థ్య, 4.వైశ్వదేవ, 5.అశ్వమేధిక, 6.పురుషమేధిక, 7.అప్తోర్యామ, 8.త్రిణవ, 9.త్రయస్త్రింశ, 10.అతిరాత్రయాగాలు.

**పితృమేధం (13-8):**

ఇది ఉత్తరక్రియలకు సంబంధించిన యాగం.

**ఋత్విక్కులు:**

హవిర్యజ్ఞాలలో (ఇష్టులు) అధ్వర్యుడు, హోత, బ్రహ్మ, అగ్నీధ్రుడు అనే నలుగురు ఋత్విక్కులుంటారు. పశుయాగాలలో పై నలుగురితోపాటు మరి యిద్దరు ప్రతిప్రస్థాతా, ప్రశాస్తా లేక మైత్రావరుణుడు ఉంటారు. సోమయాగాలలో 16 మంది ఋత్విక్కులు ఉంటారు. వారు నాలుగు గణాలుగా ఉంటారు.

1. అధ్వర్యుగణం - అధ్వర్యు, ప్రతిప్రస్థాతా, నేష్టా, ఉన్నేతా.
2. హోతృగణం - హోతా, ప్రశాస్తా, అచ్ఛావాక, గ్రావస్తుత్.
3. ఉద్గాతృగణం - ఉద్గాతా, ప్రస్తోతా, ప్రతిహర్తా, సుబ్రహ్మణ్యుడు.
4. బ్రహ్మగణం - బ్రహ్మ, బ్రాహ్మణాచ్ఛంసి, అగ్నీధ్ర, పోతా.

కొన్ని సోమయాగాలలో సదస్య, ఉపద్రష్టా అనేవారు ఉంటారు.

ఇలా బ్రాహ్మణాలు యాగాదులకు సంబంధించిన విషయాలనే వివరిస్తాయి. భారతీయ తాత్త్వికభావనారీతిని, పూజావిధానాన్ని, ప్రార్థనా విధానాన్ని, వాటి ఉత్పత్తి వికాసాలను తెలిసికోవడానికి బ్రాహ్మణాలు పెన్నిధిలాంటివి. వీటిలో శతపథబ్రాహ్మణం విషయ విస్తృతిలోను, సమగ్రతలోను సార్థకనామధేయమై ఉంది. ఇది యజ్ఞయాగాదుల చరిత్రను, కార్యకలాపాన్ని తెలిసికోవడానికి అమూల్యమైన ప్రామాణిక గ్రంథం.

- కె.వి.ఆర్.

## 2.4.7 వైశిష్ట్యం

సంహితల్లో ఋక్ సంహితకు గల స్థానం బ్రాహ్మణాల్లో శతపథానికున్నదని చెప్పవచ్చు. అయితే నూఱు అధ్యాయాలతో అనేక విషయాలతో నిండివున్న ఈ శతపథబ్రాహ్మణవైశిష్ట్యాన్ని సంగ్రహంగా ప్రతిపాదించడం సాహసమే అవుతుంది. అసలు వేదవాఙ్మయవైశిష్ట్యం ఎటువంటిది? ఎంతది? అని చెప్పటం తగనిపని. పొర్లిపొంగే పవిత్ర గంగా ప్రవాహంనుంచి చేతిలోనున్న పాత్రకు తగిన నీటినే మనం పొందగలిగినట్లు ఏ దృష్టితో ఎంతవరకు తెలిసికొనే ప్రయత్నం చేయగలమో అంతవరకే ఆ విషయం వేదవాఙ్మయంనుంచి మనకు స్ఫురిస్తుంది. అయితే అందులో విషయం అంతటిదేననుకోకూడదు. మన ఆలోచనల్లో భావనలోగల పరిమితత్వంవల్ల వేదవిజ్ఞానాన్ని కూడ ఇంతటిది, ఇటువంటిది అని వ్యాఖ్యానిస్తూ ఉంటాం. అది చాలా సంకుచితదృష్టి అనిపించుకుంటుంది.

శుక్ల యజుర్వేదానికి అనుబంధంగా ఉన్న బ్రాహ్మణాన్నే శతపథ బ్రాహ్మణమని వ్యవహరిస్తుంటారు. ఈ పేరే చెప్పక చెపుతుంది - ఈ బ్రాహ్మణం చాలా పెద్దదని. నిజానికంతే. ఈ బ్రాహ్మణం వైశిష్ట్యాన్ని గురించి మనం ఆలోచించేముందు వేదాలన్నిటికి విశదమైన భాష్యాల్ని రచించిన సాయణుడు ఏమంటున్నాడో తెలుసుకోవడం సమంజసం. హరిహరరాయలు సాయణుణ్ణి పిలిచి ఇలా అన్నారట -

> ఋగ్యజుస్సామశాఖలలో ఒక్కొక్క శాఖ తమచేత వ్యాఖ్యానింపబడింది. ఆ వ్యాఖ్యానాల చేతనే మిగతా శాఖలు కూడా అందఱికి అర్థమైనాయి. కానీ 1.సకలమంత్ర సముదాయార్థం ఏ శాఖలో విశదంగా వ్యాఖ్యానింపబడిందో 2.అధ్వర్యుని కర్తవ్యమంతా ఇతర శాఖాపేక్ష లేకుండా ఏ శాఖలో పరిపూర్ణంగా విశదీకరింపబడిందో 3. పరబ్రహ్మతత్త్వం ఏ శాఖలో కరతలామలకంగా నిరూపింపబడిందో అటువంటి వేదశాఖ నొకదాన్ని వ్యాఖ్యానించవలసింది-అని

సాయణుడు ఈ గుణాలన్నీ ఒక్క శతపథ బ్రాహ్మణానికే ఉన్నాయని నిర్ణయించి శతపథానికి భాష్యం రచించాడట. ఇది శతపథ వైశిష్ట్యాన్ని గురించి సాయణుడు స్వయంగా చెప్పినమాట.

పద్నాలుగు కాండలు గల శతపథంలో చివరికాండమే బృహదారణ్యకోపనిషత్తనబడుతోంది. క్రియావిధిపరమైన వేదభాగాన్ని కర్మకాండమనీ, పరతత్త్వపరమైన వేదభాగాన్ని బ్రహ్మకాండమని వ్యవహరిస్తారు. బ్రహ్మకాండలో బృహదారణ్యకోపనిషత్తుకు గల స్థానం అద్వితీయమైనది. గార్గి, మైత్రేయి మొ॥ ఋషికలకు వాజసనేయ యాజ్ఞవల్క్యుని వంటి ఋషులకు మధ్య జరిగిన వాదవివాదాల్లో సృష్టి ప్రళయాలకు, జీవాత్మపరమాత్మలకు, జ్ఞానాజ్ఞానాలకు సంబంధించిన ఎన్నో రహస్యాలు విస్తృతంగా, తేటతెల్లంగా ఇందులో చర్చించబడ్డాయి. మతత్రయాచార్యులు పరమాదరంతో ఈ ఉపనిషత్తుకు సుదీర్ఘ భాష్యాల్ని రచించారు. సాధారణంగా ఉపనిషత్తులు ఆరణ్యకాలకి అనుబంధంగా ఉంటూ ఉంటాయి. కాని శుక్ల యజుశ్శాఖకు సంబంధించిన రెండు ఉపనిషత్తులలో ఒకటైన ఈశావాస్యోపనిషత్తు సంహితలో చివరి అధ్యాయంగానూ, మరొకటైన బృహదారణ్యకోపనిషత్తు బ్రాహ్మణంలో చివరికాండగానూ, అమరివుండడం మరో విశేషం.

యజ్ఞాన్ననుష్ఠించడంలో కీలకమైన పాత్ర అధ్వర్యువు అనబడే ఋత్విక్కుది. ఇతను నిర్వహించే కార్యకలాపమే అధ్వర్యవం అనబడుతుంది. యజుర్వేదాన్ని అధ్వర్యుశాఖ అంటారు. అనగా ఋక్సాములలో యజ్ఞంలో ఉపయోగపడే మంత్రాలు మాత్రం పఠించబడ్డాయి. యజుర్వేదంలోనే ఈ మంత్రాలకు వినియోగం ఎక్కడ? ఎలా? అనే విషయాలు చర్చించబడ్డాయి. అందులోనూ మంత్రార్థ వివరణం - మంత్రాల వినియోగకథనం - ఇతికర్తవ్యత అనే పేరుతో పిలువబడే యజ్ఞానుష్ఠానవిధానాన్ని స్పష్టపరచడం - ఇవే బ్రాహ్మణాలకు ముఖ్యలక్షణాలు. అటువంటి ఈ అధ్వర్యు బ్రాహ్మణాల్లో

తైత్తిరీయశాఖలో మంత్రబ్రాహ్మణాలు సంకీర్ణాలై ఉండడంవల్ల అసంపూర్ణత అస్పష్టత గోచరిస్తాంటాయి. కాగా శతపథంలోనే ఇతర చోట్ల చెప్పి చెప్పబడని అన్ని యగాల ఇతికర్తవ్యత పూర్తిగా స్పష్టంగా వర్ణింపబడింది. మంత్రబ్రాహ్మణభాగాల్ని సాధ్యమైనంతవరకు కలవని విధంగా విభజించి కూర్చడంవల్ల ఇందులోని విషయాలు మరింత స్పష్టంగా శాస్త్రీయమైన పద్ధతిలో అవగాహనకు సులభమైనవిగా కనిపిస్తాయి.

అంతేకాదు - ఇతరశాఖల్లోని బ్రాహ్మణాల్లో ఏ ఒకబ్రాహ్మణంలోనూ యాగాలన్నింటి ఆచరణ విధానం వర్ణింపబడలేదు. సంపూర్ణ యాగానుష్ఠాన పద్ధతిని తెలుసుకోవడానికి ఇతర బ్రాహ్మణాల సహాయం అవసరమౌతోంది. కానీ శతపథంలో ప్రతియాగస్వరూపం సాధ్యమైనంత విశదంగా వర్ణింప బడటంవల్ల ఇతర శాఖా బ్రాహ్మణాల అపేక్ష దీనికి చాలా తక్కువ.

పద్నాలుగు కాండలుగల ఈ బ్రాహ్మణంలో మొదటికాండలో దర్శపూర్ణమాస హావిర్యజ్ఞం; రెండవకాండలో అగ్న్యాధానం, అగ్నిహోత్రం; మూడవకాండలో సోమయాగం; నాల్గవకాండలో సోమయాగాంగాలైన గ్రహహోమాలు; ఐదవకాండలో వాజపేయ రాజసూయాలు; ఆరు మొదలు పదోకాండవరకు గల ఐదుకాండల్లో గారుడాది వివిధ చయనాలు, పదకొండులో దర్శపూర్ణమాసాంగాలు; పన్నెండులో ద్వాదశాహసత్రాలు; పదమూడులో అశ్వమేధం అనే యాగాలు విస్తృతంగా వర్ణింపబడ్డాయి. దీన్ని బట్టి చూస్తే ముఖ్యంగా చయనాలు - సోమయాగాలు ఎక్కువ విశదంగా వ్యాఖ్యానింప బడ్డాయి. తైత్తిరీయశాఖ చయనాల్లో ఒకటి రెండింటిని మాత్రమే స్థూలంగా వర్ణిస్తుంది. ఏ మంత్రంతో ఎప్పుడు ఏ క్రమంలో ఏ హోమాన్ని నిర్వహించాలనే విషయంలో ఈబ్రాహ్మణంలో చెప్పబడిన తీరే కల్పసూత్రాల్లో యజ్ఞస్వరూప వ్యాఖ్యానానికి ఆధారమైందని చెప్పాలి.

మంత్రాల గూఢార్థ వివరణ మనేది బ్రాహ్మణాల ముఖ్యతాత్పర్యాలలో ఒకటి. సాయణాది వేదవ్యాఖ్యాతలు గూడ బ్రాహ్మణాల్ని మంత్రార్థవివరణంలో ఎంతో ఉపయోగించుకున్నారు. వేదాల్లో ప్రయోగింపబడిన పదాలకు ఏది సరైన అర్థం? అనేది నిర్ణయించడం చాలా కష్టమైన విషయం. ప్రతి ఒక్క పదమూ ధాతువులవల్లనే పుట్టిందని అంగీకరించి వ్యుత్పత్తి చెప్పడంద్వారా అర్థాన్ని నిర్ణయించాలన్నది కొందరి మతమైతే; మరికొందరు మంత్రాలు స్వయంప్రకాశితార్థాలని భావిస్తున్నారు. ఇలాగే పదార్థాన్ని నిర్ణయించడానికి కొన్నిచోట్ల నిఘంటువులు; కొన్ని చోట్ల ప్రత్యక్షర నిర్వచనాలు (తజ్జలాన్) మరికొన్నిచోట్ల కథలు - గాథలు ఇంకా కొన్ని స్థలాల్లో మనకర్థంకాని తాంత్రిక ప్రక్రియలు ఆధారంగా చేసుకోబడ్డాయి. ఇన్ని ప్రకారాల్ని అనుసరించి ఎన్నో పదాలకు అర్థనిర్ణయం చేయడం ద్వారా మంత్రార్థాల్ని ప్రకాశింపజేసి వేద వ్యాఖ్యానాలకు పునాదులు సుదృఢంగా వేయబడింది శతపథంలోనేనని చెప్పాలి.

ఉదాహరణకు -

మాతా చ తే పితా చ తేఽగ్రం వృక్షస్య రోహతః  
ప్రతిలామీతి తే పితా గభే ముష్టిమతంసయత్ ॥

ఈ మంత్రంలో 'గభే' మొదలైన పదాలకు వాడుకలోగల ప్రసిద్ధార్థాన్ని బట్టి చూస్తే కొంత అశ్లీలార్థం కనిపిస్తుంది. అంతేకాదు - కొందరు వ్యాఖ్యాతలు కూడా అలానే వ్యాఖ్యానించారు. అయితే శతపథబ్రాహ్మణం మాత్రం ఈ అశ్లీలాన్ని దూరం చేసి చక్కగా ఈ మంత్రాన్ని వ్యాఖ్యానించింది. 'గభే' అన్న పదానికి ప్రజలన్న అర్థాన్ని. 'ముష్టిం' అన్న పదానికి రాజశాసనమన్న అర్థాన్ని నిర్వచించి చెప్పి, రాజరికం ప్రజల సంపదల్ని దోచుకుంటుందని తేటపరచి 'తస్మాత్ రాష్ట్రీ విశంఘాతుకః' అని మంత్రతాత్పర్యాన్ని స్పష్టపరచింది.

పైగా 'పరోక్షప్రియాః' 'పరోక్షకామాః' అని దేవతలను నిర్దేశించడం బ్రాహ్మణాల్లో కనపడుతుంది. అంటే; తమ భావాలను అసురులు గుర్తిస్తారేమోనని వ్యాకరణాది శాస్త్రాలద్వారా లభించే శబ్దరూపాలను అంతో యింతో మార్చి గూఢమైన సాంకేతికభాషలో వారు వ్యవహరిస్తారట. ఉదాహరణకు దేవతలందరిలో ముందుగా (అగ్రే) అతను సృజింపబడినాడట. అట్లు సృజింపబడిన అతడు అందరికన్నా ముందుగా (అగ్రే) వెళ్లాడట. కాబట్టి అతనిని అగ్ని అని పిలుస్తారట. ఇక్కడ 'అగ్రే' అన్న సంస్కృత పదానికి బదులుగా తత్పర్యాయంగా 'అగ్ని' అన్నపదం పరోక్షప్రియత్వంవల్లనే వాడుకలోకి వచ్చింది.

గుఱ్ఱానికి అశ్వమనే పేరు ఎలా వచ్చిందని మీమాంస కలిగింది. ఈ శబ్దం చుట్టూ ఒక చిన్న కథను చుట్టి ఇలా నిర్వచిస్తోంది శతపథం - వరుణుడు ఒకప్పుడు సోమరాజు కంటిని పొడిచాడట. అపుడా కన్ను వాచిందట (అశ్వయత్). ఆ వాపునుంచి పుట్టిందట గుఱ్ఱం (యచ్ఛ్వయథాత్సమభవత్ తస్మాదశ్వో నామ). అందుకని దానికి అశ్వమని పేరట. మరో చోట ఇలా నిర్వచిస్తోంది - దెబ్బ తగిలినప్పుడు సోముని కంటినుంచి కన్నీరు (అశ్రు) కారిందట. దేవతలు పరోక్షకాములు కనుక ఆ కన్నీటినే 'అశ్వం' అని వ్యవహరిస్తారట.

బ్రాహ్మణాల్లో తరచుగా కనబడే ఈ వ్యాఖ్యాన ప్రక్రియ శతపథంలో అత్యధికంగా అనుసరింపబడింది. వందలకొలది పదాలు ఈ విధంగా నిర్వచింపబడ్డాయి. ఈ పరోక్షకామతనుపట్టి చూస్తే ఇప్పటికీ మనకర్థంకాని మరెన్నో అర్థాలు భావాలు వేదాలలో ఇమిడి ఉన్నాయన్నది నిర్ధారణ అవుతుంది. కాబట్టే నిరుక్తకారులు, వేదభాష్యకర్తలు ఎన్నెన్నో పద్ధతులనవలంబించారు వేదాల యథార్థతను వెలికి తీయడానికి.

ప్రజాపతి తత్త్వం గొప్ప ప్రాధాన్యతను సంతరించుకొన్నది శతపథంలోనే. సంహితల్లో ప్రాధాన్యత ఇంద్రాగ్ని వరుణులది. క్రమంగా ఆ ప్రాధాన్యత ప్రజాపతిని పొంది ఉపనిషత్తులలో 'ఆత్మ'లో పర్యవసానాన్ని పొందిందని చెప్పవచ్చు.

శుక్ల యజుస్సులు వాజసనేయయాజ్ఞవల్క్యునిచేత దర్శింపబడ్డాయని శతపథంలో చెప్పబడింది. దానికనుగుణంగానే చాలా చోట్ల యాజ్ఞవల్క్యుని ఉదాహరించడం జరిగింది. వైదికాలైన అనేక విషయాల్లో అతని ప్రజ్ఞ సాటిలేనిదని స్పష్టంగా ఇందులో చెప్పబడింది. విదేహరాజు జనకుడు మొ॥ తత్త్వజ్ఞులతో పలుమార్లు జరిగిన తత్త్వ విచారణలో ఇతనిది పైచేయిగా శతపథబ్రాహ్మణం పేర్కొంటున్నది.

తాత్త్విక విషయ విచారణ గోష్ఠులు చాలా తరచుగా జరుగుతుండేవని శతపథంద్వారా వ్యక్తమవుతూంది. ప్రధానంగా యజ్ఞనుష్ఠాన వేదికలలోను ఇతరత్రాకూడా ఈ గోష్ఠులు సాగుతూండేవి. ఈ గోష్ఠులలో మరో విశేషం ఏమిటంటే; ఒకచోట కలిసిన వివిధాభిప్రాయాలుగల తాత్త్వికులు తమతమ అభిప్రాయాల్ని స్పష్టంగా సూటిగా చర్చించుకొనేవారు. వాదవివాదాల్లో సంకోచానికి తావులేదు. స్త్రీలు సైతం మైత్రేయి, గార్గివంటివాళ్ళు అమితోత్సాహంతో ప్రాణాపాయానికైనా సరే తెగించి మరీ తత్త్వవిచారణ చేసిన ఘట్టాలు కోకొల్లలుగా కనబడతాయి శతపథంలో. ప్రభావసంపన్నమైన చిన్న చిన్న వాక్యాలతో ప్రశ్నోత్తరరూపంగా సాగే ఈ గోష్ఠుల తీరు, పాల్గొనేవారి తత్పరతను, శ్రద్ధాసక్తులను ఆయా విషయాలపట్ల వారు చేసిన తీవ్రానుసంధానాన్ని వ్యక్తపరుస్తూ చదువరులకు వళ్ళు పులకరింపజేస్తుంది.

ఒకచోట వైదేహజనకుడు చేసిన ఈ పనులను చూడండి - తానొక యజ్ఞాన్నాచరించి విపులమైన కానుకలనందజేస్తూ వెయ్యి ఆవులను ఒక

గుంపుగా పెట్టి "తత్త్వజ్ఞానంలో అత్యధికుడైన పండితుడు వీటిని తోలుకొని పోవచ్చును" అన్నాడట. తర్వాత శాకల్యుడు మొ॥ తత్త్వవేత్తలను వాదంలో ఓడించి యాజ్ఞవల్క్యుడు వాటిని పొందాడట. శతపథంలోని ఇలాంటి ఎన్నో సంఘటనలవలన తాత్త్విక విషయ విచారంపైన ఆనాడు ఎంత గౌరవ ప్రతిపత్తులుండేవో స్పష్టమవుతుంది. వారి దీక్షాదక్షతలు, ఉత్సాహం మనల్ని కూడా ఉత్తేజితుల్ని చేస్తాయి.

- వి.కె.ఎస్.

## 2.4.8 సంగ్రహావమీక్ష

ఆదిత్య సంప్రదాయంగా ప్రసిద్ధి చెందిన శుక్లయజుర్వేదంలో కాణ్వ-మాధ్యందినశాఖలు రెండు ప్రసిద్ధమైనవి. ఈ రెండు శాఖలకు ప్రసిద్ధమైన రెండు బ్రాహ్మణాలున్నాయి. వీటికి రెండింటికి శతపథబ్రాహ్మణమనే పేరు. రెండు బ్రాహ్మణాలలో విషయైక్యం ఉన్నప్పటికీ, ఆయా విషయాలను నిరూపించడంలోను, పఠనక్రమంలోను కొంత తేడా కనబడుతుంది.

ఈబ్రాహ్మణంలో ముఖ్యంగా అనేక యజ్ఞాలు సాంగోపాంగంగా వివరించబడ్డాయి. ఇలాంటి వివరణ మనకు ఇతర బ్రాహ్మణాల్లో ఎక్కడా లభ్యంకాదు. అక్కడక్కడ కొన్ని కథలతో కలిసి ఉండటం వల్ల ఇందులో విషయనిరూపణం సరసంగా మధురంగా జరిగిందని చెప్పాలి. ప్రధానంగా ఈ బ్రాహ్మణంలో గృహస్థులకు సంబంధించిన అగ్నిహోత్రం, పిండపితృయజ్ఞం, నవాన్నేష్టి, దర్శపూర్ణమాసయాగం, చాతుర్మాస్యేష్టి, సోమయాగం మొ॥ అనేక యాగాలు ప్రస్తావించబడ్డాయి. ఇవేకాక రాజసూయం అశ్వమేధం మొ॥ యాగాల ప్రస్తావం కూడా కనబడుతుంది. చివరిలో ప్రతినిత్యం మానవు లాచరించవలసిన బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, అతిథి యజ్ఞం, భూతయజ్ఞం అనే పంచమహాయజ్ఞాలు స్పష్టంగా పేర్కొనబడ్డాయి. ఇలా అనేక యజ్ఞయాగాలను వివరిస్తున్న ఈ బ్రాహ్మణం బ్రహ్మయజ్ఞాన్ని గురించి విశేషంగా ఉపదేశిస్తుంది. 'స్వాధ్యాయోఽధ్యేతవ్యః' అనే విధిని మనకు ప్రబోధిస్తూ, వేదాధ్యయనం అవశ్యకర్తవ్యమని నిరూపిస్తుంది.

**దర్శపూర్ణమాసం :**

శతపథం ప్రథమకాండలో ఈ యాగ వివరణం ప్రారంభమైంది. దర్శపౌర్ణమాస యాగానికి సంబంధించిన మంత్రకలాపం ప్రథమాధ్యాయంలో

పంచమకండికతో ప్రారంభమై, ద్వితీయాధ్యాయంలో 28వ కండికవరకు విస్తరించింది.

**పిండపితృయజ్ఞం :**

ద్వితీయకాండలో గృహస్థులకు బాగా ముఖ్యమైన అగ్నిహోత్రాన్ని గురించిన ప్రస్తావన ఉంది. అలాగే పితృతృప్తి కోసం ఆచరించే పిండపితృయజ్ఞం కూడా ఈకాండలోనే చోటుచేసుకుంది.

**నవాన్నేష్టి :**

మాసాలలో మార్గశీర్షానికి ఒక ప్రత్యేకత ఉంది. 'మాసానాం మార్గశీర్షోఽహాం' అన్నాడు గీతాచార్యుడు. రైతుపక్ష శ్రమ ఈ మాసంలో ఫలిస్తుంది. కొత్త బియ్యంతో చేసే ఈ యాగాన్ని నవాన్నేష్టి అన్నారు.

**చాతుర్మాస్యేష్టి :**

ఒకే సంవత్సరంలో నాలుగు మాసాలకొకసారి నిర్వర్తించే ఇష్టిని చాతుర్మాస్యేష్టి అంటారు. ఈ ఇష్టి నాలుగు భాగాలుగా విభజింపబడింది. వాటిలో 'వైశ్వదేవం' అంటే ఫాల్గుణమాసాన పూర్ణిమనాడు చేసే మొదటి ఇష్టి విశ్వేదేవులు దేవత. తర్వాత నాలుగు మాసాలకు ఆషాఢపూర్ణిమనా డాచరించే వరుణప్రఘాసమనే ఇష్టిని రెండవదిగా పరిగణించారు. ఈ ఇష్టికి అధిదైవం వరుణదేవుడు, కార్తిక పూర్ణిమనాడాచరించే ఇష్టికి 'సాకమేధ' మని వ్యవహారం, నాల్గవది శునాసీరియం. ఇది మళ్లా ఫాల్గుణశుద్ధంలో పాడ్యమినాడు చేయబడుతుంది. క్రమంగా సంవత్సరంలో నాలుగు మాసాల కొకసారి నాలుగు తిరిగి తిరిగి వస్తుంటాయని వీటికి చాతుర్మాస్యాలనే పేరేర్పడింది. ఈ ఇష్టి ద్వితీయకాండలో చక్కగా వివరింపబడింది.

**సోమయాగం**

శతపథం తృతీయ చతుర్థకాండలలో సోమయాగం ప్రస్తావింపబడింది. ఈయాగాన్ని సోమలతారసంతో అనుష్ఠిస్తారు. ఈ యాగంలో సోమరసం, అపుపాలు, తేనె ఈ మూడింటి మిశ్రమంతో దేవతలకు ఆహుతులు సమర్పిస్తారు. ఈయాగం చేసిన యజమానిని 'సోమయాజి' అని అంటారు.

**అగ్నిష్టోమం :**

సోమయాగానికి మూలమైన అగ్నిష్టోమప్రక్రియ కూడా శతపథం మూడవకాండలో చెప్పబడింది. అలాగే జ్యోతిష్టోమం కూడా నాల్గవకాండలో అభివర్ణింపబడింది. పై అగ్నిష్టోమం ఐదు రోజులాచరింపబడుతుంది.

**రాజసూయం :**

రాజసూయం, వాజపేయం ఈ రెంటిని గురించి పంచమ కాండలో విశేషంగా వివరింపబడింది. రాజసూయంలో క్షత్రియ వంశశ్రేష్ఠుడైన ఒకరాజు ఈ యజ్ఞఫలానికి అధికారి అవుతాడు. ఆ రాజు ఇదివరకే పట్టాభిషిక్తుడై ఉంటాడు. ఈ అభిషేకం ప్రాచీన భారతదేశంలో రాజులకు నిబద్ధమైన ఆధిపత్యం రావాలని చేసే ఒక గొప్ప ప్రయత్నం.

**అగ్నిచయనం :**

స్మార్తాగ్ని శ్రౌతాగ్ని అని అగ్ని రెండు విధాలు. వివాహితుడైన ప్రతి గృహస్థుడు స్మార్తాగ్నిని సంసేవిస్తాడు. స్మార్తాగ్నితో చేసే యజ్ఞాలన్నీ పాకయజ్ఞాలు. ఈ పాకయజ్ఞాలలో ఔపాసనాహోమం, వైశ్వదేవం, పార్వణయజ్ఞాలు, అష్టకాలు మొ॥ ఏడు యజ్ఞాలు ఉన్నతస్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. గార్హపత్యం, ఆహవనీయం, దాక్షిణ్యం, సభ్యం అని

శ్రౌతాగ్ని నాలుగు రకాలు. ఈ అగ్నిచయన విధానం, గాంధార, కేకయ, సాల్వదేశాల ప్రస్తావం, కురుపాంచాల కోసలాది దేశాలవర్ణనం శతపథం ఆరవకాండనుంచి పదవ కాండవఱకు కనబడుతున్నాయి. ముఖ్యంగా ఈ కాండలలో శాండిల్యోక్తి ప్రామాణ్యం ఆమోదాన్ని పొందింది.

**పంచమహాయజ్ఞాలు :**

ఈ విధంగా శతపథం పదకొండవ కాండలో పంచమహా యజ్ఞాలుగా ప్రసిద్ధమైన బ్రహ్మ, దేవ, పితృ, నర, భూతయజ్ఞాలు విడివిడిగా వర్ణించబడ్డాయి. అహోరాత్రం సంధ్యాసమయంలో చేసే పరమేశ్వరస్తుతి బ్రహ్మయజ్ఞంగా చెప్పబడింది. స్వాధ్యాయం అనే నామాంతరం గల ఈ యజ్ఞం విపులంగా వర్ణించబడింది. దేవయజ్ఞం హోమరూపం. ప్రాతస్సాయంసమయాలలో దేవతల నుద్దేశించి ఈ యజ్ఞం ఆచరింపబడుతుంది. పితృయజ్ఞం తర్పణశ్రాద్ధరూపంగా రెండు రకాలు. ఏవిధానం దేవతలకు తర్పణాన్ని (తృప్తిని) కల్గిస్తుందో అది తర్పణరూపమౌతుంది. ఏవిధానం శ్రద్ధగా నిర్వహింపబడుతుందో అదే శ్రాద్ధరూపం. నరయజ్ఞ, అతిథియజ్ఞ, భూతయజ్ఞాలు, వారిని సేవించడం ద్వారా సిద్ధిస్తాయి. ఈ యజ్ఞానుష్ఠానంచేత గృహస్థుకు శుభం కలుగుతుంది.

**సౌత్రామణి :**

సంవత్సరసత్రమైన సౌత్రామణియజ్ఞాన్ని గురించి విశేషంగా 12వ కాండలో నిరూపింపబడింది. ఈ సౌత్రామణేష్టి ఊర్ధ్వలోకాన్ని పొందినవారిని గురించి చేసేది. ఈ యాగాన్ని పశుయాగంగా చెప్పవచ్చు. అశ్వినీ దేవతలు, సరస్వతి, ఇంద్రుడు మొ॥ దేవతలు, గొఱ్ఱె, మేక, ఎద్దు మొ॥ పశువుల, సురాపానం, క్షీరపానం మొ॥ విషయాలు ఈ సందర్భంలో నిరూపించబడినాయి. అలాగే అశ్వమేధం, నృమేధం, సర్వమేధం, పితృమేధం మొ॥ యాగాల గురించిన విశేషాలు మనకు శతపథం 13వ కాండలో లభిస్తాయి.

## ఉపాఖ్యానాలు

ఇలా శతపథంలో అనేక యాగాల అనుష్ఠాన విధానం వివరింపబడింది. ఇలాగే ఈ బ్రాహ్మణంలో అంకురావస్థలో ఉన్న బౌద్ధ సాంఖ్యమతాలు మన దృష్టికి అందుతాయి. మహాభారత ప్రసిద్ధుడైన జనమేజయుని వృత్తాన్తం ఇందులో ఉన్నప్పటికీ పాండవప్రసక్తి నామమాత్రంగాకూడా కనపడదు. అలాగే ఇందులోని అర్జున శబ్దం కేవలం ఇంద్రుణ్ణి తెలియజేస్తుంది గాని కౌంతేయుడైన అర్జునుణ్ణి తెలుపదు. రామాయణంలోని జనకుడు మిథిలాధిపతిగా సీతకు తండ్రిగా ఇందులో పేర్కొనబడ్డాడు. ఈ తీరుగా ఊర్వశీపురూరవసుల ప్రణయవృత్తాన్తం, అలాగే శకుంతలాదుష్యంతుల తనయుడైన భరతుని ఉదంతంకూడా వర్ణింపబడినాయి. ప్రళయానికి సంబంధించిన మను-మత్స్యాలవృత్తాన్తం రమణీయంగా వర్ణింపబడింది.

ఇలా శతపథబ్రాహ్మణం అనేక యజ్ఞాలను వివరిస్తూ, ఎన్నో ఉపాఖ్యానాలను పేర్కొంటూ యాగాల ఆధ్యాత్మికతత్త్వాన్ని, మహామహుల చరిత్రలను మనకందిస్తున్నది.

- ఎస్.బి.ఎస్.

# తలవకారబ్రాహ్మణం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 2. విశేషవిభాగం

## 2.5 తలవకారబ్రాహ్మణం

### 2.5.1 పరిచయం

వేదవ్యాసుని శిష్యుడు జైమిని. జైమిని శిష్యుడు తలవకారుడు. జైమినిచేత రచింపబడి, శిష్యుడైన తలవకారునిచేత ప్రచారంలోకి తీసుకొనిరాబడ్డ బ్రాహ్మణం ఇది. సామాన్యంగా ఈలోకం రచయిత కంటే ప్రచారకుణ్ణే బాగా గుర్తించుకుంటుంది. ఇక్కడా అదే జరిగింది. కొందఱు జైమినీయ బ్రాహ్మణమని పిలిచినా తలవకార బ్రాహ్మణమనే పేరు దీనికి మిగిలిపోయింది.

సామవేదానికి గల అనేక బ్రాహ్మణాల్లో తలవకారబ్రాహ్మణం ఒకటి. ఇది జైమినీయశాఖకు సంబంధించింది కాబట్టి దీన్ని జైమినీయ బ్రాహ్మణమని కూడా పిలుస్తున్నారు. సామవేదానికిగల వెయ్యిశాఖల్లో తలవకారశాఖ ఒకటని, ఆ శాఖకు సంబంధించింది కాబట్టి తలవకార బ్రాహ్మణమనే వ్యవహారం ఏర్పడిందని కొందఱు ఊహిస్తున్నారు. ఏమైనా

జైమిని రచనకు జైమినీయ శాఖాసంబంధం లేదనడం సమంజసం కాదేమో! కర్ణాటకదేశంలో ఇది బాగా ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది.

- ఎస్.బి.ఆర్.

### 2.5.2 విభాగం

తలవకారబ్రాహ్మణంలో అగ్నేయ-ఐంద్ర-పవమాన-అరుణ-శుక్రియాలనే పేరుతో ఐదు కాండలున్నాయి. ఇందులోని నాల్గవ కాండకు 'ఉపనిషద్బ్రాహ్మణ'మని పేరు. చివరికాండకు 'ఆర్షేయ బ్రాహ్మణ'మని పేరు. మొదటి మూడుకాండల్లో ఉన్న ఖండల సంఖ్యలో ఏకాభిప్రాయం లేదు. కొందరు మొదటికాండలో 360 ఖండలు, రెండోకాండలో 437 ఖండలు, మూడో కాండలో 385 ఖండలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. ఇతరులు ఈ క్రింది విధంగా ఖండవిభాగం చేస్తున్నారు :

| | పేరు | ఖండలు |
|---|---|---|
| 1. | మహాబ్రాహ్మణం | 360 |
| 2. | ద్వాదశాహబ్రాహ్మణం | 388 |
| 3. | మహావ్రతబ్రాహ్మణం | 152 |
| 4. | ఏకాహబ్రాహ్మణం | 153 |
| 5. | అహీనబ్రాహ్మణం | 99 |
| 6. | సత్రబ్రాహ్మణం | 37 |
| 7. | ఆర్షేయబ్రాహ్మణం | 84 |
| 8. | ఉపనిషద్బ్రాహ్మణం | 154 |
| | మొత్తం | 1427 |

ప్రపంచహృదయం (పే.20) ఈ బ్రాహ్మణంలో 1348 ఖండలున్నట్లు తలవకారారణ్యకంలో 150 ఖండలున్నట్లు పేర్కొంటున్నది. ప్రస్తుతం దొరుకుతున్న లోకేశచంద్ర సంస్కరణంలో మొదటికాండలో 364 ఖండలు, రెండవకాండలో 442 ఖండలు, మూడవకాండలో 386 ఖండలు మొత్తం 1192 ఖండలు కనపడుతున్నాయి. ఇంతవరకు ఈ బ్రాహ్మణానికి విమర్శాత్మక

సంస్కరణం (critical edition) సరైనది రాకపోవడంవల్ల ఇదమిత్థమైన ఖండలసంఖ్య చెప్పడానికి వీల్లేకపోతున్నది.

విషయవిభాగం :

కర్మప్రతిపాదకమైన మొదటి మూడుకాండల్లోను, నిత్యాగ్నిహోత్రం, అగ్నిష్టోమం, ప్రాయశ్చిత్తాలు మొదటికాండలోను, రెండవ కాండలో గవామయనం, ఏకాహాలు, అహీనాలు, సత్రాలు, మూడవ కాండలో ద్వాదశాహాలు వివరింపబడ్డాయి. నాల్గవకాండ జ్ఞానపరమై ఆరణ్యకభాగంలా కనబడుతుంది. ఇందులో సామగాచార్యుల అనుక్రమణికలు, ప్రాణపూర్వావస్థావిచారం, సావిత్రీమంత్రార్థం, కేనోపనిషత్తు ఉన్నాయి. ఆర్షేయబ్రాహ్మణమనే పేరుగల అయిదవ కాండ సామద్రష్టలైన మహర్షుల వంశానుక్రమణికను వర్ణిస్తున్నది. ఇందులో మొదటి మూడుకాండలు మాత్రమే తలవకారబ్రాహ్మణ భాగంగా తీసుకోవడం జరిగింది.

మొదలు - చివర :

ఈ బ్రాహ్మణం "తద్ యదాహుః - కేన జుహోతి కస్మిన్ హూయత ఇతి" అనే మంత్రంతో ప్రారంభమై "ఏష ఏవేదం సర్వమ్ ఇత్యుపాసితవ్యమ్" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

- ఎస్.బి.ఆర్.

### 2.5.3 సంకలనకాలం

దేశం :

ఈ బ్రాహ్మణం ఎక్కడ రచింపబడిందనే విషయాన్ని ఖచ్చితంగా తేల్చి చెప్పడం చాలా కష్టం. ఈ బ్రాహ్మణాన్ని రచించిన జైమిని మహర్షి ద్వైతవనంలో పుట్టడంచేత, సింధునదీ ప్రశంస ఈ బ్రాహ్మణంలో కనబడటంచేత, సామసంహితలాగానే సింధునదీతీరంలోనే ఈ బ్రాహ్మణంకూడా పుట్టి ఉంటుందని విమర్శకుల విశ్వాసం. కురుక్షేత్రం సమీపంలో ఉన్న 'శర్యణావత్' అనే సరస్సును ఈ బ్రాహ్మణం కీర్తించడం ఇది అక్కడే రచింపబడి ఉంటుందనే వాదానికి బలాన్నిస్తుంది.

కాలం :

యజ్ఞయాగాలకు సామవేద బ్రాహ్మణాలకు అవినాభావ సంబంధం ఉంది. యాగాల పుట్టుపూర్వోత్తరాలను పరిశీలించేవాళ్ళు సామవేద బ్రాహ్మణాలు, యాగాలు ఒకేసారి పుట్టి ఉంటాయని భావిస్తున్నారు. పంచవింశ బ్రాహ్మణమనే ప్రసిద్ధిగల తాండ్యబ్రాహ్మణం, జైత్రీయబ్రాహ్మణం బ్రాహ్మణ వాఙ్మయంలో మొదటి రెండు స్థానాలను ఆక్రమిస్తుంటే తలవకారబ్రాహ్మణం మూడవస్థానంలో రాణిస్తున్నది. ఆధునిక విమర్శకుల దృష్టిలో క్రీ.పూ 8వ శతాబ్దంలోనే పై రెండు బ్రాహ్మణాలతోపాటు ఇదికూడా పుట్టిఉంటుందని ఇందులోని విషయ విశేషాలనుబట్టి ఊహించడానికి వీలుపడుతున్నది.

- ఎస్.బి.ఆర్.

## 2.5.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

వ్యాఖ్యానాలు :

జైమినీయబ్రాహ్మణమనే ప్రసిద్ధికల తలవకారబ్రాహ్మణానికి ప్రసిద్ధమైన భాష్యాలేవీ లేవు. సాయణాచార్యుడు దీనికి భాష్యం వ్రాయలేదు. భవత్రాతుడనే వాడు దీనికి భాష్యం వ్రాసినట్లు చెబుతారు.

ప్రచురణలు :

జైమినీయ బ్రాహ్మణంలోని ఉపాఖ్యానాలను ఎ.సి.బర్నెల్, డబ్ల్యు.విట్నీ 1884 లోను, పారిస్‌లో JAOS 14,15,18,19,23,26,28 భాగాల్లో హెచ్.ఓర్టెల్ 1897 లోను, ప్రచురించారు. ఈ బ్రాహ్మణంలోని కొన్ని భాగాలను డబ్ల్యు.కాలండ్ జర్మన్ భాషానువాదంతో సంపాదించి 1919లో ప్రచురించాడు.

ప్రొ॥ రఘువీర, డా॥ లోకేశచంద్ర నాగపూర్‌లో 1954లో జైమినీయ బ్రాహ్మణం మూడుకాండలను మొట్టమొదటి విమర్శాత్మక సంస్కరణంగా ప్రచురించారు. కాని దీన్ని విశిష్టసంస్కరణంగా ప్రొ॥ విల్‌హెల్మ్‌రావ్ (Prof. Whilhelm Rau) అంగీకరించలేదు. ప్రొ॥ కర్ల్ హాఫ్‌మన్ (Karl Hoffmann) (పశ్చిమజర్మనీ), ప్రొ॥ హెచ్.డబ్ల్యు.బోడేవిట్ (H.W. Bodewitz) (నెదర్లాండ్స్) మొ॥ వాళ్లు ఈ బ్రాహ్మణంపైన ఇంకా పరిశోధన సాగిస్తూనే ఉన్నారు.

- ఎస్.బి.ఆర్.

## 2.5.5 ప్రసిద్ధి

జైమినీయబ్రాహ్మణానికి ఆర్షేయబ్రాహ్మణమని, తలవకార బ్రాహ్మణమని కూడా పేరు ప్రసిద్ధులేర్పడినాయి. సామగాచార్యులలో జైమినిమహర్షి ప్రసిద్ధుడు. ఈ బ్రాహ్మణం ఆయనచే చెప్పబడటంవల్ల జైమినీయమని, ఆయన శిష్యుడైన తలవకారునివల్ల బాగా ప్రచారంలోకి రావడంవల్ల తలవకారబ్రాహ్మణమని ప్రసిద్ధిని పొందింది.

అగ్నిష్టోమ-గవామయన-ఏకాహ-అహీన-సత్రయాగాలను ఇతర బ్రాహ్మణాల్లాగానే ఈ బ్రాహ్మణం కూడా ప్రతిపాదిస్తున్నది. కాని ఇందులో పేర్కొనబడ్డ ద్వాదశాహయాగాలు ఈ బ్రాహ్మణానికి గొప్ప ప్రసిద్ధిని సంపాదించాయి. ఇలా కర్మకాండను ప్రతిపాదించే బ్రాహ్మణమైనా ఇందులో ఎన్నో లోకోక్తులు చారిత్రిక - వైజ్ఞానికవిశేషాలు, ధార్మిక - ఆధ్యాత్మిక తత్త్వాలు చక్కగా పొందుపరచబడినాయి. ఉదాహరణకు చూడండి:

"పెద్దగా మాట్లాడకు! నేలకు చెవులున్నాయి[1]" అనే మాట ఈనాటి సమాజంలో ప్రసిద్ధమైన "పెద్దగా మాట్లాడకు! గోడకు చెవులుంటాయి" అనే సామెతకు మూలంగా కనబడుతుంది. ఇలాగే చంద్రుడిలోని మచ్చ కుందేలేనని (1-28) సోమరసబిందువులు పడటంవల్లనే ఈభూమిమీద లతలు-ఓషధులు పుట్టాయని ఇంకెన్నో విశేషాలను ఈ బ్రాహ్మణం వివరిస్తూ మంచి ప్రసిద్ధిని సంపాదించింది.

చరణవ్యూహం "కర్ణాటకే జైమినిః ప్రసిద్ధః" అని జైమిని మహర్షి కర్ణాటకదేశంలో ప్రసిద్ధుడని పేర్కొనడంవల్ల, ఈశాఖకు సంబంధించిన సాహిత్యమంతా ఆరాష్ట్రంలో ఒకప్పుడు బాగా ప్రసిద్ధిని పొందిందని తెలుస్తున్నది.

- ఎస్.బి.ఆర్.

1. మెన్నైరితి హోవాచ. కర్ణినీ వై భూమిరితి 1. 126

### 2.5.6 యజ్ఞయాగాలు

వైదికకర్మలనాచరించడం వల్ల కేవలం ఆ వ్యక్తికి మాత్రమే గాక సమాజానికంతటికీ కల్యాణం కలుగుతుంది. జైమినీయబ్రాహ్మణమనే ప్రసిద్ధికల తలవకారబ్రాహ్మణంలో ఏయే యాగాలు ఉపదేశింపబడ్డాయో వాటిలో విశేషాలేమిటో ఇక్కడ సంగ్రహంగా తెలుసుకుందాం.

ఆహితాగ్ని అంటే ఎవరు?

జైమినీయబ్రాహ్మణంలో మొట్టమొదట చెప్పబడిన కర్మ "అగ్ని హోత్రం". ఇందులో అగ్నినుద్దేశించి మొదటహోమం చేయబడుతుంది. కాబట్టి దీనికి అగ్నిహోత్రమనే పేరు వచ్చింది. దీనిని "ఆహితాగ్ని" అయినవాడు ఆచరించాలి. ఆహితాగ్ని అంటే ఎవరు? స్వర్గాదిఫలాలను ఉద్దేశించి, జ్యోతిష్టోమాది కర్మలు ఆచరించబడుతున్నాయి కదా! ఆ కర్మలనాచరించాలంటే కొన్ని అర్హతలు ఉన్నాయి. వాటిలో ఒకటి "అగ్నిసిద్ధి". "అగ్న్యాధానం" అనే యాగాన్ని అనుష్ఠించి అగ్నులను సంపాదించాలి. తర్వాత చేయబడే యాగాలన్నీ ఈ అగ్నిలోనే చేయబడతాయి. అంటే ఈ "అగ్న్యాధానం" అన్ని యాగాలకు మూలమన్నమాట. దాన్ని అనుష్ఠించిన వాడు మిగిలిన యాగాలను అనుష్ఠించడానికి కావలసిన అర్హతతోబాటు "ఆహితాగ్ని" అనే పేరును కూడ పొందుతున్నాడు. ఇలాంటి వ్యక్తి మాత్రమే అగ్నిహోత్రాన్ని ఆచరించాలి.

సాయంకాలం పూర్తిగా సూర్యుడస్తమించడానికి ముందు (తెల్లనైన ఎండకనబడుతున్న సమయం) ప్రాతఃకాలంలో, సూర్యోదయానికి ముందు అగ్నిహోత్ర హోమాన్ని చేయాలి. ప్రధానంగా రెండు హోమాలను ఉదయం, మరి రెంటిని సాయంకాలం చేయాలని జైమినీయ బ్రాహ్మణం (1-26) చెబుతోంది. మొదటి ఆహుతికి దేవత అగ్ని, రెండవదానికి ప్రజాపతి. హోమద్రవ్యం ఆవుపాలు. మోదుగ సమిధలు. దేవతలొకప్పుడు మృత్యురూపునైన

అగ్నిని జయించదలచి ఆజ్యంతో హోమం చేయగా, ఆ అగ్ని మరింత విజృంభించాడట. అప్పుడు దేవతలు ఆవుపాలను, సోమరసాన్ని హోమంచేసి శాంతింపజేశారట (1-12.13). అందుచేత ప్రస్తుతాగ్ని హోమంలో కూడా వాటినే ద్రవ్యాలుగా ఉపయోగిస్తున్నారు. గోక్షీరం సాక్షాత్తుగా వినియోగింపబడుతోంది. ఇక మోదుగ (పలాశ) చెట్టు సోమపర్ణం నుంచి పుట్టిందని శ్రుత్యంతరం (తై.బ్రా. 1-1-3) చెబుతుండటంచేత సోమంకూడా పరోక్షంగా వినియోగింపబడినట్లే. ఈ అగ్నిహోత్ర కర్మను మధ్యలో వదిలేయక జీవితాంతం ఆచరించాలి. ఇలా చేయటంవల్ల యజమాని అన్ని పాపాలనుంచి విముక్తుడవుతాడు. (1-09). అమృతత్వాన్ని పొందగలడని (1-2) ఈ బ్రాహ్మణం చెబుతోంది. మొత్తంమీద ఈ అగ్నిహోత్రాన్ని యథావిధిగా ఆచరించేవాడు ఆరోగ్యసుఖశాంతులతో పూర్ణాయుర్దాయాన్ని పొందగలడని తెలుస్తోంది.

మొదటికాండలో ప్రధానంగా నిరూపింపబడింది అగ్నిష్టోమం. ఈ యజ్ఞంలో అగ్నిని స్తుతించే సామ చివరిది కాబట్టి దీనికి "అగ్నిష్టోమం" అనే పేరు వచ్చింది. దీనికే "జ్యోతిష్టోమం", "సోమయాగం" అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇది సోమయాగాలన్నిటికీ ప్రకృతి. అంటే మిగిలిన సోమయాగాలన్నీ కొద్దిపాటి మార్పులతో దీనిలాగానే అనుష్ఠింపబడతాయన్నమాట. ఈ అగ్నిష్టోమాన్ని పరిపక్వమైన మనస్సుగల ఆహితాగ్ని అనుష్ఠించాలి.

ఈ యజ్ఞాన్ని ప్రశంసించే వాక్యాలు వేదాలలో అసంఖ్యాకంగా కనబడుతున్నాయి. ప్రజాపతి ప్రాణులను సృష్టి చేయడానికి ఉపాయాన్ని అన్వేషిస్తుండగా "అగ్నిష్టోమం" స్ఫురించిందట. దాన్ని అనుష్ఠించి ఆయన ప్రాణులను సృష్టిచేయగలిగాడు (తా.బ్రా 2-69). దేవతలలో అందరికన్నా పెద్దవాడు ప్రజాపతి. ఆయనచేత అనుష్ఠింపబడింది కావటంచేత దానికి 'జ్యేష్ఠ' యాగమనే పేరుకూడ వచ్చింది. అంతేకాదు యజమానికి ఫలసమృద్ధిని చేకూర్చటంలో కూడా ఇది జ్యేష్ఠయాగమే. ఈ యాగాన్ని అనుష్ఠించడంవల్ల

ప్రజాపశుసమృద్ధియేగాక, విశేషించి సోమయాగఫలాలైన దీప్తి, స్ఫూర్తి, ఓజస్సు మొదలైన వాటినికూడ పొందవచ్చు.

"జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత" అనే విధివాక్యం, జ్యోతిష్టోమ అనుష్ఠానంవల్ల స్వర్గం సిద్ధిస్తుందని చెబుతోంది. స్వర్గమంటే మరణానంతరం లభించే లోకంకాదు. స్వర్గశబ్దానికి "సుఖం" అని అర్థం. లోకంలో కొందరికి ధనం కావాలి, కొందరికి ధాన్యం కావాలి; మరికొందరికి ఇంకేవో కోరికలుంటాయి. కాని సుఖం మాత్రం అందరికీ కావాలి. ఈ సుఖం మరణానంతరమే లభించనక్కరలేదు. జీవించి ఉండగానే ఈ లోకంలో కూడా అనుభవించవచ్చు. ఇన్ని ప్రయోజనాలను అందిస్తున్న ఈయాగ స్వరూపం, ఆచరించే పద్ధతి ఎలాంటిదో, దాన్ని గురించి జైమినీయ బ్రాహ్మణం ఏమి చెబుతోందో తెలుసుకుందాం.

యజమాని భార్యతో సహా శుభముహూర్తంలో 'అగ్నిష్టోమ' యాగాన్ని చేస్తానని సంకల్పించి యాగాన్ని తనచేత సక్రమంగా అనుష్ఠింపజేయుటంలో సమర్థులైన ఋత్విక్కులను ఆహ్వానించటానికి ఒక దూతను పంపాలి.

వైదిక పరిభాషలో అతనికి 'సోమప్రవాకుడ'ని పేరు. ఇతనిచేత ఆహ్వానింపబడి వచ్చిన సమర్థులైన ఋత్విక్కులను యజమాని ఆయా కార్యాలకు నియోగిస్తాడు. సోమయాగంలో ఋత్విక్కుల సంఖ్య 16. వారిని నాలుగు గణాలుగా విభజించవచ్చు. ఆయా గణాలకు అధ్వర్యుడు, బ్రహ్మ, హోత, ఉద్గాతలు నాయకులు. వారిలో అధ్వర్యుడు ప్రధానంగా యజస్సులతోనూ, హోత ఋక్కులతోను, ఉద్గాత సామలతోను, యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వర్తిస్తుంటే నాల్గు వేదాలు తెలిసిన బ్రహ్మ కర్తవ్యంలో ఏ లోపం రాకుండా కనిపెట్టి ఉండి ఋత్విక్కులు వారివారి పనులలో చక్కగా ప్రవర్తించేటట్లు చూస్తుంటాడు.

ఈ ఋత్విక్కులు, వారి పనులను గురించి జై.బ్రా. (1-75, 76) విశదంగా తెలుపుతోంది. యాగారంభంలో అధ్వర్యుడు "దీక్షణీయ" అనే ఇష్టిని జరిపి యజమానికి అతని భార్యకు 'దీక్ష'ను ఇస్తాడు. దీక్షా కాలంలో యజమానిదంపతులు, వెన్నను వంటికి రాచుకొని కంటికి కాటుక పెట్టుకొని ఉండాలి. యజమాని గోటితో గోకుకొనకూడదు. జింకకొమ్మును ఇందుకు వాడాలి. ఆహారం-పాలు, అత్తిపండ్లు, పెరుగు, పేలాలు; వీటితో కడుపు నింపుకోలేకపోతే వట్టి అన్నం మాత్రం తినవచ్చు. అపశబ్దాలను, అసత్యాలను పల్కడం, పళ్ళు కనబడేటట్లు నవ్వడం, స్త్రీ ముఖం-వీటిని పరిత్యజించాలి. యజ్ఞశాల విడిచిపోకూడదు. ఋత్విక్కులకు దక్షిణ ఇచ్చేవరకు, ఎవరికీ, ఏమీ తనచేతితో ఇవ్వకూడదు. దీక్షితుడు (యజ్ఞదీక్షను స్వీకరించిన యజమాని) యజ్ఞానికి కావలసిన ద్రవ్యాన్ని తేవటానికి యాచకులను నాలుగు దిక్కులకు పంపాలి. ఇది యజ్ఞ విధి. కనుక ధనవంతుడు కూడా ఈ విధంగా యాచించాలి. యాచకులను పంపటంలో ప్రథమ దినకర్తవ్యం ముగుస్తుంది.

రెండవరోజున "ప్రాయణీయ" అనే ఇష్టి జరిపిన తర్వాత వస్త్రాన్నిచ్చి సోమలతను కొనాలి (ప్రస్తుతకాలంలో సోమం దొరకటం లేదు కాబట్టి దానికి బదులు 'పూతిక'ను వాడుతున్నారు). ఈసోమాన్ని "రాజ" అని వేదం చెబుతోంది. రాజు మన ఇంటికి వచ్చినప్పుడెలా ఆతిథ్యమిస్తామో అలాగే సోమానికి కూడా ఇవ్వాలి. ఈ ప్రక్రియను 'ఆతిథ్యేష్టి' అని పిలుస్తారు. ఈ ఇష్టి తర్వాత ఋత్విక్కులందరు, యజమాని, పరస్పరం స్నేహంగా ఉంటామని, పాత్రలో ఉన్న నేతిని స్పృశించి ప్రతిజ్ఞ చేస్తారు.

తరువాత 'ప్రవర్గ్యకర్మ' ప్రారంభమౌతుంది. మన శరీరంలో శిరస్సు ఎంత ప్రధానమైందో సోమయాగంలో ఇది అంత ప్రధానమైంది. యజ్ఞరూపుడైన విష్ణువు ఒకప్పుడు ధనుర్యుద్ధంలో దేవతల నోడించి, ధనుస్సును గడ్డంక్రింద ఉంచుకొని విలాసంగా నిలబడి చూస్తున్నాడట. ప్రతీకారేచ్ఛతో ఇంద్రుడు

చెదలుపురుగులను పంపి, ఆ ధనుస్సు అల్లె(త్రాటిని కొరికించడంతో బంధం ఊడిపోయి అమితవేగంతో ధనుస్సు కర్ర పైకెగసి విష్ణువు శిరస్సు శరీరంనుండి వేరయింది. ప్రతిక్రియ జరిగింది కాని, (విష్ణువు యజ్ఞరూపుడు కాబట్టి) యజ్ఞం విచ్ఛిన్నమైంది. అప్పుడు అశ్వినీదేవతల సహాయంతో ఆ శిరస్సును అతికించి, యజ్ఞాన్ని పూర్తి చేశారట దేవతలు. దీన్ని అనుకరిస్తూ సోమయాగంలో 'మహావీర' అనే (శిరస్సులాంటి) కుండ ఒకటి మంత్ర పూర్వకంగా తయారు చేయబడుతుంది. దీనిలో ఆవు మేకపాలను నేతిని పోస్తారు. పిదప దీనితో హోమం జరుగుతుంది. ఇది ప్రవర్గ్యమంటే. 'ఉపసత్' అనే పేరుగల ఇష్టితో రెండవరోజు కార్యక్రమం పూర్తి అవుతుంది.

'సుత్య' అంటే అయిదవరోజు జరగబోయే సోమయాగానికి కావాల్సిన వేదికను సిద్ధంచేయటం. ఇది మూడవరోజు కార్యక్రమంలోని ప్రధానఘట్టం.

నాల్గవరోజున "అగ్నిష్టోమీయ" పశుయాగం జరుగుతుంది. యజమాని దంపతులు రాత్రి జాగరణచేయాలి. అయిదవరోజే అగ్నిష్టోమమంతటికీ ప్రధానమైంది. ఈ రోజునే సోమలతను రాతిపై ఉంచి రాతితో దంచి రసం తీసి ఆ రసాన్ని కొయ్యతో తయారుచేసిన "గ్రహం" అని పిల్వబడే చిన్నపాత్రలలో పోసి ఇంద్రాది దేవతల నుద్దేశించి హోమం చేయడం జరుగుతుంది. హోమంచేయగా మిగిలిన రసాన్ని ఋత్విక్కులు యజమాని త్రాగుతారు. ఓషధులకు రాజుగా ప్రశంసింపబడిన సోమాన్ని రాళ్ళతో పీడించి రసం తీయటం హింస కాదా? అవును. అది హింసే. దానివల్ల కలిగే దోషం "వసతీవరా" (పుణ్యజలం) యొక్క స్పర్శచేత నశిస్తుంది (జై.బ్రా.1-82)

అదే రోజు (1) ప్రాతస్సవనం, (2) మాధ్యందినసవనం (3) తృతీయ సవనం అని మూడు ప్రధానయాగాలు, తర్వాత అవభృథేష్టి జరుగుతాయి. తృతీయసవనానికి ముందే ఋత్విక్కులకు దక్షిణల నివ్వాలి. అవభృథంలో

ఋత్విక్కులు యజమాని దంపతులను పవిత్రజలంతో అభిషేకిస్తారు. దీనితో యాగం పరిసమాప్త మవుతుంది.

హోతృగణం సామలతో యజ్ఞకార్యాన్ని నిర్వహిస్తుందని తెలుసుకున్నాం గదా! ఇవన్నీ సామవేదంలోవివి. తలవకారబ్రాహ్మణం వీటిమీద చక్కగా వివరణ ఇస్తున్నది. ఉదాహరణకు - గాయత్రసామను తీసుకుందాం. దీని గొప్పదనాన్ని తెలియజేస్తూ "ప్రజాపతి ప్రజలను సృష్టి చేశాడు. అయితే ఆ సృష్టి అంతా నిర్జీవంగా కన్పించింది. అప్పుడాయన 'గాయత్రసామ'ను గానంచేసి ప్రాణాన్ని నింపాడు" అని చెప్పబడింది (1-3). గాయత్రసామను పఠించేవాని ప్రాణాలకు ఎప్పుడూ రక్షణ ఉంటుంది. "గాయత్రి" అనే పేరులో అంతరార్థం కూడా ఇదే. రథన్తరం బహిష్పవమానం మొ॥ కూడా ఇలాంటివే దేవతలు సామగానంద్వారా రాక్షసులను యుద్ధంలో ఓడించినట్లు, మరికొన్ని సందర్భాలలో వాళ్ళను తరిమివేసి, ఈ భూలోకాన్ని ఆక్రమించకల్గినట్లు తెలుస్తోంది (1-105). తలవకార బ్రాహ్మణంలోని అనేకవాక్యాలను పరిశీలిస్తే అగ్నిష్టోమం, సామగానం శత్రువినాశనాన్ని కలిగిస్తాయని బోధపడుతుంది. దేవతలు అలా రథన్తరాది సామలను గానంచేస్తూ రాక్షసులను పీడించి, పారద్రోలారట (1-154).

సందర్భం వచ్చింది గనుక సోమయాగంలో జరిగే కొన్ని పొరపాట్లను ఎలా సరిదిద్దుకోవాలని వేదం చెబుతున్నదో చూద్దాం. సోమరసాన్ని, హోమం చేయుడానికి ముందు 'ద్రోణకలశం' అనే పాత్రలో పోస్తారు. ఒకవేళ ప్రమాదవశాత్తు సోమరసం దానినుంచి పారిపోయినట్లయితే యజమాని ఆయుస్సుకూడా అంతటితో తీరి పోయినట్లే. అయితే అదే పాత్రలో ఆవుపాలను పోసి యథావిధిగా యాగం చేసినట్లయితే సోమయాగమే చేసినట్లవుతుంది. యజమానుడు పరిపూర్ణాయుర్దాయం కలవాడౌతాడు (1-79, 80). పొరబాటున ద్రోణకలశం పగిలిపోతే "బ్రహ్మసామ"తో ప్రాయశ్చిత్తం

చేసుకోవాలి. యాగంకోసం తెచ్చిన సోమలత దొంగిలించబడితే దగ్గరలో దొరికే సోమలతను తెచ్చి యాగం పూర్తి చేయాలి. మళ్ళీ శాస్త్రోక్తంగా సోమక్రయణం చేయరాదు. మహావీరం (ప్రవర్గ్యపాత్ర పగిలిపోతే) 'య ఋతే చిదభిశ్రిష' అనే మంత్రంతో దాన్ని స్పృశించాలి.

యాగవివరణతో బాటు వేదం మనకు అనేక వైజ్ఞానిక విషయాలను తెలుపుతున్నది. అగ్నిష్టోమాదియాగాలలో ఉదుంబరం - 'మేడిచెట్టు' యొక్క కొమ్మలు సమిధలు అనేక విధాలుగా ఉపయోగించబడుతున్నాయి. ఈ ఉదుంబర వృక్షం, ప్రజాపతి, దేవతలకు అన్నసారాన్ని పంచి ఇస్తుండగా పక్ష బిందువులనుంచి ఆవిర్భవించింది. అన్నసారంలోనించి పుట్టింది కావడంచేత దీనిపండు చాలా పుష్టికరం. ఈ చెట్టుకొమ్మలను కొట్టినప్పుడు, పుల్లలను విరిచినప్పుడు పాలవంటి జిగురుగా ఉండే రసం స్రవిస్తుంది. దాన్ని పాలలో కలిపితే పెరుగు తయారౌతుంది. ఈ పెరుగు సోమరసంయొక్క గుణాలను కల్గి ఉంటుంది. ఇలాంటి పెరుగునే యజ్ఞాలలో వాడుతుంటారు.

అగ్నిష్టోమాది యాగాలను అనుష్ఠించడంవల్ల కేవలం ఆ యజమానికి ఒక్కడికే కాదు, అందరికీ ప్రయోజనం ఉంటుంది. అగ్నిష్టోమాన్ని అనుష్ఠించిన దేశంలో వర్షాలు సకాలంలో చక్కగా కురుస్తాయి. పంటలు చక్కగా పండుతాయి. ఓషధులు, వనస్పతులు మంచి ఫలాలను ఇస్తాయి. నదులు నిండుగా ప్రవహిస్తాయి. శత్రువులు నశిస్తారు. ప్రజలకు ఈతిబాధలుండవు (1-361).

అగ్నిష్టోమం సోమయాగాలకన్నిటికీ ప్రకృతి అని చెప్పబడింది. దాని వికృతులను కొన్నిటిని జై.బ్రా. 2-81 నుంచి 234 వరకు చూడవచ్చు. ఇవన్నీ ఒకేరోజులో పూర్తి చేయటానికి వీలైనటువంటివి. కాబట్టి వీటికి 'ఏకాహాలు' అనే పేరు వచ్చింది. లోగడ చెప్పినట్లు ఇవన్నీ కొద్దిమార్పుతో అగ్నిష్టోమంలాగానే ఉంటాయి.

ఆదిత్యుడు అన్ని పాపాలను, స్వర్గాన్ని అతిక్రమించిపోవాలను కొన్నాడట. అప్పుడు ఆయన 'శరం' అనే యాగాన్ని అనుష్ఠించి తన లక్ష్యాన్ని పొందాడు. మానవుడు కూడా దాన్ని ఆచరించి సూర్యుడు పొందిన ఫలాన్ని పొందవచ్చు (2-82). సంతతి-పశుసంపద పొందటానికి ఏవైనా ప్రతిబంధకాలుంటే, వాటిని తొలగించడానికి 'ఉపశరం' అనే యాగాన్ని అనుష్ఠించాలి. పూర్వం కశ్యపుడు దీన్ని అనుష్ఠించినట్లు తెలుస్తున్నది (2-81) (3). అన్నసమృద్ధిని కోరేవాళ్ళు 'విరాట్' అనే యాగాన్ని చేయాలి. దేవతలు దీన్ని చేశారు. సమృద్ధిగా అన్నమేకాక, ఆ అన్నాన్ని జీర్ణంచేసుకునే శక్తికూడా ఈ యాగంవల్ల లభిస్తుంది. ఇలాగే 'స్వరాట్' అనే యాగానుష్ఠానం వల్ల స్వారాజ్యం సిద్ధిస్తుంది. స్వారాజ్యం అంటే తనకు తానుగా ప్రకాశించే లోకం. 'ఋషభం'-ఋషభశబ్దానికి శ్రేష్ఠం అని అర్థం. ఇంద్రుడీ యాగాన్ని అనుష్ఠించి దేవతలలో శ్రేష్ఠుడైనాడు (2-87) 'వ్యోమ' అనే యాగంవల్ల వ్యోమలోకాన్ని పొందవచ్చు (88).

ఉద్భిద్బలభిద్యాగాలు:

జంటగా ఉండే కొండగుహాలవంటి చీకటి ప్రదేశాల్లో నివసించే 'బలుడు' అనే రాక్షసుడు దేవతలను అమితంగా పీడించేవాడట. దేవతలు వివిధంగానూ జయించలేక బృహస్పతితో మొరపెట్టుకోగా ఆయన ఈ "బలభిత్" అనే యాగాన్ని అనుష్ఠించి, బలుణ్ణి చీకటి నుండి వెలికితీసి, ఆయుధాలతో చీల్చి చంపాడట. పై ఉపాఖ్యానాన్ని (అర్థవాదాన్ని బట్టి) ఈ బలభిద్యాగం శత్రువినాశనాన్ని కలిగించేదని అర్థమౌతుంది. ఉద్భిద్యాగం పశుసంపత్తిని సంపాదిస్తుంది. ఫలాన్ని బట్టి వేరువేరైనా 'ఉద్భిద్బలభిద్యాగం' అని కలిపి చెప్పడంవల్ల ఈ రెండూ జంటగా ఉంటున్నాయి. వేదంకూడా ఈ రెంటినీ కలిపే చెప్తున్నది (90).

అలాంటిదే "సత్రాజిత్, వ్రాతవాజి" ద్యాగాలు. ఇదేవిధంగా సంఘగౌరవంకోసం 'అపచితి', అధికమైన ప్రజా-పశుసంపదకోసం 'మనస్తోమం' లేదా 'వైశ్వదేవం', శత్రుసంహారంకోసం 'పరిక్రీ', తనవారందరిలో ప్రత్యేకతను పొందడానికి 'బృహస్పతిసవం' లేదా 'ఇంద్రస్తోమం', తేజస్సు బ్రహ్మవర్చస్సు కావాలంటే 'త్రివృత్' అనే యాగాన్ని ఆచరించాలి.

ప్రజాపతి ప్రజలను సృష్టి చేశాడు. అయితే ప్రజలెవ్వరూ ఆయనను సృష్టికర్తగా గుర్తించలేదట. అందుకు ఆయన 'ఉపహవ్యం' అనే క్రతువు నాచరించి గుర్తింపు పొందాడట. మరుద్దేవతలు ఓజస్సు కలవారై, బలిష్ఠులై, శక్తివంతులై స్వర్గాన్ని జయించాలని కోరి 'పంచశారదీయాన్ని' అనుష్ఠించి ఇష్టసిద్ధిని పొందారు.

విశ్వజిత్-అభిజిత్ యాగాలు-ప్రజాసృష్టిని చేసిన ప్రజాపతి, ప్రజలు తన శ్రేష్ఠత్వాన్ని గ్రహించటానికి దిక్కులసారాన్ని, ప్రజల సారాన్ని మాలగాచేసి మెడలో ధరించాడట. ఆ మాలప్రభావంచేత ప్రజలాయన్ని గౌరవించడం ఆరంభించారట. తరువాత ఇంద్రుణ్ణి తనలాగా శ్రేష్ఠుణ్ణి చేయదలచి, ఆ మాలను అతనికి అనుగ్రహించాడట. దీనివల్ల ఇంద్రుడు విశ్వాన్నంతటినీ జయించిన వాడయ్యాడు. మానవుడు కూడా ఈ యాగంతో విశ్వాన్ని జయించవచ్చు. ఇంద్రుడు తనకు జయించ శక్యంకానిదేదీ ఉండకూడదని మరొకయాగాన్ని అనుష్ఠించాడు. అది 'అభిజిద్యాగం'. విషువక్రతువు ననుష్ఠిస్తే ప్రజలలో శ్రేష్ఠత్వం, శత్రువిజయం సిద్ధిస్తాయి. 'సాద్యస్క్యం' శత్రువుల్ని వశింపజేస్తుంది. స్వర్గాన్ని కోరేవాడు 'గోసవాన్ని' ఆచరించాలి. 'కులాయం' అనే క్రతువు సంతతి, సేవకులు, పశువులు, గృహాలు మొదలైన వాటిని ప్రసాదిస్తుంది.

రెండు మొదలు పదిరోజులవరకు చేసే క్రతువులను 'అహీనాలు' అని పిలుస్తారు. ఇలాంటివి కొన్ని జైమినీయ బ్రాహ్మణం రెండవ కాండలో "ద్విరాత్రం" (రెండురోజుల్లో జరుపబడే యాగాలు) మొ॥ పేర్లతో చెప్పబడ్డాయి. అంగిరస్సులనే మహర్షులు సామూహికంగా సత్రయాగాన్ని అనుష్ఠించి స్వర్గాన్ని పొందారు. అదే వంశానికి చెందిన 'హవిష్మాన్, హవిష్మత్' అనే ఇద్దరు మాత్రం, లౌకిక సుఖాలకు లోనై సత్రాన్ని అనుష్ఠించకపోవడంవల్ల స్వర్గాన్ని పొందలేకపోయారు. తర్వాత వారికి జ్ఞానోదయమైంది. తమ తపశ్శక్తితో 'స్వాదిష్ఠయే' 'అస్యా ప్రత్నామనుద్యుతిం' అనే సామలను చూడగల్గారు. వాటితో రెండురోజుల క్రతువునమష్ఠించి, తాము కూడా స్వర్గాన్ని పొందారు. కాబట్టి ఇప్పటికీ ఈ యాగాన్ని అనుష్ఠించేటప్పుడు, వారి పేరుతో ఆ సామలను వరుసగా మొదటి రెండవరోజులలో గానం చేస్తారు. దేవతలు 'త్రిరాత్రక్రతువు' నమష్ఠించి మానవులకంటే ఉత్కృష్టతమ, స్వర్గాన్ని సంపాదించుకోగలిగారు. అత్రిమహర్షి వీరులు జన్మించాలనే కోరికతో 'చతూరాత్ర' యాగాన్ని అనుష్ఠించి నల్గురు వీరులను కన్నాడు. అలాగే జమదగ్ని 'చతుర్రాత్ర' యాగంవల్ల బహుసంతతిని ప్రజాపశువులను పొందగల్గాడు. "జితి" అనేదొక పంచరాత్ర (అయిదురోజుల) క్రతువు. దీని అనుష్ఠానంవల్ల శత్రుసంహారం ద్వారా విజయం పొందవచ్చు. దేవతలందరిలో ఓజిష్ఠులం, బలిష్ఠులం అయి స్వర్గంలో తిరుగులేని స్థానం కలిగి ఉండాలి" అని కోరి మరుద్దేవతలు 'షడ్రాత్ర' (ఆరురోజుల) యాగంద్వారా తమ కోరికలు తీర్చుకున్నారు. 'సప్తరాత్ర' (ఏడురోజుల) యాగం సంపదలనిస్తుంది. బృహస్పతి 'అష్టరాత్ర' (ఎనిమిదిరోజుల) యజ్ఞంవల్ల తేజస్వి, యశస్వి, బ్రహ్మ వర్చస్వి అయ్యాడు. తేజస్సును కోరేవాడు 'నవరాత్ర' (తొమ్మిదిరోజుల) యాగం చేయాలి. శత్రువును చంపాలనుకుంటే 'దశరాత్ర' (పదిరోజుల) యాగం చేయాలి. యాగం పూర్తయిన పదిరోజులలో శత్రువుయొక్క ఆయుర్దాయం ముగుస్తుంది.

పన్నెండు రోజుల కాలపరిమితిగల యాగాలకు 'అహీనం' 'సత్రం' అనే రెండు పేర్లున్నాయి. జైమినీయబ్రాహ్మణం మూడవ కాండలో ఇలాంటివి కొన్ని చెప్పబడ్డాయి. జీవించినంతకాలం ఆరోగ్యంగా ఉండాలని మానవుడు కోరుతుంటాడు. ఇంద్రియాలు తమ పటుత్వం కోల్పోనంతవరకే ఆరోగ్యం ఉంటుంది. ఇంద్రియాల పటుత్వం వీర్యంవల్ల కల్గుతుంది. ఇట్టి వీర్యాన్ని కోరే వ్యక్తి 'గోష్టోమం' అనే ద్వాదశాహాన్ని అనుష్ఠించాలి. 'విజితి' అనే ద్వాదశాహం శత్రువులను నిర్మూలిస్తుంది. 'అంగిరససత్రం' స్వర్గాన్నిస్తుంది. 'మహావ్రత్ని' కుటుంబ సౌఖ్యాన్నిస్తుంది. ఇంద్రుడు 'శ్యేన' యాగాన్ని అనుష్ఠించి, అసురులను జయించి దేవతలతోసహా స్వర్గాన్ని ఆక్రమించాడు. డేగ ఏ విధంగా హఠాత్తుగా ఆకాశాన్నుంచి క్రిందకు దిగి తన ఆహారాన్ని తీసుకొని వెళ్తుందో, అలాగే ఏ శత్రువునుద్దేశించి ఈ యాగాన్ని చేస్తే ఆ శత్రువును మృత్యువు అలా కబళిస్తుంది. మేధాతిథి అనే మహర్షి ఒక సత్రయాగాన్ని చేశాడు. దానికి "మైధాతిథం" అని పేరు. ఈ యాగాన్ని అనుష్ఠిస్తే పశుసంపద కల్గుతుంది. ద్వాదశాహం యొక్క ప్రభావం చాలాగొప్పది. దీన్ని అనుష్ఠించడం వల్లే దేవతలు రాక్షసులను జయించి, స్వర్గాన్ని స్వాధీనంచేసుకోగలిగారని తలవకారబ్రాహ్మణం స్పష్టంగా చెబుతున్నది (3-300).

పదమూడు మొదలుకొని వేయి సంవత్సరాలకాలం వరకు జరిగే యజ్ఞాలను సత్రాలు అని పిలుస్తారు. తలవకారబ్రాహ్మణం ద్వితీయకాండ చివర ఇవి చెప్పబడ్డాయి. ఇంద్రుడు దేవతలందరిలోకి అగ్రగామిగా ఉండాలని కోరాడట. అతని కోర్కె తీరటానికి త్రయోదశ రాత్రసత్రమే కారణమైంది. మానవుడు కూడా దీన్ని అనుష్ఠించి శ్రేష్ఠత్వాన్ని పొందవచ్చు. 'మాస్యం సత్రం' - ఇది నెలరోజులపాటు జరిగే యాగం. సంవత్సరంలోని (మాసాలు) ఋతువులు క్రమం తప్పకుండా నడవాలని కోరేవాడు ఈయాగం చేయాలి. ద్విమాస్యం అనే క్రతువు కూడా కొంచెం ఇంచుమించు ఇలాంటి ఫలితాన్నే ఇస్తుంది. ఇలాగే త్రిమాస్యక్రతువు కూడా చెప్పబడింది.

ద్వితీయకాండలో "గవామయనం" అనే క్రతువు వర్ణింపబడింది. అయనక్రతువులన్నిటికీ ఇది ప్రకృతి. ఇది సంవత్సరకాలం (361 రోజులు) జరుగుతుంది. దీనికి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి స్వర్గం, శత్రువిజయం, వాక్పటుత్వం మొదలైనవి. పరమాత్మ సమర్పణ బుద్ధితో ఆచరిస్తే, ఇదే మోక్షానికి సాధనమౌతుంది.

ప్రాణులందరికీ హితం కల్గించడానికి అనిష్టాన్ని దూరం చేయడానికి వేదం కొన్ని కర్మలను చేయమని, కొన్నింటిని మానమని చెప్తున్నది. ఈ కర్మలలో కొన్ని నిత్యమూ - అంటే ప్రతిరోజూ చేయాల్సినవి. ఉదాహరణకు - స్నానం, సంధ్యావందనం మొదలైనవి. మరికొన్ని నైమిత్తికాలు - అంటే ఏదో సందర్భం వచ్చినప్పుడే ఆచరించాల్సినవి. గ్రహణం పట్టినప్పుడు స్నానం చేయడంలాంటివి. ఇవి రోజూ చేసేవికావు. మరికొన్ని నిషిద్ధకర్మలవేవి ఉన్నాయి. అంటే వాటిని ఎప్పుడూ చేయకూడదు. "నానృతం బ్రూయాత్" అబద్ధమాడరాదు - ఇలాంటివి. ఇలాగే (మా హింస్యాత్సర్వాభూతాని) ప్రాణులను హింసించరాదు అనేది కూడా. ఇక్కడ కొంతమందికి ఒక సందేహం కలుగుతుంది. ఏ ప్రాణినీ హింసించవద్దని చెప్పే వేదం క్రతువులలో 'మేక' మొదలైన పశువులను చంపి హోమం చేయమని ఎందుకు విధిస్తున్నది అని?

విధివాక్యాలు రెండు రకాలు. సామాన్యవిధి, విశేషవిధి అని. సామాన్యాన్ని విశేషం బాధిస్తుంది. లోకంలో ఎవరినైనా కొట్టటం తిట్టటం నేరం (ఇది సామాన్యం). కాని, గురువు శిష్యుణ్ణి కొట్టవచ్చు, తిట్టవచ్చు (ఇది విశేషం). అది వాని శ్రేయస్సు కొరకే గనుక. ఇలాగే పశుహింస క్రతువులోగాక ఇతరత్ర జరిగితే అది హింస అవుతుంది. అదే క్రతువులో అయితే అది హింసకాదు. ఎందుకంటే అలా చేయమని వేదమే చెప్పింది గనుక. ఇది ధర్మం, ఇది అధర్మం అనే సంగతి మనకు వేదంవల్లనే గదా! తెలుస్తుంది.

క్రతువులలోగాక పశుహింస ఇతరత్ర అధర్మమంటున్నది వేదం; కనుక దాన్ని చేయకూడదు. ఆ వేదమే క్రతువులలో హింస చేయమంటున్నది. ఇది ధర్మం. కనుక ఆచరణయోగ్యం.

సందర్భాన్ని బట్టి కర్మల, వస్తువుల స్వభావం మారిపోతుంది. తలారి రాజాజ్ఞమేరకు శిరచ్ఛేదం చేస్తాడు. దానికి తప్పులేదు. అతడెవరినన్నా చంపితే అది హత్య (నేరం). అలాగే మంచి ఆరోగ్యానికి బలమైన ఆహారం తినమంటాడు వైద్యుడు. ఆ వైద్యుడే జ్వరం వచ్చినపుడు ఒక్క మెతుకు కూడా తినవద్దంటాడు. ఆయుర్వేదంలో "సింహప్రతిపాలనం" అనే మందు ఉన్నది. దాన్ని పాము విషంతో తయారుచేస్తారు. మామూలు వ్యక్తి దాన్ని తింటే మరణిస్తాడు. సన్నిపాతరోగికిస్తే అతడు జీవిస్తాడు. ఇలాగే లోకంలో జరిగే హింసకు వైదిక క్రతువులలో పశుహింసకు ఎంతో తేడా ఉంది.

తలవకారబ్రాహ్మణంలో అనేక క్రతువులు చెప్పబడి ఉన్నాయి. వాటన్నిటికీ ప్రత్యేకమైన ప్రయోజనాలున్నాయి. ఈ ప్రయోజనాలన్నీ కేవలం యాగంచేసినవారికే ఉంటాయని అనుకోకూడదు. యాగం చేసినవారికి అధిక ప్రయోజనం ఉన్నా, దానివల్ల సమాజానికి కూడా కొంత ప్రయోజనం లేకపోలేదు. ఉదాహరణకు - 'మాన్యం' అనే యాగం ఉన్నది. దీన్ననుష్ఠిస్తే ఋతువులు, -వర్షాదులు సక్రమంగా నడుస్తాయి. దీనివల్ల ఆచరించినవారికే గాక లోకానికి కూడా మేలు కలుగుతుంది. అలాగే వర్షాలు కురవటానికి "కారీరిష్టి" చేయాలి. వర్షంకురిస్తే ఒక్క యజమాని ఇంట్లోనో, పొలంలోనో కాదు; అన్ని చోట్ల కురుస్తుంది. అందుచేత వైదికకర్మలు బహుజనహితాన్ని సుఖాన్ని దృష్టిలో ఉంచుకొని చెప్పబడినవేనని గ్రహించాలి. అలాగే వైదికకర్మలకు కేవలం స్వర్గాదులే ప్రయోజనం కాదు. కర్మానుష్ఠానం ద్వారా మనస్సు పరిపక్వమౌతుంది. దానివల్ల ఆత్మజ్ఞానం, దానిద్వారా మోక్షం కలుగుతాయి. కాబట్టి లౌకికసుఖాల కోసం కాక (పరమేశ్వరార్పణబుద్ధితో) త్యాగబుద్ధిని

అలవాటు చేసుకొని మోక్షాన్ని పొందాలనే దృష్టితో యాగానుష్ఠానం చేయటం అందరికీ శ్రేయస్కరం.

- ఎస్. ఎస్.ఎస్.

## 2.5.7 వైశిష్ట్యం

సకల వేదాలకు ఆచార్యుడు కృష్ణద్వైపాయన వ్యాసమహర్షి. ఆయన దగ్గర వెయ్యిశాఖల సామవేదాన్ని జైమిని మహర్షి అధ్యయనం చేసి ప్రచారం చేసినట్లు, జైమినికి తలవకారుడనే శిష్యుడున్నట్లు జైమినీయబ్రాహ్మణం మొదట్లోను చివరలోను పేర్కొంటున్నది[1]. సామవేదప్రచారకుడైన జైమిని ఈ బ్రాహ్మణాన్ని ఉపదేశించడంచేత జైమినీయబ్రాహ్మణమని, జైమిని శిష్యుడైన తలవకారుడు ప్రచారం చేయుటంచేత తలవకార (ర) బ్రాహ్మణమని దీన్ని పిలుస్తున్నారు. జైమినీయ బ్రాహ్మణమనే పేరే దీని వైశిష్ట్యాన్ని తెలుపుతోంది. సాక్షాత్తు జైమినిమహర్షే దీని ఉపదేష్టకావడంవల్ల ఇతర సామవేదబ్రాహ్మణాలకంటే ఇది ఉత్కృష్టమైందని ఊహించవచ్చు. ఈ ఊహ సత్యమని ఈ బ్రాహ్మణపరిశీలనలో అర్థమవుతుంది.

ఇతర సామవేదబ్రాహ్మణాలకంటే ఇది ఆకారంలో పెద్దది. ఆకారంలోగాని ప్రతిపాదించే విషయాలలోగాని, ఉపాఖ్యానాలలో గాని, యజ్ఞాంగాలను విమర్శించడంలోగాని, శతపథబ్రాహ్మణానికి ఇది ఏమాత్రం తీసిపోదని విమర్శకుల భావన. అయితే మన దురదృష్టంవల్ల ఈ బ్రాహ్మణం సమగ్రంగా లభించడంలేదు. దీనికి వ్యాఖ్యానంగాని, ప్రయోగంగాని, పద్ధతిగాని, శ్రౌతసూత్రంగాని ఇంతవరకు లభించలేదు. అయినా డా॥ రఘువీర, డా॥ లోకేశచంద్రల కృషివల్ల ఇది కొంత వెలుగులోకి వచ్చే అవకాశం కలిగింది. ఈ బ్రాహ్మణం కర్ణాటకదేశంలో ప్రసిద్ధికెక్కిందని చరణవ్యూహ వ్యాఖ్యానంవల్ల తెలుస్తోంది.

---

1. సామాఖిలం సకల వేదగురోర్మునీంద్రాత్
వ్యాసాదవాప్య భువి యేన సహస్రశాఖమ్ ।
వ్యక్తం సమస్తమపి మంగళగీతరాగం
తం జైమినిం తలవకారగురుం నమామి ॥

విషయవైశిష్ట్యం:

మొదటికాండలో మొదటి 65 ఖండలు విత్యాగ్నిహోత్రానికి సంబంధించినవి. తరువాతి భాగంలో అగ్నిష్టోమం, ప్రాయశ్చిత్తాలు వివరింపబడ్డాయి. ఈ భాగానికే మహాబ్రాహ్మణమని పేరు.

రెండవకాండలో మొదటి 80 ఖండలు, 371 నుండి 442 వరకు గవామయనం వివరింపబడింది. ఈ ఖండలే మహావ్రతబ్రాహ్మణమని పిలువబడుతున్నాయి. ఈ గవామయనం ఆయనాల కన్నింటికి ప్రకృతి యాగం. సూర్యకిరణాల గతిననుసరించి చేసే యాగం కాబట్టి దీనికి గవామయనం అని పేరు. ఇది ఒక సంవత్సరం అనుష్ఠింపదగింది. అందులోను, మొదటి ఆరునెలల్లో ఏ వరుసలో క్రియలు అనుష్ఠింపబడతాయో, అవే క్రియలు మిగిలిన ఆరునెలల్లో వ్యుత్క్రమంగా అనుష్ఠింపబడతాయి. సూర్యుడు కర్కాటకంనుండి మకరంవరకు వెళ్ళి మరల కర్కాటకానికి వెనక్కి వచ్చినట్లుగా మొదటి ఆరునెలల్లోని క్రియాకలాపం వ్యుత్క్రమంగా అనుష్ఠింపబడటం వల్ల ఆఖరిరోజు, మళ్లా మొదటిరోజు చేసిన క్రియతో ఈ యాగం సమాప్తమవుతుంది.

ఈ రెండవకాండలో 81 నుండి 234 వరకు ఏకాహాలు (ఒక్క రోజులో చేయదగినవి) వివరింపబడ్డాయి. వీటన్నిటికి జ్యోతిష్టోమం ప్రకృతి యాగం. ఈ భాగాన్ని ఏకాహబ్రాహ్మణమని పిలుస్తారు.

ఆ తరువాత 333వ ఖండంవరకు పన్నెండు రోజులలో చేయదగిన 'అహీనాలు' వివరింపబడ్డాయి. ఈ భాగాన్ని అహీన బ్రాహ్మణమంటారు.

ఆ తరువాత 'సత్రాలు' (పన్నెండు రోజులకు మించి చేయదగినవి) వర్ణింపబడ్డాయి. ఈ భాగానికే సత్రబ్రాహ్మణమని పేరు.

మూడవకాండలో ద్వాదశాహాలు చాలా విస్తరంగా వివరింపబడాయి. దీనికే ద్వాదశాహబ్రాహ్మణం అని పేరు.

సామాన్యంగా ఇతర విషయాలన్నీ పంచవింశబ్రాహ్మణంలో ఉన్నాయి. అయితే ద్వాదశాహప్రకరణం మాత్రం ఈ బ్రాహ్మణంలోనే విశదంగా ఉన్నది.

ఇక ఈ బ్రాహ్మణంలో ఋగ్వేద - సామవేదమంత్రాలే గాక, ఇతరవేదమంత్రాలు కూడా ఉండటం మరొక విశేషం. ఉదాహరణకు - "అతిమాత్రం అవర్ధన్త" (1-152) అనే ఈ మంత్రం అథర్వవేదం (5-19-1) నుండి గ్రహింపబడింది. అలాగే "అర్కో దేవానాం" (2-88) అనే మంత్రం మాధ్యందిన శతపథబ్రాహ్మణంలో (8-6-2-19) కనిపిస్తోంది.

ఈ బ్రాహ్మణాన్ని ఇతర బ్రాహ్మణాలతో పోల్చి చూసినప్పుడు శాట్యాయన, పంచవింశ, శతపథ (మాధ్యందిన, కాణ్వ) తైత్తిరీయ, ఐతరేయ కౌషీతకి బ్రాహ్మణాలతో దీనికి గల సంబంధం స్పష్టమవుతుంది.

**భాషాప్రయోగవైశిష్ట్యం:**

యరలవలు పరంగాగల శసలు పరంగా ఉన్నప్పుడు సంధిలో విసర్గకు లోపం ఈ బ్రాహ్మణంలో ప్రచురంగా కనిపిస్తుంది. ఉదా - యః+శ్రియమ్= యశ్రియమ్ (2-10); మేధ్యాః+స్యామ=మేధ్యా స్యామ (3-196).

కొన్ని ఇకారాంతస్త్రీలింగ శబ్దాలలో ప్రథమాబహువచనం ద్వితీయా బహువచనంలా ప్రయోగింపబడుతుంది. ఉదా:- అంశుమతీః (1-115), మానవీః (2-105), రూపిణీః (3-106), రేవతీః (2-167) మొ॥.

వత్వన్తస్త్రీలింగ ప్రథమాబహువచనం కూడ "ఈః" అనేది అంతంగా కలదిగానే ఈ బ్రాహ్మణంలో కనిపిస్తోంది. ఉదా:- పరివతీః గాయత్ర్యః (3-159), అంధస్వతీః గాయత్ర్యః (2-13).

లౌకిక సంస్కృతంలో అకారాంతంగా వినబడే 'ఓక' శబ్దం బ్రాహ్మణాలన్నింటిలోను వస్తుప్రయోగంలో 'ఓకస్' అని సకారాంతంగానే ప్రయోగింపబడింది. ఈ బ్రాహ్మణంలో మాత్రమే అది అకారాంతంగా ప్రయోగింపబడటం[1] ఒక విశేషం.

తూష్ణీం నిషద్యం (2-1), కిందిత (2-2), ఔదుంబరదండ (3-65), మిథునాభవతి (2-9), ద్వావష్టి (2-11), ద్వానవతి (2-48), ద్వానవ (2-24) (పద్దెనిమిది అనే అర్థంలో) మొదలైన సమాసాలు, పర్యైతే (2-3), సముర్ఛయుస్తి (2-13), లిలియుః (2-2), ఉదభాత్స్యు (2-37), అపొచ్యన్ (2-3), ఇత్యాది క్రియలు, యథావిపతితమ్ (2-80), ఆస్నాయు (2-74), పురా (స్వస్త్యాదివి) పూర్వే (ప్రాచీన కాలంలో) (2-52) మొదలైన అవ్యయాలు, "కర్ణినీ వై భూమిః" (1-126), భూమికి చెవులున్నాయి (గోడలకు చెవులుంటాయి అనే తెలుగు సామెత) మొదలైన సామెతలు, "యథా కుమారో జాతః స్తనమభిపద్యేత" (1-1) మొదలైన ఔపమ్యాలు ఈ బ్రాహ్మణ వైశిష్ట్యాన్ని చాటి చెప్తున్నాయి.

**చారిత్రక విషయానుశీలనం:**

చారిత్రకంగా పరిశీలిస్తే ఈ బ్రాహ్మణంలో ప్రసిద్ధులైన ప్రభువుల యొక్క, ఆచార్యులయొక్క నామధేయాలు ఉపాఖ్యానాలలో వినవస్తాయి. జనకుని సమకాలికులైన అనేకమంది రాజులు ఈ బ్రాహ్మణంలో స్మరింపబడ్డారు. వారిలో చితుడు (1-245), దాల్భ్య వంశానికి మూలపురుషుడైన

1. స క్షమం లోకం ఓకం ప్రజానన్నభ్యవా విద్యాత్ తస్థిరః 2-6.

దర్భుడు (2-100), కేశిదార్భ్యుడు, సుత్వా యాజ్ఞసేనుడు (2-53), ఉషాకపి భార్గవి (2-122), సుదక్షిణ క్షైమి (2-113), బ్రహ్మదత్త ప్రాచీనయోగ్య (1-337) మొదలైన వాళ్లు ముఖ్యులు.

ఆచార్యులలో ఉద్దాలక ఆరుణికి సమకాలికులైన జనకుని పురోహితులు ఐదుగురు. (ఉద్దాలక ఆరుణి, యాజ్ఞవల్క్యవాజసనేయుడు, బర్కువార్ష్ణుడు, ప్రియజానశ్రుతేయుడు, బుడిల ఆశ్వతరాశ్వి (2-22), కేసిదార్భ్య కేశిసత్యకాముల పురోహితుడైన 'ఆహీనసుడనే ఆశ్వత్థి (1-285), ఔద్దాలికుడైన కుసురువిందుడనే (1-75) మహర్షి బ్రహ్మదత్త చైకితాయనుడు (ఆరుణి సమకాలికుడైన గోలూన అరక్షకాయనుని సహాధ్యాయి) (1-337) మొదలైనవారు స్మరింపబడ్డారు.

ఐతరేయ, శతపథ తైత్తిరీయాది బ్రాహ్మణ ప్రసిద్ధులైన ప్రభువులు, ఆచార్యులు ఇందులోకూడ ప్రధానులవటంవల్లనే ఈ బ్రాహ్మణానికి ఆ బ్రాహ్మణాలతో ఉన్న సంబంధం వ్యక్తమవుతుంది.

**వైజ్ఞానికతత్త్వ వివేచనం:**

ఆధునిక వైజ్ఞానిక తత్త్వాలు కొన్ని ఈ బ్రాహ్మణాన్ని పరిశీలించటం వల్ల తెలుస్తాయి.

1. చెట్లు - చేమలు లేకపోతే ప్రాణిమనుగడ ఈ భూమిపై అసాధ్యమనే వైజ్ఞానికతత్త్వం ఈ బ్రాహ్మణంలో వివరింపబడింది. ఓషధులు, వనస్పతులు లేకపోతే ఈ భూమి ప్రాణినివాసయోగ్యం కాదని ఆలోచించి గరుడుడు స్వర్గంనుంచి సోమలతను తీసికొనివచ్చి దానిని భూమిపై పిండాడట. ఆ రసబిందువులు భూమిపై ఎక్కడెక్కడ పడ్డాయో అక్కడక్కడ తాబేలు వీపులాగా కఠినంగా బోడిగా ఉన్న భూమిమీద ఓషధులు, వనస్పతులు

బయలుదేరాయట (1-355). ఈ ఓషధులు, వనస్పతులు పృథివీరోమాలుగా పోల్చబడ్డాయి (2-54). వీటివల్లనే పృథివి వాసయోగ్యంగా చేయబడింది.

2. వాయువు అంతరిక్షంలో ప్రకాశిస్తుందని, ఇది అంతరిక్షంలోని శక్తివంతమైన అణువులతో నిండిన అయస్కాంతక్షేత్రంచేత ఆకర్షింపబడి అడ్డంగా వీస్తుందట (3-310). ఈ వాయువు ఉత్తరాభి ముఖంగానే వీస్తుందట; అంతరిక్షంలో తెల్లగా ప్రకాశిస్తుందట (3-382). వాయువుకు రూపమున్నట్లు ఈ బ్రాహ్మణం పేర్కొంటున్నది. ఇలాంటి వాయువే అంతరిక్షానికి అధిపతి.

3. ఈ అంతరిక్షంలో శక్తివంతమైన అణువులున్నాయి. ఇవి ప్రాణంనుంచి, జలాలనుంచి, అగ్ని నుంచి పుట్టాయి. ఇవి అంతరిక్షంలో ప్రకాశిస్తుంటాయి. ఇవే 'పశు' శబ్దంచేత ఈ బ్రాహ్మణంలో పిలువబడ్డాయి (1-140, 2-231, 267, 3-186).

4. మేఘం వర్షించడంలో కారణంగా పెద్ద ధ్వని చెప్పబడింది. వర్షంకోసం దుందుభులను మోగించటం ఈ బ్రాహ్మణంలో వర్ణింపబడింది (1-143). బృహత్ స్తోత్రంలో వర్షానికై దుందుభులను మోగిస్తారట. ఇలా ఎన్నో వైజ్ఞానిక విషయాలు ఈ బ్రాహ్మణంలో వర్ణింపబడ్డాయి.

యాజ్ఞికదృష్టితోను, చారిత్రకదృష్టితోను, భాషాప్రయోగ దృష్టితోను, వైజ్ఞానికదృష్టితోను, ఏ దృష్టితో చూసినా ఈ బ్రాహ్మణం బ్రాహ్మణ వాఙ్మయంలో ఒక విశిష్టస్థానాన్ని అలంకరిస్తోందని చెప్పక తప్పదు.

- కె.వి.ఆర్.కె.

## 2.5.8 సంగ్రహసమీక్ష

సామవేదానికి సహస్రశాఖలున్నాయని ప్రసిద్ధి. వాటిలో ఒక శాఖ తలవకారశాఖ. ఇతర వేదాలకున్నట్లుగా ఈ శాఖకు కూడా మంత్రభాగం-బ్రాహ్మణ భాగమని రెండు భాగాలున్నాయి. వీటిని తలవకార సంహిత - తలవకారబ్రాహ్మణం అంటారు. తలవకార బ్రాహ్మణాన్ని జైమినీయ బ్రాహ్మణమని కూడా వ్యవహరిస్తుంటారు. తలవకారుడన్న మహర్షివల్ల ఏర్పడిన శాఖ కావడాన తలవకారశాఖ అని దీనినంటారు. ఈ తలవకారుడు జైమినిమహర్షి శిష్యుడు అని ప్రసిద్ధి. "శౌనకాదిభ్యశ్ఛందసి" (4-3-106) అన్న పాణినిసూత్రానికి వ్యాఖ్యలో కాశికావృత్తికారుడు శౌనకాదిగణంలో తలవకార పదాన్ని కూడా చేర్చి పఠించాడు. కాబట్టి తలవకారుడు ఒక వేదశాఖకు ప్రవర్తకుడన్న విషయానికి పాణిని మహర్షివచనం కూడా ఒక ప్రమాణమవుతోంది. సామవేదానికి ప్రవర్తకుడు మహర్షిజైమిని. అయితే సామశాఖ అయిన తలవకారబ్రాహ్మణానికి ఇద్దరు మహర్షులు ప్రవర్తకులవుతారు. సాధారణంగా కఠ, వాజసనేయ, తైత్తిరీయాదిశాఖల్లో ఒక్కరే ప్రవర్తకులు కావడం పరిపాటే గాని, గురుశిష్యులిద్దరూ ఒకశాఖకు ప్రవర్తకులు కావడం కూడా వైదిక సంప్రదాయంలో అక్కడక్కడా కానవస్తుంది. 'సైషా భార్గవీ వారుణీ విద్యా' అన్న తైత్తిరీయక వాక్యంలో ఒకేవిద్యకు భృగువు వరుణుడు కూడా ప్రవర్తకులన్నది స్పష్టంగా చెప్పబడింది.

జైమినీయ గృహ్యసూత్రంలో తర్పణప్రకరణంలో సామవేద ప్రవర్తకులైన ఆచార్యులలో జైమిని తలవకారులిద్దరూ స్మరింపబడ్డారు ధన్విచే వ్రాయబడిన ద్రాహ్యాయణశ్రౌతసూత్రభాష్యంలో సాయణాచార్యుని ఐతరేయ బ్రాహ్మణభాష్యంలోను. ఇంకా ఇతరత్ర అనేక వైదిక గ్రంథవ్యాఖ్యానాల్లోను తలవకారబ్రాహ్మణంలోని వాక్యాలు ఉదాహరింపబడ్డాయి. ఈనాడు ఇతర

వేదశాఖలకున్నంత ప్రసిద్ధి తలవకారశాఖకు లేదు. ఈ శాఖ నధ్యయనం చేసేవాళ్ళు చాలా కొద్ది మంది కేరళలోను, ద్రవిడదేశంలోను కనిపిస్తున్నారు.

కౌథుమశాఖలాగా తలవకారశాఖకు కూడా ఎనిమిది బ్రాహ్మణా లున్నాయి. శతపథబ్రాహ్మణంలాగా తలవకారబ్రాహ్మణం కూడా చాలా విస్తృతమయింది. ఈ బ్రాహ్మణంలో మూడుకాండలున్నాయి. మొదటికాండలో **364** ఖండలు, రెండవకాండలో **442** ఖండలు, మూడవ కాండలో **386** ఖండలు ఉన్నాయి. మొదటికాండలో అగ్నిహోత్రం, జ్యోతిష్టోమం, రెండవకాండలో గవామయనం, ఏకాహం, అహీనాలు, సత్రాలు, మూడవకాండలో ద్వాదశాహం విస్తృతంగా ప్రతిపాదింపబడ్డాయి.

దేవతల నుద్దేశించి హోమంచేసే ద్రవ్యాల్లో సోమలతారసం ప్రధాన ద్రవ్యంగా ఉండే యాగాన్ని సోమయాగం అంటారు. ఈ సోమయాగం ఐదురోజుల్లోగాని, అంతకుమించిన రోజులలోగాని అనుష్ఠింపబడుతోంది. ఈ సోమయాగం ఏకాహమని, అహీనమని, సత్రమని మూడు విధాలు. సోమరసాన్ని పిండి, పిండిన రసాన్ని హోమం చేయడం 'సుత్యా' అని వ్యవహరింపబడుతుంది. ఏ రోజున 'సుత్యా' అనుష్ఠింపబడుతుందో ఆ రోజుకు "సౌత్యాహస్సు" అని పేరు. ఆ రోజుల సంఖ్యనుబట్టి పైన పేర్కొన్న విభాగాలు ఏర్పడతాయి. అంటే ఒకే సుత్యాహస్సుగల అగ్నిష్టోమం, అతిరాత్రం, వాజపేయం మొ॥ యాగాల్ని 'ఏకాహ' లంటారు. సుత్యాహస్సులు రెండు మొదలు పన్నెండువరకు ఏ యాగంలో అనుష్ఠింపబడతాయో అటువంటి అశ్వమేధం, పౌండరీకం, ద్వాదశాహం మొ॥ యాగాల్ని "అహీనా" లంటారు. పదమూడు రోజులు మొదలుగా ఒక సంవత్సర దినసంఖ్య వరకు సుత్యాహస్సులు కలిగిన *గవామయనాది*యాగాల్ని "సత్రాలు" అని వ్యవహరిస్తారు. ద్వాదశాహాన్ని అహీనంగాను, సత్రంగాను కూడా పరిగణిస్తారు.

ఇతర సామవేద బ్రాహ్మణాల్లోలాగా ఈ తలవకారబ్రాహ్మణంలో కూడా ఉద్గాతయొక్క కర్మలు చెప్పబడ్డాయి. సామల స్వరూపం, వాటిపేర్లు, పేర్లకు నిర్వచనాలు, సామల ద్రష్టలు, సామలకు ఆయా క్రతువులలో వినియోగం, ఆయా సామగానాలకు ఫలవిశేషాలు, సామలలో కూర్చవలసిన స్తోమాలస్వరూపం, వాటిలోని భక్తి వ్యవస్థ గానంలో నిర్బరచదగిన స్తోభలు, వాటి స్వరూపం, వికృతియాగాల్లో సామలలోని ఊహం, అర్థవాదాలు మొదలైన విషయాలెన్నో ఈ బ్రాహ్మణంలో విశదంగా వివరించబడ్డాయి. తాండ్య, షడ్వింశ, శతపథ, తైత్తిరీయబ్రాహ్మణాల్లోని అనేక వాక్యాలు యథాతథంగా ఈ బ్రాహ్మణంలో ఉదాహరించబడ్డాయి. అయినా ఇతర బ్రాహ్మణాల్లో చెప్పనటువంటి విషయాలెన్నో ఇందులో చెప్పబడ్డాయి. ఇతర బ్రాహ్మణాల్లో కన్నా ఈ బ్రాహ్మణంలో మంత్రాలకు వ్యాఖ్యానం విశదంగా ఉన్నట్లు అనిపిస్తుంది.

ఈ బ్రాహ్మణంలో చారిత్రకులకు - సాంఘిక తత్త్వాన్వేషకులకు యాజ్ఞికులకు ఆసక్తికలిగించే విషయాలెన్నో అక్కడక్కడ ప్రసంగ వశాన ప్రస్తావించబడ్డాయి. కొన్నింటిని చూడండి:

అరణ్యమార్గాలు ముళ్ళపొదలవల్ల ప్రయాణీకులకు ఎంతో కష్టాన్ని కలుగజేస్తాయి. కాని ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి పోయే మార్గాలు మాత్రం చక్కగా నిర్మించబడి ఉండటంవల్ల బాటసార్లు ఎలాంటి కష్టాలులేక తమ తమ గమ్యాన్ని సుఖంగా చేరగల్గుతున్నారు (2-424).

నౌకద్వారాగాని పడవద్వారాగాని సముద్రాన్ని దాటదలచిన వాళ్ళు ఒక ద్వీపంనుంచి మరొకద్వీపాన్ని చేరుతూ నెమ్మదిగా తమ గమ్యాన్ని చేరారు (1-330) అనటంవల్ల ఆనాటి సముద్రయానం సూచించబడుతోంది.

పండులాంటి ముసలితనాన్ని పొందిన అభిప్రతారణుడన్న వాని ఆస్తిని అతను బ్రతికియుండగానే పుత్రులు పంచుకున్నారని ఒక కథలో వెల్లడవుతోంది (3-156).

సింధునదానికి పడమరన భరతరాజ్యం, తూర్పున ఇక్ష్వాకుల రాజ్యముండేదని; ప్రసిద్ధ మహర్షులు విశ్వామిత్రజమదగ్నులు భారత రాష్ట్రంలో ఉండేవారని ఒకచోట స్పష్టంగా ఉదాహరించబడింది (3-238). మొదట భరతుల రాష్ట్రం మూడుగా విభజింపబడియుండేది. వాటిలో ఒక భాగాన్ని వైతహవ్యులు, మరొకదాన్ని మిత్రవత్తులు మరొకభాగాన్ని కృతవంశీయులు పాలిస్తూ ఉండేవారు. కాలక్రమేణ కృతవంశం ఈ మూడు భాగాల్ని కలిపి అఖండ భారతాన్ని నిర్మించింది (3-195).

కురుక్షేత్రానికి సమీపంలో శర్యణావత్ అనే పేరుగల గొప్ప సరస్సు ఉంది (3-62).

త్రివరుణుడనే ఇక్ష్వాకురాజుతో పాటు వృశజానుడనే కుల పురోహితుడు ఒకే రథంలో ప్రయాణించాడన్న సంఘటనవల్ల అపమార్గంలో ప్రవర్తించే రాజమ్మల్ని నివారించటానికి పురోహితులు రాజుతో పాటు ప్రయాణించేవారని తెలుస్తోంది (3-92).

వైరాగ్యాదిగుణసంపన్నులైన కొందరు రాజులు రాజ్యపాలనం చేస్తూనే ఋషులయినట్లు తెలుస్తోంది. దివోదాసుడు రీతోవిరస్సుడనే ఇద్దరు రాజులు సామగానంచేసి ఆయా సామలకు ప్రవర్తకులుగా ప్రసిద్ధికెక్కారు (2-222; 3-97).

వేదవాఙ్మయంలో దేవతలకు రాక్షసులకు విరోధం - యుద్ధాలు ఇవి తరచు మనకగపడుతూనే ఉంటాయి. కాని దేవతలకు - ఋషులకు

సంఘర్షణ ఏర్పడినట్లు వర్ణించిన - ఈ బ్రాహ్మణ భాగం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మనువు పుత్రుడయిన శర్యాతుడనే ఋషిచేసిన యజ్ఞంలో భృగువంశీయుడైన చ్యవనుడు సోమపాత్రాన్ని అశ్వినీ దేవతలకై సోమం చేసేందుకు చేతిలోకి తీసుకున్నాడట! ఇంద్రుడు ఆ పాత్రని చ్యవనునికి తెలియకుండానే అపహరించాడట! ఎలాగో ఒకలాగ సోమపాత్రను అపహరించింది ఇంద్రుడని తెలుసుకున్న చ్యవనమహర్షి ఇంద్రుణ్ణి కొట్టాడట! దాంతో దేవతలు ఋషులమీద కోపగించుకున్నారట! ఋషులు కూడా దేవతలమీద కోపగించుకున్నారట! దేవతలు ఋషుల యజ్ఞాల్ని పాడుచేయటానికి పూనుకున్నారట! ఋషులు కూడా దేవతల్ని ఎదుర్కొనడానికి, ఓడించడానికి మదమనే పేరుగల అసురుణ్ణి పుట్టించారట! (3-159, 160)

కొన్నిచోట్ల సత్రయాగంలో పాల్గొన్న ఋత్విక్కుల పేర్లు కూడా పఠింపబడ్డాయి. మేధాతిథులు చేసిన సత్రయాగంలో అగస్త్య మహర్షి కొడుకైన దృఢచ్యుత్ ఉద్గాతగాను, గౌరీవితి ప్రస్తోతగాను, అచ్యుతచ్యుత్ ప్రతిహర్తగాను, వసుక్షయుడు హోతగాను, సనక సనకులు అధ్వర్యు ప్రతిప్రస్థాతలుగాను పాల్గొన్నారని ఒకచోట చెప్పబడింది (3-234).

సోమయాగ స్వరూపంలో కూడా కొంతమార్పు కనిపిస్తుంది. సోమయాగమంటే మూడు సవనాలు కలదిగా ప్రసిద్ధి. కాని ఒకప్పుడు రెండు సవనాలే ఉండేవనీ, ఇంద్రుడే మొట్టమొదటగా మూడవ సవనాన్ని ప్రారంభించాడనీ, అప్పటినుండే సోమయాగం త్రిషవణంగా (మూడు సవనాలు కలదిగా) రూపొందిందన్న అపూర్వ విషయం - ఈ బ్రాహ్మణంవల్ల తెలుస్తోంది(1-56).

గర్భధారణనుంచి అయిదవనెలలోనే గర్భస్థ శిశువుకు స్త్రీ పుం లక్షణాలు ఏర్పడతాయన్న ధర్మశాస్త్రవచనానికి మూలం ఈ బ్రాహ్మణంలోని "తస్మాన్ పంచమే మాసి గర్భా వి[క్రి]యన్తే" అన్న వాక్యమే! (1-267).

ఈనాటి స్థితిగతుల్ని అనువదించి చెప్తున్నట్లుగా తోచే వాక్యాలు అక్కడక్కడా విరివిగానే ఈ బ్రాహ్మణంలో లభిస్తాయి. "తక్కువ సంఖ్యగల ప్రజాసమూహానికి ఎక్కువ సంఖ్యగల ప్రజాసమూహం విరోధిగానే ఉంటుంది' (1-198).

వీణకుగల అవయవాలు పేరు పేరున గణించబడ్డాయి. దండం, ఉపవాణాలు, సూన, చర్మ, ఆకాశాలు, వాదనలు, సప్తతంత్రులు అని (2-70) "వాణం శతతంత్రి మాహరన్తి" (2-45) అన్న వాక్యంవల్ల నూరుతీగలుగల వాద్యమప్పటికి ప్రసిద్ధమై ఉండేదని తెలుస్తోంది.

సామెతగా మనం వ్యవహరించే భావాలు చాలా ఈ బ్రాహ్మణ వాక్యాల్లో ప్రతిఫలిస్తూ ఉంటాయి. స్త్రీలంటే ఎవరికి ప్రియం గాదు? (3-352) అనే భావన ఇందులో కనబడుతుంది.

చంద్రునిలోని మచ్చను కవులే అనేకవిధాలుగా ఉత్ప్రేక్షించా రనుకుంటాం గదా! చూడండి! ఈ వేదవాక్యం దానికేమయినా తీసిపోతుందేమో! "ఏష వై శశః య ఏషోఽన్తశ్చన్ద్రమసి" (1-28) కనబడే చంద్రునిలో ఉన్నది కుందేలే!

ఇలాంటి కవిత్వభావనలున్నాయి కాబట్టే మహాకవి కాళిదాసు కూడా అనేక భావాల్ని తాను తన గ్రంథాల్లో చొప్పించాడనిపిస్తుంది. "అస్తమయాన్ని పొందుతున్న ఈ సూర్యుడు అగ్నియందే ప్రవేశిస్తాడు" (1-11) అన్న వాక్యాన్ని ఆధారం చేసుకునే - పగలు ముగియగానే సూర్యుడిచ్చిన తేజస్సుతో అగ్నిలాగా తండ్రినుంచి పొందిన రాజ్యంతో రఘువు ప్రకాశించాడు (రఘు. 4-1) అన్నాడు కాళిదాసు.

"సమస్త పదార్థాలనుంచి సారాన్ని గ్రహించడంవల్లనే సూర్యుడు ఆదిత్యుడని పిలువబడుతాడట" (2-26). ఈ అంశాన్ని కూడా కాళిదాసు "ఆదత్తే హి రసం రవిః" అని (రఘు. 1-8) పేర్కొన్నాడు.

"బంగారానికిగల స్వభావసిద్ధమైన కాంతి నిప్పులో కాల్చినపుడుగాని గోచరించదు" (1-28). ఈ భావాన్నే రఘువంశంలో (1-10) అనువదించాడు.

'మణిలో మణిసూత్రం కూర్చబడియున్నట్టుగా ఈ లోకాలన్నింటిలో త్రిరాత్రం కూర్చబడి ఉంది" (2-245) అన్న మణిసూత్రోపమానాన్నే కాళిదాసు కూడా "మణౌ వజ్రసముత్కీర్ణే సూత్రస్యేవ" (రఘు. 1-4) అన్న వాక్యంలో స్వీకరించాడు.

ఇలా వివిధ రంగాల్లో వివిధ భావాలను వ్యక్తపరచే ఈ బ్రాహ్మణం రసికులకు ఎంతో ఆనందాన్ని ఆశ్చర్యాన్ని కూడా కలిగించేలా ఉంటుంది.

- వి.ఎస్.ఎస్.

# తాండ్యబ్రాహ్మణం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 2. విశేషవిభాగం

## 2.6 తాండ్యబ్రాహ్మణం

### 2.6. 1 పరిచయం

సామవేదంలోగల కౌథుమశాఖకు సంబంధించిన బ్రాహ్మణం తాండ్యబ్రాహ్మణం. దీనికే తాండ్యమహాబ్రాహ్మణమని, మహాబ్రాహ్మణమని, పంచవింశ బ్రాహ్మణమని, ప్రౌఢ బ్రాహ్మణమని కూడా పేర్లున్నాయి. తాండిమహర్షి ప్రవర్తకుడు కాబట్టి తాండిబ్రాహ్మణమని లేక తాండ్యబ్రాహ్మణమని, గ్రంథపరిమాణం, ఇందులో ప్రతిపాదింపబడిన విషయాల మహాత్మ్యాన్ని బట్టి మహాబ్రాహ్మణమని, ఇరవై అయిదు అధ్యాయాలుండటంవల్ల పంచవింశబ్రాహ్మణమని దీన్ని పిలుస్తున్నారు.

దీనికి అనుబంధంగా ఏర్పడిన 26వ అధ్యాయమే "షడ్వింశ బ్రాహ్మణం". ఇందులో ఆఱు ప్రపాఠకాలున్నాయి. కాని రెండు ఖండలుగల చివఱి ప్రపాఠకాన్ని "అద్భుతబ్రాహ్మణ" మని కూడా పిలుస్తారు.

సామవేదానికిగల బ్రాహ్మణాలన్నింటిలో తాండ్యబ్రాహ్మణానికిగల స్థానం అద్వితీయమైంది. ఇది ప్రధానంగా సోమయాగాన్ని ఇతరయాగాలను సాంగోపాంగంగా నిరూపిస్తున్నది. కౌషీతకిశాఖతో ఈ బ్రాహ్మణానికి కొంత విరోధం ఉన్నట్లు తెలుస్తుంది.

- ఎస్.వి.ఆర్.

## 2.6. 2 విభాగం

తాండ్యమహాబ్రాహ్మణంలో 25 ప్రపాఠకాలున్నాయి. సాయణుడు తన భాష్యంలో ఈ ప్రపాఠకాలనే అధ్యాయాలని వ్యవహరించాడు. ఇందులో మొత్తం 347 ఖండలున్నాయి. చూడండి:

| అధ్యాయం | ఖండ | అధ్యాయం | ఖండ |
|---|---|---|---|
| 1 | 10 | 13 | 12 |
| 2 | 17 | 14 | 12 |
| 3 | 13 | 15 | 12 |
| 4 | 10 | 16 | 16 |
| 5 | 10 | 17 | 14 |
| 6 | 10 | 18 | 11 |
| 7 | 10 | 19 | 19 |
| 8 | 10 | 20 | 16 |
| 9 | 10 | 21 | 15 |
| 10 | 12 | 22 | 18 |
| 11 | 11 | 23 | 28 |
| 12 | 13 | 24 | 20 |
| | | 25 | 18 |
| | 138+ | | 211-347 |

విషయవిభాగం:

ఈ బ్రాహ్మణంలో గల ఇరవై అయిదు అధ్యాయాల్లో అగ్నిష్టోమం, గవామయనం, వ్యూఢద్వాదశాహం, అభిజిత్ మొ॥ ఏకాహయాగాలు, జ్యోతిష్మ మొ॥ సాహస్రయాగాలు, అంగిరస అమక్రీః మొ॥ సాద్యస్క్రయాగాలు,

వ్రాత్యయజ్ఞాలు, అగ్నిష్టుద్యాగాలు, త్రివృత్‌స్తోమాలు, చాతుర్మాస్యయాగాలు, వాజపేయం, రాజసూయం, అతిరాత్రయాగాలు, అహీనాలు, సారస్వత యాగాలు, ఇలా ఎన్నో యాగాలు పొంగోపొంగంగా నిరూపించబడ్డాయి. మొత్తం సుమారు 180 యాగాలను మహోశ్చర్యకరంగా వివరిస్తూ ఈబ్రాహ్మణం నిజంగా మహాబ్రాహ్మణమనే పేరుకు తగిందనిపిస్తున్నది.

ఇందులోని మొదటి పది అధ్యాయాలకు దశరాత్రకాండ అని, తరువాత పదిహేనవ అధ్యాయందాకా ద్వాదశాహకాండ అని, అక్కడ నుంచి పందొమ్మిదో అధ్యాయందాకా ఏకాహకాండ అని, ఆపైన మూడు అధ్యాయాలకు అహీనకాండ అని, చివరి మూడు అధ్యాయాలకు సత్రకాండ అని వ్యవహారం ఉంది.

మొదలు-చివర:

ఈ బ్రాహ్మణం "మహాన్మేవోచ" అనే మంత్రంతో ప్రారంభమై "తదేతద్విశ్వసృజాగ్ం సహస్రసంవత్సరం" అనే మంత్రంతో పరిసమాప్త మౌతున్నది.

- ఎస్.బి.ఆర్.

### 2.6.3 సంకలనకాలం

దేశం:

ఈ బ్రాహ్మణం మనదేశంలో ఏభాగంలో సంకలనం చేయబడి ఉంటుందనే విషయాన్ని స్పష్టంగా చెప్పడానికి వీల్లేదు. ఇందులో సరస్వతీ-దృషద్వతీనదుల మధ్యభాగంలో అనుష్ఠింపబడిన యజ్ఞయాగాలు పేర్కొనబడ్డాయి. ఇలాగే ఈ బ్రాహ్మణానికి "కురుక్షేత్రం"తో కూడ పరిచయమున్నట్లు తెలుస్తున్నది. అయినా ఇందులో వర్ణింపబడ్డ నదీపర్వతాదులను బట్టి కురుక్షేత్రానికి తూర్పు భాగంలో చాలా దూరాన ఈ బ్రాహ్మణం రచింపబడి ఉండవచ్చునని చారిత్రికులు ఊహిస్తున్నారు.

కాలం :

బ్రాహ్మణాలలో ఉపయోగింపబడిన భాషను విషయవిశేషాలను దృష్టిలో ఉంచుకొని వాటికి కాలనిర్ణయం చేస్తున్నారు పరిశోధకులు. తైత్తిరీయ బ్రాహ్మణంలో గలస్వరసంప్రదాయంపంచవింశబ్రాహ్మణంలో కూడా ఒకప్పుడు ఉండి ఉండేదని గుర్తించబడుతోంది. బ్రాహ్మణ వాఙ్మయం మొట్టమొదట పంచవింశ బ్రాహ్మణమని పిలువబడే తాండ్యబ్రాహ్మణంతో ప్రారంభమై ఉంటుందనడానికి తార్కాణాలు కొన్ని కనబడుతున్నాయి.

పాశ్చాత్యపండితుల లెక్కలప్రకారం క్రీ.పూ. 8వ శతాబ్దంలో బ్రాహ్మణవాఙ్మయనిర్మాణం ప్రారంభమైంది. బ్రాహ్మణాలన్నింటిలో ప్రథమస్థానాన్ని ఆక్రమిస్తున్న తాండ్యబ్రాహ్మణం ఆ శతాబ్ది ప్రారంభంలో రచింపబడి ఉంటుందని. తరువాత అదే శతాబ్దంలో తైత్తిరీయబ్రాహ్మణం ఏర్పడి ద్వితీయస్థానాన్ని పొందిందని చరిత్రకారుల భావన.

- ఎస్.బి.ఆర్.

### 2.6.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

వ్యాఖ్యానాలు :

తాండ్యబ్రాహ్మణం ఎన్ని విధాలో వ్యాప్తిని సంపాదించింది. దీనికి సాయణాచార్యుడు సమగ్రమైన భాష్యాన్ని రచించాడు. ఇతరులెవరూ ఈ బ్రాహ్మణానికి వ్యాఖ్యానం గాని, భాష్యం గాని వ్రాసిన జాడ కనబడటం లేదు. సాయణుని భాష్యం రెండు భాగాల్లో ప్రచురింపబడింది.

ప్రచురణలు :

1870-1874 సం॥ మధ్య బిబ్లోతిక ఇండికలో ఈ బ్రాహ్మణాన్ని సంపాదించి ప్రచురించారు. శ్రీ చిన్నస్వామిశాస్త్రి 1935లో సాయణ భాష్యంతో ఈ బ్రాహ్మణాన్ని సంపాదించగా చౌఖంబా సంస్కృత సిరీస్, వారాణసివారు మొట్టమొదట ప్రచురించారు. తరువాత 1963లో కూడా ఇదే సంస్కరణం మళ్లా ముద్రింపబడింది. ఆనంద చంద్రవేదాంతవాగీశుడు సాయణభాష్యంతో కూడా ఈ బ్రాహ్మణాన్ని కలకత్తా నుంచి ప్రచురించాడు.

1909లో ఇ.డబ్ల్యు. హాప్కిన్స్ (E.W.Hopkins) "మహా బ్రాహ్మణంలోని దేవతలు, ఋషులు" (Gods and Saints of the great Brahmana) అనే వ్యాసాన్ని ప్రచురించాడు. కాలండ్ ఈ బ్రాహ్మణం పైన కొంత టిప్పణిని 1918లో ప్రచురించాడు.

- ఎస్.బి.ఆర్.

**2.6.5 ప్రసిద్ధి :**

బ్రాహ్మణవాఙ్మయంలో తాండ్యబ్రాహ్మణానికి గల ప్రసిద్ధి ఇతర బ్రాహ్మణాలకు వేటికీ లేదనే చెప్పాలి. ఈ ప్రసిద్ధికి ఎన్నో కారణాలున్నాయి. ఇది మిగతావాటికంటే ప్రాచీనమైంది కావడం, ఇరవై అయిదు అధ్యాయాలుగల మహాగ్రంథం అయివుండడం, ఇందులో ఎన్నోరకాలైన సోమయాగాలు సమగ్రంగా ప్రతిపాదించబడటం, వ్రాత్యస్తోమాలను ఇది ప్రత్యేకంగా నిరూపించడం, సామ బ్రాహ్మణాల్లో విశిష్టస్థానాన్ని ఆక్రమించడం మొ॥ వాటిలో కొన్ని. వాటన్నిటికంటే సాయణాచార్యుడు దీనికి సమగ్రమైన భాష్యం వ్రాయడంవల్ల ఇది ఎంతో ప్రసిద్ధి పొందడానికవకాశమేర్పడింది.

కాత్యాయనుడు, ఆపస్తంబుడు తమ తమ శ్రౌతసూత్రాల్లో క్రతుస్వరూపాన్ని వివరించడానికి ఈ బ్రాహ్మణంమీద పూర్తిగా ఆధారపడ్డారని చెప్పడానికి ఎన్నో నిదర్శనాలు కనపడుతున్నాయి. దాన్ని బట్టి ఈ బ్రాహ్మణం ప్రాచీనకాలంలో కూడా ఎంతో ప్రసిద్ధిని పొందిందని చెప్పడానికి వీలవుతున్నది.

అనేక యజ్ఞ యాగాలను నిరూపిస్తూనే ఈ బ్రాహ్మణం ఎన్నో లౌకిక విశేషాలను గూడ అక్కడక్కడ చక్కగా తెలియజేస్తున్నది. చూడండి -

**మధ్యలో మాట్లాడకూడదు:**

> విద్యాతపస్సంపన్నుడైన అతిథివచ్చి భోజనం చేస్తున్నప్పుడు, ఎవరూ అతడి మనస్సు నొప్పించేమాట మధ్యలో మాట్లాడకూడదు. అతని మనస్సు నొప్పిపడితే అతిథ్యం వ్యర్థమైపోతుంది.

ఇంత సున్నితంగా, క్రమశిక్షణతో ఉండమని చెప్పే సందర్భాలు ఈ బ్రాహ్మణంలో ఎన్నో ఉన్నాయి. ఇలాంటి వాటివల్ల మన ప్రాచీనుల సంస్కృతి ఎంతగొప్పదో ఊహించవచ్చు. ఇలాగే యాగాలను తెలియజేస్తూ కూడా

సమాజానికి ఉపయోగించే ఉపదేశాలతో, విలసిల్లే ఈ బ్రాహ్మణం అటు కర్మకాండకు, ఇటు ధార్మిక జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతూ ఎంతో ప్రసిద్ధిని సంపాదించింది.

- ఎస్.బి.ఆర్.

## 2.6.6 యజ్ఞయాగాలు:

అగ్నిహోత్రంలో నేతిని, ధాన్యాలను, నేతితో తయారుచేసిన పురోడాశాన్ని ఆహుతులుగా వేస్తూ చేసే కర్మకే యాగమని పేరు. 1. దర్వీహోమం 2. ఇష్టి 3. పశుయాగం 4. సోమయాగ మనే పేర్లతో ఇవి నాలుగురకాలు.

పై వాటిల్లో దర్వీహోమ మనేది ప్రతిరోజూ ఉదయం సాయంకాలం పెరుగు, పాలు, బియ్యం మొ॥ ద్రవ్యాలతో చేసే అగ్ని హోత్రయాగం ద్వారా వైదిక కర్మలను తెలియజేస్తుంది. ప్రతి అమావాస్యకు పౌర్ణమికి పిండి, పాలు, నెయ్యి మొదలైన వాటితో తయారుచేసిన పురోడాశాన్ని హోమంలో ఉపయోగిస్తూ చేసేవి ఇష్టులు. పశువుల హృదయాలతో, పిండి మొ॥ ఇతర పదార్థాలతో తయారుచేసిన పురోడాశాన్ని హోమద్రవ్యంగా ఉపయోగిస్తూ ప్రత్యేకమైన ఋతువుల్లో చేసే యాగాలను పశుయాగాలంటారు. వసంత సమయంలో కాని ఇంకా కొన్ని ఇతరకాలాల్లోగాని చేయబడే యాగమే సోమయాగం. ఈ యాగంలో సోమలతనుంచి రసాన్ని తీసి చమసం, గ్రహం అనే పాత్రల్లో నింపి దేవతలకు సమర్పిస్తారు.

పాకయజ్ఞం, హవిర్యజ్ఞం, సోమయజ్ఞమని యజ్ఞాలను మూడు రకాలుగా కూడా విభజిస్తారు. పాకయజ్ఞాలు: 1. అష్టక 2. పార్వణ 3. స్థాలీపాక 4. శ్రద్ధాశ్రావణి 5. ఆగ్రహాయణి 6. చైత్రి 7. ఆశ్వయుజి అని ఏడు రకాలు. పాకయజ్ఞాల్లో హోమం చేసే ద్రవ్యాన్ని ముందుగానే తయారు చేస్తారు. హవిర్యజ్ఞాలు: 1. అగ్న్యాధేయం 2. అగ్నిహోత్రం 3. దర్శపూర్ణమాసలు 4. ఆగ్రాయణం 5. చాతుర్మాస్యలు 6. నిరూఢపశుబంధం 7. సౌత్రామణి అని ఏడు రకాలు. వీటిల్లో ఎన్నో పదార్థాలను హోమద్రవ్యాలుగా ఉపయోగిస్తారు. పశుమాంసం కూడా ఒకప్పుడు ఈ పదార్థాలలో ఒకటౌతుంది. అందుకే ఇవి

ఇష్టులు, పశుయాగాలు కూడా అవుతున్నాయి. 1. అగ్నిష్టోమం 3. అత్యగ్నిష్టోమం 3. ఉక్థ్యం 4. షోడశి 5. వాజపేయం 6. అతిరాత్రం 7. అప్తోర్యామం పేర్లతో సోమయాగాలు కూడా ఏడు రకాలు. ఉక్థ్యం, షోడశి, వాజపేయం, అతిరాత్రం ఈ నాలుగు అగ్నిష్టోమవికారాలే. అగ్నిష్టోమాన్నే జ్యోతిష్టోమమనికూడా అంటారు. వాజపేయం, గోసవం, విశ్వజిత్, వ్రాత్యస్తోమం ఈ నాలుగు జ్యోతిష్టోమయాగ ప్రభేదాలుగానే పరిగణింపబడ్డాయి.

ఏకాహం, అహీనం, సాద్యస్క్రం, సత్ర మనే పేర్లతో సోమయాగం నాలుగు రకాలు. ఒక్కరోజులో మాత్రం ఆచరింపబడే యాగానికి ఏకాహమని పేరు. రెండురోజులనుంచి పదిరోజులలోపు చేసే యాగాలకు అహీనాలని పేరు. పదుకొండు రోజులు లేక పన్నెండు రోజులు జరిగే యాగాలను అహీనాలని, సత్రాలని కూడా పిలుస్తారు. పదమూడు రోజులనుంచి వెయ్యి సం॥వత్సరాల వరకు జరిగే యాగాలకు మాత్రం సత్రాలనే పేరు. ఒక ప్రత్యేకమైన రోజున ప్రారంభమై, ఆ రోజే పూర్తయ్యే యాగానికి సాద్యస్క్రమని పేరు.

రాత్రిసత్రం, అయనసత్రమని సత్రయాగాలు రెండు రకాలు. పన్నెండు నుంచి వందరోజుల వరకు జరిగే యాగానికి రాత్రిసత్రమని పేరు. వందరోజులు దాటి జరిగే యాగం అయనసత్రం.

ప్రతి సోమయాగంలోను హోమాలతోపాటు ఆయా సందర్భాలలో ఋఙ్మంత్రాలగానం తప్పకుండా ఉంటుంది. గీతబద్ధంగా ఈ ఋక్కులగానం జరిగినప్పుడు దాన్ని స్తోత్రమని, గీత రహితంగా ఉచ్చరించబడినప్పుడు శస్త్రమని అంటారు. యజుర్వేదాన్ని అధ్యయనం చేసిన అధ్వర్యుడు హోమం చేస్తాడు. సామవేదాధ్యాయి అయిన ఉద్గాత స్తోత్రం చేస్తాడు. ఋగ్వేదాధ్యేత అయిన హోత మంత్రోచ్చారణ చేస్తాడు.

ప్రతియాగంలోను అధ్వర్యుడు, ఉద్గాత, హోత అనే ఈ ముగ్గురు ఋత్విక్కుల అవసరం ఉంటుంది. ఆయా యాగాలకు సంబంధించిన వస్తువులను సేకరించిన తరువాత, పవిత్రమైన అగ్నిహోత్రంలో అధ్వర్యుడు హోమం చేస్తాడు. సామవేదంలోని గానపద్ధతుల కనుగుణంగా ఉద్గాత ఋక్కులను గానం చేస్తాడు. హోత ఆయా ప్రకరణాలకు తగిన ఋక్కులను ఉచ్చరిస్తాడు.

ఋక్కులను సామవేదాధ్యాయి అయిన ఉద్గాత గానంచేస్తే అది స్తోత్రమవుతుంది. సామగానికి ఉద్గాత, స్తోత, ప్రతిహర్త, సుబ్రహ్మణ్యుడు అనే నల్గురు ఋత్విక్కులుంటారు. మూడు ఋక్కులకు ఒక సామగానం చేయాలి. దీన్ని నిర్ణీత సంఖ్యలో ఆవృత్తి చేయాలి. ఈ ఆవృత్తుల సంఖ్య కొన్ని చోట్ల పదిహేనైతే ఇంకా కొన్ని చోట్ల ఇరవై ఎనిమిదిగా ఉంటుంది. ఈ సంఖ్యలనే 'స్తోమం' అంటారు. గానం చేయవలసిన మంత్రాలను క్రమబద్ధంగా ఏర్పాటు చేయడాన్ని 'విష్టుతి' అంటారు.

సామగానం చేసే ఉద్గాత ప్రతియాగంలో అవసరమైనప్పటికి సామగానం తప్పనిసరిగా చేయబడే యాగాలకే సామవేదం ప్రాముఖ్యానిస్తుంది. అందువల్ల ఇందులో సోమయాగనిరూపణానికి ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది.

ఏ యాగం చేయాలన్నా మొదట యజమాని అగ్న్యాధేయాన్ని చేసితీరాలనే విషయం తప్పక గుర్తుంచుకోవాలి. ఎవరి తండ్రి, తాత యాగాలను ఆచరించారో అతడే యాగానుష్ఠానానికి అర్హుడౌతాడు.

ఇష్టిలోను, పశుయాగంలోను సోమయాగం ఒక భాగంగా ఉంటుంది కాబట్టి చాలా యాగాలు సోమయాగాలుగానే వ్యవహరింపబడతాయి. సోమయాగం ఋగ్యజుస్సామవేదాల ననుసరించే చేయబడుతుంది. ఆయా కర్మలలో ఋక్కుల శస్త్ర-స్తోత్రాలనుబట్టి వీటికి క్రమంగా ప్రాధాన్యత

ఇవ్వబడుతుంది. ఉదాహరణకు - అగ్నిష్టోమంలో పదిస్తోత్రాలు చేయాలి. అందులో పదో స్తోత్రానికి అగ్నిష్టోమమని పేరు. కాబట్టి దీన్ని అగ్నిష్టోమయాగ మంటారు. సామాన్యంగా చివరి స్తోత్రానికిగల పేరే ఆ యాగానికి ఏర్పడుతుంది. ఉక్థ్యం, అతిరాత్రం కూడా ఇలాంటివే. కొన్ని సోమయాగాలను వాటిని ఆచరించిన యజమాని పేరుతోనే పిలుస్తున్నారు. అంగిరస ద్విరాత్రయాగం, జనకసప్తరాత్రయాగం ఈ కోవలోనివే.

ప్రతి వసంత ఋతువులోను సోమయాగాన్ని చేయాలి. అలా చేయకపోతే కర్మలోపప్రాయశ్చిత్తం వుడుతుంది. ప్రత్యేక ప్రయోజనాల నుద్దేశించి కొన్ని యాగాలను చేస్తారు.

సోమయాగ ప్రభేదమే అగ్నిష్టోమం. ఇది ప్రాతస్సవనం, మాధ్యన్దినసవనం, తృతీయసవనమని మూడు దశల్లో చేయబడుతుంది ఇందులో 'ప్రాతస్సవనం' అయిదురోజులు చేస్తారు. మొదటిరోజు యాగ ప్రారంభ కార్యక్రమం, రెండవరోజు సోమలతను కొనడం, ప్రవర్గ్య, ఉపసత్ అనే కర్మలను చేయడం, మూడు, నాలుగు రోజుల్లో కూడా ఈ రెండింటినే కొనసాగించడం జరుగుతుంది. అయిదవరోజు సోమరసాన్ని పిండి చమసపాత్రల్లో పోసి కొంతభాగాన్ని ఆయా దేవతలకు హోమం చేస్తారు హోమం చేయగా మిగిలిన సోమరసాన్ని ఋత్విక్కులు సేవిస్తారు.

రెండోదశ మాధ్యన్దినసవనం. ఇది మిట్టమధ్యాహ్నం జరుగుతుంది ఇందులో మళ్ళా సోమరసం తీసి ఋత్విక్కులు తీసుకుంటారు. దీనిలోనే ఋత్విక్కులకు దక్షిణలు ఇవ్వబడతాయి. ఇక తృతీయ సవనం మూడోదశ ఇది మాధ్యన్దినసవనం చేసిన తరువాత కొంత విలంబంతో ప్రారంభమౌతుంది ప్రాతస్సవన-మాధ్యందిన సవనాల్లో ఉపయోగించగా మిగిలిన సోమరసాన్ని ఇందులో ఉపయోగిస్తారు. 'సౌమ్యచరు' అనే యాగం చేయబడుతుంది

హారియోజనపాత్రలో సోమరసాన్ని పోస్తారు. తరువాత ఋత్విక్కులందరూ కలసి ఒక నదిలో అవభృథంలో పాల్గొంటారు. అంతటితో అగ్నిష్టోమం పూర్తవుతుంది. ఈ యాగాన్ని తాండ్యబ్రాహ్మణంలోని ఆరవ అధ్యాయం నిరూపిస్తున్నది. పన్నెండు స్తోత్రాలు, పన్నెండు శస్త్రాలు, నాలుగు స్తోమాలు ఇందులో ఉంటాయి.

తాండ్యబ్రాహ్మణంలోని నాలుగు, అయిదు అధ్యాయాల్లో గవామయనం అనే సత్రయాగం చెప్పబడింది (చూ. 143, 228).

ఈ బ్రాహ్మణంలో 10 నుంచి 15 అధ్యాయాల వరకు వ్యూఢ ద్వాదశాహమనే యాగం చెప్పబడింది. దీన్ని పన్నెండు రోజులు చేస్తారు. ఇది అహీనం, సత్రం కూడా అవుతుంది. ఇందులో అతిరాత్రం, అగ్నిష్టోమం, ఉక్థ్యం, షోడశి, అతిరాత్రం అనే యాగాలున్నాయి. రథన్తర, బృహత్, రైవత మొ॥ సామలను ఇందులో గానం చేస్తారు.

16వ అధ్యాయం ఆరు ఏకాహయాగాలను, నాలుగు సాహస్ర యాగాలను, ఐదు సాద్యస్క్రయాగాలను నిరూపిస్తున్నది. వీటిల్లో ఏకాహయాగాలు ఒక్కరోజులో చేయాల్సినవి. అభిజిత్, విశ్వజిద్యాగాలు దీని కుదాహరణలు. బృహత్, వైరాజ మొ॥ సామలను వీటిల్లో గానం చేస్తారు. కొన్నింట్లో యజమాని మూడురోజులు అడవిలో నివసించాలి. రెండవ విభాగంలో జ్యోతిస్సు, సర్వజ్యోతిస్సు విశ్వజ్యోతిస్సు, త్రిరాత్రసమ్మితమని నాలుగు యాగాలున్నాయి. ఇందులో దక్షిణ సహస్రం కాబట్టి వీటికి సాహస్రాలని పేరు. సాద్యస్క్ర యాగాలు ఐదు. కొన్ని యాగాలకు దీక్ష, యాగపరిసమాప్తి ఒకే రోజు ఉంటుంది. కొన్నింటికి మాత్రం వరుసగా రెండు రోజుల్లో ఉంటుంది. వాటిల్లో ఒకటి అంగిరసాం అనుక్రీః, ఇంకొకటి విశ్వజిచ్ఛిల్పం.

17వ అధ్యాయం నాలుగు వ్రాతయజ్ఞాలను, ఐదు అగ్నిష్టుద్యాగాలను, మూడు త్రివృద్యాగాలను నిరూపిస్తున్నది. ఒకప్పుడు దేవతలు తమ అనుచరులను భూమిమీద వదిలేసి స్వర్గానికి వెళ్ళిపోయారు. మంచినడవడి లేకపోవడంవల్ల వీళ్లకు వ్రాత్యులని పేరొచ్చింది. తరువాత దేవతలు వీళ్లను చూసి జాలిపడి కొన్ని యజ్ఞాలు చేసే విధానాన్ని ఉపదేశించారు. ఆయజ్ఞాలే వ్రాత్యయజ్ఞాలని ప్రసిద్ధి పొందాయి. ఈ వ్రాత్యులు - నిందితులు, యువకులు, వృద్ధులు, ఇతరులని నాలుగు రకాలుగా ఉన్నారు. పాపాలు పోగొట్టుకోవడానికి గోసంపదను, అన్నాన్ని పొందడానికి ఈ అగ్నిష్టుద్యాగాలను చేసేవాళ్ళు. త్రివృత్‌స్తోమమంటే ఒక ప్రత్యేక త్రికాన్ని ఆవృత్తి చేయడం. ప్రజాపతిసవం, బృహస్పతిసవం మొ॥ ఇందులో చేరుతాయి.

ఈ అధ్యాయంలోని చివరిభాగం నాలుగు చాతుర్మాస్య యాగాలను వివరిస్తున్నది. ఈ నాలుగు యాగాలను విడివిడిగా నాలుగు ప్రత్యేక మాసాల్లో ఆచరిస్తారు. కాబట్టి వీటికి ఆపేరు వచ్చింది. ఇవి రెండు రకాలు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులచే చేయబడేవి మొదటి విభాగానికి చెందుతాయి. రాజసూయయాగంలో ఒక భాగంగా క్షత్రియుడు మాత్రమే చేసేవి, రెండో విభాగానికి సంబంధించినవి. 1. వైశ్వదేవం. 2. వరుణప్రఘాసం 3. పాకమేధం. 4. శునాసీరీయం అని వాటిపేర్లు. వీటిని ప్రతిసంవత్సరం చేయాలి. ఫాల్గుణ పూర్ణిమకు గాని, చైత్రపూర్ణిమకు గాని వైశ్వదేవం చేయాలి. దీనికి ఎనిమిది అంగయాగాలు. వాటికి ప్రత్యేక దేవతలు ఉన్నారు. వైశ్వదేవంచేసిన నాలుగునెలలకు అంటే ఆషాఢం లేక శ్రావణంలో పూర్ణిమ రోజున వరుణప్రఘాసం చేయాలి. దీనికి తొమ్మిది అంగయాగాలు, వాటికి ప్రత్యేకమైన దేవతలు ఉన్నారు. కార్తికమాసంలోగాని, మార్గశిర మాసంలోగాని శుక్లపక్షంలో చతుర్దశినుంచి రెండురోజులు పాకమేధాన్ని చేయాలి. దీనికి మహాపితృయజ్ఞంతో బాటు ఎనిమిది అంగయాగాలున్నాయి. హోమాహుతులు ఇందులో రుద్రుడికి

సమర్పింపబడతాయి. సాకమేధం చేసిన మూడు నాలుగురోజుల తర్వాత గాని, మూడు నాలుగు నెలల తర్వాతగాని శునాసీరీయం చేయాలి. దీనికి అయిదు అంగయాగాలున్నాయి.

ఈ చాతుర్మాస్యాలు మూడురకాలు - 1. ఇష్టిరూపంలో ఉండేవి. 2. పశువుల నర్పించే పాశుకయాగరూపంలో ఉండేవి. 3. సోమరసాన్ని ఉపయోగించే సౌమికయాగరూపంలో ఉండేవి.

18వ అధ్యాయంలో వాజపేయం వర్ణింపబడింది. ఇది ఒక్క రోజులో పూర్తయ్యే అంగయాగం. ఇదేమాదిరి యాగాలు ఈ అధ్యాయంలో ఇంకా నాలుగున్నాయి. అగ్నిష్టోమంకూడా వాటిల్లో ఒకటి. వీటిని ఆచరించినవాళ్ళకు లౌకికమైన సుఖాలతోపాటు స్వర్గం కూడా లభిస్తుంది.

ఈ అధ్యాయమే రాజసూయాన్ని కూడా వర్ణిస్తుంది. దీన్ని చేయడానికి ఒక సంవత్సరంపైన కొన్ని రోజులు పడుతుంది. క్షత్రియులే దీన్ని ఆచరించడానికి అర్హులు. ఇందులో ఆరు సోమయాగాలు, రెండు పశుయాగాలు, 129 ఇష్టులు ఉంటాయి. దీన్ని ఫాల్గుణ బహుళ చతుర్దశినాడు ప్రారంభించాలి. ఈ యాగంలో చరువును మద్యంతో కలిపి దేవతలకర్పించి రాజు స్వీకరించడంవల్ల ఈ పేరు దీని కేర్పడింది. సార్వభౌమాధికారాన్ని, పశుసంపదను పొందడం దీనికి ఫలం. ఇందులో 'యజ్ఞాయజ్ఞీయ' 'వారవన్తీయ' సామలను గానం చేస్తారు.

19వ అధ్యాయంలో దేవతాద్వంద్వాల ప్రీతికోసం ఒకేవ్యక్తి చేసే ఇరవైయాగాలు వివరించబడ్డాయి. ఆ దేవతాద్వంద్వాలలో ఇంద్రుడు-అగ్ని మొదలగు దేవతలుకూడా ఉన్నారు (19-15).

20వ అధ్యాయం పదమూడురకాల అతిరాత్రయాగాలను నిరూపిస్తున్నది. వీటిల్లో సోమరసాన్ని పిండి చమసపాత్రల్లో పోసి దేవతల కర్పించి ఋత్విక్కులు స్వీకరిస్తారు. ఆ సమయంలో నాలుగు స్తోత్రాలను గానం చేస్తారు. ఇలాగే ఇంకా రెండు సమయాల్లో ఈ నాలుగు స్తోత్రాలను గానం చేస్తారు. మొత్తం పన్నెండు స్తోత్రాల గానం జరుగుతుంది. ఈ మూడు సందర్భాలు అర్ధరాత్రిలోనే వస్తాయి కాబట్టి వీటికి రాత్రులని, ఈ యాగానికి అతిరాత్రమని పేరేర్పడింది.

ఈ బ్రాహ్మణంలో 20-11 నుంచి 25-9 వరకు సుమారు 91 యాగాలు వివరించబడ్డాయి. ఈ యాగాలక్రమం వాటిని ఆచరించే రోజుల సంఖ్యనుబట్టి ఉంటుంది. ఇవన్నీ అహీనాలనే యాగాలకోవకు చెందినవి. వీటిల్లో యాగకాలపరిమితి రెండు నుంచి పది రోజులవరకు, 13 నుంచి 15, 21, 24, 33, 49 రోజులవరకు ఉంటుంది.

ఇరవైఐదో అధ్యాయంలోని 10వ ఖండనుంచి 12వ ఖండ వరకు మిత్రావరుణయోరయనం, ఇంద్రాగ్న్యోరయనం, అర్యమ్ణోరయనం అనే సారస్వతయాగాలు ప్రతిపాదింపబడ్డాయి. ఈ యాగాలు సరస్వతీనది దక్షిణతీరాన చేయబడినట్లు ఈ బ్రాహ్మణం (25-10-1) చెబుతున్నది. అక్కడే ఈ నది అంతర్ధానమైంది. సాయణుడు ఈ నది పశ్చిమాభిముఖంగా ప్రవహిస్తున్నదని, ఎవరికీ కనబడడం లేదని వ్రాశాడు. అందువల్లనే దృషద్వతీనది ఒడ్డున యాగాలను చేస్తారు.

దృషద్వతీతీరాన దార్షద్వతయాగం చేయాలని 25-1-2 లో చెప్పబడింది. సర్పసత్రం ఒక సంవత్సరం చేయాలి. గవామయనం, ఆదిత్యానామయనం, అంగిరసామయనం, ఇవన్నీ ఒక విభాగానికి చెందినవి. వీటిని చేయటానికి ఒక్క సంవత్సరం పడుతుంది. ప్రజాపతి సత్రం, విశ్వసృజామయనం ఒక్కొక్కటి వెయ్యి సంవత్సరాలు చేయాల్సిన యాగాలు.

ఈ బ్రాహ్మణంలో ఉద్గాత, ప్రస్తోత, ప్రతిహర్త, సుబ్రహ్మణ్యుడు అనే సామగానంచేసే ఋత్విక్కులకు సంబంధించిన విషయాలు ఎన్నో ప్రతిపాదింపబడ్డాయి. ఈ బ్రాహ్మణం సుమారు 178 యాగాలను నిరూపిస్తున్నది. ఋగ్వేదయజుర్వేదాలు అధ్యయనం చేసిన ఋత్విక్కులు కూడా ఈ యాగనిర్వహణలో వారి వారి పాత్రలను నిర్వహిస్తారు. సామవేదానికి సంబంధించిన స్తోత్రపద్ధతిని గురించి అనేక గ్రంథాల్లో నుంచి ఎన్నో వివరాలు ఇందులో తెలియజేయబడ్డాయి. కాపివన, గర్గత్రిరాత్ర, వైదతిరాత్ర మొ॥ పదాలు, కొన్నియాగాల పేర్లుగా ఇందులో వినబడుతున్నాయి.

ఈ బ్రాహ్మణంలో సామసంహితనుంచి చాలా మంత్రాలు పేర్కొనబడ్డాయి. కొన్ని సామలను ఉపయోగించే పద్ధతులను ఈ బ్రాహ్మణం చక్కగా నిర్దేశిస్తున్నది. 14వ అధ్యాయంలో తొమ్మిదో ఖండలో చాలా సామల ప్రస్తావం ఉంది.

- వి.వి.

## 2.6.7 వైశిష్ట్యం

తాండ్యబ్రాహ్మణం సామసంహితకు చెందిన బ్రాహ్మణాలలో చాలా ప్రాచీనమైంది. దీనిశైలి కల్పసూత్రాలశైలిలాగా ఉంటుంది. ఈ సామసంహితకు చెందిన బ్రాహ్మణాలలో రెండు శాఖలున్నాయి. ఒకటి తాండ్యశాఖ, మరొకటి తలవకారశాఖ. జైమినీయబ్రాహ్మణాదులు రెండవశాఖకు చెందినవి.

తాండ్యబ్రాహ్మణం ముఖ్యంగా సోమలతాప్రధానమైన సోమయాగాలను, వాటి అంగాలను ప్రతిపాదిస్తోంది. ఇందులో ఒకరోజు మొదలు వందరోజులు, ఒక సంవత్సరం మొదలు వెయ్యి సంవత్సరాలు అనుష్ఠించదగిన సత్రాలనే యాగాలు చాలా ఉన్నాయి. ఇందులో ఎన్నో చారిత్రికాంశాలు, భౌగోళిక విషయాలు, కాలనిర్ణయానుకూలాలైన విశేషాలు చాలా ఉన్నాయి. సోమయాగాలకు సంబంధించిన విషయాలు ఈ బ్రాహ్మణంలో చాలా విపులంగా ప్రతిపాదించబడ్డాయి.

ఇందులో పేర్కొనబడ్డ యాగాల పేర్లు వాటి ఫలాలనుబట్టో వాటిని మొదట కనిపెట్టి ఆచరించిన ఋషినిబట్టో ఏర్పడ్డాయి. దేవతల ప్రార్థనలకు ఉపయోగించే మంత్రాలు శస్త్రాలని, ఉక్థాలని, స్తోమాలని, స్తోభలని, విష్టుతులని, ప్రీష్ఠాలని పిలువబడుతున్నాయి. ఇవన్నీ సామలతో యాగానుగుణంగా ప్రయోగించబడుతున్నాయి.

ముఖ్యంగా ఈ బ్రాహ్మణంలో ఆనాడు సరస్వతీ-దృషద్వతీ నదుల తీరాలపై ఆచరించబడిన యాగాలు వాటిలో పఠించబడే సామాదుల సూక్ష్మాంశాలు చక్కగా వివరించబడ్డాయి. అంతేకాక వ్రాత్యస్తోమాలనే యాగాలద్వారా బ్రాహ్మణులుకాని ఆర్యులు ప్రాయశ్చిత్తాన్ని పొంది బ్రాహ్మణ సంఘంలో ప్రవేశించడమనే అంశం ఇందులో ప్రస్తావించబడింది. ఈ

వ్రాత్యుల జీవనవిధానం ఇలా ఉండేది: వాళ్లు సైకప్పులేని యుద్ధశకటాలను తోలేవాళ్లు. విల్లులను, బల్లేలను ధరించేవాళ్లు. గాలికెగిరే ఎఱ్ఱటి అంచుగల తలపాగలను ఉడుపులుగా ధరించేవాళ్లు. మడిచిన గొఱ్ఱితోలు చెప్పులను తొడిగేవారు. వాళ్ళ నాయకులు గోధుమరంగు దుస్తులను ధరించేవారు. వెండి హారాలను అలంకరించుకొనేవారు. వాళ్లు వ్యవసాయంగాని, వ్యాపారంగాని చేసేవాళ్ళుకాదు. వాళ్ళు బ్రాహ్మణత్వాన్ని పొందిన వెంటనే ఆ బ్రాహ్మణ భాషనే మాట్లాడసాగారు. ఆ భాష మాట్లాడటం సులభమేకాని అందులో పరుష సంయుక్తాక్షరాలు ఎక్కువగా ఉండటంతో ఉచ్చారణ కష్టమని తెలుస్తోంది. కాని వాళ్ళభాష సంస్కృతానికి బాగా సన్నిహితంగా ఉన్న ఆనాటి ప్రాకృతభాషలలో ఒక్కటై ఉండవచ్చు.

ఈ బ్రాహ్మణంలో నైమిశారణ్యంలోని ఋషులుచేసిన ఒక గొప్పయాగం, 'సుదామను' నే పేరుగల నది పేర్కొనబడినాయి. వాళ్ళు చేసే వ్యాపార వ్యవహారాలన్నీ ఎక్కువగా పడమటి దిక్కు వాళ్ళతోనే ఉండేవి. కాబట్టి ఈ బ్రాహ్మణం పుట్టిన ప్రదేశం సాధారణంగా పడమటి భాగంగా ఉండవచ్చు. అయినా తూర్పు భాగానికి దీనికి సంబంధం లేకపోలేదు. కోసలరాజైన 'పర అత్నార' అనే అతడు, ఋగ్వేదంలోని త్రసదస్యు, పురుకుత్సులు ఇందులో వినబడుతున్నారు. విదేహరాజైన 'నామిన్‌సప్య' అనే అతణ్ణి గురించి ఇందులో ప్రస్తావించబడింది. కురుక్షేత్రం, యమున మొదలైనవి చెప్పబడ్డాయి. పాంచాల దేశాన్ని గురించి, ఆదేశపు రాజులను గురించి జనకమహారాజును గురించి చెప్పకపోవటంలో స్థలభేదమే కారణం. ఆ రాజ్యాల సమకాలంలోనో, లేక ముందో; వెనకనో ఇది ఏర్పడి ఉండవచ్చు.

ఇందులోని పేర్లు ఇతరబ్రాహ్మణగ్రంథాలలో ఉన్నవాటికంటే చాలా ప్రాచీనాలు. అవి ఋషియుగానికి చెందినవిగా తోస్తున్నాయి. ఈ బ్రాహ్మణంలో చాలామంది ఉపాధ్యాయులలో అభిప్రాయభేదం లేదు. కాని కౌషీతకిశాఖీయులతో

సదభిప్రాయం ఉన్నట్లు కనబడదు. ఆ కౌషీతకులు వ్రాత్యులుగాను, యజ్ఞబాహ్యులుగాను భావించబడ్డారు.

తాండ్యమనేపేరు శుక్లయజుర్బ్రాహ్మణంలో కనబడుతోంది. అది ఒక ఉపాధ్యాయుడి పేరు. కాబట్టి శుక్లయజుస్సుకంటే ఇది ప్రాచీనమని ఊహించవచ్చు.

పురుషసూక్తంలో వివరించబడ్డ చాతుర్వర్ణ్య విభాగానికి ఇందులో కొంత వివరణ దొరుకుతుంది.

ఈ బ్రాహ్మణంలో 17వ అధ్యాయంలో రెండవ ఖండంలో ఉన్న వ్రాత్యస్తోమాల ముఖ్యాశయం పతితులు, భ్రష్టులు మొదలైన బ్రాహ్మణేతర జాతికి చెందిన ఆర్యులను ప్రాయశ్చిత్తం చేసి శుద్ధిపరచటం. షట్షోడశస్తోమాలు క[illegible] ఉక్థసంస్థలో దీన్ని ఆచరించాలి. ఈ వ్రాత్యస్తోమాలు అబురకాలుగా ఉన్నాయి. అందులో ఒకటి కుమారులకు అంటే యువకులకు చేయదగింది. మరొకటి ముసలివాళ్ళకు చేయదగింది. బాలురకు యువకులకు 'ద్విషోడశి' అనే వ్రాత్యస్తోమం. స్థవిరులకు 'శమనీచామేఢ్రస్తోమం'. ఇది శమించిన యౌవనశక్తిగల వారాచరించదగింది. ఆ కాలంలో ఈ వ్రాత్యులకు కుషీతకుడు గురువుగా ఉండేవాడు. వాళ్ళు భ్రష్టాచారులై ఉండటంచూసి లుశాకపి అనే స్వర్గిలపుత్రుడు శపించాడు. వాళ్ళు దానితో ఇంకా భ్రష్టులయ్యారు. వ్రాత్యులైన వాళ్ళు మొదట విధించిన సంఖ్యతో స్తోమాలను వాడనందువల్ల కేవలం రెండు స్తోమాలనే వాడినందువల్ల లుశాకపిశాపానికి గురై పతితత్వంనుంచి విముక్తి పొందలేదు. అందువల్లనే కుషీతకశిష్యులు వెలివేయబడ్డారు.

ఈ బ్రాహ్మణంలో 25వ అధ్యాయంలో సారస్వతసత్రాలని మూడు యజ్ఞాలు చెప్పబడ్డాయి. అందులో ఒకటి మిత్రావరుణులకు, రెండవది ఇంద్రాగ్నులకు, మూడవది అర్యమకు సంబంధించింది. సరస్వతీ వినశనే

దీక్షన్తే' అని చెప్పినట్లు సరస్వతీ నది ప్రవహించే శయ్యలో అది అంతరించిన ప్రదేశంలో యాగదీక్షను గ్రహించాలి. ఈ సరస్వతీనదియొక్క తూర్పు పడమటి భాగాలు అన్ని లోకాలకు కనబడతాయి. దాని మధ్యభాగం కనపడదు. అంటే ఇది ఇక్కడ అంతర్వాహిని అవుతుంది. ఇక్కడనే యజ్ఞదీక్ష నిర్వహించాలి. ఆ సరస్వతీ దృషద్వతి మధ్యభాగంలో కలుస్తుంది. ఆ సంగమభూమిలో జలదేవతాకచరువును, జలాతిక్రమణదోష నివారణకు హోమం చేస్తారు. తర్వాత దృషద్వతి గట్టుకు పోయి దృషద్వతి దేవతాయాపితి కాబట్టి దాంట్లో చేయకూడదు. ఒకవేళ సరస్వతిలోనే అవభృథం అనివార్యమైతే దాని జలాలను గట్టుకు తెచ్చుకొని పాత్రలలో పోసుకోవాలి. ఇలాంటి సందర్భాలమబట్టి భౌగోళికంగా ఈ బ్రాహ్మణ నిర్మాణానికి సంబంధించిన స్థల వివరాలను మనం తెలుసుకోవచ్చు.

ఈబ్రాహ్మణంలో చివర "అతిరాత్రం ప్రజాపతేః సహస్ర సంవత్సరః" (25-17-2) అని వేయి సంవత్సరాలు ఆచరించదగిన అతిరాత్రమనే సత్రం చెప్పబడింది. దీన్ని అనుష్ఠించటంచేత ప్రజాపతికి మళ్లా ప్రజాసృష్టికి కావలసిన శక్తి ఏర్పడుతుందట. భూమిలో వెయ్యి సంవత్సరాలు ఆయుువు ఎవ్వరికీ లేనందువల్ల దీనివాచరించే మానవులెవ్వరని పూర్వపక్షసిద్ధాంతాలు విపులంగా జరిగి, చివర సంవత్సర శబ్దానికి రోజని అర్థమని, వేయిరోజులు ఆచరించే సత్రంగా దీన్ని సిద్ధాంతీకరించారు.

ఇక ఈ బ్రాహ్మణంలో సామస్తోమాది మహిమలను ప్రశంసించటానికి ఆఖ్యాయికలు ఎక్కువగా ఉన్నాయి. అవి చాలా మనోరంజకాలు, అర్థగర్భితాలుగా ఉన్నాయి. అందులో సౌమిత్రసామప్రాశస్త్యాన్ని చెప్పే ఆఖ్యాయిక చూడండిః 'దీర్ఘజిహ్వా' అనే రాక్షసి చరుపురోడాశాదులను తన పొడుగు నాలుకతో నాకివేస్తూ యజ్ఞాన్ని పాడుచేస్తూండేది. దాన్ని ఇంద్రుడు ఏ విధంగానూ చంపలేక సుమిత్రుడనే కుత్సమహర్షి సహకారాన్ని కోరితే

ఆతడు అపవిత్రమైన సంస్కారరహితమైన యాగశాలలో ఆమెను మాయా వశం చేసుకొని, ఇంద్రునిచేత ఆ సామసహాయంతో చంపించాడు. అందువల్లే ఇది సౌమిత్రసామ అనబడుతోంది (13-4-17).

అలాగే పూర్వం ఇంద్రుడు యాగవిరోధులైన యతులను యజ్ఞవిరోధులతో నక్కలకు వేశాడు. అవి తినగా మిగిలిన పృథురశ్మి, బృహద్గిరుడు, రాయోవాజుడు అనేవాళ్ళు పిల్లలు కాబట్టి వారికోరిక ననుసరించి వారి పోషణభారం తనే వహించాడు. వాళ్ళల్లో పృథురశ్మికి క్షత్రబలాన్ని సార్థురశ్మమనే సామన్ని బృహద్గిరునికి బ్రహ్మవర్చస్సును, బార్హద్గిరసామను, రాయోవాజునకు పశువుల నిచ్చాడు. ఇప్పుడు సామలను గానం చేసేవారికి ఆయా ఫలాలు సంభవించగలవు. ఇవి ఆ ఆఖ్యాయికల సారాంశాలు.

ఇందులో యాగద్రవ్యాలు లభించనప్పుడు వాటికి ప్రతినిధులు విధించబడ్డాయి. సోమలత లభించనప్పుడు 'పూతీకలత' అంటే 'పుల్లజముడుతీగ'ను ఉపయోగించవచ్చు. అదీ లభించకపోతే 'అర్జునతృణా'న్ని వాడవచ్చు.

కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని సోమయాగ విషయసర్వస్వంగా భావించవచ్చు. కేవలం కర్మకాండదృష్టిలో మీమాంసాశ్రౌతసూత్రాలకు సంబంధించిన అపూర్వశాస్త్రాంశాలు ఇందులో విపులంగా విచారించబడ్డాయి. విమర్శకుల దృష్టిలో ఇది అల్పసారమని భావించబడినా, వైదికుల దృష్టిలో ఈ బ్రాహ్మణం కల్పవృక్షంలాంటిది.

- యు.ఎస్.ఆర్.

## 2.6.8 సంగ్రహసమీక్ష

తాండ్యమహాబ్రాహ్మణంలో ఆయా క్రతువులకు అంగభూతాలైన మంత్రాలు, విష్టుతులు, వాటి అర్థాలు, వాటి ఫలాలు విస్తరంగా నిరూపింపబడినాయి.

మొదటి అధ్యాయంలో ఉద్గాత పఠింపవలసిన మంత్రాలు వివరింపబడ్డాయి. అందులో మొదటిమంత్రం యజమాని తనను సోమయాగంలో ఋత్విక్కుగా వరించమని కోరినందుకు సంతోషిస్తూ ఉద్గాత సోమప్రవాకుని ఉద్దేశించి పఠించినది. సామవేదంలో చెప్పబడ్డ కర్మలను ఆచరించడానికి అధికారులైన పురుషులలో హోత, అధ్వర్యుడు, బ్రహ్మ, ఉద్గాత అనే నలుగురు వరించదగినవాళ్ళు. వాళ్ళల్లో ఉద్గాతను ఋత్విక్కుగా వరించడానికి యజమాని సోమప్రవాకుణ్ణి పంపిస్తాడు. సోమప్రవాకుడంటే: సోమయాగ వృత్తాంతాన్ని బాగా వివరించి చెప్పగలవాడని అర్థం. ఉద్గాత ఋత్విక్కుగా ఉండటానికి సంతోషపూర్వకంగా అంగీకరించి ఇలా అంటాడు. 'ఓ సోమప్రవాకుడా! యజమాని నన్ను తను చేయబోయే సోమయాగంలో ఋత్విక్కుగా అవ్వయించమని కోరుతున్నాడని నీవు చెప్పినమాట ఎంతో పూజ్యతమం, దీప్తం, యశస్కరం, భోగసాధనం, సర్వాభీష్టప్రదమైంది. అలా ఋత్విక్కుగా ఉండటం నాకు రక్షకం కావాలి'.

ఆర్త్విజ్యం (ఋత్విక్కుగా ఉండటం) ఒక దుర్లభమైన అధికారం. మహాభాష్యకారుడు, వ్యాకరణాధ్యయనానికి ఋత్విక్కర్మార్హతాలాభం ప్రయోజనమని చెప్పాడు. 'ఆర్త్విజీనాః స్యామేత్యధ్యేయం వ్యాకరణమ్'.

రెండు-మూడధ్యాయాలలో స్తోత్రరూపాలైన మంత్రాలు, స్తోమలు పఠింపబడ్డాయి. ప్రథమాధ్యాయంలో చెప్పబడ్డ మంత్రాలకు అన్ని

సోమయాగాల్లోను వినియోగముంటుంది. చతుర్థపంచమాధ్యాయాలు 'గవామయనం' అనే యాగాన్ని ప్రతిపాదించాయి.

ఆరవ అధ్యాయంలో సర్వయాగాలకు ప్రకృతి అయిన అగ్నిష్టోమం నిరూపించబడింది. హిరణ్యగర్భుడు 'ఇప్పుడు నేన్కొక్కణ్ణే కాని బహు పదార్థరూపంగా కావాలి' అని కోరుకొన్నాడు. తరువాత అగ్నిష్టోమయాగం సంతానాన్ని కలిగించగలదని గ్రహించి దాన్ని ఆచరించాడు. దానివల్ల ఈ ప్రజలను సృష్టించాడు, అని ఈ బ్రాహ్మణం చెబుతుంది. 'ప్రజాపతి దీన్ని ఆచరించాడు కాబట్టి అందరు దీన్ని ఆచరించాలి' అనే విధి దీనివల్ల ఊహింపబడుతోంది. "యత్ స్తూయతే తద్విధీయతే" 'స్తుతిపాత్రమైన దాన్ని తప్పక ఆచరించాలి' అని న్యాయం.

ఏడవ అధ్యాయంలో బహిష్పవమానంలో ఉన్న సామలు వాటి స్తోత్రులు నిరూపింపబడ్డాయి. బహిష్పవమానం అంటే ఒక స్తోత్రం[1]. గాయత్రమనే సామ ఈ భూర్లోకభువర్లోక సువర్లోకాలే. ఆ సామను మూడు ఆవృత్తులు అయ్యేటట్లు గానం చేయాలి. ఆవృత్తులు అంటే గీతిఖండాలు. అందులో మొదటి ఆవృత్తి 'పవమానాయేన్దవా' అనేది. రెండవఖండం 'అభిదేవామియా', మూడోది 'క్షాత' అనేఖండం. ఈ గానప్రకారం సూత్రకారుడు చెప్పిందట. ఇలా గానంచేస్తే, అది యజమానిని పైమూడు లోకాలతో సమానమైన్నిగా చేస్తుంది. ఈ అధ్యాయంలోనే రథన్తరసామ గానప్రకారం చాలా విస్తరంగా నిరూపింపబడింది. దీన్ని గానం చేసేటప్పుడు ప్రతిఅక్షరాన్ని నిలుపుతూ గానం చేయాలి. రథన్తరమనే ఈ సామ దేవతల రథమే. రథం తన చక్రాల ఆకులమీద గదా! నిలబడుతుంది[2]. స్వర్గం ఆలస్యం లేకుండా

1. "ఇమే వై లోకాః గాయత్రమ్, త్ర్యావృత్తేయమ్. త్రయో హీమే లోకా యత్ త్ర్యావృద్గాయతి. ఏభిరేవైనం లోకైః సంమిమీతే".
2. "దేవరథో వై రథన్తరమ్. అక్షరేణాక్షరేణ ప్రతిష్ఠాయం స్తోతవ్యమ్. అరేణారేణ హి రథః ప్రతితిష్ఠతి".

సిద్ధించడానికి తొందరగా గానం చేయాలి. 'క్షిప్రం గేయం స్వర్గస్య లోకస్య సమష్ట్యై.'

ఎనిమిదో అధ్యాయంలో కూడ చాల సామలు, వాటి గాన రీతులు ప్రయోజనాలు చెప్పబడ్డాయి. వాటిలో ఉదాహరణ మాత్రం కొన్నింటిని ఇక్కడ పరిశీలిద్దాం -

బ్రహ్మసామలంటే బ్రహ్మణాచ్ఛంసి గానం చేసేవి. అందులో కొన్ని కామ్యాలు, కొన్ని అభిచారం ప్రయోజనంగా గలవి. అభిచారమంటే చాతపాడి. అభిచారంకోసం చేసే యాగాలలో వాటి గానం. పశువులు కావాలని కోరేవాళ్ళుకూడ ఈ సామను గానం చేస్తారు. దానికి 'త్రైకకుభ' మనిపేరు.

కాలేయమని ఇంకొక సామ. పూర్వం లోకాల ఆధిపత్యం కోసం దేవతలు అసురులు పోటీపడ్డారు. దేవతలు తమ తండ్రి ప్రజాపతితో మొరబెట్టుకోగా అతడు వారికి సామనుపదేశించి, 'దీనితో అసురుల బెడదను తొలగించుకోండి' అని 'ఏతేనైతాన్ కాలయిష్యధ్వమ్' అనటంవల్ల కాలేయమనే పేరు దీని కేర్పడిందట. కలి అనే ఋషిచేత దర్శింపబడిన సామగూడ 'కాలేయం' అవుతుంది.

శ్యావాశ్వుడు కనుగొన్న సామ శ్యావాశ్వం. శ్యావాశ్వుడు సత్రం చేస్తుండగా కొందరు యాజ్ఞికులు క్రోధంతో అతన్ని నీళ్ళులేని మరుప్రదేశానికి తీసుకుపోయి విడిచిపెట్టారట. అప్పుడాయన వృష్టి సాధనమైన ఈ సామను కనుగొన్నాడట. దీన్ని గానంచేయుటంవల్ల అక్కడ వర్షంపడి, సస్యసంపత్తి గలిగిందట. దాని ప్రభావంవల్ల అతడా మరుభూమినుంచి తిరిగి తన యజ్ఞభూమికి చేరుకోగలిగాడు (8.5.6). ఈ సామతో స్తోత్రంచేస్తే దోవతప్పినవాడు మార్గాన్ని మళ్ళా గుర్తించగలుగుతాడు. ఆ కాలపు మహర్షుల తపశ్శక్తి, సంకల్ప బలం ఇంతింతని చెప్పలేం.

కవిచే దర్శింపబడ్డ సామ 'కావం'. కవి అంటే శుక్రాచార్యుడు. 'ఔశనం' అని ఇంకొక సామ. (ఉశనాః=శుక్రాచార్యుడు). ఈ రెండు యజ్ఞాన్ని రక్షించే పగ్గాలవంటివి.

యజ్ఞాయజ్ఞీయం - సకలయజ్ఞాలను బ్రహ్మ ఈ సామనుంచే సృష్టించాడట. పూర్వం దేవతలందరు వేదరాశి నంతటిని తమలో తాము పంచుకొన్నారట. అందులో బ్రహ్మభాగం పెద్దదైందట.

సామలగానం భిన్నభిన్న రీతుల్లో వేయాలని విధింపబడింది. అందులో ఈ యజ్ఞాయజ్ఞీయసామ గానప్రక్రియ వివోపమచేత చూపబడింది. ఎద్దు మూత్రించినపుడు ఆ ధారను ఎప్పుడూ భూమిపై వంకరగానే పడేటట్లు చేస్తుంది. అలాగే మెలికలు మెలికలుగా గానం చేయాలి (8.7.4). ఇలా లౌకికమైన ఉపమానాలు అశ్లీలంగా తోచేవికూడ అనేకమున్నాయి. కాని ఇది కావ్యం గాదు కాబట్టి దోషంగా భావింపకూడదు.

దేవతలు అగ్నిని ముందుపెట్టుకొని అశ్వంతో గూడ వెళ్లి శత్రువులను ముట్టడించినప్పుడు గానంచేసిన సామకావటంచేత దీనికి 'సాకమశ్వం' అనే పేరేర్పడింది. 'సాకం' అంటే 'కూడా' అని అర్థం.

ఈ విధంగా ఆయా ఋషులు దర్శించిన సామలు కావటంచేత వాటికా పేర్లు ఏర్పడ్డాయి. వాళ్లు వాటిని దర్శించటానికి కారణాలు, వాటి గానంవల్ల కలిగే ఫలాలు ఆఖ్యాయికారూపంలో ఈబ్రాహ్మణంలో చాలా చోట్ల విశదీకరింపబడ్డాయి.

ఆ కాలంలో చర్మరోగాదులు గూడ ఆయా సామలగానంవల్ల శాంతించినట్లు కొన్ని మంత్రాలవల్ల తెలుస్తున్నది. తొమ్మిదో అధ్యాయంలో నైతవాస్యం, దైవోదాసం, మైత్రావరుణం మొ॥ ఆయా ఋషులచే దర్శింపబడ్డ

సామలున్నాయి. అందులో 'అకూపారం' అనేది ఒక సామ. అంగిరస్సు కుమార్తె 'అకూపార'. ఆమె శరీరంలో చర్మమంతా ఏదో దోషంవల్ల ఉడుము చర్మంలాగా కర్కశమైపోయిందట. అప్పుడామె ఇంద్రుని ప్రార్థించగా అతడా దోషాన్ని తొలగించాడట. ఎవరెవరు ఎలాంటి కోరికతోనైనా ఈ సామగానంతో స్తోత్రంచేస్తే వారికా కోరికలు సిద్ధిస్తాయని ఈ బ్రాహ్మణం చెబుతుంది (9.2.14).

బ్రాహ్మణ జాతీయులైన ఋషులేగాక క్షత్రియ ఋషులు గూడ తమ తపోబలంచేత కొన్ని కొన్ని సామలను దర్శించినట్లు ఈ బ్రాహ్మణం ద్వారా తెలుస్తున్నది. 'ఆర్షభసామ' అనేది క్షత్రియసామ. విశ్వామిత్రుని కుమారుడు ఋషభుడు. ఋషభుడు పుట్టినప్పటికి విశ్వామిత్రుడు క్షత్రియుడుగానే ఉన్నాడు. అందువల్ల ఇది క్షత్రసామ. దీన్నే 'బ్రాహ్మణాచ్ఛంసిసామ' అని కూడా అంటారు.

బ్రాహ్మణాలలో విధింపబడ్డ శస్త్రాలు లక్షణచేత బ్రాహ్మణాలని పిలువబడుతున్నాయి. శస్త్రాలంటే ఆయుధాలు కాదు; స్తుతులు. వాటిని పఠించే ఋత్విక్కు బ్రాహ్మణాచ్ఛంసి. ఈ పదంలోని పంచమీ విభక్తికి ద్వితీయావిభక్తి అర్థాన్ని చెప్పాలి. స్తుతులు -స్తోత్రాలు, శస్త్రాలు అని రెండు విధాలు. గానంతో గూడిన మంత్రంతో చేయబడేది స్తోత్రం[1]. గానం లేనిది శస్త్రం[2].

పురుషులైన ఋషులే గాక స్త్రీలు గూడ సామలను తపోబలం చేత దర్శించగలిగారని ఈ బ్రాహ్మణంలో ఒక ఆఖ్యాయికవల్ల తెలుస్తుంది. 'త్వాష్ట్రీసామ' అని ఒక సామ ఉంది. త్వష్టకుమార్తెలు త్వాష్ట్రులు (త్వాష్ట్ర్యః).

1. ప్రగీతమంత్రసాధ్య గుణినిష్ఠ గుణాభిధానం స్తోత్రమ్.
2. అప్రగీతమంత్రసాధ్య గుణినిష్ఠగుణాభిధానం శస్త్రమ్.

ఇంద్రునికి కంటిరోగంవల్ల నిద్రపట్టకుండా బాధపడుతున్నాడట. ఎవరూ ఏమీ చేయలేకపోయారట. అప్పుడు త్వష్టకుమార్తెలు ఆ సామగానంతో చంటిబిడ్డలను జోలపాడి నిద్ర పుచ్చినట్లు నిద్రపుచ్చారట (12.5.19-22).

ఔర్ణాయవమని ఒక సామ - పూర్వం అంగిరసులు సత్రయాగాన్ని చేసి స్వర్గాన్ని పొందినా వాళ్ళకు దేవయానమార్గం తెలియలేదు. వాళ్ళల్లో కల్యాణుడనే ఒక అంగిరసుడు అంతరిక్షలోకానికి వెళ్లి ఊర్ణాయువనే గంధర్వుణ్ణి ప్రార్థించాడు. అతడా మార్గాన్ని ఇతడికి తెలియజెప్పి 'నీవు మీవాళ్ళకు ఊర్ణాయువు నాకు దాన్ని చెప్పాడని చెప్పు. నేనే తెలిసికొన్నానని అబద్ధమాడకు' అని చెప్పాడు. కాని అతడు అసత్యమాడటంచేత అతనికి ఆ జ్ఞానం నశించి కుష్ఠురోగి కూడా అయినాడట. ఊర్ణాయువు దర్శించిన ఆసామకు అంతశక్తి ఉంది. దర్శనమంటే కనుక్కోవటమేగాని రచించటం కాదు.

పదమూడో అధ్యాయంలో బహిష్పవమానస్తోత్రంలో తృచవిధానం, ఆజ్యస్తోత్రవిధానం, సామగానంలో సాంతత్యవిధి, నిధనవిధి, గాయత్రశాక్వరసామవిధి మొ॥ విషయాలు చెప్పబడ్డాయి.

పద్నాల్గో అధ్యాయంలో నాలుగు ఆజ్యస్తోత్రాలు, పృష్ఠస్తోత్రాలకు సంబంధించిన తృచలు, సామలు, ఆర్భవపవమానంలోని తృచలు, సామలు, ఉక్థస్తోత్రఋక్కులు, సామలు మొ॥ విధింపబడ్డాయి.

పదిహేనో అధ్యాయంలో ఋత్విక్కులు మరచిపోయిన కర్మను ప్రక్కనున్నవారు జ్ఞాపకం చేయకూడదని చెప్పబడింది. ప్రజాపతిని అతిథిలాగా ఆహ్వానించి చరుపురోడాశాలతో అతనికి సంతృప్తి కలిగించేటప్పుడు మధ్యలో మర్చిపోయిన కర్మను జ్ఞాపకం చేయకూడదు. అది ఆయనకు అసంతృప్తిని కలిగించవచ్చు (15.7.3).

పదహారవ అధ్యాయంలో జ్యోతిశ్శబ్దనిర్వచనం, దక్షిణావిధి, గో-ఆయు, అభిజిత్ - విశ్వజిత్ అనే ఏకాహయాగవిధి, మొ॥ వివరింపబడ్డాయి.

పదిహేడవ అధ్యాయం వ్రాత్యయజ్ఞాలను, అయిదు అగ్నిష్టుద్యాగాలను, మూడుత్రివృద్యాగాలను, సౌమిక చాతుర్మాస్యలను వివరిస్తున్నది.

పద్దెనిమిదో అధ్యాయంలో రాజసూయయాగం ప్రధానంగా ప్రతిపాదించబడింది. పవిత్రం -అభిషేచనీయం అనే రెండు సోమయాగాలు రాజసూయంలో వస్తాయి. దశపేయం, కేశవపనీయం మొ॥ విధులు ఈ సందర్భంలో చెప్పబడ్డాయి.

పందొమ్మిదో అధ్యాయంలో రాజ్యం పొందాలనే అభిలాష నెరవేరని రాజు చేయాల్సిన "రాట్" అనే యాగంనుంచి "విఘన" మనే యాగందాకా ఉండే ఇరవై ద్వంద్వసోమయాగాలు చెప్పబడ్డాయి.

ఇరవయ్యో అధ్యాయంలో పదమూడు అతిరాత్రయాగాలు, మూడు అంగిరసద్విరాత్రయాగాలు, గర్గత్రిరాత్రం ఉపదేశించబడ్డాయి.

ఇరవయ్యొకటో అధ్యాయం అశ్వత్రిరాత్రం, వైదత్రిరాత్రం, ఛందోమపవమానం, అంతర్వసుత్రిరాత్రం, పరాకత్రిరాత్రం, చతుర్వీరచతూరాత్రం, అభ్యాసంగి పంచరాత్రం, మొ॥ వివరిస్తోంది.

ఇరవైరెండో అధ్యాయంలో మూడు షడ్రాత్రాలు, ఏడు సప్తరాత్రాలు, రెండు నవరాత్రాలు, నాలుగు దశరాత్రాలు, పౌండరీకమనే ఏకాదశరాత్రయాగం ప్రతిపాద్యవిషయాలు.

ఇరవైమూడో అధ్యాయం త్రయోదశరాత్రంనుంచి, ద్వాత్రింశద్రాత్రయాగం వరకు ఉన్న సత్రాలను వివరిస్తున్నది.

ఇరవైనాలుగో అధ్యాయం త్రయస్త్రింశద్రాత్రసత్రయాగం నుంచి శతరాత్రసత్రయాగం వరకు వివరించి, సంవత్సరకాలం చేయాల్సిన గవామయనాన్ని నిరూపిస్తోంది.

ఆదిత్యానామయనం, అంగిరసామయనం, కుండపాయినామయనం, ప్రజాపతిసత్రం, సర్వసమృద్ధులను సంపాదించే శక్త్యానామయనం, మూడు సంవత్సరాలుచేసే సాధ్యసత్రం, మూడు సారస్వత సత్రాలు, వెయ్యి సంవత్సరాలు చేసే విశ్వసృజామయనం మొ॥ ఇరవై అయిదో అధ్యాయంలో ప్రతిపాదింపబడ్డ విషయాలు.

ఇలా ఎన్నో యాగాలను, సత్రాలను సాంగోపాంగంగా ప్రతిపాదిస్తూ తాండ్యబ్రాహ్మణం బ్రాహ్మణాలన్నింటిలోకి విశిష్టమైన స్థానాన్ని సంపాదించింది.

- కె.ఆర్.

# ఛాందోగ్యబ్రాహ్మణం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 2. విశేషవిభాగం

## 2.7 ఛాందోగ్యబ్రాహ్మణం

### 2.7. 1 పరిచయం

సామవేదానికి గల కౌథుమశాఖకు సంబంధించిన బ్రాహ్మణం ఛాందోగ్యబ్రాహ్మణం. దీన్నే మంత్రబ్రాహ్మణమని కూడా అంటారు. కౌథుమశాఖకు సంబంధించిన బ్రాహ్మణాలకు ఛాందోగ్యబ్రాహ్మణాలనే వ్యవహారం కూడా ఉంది. ఈ బ్రాహ్మణంలో నాలుగు వేదాల్లోను ఇతర బ్రాహ్మణాల్లోను ప్రసిద్ధమైన మంత్రాలు కొన్ని ఉన్నాయి. దీన్ని ఎవరు సంకలనం చేశారో మనకు స్పష్టంగా తెలియడం లేదు. మిగతా బ్రాహ్మణాలకు దీనికి ఎంతో తేడా ఉంది. ఇందులో యజ్ఞ యాగాల ప్రస్తావన లేనే లేదు. మానవజీవితంలో తప్పనిసరిగా ఆచరించాల్సిన సంస్కారాలకు సంబంధించిన కొన్ని మంత్రాలు ఇందులో చోటుచేసుకున్నాయి. అందువల్లనే గృహ్యసూత్రాలకు కొంతవఱకు మార్గదర్శనం చెయ్యగలిగింది.

ఈ బ్రాహ్మణంలో చివఱ చేరిన ఎనిమిది ప్రపాఠకాలు ఛాందోగ్యోపనిషత్తుగా ప్రసిద్ధి పొందాయి. మొదటి రెండు ప్రపాఠకాలకే మంత్రబ్రాహ్మణం అనే వ్యవహారం ఏర్పడింది.

- ఎస్.బి.ఆర్

2.7.2 విభాగం

ఛాందోగ్యబ్రాహ్మణంలో రెండు ప్రపాఠకాలున్నాయి. ఒక్కొక్క ప్రపాఠకం ఎనిమిది ఖండలుగా విభజింపబడింది. అందులో మొదటి ప్రపాఠకంలో 136 మంత్రాలు, రెండో ప్రపాఠకంలో 121 మంత్రాలు ఉన్నాయి. చూడండి :

| ప్రపాఠకం | ఖండలు | మంత్రాలు | ప్రపాఠకం | ఖండలు | మంత్రాలు |
|---|---|---|---|---|---|
| 1 | 1 | 15 | 11 | 1 | 16 |
| | 2 | 21 | | 2 | 16 |
| | 3 | 14 | | 3 | 21 |
| | 4 | 9 | | 4 | 11 |
| | 5 | 19 | | 5 | 18 |
| | 6 | 35 | | 6 | 19 |
| | 7 | 16 | | 7 | 6 |
| | 8 | 7 | | 8 | 14 |
| | | 136+ | | | 121=257 |
| | | | | | గుణవిష్ణుమాత్రవ్యాఖ్యాతాలు 11 |
| | | | | | --- |
| మొత్తం | | | | | 268 |

విషయవిభాగం :

బ్రాహ్మణాలు చాలావరకు యజ్ఞయాగాది కర్మలను విధించి, వాటి స్వరూపాలను నిర్వచిస్తూ ప్రసంగవశాన ఇతర విషయాలెన్నింటినో ప్రతిపాదిస్తుంటాయి. ఈ బ్రాహ్మణంలో ఆ పద్ధతి పూర్తిగా మారిపోయింది. యజ్ఞయాగాది కర్మలకంటే ఇది గృహ్యకర్మలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నది.

భారతీయ జీవనవ్యవస్థకు వివాహం ఒక పట్టుగొమ్మ. అలాంటి వివాహం, గర్భాధానం, సీమంతం, జాతకర్మ, ఉపనయనం, సమావర్తనం, పశువృద్ధి నాగబలి, స్థాలీపాకం, దుష్టగ్రహోచ్చాటనం మొ॥ కర్మలను ఈబ్రాహ్మణం నిరూపిస్తున్నది. ఈ బ్రాహ్మణం చివర పేర్కొనబడ్డ భోజనాదుల్లో క్రిమిదోషనివారక మంత్రాలు ఎంతో ఆకర్షణీయమైనవి.

**మొదలు-చివర:**

ఈ బ్రాహ్మణం "దేవ సవితః ప్రసువ యజ్ఞం" అనే మంత్రంతో ప్రారంభమై "మాతా రుద్రాణాం దుహితా వసూనాం" అనేమంత్రంతో పూర్తవుతున్నది.

- ఎస్.బి.ఆర్.

### 2.7.3 సంకలనకాలం

దేశం:

ఛాందోగ్యబ్రాహ్మణం మనదేశంలో ఏ ప్రాంతంలో సంకలనం చేయబడి ఉంటుందని ఊహించడం అంత తేలికైన పనికాదు. కాని ఈ బ్రాహ్మణానికిగల తాండ్యబ్రాహ్మణసంబంధాన్ని బట్టి ఇది కూడా కురుక్షేత్రానికి తూర్పుభాగంలో ఏర్పడి ఉంటుందని ఊహించడంలో తప్పులేకపోవచ్చు. ఒకప్పుడు మొదటి 25 ప్రపాఠకాలు పంచవింశ బ్రాహ్మణమని, ఆ తరువాత 5 ప్రపాఠకాలు షడ్వింశబ్రాహ్మణమని, 2 ప్రపాఠకాలు మంత్రబ్రాహ్మణమని, 8 ప్రపాఠకాలు ఛాందోగ్యోపనిషత్తని, ఈ మొత్తం 40 ప్రపాఠకాలకు తాండ్యబ్రాహ్మణమని లేక ఛాందోగ్యబ్రాహ్మణమనే వ్యవహారం ఉన్నట్లు తెలుస్తున్నది.

కాలం:

పైన చెప్పబడినట్లు మంత్రబ్రాహ్మణం తాండ్యబ్రాహ్మణంలో చివరి భాగం గనుక అయినట్టైతే తాండ్యబ్రాహ్మణంలో మొదటి 25 ప్రపాఠకాలు (అనగా పంచవింశబ్రాహ్మణం) క్రీ.పూ. 8వ శతాబ్దంలో ఏర్పడి ఉంటాయి. ఆపైన షడ్వింశబ్రాహ్మణంగా ఉన్న అయిదు ప్రపాఠకాలు, మంత్ర బ్రాహ్మణంలో ఉన్న రెండు ప్రపాఠకాలు ఏర్పడి ఉంటాయి. మంత్రబ్రాహ్మణంలో మంత్రాలు నాలుగు సంహితలనుంచి తీసుకోబడటం, గోభిల-ఖాదిరగృహ్యసూత్రకారులు ఈ బ్రాహ్మణంలోని మంత్రాలను యథాతథంగా పేర్కొనడం, ఇందులోని మంత్రాలు వివాహాది సంస్కారాలను వివరించడం చూస్తే ఇది బ్రాహ్మణకాలం చివర ఏర్పడి ఉంటుందనే ఊహాకు ఆస్కారం కనబడుతున్నది.

- ఎస్.బి.ఆర్.

2.7.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

వ్యాఖ్యానాలు:

ఛాందోగ్యబ్రాహ్మణానికి ప్రసిద్ధమైన భాష్యాలు రెండున్నాయి. ఒకటి "ఛాందోగ్యమంత్రభాష్య" మనే పేరుతో గుణవిష్ణువు వ్రాసిన భాష్యం. రెండోది సాయణుడు వ్రాసిన "వేదార్థప్రకాశ" మనే భాష్యం. దీనికి సత్యవ్రతసామాశ్రమి స్వతంత్రంగా ఒక వ్యాఖ్యను వ్రాసినట్లు తెలుస్తున్నది. ఆయనే 1872 లో ఒక సంస్కృతవ్యాఖ్యానంతో ఈ బ్రాహ్మణాన్ని ప్రచురించాడు. ఇంతకంటే ఈ బ్రాహ్మణానికి ప్రసిద్ధమైన భాష్యాలుగాని, వ్యాఖ్యానాలుగాని దొరకడం లేదు.

ప్రచురణలు :

మంత్రబ్రాహ్మణమనే ఛాందోగ్యబ్రాహ్మణాన్ని 1872లో ప్రత్నక్రమనందిని అయిదవ సంపుటంగా సత్యవ్రతసామాశ్రమి ప్రచురించాడు. ఈ ప్రచురణలో మూలంతోపాటు ఒక సంస్కృత వ్యాఖ్యానం, బెంగాలీ అనువాదం కూడా ఉన్నాయి. మళ్లా 1890లో ఆయనే కలకత్తా నుంచి తన స్వంత వ్యాఖ్యానంతోను, బెంగాలీ అనువాదంతోను ఈ బ్రాహ్మణాన్ని ప్రచురించాడు. దీన్ని "మంత్రబ్రాహ్మణం" అనే పేరుతో జర్మన్ భాషానువాదంతో హెన్రిచ్ స్టోనర్ హాలే (Heinrich Stonner Halle) 1901లో ప్రచురించాడు. ఇందులో ప్రథమ ప్రపాఠకం మాత్రం ఉంది. 1911వ సం॥లో హన్స్ జోర్గెన్సెన్ డార్మ్‌స్టడ్ (Hans Jorgensen Darmstadt) మంత్రబ్రాహ్మణమనే పేరుతో ఇందులోని రెండో ప్రపాఠకాన్ని సాయణభాష్యంతోను, జర్మన్ భాషానువాదంతోను ప్రచురించాడు.

కలకత్తా సంస్కృత సాహిత్య పరిషత్ పుస్తకమాలవారు 1930లో "ఛాందోగ్యమంత్రభాష్య" మనే పేరుతో ఛాందోగ్యబ్రాహ్మణంపై గల గుణ

విష్ణుభాష్యాన్ని ప్రచురించారు. దుర్గామోహనభట్టాచార్య ఛాందోగ్య బ్రాహ్మణాన్ని పూర్తిగా గుణవిష్ణు సాయణభాష్యాలతో సంపాదించి కలకత్తా సంస్కృత కళాశాల ప్రథమ ప్రచురణగా 1958లో ప్రచురించాడు. ఇలా ఛాందోగ్య బ్రాహ్మణానికి విలక్షణమైన సంస్కరణలు చాలా ఏర్పడ్డాయి.

- ఎస్.వి.ఆర్.

## 2.7.5 ప్రసిద్ధి

ఛాందోగ్యబ్రాహ్మణం సామవేదానికి సంబంధించిందైనా ప్రసంగాన్ని బట్టి నాలుగు వేదాల్లోని మంత్రాలను పేర్కొంటున్నది. గుణవిష్ణువు, సాయణుడు వ్రాసిన భాష్యాలు ఈ బ్రాహ్మణానికి ఎంతో ప్రసిద్ధిని కలిగించాయి. మిగతా బ్రాహ్మణాలు యజ్ఞయాగాది కర్మలను, అందులో ఉండే అవాంతర విశేషాలను ప్రతిపాదిస్తుంటే ఈ బ్రాహ్మణం వివాహం, గర్భాదానం, సీమంతం మొ॥ గృహ్యకర్మలను వివరిస్తున్నది. ప్రశాంతమైన సామాజిక జీవనానికి నాంది పలికే వివాహాది సంస్కారాలను ఈ బ్రాహ్మణం చక్కగా వర్ణిస్తూ ఇతర బ్రాహ్మణాలకంటే విశిష్టమైన స్థానాన్ని సంపాదించింది.

ఇందులో చెప్పబడ్డ విషయాలు అన్ని దేశాలలోను, అన్ని కాలాల్లోను మానవజాతి ఉన్నంతవరకు విలువ తగ్గనివి. చూడండి - వివాహసమయంలో వరుడు వధువుతో ఇలా అంటున్నాడు:

> నీ హృదయం; అంటే నీ అభీష్టం నాది కావాలి. అలాగే నా హృదయం నీది కావాలి. అంటే మన ఇద్దరి ఆలోచనలు, అభిలాషలు ఒకటి కావాలని భావం[1].

వివాహ ప్రయోజనం, గృహస్థాశ్రమసారం ఇందులో ఎంత చక్కగా ఇమిడి ఉన్నాయో చూడండి. అనురాగంతో నిండిన అనుకూల దాంపత్యానికి ఇదే నాంది.

కుటుంబంలో స్త్రీ మకుటంలేని మహారాణి. కుటుంబ గౌరవప్రతిష్ఠలు ఇల్లాలివల్లనే వృద్ధి పొందాలి. ఆనాడు స్త్రీకి సంఘంలో సమున్నతమైన స్థానం ఇవ్వబడింది చూడండి. వివాహసందర్భంలో వరుడు వధువుతో ఇలా అంటాడు:

---

1. యదేతద్ధృదయం తవ తదస్తు హృదయం మమ
   యదిదం హృదయం మమ తదస్తు హృదయం తవ॥ 1.3.9

> నీవు అత్తవారింట్లో అత్తమామ, ఆడుబిడ్డలు, బావలు, మఱదులు మొ॥ వారందఱిని ప్రేమానుబంధంతో చక్కగా చూసుకుంటూ ఇంటికి దీపం లాగా యజమానురాలుగా ఉండు.[1]

నిజమేమంటే: కళకళలాడే కుటుంబంలో భార్యగా, కోడలుగా, వదినగా, తల్లిగా స్త్రీ నిర్వహించే బాధ్యతలు ఆమెకెంతో ఉన్నత స్థానాన్ని నిర్ధారించాయి.

ఇలా ఛాందోగ్యబ్రాహ్మణంలో ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా గౌరవింపబడే నిత్యసత్యాలెన్నో ఉండటంవల్ల దానికెంతో ప్రసిద్ధి ప్రాచుర్యాలేర్పడ్డాయి.

- ఎస్.బి.ఆర్.

---

1. సమ్రాజ్ఞీ శ్వశురే భవ సమ్రాజ్ఞీ శ్వశ్ర్వాం భవ
ననాందరి సమ్రాజ్ఞీ భవ సమ్రాజ్ఞీ అధిదేవృషు॥ 1.2.20

2.7.6 ప్రమేయం

ఛాందోగ్యబ్రాహ్మణంలో పది ప్రపాఠకాలున్నాయి. మొదటి రెండు ప్రపాఠకాల్లో గృహ్యకర్మలకు సంబంధించిన మంత్రాలు చెప్పబడ్డాయి. ఈ రెండు ప్రపాఠకాలనూ 'మంత్రబ్రాహ్మణ' మని, 'మంత్రపర్వ' మనీ పేర్కొంటారు. తక్కిన ఎనిమిది ప్రపాఠకాలు 'ఛాందోగ్యోపనిషత్తు' అని వ్యవహరింపబడుతున్నాయి. సుప్రసిద్ధమైన దశోపనిషత్తులలో ఈ ఉపనిషత్తు ఒకటి.

సవితృదేవతాప్రార్థనతో ఛాందోగ్యబ్రాహ్మణంలోని ప్రథమ ప్రపాఠకం ప్రారంభమవుతుంది. తలపెట్టిన కర్మలు నిర్విఘ్నంగా పరిసమాప్తి కావాలంటే దేవతాప్రార్థన ఆవశ్యకమని మనసంప్రదాయం. సవితృదేవత అనుజ్ఞతో ఆరంభించే కర్మలన్నీ శుభప్రదంగా పరిసమాప్తి చెందుతాయని ఈ గ్రంథంలో 'దేవసవితః ప్రసువ యజ్ఞం' (1.1.1) అనే మొదటి మంత్రంవల్ల తెలుస్తున్నది.

ప్రథమప్రపాఠకంలోని మంత్రాలు 1. వివాహం 2. గర్భాధానం 3. సీమంతం 4. జాతకర్మ 5. ఉపనయనం 6. సమావర్తనం 7. పశువృద్ధి అనే ముఖ్యమైన ఏడు కర్మలకు అంగభూతాలైనవిగా విభజింపబడ్డాయి. ఈ మంత్రాల అర్థాన్ని సావధానంగా పరిశీలిస్తే ఆకాలపు మహర్షులు వివాహాది కర్మలకు ఎంత ప్రాముఖ్యాన్ని ఇచ్చారో, అవి ఎంత పవిత్రమైనవని భావించారో తేటతెల్లమవుతుంది.

వధూవరుల భావిజీవితం, పిల్లలు చనిపోవడం మొ॥ కష్టాలు లేకుండా సుఖంగా ఉండాలని ఆయా దేవతలను ప్రార్థిస్తూ వివాహకాలంలో ఆజ్యహోమం చేసేవారు. ఆ ప్రార్థన ఇలా ఉండేది -

ఇంద్రాదిదేవతలలో ముఖ్యుడైన అగ్నిదేవుడు మొదట ఇక్కడికి వచ్చి ఈ కన్యకకు కలుగబోయే సంతతిని మృత్యుపాశం నుండి విడిపించాలి. అలా విడిపించడాన్ని వరుణుడు అంగీకరించాలి. తన కొడుకు కేర్పడిన ఆపదవల్ల ఈమె దుఃఖించకుండా ఉండాలి. అంటే ఈమె పిల్లలకు ఆపదలు రాకూడదు.

గార్హపత్యాగ్ని ఈ కన్యను రక్షించి, ఈమె సంతతికి ఏవ్యథలూ లేని దీర్ఘ జీవితాన్ని అనుగ్రహించాలి. ఈ అమ్మాయి ఎప్పుడూ భర్తతో కలసిమెలసి ఉంటూ మంచికొడుకులను ప్రసవించాలి. ఈమె పుత్రసౌఖ్యాన్ని అనుభవించాలి.

కన్యపుట్టగానే ఆమెను సోముడు ఆదిత్యునికిస్తాడని, ఆదిత్యుడగ్నికి సమర్పిస్తాడని అగ్ని ధనపుత్రసమేతంగా ఆ కన్యను వరునికి దానం చేస్తాడని ఈ బ్రాహ్మణం తెలియజేస్తున్నది[1].

ఏడడుగులు వేసే సందర్భంలో వరుడు వధువుతో అనే ఈక్రింది మాటలు భావిజీవితంలో వారి సాహచర్యం ఎంతో దృఢంగా వుండాలని నిర్దేశిస్తున్నాయి -

'ఓ కన్యకా! నీవు నాతో అన్ని కర్మలలో సమానాధికారం పొందుతూ ఏడడుగులు నావెంట నడిచిరా! నేనుగూడా నీ సఖ్యాన్ని పొందుతాను. మనమిద్దఱం ఒకరి స్నేహాన్ని ఇంకొల్ల విడవకుండా పరస్పరం పరమానురాగంతో మెలగుదాం[2].

వధూహస్తాన్ని పరిగ్రహించి మళ్ళీ వరుడామెతో ఇలా అంటాడు-

---

1. సోమోఽదద్గంధర్వాయ గంధర్వో ఽదదదగ్నయే।
   రయిం చ పుత్రాంశ్చాదాదగ్నిర్మహ్యా మథో ఇమామ్॥ 1.1.7
2. సఖా సప్తపదీ భవ సఖ్యం తే గమేయమ్।
   సఖ్యం తే మా యోషాః సఖ్యం తే మాయోష్ఠాః॥ 1.2.18

ఓ కన్యకా! సౌభాగ్యంకోరి నేను నీహస్తాన్ని గ్రహిస్తున్నాను. పతినైన నాతో వృద్ధాప్యం పండేవఱకూ నీవు వుండాలి. భగుడు, అర్యముడు, సవిత ఈ దేవతలు గార్హపత్యాగ్ని శుశ్రూషకై నిన్ను నాకు సమర్పించారు (1.2.16`

నీవు ప్రసన్నమైన దృష్టితో నాకు ప్రీతి కలిగేటట్లు ప్రవర్తించు పశువులకు శుభం కలిగించు. మంచి మనస్సుతోనూ, మంచి తేజస్సుతోనూ వర్ధిల్లు. వీరులూ, దీర్ఘాయుష్మంతులూ అయిన పుత్రులను ప్రసవించు. పంచమహాయజ్ఞాలతో దేవతలకు తృప్తి కలిగించు. కుటుంబానికి సుఖసంతోషాలను కలిగించే నీవు రెండు పాదాలుగల పుత్రభృత్యాదులకు, నాల్గు పాదాలుగల పశువులకూ సుఖస్వరూపిణివి కావాలి (1.2.17).

ప్రజాపతి మనకు పుత్రపౌత్రాదిరూపమైన సంతతిని ప్రసాదించాలి. అర్యముడు మన సంతతిని చిరాయుష్మంతంగా చేయాలి. శుభప్రదమైన నీవు నా దగ్గఱకు చేరుకో. ప్రజలకు, పశువులకు సుఖశాంతులను కలిగించు!(1.2.18).

వర్షంద్వారా లోకానికి క్షేమం కలిగించే ఓ ఇంద్రుడా! ఈ నవవధువుకు మంచి పుత్రులను ఐశ్వర్యాన్ని ప్రసాదించు. ఈమెకు పదిమంది పుత్రులు కలిగేటట్లు అనుగ్రహించు. భర్తనైన నన్ను పుత్రులతో కలిపి పదకొండవవాణ్ణిగా చేయి (1.2.19).

హృదయపూర్వకంగా నీవు చేసే పనులు నే నాచరించే లౌకిక వైదిక కర్మలలో కలసిపోవాలి. నీ హృదయం నా హృదయాన్ని అనుసరించాలి. నీవు నామాటను పాటించాలి! బృహస్పతి నిన్ను నా కోసమే నియోగించాలి (1.2.21)

ఇందులో 19వ మంత్రాన్ని బట్టి ఆకాలంలో బహుసంతానాన్ని గృహస్థులు ఆపేక్షించేవాళ్ళని తెలుస్తున్నది. ఇందుకు కారణం ఈనాడున్నంత జనాబాహుళ్యం అనాడు లేకపోవడమే. పైగా ఆకాలంలో ప్రజాసంఖ్య పెరిగినా

అందరు సుఖంగా జీవించడానికి తగిన వనరులు భారతావనిలో సమృద్ధిగా వుండేవి.

సతీపతుల హృదయాలు ఏకం కావాలి. అవి అన్యోన్య విరుద్ధంగా వుంటే సంసారరథం చక్కగా సాగదని ఈ బ్రాహ్మణం చెబుతున్నది.

ఇంట్లో పశువులు, బిడ్డలు, అపారమైన ధనం ఉన్నప్పుడే ఆ కాపురం పాడిపంటలతో కళకళలాడుతుంది. అంతకంటే గృహస్థు కోరదేముంటుంది? అందుకే నూతనదంపతులు గృహప్రవేశం చేసేటప్పుడు పశుపుత్రధనసమృద్ధిని కాంక్షిస్తూ ఒక మంత్ర పఠింపబడుతుంది[1].

ఇక్కడ ఆవులతోపాటు గుర్రాలను కూడా కోరటంవల్ల ప్రయాణాది కార్యాలలో ఆనాడు అశ్వాపేక్ష బహుళంగా ఉండేదని ఊహించవచ్చు.

గృహప్రవేశం తరువాత శయ్యపై కూర్చుని వధువును చూస్తూ వరుడిలా అంటాడు[2].

ఓ అమ్మాయీ! ఈ ఇంట్లో నీవు ధైర్యస్థైర్యాలు కలిగివుండు! ఇక్కడే నాతో క్రీడించు! నీకు, నీ బంధువర్గానికి నాపై మనస్సు ప్రసన్నంగా ఉండాలి. నాతో అనురాగంతో మెలగు.

ఇలా దంపతులు కలసిమెలసి జీవిస్తే సంసారం స్వర్గసీమ కావడంలో ఆశ్చర్యమేముంటుంది? మన పెద్దలు సతీపతుల అనుబంధాన్ని అంత దృఢంగా నిలపగలిగారు. కాబట్టే నేటికీ భారతీయ కుటుంబాలలో విదేశాలలోలాగా విస్తృతమైన విచ్ఛిత్తి కనిపించడం లేదు.

---

1. ఇహ గావః ప్రజాయధ్వ మిహాశ్వా ఇహ పూరుషాః
   ఇహో సహస్రదక్షిణోపి పూషా నిషీదతు॥ 1.8.13
2. ఇహ ధృతి రిహ స్వధృతి రిహారన్తి రిహ రమస్వ
   మయి ధృతిర్మయి స్వధృతి ర్మయి రమో మయి రమస్వ॥ 1.3.14

దంపతులు పురుషసంతతినే ఎక్కువగా అర్థిస్తారు. ఈకాలంలోనేకాక పూర్వం కూడా మగబిడ్డలమీదనే గృహస్థులకు మక్కువ ఎక్కువ అనే విషయం ఈ క్రింది వచనాలవల్ల చక్కగా స్పష్టమవుతున్నది -

'మిత్రావరుణులు, దేవవైద్యులైన అశ్వినీదేవతలు, అగ్ని, వాయువు - వీరంతా పురుషులే. అలాగే నీ గర్భంలోని బిడ్డకూడా పురుషుడే కావాలి(1.4.8).

అగ్ని పురుషుడు, ఇంద్రుడు పురుషుడు, బృహస్పతి పురుషుడు, నీవూ అలాగే పురుషుడైన బిడ్డను పొందు. ఆ బిడ్డ తర్వాత పుట్టే బిడ్డ కూడా మగవాడే కావాలి (1.4.9).

వ్యాధులకు గురై చనిపోకుండా శిశువులను కాపాడడం తల్లిదండ్రుల ముఖ్యకర్తవ్యం. జాతకర్మకు అంగభూతాలైన మంత్రాలలోని చంద్రదర్శన సందర్భంలో వినియోగించే 'యత్తే సు సీమే హృదయం' (1.5.10) మొ॥ వాల్గుమంత్రాల్లో ఈ విషయాన్నే ప్రస్తావించడం జరిగింది.

ఆ పైన గ్రామాంతరం నుంచి తిరిగివచ్చిన తండ్రి తన కొడుకు తలను తాకుతూ ఉచ్చరించే 'అంగా దంగా త్సంస్రవసి' (1.5.16) మొ॥ మంత్రాల్లో కూడా శిశువు దీర్ఘాయుష్మంతుడుగా బ్రతకాలన్న కాంక్ష వ్యక్తం చేయబడింది. పుత్రుడు రాయిలాగా దృఢంగానూ, పదునైన పరశువులాగా తీక్ష్ణంగానూ, సువర్ణంలాగా తేజస్విగానూ ఉండి నూరేండ్లు జీవించాలని తండ్రి కోరుకుంటాడు.

శిశువు పుట్టిన తరువాత మూడో సంవత్సరంలో 'చూడాకరణం' చేయాలని శాస్త్రాలు విధిస్తున్నాయి. వపనకర్మకై వచ్చిన మంగలిని సవితృదేవతగా భావించాలని "ఆయమగాత్ సవితా క్షురేణ" (1.6.1) అనే మంత్రంవల్ల స్పష్టమవుతున్నది. అలా భావిస్తే చేసేపని ఫలవంతమవుతుంది

క్షురకర్మ దీర్ఘాయుష్యానికి దోహదం చేస్తుందని ఈ బ్రాహ్మణం (1.6.7.) నిర్దేశిస్తున్నది.

ప్రథమ ప్రపాఠకంలోని ఆరవఖండలో 9 నుండి 35 వరకు ఉండే 27 మంత్రాలు ఉపనయనకర్మకు అంగభూతాలు. ఉపనయనవిధికి ఉపక్రమించేటప్పుడు వటువు అగ్నిని, వాయువును, సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, ఇంద్రుణ్ణి (1.6.9-13) ఉద్దేశించి హోమం చేస్తూ, ఆ దేవతలను పేరు పేరునా పిలిచి ఇలా ప్రార్థిస్తాడు -

'శాస్త్రవిహితకర్మలకు పాలకులైన ఓ అగ్న్యాదిదేవతలారా! నేను ఉపనయనమనే కర్మను అనుష్ఠించబోతున్నాను. ఈ సంగతి మీకు నివేదిస్తున్నాను. మీ ఆజ్ఞతో నే నీ కర్మను సుఖంగా చేయగలను. అలా చేయడంవల్ల విద్యాభ్యాసం మొదలైన నా పనులన్నింట్లోను నేను సమృద్ధిని సాధించగలను. అంతేకాక అసత్యం నుంచి విడివడి సత్యవ్రతాన్ని పరిగ్రహించగలను.

ఇందువల్ల చదువుసంధ్యలలో నైపుణ్యం, సత్యవ్రతపాలనం, ఉపనయనానికి ముఖ్య ప్రయోజనాలని వ్యక్తమవుతున్నది.

బ్రహ్మచారి ముఖ్యంగా అగ్నికార్యం, గురుశుశ్రూష మొ॥ పనులు చేయాలని,పగలు నిద్రపోకూడదని (1.6.27) ఈ బ్రాహ్మణం నిర్దేశిస్తున్నది.

ఆ తరువాత రెండు మంత్రాలు మేఖలాబంధనంవల్ల దుర్వచన నివృత్తి, పవిత్రత, బలవృద్ధి, సత్యపాలనం, తపోవృద్ధి, రాక్షసులనుండి, శత్రువుల నుండి రక్షణ సిద్ధిస్తాయని (1.6.28, 29) ప్రతిపాదిస్తున్నాయి.

మేఖలాబంధనం తరువాత శిష్యుడు ఆచార్యుని దగ్గఱ కూర్చొని తనకోసం అధ్యయనం ప్రారంభించమని ప్రార్థిస్తాడు. అధ్యయనం కోసం

శిష్యుడు గురువును సమీపించడమే ఉపనయనమని చెప్పబడుతున్నది (తదేత దధ్యయనార్థమాచార్య సమీపప్రాప్తి రుపనయన మిత్యుచ్యతే - సాయణభాష్యం).

వటునిచేత వేదాలకు ఆదిభూతం శ్రుతిసారమూ అయిన గాయత్రీ మంత్రాన్ని చదివించడంతో వేదాధ్యయనం ప్రారంభమవుతుంది. గానం చేసే వాళ్ళ్ని రక్షిస్తుంది కాబట్టి దానికి 'గాయత్రి' అన్న వ్యవహారం కలిగింది.

ఉపనయనవిధిని వివరించిన తరువాత సమావర్తనానికి అంగభూతాలైన మంత్రాలు ఏడవఖండలో చెప్పబడ్డాయి. ఆ పైన ప్రథమప్రపాఠకంలోని చివరిఖండలో పశువృద్ధికోసం కొన్ని మంత్రాలను చెప్పారు.

ఆవులు క్షీరసమృద్ధిగల్గి వినాశానికి గురికాకుండా ఎక్కడ తిరిగినా క్షేమంగా ఇంటికి తిరిగి రావాలి. ఆజ్యాన్ని ప్రసాదించే గోసంతతి అభివృద్ధి చెందాలి అని అందులో ఒకమంత్రం (1.8.2) తెలియజేస్తున్నది. దీనివల్ల ఆ రోజుల్లో పశుసంపదకున్న ప్రాముఖ్యం బోధపడుతుంది.

ఛాందోగ్యబ్రాహ్మణంలోని రెండవ ప్రపాఠకంలో వివిధ హోమాలకు అంగభూతాలైన మంత్రాలు పేర్కొనబడ్డాయి. కామ్యకర్మలలో అనేక ప్రయోజనాలను అర్థించి ఆయా హోమాలను చేయడం, ఆయా మంత్రాలను జపించడం జరుగుతుంది. ఇందుకుపయోగించే మంత్రాలు అనేకం ఈ ప్రపాఠకంలో మనకు లభిస్తాయి.

పశుక్షేమం, స్వేచ్ఛామరణం, దారిద్ర్యనిర్మూలనం, కీర్త్యభిలాష, శుభప్రాప్తి, ఈశ్వరప్రసాదం, పుణ్యలాభం, వృత్తిలో విచ్ఛేదం లేకుండా ఉండడం, విషనివారణం, క్రిమినివారణం మొదలైన ఎన్నో ప్రయోజనాలను మానవులర్థిస్తారు. ఈ ఫలితాలనుద్దేశించిన మంత్రాలు ఈ ప్రపాఠకంలో

కొల్లలుగా ఉన్నాయి. ఆఱవఖండలో వాస్తుహోమాంగభూతాలైన మంత్రాలు కనిపిస్తాయి.

ఏడవఖండలోని మంత్రాలన్నీ క్రిమినాశాన్నే నిరూపిస్తున్నాయి. దీన్ని బట్టి క్రిములవల్ల కలిగే నానాదోషాలను ఆ కాలంలోనే గుర్తించారని చెప్పవచ్చు.

ఇందులో మూడోమంత్రం వక్రంగా నడిచేవి, అంత్రచారులు, రెండు తలలు గలవి, తెల్లని ఇత్యాదిగా పలురకాల క్రిములను పేర్కొంటున్నది. మంత్రభావంతో నాటి ఋషులు ఈ క్రిములను నశింపజేసినట్లు వ్యక్తమవుతున్నది.

రెండవ ప్రపాఠకంలో చివరిదైన ఎనిమిదోఖండలో సత్కార విధానం చక్కగా నిరూపించబడింది.

ఆచార్యుడు, ఋత్విక్కు, స్నాతకుడు, రాజు, వివాహం చేయదగినవాడు, అతిథి - ఈ ఆరుగురు సత్కరింపదగినవారు. వీరిని పూజించే సమయంలో వినియోగపడే మంత్రాలు ఈ ఖండలో నిర్దేశింపబడ్డాయి. పెద్దలను గౌరవించవలసిన పద్ధతిని దీనివల్ల గ్రహించవచ్చు.

ఈ విధంగా ఛాందోగ్యబ్రాహ్మణం గృహ్యకర్మల స్వరూపాన్ని చక్కగా నిరూపిస్తున్నది. వైదిక వాఙ్మయంలో పరిశోధనలు చేసేవారు ఈబ్రాహ్మణాన్ని సావధానంగా పరిశీలిస్తే నాటి ఆచార విచారాలను, గృహస్థుల జీవన పద్ధతులను ఇంకా విశదంగా తెలుసుకోవచ్చు.

- ఎస్.ఎల్.ఎన్.

## 2.7.7 వైశిష్ట్యం

మంత్రాలకు ఋషులు, దేవతలు, ఛందస్సు ముఖ్యమైనవి. అలాగే బ్రాహ్మణాలు కూడా చాలా ముఖ్యం. ఋషిదేవతాచ్ఛందో బ్రాహ్మణాలను తెలిసికోకుండా మంత్రాలను గట్టిగా వల్లించినా, సస్వరంగా పఠించినా, వాటిని ఇతరులకు బోధించినా, యాగాలను చేయించినా ప్రయోజనం శూన్యం. కాబట్టి బ్రాహ్మణాల నధ్యయనం చేయాలని తెలుస్తోంది. అలాంటి బ్రాహ్మణాలలో ఛాందోగ్య బ్రాహ్మణం చాలా విశిష్టమైంది. నాటి సామాజిక వ్యవస్థకు ఇది చక్కని ప్రతీక. నేటి సామాజికవ్యవస్థకు మంచి మార్గదర్శకం.

శ్రౌతసూత్రాలు, గృహ్యసూత్రాలు, ధర్మసూత్రాలు సంస్కృత వాఙ్మయంలో ప్రధాన స్థానాన్నలంకరించినాయి. ఈ మూడు సూత్రాలకు కలిపి కల్పసూత్రమని మహర్షులు పెట్టినపేరు. గర్భాధానం మొదలుకొని, శ్మశానాంతంవఱకు, పురుషులకు జరుగవలసిన కర్మలన్నీ ఆపస్తంబాది మహర్షులచేత ఇందులో పొందుపరచబడ్డాయి. బ్రాహ్మణాలలో ఉన్న మంత్రాలను స్వీకరించి ఉపనయనం, వివాహం మొ॥ క్రియాకలాపాన్ని గృహ్యసూత్రాలలో ఏర్పాటు చేశారు.

నాటి వివాహవ్యవస్థే ఈనాటికీ యథాతథంగా మనదేశంలో ఆచరింపబడుతున్నది. దేశాభివృద్ధికి కావలసింది సంతానాభివృద్ధి. అది స్త్రీపురుషసాధ్యం. కనుక పురుషుడు స్త్రీని స్వీకరించాలి. స్త్రీ పురుషుల సమాగమమే వివాహం. సంతానోత్పత్తి కామమూలకం. కామం సురామూలకం. కాబట్టి పెండ్లి చేసుకోబోయే కన్యకను సురతో అభిషేకించాలని ఇందులో చెప్పబడింది. ఇక్కడ ఒక విశేషాన్ని మనం గ్రహించాలి. కన్యకయొక్క ఉపస్థేంద్రియాన్ని ఆనందేంద్రియమని బ్రహ్మదేవుని రెండవముఖమని వర్ణించారు. బ్రహ్మ ఒక ముఖంతో వేదాలను చదువుతాడట. రెండవ

ముఖంతో సంతానోత్పత్తిని చేస్తాడట. ఈ ఇంద్రియంద్వారానే స్త్రీలు పురుషులను వశపరచుకొంటున్నారని, స్త్రీలు అధికారిణులుగా ప్రవర్తిస్తున్నారని, పురుషుడు స్త్రీయోనిలో రేతస్సనే ఆజ్యాన్ని (నేతిని) ఉంచుతున్నాడని దానివల్ల సంతానం కలుగుతుందని ఈ బ్రాహ్మణం వివరిస్తున్నది.

కన్యకను నూతనవస్త్రాలతో అలంకరించాలి. ఆ వస్త్రాలు స్త్రీల చేతనే నేయబడాలి. ఆ వస్త్రాలతో స్త్రీలే కన్యకనలంకరించాలి. నూతన వస్త్రధారిణియైన ఈ కన్య నూరు సంవత్సరాలు జీవించాలని, కాంతిమతియై, ధనవంతురాలై ఉండాలని వరుడు కోరతాడు.

నేటికీ సనాతనపద్ధతిలో జరిగే వివాహంలో ఈ బ్రాహ్మణంలోని మంత్రాలను మనం వింటూంటాం. 'గుండ్రాయి దాస్తే పెండ్లి ఆగదు', అనే సామెత ఒకటి సమాజంలో ప్రసిద్ధంగా ఉంది. ఇది ఈ బ్రాహ్మణంద్వారా ప్రచారంలోకి వచ్చిందేమో ననిపిస్తుంది. భర్త భార్యను గుండ్రాయిని త్రొక్కవలసిందిగా ఒక మంత్రంలో ఇలా కోరతాడు -

> ఓ సుందరీ! నీవు ఈరాయిని త్రొక్కు. ఈ రాయిలాగా స్థిరంగా ఉండు. శత్రువులను బాధించు.

పెండ్లి అంటూనే నేడు గుండ్రాయిని కడిగి, పసుపు రాచి జాగ్రత్త చేస్తారు. గుండ్రాయిని గూర్చి చెప్పే మంత్రం-మనకీ బ్రాహ్మణంలో కనబడుతుంది. కన్యక తన జ్ఞాతివర్గం వృద్ధిపొందాలని తన భర్త దీర్ఘాయుష్మంతుడు కావాలని, పేలాలతో హోమం (లాజహోమం) చేస్తూ కోరుకొంటుంది.

సప్తపది అని పెండ్లిలో మన పెద్దలొకతంతు నడుపుతూంటారు. అది చూడముచ్చటగా ఉంటుంది. పెండ్లి చేసుకొంటున్న వధూవరుల విద్దరిని

ఏడడుగులు నడిపిస్తారు. దీన్నే సప్తపది అంటారు. ఇలా చేయుటంవల్ల వధూవరులకు అన్యోన్యానురాగం కలుగుతుందని పెద్దలతలంపు. త్రివిక్రమ స్వామియైన విష్ణువు బలిచక్రవర్తియొక్క దర్పదమనం జేయుగోరి మూడడుగులతో ముల్లోకాలనాక్రమించాడు. కాబట్టి ఆయన్ను ప్రార్థించి, ఈ వధూవరులను ఏడడుగులు నడిపిస్తారు.

విష్ణువు నిన్ను అన్నసమృద్ధికోసం మొదటి అడుగు,
బలంకోసం రెండవ అడుగు,
యజ్ఞంకోసం మూడవ అడుగు,
సౌఖ్యప్రాప్తి కోసం నాల్గవ అడుగు,
పశుసంపద కోసం ఐదవ అడుగు,
గవాదిధనవృష్టికోసం ఆరవ అడుగు,
సప్తహోమసాధ్య సోమయాగంకోసం ఏడవ అడుగు

నడిపించు గాక! అని వరుడు ఏడు వాక్యాలు చెబుతూ వధువును ఏడడుగులు నడిపిస్తాడు. ఇదీ సప్తపది[1].

అప్పుడే పెండ్లైన కన్యతో సప్తపది చేయించిన భర్త, ఆమె సఖ్యాన్ని కోరుతూ, నీలాగా సుఖకారిణులైన ఇతర స్త్రీ లెవరూ నాతో సఖ్యాన్ని పొందకుందురుగాక! అనికూడా చెబుతాడు.

వివాహంలో పాణిగ్రహణం చాలాముఖ్యం. ఒక మంత్రంలో వీరులు దీర్ఘాయుష్మంతులైన పుత్రులను కని, పశుసంపదను సుఖపరంపరను పొందుమని

---

1. ఏక మిషే విష్ణు స్త్వా నయతు. ద్వే ఊర్జే విష్ణు స్త్వా నయతు.
త్రీణి వ్రతాయ విష్ణు స్త్వా నయతు చత్వారి మాయో భవాయ విష్ణు స్త్వా నయతు.
పంచ పశుభ్యో విష్ణు స్త్వా నయతు. షడ్ రాయ స్పోషాయ విష్ణు స్త్వా నయతు.
సప్త సప్తభ్యో హోత్రాభ్యో విష్ణు స్త్వా నయతు. 1.2.6-12

కన్యకను గురించి ఆశీస్సొకటి వినబడుతున్నది. అత్తమామల మీద, ఆడబడుచులమీద, మరుదులమీద కూడ అధికారం వధువుకీయబడింది. ఇలాంటి అధికారాలను పొందిన గృహిణి భర్తృగృహానికి సర్వాధికారిణియై ప్రసన్నురాలై బంధువులకానందాన్ని కలిగిస్తూ, తనకు ఆనందాన్ని కలిగించాలని భర్త పలికే పలుకులు భారతీయ జీవనవిధానానికే మణిదీపాలు.

గృహాధిదేవతైన గృహిణికి గర్భం కలగాలని, అగ్ని, ఇంద్రుడు, బృహస్పతిలాగా పురుషుడే పుట్టాలని, స్త్రీ సంతానం కలుగకూడదనీ, ఒకఖండలో కోరబడింది. గర్భవతియైన స్త్రీకి సౌభాగ్యంకోసం సీమంతోన్నయనం చేసే ఆచారం ఇప్పటికీ కనబడుతున్నది. పుట్టిన బిడ్డకు నామకరణం, అన్నప్రాశనం మొ॥ కర్మలను తెలియజేసే మంత్రాలిందులో ఉన్నాయి. మిత్రావరుణులు, అగ్ని, అశ్వినీదేవతలు పుట్టిన మగబిడ్డకు మేధాశక్తిని కలిగించాలనే ఆశీర్వచనం కూడా ఉంది. ఒక మంత్రంలో పుట్టిన బిడ్డకు ఆయుష్యాభివృద్ధి కోరబడింది.

ఉపనయనవ్రత మంత్రాలిందులో చాలా ఉన్నాయి. బిడ్డకు ఉపనయన వ్రతాన్ని ఆచరింపగోరిన తండ్రి, అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు ఇంద్రుడు అనే దేవతలతో వ్రతాన్ని చేస్తున్నానే మంత్రమొకటి ఈ బ్రాహ్మణంలో కనబడుతుంది. ఉపనయనవ్రతంలో ముఖ్యమైన మంత్రం గాయత్రీమంత్రం. ఈ మంత్రానికి సవిత దేవత కనుక, సావిత్రి అని కూడ పిలుబడుతోంది. ఈ మంత్రం భారతదేశంలో నేటికీ మూడుకాలాలలో నియమనిష్ఠాగరిష్ఠులైన వారిచేత 27 సార్లుగాని, 108 సార్లుగానీ, 1000 సార్లుగానీ జపింపబడుతోంది. ఆ మంత్రమిది -

తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి,
ధియో యో నః ప్రచోదయాత్.

దాని అర్థం-సవితుః దేవస్య=దానాదిగుణయుక్తుడైన సూర్యునియొక్క వరేణ్యం=శ్రేష్ఠమైన, భర్గః=సేవింపదగిన, యత్తేజః=ఏ తేజస్సు, అస్తి=ఉన్నదో, తత్=ఆ తేజస్సును, ధీమహి=ధ్యానిస్తున్నాం. యః=ఏ సవిత (సూర్యుడు), నః=మా యొక్క, ధియః=బుద్ధులను (స్నాన, దాన, అధ్యయన హోమాది కర్మలలో) ప్రచోదయాత్=ప్రవర్తింపజేయుచున్నాడో.

సూర్యుడుదయించగానే ప్రజలు తమ తమ కర్తవ్యాలలో నిమగ్నమవుతున్నారు. అస్తమించగానే తమ తమ పనులనుంచి విరమిస్తున్నారు. ఈ మంత్రం మహామహిమాన్వితమని వేరే చెప్పనవసరం లేదు. కోట్లకొలది భారతీయుల హృదయాలలో నేటికీ ఇది ప్రకాశిస్తోంది.

ఉపనయనానంతరం స్నాతకునికి కావలసిన మంత్రాలు కొన్ని ఈ బ్రాహ్మణంలో చెప్పబడ్డాయి.

ద్వితీయ ప్రపాఠకంలోని ఎనిమిది ఖండలలోను గృహస్థు ఆచరించాల్సిన నిత్యవిధిలోని ముఖ్యమంత్రాలు చెప్పబడ్డాయి. 'ఓ సర్పాల్లారా! మీకు పూజాద్రవ్యాన్ని (బలిని) సమర్పిస్తున్నాము. నమస్కరిస్తున్నాము. సప్తర్షులతో మీరు చేసికొన్న అభిసంధిని (షరతును) మరచిపోకండి. మమ్మల్ని హింసించకండి'. ఇలాంటి సర్పప్రార్థనా మంత్రాలు కొన్ని ఇందులో కనబడుతున్నాయి. రుద్రుణ్ణి గురించి చేసే ప్రార్థనలో - "మా బిడ్డలను, పశువులను, ఆయుష్యాన్ని హింసించకు. ఎప్పుడూ నీ పూజచేస్తాం" అనే యజమాని కోరిక వినబడుతోంది. ఇంద్రుణ్ణి గురించి చేసే ప్రార్థనలో - "వజ్రం మొ॥ నూరు ఆయుధాలు గలవాడు, మహాబలసంపన్నుడు, పరిపాలనాదక్షుడైన ఇంద్రుడు నూరుసంవత్సరాలు మమ్మల్ని రక్షించాలి" అని కోరబడుతోంది. కాలం సర్వాధారం. సంవత్సరం కాలస్వరూపం కాబట్టి సంవత్సరంలోని ఆరుఋతువులు తమను రక్షించాలనే కోరిక ఒక మంత్రంలో ఆవిష్కరింపబడింది.

ఆగ్రహాయణి అనే యజ్ఞం ధేనువుగా వర్ణింపబడింది. 'ఈ ధేనువు మొదట్లో యమునిదగ్గర నివసించి, ఆయనకు హవిర్ద్రవ్యాన్ని చేకూర్చింది. ఆ ఆగ్రహాయణి అనే ధేనువు ఇష్టఫలదాయినియై, మాకు కూడా ప్రతిసంవత్సరం పుత్రులు, పశువులు, అన్నం, గ్రామం మొ॥ కోరికలను తీర్చుగాక!' అనేది చక్కని మంత్రం. పితరులు దేవతలుగా ఉండే కర్మ అష్టక. ఆ అష్టకయొక్క ఘనతను తెలియజేసే మంత్రాలిందులో ఉన్నాయి. సోమపానంచేసే పితరులారా! గంభీరాలై పూర్వపురుషులు వచ్చిన గంభీరమైన మార్గాలలో మీరిక్కడకు విచ్చేసి సిరిసంపదలను సకలశుభాలను మాకిచ్చి దయచేయండి. అష్టక వ్రతాన్ని ఒక్కసారి ఆచరించగా, అదితికి మహామహిమాన్వితుడైన ఇంద్రుడు కలిగాడు. అతడు తన అద్భుతకర్మలతో అసురులను హింసించినాడనే మంత్రం, ఆ వ్రతంలోని ఘనతను వెల్లడిస్తోంది.

ఇంద్రాగ్ని యమవరుణాదిత్యులనే దేవతలను గురించి చెప్పబడిన మంత్రాలలో ఆదిత్యుణ్ణి గురించి చేసిన స్తుతులు అధికంగా కనబడుతున్నాయి. ఒక మంత్రాన్ని చూడండి -

> ముల్లోకాలకు ప్రభువైన ఓ ఆదిత్యుడా! మహాత్మ్యగుణ సంయుక్తుడా! పళ్ళతోనిండిన చెట్లు పళ్ళను పంచిపెట్టినట్లు, మాకు కావలసిన కోరికలను నీవు పంచిపెట్టు.
>
> యజ్ఞం సత్యంలో ప్రతిష్ఠింపబడింది. భూతం, భవిష్యత్తు అనే కాలాలు కూడా సత్యంలో ప్రతిష్ఠింపబడ్డాయి. సత్యమంటే ఆదిత్యుడు. ఆకాశంలో ఉన్న ఆదిత్య డాకాశస్వరూపుడు. అలాంటి ఆకాశం నాకు అన్నాన్ని, ఐశ్వర్యాన్ని కలిగింవాలి.
>
> ఓ ఆదిత్యుడా! నీవు ధనాగారంలాగా ధనంతో నిండివున్నావు. ప్రసన్నుడవై నీవు నీ భక్తుల కోరికలన్నింటిని తీర్చు.
>
> అన్నింటికంటే ఆకాశం గొప్పది. నీవు ఆకాశానికి ఆకాశానివి. అంటే నీ కాంతితో ఆకాశాన్ని కూడ ప్రకాశింపజేస్తున్నావు. ఈ విషయాన్ని నేను తెలిసికొన్నాను. కాబట్టి చతుర్వేదాలకు ప్రభువైన ఓ ఆదిత్యుడా! నాకన్ని భోగాలను కలిగించు.

ఇలా ఆదిత్యస్తుతులు ఈబ్రాహ్మణంలో చాలా ఉన్నాయి.

గోవధనిషేధమిందులో చక్కగా చెప్పబడింది.

> ఈ గోవు రుద్రులకు తల్లి. వసువులకు కూతురు. ఆదిత్యులకు చెల్లెలు. అమృతానికి (దుగ్ధదధిఘృతాదులకు) నాభి (ఉత్పత్తి కారణం). ఇలా ఏ పాపమెరుగని గోవును వధించకండి.

ఛాందోగ్యబ్రాహ్మణంలో కొన్ని ముఖ్యమంత్రాలు సంగ్రహింపబడ్డాయి. వీటివల్ల నాటి వివాహ పద్ధతి, ఉపనయనపద్ధతి, గృహస్థుని నిత్యకర్మానుష్ఠాన పద్ధతి - మనం తేలికగా తెలుసుకోగలుగుతున్నాం. కనుక ఛాందోగ్యబ్రాహ్మణం నాటి సామాజికవ్యవస్థకు ప్రతిబింబమనటం సమంజసం.

- టి.ఎస్.

2.7.8 సంగ్రహసమీక్ష

ఛాందోగ్యబ్రాహ్మణం సామవేదానికి సంబంధించింది. వివాహ గర్భాధానాది గృహవిషయకమంత్రాలను ఈ బ్రాహ్మణం వివరిస్తోంది. ఇందులో రెండు ప్రపాఠకాలున్నాయి. మొదటి ప్రపాఠకంలో ఎనిమిది ఖండలు, రెండవ ప్రపాఠకంలో ఎనిమిది ఖండలు ఉన్నాయి.

## మొదటి ప్రపాఠకం

1. యజుర్వేదశాఖలో అతిప్రసిద్ధమైన 'అదితే అనుమన్యస్వ' 'అనుమతే అనుమన్యస్వ' 'సరస్వత్యనుమన్యస్వ' మొ॥ మంత్రాలతో ఈ బ్రాహ్మణం ప్రారంభంకావడం ఒక విశేషం. సవితృప్రార్థన తరువాత వివాహానికి ముందుచేసే అభ్యంగనస్నానానికి సంబంధించిన మంత్రాలు వివరింపబడ్డాయి. వివాహ ప్రక్రియలో వరుని వీర్యం ఘృతం. వధువుయొక్క యోనిభాగం అగ్ని. ఘృతాన్ని అగ్నిదేవుడు భరించినట్లు వధువు వరుని వీర్యాన్ని భరించాలి. నూతన వస్త్ర ధారణం దీర్ఘాయువును కలిగిస్తుంది. వధూవరులు నూరు సంవత్సరాలు కలిసి జీవించాలి. వరుడు వధువు జీవనమార్గాన్ని తీర్చిదిద్దుతాడు. అగ్నిదేవుని అనుగ్రహంవల్ల ఆ దంపతులకు సంతతికి మృత్యుపాశపీడ ఉండదు. వారి సంతానాన్ని విశ్వేదేవులు, అశ్వినీదేవతలు, బృహస్పతి కాపాడుతుంటారు. స్త్రీ స్వగృహంలో దుఃఖించటం అరిష్టం. ఎప్పుడూ సంతోషంతో గృహిణి జీవించాలని ఈ బ్రాహ్మణం నొక్కి చెబుతున్నది.

2. లోకప్రసిద్ధమైన సప్తపదిమంత్రాలు ఈ ఖండలో వివరింపబడ్డాయి. వరుడు వధువుతో నీవు నాకు ఇష్టసఖివి. నేను నీకు ఇష్టసఖుణ్ణి. నేను నిన్ను విడువను. నీవు నన్ను విడువకు. విశ్వేదేవులు మనల్ని కలిసి ఉండేటట్లు అనుగ్రహిస్తారు' అంటాడు. తన అత్తవారింట్లో ఉండేవాళ్ళపైన వధువు ఎంతో

అనురాగంతో ఉండాలి. మనస్సులోను, మాటలోను, పనిలోను, వధూవరు లొక్కటేనని ఇందులో చెప్పబడింది.

3. భర్త భార్యకు చేయవలసిన ఉపచారాలను ఈ ఖండ వివరిస్తున్నది. భార్యకెలాంటి అనారోగ్యాన్ని కలుగనీయునని భర్త బాసచేస్తాడు. భూమ్యాకాశాలు, హిమవంతుడు మొ॥ పర్వతాలు ఎంతకాలముంటాయో అంతకాలం ఈ దాంపత్యం చల్లగా ఉండాలనే ఆశంస ఇందులో కనబడుతుంది. అన్నమనే పాశంతో భర్త భార్యను బంధిస్తాడు. శరీరాలు వేరైనా వారిద్దరి హృదయాలు ఒక్కటేనని ఈ బ్రాహ్మణం విశదపరుస్తున్నది.

4-5. ఈ రెండు ఖండలలో వివాహానంతరం చేయదగిన మూడు నిద్రలముచ్చట్లు, గర్భాధానం, సీమంతం, సోష్యంతి హోమం, జాతకర్మానంతర చంద్రదర్శనం, నామకరణం, తండ్రి పసివాడైన తన పుత్రుని మూర్ధాఘ్రాణం చేయుటానికి సంబంధించిన మంత్రాలిందులో ఉన్నాయి.

6. ఇందులో చూడాకరణం, ఉపనయనం, బ్రహ్మచర్య ధర్మాలు, గాయత్రీమంత్రోపదేశం, దానివివరణ, గురువు నిర్వహించాల్సిన విధి, శిష్యుడైన వటువు ప్రవర్తించాల్సిన తీరు, గాయత్రీ జపవిధానం మొ॥ విషయాలిందులో పేర్కొనబడ్డాయి.

7. ఈ ఖండలో చౌలం, ఉపనయనం, స్నానమంత్రాలు, ఆదిత్యస్తుతి, లక్ష్మీమంత్రం, శిరోమాలాధారణం, పాదుకాధారణం, సద్వాక్ ప్రదానానికి నాలుకను ప్రార్థించే మంత్రం, ఆచార్యపరిషత్ ప్రార్థనం, రథారోహణమంత్రాలు చెప్పబడ్డాయి.

8. ఆనాటివారి ప్రధానసంపదయైన గోస్తుతి, గో ప్రాముఖ్యం, వాటి చిరజీవిత్వం, గోవత్సరక్షణ విషయంలో ఆదిత్యదేవతలలో ఒకటైన

పూషాప్రార్థనం, గోపోషణం, గోపత్నమిథునాలకు చిహ్నాలు విధించటం, గోబందనాది మంత్రాలను ఈ ఖండ తెలియజేస్తున్నది.

## రెండో ప్రపాఠకం

1. శ్రావణపౌర్ణమినాటి నాగబల్యుత్సవం, భూస్పర్శనం, రుద్రునికి సంబంధించిన హోమమంత్రాలు, ఇంద్రాగ్నులకు సంబంధించిన హవిర్మంత్రాలు, సర్వరోగనివారకమంత్రాలు, ఆజ్యహోమం, యవభక్షణాది విషయాలు పేర్కొనబడ్డాయి.

2. పాయసహోమం, వివిధ జపమంత్రాలు, అందరికి సుఖాన్ని కలిగించే భూదేవతా మంత్రాలు, స్థాలీపాకం, అష్టకామంత్రాలు, గోవధ, పశ్వంగహోమం, యజ్ఞకర్తకు సుఖాన్ని కలిగించే సూక్తాలు ఇందులో ఉన్నాయి.

3. ఈ ఖండలో మాంసాహుతి మంత్రాలు, పితృకర్మ, ఆవాహనం, పిండ ప్రదానం, స్వీకారం, అగ్నిస్తుతి, వపాహోమం, ఋణవిమోచనహోమం, ఇంద్రాణిమంత్రాలు చెప్పబడ్డాయి.

4. భూమిగ్రహణమంత్రం, అన్ని హోమాలలో ఇధ్మాధానం తరువాత చేసే జపమంత్రం, రుద్రుణ్ణి స్తుతించే దర్భజాటికామంత్రం, పశుక్షేమం, భోగకాముకత్వం, అక్షతతండులహోమం, క్షుద్రపశుస్వస్త్యయన మహార్ఘ ద్రవ్యసంపాదనాలు, ఆదిత్యోపాసనం, స్వేచ్ఛా మరణం, తమ తమ కోరికలను సంపాదించడం మొ॥ వాటికి సంబంధించిన మంత్రాలను ఈ ఖండ వివరిస్తున్నది.

5. శరీరాన్ని ఆశ్రయించిన దుష్టగ్రహాలను ఉచ్చాటన చేయడం, సుఖప్రయాణమంత్రం, ధనార్జనమంత్రం, యశఃప్రాప్తి, ధనాభివృద్ధి మొ॥ వాటికి సంబంధించిన మంత్రాలను ఈ ఖండ వివరిస్తున్నది.

6. ఇందులో నూతనగృహప్రవేశం. రాక. సినీవాలికి సంబంధించిన సుఖకామ మంత్రాలు, వాస్తుహోమ మంత్రాలు, వశీకరణ, విశ్వకర్మ దేవతాపూజన, అన్నదమంత్రాలు ప్రాధాన్యతను వహించాయి. విషనివారక మంత్రాలను కూడ ఈ ఖండ పేర్కొంటున్నది.

7. ఈ ఖండలో భక్ష్యభోజ్యాదులలో క్రిమిదోషనివారక మంత్రాలు ఉన్నాయి.

8. ఈ బ్రాహ్మణభాగంలో ధేనుబంధనం, మధుపర్కగ్రహణం, ప్రాశనం, పాదప్రక్షాళనం, కుడి ఎడమపాదాలను ప్రక్షాళనచేసుకొనే మంత్రాలు, అర్ఘ్య-ఆచమనీయ మంత్రాలు ముఖ్యమైనవి.

ఈ బ్రాహ్మణం సామవేదానికి సంబంధించిందైనా చాలా సూక్తాలు యజుర్వేదంనుంచి గ్రహింపబడటంచేత నిత్యకర్మనిరతులైన వారికి ఎంతో ఉపయోగపడతాయి.

- కె.వి.ఆర్.

# ఉపబ్రాహ్మణాలు

సామవిధానబ్రాహ్మణం - దేవతాధ్యాయబ్రాహ్మణం

సంహితోపనిషద్బ్రాహ్మణం - వంశబ్రాహ్మణం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 2. విశేషవిభాగం

## 2.8 ఉపబ్రాహ్మణాలు

### 2.8.1 పరిచయం

సామవేదానికిగల బ్రాహ్మణాలలో యజ్ఞయాగాలను వర్ణించే ప్రధానమైన బ్రాహ్మణాలు తలవకార-తాండ్యబ్రాహ్మణాలు. ఛాందోగ్య బ్రాహ్మణం యజ్ఞయాగాదులను వివరించకపోయినా జీవితంలో ముఖ్యమైన వివాహాది సంస్కారాలను అభివర్ణిస్తూ ముఖ్యస్థానాన్ని ఆక్రమించింది. ఇక మిగిలిన నాలుగు బ్రాహ్మణాలు పేరుకు బ్రాహ్మణాలైనా అందులో చెప్పబడ్డ విషయాలు యజ్ఞయాగాది సంబంధం కలవి కావు. కాబట్టి వాటిని ఉపబ్రాహ్మణాలని వ్యవహరించడం బాగుంటుంది. ఇవి 1. సామవిధాన బ్రాహ్మణం 2. దేవతాధ్యాయ బ్రాహ్మణం 3. సంహితోపనిషద్బ్రాహ్మణం 4.వంశబ్రాహ్మణం. వీటికి సంబంధించిన విశేషాలను చాలా సంగ్రహంగా ఇక్కడ తెలుసుకుందాం.

### 2.8.1.1 సామవిధానబ్రాహ్మణం

మానవుడు పరలోకంలో మరోజన్మలో శాశ్వతసుఖాన్ననుభవించడానికి తప్పకుండా కృషిచేయాలి. అది అన్ని మతాలకు ధర్మాలకు సంప్రదాయాలకు ముఖ్యలక్ష్యం. కాని అంతమాత్రంచేత ఈ లోకంలో ఈ జీవితంలో తీరని దుఃఖాల ననుభవించాల్సిన పనిలేదు; మరి ఈ జీవితంలో కోరికలను పండించుకోడానికి వైదికవాఙ్మయం ఏవైనా మార్గాలను చెబుతుందా? తప్పకుండా చెబుతుంది. అవి చాలావరకు ధర్మాన్నతిక్రమించకుండా ఉంటాయి. ఇలా ఇష్టసిద్ధిని సంపాదించుకోవడానికి వైదికసాహిత్యంలో ఎన్నో మార్గాలున్నాయి. అందులో సామలను గానం చేయడంద్వారా తమ తమ కోరికలను సిద్ధింపజేసుకోవచ్చునని ఈ బ్రాహ్మణం తెలియజేస్తుంది.

ఆయా కోరికలు సిద్ధించడానికి ఇది సామలను విధిస్తున్నది. కాబట్టి దీనికి సామవిధాన బ్రాహ్మణమనే పేరు సార్థకమైంది.

### 2.8.1.2 దేవతాధ్యాయబ్రాహ్మణం

సామలు ఎన్నో ఉన్నాయి. సామగానానికి దేవతలు కూడా ఎందరో ఉన్నారు. ఏయే సామలకు ఎవరెవరు అధిదేవతలో ఈ బ్రాహ్మణం చక్కగా నిరూపిస్తున్నది. అందుకే దీన్ని "దైవత బ్రాహ్మణం" అని కూడా అంటారు. 'అగ్నిబ్రాహ్మణమ'ని కూడా దీన్ని కొందరు పిలుస్తారు.

గానంచివర వినిపించే ధ్వనినిబట్టి సామలను కనిపెట్టి ఆయా సామలకు దేవతలను ఈ బ్రాహ్మణం వివరిస్తున్నది. అలాగే అనేక రకాలైన ఛందస్సులకు రంగులు, దేవతలుకూడా ఇందులో పేర్కొనబడ్డారు. మొత్తంమీద ప్రతీకోపాసనకు సంబంధించిన బీజాలు అనాటికే ఉన్నట్లు ఈ బ్రాహ్మణంలోని విషయాలవల్ల తెలుస్తున్నది.

### 2.8.1.3 సంహితోపనిషద్బ్రాహ్మణం

మంత్రసముదాయానికి సంహిత అనే పేరున్నది. కాని ఇక్కడ 'సంహిత' అంటే గానమని అర్థం. సామవేదంలో ఋక్కులే గానం చేయబడి సామలని పిలువబడ్డాయి. 'ఉపనిషత్తు' అంటే రహస్యమని అర్థం. సామగానంలో ఉండే విశేషాలను, రహస్యాలను తేటతెల్లం చేసేది కాబట్టి ఈ బ్రాహ్మణానికి సంహితోపనిషద్బ్రాహ్మణమని వ్యవహారం ఏర్పడింది.

### 2.8.1.4 వంశబ్రాహ్మణం

భారతీయవిద్య గురుపరంపరగా వస్తున్నది. వేదాధ్యయనం గురుశిష్య పరంపరద్వారా రావలసిందే గాని ఇంకే ఇతర మార్గాలలోను వచ్చేది కాదు. అలాంటి వేదాల్లో సామవేదాధ్యయనం చేసి ఆయా సామలను గానం చేయుగలగడం కేవలం గురువు అనుగ్రహంవల్లనే కలగాలి. అలా ఆ వేదం ఈ నాటికీ పరంపరగా మనదాకా వచ్చింది. ఈ పరంపరను కాపాడిన మహర్షుల, మహామహుల వంశక్రమం ఈ బ్రాహ్మణంలో గుర్తింపబడింది. అందుకే ఇది వంశబ్రాహ్మణం అయింది.

- ఎస్.బి.ఆర్.

### 2.8.2 విభాగం

#### 2.8.2.1 సామవిధానబ్రాహ్మణం

ఈ బ్రాహ్మణంలో మూడు ప్రపాఠకాలున్నాయి. మొదటి ప్రపాఠకంలో ఎనిమిది అనువాకాలు, రెండవ ప్రపాఠకంలో ఎనిమిది అనువాకాలు, మూడో ప్రపాఠకంలో తొమ్మిది అనువాకాలు ఉన్నాయి. మూలంలో ఈ అనువాకాలకే ఖండలనే వ్యవహారం ఉంది.

విషయవిభాగం :

ఈ బ్రాహ్మణంలో బ్రహ్మనుంచి ప్రజాపతి పుట్టడం, ఆయన లోకాలను సృష్టించడం, కృచ్ఛ్రాలస్వరూపం, దర్శపూర్ణమాసాదులు, ప్రాయశ్చిత్తాలు, అనేక కామ్యసిద్ధులు, రాజ్యాభిషేకం మొ॥ విషయాలు చక్కగా నిరూపింపబడినాయి.

మొదలు - చివరః

ఈ బ్రాహ్మణం "బ్రహ్మ హవా ఇదమగ్ర ఆసీత్" అనే మంత్రంతో ప్రారంభమై "ఉపాధ్యాయాయ గ్రామవరగ్ం" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

#### 2.8.2.2 దేవతాధ్యాయబ్రాహ్మణం

ఈ బ్రాహ్మణంలో మూడు ఖండలున్నాయి. మొదటి ఖండలో 26, రెండో ఖండలో 11, మూడో ఖండలో 25 ఖండికలున్నాయి. ప్రొ. గుణే ఈ మూడో ఖండ అంతా నిరుక్తానికి అనుకరణే గాని ఈ బ్రాహ్మణానికి సంబంధించిన విషయం లేదన్నాడు. మూడో ఖండలో 24 ఖండికలే ఉన్నాయని, 25వ ఖండికను నాల్గో ఖండగా విభాగం చేస్తారు కొందరు.

విషయవిభాగం:

ఈ బ్రాహ్మణంలో సామలకు విధనభేదంవల్ల దేవతాభేదాన్ని అంగీకరించారు. విధనం అంటే సామలో చివరిభాగం. ఆగ్నేయ, ఐంద్ర, ప్రాజాపత్యాది సామలు, వాటి దేవతలు, వేదార్థపరిజ్ఞానానికి ప్రశంస, గాయత్ర్యాది ఛందస్సుల వర్ణాలు, ఛందోనిర్వచనాలు, సావిత్ర్యుపాసన మొ॥ విషయాలు వివరింపబడ్డాయి.

మొదలు-చివర:

ఈ బ్రాహ్మణం "అగ్నిరింద్రః ప్రజాపతిః సోమః" అనే మంత్రంతో ప్రారంభమై "బ్రహ్మ సత్యం చ పాతు మామ్" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

2.8.2.3 సంహితోపనిషద్బ్రాహ్మణం

ఈ బ్రాహ్మణంలో ఒకే ఒక ప్రపాఠకం ఉంది. దాంట్లో 5 ఖండలున్నాయి.

విషయవిభాగం:

దేవ-అసుర-ఋషిసంహితల లక్షణం, దేవహూ-వాక్యహూ అమిత్రహూ సంహితల లక్షణం, గానవిధిలోని విశేషాలు, విద్యాదానపద్ధతి, గురుప్రశంస, దానప్రశంస, బ్రహ్మచర్యప్రశంస మొ॥ విషయాలు ఇందులో విశదీకరింపబడ్డాయి.

మొదలు-చివర:

ఈ బ్రాహ్మణం "అథాతః సంహితోపనిషదో వ్యాఖ్యాస్యామః" అనే మంత్రంతో ప్రారంభమై "చతు బ్రుచో భవతి య ఏవం వేద, య ఏవం వేద" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

### 2.8.2.4 వంశబ్రాహ్మణం

ఈ బ్రాహ్మణం చాలా చిన్నది. ఇందులో మూడు ఖండలు మాత్రమే ఉన్నాయి.

**విషయవిభాగం:**

సామవేదానికి సంబంధించిన మహర్షుల వంశపరంపర ఇందులో చక్కగా వర్ణింపబడింది.

**మొదలు - చివర:**

ఈ బ్రాహ్మణం "నమో బ్రహ్మణే నమో బ్రాహ్మణేభ్యః" అనే మంత్రంతో మొదలై "సమానం పరం సమానం పరమ్" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

**- ఎస్.బి.ఆర్.**

## 2.8.3 సంకలనకాలం

సామవేదానికి సంబంధించిన ప్రధానబ్రాహ్మణాలు తాండ్యబ్రాహ్మణం, తలవకారబ్రాహ్మణం. మిగతావన్నీ ఈ రెంటికి అనుబంధాలవంటివే గాని స్వతంత్రప్రతిపత్తి కలవికావు. సామవిధానం, దేవతాధ్యాయం, సంహితోపనిషత్, వంశం అనే ఈ నాలుగు ఉపబ్రాహ్మణాల్లోను యజ్ఞయాగాలకు సంబంధించిన ప్రస్తావన లేదని ఇంతకు పూర్వమే చెప్పాను. ఇవి తరువాత కాలాల్లో ప్రత్యేక ప్రయోజనాల నభిలషించి సంకలనం చేయబడ్డాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

ఈ నాలుగు ఉపబ్రాహ్మణాలు సామవేదానికి, యజ్ఞయాగాలకు ఆశ్రయమైన కురుక్షేత్రానికి తూర్పు భాగంలో బ్రాహ్మణకాలం చివఱ క్రీ.పూ. 5వ శతాబ్దంలో ఏర్పడి ఉంటాయని చెప్పడానికి అవకాశాలు కనబడుతున్నాయి.

- ఎస్.బి.ఆర్.

### 2.8.4 వ్యాఖ్యానాలు - ప్రచురణలు

#### 2.8.4.1 సామవిధానబ్రాహ్మణం

వ్యాఖ్యానాలు :

సామవిధానబ్రాహ్మణానికి రెండు భాష్యాలు దొరుకుతున్నాయి. అందులో ఒకటి 'వేదార్థప్రకాశ' మనే సాయణభాష్యం. రెండోది "పదార్థమాత్రవివృతి" అనే భరతస్వామిభాష్యం. ఈ రెండు సమగ్రమైనవి. సాయణభాష్యం కొంచెం విపులంగా ఉంటుంది. భరతస్వామి వ్రాసిన 'పదార్థమాత్రవివృతి' పేరుకు తగినట్లే సంగ్రహంగా ఉంటుంది.

భరతస్వామి సామసంహితకు గూడ భాష్యం వ్రాశాడు. హోసలరాజైన రామనాథుడు రాజ్యంచేస్తున్న రోజుల్లో (క్రీ.శ.1300) శ్రీరంగంలో సామసంహితకు భాష్యం వ్రాసినట్లు దాని ఉపోద్ఘాతంలో భరతస్వామి పేర్కొన్నాడు. ఆ తరువాత ఈ బ్రాహ్మణానికి భాష్యం వ్రాసి ఉండవచ్చు. ఇతను ఇతర బ్రాహ్మణాలకు కూడ భాష్యాలు వ్రాసినట్లు తెలుస్తున్నది.

ప్రచురణలు :

ఈ బ్రాహ్మణాన్ని మొట్టమొదట 1873 లో లండన్‌లో ఏ.సి. బర్నెల్ (A.C. Burnell) రోమన్‌లిపిలో ప్రచురించాడు. ఈ ప్రచురణలో సాయణభాష్యం కూడా ఉంది. కాని ఇది అంతగా మంచి సంస్కరణం కాదు. తరువాత కలకత్తాలో సత్యవ్రతసామశ్రమి 1895 లో దేవనాగరిలిపిలో సాయణభాష్యంతో ప్రచురించాడు. ఈ ప్రచురణకూడా విమర్శాత్మక సంస్కరణం (Critical edition) కాదు. ఆపైన చాలా కాలానికి 1964లో తిరుపతి, కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం ప్రథమకుసుమంగా ప్రొ॥ బి.ఆర్.శర్మ

(Prof. B.R.Sharma) సాయణభాష్యంతో, భరతస్వామి భాష్యంతోను విలక్షణమైన విమర్శాత్మక సంస్కరణంగా దీన్ని ప్రచురించారు. ఇప్పుడున్న వాటిల్లో ఈ బ్రాహ్మణానికి ఇదే ప్రామాణిక ప్రచురణ.

### 2.8.4.2 దేవతాధ్యాయబ్రాహ్మణం

**వ్యాఖ్యానాలు :**

దేవతాధ్యాయబ్రాహ్మణానికి వ్యాఖ్యానాపేక్ష లేదు. కాని దీనికి సాయణుని పేర ఒక భాష్యం చెలామణిలో ఉంది. ఇది సాయణుని రచన కాదని; ఎవరో వ్రాసి సాయణుని పేరు పెట్టి ఉంటారని ప్రొ॥ బి.ఆర్.శర్మ తన ఉపోద్ఘాతంలో నిరూపించారు. సత్యవ్రతసామశ్రమి ఈ బ్రాహ్మణానికి అక్కడక్కడా వ్రాసిన టిప్పణిలో కూడా ఇందులో చివరి భాగాన్ని సాయణుడు వ్రాయలేదన్నట్లే సూచించాడు. ఇవన్నీ ఎలా ఉన్నా ఈ భాష్యం సాయణ భాష్యం అనే ప్రసిద్ధిని పొందింది.

**ప్రచురణలు :**

దేవతాధ్యాయబ్రాహ్మణాన్ని 1849లో సత్యవ్రత సామశ్రమి కలకత్తా నుంచి ద్వితీయ ముద్రణగా ప్రచురించాడు. దానికి ఆయన అక్కడక్కడ టిప్పణి కూడా వ్రాశాడు. తరువాత 1881లో కలకత్తా నుంచే జీవానన్ద విద్యాసాగరభట్టాచార్య ఈ బ్రాహ్మణాన్ని మళ్లా ముద్రించాడు. 1959లో మద్రాసు నుంచి ఎం.రామనాథదీక్షితర్ దీన్ని ప్రకటించాడు. ఆ తరువాత 1965లో తిరుపతి కేంద్రీయ సంస్కృత విద్యాపీఠంనుంచి ప్రొ॥ బి.ఆర్.శర్మ ముద్రితాముద్రిత ప్రతులన్నింటిని పరిశోధించి విమర్శాత్మక సంస్కరణాన్ని ఈ బ్రాహ్మణానికి రూపొందించి ప్రకటించారు. ఈ బ్రాహ్మణానికి గల ప్రచురణలన్నింటిలోను ఇది చాలా విశిష్టమైంది.

**2.8.4.3 సంహితోపనిషద్బ్రాహ్మణం**

**వ్యాఖ్యానాలు :**

సంహితోపనిషద్బ్రాహ్మణంలో ప్రథమ ఖండవఱకు సాయణభాష్యం దొరుకుతున్నది. మిగతా భాగానికి సాయణుడు భాష్యమే వ్రాయలేదో, వ్రాసినా అది దొరకటంలేదో స్పష్టంగా తెలియదు. దొరుకుతున్నంతవఱకు సాయణుడే ఈ భాష్యాన్ని వ్రాశాడనటానికి ఏమీ నిదర్శనాలు లేవు. పైగా ఎవరో వ్రాసి సాయణునిపేరు పెట్టి ఉంటారని కూడా కొన్ని ఊహాగానాలు బయలుదేరాయి. ఈ భాష్యం కాక ద్విజరాజభట్టు వ్రాసిన భాష్యం ఇంకొకటి పూర్తిగా దొరుకుతున్నది. ఈయన సాయణుని తరువాత వాడు. కాని సాయణ భాష్యాన్ని తన భాష్యంలో ఎక్కడా పేర్కొనలేదు. బహుశః ఇతడు 16వ శతాబ్దప్రారంభంలోనే ఉండి ఉంటాడని చారిత్రికుల ఊహ.

**ప్రచురణలు:**

సంహితోపనిషద్బ్రాహ్మణాన్ని మొట్టమొదట ఎ.సి.బర్నెల్ 1877లో మంగుళూరులో ద్విజరాజభట్టభాష్యంతో ప్రచురించాడు. ఈ ప్రచురణ రోమన్‌లిపిలో జరిగింది. ఆ తరువాత చాలాకాలం వరకు ఈ బ్రాహ్మణాన్ని ఎవరూ ముద్రించలేదు. 1959 లో ప్రా॥ బి.ఆర్.శర్మ, తిరుపతి కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం నుంచి ముద్రితాముద్రిత ప్రతుల నన్నింటిని పరిశోధించి విమర్శాత్మక సంస్కరణంగా ఈబ్రాహ్మణాన్ని ప్రకటించారు. ఇది చాలా విశిష్టమైన ప్రచురణ.

**2.8.4.4 వంశబ్రాహ్మణం**

**వ్యాఖ్యానాలు :**

వంశబ్రాహ్మణానికి సాయణాచార్యుని భాష్యంమాత్రమే దొరుకుతున్నది. ఇతరులెవరూ దీనికి భాష్యం వ్రాసినట్లు ఇంతవరకు తెలియలేదు.

ప్రచురణలు :

వంశబ్రాహ్మణాన్ని మొట్టమొదట ఎ. వేబర్ (A. Weber) ఇండిషె స్టుడియన్‌లో 271-386 పేజీలల్లో ప్రకటించాడు. ఆ తరువాత సత్యవ్రతసామశ్రమి ఈ బ్రాహ్మణాన్ని కలకత్తానుంచి 1849లో తన సత్యయంత్ర ప్రెస్‌నుంచి బెంగాలీ అనువాదంతో, సాయణభాష్యంతోను ప్రచురించాడు. ఎ.సి. బర్నెల్ దీన్ని మంగుళూరునుంచి 1873లో రోమన్‌లిపిలో ప్రచురించాడు. 1965లో ప్రొ॥ బి. ఆర్. శర్మ తిరుపతి నుంచి ఈ బ్రాహ్మణానికి దొరుకుతున్న ప్రతులన్నీ సేకరించి, దీని విమర్శాత్మక సంస్కరణాన్ని ప్రకటించారు. ఇంతవరకు ఉన్న ప్రచురణల్లో ఇది చక్కగా ఉన్నది.

- ఎస్.బి.ఆర్.

## 2.8.5 ప్రసిద్ధి

### 2.8.5.1. సామవిధానబ్రాహ్మణం

సామవేదానికి సంబంధించిన బ్రాహ్మణాల్లో తాండ్య-తలవకార బ్రాహ్మణాలు వివిధ యజ్ఞ-యాగ ప్రతిపాదకాలుగా ఎంతో ప్రసిద్ధిని సంపాదించాయి. కాని ఛాందోగ్యబ్రాహ్మణం, ఉపబ్రాహ్మణాలైన సామవిధానాది బ్రాహ్మణాలు ఇతర విషయాలనెన్నింటినో ప్రతిపాదిస్తూ పరంపరగా యజ్ఞ యాగాలకు, ప్రశాంతజీవనానికి ఎంతో ఉపయోగపడుతూ ప్రసిద్ధిని సంపాదించాయి.

**నచ్చినవాడి కివ్వడమెలా?**

ఆడపిల్లను మనకు నచ్చినవాడికిచ్చి పెళ్ళిచేయాలి. అది ఎలా సాధ్యపడుతుంది? దానికి సామవిధానబ్రాహ్మణం ఒక మార్గాన్నిలా చెబుతున్నది-చూడండి:

పిల్ల తండ్రి ఉపవాసంచేసి అమావాస్యనాటి రాత్రి చతుష్పథంలో (నాలుగు రోడ్లు కలిసేచోటు) ఆ అమ్మాయిని కూర్చోబెట్టి "పిహాన్యాసు బ్రవాణితే" (గ్రామ. 1.1.7.1-2) అనే సామతో మూడుసార్లు అభిషేకం చేయాలి. ఇలా మూడు అమావాస్యలలో మూడుసార్లు అభిషేకం చేస్తే ఆ పిల్లకు ఇష్టమైనవాడితో తప్పక పెండ్లి జరుగుతుంది (2.5).

ఇలా ఎన్నో లౌకిక విషయాలు కూడా ఈ బ్రాహ్మణంలో చెప్పబడటంవల్ల దీనికి ప్రాచీన కాలంనుంచి ఎంతో ప్రసిద్ధి ఏర్పడింది.

### 2.8.5.2. దేవతాధ్యాయ బ్రాహ్మణం

ఈ బ్రాహ్మణం ఛందస్సులకు సంబంధించిన ఎన్నో విశేషాలను తెలియజేస్తూ లోకంలో ఎంతో ప్రసిద్ధిని పొందింది. ఈ బ్రాహ్మణం చివరలో చెప్పబడ్డ "బ్రహ్మ సత్యం చ పాతు మామ్ (4.5)" అనే మాట నిజంగా వరాలమూట. వేదం, సావిత్రీదేవి, సత్యం ఈ మూడు నన్ను కాపాడుగాక!

ఇందులో జ్ఞానం, సావిత్రీదేవి, శాశ్వతమైన సత్యం ఈమూడు నన్నెప్పుడు చల్లగా కాపాడాలనే ప్రార్థన ఎంతో ప్రశంసనీయంగా ఉంది. ఇలాంటి విశేషాలవల్ల దీనికి ఎంతో ప్రసిద్ధి లభించింది.

### 2.8.5.3. సంహితోపనిషద్బ్రాహ్మణం

సంహితోపనిషద్బ్రాహ్మణం సామగానం చేసేవాళ్ళకు, సామగానానికి సంబంధించిన విశేషాలను తెలుసుకోదలచినవాళ్ళకు ఎంతో సమాచారాన్ని తెలియజేస్తుంది. అయినా ఎన్నో లౌకిక విషయాలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి - చూడండి :

> ఒకప్పుడు విద్య బ్రాహ్మణుని దగ్గరకువచ్చి ఇలా ప్రార్థించింది - "నేను నీ దాన్ని. నన్ను చక్కగా అభ్యసించి పాలించు. అయోగ్యుడు, దురభిమాని అయిన శిష్యుడికి నన్ను ఇవ్వద్దు. నన్ను నీలోనే ధరించి కాపాడు. నీకు ఎప్పటికైనా మంచినే చేస్తాను (3.9).

అంతేకాక ఈ బ్రాహ్మణం ఇంకొక రహస్యాన్ని కూడా చెబుతున్నది. తనజీవితం మొత్తంలో యోగ్యుడైన శిష్యుడు దొరక్కపోతే గురువు తన విద్యను తనలోనే ఉంచుకొని చనిపోవాలేగాని, ఊషరక్షేత్రం (ఉప్పు చవిటినేల) లాంటి అయోగ్యునిచేతుల్లో ఉంచకూడదు (3.10). దానివల్ల వాడు లోకకళ్యాణం సాధించలేకపోగా లోకానికి వినాశనాన్ని కలుగజేస్తాడు. అందుకనే పాత్రతనుబట్టి

ఏదైనా చేయాలని పెద్దవాళ్ళు చెబుతారు. ఇలాంటి విశేషాలను ఎన్నింటినో చెబుతూ ఈ బ్రాహ్మణం ఎంతో ప్రసిద్ధిని పొందింది.

### 2.8.5.4. వంశబ్రాహ్మణం

సామగానం చేసిన మహర్షుల పరంపరను పేర్కొంటూ ఎక్కడెక్కడ ఎవరికి ఏ సందేహం వచ్చినా ఆయా వంశక్రమాన్ని విశదపరుస్తూ ఈ బ్రాహ్మణం సుప్రసిద్ధమైంది. దీనిద్వారా సామవేదాధ్యయనం ఎవరెవరిద్వారా ప్రవాహంలా ఎలా కాలంలో వ్యాపించిందో తెలుస్తున్నది.

- ఎస్.బి.ఆర్.

## 2.8.6 ప్రమేయం

ఇష్టులు-యజ్ఞాలు-యాగాలు: వీటిని నిర్వర్తించే పద్ధతులను సామాన్యంగా "బ్రాహ్మణాలు" చూపుతాయి. కాని 'సామవిధాన బ్రాహ్మణం' 'దేవతాధ్యాయబ్రాహ్మణం' 'సంహితోపనిషద్బ్రాహ్మణం' 'వంశబ్రాహ్మణం' అనే నాలుగు సామవేద బ్రాహ్మణాలలోను యజ్ఞ యాగాదులకు సంబంధించిన ప్రక్రియ ఏమీ కనబడదు. అయినా యజ్ఞ సందర్భాన్ని పురస్కరించుకొని విశదీకరింపబడిన కొన్ని విశేష విషయాలు వీటిలో చోటుచేసుకున్నాయి. వాటిలో కొన్ని సామగానానికి, సామవేదం అధ్యయనం చేయడానికి సంబంధించినవి. మరికొన్ని ధర్మశాస్త్రాలకు చెందినవి. ఇంకా కొన్ని కామ్యకర్మలను (కోరికలను తీర్చేకర్మలు) బోధించేవి. కేవలం మంత్రాల అధిష్ఠాన దేవతలను ఛందస్సుల రంగులను నిర్దేశించేవి మరికొన్ని. ఋషుల వంశాలను చూపించేవి, గానరహస్యాలను విశదీకరించేవి - ఇటువంటి ప్రకరణాలు కూడా ఈ బ్రాహ్మణంలో ఉన్నాయి.

అందువల్ల వీటిలో ఉన్న వింతలను, విశేషాలను కొన్నింటిని ఏర్చికూర్చి, యథాక్రమంగా ఇక్కడ పొందుపరుస్తున్నాను.

### 2.8.6.1 సామవిధానబ్రాహ్మణం

సామ-దాని గొప్పదనం:

మొదట బ్రహ్మమనే పదార్థం మాత్రమే ఉండేది. దానినుంచి 'హిరణ్యగర్భుడు' ఉదయించాడు. అతని మనస్సునుంచి 'ప్రజాపతి' ఉద్భవించాడు. ప్రజాపతి అంటే మనస్సే. అతడు చరాచర సృష్టినంతా చేశాడు. తన సృష్టికంతటికీ సామను జీవనసాధనంగా ఇచ్చాడు. సప్తస్వరాలతో కూడిన సామమే దేవతలకు, పితరులకు, మానవులకు పశుపక్ష్యాదులన్నింటికీ

జీవనోపాయం. కాబట్టే సామను అన్నమని చెప్పవచ్చు. సామస్వరూపం వాక్కు. వాగ్రూపమే ఋక్కు. సమానం గనుక 'సామ' అనిపించుకుంది. అంటే అనేక రకాలైన ఛందస్సు లన్నింటికీ ఇది సమానమే. సామతత్త్వాన్ని తెలుసుకొన్నవానికి ఇహపరలోకాలలో ప్రతిష్ఠ కలుగుతుంది (1.1).

ఈ ఘట్టాన్ని ఈ విధంగా వ్యాఖ్యానించుకోవచ్చు :- సామమంటే చక్కని గానం. దానికి సప్తస్వరాలు మూలాధారం. భావయుక్తమైన సాహిత్యాన్ని జోడించి గానంచేస్తే అది అమృతంలాగా ఆప్యాయనమవుతుంది. గానామృతాన్ని గ్రోలి పరవశంకాని ప్రాణి అంటూ సృష్టిలో ఉండదు. లోకానికి గానాన్ని ప్రసాదించినవాడు భగవంతుడే గనుక గానప్రాశస్త్యం ఇక్కడ సూచితమౌతోంది.

సామాధ్యయనం:

ఒకప్పుడు దేవతలు తమను సృష్టించిన ప్రజాపతిని ఇలా అడిగారు: 'మహాత్మా! మేము స్వర్గాన్ని సాధించే సాధనం ఏమిటి? ప్రజాపతి చిరునవ్వుతో 'రకరకాలైన యజ్ఞాలు, యాగాలు, క్రతువులూ ఉన్నాయి. వాటిని ఆచరిస్తే స్వర్గం అరచేతిలో ఉంటుంది' అని చెప్పి ఆయా ఆచరణ విధానాలను వాళ్ళకు ఉపదేశించాడు. వాళ్ళు వాటిని ఆచరించి స్వర్గాన్ని పొందారు.

అయితే గుణకర్మలను బట్టి దేవతలకన్నా తక్కువైనవాళ్ళు చాలామంది ఉన్నారు. అజాలు, పృశ్నులు మొదలయిన ఋషులు, వైఖానసులనబడే మంత్రద్రష్టలు, అపవిత్రులై కేవలం కోరికలను మాత్రమే కోరుకునే మానవులూ ఈ కోవకు చెందుతారు. వీరికి యజ్ఞాలు చేయడానికి అర్హతలేదు. అందుచేత వీరందరు వెళ్ళి 'మాకు స్వర్గం లభించే ఉపాయం ఏమిటి? అని తమ తండ్రి ప్రజాపతిని అడిగారు. "స్వాధ్యాయం (ఆయా యజ్ఞాలలో విధింపబడిన ఆయా సామలను గానంచేయడం మాత్రమే), తపస్సు - ఈ రెండింటివల్ల మీకు స్వర్గం లభిస్తుంది. వేరుగా మీరు యాగాలు చేయకపోయినా ఇబ్బంది

లేదు" అని ప్రజాపతి సమాధానం చెప్పి, అధ్యయనరీతులను తపస్సుయొక్క పద్ధతులను వారికుపదేశించాడు. తరువాత ఆజపృశ్నియులందరు సామాధ్యయనంవల్ల, తపస్సువల్ల స్వర్గాన్ని సాధించుకున్నారు (1.1).

ఈ సందర్భంలో తాత్పర్యం ఇది - "ఏకాహీనం" (ఒకరోజులో పూర్తి అయ్యే క్రతువు) మొదలు "సత్రయాగం" (సంవత్సరాల తరబడి జరిగే యాగం) వరకు వందలకొలది యజ్ఞయాగాదులున్నాయి. శాస్త్రోక్తంగా ఆయా కర్మలను చేస్తే స్వర్గాదిఫలాలు చేకూరుతాయి. కాని అందరికీ యజ్ఞాలు చేసే అవకాశం, అర్హత, స్తోమత వుండవుగదా! మరి అటువంటివారి గతేమిటి? అనే ప్రశ్నకు చక్కని సమాధానం ఇక్కడ ఉంది. సాక్షాత్తుగా యజ్ఞయాగాదులను ఆచరించకపోయినా పరవాలేదు. ఆయా యజ్ఞాలకు సంబంధించిన వేద భాగాలను శ్రద్ధగా చదువుకోవడంవల్ల, నియమనిష్ఠలతో జీవితాన్ని గడపడంవల్ల కూడా అన్ని ఫలితాలు సిద్ధిస్తాయి. స్వర్గం అంటే ఆనందమయమైన దివ్యజీవనమే గదా!

అందరికి ఆనందాన్ని అందివ్వాలనే ఋషుల సమదర్శనం ఇక్కడ కనిపిస్తుంది.

కొన్ని ఉదాహరణలు - శుచిగా అగ్ని దగ్గరగాని, నది ఒడ్డునగాని సూర్యుణ్ణి ధ్యానిస్తూగాని, దర్భాసనం మీద కూర్చుని, కుడిచేతిలో దర్భలను పట్టుకొని "అగ్న ఆయాహి వీతయే" మొ॥ మూడు సామలను తొమ్మిదిసార్లు అధ్యయనం చేస్తే (ఒకరోజు పూర్తిగా) "అగ్న్యాధానం" (అగ్నిని ప్రతిష్ఠించడం) అనే కర్మను చేసినంత ఫలితం సిద్ధిస్తుంది.

ఆ విధంగానే "సువర్ణపాః" "సువర్ణయూః" అనే రెండు సామలను అధ్యయనం చేస్తే "దర్శపూర్ణమాసలు" అనే ఇష్టులు (చిన్న యజ్ఞాలు) చేసినట్లవుతుంది.

అలాగే నిష్ఠలు, నియమాలతో 'శంఖయంతీః' అనే పది సామలను "రథంతరం" "వామదేవ్యం" అనే సామలను రోజుకు మూడుసార్లు ఏడురోజులు అధ్యయనం చేస్తే "అగ్నిష్టోమం" అనే యజ్ఞాన్ని ఆచరించిన ఫలితం వస్తుంది.

శాస్త్రోక్తమైన నియమాలను అవలంబిస్తూ పాలు మాత్రమే ఆహారంగా తీసుకుంటూ "త్రిప్రో వాచ ఉదీరత" ఇత్యాది సామను ఏడు రోజులు (రోజుకు మూడుసార్లు) అధ్యయనం చేస్తే 'వాజపేయయాగం" చేసినట్లే.

ఈ విధంగా ఆహారవిహార నియమాలను ప్రత్యేకంగా నిర్దేశిస్తూ ఆయా సామలను అధ్యయనం చేస్తే ఆయా యాగాలను ఆచరించినట్లే అవుతుందని సవిస్తరంగా చెప్పడం జరిగింది (1.4).

తపస్సు :

శరీరాన్ని వేడెక్కించి ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవడానికి ఉపయోగించే ముఖ్యసాధనం తపస్సు. ఇది అనేక విధాలుగా ఉంటుంది. అందులో కృచ్ఛ్రం, అతికృచ్ఛ్రం, కృచ్ఛ్రాతికృచ్ఛ్రం అనేవి చాలా ముఖ్యమైనవి.

మూడురోజులపాటు పగలు మాత్రమే సాత్త్వికాహారం తీసుకుని రాత్రి ఏమీ తినకూడదు. తరువాత మూడురోజులు రాత్రి మాత్రమే తిని పగలు తినకూడదు. ఇంకొక మూడురోజులు అయాచితంగా దొరికిన వస్తువునే తినాలి (ఎవరినీ ఏమీ అడిగి తీసుకోకూడదు). చివరి మూడురోజులు పూర్తిగా ఉపవాసం చేయాలి. (మొత్తం పన్నెండు రోజులు) ఫలితం వేగంగా కలగాలంటే పగళ్లంతా నిల్చునే ఉండాలి. రాత్రిళ్లంతా కూర్చునే ఉండాలి (నిద్రపోకూడదు). సత్యమే మాట్లాడాలి. దుర్జనసాంగత్యం పొత్తిగా పనికిరాదు. "రౌరవం" "యౌధాజయం" మొ॥ సామలను గానంచేస్తూ ఉండాలి. చిట్టచివరను దేవతా తర్పణాదులను చేసి, స్వయంపాకం చేసుకుని దేవతలకు నివేదించి తాను తినాలి. ఈ పన్నెండు రోజుల తపస్సుకు 'కృచ్ఛ్రం' అని పేరు.

దీన్ని మించింది "అతికృచ్ఛ్రం" ఇందులో మీది నియమాలను అన్నింటినీ అనుసరిస్తూ కుడిచేతిలో పట్టినంత అన్నాన్ని మాత్రమే రోజుకొకసారి తినాలి.

ఇంతకన్నా కఠోరమైన తపస్సు 'కృచ్ఛ్రాతికృచ్ఛ్రం'. ఇందులో పన్నెండు రోజులూ నీటితో మాత్రమే జీవించాలి. తక్కిన నియమాలన్నీ మామూలే. ఈ మూడు వ్రతాలను ఆచరిస్తే పాపాలన్నీ పటాపంచలవుతాయి. పరమ పవిత్రత సిద్ధిస్తుంది. సకల సత్ఫలితాలు సమకూరుతాయి (1.2).

ప్రాయశ్చిత్తాలు :

శాస్త్రం చెప్పిన విధులను చేయకపోవడం, అది నిషేధించిన పనులను చేయడం, సమాజానికి హానికరమైన పద్ధతులు అవలంబించడం మొ॥ పాపాలనిపించుకుంటాయి. పాపాలకుచేసే ప్రతీకారమే (పాపాలు పోగొట్టుకునేందుకు చేసే పనులు) ప్రాయశ్చిత్తం. అనేక రకాలైన పాపాలకు చాలా రకాలైన ప్రాయశ్చిత్తాలు చూపబడ్డాయి.

ఉదాహరణలు:

అశ్లీలం (బూతుమాట-తప్పుమాట) మాట్లాడితే "దధిక్రావ్ణో అకార్షమ్" మొ॥ గల సామను ఒకసారి శ్రద్ధగా జపించాలి.

ఎవరినయినా నిష్ఠురంగా దూషిస్తే పరిహారంగా 'ఇదం విష్ణుర్విచక్రమే' అనే సామను ఒకసారి గానం చేయాలి.

గురువు, తల్లి, తండ్రి, సోదరుడు - వీరిలో ఎవరినైనా దూషించినప్పుడు మూడు రోజులు ఉపవాసం చేసి, చివరను "తవాఽహం సోమ రారణ" అనే సామను ఇరవై ఒక్కసార్లు జపించాలి.

మద్యపానం ఒకసారి చేస్తే ఒక సంవత్సరంపాటు మధ్యాహ్నం మాత్రమే ఉప్పు, కారంలేని అన్నాన్ని తినాలి. అదైనా రెండు చేతుల్లోను పట్టినంత అన్నం మాత్రమే. గోచీ తప్ప వేరే బట్ట ఉండకూడదు. పగలు మూడుసార్లు, రాత్రి మూడుసార్లు స్నానం చేయాలి. 'పవిత్రం తే' ఇత్యాది సామను రాత్రింబగళ్లు జపించాలి. పగటి సమయంలో నిలుచుని రాత్రిళ్లు కూర్చుని కాలం గడపాలి. ఊరికి వెలుపలనే బస ఏర్పాటు చేసుకోవాలి. దూరదేశం మాత్రం పోకూడదు. తాను చేసిన తప్పును (కల్లుత్రాగడం) వచ్చే పోయే వారందరికీ వివరిస్తూ ఉండాలి. సంవత్సరం పూర్తికాగానే ఊరి పెద్దల ఎదుట "ప్రాయశ్చిత్తం పూర్తి అయిందని, ఇంకెప్పుడూ కల్లు త్రాగనని" ప్రమాణం చేసి శుచిగా ఊళ్ళో ప్రవేశించాలి.

భ్రూణహత్య (గర్భాన్ని పాడుచేడం) చేసినా, బంగారం దొంగిలించినా ఇదే ప్రాయశ్చిత్తం (1.5).

ఇతరుల సొత్తు అపహరించినవాడు "కృచ్ఛ్రవ్రతాన్ని" (పైన వివరింపబడింది) ఆచరించి "అయం సహస్రమానవః" అనే సామను గానం చేయాలి.

పీడకలలు వచ్చినప్పుడు "అద్యా నో దేవ సవితః" అనే సామను జపించుకోవాలి (1.6-8).

ఇటువంటి నియమాలను ప్రాయశ్చిత్తాలను పూర్తిగా అమలు జరుపగలిగితే సమాజం స్వర్గమే అవుతుంది గదా! అని అనిపిస్తూ ఉంటుంది.

**కామ్యకర్మలు:**

"తు చే తునాయ తత్సున" మొ॥ సామతో తెల్లఆవాలను మంత్రించి ప్రతిరోజూ తింటూ ఉంటే ఆయుర్దాయం పెరుగుతుంది.

"శం నో దేవీ రభిష్టయే" అనే సామతో నేతిని మంత్రించి ప్రతిరోజు శరీరానికి రాసుకుంటే చిన్నచిన్న రోగాలు శాంతిస్తాయి.

శంఖపుష్పి, సర్పగంధ అనే రెండు ఓషధులను నూరుకుని గుళికగా చేయాలి. దాన్ని దగ్గరగా పెట్టుకొని "చర్షణీధృతమ్" ఇత్యాది సామతో మూడుసార్లు అగ్నిలో హోమం చేయాలి. అప్పుడా గుళికను మెడలో కట్టుకున్నా చేతికి కట్టుకున్నా సర్పభయం ఉండదు.

"త్వ మిమా ఓషధీః" ఇత్యాది సామను నిత్యం గానం చేసుకుంటూ ఉంటే విషంతిన్నా అరిగిపోతుంది. ప్రమాదం ఉండదు.

దుంపలు, పండ్లు, తింటూ కృష్ణాజినం ధరించి (జింకతోలు) మౌనం అవలంబించి ఒక నెలరోజులు అడవిలో ఉండాలి. పుష్య పూర్ణిమనాడు "ఉద్వయం తమసస్పరి" అనే సామతో సూర్యుణ్ణి పూజించాలి. ఇలా వరుసగా నాలుగు సంవత్సరాలు జపిస్తే ముసలితనం, మృత్యువుకూడా దగ్గరకు రావు (అజరామరత్వం సిద్ధిస్తుంది) (2.1-4)

ఈ తీరులో పురుషులను, స్త్రీలను, కుటుంబాలను వశం చేసుకోవడానికి సంపద, సంతానం, సౌందర్యం మొ॥ వాటిని పొందడానికి - చివరకు చెడిపి, చిల్లంగి మొదలయిన నీచపు పనులు చేయడానికి ఉపయోగించే ప్రయోగాలు వందలకొలది చూపబడ్డాయి. అన్ని సందర్భాలలోను శీలం, శౌచం మొ॥ నియమాలు మామూలే. అయినా జపం లేక గానం విషయంలో మాత్రం ప్రత్యేకంగా ఆయా సామలు పేర్కొనబడ్డాయి. "సకలమైన సిద్ధులకు సామలను విధించేది" గనుకనే ఈ బ్రాహ్మణం "సామవిధానం" అనే సార్థకనామధేయం ధరించింది.

### 2.8.6.2 దేవతాధ్యాయబ్రాహ్మణం

అగ్ని, ఇంద్రుడు, ప్రజాపతి, సోముడు, వరుణుడు, త్వష్ట, అంగిరసుడు, పూష, సరస్వతి, ఇంద్రాగ్నులు (కలిపి) - అని పదిమంది సామగానానికి అధిదేవతలు.

కాలేయం, రౌరవం, యౌధాజయం, మహోవత్సం మొదలయిన కొన్ని సామలకు దేవత అగ్ని. వామదేవ్యం అనే సామకు దేవత ప్రజాపతి. ఔశనకావం అనేదానికి సోముడు దేవత. యజ్ఞాయజ్ఞీయం అనేదానికి వరుణుడు. వారవంతీయం, అభీవర్తం అనే సామలకు త్వష్ట దేవత. స్వాస్వష్మములు అనే సామలకు అంగిరసుడు. కాశీతం, దైవోదానం మొదలయినవాటికి పూష. కొన్నింటికి సరస్వతి దేవత. మరికొన్నింటికి ఇంద్రాగ్నులు. మిగిలిన అన్ని సామలకు ఇంద్రుడే దేవత.

వసువులు, రుద్రులు, ఆదిత్యులు, విశ్వేదేవులు అనే నలుగురు సాముదాయికంగా సామదేవతలని చెప్పవచ్చు. ఇంద్రుడు, అగ్ని, ప్రజాపతి- అని ముగ్గురే దేవతలని కూడా కుదించి చెప్పవచ్చు. ఇంకా సంగ్రహిస్తే బ్రహ్మ ఒక్కడే సామలన్నింటికి దేవత' అని చెప్పడం సమంజసం. అతడే అన్నింటికి మూలకారణం గదా!

"ఋక్కు తల్లి, గానం తండ్రి, స్వరం ప్రజాపతి" అన్నది సామరహస్యం(1).

ఈ బ్రాహ్మణం రెండవ ఖండలో గాయత్రి మొ॥ ఛందస్సులకు రంగులు, దేవతలు నిర్ణయించబడ్డాయి. మూడవ ఖండ ఛందస్సుల నిర్వచనానికి వినియుక్తమయింది. నాలుగవ ఖండ పూర్తిగా సావిత్రిదేవత యొక్క విశ్వరూపాన్ని వర్ణించింది.

కాగా పర్యవసానం ఇది - ఋక్కుల గానంలో చివర ఉండే ధ్వనిని బట్టి సాంకేతికంగా సామలను వర్గీకరించి, తదనుసారంగా దేవతలను నిశ్చయించారు. ఆయా ఛందస్సులకు నిర్వచనం, రంగు ప్రత్యేకంగా నిర్దేశించారు. మనస్సుయొక్క ఏకాగ్రత సిద్ధించడానికి ప్రతీకోపాసన ప్రథమసోపానం. ఈ అంశాన్ని కేంద్రంగా తీసుకొని, భావనా సౌందర్యాన్ని బలంగా ఉంచుకొని, గానాన్ని పురశ్చరణకు అనువుగా ఉండే విధంగా ఋషులు మంత్రాలకు ఛందస్సులకు కూడా అధిష్ఠాన దేవతలను, రంగులను నిర్ణయించారని భావించవచ్చు.

మూలమైన సాహిత్యం ఋక్కు. దానికి గానాన్ని జోడిస్తే సామ అవుతుంది (సామ అంటే గానమే). అందులో ఎన్నో రీతులు. వాటిలో "గాయత్రం" అనే రీతిని పుష్కలంగా ప్రశంసించారు. కర్మలలోను, ఉపాసనలలోను గాయత్రీచ్ఛందస్సుకు, గాయత్రీ మంత్రానికి, గాయత్రీ గానానికి, గాయత్రీదేవతకు వైదిక సంప్రదాయం ఇచ్చిన గౌరవం వర్ణనాతీతం. ప్రత్యక్షదైవమైన సూర్యునితో సంబంధం ఉండడం అందుకు ముఖ్యకారణం కావచ్చు. గాయత్రి అన్నా సావిత్రి అన్నా ఒక్కటే. సావిత్రీదేవతను విశ్వరూపిణిగా చిత్రించడం వైదిక ఋషుల భావనాసౌందర్యానికి మకుటాయమానంగా చెప్పవచ్చు.

ప్రముఖంగా సామదేవతలను నిర్దేశించింది కాబట్టి 'దేవతాధ్యాయం' అనే పేరు ఈ బ్రాహ్మణానికి సముచితమే.

### 2.8.6.3 సంహితోపనిషద్బ్రాహ్మణం

సామగానరహస్యాలను చూపించేది గనుక ఈ బ్రాహ్మణానికి సంహితోపనిషద్బ్రాహ్మణమని పేరు. అధ్యయనం, గురుశిష్యుల సంబంధం,

దానప్రశంస మొ॥ ధర్మశాస్త్రవిషయాలు ఈ బ్రాహ్మణంలో చక్కగా నిరూపించబడినాయి.

మొదట-మంద్రం, మధ్యమం, తారం అనే స్థాయిల భేదాన్ని బట్టి గానాన్ని ముఖ్యంగా మూడు విధాలుగా విభజించడం, వాటికి దేవసంహిత, అసురసంహిత, ఋషిసంహిత మొ॥ సాంకేతిక పదాలను ఉపయోగించడం, ఆయా గానాలవల్ల వచ్చే ఫలితాలను చూపడం జరిగింది.

తరువాత గానం చేసేటప్పుడు మూలమంత్రాలలో వచ్చే మార్పులను (ఉన్న అక్షరాలు జారిపోవడం, కొత్తవి చేరడం, హో, హోఇ, హాఇ మొ॥ విచిత్ర ధ్వనులు, పదాలకు ఆవృత్తులు మొదలైనవి) ద్రుతం, విలంబితం మొ॥ వృత్తులను, స్వరప్రస్తారాలను విశదీకరించడం అయింది. గాన ప్రభావంవల్ల మూలసాహిత్యంలో కలిగే ఎన్నో మార్పులకు సామవేదమే నాంది పలికిందని ఈ ఘట్టం సాక్ష్యం చెబుతుంది.

విద్యనుపదేశించడానికి తగిన యోగ్యతలు, గురువుయొక్క లక్షణాలు, విద్యార్థి నియమాలు, అధ్యయనరీతులు, గురుదక్షిణారీతులు-ఇవన్నీ తరువాతి సందర్భాలలో పుష్కలంగా ఉన్నాయి. ఈ విషయాలన్నీ ధర్మశాస్త్ర గ్రంథాలలో ఎక్కడ పడితే అక్కడ ప్రవాహంగా ప్రసిద్ధంగా కనిపించేవే. అవి సర్వకాలికాలు - సర్వజనీనాలు.

చివరన పలువిధాలైన దానాలు, వాటివల్లకలిగే లాభాలు చూపబడ్డాయి. ఇవికూడా ధార్మికవిషయాలే.

సామాధ్యయనం మాత్రం ఎప్పుడూ మానకూడదని, సామజపంవల్లనే ఆయా యజ్ఞాలు-యాగాలు చేసినంత ఫలితం వస్తుందనీ ఈ బ్రాహ్మణం మనల్ని ప్రోత్సహిస్తున్నది.

### 2.8.6.4 వంశబ్రాహ్మణం

ఇందులో చెప్పుకోదగిన విషయం ఏమీ లేదు. సామసంప్రదాయ ప్రవర్తకులైన ఋషుల వంశపరంపరను ఇంచుమించు ఒక పట్టికరూపంలో ఈ బ్రాహ్మణం చూపించింది. అందువల్లనే ఈ పేరు సార్థకం అయింది.

"బ్రహ్మకు, ఆచార్యులకు, ఋషులకు, సకల దేవతలకు నమస్కారం" అన్న మాటతో దీని ప్రారంభం. పిదప మిత్రవర్చసుడు బ్రహ్మవృద్ధి, గిరిశర్మ, నిగడుడు, త్రాతుడు, రుద్రభూతి మొదలైన ఇంచుమించు అరవైమంది సామగురువులను, వారి గోత్రాలను పేర్కొనడం జరిగింది. చివరన ప్రథమ గురువు, పరమగురువు కూడా 'బ్రహ్మ' అని చెప్పి 'తస్మై నమః, తస్మై నమః' అన్న నమస్కారంతో ఇది పూర్తి అయింది.

సామవేదాన్ని అధ్యయనం చేయడంలో అభిరుచిని ఉత్సాహాన్ని కలిగించడానికి ఈ తీరు దోహదం చేయవచ్చు. సామగానాన్ని సంప్రదాయబద్ధంగా సంరక్షించుకోవడానికి కొన్ని వేల సంవత్సరాలుగా భారతీయఋషులు చేసిన పరిశ్రమకూడా దీనివల్ల విశదమవుతుంది.

- ఏ.ఎస్.ఎస్.

## 2.8.7. వైశిష్ట్యం

### 2.8.7.1 సామవిధానబ్రాహ్మణం

యజ్ఞాలు, యాగాలు మొదలైన వైదికకర్మలను చేయడానికి అర్హత, శక్తి, అవకాశం అందరికీ ఉండదు. అలాంటివాళ్ళు యజ్ఞయాగాలను ఆచరించకపోయినా కేవలం సామగానం చేస్తే ఆయా కర్మలు చేసినంత ఫలితం లభిస్తుంది. ఏయే సామలను గానంచేస్తే ఏయే ఫలం వస్తుందో నిరూపించడమే ఈ బ్రాహ్మణంలోని విశిష్టత.

అంతేకాక కొన్ని కొన్ని పాపాలకు ప్రాయశ్చిత్తాలు, కృచ్ఛ్రం అతికృచ్ఛ్రం మొదలైన కఠోరవ్రతాలు - వాటి ఫలితాలు, కోరికలను తీర్చే కొన్ని ప్రయోగాలు, ఇంద్రజాలపు తీరులు, అద్భుతశక్తులను సంపాదించి పెట్టే ప్రక్రియలు - ఇవన్నీ కూడా ఇందులో చోటు చేసుకున్నాయి.

ఒక విషయం - సామ అంటే సంగీతమే. అది అందరికీ ఆప్యాయనమైనది. దానికి సప్తస్వరాలు ఆధారం. క్రుష్టం, ప్రథమం, ద్వితీయం, తృతీయం, చతుర్థం, పంచమం, షష్ఠం అని ఆ స్వరాలను సామసంప్రదాయంలో వ్యవహరిస్తారు. సావిత్రం, రథంతరం, వారవంతీయం యజ్ఞాయజ్ఞీయం మొదలైన సామలు ఆయా రాగాల వంటివి. వీటితో ఆనాటివారు ఎంత ఆనందంపొందేవారో - ఎన్నెన్ని కోరికలను తీర్చుకొనేవారో! అని భావిస్తే ఆశ్చర్యం కలగకమానదు.

ఇక ఇందులోని సారాంశాలు - ప్రజాపతి ఈ ప్రపంచాన్ని అంతను సృష్టించాడు. తరువాత సకల చరాచరజగత్తుకు జీవనాధారంగా సామను (సంగీతం) కల్పించాడు. సామకు ఋక్కు ఎముకలని (మూలాధారం), స్వరం మాంసమని, స్తోభలు (గానంలో అధికంగా వినిపించే అక్షరాలు,

పదాలు) రోమాలని చెప్పవచ్చు. కేవలం సామగానంవల్లనే స్వర్గాది సుఖాలను అనుభవించవచ్చు (1.1).

ఆయా సామలను గానంచేస్తే ఆయా యాగఫలాలు సమకూరుతాయని వివరంగా చెప్పడం జరిగింది. ఆయా సామగానం వల్ల ఆయా దేవతలు వశమవుతారన్న అంశాలున్నాయి. అసభ్యంగా మాట్లాడడం, పరుషంగా వాగడం మొదలైన వాగ్దోషాలు, దృష్టి దోషాలు, అన్నపానదోషాలు మొదలైన దోషాలన్నింటికి ప్రాయశ్చిత్తాలున్నాయి. కాగా మానవుని మనుగడకు, సుఖజీవనానికి శీలానికి ధర్మాచరణకూ ఉపయోగించే విషయాలన్నీ ఉన్నాయని అనవచ్చు. (1.3-8)

ఆయుర్దాయం, సంతానం, బలం, వశీకరణం మొదలైనవి సిద్ధించడానికి, అద్భుతశక్తులు సంపాదించడానికి, అభిచారకర్మలు (చేతబడి-చిల్లంగి) ప్రయోగించడానికీ కావలసిన వివిధ ప్రక్రియలను ఈ బ్రాహ్మణం ఎంతో చక్కగా నిరూపిస్తున్నది. ఓషధులు, చెట్లు, చేమలు, తీగలు, పువ్వులు-మొదలైన ప్రకృతి ప్రసాదించిన వస్తువుల మహిమలను ఇది చూపిస్తుంది.

ప్రజాపతి, బృహస్పతి, నారదుడు, వ్యాసుడు మొదలైన సామగురువుల ప్రశంస ఇందులో కనబడుతుంది. 'అర్హత గలవానికే ఈ సామవిధిని ఉపదేశించాలి' అన్న హెచ్చరిక ఈ బ్రాహ్మణంచివర కనబడుతున్నది.

### 2.8.7.2 దేవతాధ్యాయబ్రాహ్మణం

గానభేదాన్నిబట్టి ఆయా సామల ఛందస్సులను, దేవతలను ఇది నిశ్చయిస్తుంది. గానంలో స్వరప్రస్తారం, మూర్ఛనలు, స్థాయులు, గతులు మొదలైన సహజమైన సాంకేతికమైన భేదాలు చాలా ఉంటాయి. తదనుసారంగా ఆయా పేర్లు పెట్టి దేవతలను నిర్దేశించడం ఆర్ష సంప్రదాయం.

ఛందస్సుల రంగులను, దేవతలను ఇది చక్కగా నిర్దేశించింది. 'గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్ మొదలైన ఛందస్సులలో ఋక్కులు నిబద్ధం అయి ఉంటాయి. వాటిలో 'గాయత్రీచ్ఛందస్సుయొక్క రంగు తెలుపు, దేవత అగ్ని' అనే తీరుతో అన్ని ఛందస్సుల రంగులు దేవతలు పూర్తిగా పేర్కొనబడ్డాయి. అధిష్ఠానదేవతలు, వారి రంగులు, స్వరూపస్వభావాలు-వీటన్నింటిని పరిపరి విధాల భావించి వర్ణించడం ఋషుల భావనాసౌందర్యాన్ని ఉపాసనామార్గాలను విశదం చేస్తుంది (2.1.12).

ఇందులో ఛందస్సుల వ్యుత్పత్తులు ఉన్నాయి. అక్షరాలలెక్కను పాటిస్తూ భావాలను తనలో ఇముడ్చుకునేది ఛందస్సు (ఛందయతి=ఛందః), లేదా జపించేవాని పాపాలను పోగొట్టి అతనిని రక్షించేది ఛందస్సు (ఛాదయతి=ఛందః). ఇది సామాన్య నిర్వచనం. మంత్రం యొక్క దేవతను స్తుతించేది లేక వెలుగొందించేది "గాయత్రి". లేదా బ్రహ్మయొక్క నోటినుండి వెలువడింది కాబట్టి "గాయత్రి" అని కూడా అనవచ్చు (గాయతి=గాయత్రీ గాయతః ఉదపతత్=గాయత్రీ). దేవతలకు ప్రియమైనది ఉష్ణిక్. గాయత్రిని మించి అక్షరాలు కలది అనుష్టుప్. ఈ విధమైన విశేషాలన్నీ పొందుపరచబడ్డాయి. తరువాత అన్ని విధాలైన సామలలోను (గానరీతులు) 'గాయత్రం' అనే సామ చాలా ఉత్తమమైందని గాయత్ర ప్రశంస కనబడుతుంది. గాయత్రం సాక్షాత్తు బ్రహ్మకు సంబంధించిందట. సామదేవతలను ఛందస్సులను తెలిసినవాడికి సకల శ్రేయాలు కలుగుతాయని ఫలశ్రుతి చివర ఉంది (3.1.-24).

గాయత్రసామకు మూలాధారమైన సావిత్రీ దేవతయొక్క విశ్వరూపాన్ని చిత్రిస్తూ, ఆవిధమైన ఉపాసనవల్ల సర్వమంగళాలు చేకూరుతాయని ఉపదేశిస్తుంది ఈబ్రాహ్మణం. సావిత్రికి బ్రహ్మ శిరస్సు, ఆకాశం నుదురు, సూర్యచంద్రులు కళ్ళు, అగ్ని నోరు, సరస్వతి నాలుక, త్వష్ట మెడ, వసువులు, రుద్రులు చేతులు, వాయుమండలం వక్షస్సు, ఇంద్రుడు పృష్ఠం, విష్ణువు

బొడ్డు, మరుత్తులు తొడలు, వేదాలు పాదాలు, మెరుపు చిరునవ్వు, నక్షత్రాలు ఆభరణాలు. ఇది కేవలం భౌతికవర్ణనం కాదు. సావిత్రి సకల చరాచరజగద్రూపమనే దివ్యభావన. ఆహా! ఈ భావన ఎంత మనోహరంగా ఉంది!

### 2.8.7.3 సంహితోపనిషద్బ్రాహ్మణం

గానం చేసేటప్పుడు మూలసాహిత్యంలో చాలా మార్పులు వస్తూ ఉంటాయి. కొన్ని అక్షరాలు, పదాలు లోపిస్తాయి. కొన్ని కొత్తగా చేరతాయి. మూలానికి అర్థంతో సంబంధం ఉంటుంది. కనుక అక్కడి పదాలు వ్యాకరణయుక్తంగాను, ఛందోబద్ధంగాను, వాక్యరూపంలో ఉండక తప్పదు. పాటలో అర్థానికి అవసరం తక్కువ; స్వరం, మాధుర్యం మొదలైన అంశాలకే ప్రాధాన్యం. ఆ పద్ధతి సామవేదంతోనే పుట్టి, అనూచానంగా వస్తున్నది. ఇలాంటి తీరులనే సాంకేతికంగా ఈ బ్రాహ్మణం మొదట వివరిస్తుంది. చివర అధ్యయనం గురుశిష్యుల సంబంధం, దానప్రశంస మొ॥ ధర్మశాస్త్ర విషయా లున్నాయి.

దేవసంహిత, అసురసంహిత, ఋషిసంహిత అని సంహిత మూడు రకాలు. ఇతరులకు వినిపించనట్లుగా చేసే గానం దేవసంహిత. అతితీవ్రస్థాయిలో చేసేగానం అసురసంహిత. సమయాన్ని బట్టి మెల్లగాగాని మంద్రంగా గాని నడిచేది ఋషిసంహిత. దేవసంహిత స్వర్గాది సుఖాలను, అసురసంహిత పశు సంపదను, ఋషిసంహిత మంచి తేజస్సును సమకూరుస్తుంది. ఈ విధంగా పారస్థాయివి, మాధుర్యాన్ని అనుసరించి మూడేసి విభాగాలు - వాటి సాంకేతికపదాలు - వాటి ఫలితాలు ఉన్నాయి (మొదటి ఖండం).

గానం చేసేటప్పుడు మూలంలో ఉన్న అక్షరాలు కొన్ని జారిపోవడం, కొన్ని కొత్తగా చేరడం, హో, హోఇ, తాఇ, హోఇడా మొదలైన ధ్వనులు

వినిపించడం, పదాలు ఆవృత్తి చెందడం జరుగుతాయి. ఆ విధంగానే మంద్రం, మధ్యం మొదలైన స్థాయులు, ఉదాత్తం, అనుదాత్తం మొదలైన స్వరాలు, ద్రుతం (వేగం), విలంబితం (ఆలస్యం) మొదలైన వృత్తులు, స్వరప్రస్తారాలు, మూర్ఛనలు - ఇవన్నీ ఉంటాయి. అన్నింటిని తెలుసుకొని యథాశాస్త్రంగా సామగానంచేస్తే సకల శ్రేయస్సులను సంపాదించవచ్చు (రెండవ ఖండం).

విద్య ఎప్పుడూ మంచి విద్వాంసుణ్ణి ఆశ్రయించుకుని ఉంటుంది. అది అతన్ని ఈ విధంగా కోరుకుంటుంది - "నీవు నన్ను కాపాడు. నీకు శ్రేయస్సులు కలుగుతాయి. అర్హత లేనివానికి కలలోనైనా నన్ను ఇవ్వకు - నీకు పుణ్యం ఉంటుంది".

యోగ్యత లేనివానికి విద్యాదానం చేయకూడదు. అనర్హునికి విద్య చెప్పడంకన్న తన విద్యతో పాటు తాను చనిపోవడం చాలా మంచిది. యోగ్యత ఉన్నా ఆదరంలేనివానికి కూడా విద్యాదానం చేయకూడదు. యోగ్యత-ఆదరం ఉన్న విద్యార్థి దొరికినప్పుడు మాత్రం తప్పక విద్యను ఉపదేశించాలి. లేకపోతే గురువుకు పాతకాలు చుట్టుకుంటాయి. బ్రహ్మచర్యం, ప్రజ్ఞ, ఇంద్రియనిగ్రహం, శ్రద్ధ, ఆసక్తి, గురుభక్తి, ఉత్సాహం, గురుదక్షిణ ఇవ్వగల స్తోమత, శుశ్రూష (గురుసేవ) మొదలైనవి విద్యార్థికి ఉండాల్సిన ముఖ్యగుణాలు (మూడవ ఖండం).

విద్యాభ్యాససమయంలో కఠోరనియమాలను పాటిస్తే ఫలం అత్యధికం. విద్య పూర్తికాగానే శిష్యుడు గురువుకు సముచితంగా దక్షిణ సమర్పించుకోవాలి. అలా చేసినట్లయితే కోరికలు సిద్ధిస్తాయి. తల్లి దండ్రులకు, గురువుకు సేవ చేసిన వానికి కలిగే లాభాలకు లెక్కేలేదు. గురువుకు తగినంత బంగారం దానం చేయగలిగితే శిష్యునికి బంగారు రాశులు కురుస్తాయి. దానాలలో

గోదానం, భూదానం, విద్యాదానమూ మిక్కిలి ఉత్తమమైనవి (నాలుగవ ఖండం).

### 2.8.7.4 వంశబ్రాహ్మణం

ఇది సామవేదబ్రాహ్మణాలలో చివరిది. చాలా చిన్నది. సామసంప్రదాయ ప్రవర్తకులైన ఋషులు విద్యావంశపరంపరను (గురుశిష్యుల వరుస) ఒక పట్టిక రూపంలో ఈ బ్రాహ్మణం నిరూపించింది. సామవేదాన్ని చదువుకోవడంలో అభిరుచిని, ఉత్సాహాన్ని కలిగించడానికి ఈ తీరు దోహదం చేస్తుందని నమ్మకం.

"బ్రహ్మకు, ఆచార్యులకు, ఋషులకు, సకల దేవతలకు నమస్కారం" అన్నది ప్రారంభవచనం. గార్గ్యుడు శర్వదత్తుని నుంచి సామవేదాన్ని అధ్యయనం చేశాడు. శర్వదత్తుడు రుద్రభూతినుంచి నేర్చుకున్నాడు. రుద్రభూతి గురువు త్రాతుడు. అతని గురువు నిగడుడు. నిగడుని ఆచార్యుడు గిరిశర్మ. అతనికి ఉపదేష్ట బ్రహ్మవృద్ధి. అతనికి చెప్పినవాడు మిత్రవర్చసుడు. ఈ విధంగా ఇంచుమించు అరవై డెబ్భైమంది గురువుల పేర్లను, వారి గోత్రాలను చూపించి, చివరకు ప్రథమగురువు పరమ గురువుకూడా బ్రహ్మ అని చెప్పడం జరిగింది.

- ఏ.ఎస్.ఎస్.

### 2.8.8 సంగ్రహసమీక్ష

#### 2.8.8.1 సామవిధాన బ్రాహ్మణం

"వేదానం సామవేదోఽస్మి" అని భగవద్గీతలో, "ఏతత్సామ గాయన్నాస్తే" అని ఉపనిషత్తులోను భగవంతుడు గానప్రియుడని చెప్పబడింది.

సామవిధానబ్రాహ్మణంలో మొదట అజపృష్ఠి, వైఖానసాది యజ్ఞాలలో అనధికారులు, శక్తిలేనివారి శుద్ధికొరకు కృచ్ఛ్రం అనే పేరుగల ప్రాయశ్చిత్తాలు చెప్పబడినాయి. ఈ ప్రాయశ్చిత్తాన్నాచరించటంచేత పాపాన్ని పోగొట్టుకొన్నవారికి స్వర్గాదిఫలం కోసం అగ్న్యాధానం, అగ్నిహోత్రం మొ॥ యాగాలకు బదులుగా కొన్ని సామలు చెప్పబడ్డాయి.

దేవతలకు ప్రజాపతి సామవేదాన్ని, స్వర్గాదిఫలంకోసం యజ్ఞ యాగాదులను ప్రదానం చేశాడు. మొదట దేవతలు స్వర్గసుఖాల ననుభవించటానికి తమ తండ్రియైన ప్రజాపతిని సమీపించారు. అప్పుడు ప్రజాపతి వారికి స్వర్గప్రాపకాలైన యజ్ఞయాగాది కర్మలను ఇచ్చాడు. వారు దానివల్ల స్వర్గానికి వెళ్ళారు. ప్రజాపతి లోకాన్ని కాపాడటానికి దేవతలకు యాగాలను ఇవ్వగా వాళ్ళు స్వర్గానికి వెళ్లారు. యాగాలను చేయుటాని కశక్తులైనవారికి కృచ్ఛ్రం, అతికృచ్ఛ్రం, కృచ్ఛ్రాతికృచ్ఛ్రం అనే పేర్లతో ప్రాయశ్చిత్తాలు చెప్పబడ్డాయి.

ఒకపూట స్వల్పభోజనం చేయుటం, నీళ్ళుత్రాగి ఉండటం, సత్యాన్నే మాట్లాడటం, చెడువారితో మాటలాడకపోవటం, తర్పణాదులు చేయడం-వీటివల్ల పరిశుద్ధుడై మహాపాతకం, ఉపపాతకం మొదలైన పాపాలనుంచి విముక్తుడవుతాడు. అధ్యయనం, దానికి సంబంధించిన నియమాలు, వాటి

ఫలితాలు; పవమాన, దర్శపూర్ణమాస, అగ్నిహోత్ర, పాంచరాత్రిక, పశుబంధ, సౌత్రామణి మొదలైన యాగాలను గురించి వివరింపబడింది.

మోక్షసాధనం, విష్ణు, రుద్ర, వినాయక, స్కందాది సర్వకామ ప్రాప్తిసాధనప్రయోగం, సురాపానం, ఇతరుల ద్రవ్యాన్నపహరించటం, పరస్త్రీ గమనం, పరహింస, దుఃస్వప్నాది ప్రాయశ్చిత్తాలు ఇందులో వివరింపబడ్డాయి.

బ్రహ్మలోకప్రాప్తి, ఆయుష్యం, ఆరోగ్యం, రోగోపశమనం, వశీకరణం, జయాన్ని, శ్రేయస్సును, దీర్ఘాయుర్దాయంతో కూడిన పుత్రుణ్ణి పొందటం మొ॥ వాటికి కావలసిన ప్రయోగాలుకూడ ఈ బ్రాహ్మణంలో ఉన్నాయి.

గోవులు, భూమి, ధనం, ధాన్యం, పశువులు, పుత్రులు, కీర్తి, దుఃస్వప్నం, శాంతి, భూతవశీకరణాలకు సంబంధించిన ప్రయోగాలు పునర్జన్మ లేక ఈ జన్మలోనే మోక్షాన్ని పొందటానికి కావలసిన ప్రయోగం; దివ్య, మానుషభోగాలకు సంబంధించిన ప్రయోగాలు ఇందులో అధికంగా ఉన్నాయి.

ఈ బ్రాహ్మణగ్రంథాన్ని అధ్యయనం చేయటానికి అధికారి ఎవరు? అన్ని వేదాలను అధ్యయనం చేసి గురుకులం నుంచి తన స్వగృహానికి బయలుదేరి వస్తున్న శిష్యుడు ఈ బ్రాహ్మణాన్ని చదవటానికి అధికారి. ఇటువంటి శిష్యుడు తన గురువుకు సేవచేసి గాని, కొంతధనాన్ని ఇచ్చిగాని సంతోషపరచి, ఆయన చెప్పిన ఈ సామవిధానబ్రాహ్మణాన్ని అధ్యయనం చేసి, తన అభీష్టాలను పొందాలి.

### 2.8.8.2 దేవతాధ్యాయబ్రాహ్మణం

ఇందులో నాలుగు ఖండలున్నాయి. ఇంద్రుడు అగ్ని, సోముడు, ప్రజాపతి, వరుణుడు, త్వష్ట, అంగిరసుడు, పూష, సరస్వతి వీరందరు సామదేవతలుగా పేర్కొనబడ్డారు. ఒక్కొక్క దేవతకు ప్రత్యేకంగా

సామమంత్రాలుకూడా చెప్పబడ్డాయి. ఆయా మంత్రాలకు సంబంధించిన దేవతలుకూడ పేర్కొనబడ్డారు.

ఈ సామదేవతలను గురించి ముఖ్యంగా తెలుసుకోనవలసిన రహస్యవిషయం ఒకటి ఉంది. అది ఏమిటంటే: ఋక్, సామ, స్వరం. ఇందులో సామ-ఋగాశ్రితాలైన ఛందో దేవతలు: వారి వర్ణాలు వివరింపబడ్డాయి. గాయత్రి, ఉష్ణిక్, కకుప్, అనుష్టుప్, బృహతి, పంక్తి త్రిష్టుప్, జగతి అనేవి ఛందస్సుల పేర్లు. దీనికి అనుగుణంగా తెలుపు బూడిదరంగు, పసుపు, నలుపు, కుంకుమవర్ణం, నీలం, బంగారురంగు, గౌరవర్ణం గలిగిన వర్ణాలపేర్లు చెప్పబడ్డాయి. ఛందస్సునుంచి అగ్ని, సోముడు బృహస్పతి మొదలైన దేవతల ఆవిర్భావం వర్ణింపబడింది.

సమస్త వేదాలను చెప్పే ప్రజాపతి ముఖంనుంచి వేదసారభూతమైన ఈ గాయత్రీదేవి ఉద్భవించింది. అందువల్లకూడ ఈ దేవతకు గాయత్రి అని పేరు. ఎవడు వేదాన్ని గానం చేస్తాడో వాణ్ణి వేదమాత రక్షిస్తుంది అని వేదవ్యాస మహర్షి గాయత్రిపదాన్ని వర్ణించారు.

పై విధంగా అన్ని ఛందస్సులకు నిర్వచనం సూక్ష్మంగా ఈ బ్రాహ్మణంలో దొరుకుతుంది. గాయత్రీసామలాగా కొన్ని స్థలాలలో సావిత్రీ సామగానం చేయాలి. మంత్రానికి ఋషి, ఛందస్సు, దేవత, జ్ఞానం ప్రధానం. మంత్రాన్ని తెలిసినవాళ్లు మంత్రజ్ఞులని, ఋషులని వాళ్ళ నాశ్రయించిన సామలు ఛందస్సులని, ఆ సామ విషయాలు దేవతలనీ తెలుసుకోవాలి.

మంత్రం, దేవత, మంత్రాన్ని ఉపదేశించిన గురువు ఈ ముగ్గురిపైన భక్తిశ్రద్ధలు కలవాడు కోరినఫలాన్ని పొందుతాడని ఈ బ్రాహ్మణం చెబుతుంది. ఋషి, ఛందస్సు, దేవత అనే మూడింటి విశేషాలు ఈ బ్రాహ్మణంలో బాగా వివరింపబడ్డాయి.

గాయత్రీసామకు ఆధారభూతమైన సామ సావిత్రి. ఆ సావిత్రీదేవి సకల దేవతలకూ మూలమై ఉపాసించదగి ఉంది. ఈ రహస్యాన్ని తెలుసుకొన్నవాడు అన్ని దోషాలను పోగొట్టుకొని శుభాలను పొందుతాడు.

### 2.8.8.3 సంహితోపనిషద్బ్రాహ్మణం

సామవేదమంత్రసముదాయపు రహస్యార్థాలను, మోక్షమార్గానికి కారణమైన బ్రహ్మవిద్యను తెలిపేది ఈ సంహితోపనిషద్బ్రాహ్మణం. మహర్షులు ఆరణ్యంలో జనరహితమైన ఏకాంత ప్రదేశంలో వేదాధ్యయనం చేసేవాళ్లు. తమతమ ధర్మాలపైన ఆసక్తి గలవాళ్ళ హితంకోసం మంత్రాలతో యజ్ఞయాగాది క్రతువులను చేసేవాళ్ళు.

జైమిని, గౌతమ, భరద్వాజాది మహర్షులు ఈ సంహితలను ఉత్తమ, మధ్యమ, నీచస్వరాలతో పఠించారు. ఈ సంహితలను సుస్పష్టంగా గానం చేయాలి. ఎవరు చక్కగా గానంచేయరో వాళ్ళు వెంటనే చనిపోతారని ఈ బ్రాహ్మణం చెబుతోంది. ఈ సంహిత నుపాసించే వారికి మూడు విధాలైన శుభఫలాలు చెప్పబడి ఉన్నాయి.

సామమంత్రాలను స్వరంతో గానంచేయాలి. అలా చేయటం వల్ల జగదీశ్వరుడైన పరమాత్మకు, ఆయా సామదేవతలకు కూడ అధికమైన తృప్తి కలుగుతుంది. వారి అనుగ్రహంవల్ల ధన, ధాన్య, పశు, పుత్ర, కీర్తి, గ్రామ, బ్రహ్మవర్చస్సులను పొంది స్వర్గలోకాన్ని పొందుతాడు. సామగానం చేసేటప్పుడు అనుస్వారం, విసర్గం, వ్యంజనం, రేఫం, సంధులు వీటిని విడిచిపెట్టకుండా అనేకస్వరాలతో గానం చేయాలి. యాగంలో యజమాని ఉద్గాత మొదలైనవాళ్ళు మంత్రాలను శాస్త్రోక్తప్రకారం గానం చేస్తారు. అటువంటి వాళ్ళు అగ్ని, చంద్రుడు, సూర్యుడులాగా ప్రకాశిస్తూ అజ్ఞానాన్ని విడిచి పెట్టగలరు. అందువల్ల మంత్రోచ్చారణకు స్వరం చాలా ముఖ్యమైంది.

బ్రహ్మచారి, ధనదాత, ప్రియుడు, మేధావి అయి సద్గుణాలతో కూడినవాడు ఈ సామలను గానం చేయటానికి తగిన శిష్యుడు. వానికి శ్రద్ధ, దమం, జ్ఞానం, యోగం, ఆచార్యశుశ్రూష మొదలైన ఉత్తమగుణాలు ఉండాలి.

ఇలాంటి ఈ సామవిద్యను సత్పాత్రుడైన శిష్యునకు దానం చేసేవాడు మంచి గురువు. అలాంటి గురువు లక్షణాలు కూడ ఈ బ్రాహ్మణంలో విపులంగా చెప్పబడ్డాయి.

ఆచార్యభక్తిలేని శిష్యునికి విద్య నుపదేశించకూడదు. శరణాగతుడైన శిష్యుని కూడ పరీక్షించి కొద్ది కొద్దిగా ఈ బ్రహ్మవిద్య నుపదేశించాలి. గురువు చెప్పిన పనులను చేయటానికి సమర్థుడై ఉండి కూడ ఎవడు చేయడో అలాంటివానికి ఈ విద్యను చెప్పరాదు.

అర్హతలేని శిష్యునికి విద్యనేర్పితే వంశదహనాఖ్యమనే దోష మేర్పడుతుంది. అందువల్ల జ్ఞానవంతుడైన ఆచార్యుడు అపాత్రుడైన శిష్యునికి బ్రహ్మవిద్యను చెప్పకూడదు. ఎప్పుడూ ఆచార్యహితాన్ని కోరే శిష్యునికి బ్రహ్మవిద్యను చెప్పాలి. శిష్యుడు గురువు చెప్పిన మాటలను తప్పకుండా అనుసరించాలి. గురువుగా ఉన్నవాడు సచ్ఛిష్యునికి సామవిద్య నుపదేశించాలి. ఉపదేశం పొందిన శిష్యుడు వేదాన్ని గ్రహించిన తరువాత దాన్ని చక్కగా అభ్యసించి, పరిశీలించి జపంచేసి తిరిగి సత్పాత్రుడైన శిష్యునికి దానం చేయటం అనేవి వేదాధ్యయనానికి ఐదు అంగాలని దక్షస్మృతిలో వివరింప బడింది.

ఎవడు వేదోక్తప్రకారం బ్రాహ్మణమంత్రాలను ఇతరులకు ఉపదేశించి, స్వయంగా యజ్ఞం చేస్తాడో వాడు పరిపూర్ణాయుర్దాయాన్ని సమస్త శుభాలను పొందుతాడు. ఇలా ఈ సంహితోపనిషద్బ్రాహ్మణంలో వివరించబడిన అధ్యయనాధ్యాపనవిధి ధర్మాలు, ధర్మమూర్తులైన పురాణపురుషులైన వ్యాస,

నారద, కపిల, మను, కశ్యప, దత్తాత్రేయాది పరబ్రహ్మస్వరూపులైన మహర్షులచే విస్తారంగా చెప్పబడ్డాయి.

గురువు దగ్గర అధ్యయనం చేసిన శిష్యుడు; గురువుకు ఇష్టమైన దక్షిణను సమర్పించి సమస్తకోరికలను, పరిపూర్ణాయుర్దాయాన్ని పొందుతాడు.

ఈ బ్రాహ్మణాన్ని తెలుసుకోవటంవల్ల సమస్త పాపాలు నశిస్తాయి. వాళ్ళు ఇహలోకంలో భోగాలననుభవించి పరలోకంలో మోక్షసామ్రాజ్యం పొందుతారు.

**2.8.8.4 వంశబ్రాహ్మణం**

వంశబ్రాహ్మణం ద్వారా సామవేదాధ్యయనం చేసిన ఋషి పరంపర స్పష్టంగా తెలుస్తున్నది. బ్రహ్మ బ్రాహ్మణగ్రంథాలను ప్రచారం చేసిన ఋషులు, ఆచార్యులు వాళ్ళ గురుపరంపర సవిస్తరంగా ఇందులో తెలుపబడింది. ఈ బ్రాహ్మణంలో సామవేదాన్ని సమగ్రంగా అధ్యయనం చేసేవారికి; దీనిపైన ఆసక్తి కలిగించటానికి మూలపురుషులైన ఋషులు పేర్కొనబడ్డారు. సామవేదంలోని దేవతలు వాయువు, మృత్యుదేవత, విష్ణువు, వైశ్రవణుడు మొదలైనవారు. వారికి చేసిన నమస్కారంతో ఈ వంశబ్రాహ్మణం ప్రారంభమైంది. మొదటి రెండు ఖండలు అనుస్యూతంగా సామవేదవిద్యా సంప్రదాయ ప్రవర్తకులైన ఋషులు, దేవతల పేర్లు చెప్పి వారందరికి నమస్కరించటంతో సమాప్తి చెందుతున్నాయి.

అంతిమ ఖండలో సామవేదసంప్రదాయ ఋషిపరంపరలో ఆచార్యుడు మొదలు బ్రహ్మపర్యంతం గల వంశక్రమం సూచింపబడింది.

ఇలా వేదానికి శరీరభూతాలైన బ్రాహ్మణగ్రంథసమూహంలో భూతసృష్టి మొదలు యాగం, దేవతలు, యాగఫలం, యజ్ఞాధికారి, మంత్రాలు, అధ్యయనం,

అధ్యాపనం, గురుశిష్యపరంపర, ప్రాయశ్చిత్తాలు, మానుషదివ్యభోగాదులు సవిస్తరంగా ప్రతిపాదింపబడ్డాయి.

వీటిలో సారభూతమైన విషయం 'య ఏవం వేద' అనే దివ్యసూక్తి. ఈ విషయాలను తెలుసుకొన్నవాళ్ళు కూడ సమస్త ఫలాలను పొంది ఇహలోకంలో సమస్తభోగాల ననుభవించి చిరంజీవులై, చివర మోక్షసామ్రాజ్యాన్ని పొందగలరని పై సూక్తి భావం.

- కె.ఎస్.వి.

# గోపథబ్రాహ్మణం

# ఆర్ష విజ్ఞాన సర్వస్వము

## బ్రాహ్మణాలు

## 2. విశేషవిభాగం

## 2.9 గోపథబ్రాహ్మణం

### 2.9.1 పరిచయం

గోపథబ్రాహ్మణంలో బ్రాహ్మణగ్రంథలక్షణాలు పరిపూర్ణంగా ఉన్నా లేకపోయినా, అది యజ్ఞయాగాలతోపాటు ఇతర విషయాల నెన్నింటినో ప్రతిపాదించినా, అథర్వవేదానికి సంబంధించిన రచన కాదని దాన్ని ఎవరూ అనలేరు. అథర్వసంహితకు వ్యాఖ్యానరూపమైన గ్రంథమింకొకటి లేకపోవటంవల్ల గోపథం దానికి బ్రాహ్మణమని చెప్పబడింది. నిజానికి అథర్వసంహితకు దీనికి సాక్షాత్సంబంధం పెద్దగాలేదు. ఇది అర్వాచీన బ్రాహ్మణాలలో ఒకటి.

అథర్వవేదంలో నిష్ణాతుడైనవాడు యజ్ఞాలలో బ్రహ్మగా ఉండాలని బ్రహ్మ గొప్పదనం ఇందులో బాగా ప్రతిపాదించబడింది. బ్రహ్మవిధులను, ప్రాముఖ్యాన్ని ఈ బ్రాహ్మణం తప్ప ఇతర బ్రాహ్మణాలు చెప్పవు. ఇందులో

కర్మలోపంవల్ల కలిగిన దోషాన్ని వారించడానికి ప్రాయశ్చిత్తాలు చెప్పబడ్డాయి. సకలకర్మలోపాలను బ్రహ్మ పూర్తి చేస్తాడని, ఋత్విక్కులలో బ్రహ్మకుగల ఉన్నతస్థానాన్ని ఈబ్రాహ్మణం ఇలా వివరిస్తున్నది -

ప్రాయశ్చిత్తైరనుధ్యానైరనుజ్ఞానానుమంత్రణైః
హోమైశ్చ యజ్ఞ విభ్రంశం సర్వం బ్రహ్మా ప్రపూరయేత్॥

అథర్వచరణవ్యూహాన్ని బట్టి ఒకప్పుడు ఈ బ్రాహ్మణంలో నూరు ప్రపాఠకాలుండేవని తెలుస్తున్నది. ఇప్పుడు పదకొండు ప్రపాఠకాలు మాత్రమే దొరుకుతున్నాయి. పతంజలి పేర్కొన్న జగత్ప్రసిద్ధమైన అవ్యయలక్షణం ఈ బ్రాహ్మణంలోనిదే.[1]

ఓంకారస్వరూపాన్ని, ప్రతివేదబ్రహ్మచర్యాన్ని, గాయత్రీమంత్ర రూపాన్ని అర్థం చేసుకోవడానికి ఈ బ్రాహ్మణం ఎంతగానో ఉపకరిస్తున్నది.

**- ఎస్.బి.ఆర్.**

---

1. సదృశం త్రిషు లింగేషు సర్వాసు చ విభక్తిషు ।
వచనేషు చ సర్వేషు యన్నవ్యేతి తదవ్యయమ్॥ 1.8.8

### 2.9.2 విభాగం

గోపథబ్రాహ్మణం పూర్వభాగమని, ఉత్తరభాగమని రెండుగా విభజింపబడింది. పూర్వభాగంలో అయిదు ప్రపాఠకాలు, ఉత్తర భాగంలో ఆరు ప్రపాఠకాలు మొత్తం 11 ప్రపాఠకాలు ఇందులో ఉన్నాయి. ఒకప్పుడు నూరు ప్రపాఠకాలు ఈ బ్రాహ్మణంలో ఉండేవని అథర్వణపరిశిష్టం ద్వారా తెలుస్తున్నది[1]. ప్రపాఠాకాన్ని అధ్యాయమని కూడా కొందరు పిలుస్తారు. ప్రతిప్రపాఠకం మళ్లా కొన్ని కండికలుగా విభజింపబడింది. చూడండి:

| కాండ | ప్రపాఠకాలు | కండికలు | కాండ | ప్రపాఠకాలు | కండికలు |
|---|---|---|---|---|---|
| I | 1 | 39 | II | 1 | 26 |
| | 2 | 24 | | 2 | 24 |
| | 3 | 23 | | 3 | 23 |
| | 4 | 24 | | 4 | 19 |
| | 5 | 25 | | 5 | 15 |
| | | | | 6 | 16 |
| మొత్తం | | 135+ | | | 123=258 |

**విషయవిభాగం:**

పూర్వభాగంలో భగవంతుడు సృష్టిచేయాలని సంకల్పించడం, సముద్రాలు, భృగువు పుట్టడం, అథర్వమహర్షి ఉత్పత్తి, అథర్వవేదావిర్భావం, బ్రహ్మసృష్టి, ఓంకారోత్పత్తి, గాయత్రీమాహాత్మ్యం, బ్రహ్మచారిధర్మాలు, యాగాలలో బ్రహ్మస్థానం, దేవయజనం, బ్రహ్మోదనం, ఆత్రేయయజ్ఞం

1. తత్ర గోపథం శతప్రపాఠకం బ్రాహ్మణమాసీత్, తస్యావశిష్టే ద్వే బ్రాహ్మణే పూర్వముత్తరం చేతి 49.4.5.

మొ॥, ఋత్విక్కుల అర్హతలు, స్వాహాశబ్ద వ్యుత్పత్తి, యజమాని మొ॥ వారి దీక్ష, యజ్ఞయాగాదుల్లో వేద మంత్రాల ఉపయోగం మొ॥ విషయాలు చర్చింపబడ్డాయి.

ఉత్తరభాగంలో యజమాని అతిథులు, నక్షత్రోత్పత్తి, చాతుర్మాస్యయాగాలు, దేవాసురయుద్ధం, అగ్నీధ్రనియమనం, వషట్కార విశేషాలు, దక్షిణ, ఉక్థదేవతలు, షోడశినిర్వచనం, శర్వం, వాజపేయ ప్రశంస, అప్తోర్యామ ప్రశంస, సంపాతమంత్రోత్పత్తి, అహీనయాగ వైశిష్ట్యం మొ॥ విషయాలు ప్రతిపాదింపబడ్డాయి.

మొదలు - చివర:

ఈ బ్రాహ్మణం "ఓం బ్రహ్మ హ వా ఇదమగ్ర ఆసీత్" అనే మంత్రంతో మొదలై "న హ్యస్యాపరజనం భయం భవతి" అనే మంత్రంతో పూర్తవుతున్నది.

- ఎస్.బి.ఆర్.

## 2.9.3 సంకలనకాలం

దేశం:

అథర్వసంహితకు సంబంధించిన బ్రాహ్మణం గోపథబ్రాహ్మణం. ఇది మొదట్లో నూరు ప్రపాఠకాలతో ఉండేది. ప్రస్తుతం ఇందులో 89 ప్రపాఠకాలు నశించిపోయి మిగతావి మాత్రమే దొరుకుతున్నాయి. అథర్వవేదానికి సంబంధించిన శౌనకశాఖ గుజరాత్ ప్రాంతంలో దొరికింది. ఇప్పటికీ ఈ శాఖ బరోడా ప్రాంతంలో పఠనపాఠనాల్లో ప్రచారంలో ఉంది. కాబట్టి ఈ బ్రాహ్మణంకూడా ఆ ప్రాంతంలోనే ఏర్పడి ఉండవచ్చునని ఊహించడానికి అవకాశం కలుగుతున్నది. ఇందులో కొన్ని సందర్భాలను పరిశీలిస్తే, కురుపాంచాలయకు, వ్యాసకుండానికి దగ్గరవున్న ప్రాంతాల పరామర్శ చేయబడిందనిపిస్తున్నది. దాన్నిబట్టి ఈ బ్రాహ్మణం ఆప్రాంతంలో ఏర్పడి ఉండవచ్చుననే ఆలోచనకు కూడా అవకాశం ఉన్నది.

కాలం:

గోపథంలో ఐతరేయ బ్రాహ్మణంలోని వాక్యాలు కొన్ని అనువాదం చేయబడినాయి. బ్రాహ్మణకాలం చివర ఏర్పడిన బ్రాహ్మణం కావడంవల్ల ఇది బహుశ క్రీ.పూ. అయిదవ శతాబ్దంలో ఏర్పడి ఉండవచ్చునని కొందరు చరిత్రకారుల ఊహ. వైతానసూత్రానికి దీనికి గల పోలికలను దృష్టిలో ఉంచుకొని కొంతమంది విమర్శకులు ఈ బ్రాహ్మణం సూత్రకాలానికి తరువాత ఏర్పడి ఉంటుందని భావిస్తున్నారు. కాని ఇది అంత అర్వాచీనం కాదు. ఇందులో విశేషాలను పరిశీలిస్తే బ్రాహ్మణరంగంలో చివర ఏర్పడి ఉండటానికే ఎక్కువ ఆస్కారం కనబడుతున్నది.

- ఎస్.బి.ఆర్.

పరిశీలిస్తే ఆనాటివారికి శరీరతత్త్వం ఇంత బాగా తెలుసా? అని అనిపించేలా ఉంటుంది.

> పురుషుడొక్కడు. సంవత్సరం ఒక్కటి. సంవత్సరానికి అహోరాత్రాలు రెండు భాగాలు. పురుషునిలో ప్రాణాలు రెండు విధాలు. సంవత్సరానికి 24 పక్షాలు. పురుషునిలో రెండు పాదాలు. రెండు హస్తాలు. ఇరవై వేళ్ళు మొత్తం 24 (1.5.3.-6)

ఇలా పోల్చుకుంటూ ఎన్నో వైజ్ఞానిక విశేషాలను ప్రతిపాదిస్తూ ఈ బ్రాహ్మణం ఇతర బ్రాహ్మణవాఙ్మయంలో గొప్పగా ప్రసిద్ధిని సంపాదించింది.

**- ఎస్.బి.ఆర్.**

## 2.9.6 యజ్ఞయాగాలు

గోపథబ్రాహ్మణం పూర్తిగా యజ్ఞయాగాల నిరూపణంకోసం ఉద్దేశింపబడింది కాకపోయినా కొన్ని యాగాల ప్రస్తావం ఇందులో లేకపోలేదు. ఇతరబ్రాహ్మణాల్లోలాగా యాగస్వరూపం ఇందులో విస్తరంగా కనబడదు. అంతేకాక ఇతర బ్రాహ్మణాల్లో చెప్పినదాని కంటే ఆయా యాగాలను గురించి ఈ బ్రాహ్మణం చెప్పింది కూడా పెద్దగా లేదు. యాగాలకు సంబంధించిన కొన్ని విశేషాలు ఇందులో సచమత్కారంగా నిరూపింపబడ్డాయి. ఇవి ఇతర బ్రాహ్మణాల్లో అంత చక్కగా పేర్కొనబడలేదు.

ఇందులో ప్రధానంగా అగ్న్యాధేయం, అగ్నిష్టోమం, జ్యోతిష్టోమం, దర్శపూర్ణమాసలు, కామ్యేష్టులు, వాజపేయం, అప్తోర్యామం ప్రస్తావించబడ్డాయి. ఇతర బ్రాహ్మణాలకు గోపథానికి ఈయాగాల నిరూపణపద్ధతిలో తేడా స్పష్టంగా కనబడుతుంది.

**ఋత్విక్కులు :**

యాగాన్ని నిర్వహించడానికి కొందరు ఋత్విక్కులు కావాలి. యాగంలో వాళ్ళు చేయాల్సిన పనులు నియుతంగా ఉంటాయి. ప్రధానంగా 1. బ్రహ్మ, 2. ఉద్గాత, 3. హోత, 4. అధ్వర్యుడు అని ఋత్విక్కులు నలుగురు. గోపథబ్రాహ్మణం వీరికందరికీ దీక్షనిచ్చి వరించే విధానాన్ని చక్కగా వివరిస్తున్నది. ఈ నల్గురు ఋత్విక్కులకు సహాయకులు కూడా ఉంటారు. వారికందరికీ యాగప్రారంభంలో దీక్షనిస్తారు. దాన్నే ఋత్విగ్వరణం అంటారు.

1. బ్రహ్మకు-బ్రాహ్మణాచ్ఛంసి, పోత, అగ్నీధ్రుడు
2. ఉద్గాతకు-ప్రస్తోత, ప్రతిహర్త, సుబ్రహ్మణ్యుడు
3. హోతకు-మైత్రావరుణుడు, అచ్ఛావాకుడు, గ్రావస్తుత్
4. అధ్వర్యునకు-ప్రతిప్రస్థాత, నేష్ట, ఉన్నేత

} సహాయకులు

**1. అగ్న్యాధేయం (1.2.18-21):**

అగ్న్యాధేయప్రక్రియ ఇతరబ్రాహ్మణాలతో సమానమే అయినా ఇందులో కొన్ని విశేషాలు వివరించబడ్డాయి. అగ్న్యాధేయంలో లోహమయమైన గిట్టలుగల అశ్వం చాలా ముఖ్యమైంది. దీన్ని ఘోరమైన, క్రూరమైన నీటి నుంచి వేదాలు తీసుకువచ్చాయి. మూడు వేదాలు ఈ అశ్వాన్ని శాంతపరచలేక పోయాయి. చివరకు కబన్ధ ఆథర్వణుని కొడుకు విచారి అనేవాడు అథర్వవేదమంత్రాలతో దాన్ని శాంతపరుస్తాడు.

**2. అగ్నిష్టోమం (1.3.17):**

కారవులనే ఋషులు పేదవాళ్ళు. వాళ్ళు ఒకే గోవుతో చేసే అగ్నిష్టోమయాగాన్ని దర్శించారు. ఒకే గోవుతో అగ్నిష్టోమం చేసి వాళ్ళు స్వర్గాన్ని పొందేరు. స్వర్గానికి పోవాలనుకునేవాళ్ళు ఈ 'ఏకగు' అగ్నిష్టోమాన్ని చేసి స్వర్గానికి వెళ్ళవచ్చు.

**3. జ్యోతిష్టోమం (1.3.20):**

జ్యోతిష్టోమయాగానికి అర్ధసంవత్సరంతో గల సంబంధం ఈ సందర్భంలో తెలియజేయబడింది.

**4. దర్శపూర్ణమాసలు (1.3.6-10):**

ఈ బ్రాహ్మణంలో దర్శపూర్ణమాసయాగనిరూపణంలో ఒక విశిష్టత గోచరిస్తుంది. ఉద్దాలక ఆరుణి ప్రైదాయన శౌనకుల సంవాదంలో దర్శపూర్ణ మాసయాగంలో అనేక ప్రక్రియలకు మానవ శరీరంలోని అనేక అవయవాల్లో కలిగే క్రమిక వికాసానికి, ప్రత్యేకతలకు సంబంధం ఇలా తెలియజేయబడింది-

మానవులకు మొదట శిరస్సుపైన తరువాత గడ్డాలు, మీసాలు, మిగతా భాగాల్లో రోమాలు ఎందుకు ఏర్పడతాయో, ప్రాణులకు వెంట్రుకలు నెరవడం తలమించే ఎందుకు ప్రారంభమవుతుందో, పండ్లులేకుండా ఎందుకు పుట్టుతున్నారో, క్రిందిపళ్ళు ముందెందుకు వస్తున్నాయో, ఏడో ఏట లేక ఎనిమిదో ఏట ఎందుకు అవి ఊడిపోతున్నాయో, చిన్న చిన్న పండ్లు ముందెందుకు వస్తున్నాయో, పెద్దపెద్ద దంతాలు తరువాత ఎందుకు వస్తున్నాయో, పురుషులకే గడ్డాలు మీసాలు ఎందుకు వస్తున్నాయో, స్త్రీలకు ఎందుకు రావడంలేదో, ఆడవాళ్ళ శరీరాలెందుకు నిండుగా ఉంటాయో, వాళ్ళ ఎముకలెందుకు గట్టిగా ఉంటాయో, ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం దర్శపూర్ణమాసయాగస్వరూపం తెలిసిన వాడికి స్పష్టంగా తెలుస్తుంది.

ఈ సందర్భాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆనాటివారికి మానవ శరీర నిర్మాణాన్ని గురించి ఎంత చక్కటి అవగాహన ఉందో మనకు స్పష్టమవుతుంది.

### 5. కామ్యేష్టులు (2.1.13-16)

లౌకిక ఫలాలనుద్దేశించి చేసే ఇష్టులకు కామ్యేష్టులని పేరు. ఈ బ్రాహ్మణంలో అలాంటి ఇష్టులు కొన్ని నిరూపింపబడ్డాయి. 1. ప్రజ్ఞాతేష్టి 2.ఐన్ద్రాగ్నం మొదలైనవి.

తరువాత ఆగ్రయణం, అగ్నిచయనం నిరూపింపబడ్డాయి. ఇతర బ్రాహ్మణాల్లాగానే గోపథం కూడా 1. వైశ్వదేవం 2. వరుణ ప్రఘాసం 3. సాకమేధం 4. శునాసీర్యం అనే నాలుగు చాతుర్మాస్య యాగాలను (2.1.17-26) సమగ్రంగా నిరూపిస్తున్నది. ఆ తరువాత అగ్నిష్టోమయాగం సాంగంగా ప్రతిపాదింపబడింది. తనూనప్త్రం, ప్రవర్గ్య మొ॥ చక్కగా నిరూపింపబడ్డాయి. తృతీయ ప్రపాఠకంలో ఏకాహసవనాలు వివరింపబడ్డాయి.

ఈ బ్రాహ్మణంలో చివఱ అతిరాత్రం, సౌత్రామణి, వాజపేయం, అప్తోర్యామం, అనైకాహికం, ఆరంభణీయం మొదలైన యాగాలు ఇతర బ్రాహ్మణాల్లోవలె విపులీకరించబడినాయి. వీటిల్లో చెప్పదగ్గ విశేషాలేవి లేవు.

యాగాలలో మధ్యమధ్య వచ్చే కర్మలోపాలకు చేయాల్సిన ప్రాయశ్చిత్తాలను నిరూపించడం ఈ బ్రాహ్మణం ప్రత్యేకత. అథర్వవేదంలో నిపుణుడైన బ్రహ్మప్రత్యేకతను తెలియజేస్తూ యజ్ఞసంబంధాన్ని వివరిస్తూ ఈ బ్రాహ్మణం అథర్వబ్రాహ్మణంగా ప్రసిద్ధిని పొందింది.

- ఎస్.బి.ఎల్.ఎన్.

### 2.9.7 వైశిష్ట్యం

అథర్వవేదానికి చెందిన బ్రాహ్మణాలలో మనకిప్పుడు లభించేది గోపథబ్రాహ్మణం మాత్రమే. ఇది శౌనకశాఖకు చెందింది. అథర్వవేదానికి కూడా ఎన్నో బ్రాహ్మణాలు ఉండి ఉంటాయి, కాని గోపథబ్రాహ్మణం మాత్రమే మనకిప్పుడు అథర్వబ్రాహ్మణంగా మిగిలింది. దీనిలో వాడబడిన భాష మిగత వేదాలలోని భాషవంటిదే. ఇక్కడ కూడ ఆర్షప్రయోగాలు, వ్యాకరణానికి లొంగని ప్రయోగాలు, కృత్రిమమైన భాష ఉన్నాయి. ఋగ్వేదంనుంచి ఉదాహరించబడిన మంత్రాలు, శ్లోకాలు, తప్ప దీనిలోని విషయమంతా వచనంలోనే వ్రాయబడి ఉన్నది. భాషలోను, విషయంలోను దీనికి ఐతరేయబ్రాహ్మణానికి పోలిక ఉంది. దీనిలో చెప్పబడిన కొన్ని విషయాలు గహనంగా, అసమగ్రంగా, అసంపూర్ణంగా ఉన్నాయి. మిగిలిన బ్రాహ్మణాలను చదివినవారే దీనిలోని విషయాన్ని అర్థం చేసుకోగలుగుతారు. దీనిలో కూడా ఇతర బ్రాహ్మణాలలోలాగా కల్పితగాథలు, నీతికథలు, ఐతిహాసికకథలు చోటుచేసుకొన్నాయి. ఈ క్రింది అంశాలలో గోపథబ్రాహ్మణ వైశిష్ట్యం మనకు గోచరిస్తుంది.

**ప్రపంచసృష్టి:**

ఇది మరే వేదంలోను లేనంత విస్తారంగా వర్ణించబడింది. పరబ్రహ్మ ఆదిలో తానొకడే ఉండేవాడు. తనవంటి మరొకదైవాన్ని సృష్టించదలచి తపస్సు చేసి తన దేహంలో వేడి పుట్టించి ఫాలభాగం నుంచి స్వేదం (చెమట) కార్చాడు. స్వేదానికే సువేదం (జ్ఞానం) అనిపేరు. దీనివల్ల ఆయనకు అంతా గోచరమవుతుంది, అర్థమవుతుంది. మరింత తపస్సు చేయడంవల్ల ఆయన రోమకూపాల నుంచి స్వేదం ధారలుగా ప్రవహించింది. ఆ స్వేదధారలతో ప్రపంచాన్నంతటినీ సృష్టించి, ధరించి పాలించదలచాడు. వెంటనే స్వేదధారలలో

తొంగి చూడగా ఆయునకు తన ప్రతిబింబం కన్పించింది. అంతలో ఆయున రేతస్సు ఆ స్వేదంలో పడింది. స్వేదంలో వేడిపుట్టించి దాన్ని రెండు భాగాలుగా విభజించాడు. అందులో ఒకటి త్రాగడానికి వీలులేని లవణమయమైన సముద్రం. మరొకటి త్రాగడానికి వీలుపడే తియ్యని నీరు. పరబ్రహ్మ తియ్యనినీటిలో వేడిపుట్టించగా అందులో ఇంతకుమునుపే పడిన పరబ్రహ్మయొక్క రేతస్సు ఎండిపోయి దానినుంచి భృగువనేఋషి జన్మించాడు. వెంటనే పరబ్రహ్మ అదృశ్యమయ్యాడు.

అన్ని దిక్కులలోను పరబ్రహ్మను వెదకడానికి భృగువు బయలుదేరాడు. కాని ఆ ఋషి ప్రయత్నాలు ఫలించలేదు. ఆయున తూర్పు దిక్కులో చూడగా 'వాయువు' అని, దక్షిణదిక్కులో 'మాతరిశ్వ' అని, పశ్చిమదిక్కులో 'పవమానం' అని, ఉత్తరదిక్కులో 'వాతం' అని అశరీరవాణి పలికి 'క్రింద నీటిలో చూడు' అని ఆదేశించింది. నీటిలో క్రిందికి చూడడంవల్ల నోటినుంచి అథర్వుడు అనే ఋషి పుట్టాడు. క్రిందనుంచి పుట్టినవాడు కాబట్టి ఆయునకు అథర్వుడని పేరు. ఆయున దేహం బ్రహ్మదేహంలాగా తేజోవంతంగా ఉండేది. ఆయునకే సృష్టికార్యం జరిపే ప్రజాపతి అని పేరు.

పరబ్రహ్మ అథర్వుని దేహాన్ని తపింపచేసి వేడెక్కించడంవల్ల అథర్వుని దేహంనుంచి ఏకర్చ, ద్వ్యర్చ, త్ర్యర్చ, చతుఋచ, పంచర్చ, షడర్చ, సప్తర్చ, అష్టర్చ, నవర్చ, దశర్చులనే పదిమంది అథర్వణ ఋషులు పుట్టారు. వీరినుంచి ఏకాదశర్చ, ద్వాదశర్చ, త్రయోదశర్చ, చతుర్దశర్చ, పంచదశర్చ, షోడశర్చ, సప్తదశర్చ, త్రయోదశర్చ, చతుర్దశర్చ, పంచదశర్చ, షోడశర్చ, సప్తదశర్చ, అష్టదశర్చ, ఏకోనవింశర్చ, వింశత్యర్చులనే పదిమంది అథర్వణఋషులు తిరిగి పుట్టారు. అథర్వణుడు, అథర్వణఋషులు దర్శించిన మంత్రాలకే అథర్వవేదమని పేరు. దీనినుంచి ఓంకారం పుట్టింది.

తరువాత పరబ్రహ్మనుంచి భూమి, అంతరిక్షం, స్వర్గం అనే మూడు లోకాలు పుట్టాయి. ఆయన తన పాదం నుంచి భూమిని, ఉదరం నుంచి అంతరిక్షాన్ని, తలనుంచి స్వర్గాన్ని సృష్టించాడు. అదే విధంగా భూమినుంచి అగ్నిని, అంతరిక్షంనుంచి వాయువును, స్వర్గం నుంచి ఆదిత్యుని సృష్టించాడు. ఈ ముగ్గురు దేవతలనుంచి క్రమంగా అంటే అగ్నివలన ఋగ్వేదం, వాయువువలన యజుర్వేదం, ఆదిత్యుని వలన సామవేదం వెలసినాయి. ఋగ్వేదంనుంచి 'భూః' అనే వ్యాహృతి, యజుర్వేదంనుంచి 'భువః' అనే వ్యాహృతి, సామవేదం నుంచి 'స్వః' అనే వ్యాహృతి పుట్టాయి.

పిమ్మట ఉప్పునీటినుంచి సముద్రం పుట్టింది. సముద్రజలాలు నాలుగు దిక్కులలోను ప్రవహించి తమను అధిపతిగా ఒకదేవుని కోరుకున్నాయి. ఆ విధంగా వరింపబడినవాడే వరుణుడు, వరుణుడు సముద్రాలకు అధిదేవత. వరుణుని నుంచి పుట్టినవాడు ముచ్యుడు. ఇతనికే మృత్యువని పేరు (1.1.7). ఇతని దేహంనుంచి రసాలు కారాయి. ఈ రసాలనుంచి పుట్టినవారే ఆంగీరసఋషులు అని పేరు.

ఈ విధంగా అథర్వాంగిరసులు, భృగ్వాంగిరసులు జన్మించారు. ఆంగీరసులవల్ల దర్శింపబడిన వేదానికి ఆంగీరసవేదమని పేరు. దీని నుంచి 'జనత్' అనే వ్యాహృతి పుట్టింది. అప్పుడు పరబ్రహ్మ తూర్పు దిక్కునుంచి సర్పవేదాన్ని, దక్షిణదిక్కునుంచి పిశాచవేదాన్ని, పశ్చిమ దిక్కునుంచి అసురవేదాన్ని, ఉత్తర దిక్కునుంచి ఇతిహాసవేదాన్ని ఊర్ధ్వ అధోదిక్కులనుంచి పురాణవేదాన్ని సృష్టించాడు. సర్పవేదం నుంచి 'వృథత్', పిశాచవేదం నుంచి 'కరత్', అసురవేదం నుంచి 'గుహాన్' ఇతిహాస వేదంనుంచి 'మహాత్', పురాణ వేదంనుంచి 'తత్' అనే వ్యాహృతులను సృష్టించాడు. తరువాత చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, వృక్షాలు మొ॥ వాటిని సృష్టించాడు.

ఆ తరువాత పరబ్రహ్మ ఒక యజ్ఞాన్ని చేసి దానిలో అగ్నిని హోతగాను, వాయువును అధ్వర్యువుగాను, సూర్యుణ్ణి ఉద్గాతగాను, చంద్రుణ్ణి బ్రహ్మగాను, పర్జన్యుణ్ణి సదస్యునిగాను, ఓషధులను, వృక్షాలను చమస్సులు (యజ్ఞంలో నెయ్యి వేయడానికి వాడే చెక్క గరిటెలవంటివి) గాను, విశ్వేదేవతలను హోతలుగాను, అథర్వాంగిరసులను గోప్తలుగాను నియమించాడు. గోప్తలు యజ్ఞంలో జరిగే లోపాలను సవరిస్తారు. ఈ విధంగా గోపథబ్రాహ్మణంలో అథర్వవేదం పుట్టుక, దాని ప్రాముఖ్యం, అథర్వాంగిరసుల ప్రాశస్త్యం విశిష్టమైన పద్ధతిలో వివరింపబడింది.

ప్రణవం:

పరబ్రహ్మ బ్రహ్మదేవుణ్ణి ఒక తామరాకుపై సృష్టించాడు. తన కోర్కెలను, లోకాలను, దేవతలను, వేదాలను, యజ్ఞాలను, శబ్దాలను భూతాలను, స్థావరజంగమాలను ఎలా ఏకాక్షరంవల్ల తెలుసుకోగలుగుతానని ఆలోచించి బ్రహ్మచర్యాన్ని పాటించి చివరకు 'ఓం' అనే ప్రణవాన్ని కనుగొన్నాడు. ఓంకారంలో రెండు వర్ణాలు నాలుగు మాత్రలు ఉన్నాయి. ఇది సర్వవ్యాపి. మార్పులేనిది బ్రాహ్మమయం. దీనినుంచే కోరిన వస్తువులు, సమస్తలోకాలు, దేవతలు, యజ్ఞాలు, శబ్దాలు, స్థావరజంగమాత్మకమైన భూతాలు పుట్టాయి (1.1.16-30).

దీని మొదటి అక్షరంనుంచి స్వర్గం, రెండవ అక్షరంనుంచి తేజస్సు, వెలుగు పుట్టాయి. ఓంకారంలోని మొదటి స్వరమాత్రనుంచి భూమి, అగ్ని, ఓషధులు, వృక్షాలు, భూః అనే వ్యాహృతి, గాయత్రి ఛందస్సు మూడు విధాలైన స్తోమాలు, తూర్పుదిక్కు, వసంతఋతువు, వాక్కు, నాలుక సృష్టింపబడ్డాయి. దాని రెండవ స్వరమాత్రనుంచి అంతరిక్షం, వాయువు, యజుర్వేదం, భువమనే వ్యాహృతి, త్రిష్టుప్ ఛందస్సు, పదిహేను విధాలైన స్తోమాలు, పశ్చిమదిక్కు

గ్రీష్మ ఋతువు, ఉచ్ఛ్వాసనిశ్వాసాలకుపయోగించే అవయవాలు నిర్మించబడ్డాయి. మూడవ స్వరమాత్రనుంచి స్వర్గం, సూర్యుడు, సామవేదం, 'స్వః' అనే వ్యాహృతి, జగతీచ్ఛందస్సు, ఉత్తరదిక్కు, వర్షఋతువు, కళ్లు మొ॥ సృష్టించబడ్డాయి. దాని 'వ' కార మాత్రనుంచి నీరు, చంద్రుడు, అథర్వవేదం, నక్షత్రాలు, అంగిరసులు, అనుష్టుప్ ఛందస్సు, దక్షిణదిక్కు, శరదృతువు, మనస్సు మొ॥ పుట్టాయి. దాని 'మ' కార మాత్రనుంచి ఇతిహాసపురాణాలు, వాక్కు, ఛందోయుక్తమైన భాష, ఉపనిషత్తులు, 'వృధత్' 'కరత్' 'గుహాన్' 'మహత్' 'తత్' 'శం' 'ఓం' అనే వ్యాహృతులు, నృత్యం, గానం, చైత్రరథ దేవతలు, తేజస్సు, వెలుతురు, ఊర్ధ్వదిక్కు, అధోదిక్కు, హేమంత శిశిరఋతువులు సృష్టించబడ్డాయి.

ఓంకార సహాయంతోనే దేవతలు అసురులను జయించారు. ఓంకారమే అన్ని వేదాలకు మూలం, ప్రపంచానికంతటికీ ఆధారం. ఈ విధంగా దిక్కులు, ఛందస్సు, పంచభూతాలు, వేదాలు, ఋతువులు, సూర్యచంద్రులు, ఇతిహాసపురాణాలు మొ॥ ఓంకారం నుంచి పుట్టాయని చెప్పడమే గోపథబ్రాహ్మణంలోని విశిష్టాంశాలలో ఒకటి.

**గాయత్రీమంత్రం:**

గాయత్రిని మించిన మంత్రం లేదంటారు. "ఓం భూర్భువ స్సువః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్" అనేది గాయత్రీ (సావిత్రి) మంత్రం. గాయత్రీమంత్రతత్త్వం గ్లావుడు, మౌద్గల్యుడు అనే ఇద్దరు ఋషులకు జరిగిన సంభాషణ రూపంలో వివరించబడింది (1.1.31-38). మైత్రేయవంశంలో పుట్టిన గ్లావుడు మౌద్గల్యునికి వేదాలు, వాటి అర్థం తెలియవని నిందించాడు. అందుకు మౌద్గల్యుడు సకలవేదసారం, సకల ఆధారమైన గాయత్రీమంత్రంయొక్క తత్త్వం నీకు

తెలుసా? అని శిష్యునిద్వారా ప్రశ్నించాడు. ఈ మంత్రతత్త్వం తనకు తెలియదని, మౌద్గల్యుని తూలనాడినందుకు ఆయనకు క్షమాపణ చెప్పుకొని గాయత్రీమంత్రతత్త్వాన్ని ఉపదేశించమని ప్రార్థించాడు. మౌద్గల్యుడు ఈ విధంగా గాయత్రిని గురించి చెప్పాడు.

"వేదాలు, ఛందస్సు సవిత (సూర్యుని) యొక్క వరేణ్యమైన (శ్రేష్ఠమైన) భాగాలు. అన్నం ఆయనయొక్క ప్రకాశం. 'ధియః' అంటే విధులు (లేక కర్మలు). వీటివల్లనే ఆయన లోకమంతా సంచరిస్తాడు. మనస్సు సవిత, వాక్కు సావిత్రి. మనస్సు ఉన్నచోట వాక్కు, వాక్కు ఉన్నచోట మనస్సు ఉంటుంది. అగ్నియే సావిత్రి, పృథ్వి సావిత్రి, అగ్ని ఆదిత్యుడు, వేదాలు ఛందస్సు యజ్ఞం, దక్షిణ - ఇంతెందుకు? సమస్త ప్రపంచం సావిత్రి. ఈ మంత్రతత్త్వాన్ని తెలుసుకొన్నవాడు సర్వపాపవిముక్తుడై సుఖసంతోషాలను పొందుతాడు."

ఇంత విపులంగా మరెక్కడా లేనంత దీర్ఘంగా గాయత్రీ మంత్రతత్త్వాన్ని తెలియజేయడం గోపథబ్రాహ్మణంలోని మరొక విశిష్టత.

ఋక్-సామల సంబంధం:

ఉత్తరభాగంలోని తృతీయ ప్రపాఠకంలో ఈ విషయం చెప్పబడింది. ఆదిలో ఋక్, సామలు మాత్రమే ఉండేవి. ఋక్కుకు 'సా' అని, సామకు 'అమ' అని పేరు. (స్త్రీ లింగలో ఉన్న) ఋక్ (పుంలింగంలో ఉండే) సామతో 'జీవరాసుల వృద్ధి చేయడానికి మనం కలుసుకుందాం' అని చెప్పింది. కాని సామ అందుకు ఒప్పుకోక ఋగ్ కన్న తనే గొప్ప అని పలికింది. దానితో కోపించిన ఋక్ తానే రెండు భాగాలుగా విడిపోయి మొదటిభాగం రెండవభాగంతో మాట్లాడింది. కాని అది పలుకలేదు. అప్పుడు తను మూడు భాగాలుగా విడిపోయి సామను తిరిగి పలుకరించింది. కాబట్టి సామ మూడు

ఋక్కులచేత కీర్తింపబడుతూ ఉంటుంది. ఈ సంభాషణ అంతా 'సా' 'మ' ల మధ్య జరిగింది కాబట్టి దానినుంచే సామవేదం పుట్టింది. ఈ విధంగా ఋక్, సామలకుమధ్య ఉండే సంబంధాన్ని వివరించడమే గోపథబ్రాహ్మణంలోని మరొక విశిష్టాంశం (2.3.20).

ప్రపంచసృష్టిక్రమాన్ని వివరంగా తెలుసుకోవడానికి: ఓంకారం సర్వప్రపంచానికి ఆధారమని తెలుసుకోవడానికి, సర్వవేదసారమైన గాయత్రీ మంత్రతత్త్వాన్ని అర్థం చేసుకోవడానికి, సామవేదోత్పత్తిని గురించి తెలుసుకోవడానికి అథర్వవేదోత్పత్తి, దాని ప్రాముఖ్యం, యజ్ఞంలో అథర్వాంగిరసుల ప్రాముఖ్యం-మొదలైన వాటిని తెలుసుకోవడానికి గోపథబ్రాహ్మణం ఎంతగానో ఉపకరిస్తుంది. ఇదే ఈ బ్రాహ్మణంలోని వైశిష్ట్యం.

- కె.ఎస్.ఆర్.

## 2.9.8 సంగ్రహసమీక్ష

గోపథం అథర్వవేదానికి సంబంధించిన బ్రాహ్మణం. గోపథానికి అథర్వసంహితతో సంబంధం లేదు. అయినా అథర్వాదుల ఉత్పత్తిని, అథర్వాంగిరస్సంహితోత్పత్తిని యాగస్వరూపాన్ని తెలుపుతోంది; గనుక ఇది అథర్వసంబంధమైన బ్రాహ్మణం అయింది. యజ్ఞాలలో హోత, ఉద్గాత, అధ్వర్యు, బ్రహ్మలు ఉంటారు. అందులో బ్రహ్మ యొక్క కృత్యాలను గోపథబ్రాహ్మణం తెలుపుతుంది. అందుకే దీన్ని 'బ్రహ్మవేద' మని కూడ అంటారు. మిగిలిన మూడు వేదాలకు సంబంధించినవారు చేయలేని పనిని అథర్వణుడు చేసిచూపుతాడు. కనుక యజ్ఞంలో ఇతడు ప్రముఖుడు. బ్రహ్మ చతుర్ముఖుడు. ఇతడు నాలుగు వేదాలు చదివినవాడుగా ఉంటాడు. అథర్వవేద ప్రముఖుడైన బ్రహ్మ యజ్ఞంలో ప్రముఖుడు.

నిర్వచనం:

'గమ్' ధాతువుకు 'డో' ప్రత్యయం చేరిస్తే గో శబ్ద మేర్పడుతుంది. గో శబ్దానికి పొందదగిన పదార్థం అని అర్థం. పొందదగింది వేదవాణి, పృథివీరాజ్యం, స్వర్గసుఖం. వీటిని పొందే మార్గాన్ని తెలిపే బ్రాహ్మణం కాబట్టి ఇది గోపథమని పిలువబడుతోంది. ఈ బ్రాహ్మణంవల్ల వేదజ్ఞానం పొందటం, రాజ్యవ్యవహారాలు నడపటం పరమసుఖాన్ని పొందటం అనే పురుషార్థాలు కలుగుతాయి.

ఐతిహ్యం:

పూర్వం వైదికయుగంలో 'పణి' అనే కొండజాతి వాళ్ళు బ్రాహ్మణుల ఆవులను దొంగిలించి కొండగుహల్లో దాచి ఉంచారట. 'సరమ' అనే ఇంద్రుని కుక్క, ఆవుల కోసం వెదుకుతూ బయలుదేరిందట. దుర్గమారణ్యాలను,

నదీనదాలను దాటుకొంటూ నిర్జనారణ్యాలలో వెళ్లివెళ్లి చివరకు ఆవులను దాచిన ప్రదేశాన్ని కనుగొన్నదట. వెంటనే ఈ విషయాన్ని ఇంద్రునికి తెలిపింది. ఇంద్రుడు దండెత్తి వెళ్ళి పణిజాతివారి బలాన్ని ఛేదించి ఆవులను విడిపించాడు. అంగిరసులు ఈ పనిలో ఇంద్రునికి సహాయపడ్డారు. అందుకే దీనికి గోపథబ్రాహ్మణం అని పేరు వచ్చింది. గోవుల అడుగుజాడలను అంగిరసులు తెలుసుకొన్నారు. గనుక ఇది అథర్వాంగిరసుల బ్రాహ్మణమైంది. ఇది నేటి అపరాధ పరిశోధనా పద్ధతులను తెలుపుతోంది. పోలీసు కుక్కల సహాయంతోను, అడుగుజాడలను, వేలిముద్రలను బట్టి నేరస్థులను పట్టుకోవడం నేడు మనం వింటున్నాం గదా! అదే వైదికయుగంలో జరిగినట్లు దీనివల్ల తెలుస్తున్నది.

గోపథబ్రాహ్మణంలో యజ్ఞప్రక్రియలు ప్రతిపాదింపబడ్డాయి. అథర్వవేదంలో ఆధివ్యాధుల నివారణ, వ్యాధుల ఉపశమనానికి ఔషధాదులు మున్నగు విషయాలు చెప్పబడినప్పటికీ ఆ విషయాలు గోపథబ్రాహ్మణంలో లేవు. దానికి కారణం యజ్ఞప్రక్రియలే బ్రాహ్మణాల ముఖ్య విషయాలు. యజ్ఞంవల్ల ఆత్మోన్నతి, దానివల్ల పురుషార్థమూ పెరుగుతుంది. దానివల్ల అన్నం, సంతతి, పశువృద్ధి, స్వర్గమూ కలిగే విధానాలు ఇందులో వివరింపబడ్డాయి.

ప్రతిపాద్యం:

పూర్వభాగంలో 'ఓం' అనే ప్రణవస్వరూపమహిమ, గాయత్రీ మంత్రవివరణ, బ్రహ్మచారి కర్తవ్యం, పుత్రేష్టి మొ॥ యజ్ఞాల విధానం సంవత్సరం మొ॥ కాలనిర్ణయం, రాజసూయాది యజ్ఞవిషయాలు స్థూలంగా చెప్పబడ్డాయి. ఉత్తరభాగంలో దర్శపూర్ణమాసం మొ॥ చిన్నయాగాలతోపాటు అగ్నిష్టోమాది యజ్ఞవిషయాలు, వషట్ అనువషట్ కారవివరణ అనేకాలైన యజ్ఞాలు, వాటిని నిర్వహించే విధానం చెప్పబడింది. జ్యోతిష, ఖగోళ విషయాలు కూడ వివరింపబడ్డాయి.

మర్మగర్భ వివరణలు:

కొన్ని పదాల వివరణ ఎంతో రమ్యంగా చెప్పబడింది.

1. సు వేద పదమే స్వేదం అయిందట. సు వేద అంటే బాగా వేదం చదవటం. వేదం గట్టిగా చదివి కంఠస్థం కావాలంటే చెమట పట్టేటట్లుగా చదవాలి. కాబట్టే ఈ సువేద పదం స్వేదంగా మారిందని వివరణ ఇవ్వబడింది (1.1.1).

2. రథం రసశబ్దం నుంచి వచ్చిందట. రసపూర్ణం అంటే ఆనందపూర్ణంగా ఉండటం. దీనివల్ల రథమనే సంజ్ఞను పొందిందని వివరణ (1.2.21).

3. 'దీక్షిత' పదం 'ధీక్షిత' పదంనుంచి వచ్చిందట. శ్రేష్ఠమైన బుద్ధిని పొందేవాడు ధీక్షితుడు. అదే 'దీక్షిత'గా మారింది. అందుచేతనే అతడు పెద్దలచే నమస్కరింపదగినవాడవుతాడు (1.3.19).

4. 'మఖ' శబ్దం యజ్ఞార్థకం. 'ఖ' అంటే ఛిద్రాలు, దోషాలు, అపరిశుభ్రంగా ఉండటం. 'మ' అంటే అది నిషేధింపబడేది. దోషాలు లేనిదిగా యజ్ఞం ఉండాలి. ఈ శబ్దంద్వారా యజ్ఞకర్మలలో ఏ దోషంగాని, పొరపాటుగాని ఉండకూడదని తెలుపబడింది (2.2.5).

5. 'సామ' శబ్దానికి లక్ష్మీ సంబంధమైన జ్ఞానమని అర్థం చెప్పబడింది. 'సా' అంటే లక్ష్మి. 'అమ' అంటే జ్ఞానం (2.3.20).

6. అథర్వవేదంలో కుంతాపసూక్తం ప్రసిద్ధం. 'కు' అంటే చెడు. 'తాప' అంటే తపింపచేయడం. చెడును నశింపచేసే సూక్తమని వివరణ ఇవ్వబడింది (2.6.12)

సుభాషితాలు :

1. దేవతలు పరోక్షప్రియులు, ప్రత్యక్షద్వేషులు. ఇది ఈశ్వరుని అచింత్యశక్తిని వర్ణించే సందర్భంలోనిది. ఈశ్వరుడు పరోక్షంగా ఉన్నా ఇష్టుడు. ఈ భౌతిక జగత్తు ప్రత్యక్షంగా ఉన్నా ద్వేషించదగింది. ఇది అశాశ్వతం కనుక. ఈ విషయమే దీనిలో వివరించబడింది (1.1.1)

2. యజ్ఞకర్మలలో ఋత్విజులు అసమర్థులు గాను, బ్రహ్మచర్యదీక్ష లేనివారుగాను, రాగద్వేషాలు కలవారుగాను ఉంటే ఆ యజ్ఞం నాశనమవుతుంది. ఋత్విజులు సదాచారులుగా ఉండాలని దీని భావం (1.1.13)

3. మట్టిబెడ్డలు కుండలో వేస్తే అవి ఇటు శౌచకర్మకూ పనికిరావు, అటు ధాన్యోత్పత్తికీ పనికిరావు. బాగా ఉపయోగపడే వస్తువునైనా తగనిస్థానంలో ఉంచితే అది నిష్ప్రయోజనం (1.2.23)

4. యాజకుడు తేజస్వి, సత్యవాది, వ్రతనిష్ఠుడుగా ఉండాలి. అతడు మంచివాడు కాకపోతే పచ్చికుండలో నీళ్ళు పోసినప్పుడు అది విచ్చిపోయి నీరు కారిపోయినట్లుగా యజమాని ప్రయోజనాలన్నీ నశిస్తాయి (1.4.13)

5. తల్లిదండ్రులు చిన్నతనంలో కుమారుణ్ణి పోషిస్తారు. అతడు పెద్దవాడై తల్లిదండ్రులను పోషించాలి. ఈ విషయం తెలిస్తే ఇదే నిజమైన యజ్ఞం. తల్లిదండ్రుల సేవే నిజమైన శ్రాద్ధం, తర్పణం కూడా. బ్రతికి ఉండగా సరిగా చూడకుండా చనిపోయిన తరువాత శ్రాద్ధాదులు చేసినా అది నిష్ప్రయోజనమని దీని తాత్పర్యం (1.4.17).

6. జరిగిపోయిన కాలం పరిమితం. రాబోయే కాలం అపరిమితం, గతంలో చెడు చేసినంత మాత్రాన క్రుంగిపోనవసరం లేదనీ, భవిష్యత్తు

అనంతం కనుక మంచిని చేసి ఆదోషం పోగొట్టుకోవచ్చునని, నిరాశ చెందనక్కరలేదనీ దీనివల్ల తెలిపినట్లయింది (2.5.3)

ఈ విధంగా అన్ని కాలాల్లోను ఉపయోగపడే చాలా సుభాషితాలు ఇందులో పొందుపరచబడ్డాయి.

పూర్వబ్రాహ్మణం:

ఇందులో మొదట బ్రహ్మ ఈ చరాచరసృష్టిని చేసిన విధానం తెలుపబడింది. 'ఓం' యొక్క మహిమ తెలుపబడింది.

ఇందులో నాలుగు మాత్రలుగల రెండు అక్షరాలున్నాయి. సృష్టి అంతా 'ఓం' నుంచే వచ్చింది. 'ఓం' బ్రహ్మ విష్ణురుద్రాత్మకం. దీన్ని వెయ్యిసార్లు జపిస్తే అన్ని కోరికలు సిద్ధిస్తాయి. ప్రతిగ్రంథాన్నీ ముందు 'ఓం' తో ప్రారంభిస్తే మంచి ఫలితాలు కలుగుతాయని తెలుపబడింది. తరువాత గాయత్రీమంత్రాన్ని గురించి తెలుపబడింది. దీనిని ఉపాసనచేస్తే తనకు, తన సంతతికి కూడ దృఢత్వం కలుగుతుంది. తరువాత బ్రహ్మచారిని గురించిన వివరణ ఉంది. అతడు నియమనిష్ఠలతో గురుశుశ్రూష చేసి పంచాగ్నులను వశం చేసుకోవాలి. గృహిణి అతనికి భిక్ష పెట్టాలి. భిక్ష పెట్టకపోతే సకల పుణ్యాలు నశిస్తాయి. యజ్ఞాల్లో యజమాని, ఋత్విజుల ధర్మాలు తెలుపబడ్డాయి. మాంసభక్షణ చేయరాదని చెప్పబడింది. విపాట్‌నది ఒడ్డున వశిష్ఠాశ్రమం,ఇలానే ఇతరాశ్రమాలు, కొన్ని ప్రాచీన రాజ్యాలు తెలుపబడ్డాయి.

ఉత్తరబ్రాహ్మణం:

ఇందులో దర్శపూర్ణమాసం మొ॥ చిన్నయాగాలతోపాటు, అగ్నిష్టోమం మొ॥ పెద్ద పెద్ద యజ్ఞాలు కూడా వివరించబడ్డాయి. ఖగోళ, జ్యోతిష

సంబంధమైన విషయాలు చెప్పబడ్డాయి. చిత్రాది నక్షత్రాలు పూర్ణిమనాడు చంద్రునితో కలిసే చైత్రాదిమాసాలుగా పేర్కొనబడతాయని తెలుపబడింది. ఫాల్గుణ పూర్ణిమనుంచి సంవత్సరం ఆరంభం అని పేర్కొనబడింది (2.1.19). ఉత్తరాయణ దక్షిణాయన విభాగం పేర్కొనబడింది (2.6.6). భూమి గోళాకారంగా తిరుగుతోందనీ, సూర్యుడు ఎప్పుడూ చాటుకాదనీ, తిరుగుతూ ఉండే భూమి అంచున సూర్యకాంతి పడుతుందనీ చెప్పబడింది. ఈ విధంగా ఖగోళ విషయాలు కొన్ని ఉట్టంకించబడ్డాయి.

- యు.వి.ఆర్.

## అధ్యేయ గ్రంథసూచి

**అథర్వవేద మే సాంస్కృతికతత్త్వ (అ.సాం.)**
రాజా ఛత్రమిశ్ర
పంచనద పబ్లికేషన్స్, ఇలాహాబాద్, 1968.

**ఆపస్తంబ శ్రౌతసూత్రమ్ (ఆప.శ్రౌ.సూ.)**
చిన్నస్వామిశాస్త్రి
ఓరియంటల్ ఇన్స్టిట్యూట్, బరోడా, 1955.

**ఋగ్భాష్యభూమికా (ఋక్.భా.భూ.)**
బలదేవ ఉపాధ్యాయ
చౌఖంబా సాంస్క్రిట్ సిరీస్. వారాణసి, 1958.

**ఐతరేయ ఆరణ్యకమ్ (ఐ.ఆ.)**
హరినారాయణ ఆప్టే
ఆనందాశ్రమప్రెస్, పూనా, 1820.

**ఐతరేయబ్రాహ్మణమ్ (ఐ.బ్రా.).**
ఏ.ఎస్.కాశీనాథశాస్త్రి
ఆనందాశ్రమ సాంస్క్రిట్ గ్రంథావళి, పూనా, 1977.

**కౌషీతకి బ్రాహ్మణమ్ (కౌ.బ్రా.)**
ఇ.ఆర్.శ్రీకృష్ణశర్మ
Franz Steiner Verlag Gmbh, Wiesbaden, 1968.

**గోపథబ్రాహ్మణమ్ (గో.బ్రా.)**
రాజేంద్రలాల్ మిత్ర
ఇండోలాజికల్ బుక్‌హౌస్. ఢిల్లీ, 1972.

ఛాందోగ్యబ్రాహ్మణమ్ (ఛా.బ్రా.)
దుర్గామోహన్ భట్టాచార్య
కలకత్తా సంస్కృత కాలేజ్ రిసెర్చ్ సిరీస్, 1958.

తలవకార బ్రాహ్మణమ్ (త.బ్రా.)
(జైమినీయ బ్రాహ్మణమ్)
ప్రొ. రఘువీర, లోకేశచంద్ర
నాగపూర్, 1954.

తాండ్యమహాబ్రాహ్మణమ్ (తా.బ్రా.)
చిన్నస్వామిశాస్త్రి
చౌఖంబా సంస్కృత సిరీస్, వారాణసి, 1935.

తైత్తిరీయబ్రాహ్మణమ్ (3 Vols) (తై.బ్రా.)
గోడ్‌బోలె నారాయణశాస్త్రి, వినాయకగణేశ ఆప్టే
ఆనందాశ్రమముద్రణాలయం. పూనా. 1934-1988.

తైత్తిరీయోపనిషత్ (తై.ఉ.)
వాసుదేవశర్మ
నిర్ణయసాగరముద్రణాలయం, బొంబాయి, 1925.

దేవతాధ్యాయబ్రాహ్మణమ్ (దే.బ్రా.)
బి.ఆర్. శర్మ
కేంద్రీయ సంస్కృత విద్యాపీఠమ్, తిరుపతి, 1965.

నిరుక్తమ్ (ని.)
లక్ష్మణ్ సరూప్
మోతీలాల్ బనారసీదాస్, న్యూఢిల్లీ, 1967.

ప్రపంచహృదయం (ప్ర.హృ.)
టి.గణపతిశాస్త్రి
త్రివేంద్రం. 1915.

బృహదారణ్యకోపనిషత్ (బృహ.)
వాసుదేవశర్మ
నిర్ణయసాగరముద్రణాలయం, బొంబాయి, 1925.

భారతవర్షీయ ప్రాచీన చరిత్రకోశ్ (భా.ప్రా.చ.)
సిద్ధేశ్వరశాస్త్రి చిత్రావ్
భారతీయ చరిత్ర కోశమండల్, పూనా, 1964.

మహాభాష్యమ్ (మహా.)
జయకృష్ణదాస్, హరిదాస్‌గుప్త
చౌఖంబా సంస్కృత సీరిస్ ఆఫీస్, బెనారస్, 1854.

వంశబ్రాహ్మణమ్ (వం.బ్రా.)
బి.ఆర్.శర్మ
కేంద్రీయ సంస్కృత విద్యాపీఠమ్, తిరుపతి, 1965.

వేదకాలీన్ సమాజ్ (వే.స.)
శివదత్తజ్ఞాని
చౌఖంబా విద్యాభవన్, వారాణసి, 1967.

వేదత్రయీ పరిచయ (వే.ప.)
సత్యవ్రత సామాశ్రమి భట్టాచార్య
హిందీసమితి, లక్నో, 1965.

**వైదిక కోశ్ (వై.కో.)**

సూర్యకాంత

వైదిక రీసెర్చి సమితి, బెనారస్, 1963.

**వైదిక సాహిత్య చరిత్రమ్ (వై.సా.చ.)**

పి.పి.ఎస్.శాస్త్రి; కె.ఎల్.వి.శాస్త్రి

శ్రీ గీర్వాణ వాణీ పుస్తకశాల, పాల్ఘాట్, 1927.

**శతపథబ్రాహ్మణమ్ (శ.బ్రా.)**

గంగావిష్ణు శ్రీకృష్ణదాస్

కల్యాణ్, బొంబాయి, 1940.

**శ్రౌతపదార్థనిర్వచనమ్ (శ్రౌ.ని.)**

విశ్వనాథశాస్త్రి

ఇ.జె.లాజరస్ అండ్ కొ.బెనారస్, 1919.

**సంహితోపనిషద్బ్రాహ్మణమ్ (సం.బ్రా.)**

బి.ఆర్. శర్మ

కేంద్రీయ సంస్కృత విద్యాపీఠమ్, తిరుపతి, 1965.

**సామవిధానబ్రాహ్మణమ్ (సా.బ్రా.)**

బి.ఆర్.శర్మ

కేంద్రీయ సంస్కృత విద్యాపీఠమ్, తిరుపతి, 1964.

## BIBLIOGRAPHY

**AGUILAR. H.**
The Sacrifice in the Rgveda
Bharatiya Vidya Prakashan, DELHI, 1976.

**BASU. J.**
India of the age of Brahmanas
Sankrit Pusthak Bhandar, CALCUTTA. 1969.

**BLOOMFIELD. M.**
A Vedic concordance
Motilal Banarsi Dass, DELHI, 1906.

**DANGE. S.A.**
Sexual Symbolism from the Vedic Ritual
Ajanta Publications, DELHI, 1979.

**DASGUPTA. S.**
A History of Indian Philosophy
Motilal Banarsi Dass, DELHI, 1975.

**KEITH. A.B.**
Rgveda Brahmanas, The Aitareya & Kaushitaki Brahmanas
Motilal Banarsi Dass, DELHI, 1971.

**MACDONELL. A.A.**
The Vedic Mythology
Indological Book House, VARANASI, 1971.

**MAXMULLER. F.**
Origin and Growth of Religion
Indological Book House, DELHI. 1964.

**MAXMULLER. F.**
The Vedas
Indological Book House, DELHI, 1969.

**RENOU.L.**
Vedic India
Indological Book House, DELHI, 1971.

**SATYASHRAVA**
A Ccomprehensive History of Vedic Literature
(Brahmana and Aranyaka Works)
Pranava Prakashan, NEW DELHI, 1977

**SHIVAGANESHA MURTHY, R.S.**
A Study of the Important Brahmanas
Prasaranga, University of Mysore, MYSORE, 1974

**WINTERNITZ. M.**
A History of Indian Literature
Munshiram Manoharlal, NEW DELHI, 1977.

విశిష్టపదసూచి

అగ్నిస్వామి 21, 22
అనన్త దేవుడు 247
అనన్త భట్టు 15
అపరార్కుడు 16
అవన్తి 253
ఆత్మానందుడు
ఆనందతీర్థుడు 21
ఆనందరాయమహారాజా 255
ఆపస్తంబుడు 4,24,28,32
ఆర్. లొబ్బెక 170
ఆర్.డి. రానడె 6
ఆషాఢసావయసుడు 46
ఆపోలవార్ష్ణి వృద్ధుడు 46
ఇంద్రద్యుమ్నభాల్లవేయుడు 45
ఇ.ఆర్.శ్రీకృష్ణశర్మ 170
ఇ.డబ్ల్యు. హాప్కిన్స్ 326
ఇటన్ కావ్యుడు 46
ఇళుడు 90
ఉక్థాలు 340, 349
ఉషా 265
ఉచ్చైఃశ్రవసుడు 45
ఉజ్జయిని 255
ఉపసత్ 267
ఎమ్.బ్లూంఫీల్డ్ 430
ఎమ్.వింటర్నిట్జ్ 6,10,30,134
ఏకచక్ర 48
ఏ.బి. కీత్ 10,134,136
ఏ.వేబర్ 170,258,395
కర్ల్ హాఫ్మన్ 292
కాంపిల 48
కాలండ్ 16,26,258,292,326
కాళిదాసు 111,317,318
కాశ్మీర్ 16
కుమారిలభట్టు 23,24,28
కురుక్షేత్రం 48,49,51,133,289,315
325,339,389
కేశిదార్భ్యుడు 45
కోసల 46,48,252,339
కౌశాంబి (పాట్నా) 95
గాలవుడు 14
గుణవిష్ణువు 359,360
గుణే 386
గోవిందస్వామి 135
గౌతమ 416
గ్రహం 296
చయనం 263
చితి 262
చైకితాయనదాల్భ్యుడు 45
జనకుడు 17,24,38,39,40,41,42,43
44,46,107,252,276,282,339

జనమేజయుడు 23,252,282
జనశార్క్య, రాక్ష్యుడు 45
జయన్తభట్టు 16
జయాదిత్యుడు 10,11,19,20,23
జిమ్మర్ 6
జీవల కారీరాది 46
జీవలచైలకి 45
జూలియస్ ఎగ్గెలింగ్ 4,254
జైమిని 4,285,296,311,312,418
టి.వి.కపాలిశాస్త్రి 6,30
డబ్ల్యు.డి. విట్నీ 6,290
డి.గాస్త్ర 420
త్రివరుణుడు 315
త్రైవృష్ణుడు 22
థ్యూడర్ ఔఫ్రెక్ 135
దయానందసరస్వతి 4,30
దార్శకేవది 250,260,264
దివోదాసుడు 40,315
దుర్గాచార్యుడు 19
దుష్యంతుడు 282
దేవణభట్టు 24
దేవరాజయజ్వ 15
ద్రుపదుడు 45
ధన్వినుడు 21,25
ధారానగరం 253
ధీతోవిరమ్యుడు 315
నమీసాప్యుడు 46
నాసిక్ 17
పతంజలి 15,19,23,424
పరఆట్నార 339
పరఆహ్లార 46
పాణిని 18,25,165,168,169,312
పాంచాల 14,44,49,133,252,339
పురూరవుడు 90
ప్రతర్దనుడు 44
ప్రవాహణజైవలి 44,45
ప్రవృంజన 143
ప్రాచీనశాల ఔపమన్యవుడు 45
ప్రియజానశ్రుతేయుడు 46
ప్రిస్థాలు 338
బకదాల్భ్యుడు 45
బర్క్యువార్ష్ణుడు 46
బ్రహ్మదత్తచైకితాయనుడు 46
బ్రహ్మదత్త ప్రాసేనజితుడు 46
బి.ఆర్.శర్మ 390,391,392,393
బి.లిండ్నెర్ 170
బుడిల ఆశ్వతరాశ్వి 45
భట్టభాస్కరుడు 135
భరతస్వామి 390,391
భరతుడు 41,282
భరద్వాజుడు 416
భవత్రాతుడు 290
మస్కరి 28
మహాభిషవం 261

మహావీరం 265,296,298
మహీధరుడు 34
మాక్స్‌ముల్లర్ 30
మాక్డోనల్ 133
మాధవుడు 38
మార్టిన్ హాగ్ 4,135
మిథిల 252,282
మేధాతిథి 16,28,44
మోనియర్ విలియమ్స్ 137
యాస్కుడు 18,31,169
యాజ్ఞవల్క్యుడు 10,17,38,39,43,44,
54,56,248,252,272,276
రఘునందనుడు 14
రాజేంద్రలాల్ మిత్ర 428
రామనాథుడు 390
రోహితుడు 82,83
వాల్మీకి 110
విక్రమార్కుడు 299
విద్యారణ్యుడు 76
విదేహ 38,39,48,107,252,339
విల్‌హాల్మ్‌రాప్ 290
విశ్వరూపాచార్యుడు 16,17
విమవత్ 234,235
విష్ణుతి 331,338
విష్ణుక్రమణం 263
వేంకటమాధవుడు 17,34
వేదవ్యాసుడు 110,417,420
వేదాంతదేశికుడు 26
శతానీకుడు 45
శబరస్వామి 14,28
శస్త్రం 332,330,449
శంకరాచార్యులు 13,28,165
శిఖండియాజ్ఞసేనుడు 45
శిలకశాలావత్యుడు 45
సత్యకామజాబాలి
సత్యయజ్ఞపౌలుషి 45
సత్యవ్రత సామశ్రమి 4,135,258,
392,393,395
సత్యశ్రవ 4,287,293,314,416
స్కందస్వామి 15,20
సి.జి.కాశికర్ 6
సుత్యా 228,298,315
సుత్యాయాజ్ఞసేనుడు 45
సుదర్శనాచార్యుడు 45
సుదక్షిణక్షైమి 46
సూర్యకాన్త 16,430
స్తోత్రం 332,349
స్తోభలు 409
స్తోమం 333,340
హాన్స్‌జోర్గ్‌న్ డార్మ్‌స్టట్ 360
హరచంద్ర విద్యాభూషణుడు 430

హరిస్వామి 255
హరిహరరాయలు 257,273
హస్తినాపుర 48
హెచ్.ఆర్.కర్లిక్ 6
హెచ్.డబ్ల్యు.బోడేవిల్ 290
హెన్రిచ్ స్టోనర్ హాలే 358
హోసల 390